నేను స్వప్నించిన

# స్వర్ణ భారతం

చెన్నమనేని

# స్వర్ణ భారతం
చెన్నమనేని

© చెన్నమనేని

*ప్రచురణ :* ఆగష్టు, 2014
*ప్రతులు :* 1000

*వెల:* **రూ. 100/-**

*ప్రతులకు:*
**చెన్నమనేని రాజేశ్వరరావు**
1141, ఎం.ఎల్.ఏ., కాలనీ, రోడ్ నెం.12
బంజారా హిల్స్, హైదరాబాద్ – 500 034
ఫోన్: 040–23397720

*ముద్రణ*
**శ్రీ బాలాజి గ్రాఫిక్స్**
(డిజైనర్స్ & ప్రింటర్స్)
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500 044.
ఫోన్: 2766 2794, 99481 25459

# విధాన రూపకర్తలకు "కర దీపిక "



- పొత్తూరి వెంకటేశ్వరరావు
*సీనియర్ సంపాదకులు*

స్వాతంత్రం వచ్చి ఆరు దశాబ్దాలు గడిచి ఏడవది గూడా ఇక కొద్దికాలంలో పూర్తవుతున్నప్పటికి మన దేశం సంపన్న దేశాల స్థాయిని అందుకోలేకపోతున్నదెందువల్ల? సంపన్నదేశం కాలేకపోయినా కనీసం పేదరికాన్ని తొలగించుకొనలేక పోయినామేమి? నానాటికి పెరిగిపోతున్న నిరుద్యోగుల సంఖ్యనూ, వారిలో నైరాశ్యాన్ని ఎప్పటికైనా తగ్గించగలమా?

ఇరవయ్యో శతాబ్ది పూర్వార్ధంలో పుట్టి స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని నేటి దేశ పరిస్థితులను చూస్తున్న వారూ, గాంధీజి, నెహ్రు, పటేల్ మొదలైన జాతీయ నాయకులు దేశ ప్రజల ముందుంచిన ఆశయాలను, స్వప్నించిన సంక్షేమ, అభివృద్ధి లక్ష్యాలను తెలిసిన వారూ తరచు వేసుకుంటున్న ప్రశ్నలివి. అందులోనూ కొందరు ప్రజల మధ్యన ఉండి ఏ అధికార పీఠాలను ఆశించక యధాశక్తి ప్రజాసేవ జేస్తూ తమ అంతరంగాన్ని మనస్సును మధించి ఎప్పటికప్పుడు నిర్మాణాత్మక సూచనలు చేస్తూనే ఉన్నారు. సలహాలను ఇస్తూనే ఉన్నారు. ఐతేనేమి భర్తృహరి చెప్పిన "జీర్ణమంగే సుభాషితమ్" అన్నట్లవుతున్నది. పార్టీ వేదికనుంచి, శాసనసభల్లోనూ అలా తమ ప్రతిపాదనలందచేస్తూ అభిప్రాయాలను ప్రకటిస్తూ వచ్చిన అగ్రశ్రేణి నాయకుడు శ్రీ చెన్నమనేని రాజేశ్వరరావుగారు అలాంటి కొద్ది మందిలో ఒకరు.

శ్రీ రాజేశ్వరరావుగారు తెలుగు నాట అన్ని వర్గాల ప్రజల నుంచి గౌరవాభిమానాలను, ప్రేమాదరణలను అపారంగా పొందినవారు. మంచి ఎక్కడున్నా దానిని హర్షించి, ఆమోదించడం, స్వీకరించడం ఆయన మూర్తిమత్వం ప్రత్యేకత. ఆయన షహిద్ భగత్‌సింగ్ విప్లవ భావాలను గౌరవించారు. మహాత్మాగాంధి ఆహింసా సిద్ధాంతాన్ని అభిమానించారు. మార్క్సిస్టు సిద్ధాంతాలను అధ్యయనం చేసి అభ్యుదయ పథంలో రాజకీయ జీవితయాత్ర సాగించారు. ఐనా స్వామి వివేకానంద దేశభక్తి, ప్రపూరితంగా చేసిన వేదాంతోపన్యాసాలను మెచ్చి అభిమానించడానికి ఏది ప్రతిబంధకం కాలేదు. సాంఘిక దురాచారాలను, మూఢ విశ్వాసాలను నిర్ద్వంద్వంగా ఖండించారు. మూఢ విశ్వాసాలు వేరు, విశ్వాసాలు వేరు అందుకే " మనుర్భవ " అంటూ మనిషి పశుత్వం నుంచి విముక్తుడై మనిషిగా ఎదగాలనే మహోన్నత సందేశాన్ని మానవాళికి అందిస్తున్న వేదాన్ని గౌరవించారు. తొంభై వసంతాలు పండించిన జీవితానుభవంతో నిరంతరం సమకాలీన ప్రచురణలను ఆధ్యయనం చేసి వాటి సారాన్ని తనదైన ఆలోచనలతో మేళవించి ఏర్పరచుకున్న రాజకీయ,సాంఘిక ఆర్థిక భావజాలంతో రాజేశ్వరరావు

గారు ఈ 2014 " స్వర్ణభారతం" గ్రంధాన్ని రచించి ప్రజల ముందుంచారు. ఇంతకు పూర్వం ఆయన వ్రాసిన వ్యాసాలైనా, గ్రంధాలైనా మన రాష్ట్రానికే ఎక్కువ వర్తించేవి. ఇప్పుడాయన విధానాలను లోతుగా పరిశీలించి దేశం అంతటా నెలకొని ఉన్న పరిస్థితులను రాగద్వేషరహితంగా అంచనా వేసి ఏ రాజకీయ పార్టీల సిద్దాంతాల, విధానాల చట్రంలోనూ అమరని పరిష్కారాలను అందించారు. అలాగని అవి రాజకీయ పార్టీలు వ్యతిరేకించినవని అనుకోడానికి వీలులేదు. కొన్నిటిని కొన్ని పార్టీలు పాక్షికంగానో, సంపూర్ణంగానో ఆమోదించినవై కూడా ఉండవచ్చును. ఐనా వాటిని పార్టీలు అమలు పరచలేదు. అమలై ఉంటే ఈ గ్రంధం అవసరమై ఉండేదికాదు. ప్రజాహితమనే ఏకైక లక్ష్యంతో రచించిన గ్రంధం ఇది. 2010లో " సత్యశోధన " అనే పేరుపెట్టి ఆత్మకధను రచించినప్పుడు ఆయన సత్యాన్వేషణలో భారతదేశంలో ప్రజలకు సుపరిపాలనందించి స్వరాజ్యాన్ని నిర్మించి బహుజన సంక్షేమాన్ని సాధించడానికి ఉపయోగపడే అనేకానేక ప్రతిపాదనలున్నాయి. జాతికి దిశా నిర్దేశం చేస్తున్న " స్వర్ణ భారతం " గ్రంధకర్తగా రాజేశ్వరరావుగారు దార్శనికులు.

"స్వర్ణభారతం" రచనకు ప్రధానంగా రాజేశ్వరరావు గారి స్వీయ ఆధ్యయనాలు, సొంత అను భవాలే ఆధారం. అయితే అంతర్జాతీయ ఖ్యాతి గడించిన కెన్స్ (యుకె) డాక్టర్ రాబర్ట్ జాన్సస్ (యు.స్.) నోబెల్ బహుమాన గ్రహిత శ్రీ అమర్త్యసేన్, డా॥ వై.వి.రెడ్డిగారల అభిప్రాయాలను ఆయన తమ పరిగణలోకి తీసికొని చర్చించారు. ప్రముఖ అర్ధశాస్త్రవేత్త, ప్రణాళికా సంఘం, ఆర్ధిక సంఘం పూర్వ సభ్యులు, ప్రస్తుత హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయ ఛాన్సలర్గారైన డా॥ సి.హెచ్. హనుమంతరావుగారు ఈ గ్రంధం చిత్తుప్రతిని చదివి తమ సూచనలందించారు.

శాంపుల్ సర్వే ఫలితాలను, ప్రభుత్వం ప్రచురించిన ప్రణాళికా విధాన పత్రాలలోని గణాంకాలను అవసరమైన సందర్భాలలో వాడుకున్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగ స్థితిగతులను సమీక్షించారు. కేటాయింపులలో అనౌచిత్యాలను ఎత్తిచూపారు. ఉదాహరణకు రెండవ హరిత విప్లవ భాగానికి నాలుగువేల కోట్లుకేటాయించి మహాత్మాగాంధి పేరిట అమలు పరుస్తున్న గ్రామీణ ఉపాధి హామి పథకానికి నలుభైవేల కోట్లు కేటాయించడాన్ని పేర్కొన్నారు. అభివృద్ధి కంటే ఓట్ల ఆకర్షణ అంతర్యంగా ఈ కేటాయింపులను జాగ్రత్తగా గమనిస్తే బోధపడుతుంది. సుపరిపాలన గురించి మాట్లాడుతున్నవారు అందుకు ఆవశ్యకమైన పరిపాలనా యంత్రాంగం సంస్కరణల గురించి మాట్లాడకపోవడాన్ని మనం గమనించాలన్నారు. ప్రజాస్వామ్యం గురించి అందరూ పొగుడ్తారు. రాజేశ్వరరావుగారు ప్రజాస్వామ్యం అవసరాన్ని దాని విలువని నొక్కి చెబుతూనే క్రమశిక్షణ ఉంటేనే ప్రజాస్వామ్యం మనగల్గుతుందన్న వాస్తవాన్ని చెప్పారు. ఇప్పుడు మనకు లేనిది అదే అని చెప్ప నక్కరలేదు.

పంచాయితీల గురించి ఎవరూ మాట్లాడని ఒక ముఖ్య ప్రతిపాదన చేశారాయన. గ్రామసభలు సక్రమంగా జరగడంలేదని అందరికి తెలుసు. కాని అవి జరగడానికి గ్రామంలో తగిన ప్రదేశం లేకపోవడం ఒక లోపమన్న సత్యాన్ని రాజేశ్వరరావుగారు చెప్పారు. పార్లమెంటు, శాసనసభలకు

పనిచేసే పరిపాలనా సిబ్బంది ప్రభుత్వ పాలనాయంత్రాంగంలో భాగంగాక ప్రత్యేక యంత్రాంగం ఉండాలని ఆయన చేసిన మరో ప్రతిపాదన.

విదేశీ పెట్టుబడులను చిల్లర వ్యాపారరంగంలో అనుమతించడాన్ని మూర్ఖంగా వ్యతిరేకించ రాదని, చిల్లర వ్యాపారాలు జీవనాధారమైన వారి ప్రయోజనాలకు భంగం కలగకుండా చూస్తూ విదేశీ పెట్టుబడులను ఉపయోగించుకోవాలని ఈయన అభిప్రాయం. కార్పొరేటు వ్యవసాయాన్ని సమర్థించకుండానే చిన్న కమతాలను ఏకం చేసి వ్యవసాయాన్ని లాభసాటి చేసుకోవాలనేది రాజేశ్వరరావుగారి మరొక నిర్మాణాత్మక ప్రతిపాదన. విద్య, వైద్యం, పర్యావరణంతోపాటు ఎన్నికల విధాన సంస్కరణలు మొదలైన ముఖ్యాంశాలన్నిటిపైన ఆయన లోతైన విశ్లేషణతో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం, ఉత్పత్తిదారుల భాగస్వామ్యం ఉన్న ప్రజాస్వామ్యం మనకు శరణ్యం అంటారాయన. రాయితీలు, సబ్సిడీలుగాక ప్రజలు ఆత్మగౌరవంతో స్వావలంబన సిద్ధాంతం పాటించితే పేదరిక నిర్మూలన, ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పన సాధ్యమని ఆయన విశ్వాసం. 21వ శతాబ్దంలో స్వతంత్ర భారతం " బహుజన హితాయ" " బహుజన సుఖాయ" అనే సంక్షేమ సిద్ధాంతాన్ని పాటించాలని ఆ తర్వాత " వసుధైక కుటుంబకం" అనే సమ సమాజం సాకారం అవుతుందని ఆయన దృఢ విశ్వాసం. అది ఆయన స్వప్నిస్తున్న " స్వర్ణభారతం" " స్వాతంత్ర పోరాట కాలం నాటి నిస్వార్ధ రాజకీయ నాయకులు ఆశించినదీ. నిష్కళంక చరితులైన తరువాత తరాల నాయకులు కోరుకుంటున్నది అదే.

మన జాతీయార్థిక సాంఘిక, రాజకీయ విధాన రూపకల్పనలో నిమగ్నులై ఉన్న నేతలకూ అధికార గణానికి కూడా కరదీపిక చెన్నమనేని రాజేశ్వరరావు గారి " స్వర్ణభారతం " గ్రంధం.

# నా మాట

1929 డిసెంబరు మాసంలో ప్రస్తుత పాకిస్తాన్‌లోనున్న లాహోర్ నగరంలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశం దేశానికి పూర్ణ స్వరాజ్యం కావాలని తీర్మానించింది. ఈ తీర్మానంపై దేశవ్యాపితంగా ఆసక్తికర చర్చ జరిగింది. 1931 మార్చి నెల 23వ తేదీన తాను ఉరిశిక్షకు గురికాక ముందు అమరజీవి సర్దార్ భగత్‌సింగ్ తమ బంధు మిత్రులకు వ్రాసిన ఉత్తరాలలో చివరి ఉత్తరం " యువ రాజకీయ కార్యకర్తలకు " అను శీర్షికతో వ్రాసినది. అందులో అమరజీవి " పూర్ణ స్వరాజ్ " గురించి ఇలా ప్రశ్నించారు. రాబోయే పూర్ణ స్వరాజ్ ఈనాడు గవర్నర్ జనరల్‌గా వ్యవహరిస్తున్న లార్డ్ ఇర్విన్ స్థానంలో పురుషోత్తం దాస్ ఠాకూర్ దాస్ లాంటి వారిని కూర్చో బెట్టడానికేనా లేక దేశ ప్రజాసామాన్యానికి ఏదయినా ఒరగబెట్టడానికా? అన్నాడు. ఈ ఉత్తరం వ్రాసిన తేదీ జనవరి 26. ఉరి తీసిన తర్వాత వారిని బంధించిన గదిలోని కాగితాలలో పై ఉత్తరం కూడా దొరికింది, ప్రచురణ పొందింది. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఈ లేఖను భద్రపరుస్తూ భారత జాతీయ కాంగ్రెస్ ద్వారా ప్రతి సంవత్సరం 26 జనవరి నాడు దేశానికి పూర్ణ స్వరాజ్యాన్ని సాధించే ప్రతిజ్ఞాదినంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. దేశ భక్తులంతా ఈ ప్రమాణం చేస్తూ వచ్చారు. 1947 ఆగస్టు 15న దేశం స్వాతంత్ర్యం సాధించింది. ఆ తర్వాత పార్లమెంటు రాజ్యాంగ నిర్ణాయక సభగా మారింది. స్వతంత్ర భారత దేశానికి రాజ్యాంగ రూపకల్పన చేస్తూ 26-11-49 నాటికే రాజ్యాంగ నిర్ణాయక సభ తీర్మానాన్ని ఆమోదించింది. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గారి జోక్యంతో రెండు మాసాలు ఆలస్యంగా అనగా అదే 26-1-1950 తేదీన రాజ్యాంగ ప్రకటన తేదిని నిర్ణయించడం జరిగింది. మరుగున పడియున్న ఈ సత్యాన్ని మార్క్సిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కీ॥శే॥ హరికిషన్ సింగ్ సుర్జీత్ గారు అమరజీవి శత జయంతి సందర్భంగా తమ పార్టీ వారపత్రిక " పీపుల్స్ డెమోక్రసీ "లో తాము వ్రాసిన వ్యాసంలో దీన్ని వివరించియున్నారు. వారికి భారతజాతి కలకాలం రుణపడియుంటుంది.

**- రచయిత**

# ఇందులో...


1. ఉపోద్ఘాతం ..................... 11
2. వ్యవసాయం ..................... 36
3. పరిశ్రమలు ..................... 59
4. మానవ వనరులు – విద్య ..................... 70
5. మానవ వనరులు – ఆరోగ్యం ..................... 79
6. సంస్కరణలు ..................... 88
7. కుల వ్యవస్థ ..................... 107
8. రాజకీయ వ్యవస్థ ..................... 122
9. న్యాయ, పోలీస్ వ్యవస్థలు ..................... 144
10. స్థానిక స్వపరిపాలన ..................... 161
11. రాజకీయార్థిక విశేషాలు ..................... 171
12. సుపరిపాలన ..................... 195
13. పర్యావరణ పరిరక్షణ ..................... 206
14. ముగింపు ..................... 219

# 1. ఉపోద్ఘాతం

మానవ సమాజ పరిణామక్రమంలో ప్రప్రథమంగా నాగరికతా వెలుగును ప్రసరించిన 5 వేల సంవత్సరాల సుసంపన్న చరిత్ర కలిగిన దివ్య భూమి మన భరతభూమి. అలనాటి " భగవద్గీత" మొదలుకొని ఇటీవల రవీంద్ర కవీంద్రుని " గీతాంజలి" వరకు రామాయణ, మహభారత భాగవతాలు వేద వేదాంతాలతో మానవత్వం ఉట్టిపడే సందేశాలతో కూడిన సుభాషితాల్ని ప్రపంచ మానవాళికి భారతావని అందించిన కానుకలు. ఇంతటి ఘనచరిత్ర కలిగిన భారత్ సుమారు 500 సంవత్సరాల సుదీర్ఘ కాలం తమ ఉనికినే కోల్పోయినంతగా బానిసత్వ గాఢాంధకారంలో నిద్రావస్థలోకి జారి పోయింది. విదేశీ దండయాత్రలు, స్వదేశీ అంతర్యుద్ధాలు, ధర్మశాస్త్రాల పేరుతో కొనసాగిన వర్ణా శ్రమ ధర్మాలు ఈ చీకటి యుగానికి మూల కారణాలు. నిస్తేజం, నిర్వీర్యం, నిర్జీవమైన మన మాతృభూమి బానిస బంధనాల వాత బడిపోయింది. రాజకీయ స్వతంత్రతతోపాటు ఆర్థిక, సామాజిక స్వేచ్ఛలను కోల్పోయింది. భావ దాస్యానికి బలిపశువైంది.

కాలం మారింది. నిర్జీవమై పోతున్న భరతజాతి మేల్కొన్నది. 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య పోరాటం నుండి దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు జాతి స్వతంత్రత సాధనకై నడుంబిగించినారు. పూర్వపు స్వర్ణ యుగానికి జెందిన ఘనచరిత్ర నుండి స్ఫూర్తిని పొందినారు. అటువేలాది భారతీయ యువకిశోరాలు పాశ్చాత్య పారిశ్రామిక విప్లవయుగ గుణపాఠాలను ఒంటబట్టించుకున్నారు. స్వాతంత్ర్యం, స్వేచ్ఛలు మానవ జన్మహక్కులని నినదించినారు. ఇది ప్రజాస్వామ్యయుగమని ప్రబోధించినారు. సామ్రాజ్య వాదయుగం అంతం కావాలని, జాతి, మత, వర్గ విభేదాలులేని ప్రజాతంత్ర యుగధర్మం కలకాలం వర్ధిల్లాలని పిలుపునిచ్చారు. 1914 నాటి మొదటి ప్రపంచయుద్ధం 1939 నాటి రెండవ ప్రపంచ యుద్ధం, నాటి సామ్రాజ్యవాద సిద్ధాంతాన్ని దాని దమనకాండను మట్టికరిపిస్తూ స్వేచ్ఛా స్వాతంత్ర్య ఉద్యమాలకు అకుంఠిత బలాన్ని సమకూర్చినారు. ప్రపంచంలో 80కి పైగా ఉండిన బానిస దేశాలు విముక్తిని సాధించినవి. ప్రజాస్వామ్యం సమ సమాజ స్థాపనకు రాచబాటలు వేసినవి.

1947 ఆగస్టు 15న రాజకీయ స్వాతంత్ర్యాన్ని సాధించిన మనదేశం ఆత్మగౌరవాన్ని సాధించినప్పటికి ఆర్థిక సామాజిక రంగాలలో ఆశించిన విధంగా అభివృద్ధిని సాధించలేదు. 65 సంవత్సరాల సుదీర్ఘకాల స్వతంత్రం తర్వాతకూడా పేదరికం, వెనకబాటుతనం, అసమానతలు, అత్యాచారాలు, సంఘ వ్యతిరేకశక్తుల స్వైరవిహారాలు ఊహాతీతంగా కొనసాగడం జాతికి తలవంపుగా ఉన్నది. లక్ష్యశుద్ధి, సంకల్పబలం, జాతీయ సమైక్యతల లోపాలే దీనికికారణం. అధికారంలో ఉన్న వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు మానవీయ సిద్ధాంతాల వెలుతురులో రాజకీయార్థిక, సామాజిక సంస్కరణలకంటే తమకు రాజ్యాధికారాలను సాధించడం, ఆ తర్వాత వాటిని పదిల పరుచుకునే దిశలో తమ శక్తి సామర్థ్యాలను వినియోగించడం దేశ ప్రజల చిరకాల సమస్యల శాశ్వత పరిష్కార ప్రయత్నాలు చేయకపోవడం కేవలం దురదృష్టకరం. నాయకుల, దేశ భక్తి రాహిత్యం, ధనదాహం,నిష్క్రియాపరత్వం కారణంగా దేశంలో సాధించవలసిన, సాధించగలిగిన అభివృద్ధి

సాధించలేకపోవడం దేశాన్ని అన్ని రంగాలలో అత్యంత వెనుకబాటు తనంతో అనేక అనర్థాలకు గురిచేయడం ఏమాత్రం క్షంతవ్యం కాని దుస్సాహసం. ఇకనైనా తిరోగమన రాజకీయాలకు కళ్లెం వేయవలసిన సమయం ఆసన్నమైందని గుర్తించాలి. తీవ్రమైన ఆర్థిక రాజకీయ సామాజిక సంస్కరణలను చేపడుతూ వాటిని అమలు పర్చడమే ఏకైక పరిష్కారమార్గం. మనదేశం వివిధ రంగాలలో విదేశాలతో పోల్చగా ఎంతగా వెనకబడియున్నదో ఒకసారి సాక్షాధారాల వెలుతురులో పరిశీలిద్దాం.

15 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన బాల బాలికల మేధాశక్తిని అంచనా వేయడానికై ఒ.ఈ.సి.డి. సంస్థ వారు ఒక పరీక్ష నిర్వహించగా అందులో భారతదేశంతో సహ 73 దేశాల నుండి 5 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఫలితాలు ప్రకటించగా భారత విద్యార్థుల స్థానం క్రింది నుండి రెండవస్థానం మాత్రమే కావడం మన విద్యార్థుల మేధాశక్తిహీనతకు అద్దంపడుతుంది. అంటే మనం మొత్తం 73 దేశాలలో 71వ ర్యాంకు సాధించుకున్నాం. ఇది జాతికే తలవంపు. మనమనుసరిస్తున్న బానిస విద్యా విధానానికి ప్రబల సాక్ష్యం.

2012లోనే ప్రపంచ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్ నిర్వహిస్తే ప్రపంచంలో ఉన్నత స్థానాలను సాధించిన 200 విశ్వవిద్యాలయాలలో చైనాకు 7వ స్థానం దక్కగా భారతదేశానికి ఏ స్థానము లేకపోవడం మన విద్యావిధానం దివాళాకోరుతనానికి తిరుగులేని సాక్ష్యం కాదా? భారతదేశంలో ఒక కోటి 50 లక్షల విద్యార్థులు చదువుచున్న 2600 ఉన్నత విద్యాసంస్థలున్నవి. ఒక అంచనా ప్రకారం ఇందులో 92 శాతం విద్యార్థులు గణితశాస్త్రంలో బలహీనంగానుంటే 78% విద్యార్థులు ఇంగ్లీష్ భాషలో పూర్తిగా వెనకబడియున్నారు.

ప్రజల ఆరోగ్య పరిస్థితి పూర్తిగా అనారోగ్యంగానుండడం మన రెండవ దుస్థితి. 2010 సంవత్సరంలో దేశంలో ప్రతి లక్ష జనాభాకి ఒకే ఒక అల్లోపతి డాక్టర్ పనిచేయగా అది 1997లో 0.47% మాత్రమే ఉండింది. నర్సుల సంఖ్య 1991లో ప్రతి లక్ష జనాభాకి 40 మంది ఉండగా 2009 నాటికి అది కాస్తా పెరిగి 92.8కి చేరింది. 120 కోట్ల జనాభాలో 13 కోట్ల పేదలకు ప్రాథమిక వైద్య సౌకర్యాలేలేవు. ఇంకా సిగ్గుపడవలసిన వాస్తవం గమనార్హం. 2011 నాటి అంచనా ప్రకారం దేశ జనాభాలో సగానికి సగం జనాభా బహిరంగంగా మల మూత్ర విసర్జన చేయవలసి వస్తున్నది. 20 శాతానికి మించిన గృహస్తులు మంచినీరు తెచ్చుకోవడానికై కనీసం అరకిలోమీటరు దూరం వెళ్ళి రావలసివస్తున్నది. జనాభాలో మూడింట రెండువంతులకు మించిన గృహస్తులు, గ్రామాలల్లో 87 శాతం, పట్టణాలల్లో 28 శాతం, తమ వంటకాలకై కట్టెలు, పేడతో చేసిన పిడకలు, బొగ్గుపై ఆధారపడుతున్నారు. ప్రపంచంలో ప్రతి 1000 జనాభాకి అందు బాటులోనుండే వైద్యుడు (ఫిజిషియన్) 1.5 శాతమైతే భారతదేశంలో కేవలం 0.6 శాతం మాత్రమే. ఆసుపత్రులలో లభ్యమయ్యే పడకల సంఖ్య ప్రపంచంలో ప్రతి వేయి జనాభాకి 3.3 కాగా మన దేశంలో అది 0.6 మాత్రమే. ప్రతి సంవత్సరం తమ ప్రథమ జన్మదినోత్సవాన్ని కూడా చూడనోచుకోలేని బాల బాలికల సంఖ్య సుమారు 20 లక్షలు.

దేశంలోని ధాన్యం గిడ్డంగులలో 7 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలున్నాయని గొప్పలు చెప్పు కొంటాం కాని, దేశంలోని బాల బాలికల్లో పౌష్టికాహార లోపంవల్ల 40 శాతం బాలలు తక్కువబరువు

కలిగియుండడం, 70శాతం రక్తహీనతతో బాధపడుతుండడానికేమి కారణం? 2000 సంవత్సరంనాటి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ.హెచ్.ఒ) అంచనా ప్రకారం ప్రపంచంలో ప్రతి సంవత్సరం 1,36,000మంది బాలింతలు మరణిస్తుండగా అందులో 26 శాతం భారతీయులే! దేశంలో కొన్ని ప్రాంతాలలో కొంత అభివృద్ధి జరిగి అక్కడ ప్రజారోగ్యం కొంత వరకు బాగుపడిన విషయం నిర్వివాదమే ఐనా దేశ వ్యాపితంగా 37.5 శాతం జనాభా పౌష్టికాహారలోపంతో భాదపడుతూనే ఉన్నారు. ఇందులో 41.6 శాతం జనాభా 1.25 డాలర్ దినసరి ఆదాయంతో బ్రతుకుతున్నారు. 2007 సంవత్సరంలో ప్రపంచ ఆహార విధానాల విశ్లేషణా సమితి 119 దేశాలల్లో భారతదేశానికి 96వ స్థానాన్నిచ్చింది. ఇది బంగ్లాదేశ్‌ను మినహాయిస్తే కూడా ఇంకా పైకి చేరిన వార్తలందుతున్నాయి. ఇది ఇలా ఉండగా భారతదేశం గత ఆర్థిక సంవత్సరంలోనే 3.5 లక్షల కోట్ల రూపాయల విలువైన 1100 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకున్నది. దేశ పారిశ్రామికాభివృద్ధికి అత్యవసరమైన విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని కొని తిరిగి దాన్ని అమ్మి బంగారాన్ని కొనుగోలు చేసిందెవరు? " పి.ఈ.డబ్ల్యూ " అనబడే ఒక పరిశోధన సంస్థ ప్రపంచంలోని 21 పెద్ద ఆర్థిక వ్యవస్థలు గల దేశాల ప్రజల మనోభావాల్ని విశ్లేషించింది. అందులో భారతీయులు తమ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నట్లు తమ దేశ ఆర్థిక వ్యవస్థ బాగుపడడంపై విశ్వాసాన్ని వదులుకుంటున్నట్లు తేలింది.

దేశ పార్లమెంటరీ వ్యవస్థ కొద్దిమంది కోటీశ్వరుల చేతిలో కీలుబొమ్మగా మారుతున్నట్లు వారు దేశ సంపదను నిర్భీతిగా పితుక్కుంటున్నట్లు భావించడం స్పష్టమైంది. స్వయంగా దేశ ఎన్నికల కమిషన్ నిర్వహించిన పరిశోధన ప్రకారం గౌరవ పార్లమెంటు సభ్యుల్లో 40 మంది, శాసనసభ్యుల్లో 700 మంది నేరాలు చేసి శిక్షలు కూడా విధించబడిన వారై యుండడం యాధృచ్ఛికం కాదు.దశాబ్దాల క్రితం నుండే రాజకీయాలు నేరమయమైపోయినవి. నేరస్తులే మంత్రులుగా నిర్వాకం చేస్తున్నారు.

ఇది ఇలా ఉండగా దేశం కులం, మతం, ప్రాంతీయ తత్వాలతో అనుదినం చీలిపోతూ ఉండడం అత్యంత భాధాకరం. పెద్ద జనాభాతో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా 8-9 శాతం. జి.డి.పి.తో వేగంగా అభివృద్ధిని సాధిస్తున్నదని, అనతికాలంలోనే చైనా దేశాన్ని అన్ని రంగాలలలో వెనక్కి నెట్టగల్గుతుందని కొందరు రాజకీయ నాయకులు నమ్మబలుకుతున్నారు. ఇందులో సత్యం ఎంతో కేంద్ర ప్రభుత్వం ఆదేపనిగా చెప్పుకునే " ఆం ఆద్మి " ( సామాన్యుడు)ని అడిగితే చెపుతాడు. అనుదినం వెలువడే పిడుగుపాటు వార్తలు, భ్రూణ హత్యలు, స్త్రీలపై ఆత్యాచారాలు, హత్యలు, రైతులు, కార్మికుల ఆత్మహత్యలు ఈ భ్రమలను పటాపంచలు చేస్తున్నాయి.

## సామాజిక పెట్టుబడి

ప్రజా బాహుళ్యం యొక్క భావజాలం నెమ్మదిగానైనా గణనీయంగానే మారుచున్నది. అర్ధబానిస ఫ్యూడల్ వ్యవస్థలో అనుభవించిన భయభ్రాంతులనుండి తిరుగులేని విమోచనాన్ని సాధించింది. కండ బలానికి వెరవడంలేదు. సామాజిక స్పృహలోపంతో ఉద్యమ బలహీనతలు, రాజకీయ నాయకుల మధ్య ఐక్యతాలోపం కారణంగా తమ సంకల్పబలాన్ని సుధృడం, కార్యోన్ముఖం చేయలేకపోతున్నది. అభ్యుదయ రాజకీయ పార్టీలు, చైతన్యవంతమైన పౌర సంఘాలు, సుప్రసిద్ధ సామాజిక సేవకులు సమైక్యంగా రంగప్రవేశం చేస్తూ అసంఘటిత జన బాహుళ్యానికి మార్గదర్శకులుగా అవతరించగల్గుతారు.

నిద్రాణమైయున్న ప్రజాశక్తిని తట్టి మేల్కొల్పుతూ ప్రజాస్వామ్య బద్ధంగా, శాంతియుతంగా రాజకీయార్థిక వ్యవస్థలను తీవ్రంగా సంస్కరించగలుగుతారు. కాలచక్రాన్ని అడ్డుకునే ప్రతీపశక్తుల కుట్రలు, కుతంత్రాలను ఎదిరించి ఓడిస్తారు.

ప్రపంచ వ్యాపితంగా మానవతావాదులు ఆశించినట్లుగా ఈ మానవ శ్రమ ఫలితం మొత్తం మానవ సమాజాభివృద్ధికి పెట్టుబడిగా వినియోగించబడాలనే మానవీయ సిద్ధాంతం ప్రపంచ శ్రమైక జీవులందరిని ఆకర్షిస్తున్నది. ఇరువదవశతాబ్ది విప్లవాల శతాబ్దంగా వెలిగింది. బానిస, అర్ధబానిస భూస్వామ్య వ్యవస్థల క్రింద నలిగి నశించి పోయిన మానవాళి నిద్రనుండి మేల్కొని తమ భవిష్యత్తును తామే నిర్మించనారంభించింది. సామాజిక విలువగా మిగలవలసిన, శ్రమ జీవుల కృషి ఫలితమైన అదనపు సంపదను కొద్దిమంది బలవంతులు తమ సొంత ఆస్తిగా మార్చుకుని పెట్టుబడిదారులుగా రెండు మూడు శతాబ్దాలపాటు ఊరేగినారు. తమ దేశానికే పరిమితంగాకుండా ప్రపంచ దేశాల నాక్రమిస్తూ వాటి సహజాభివృద్ధిని అడ్డుకున్నారు. భూస్వామ్య యుగ బానిసత్వాన్ని మరిపించే విధంగా సామ్రాజ్యవాదులుగా దేశ ప్రజల స్వతంత్రాన్ని హరించివేశారు. తమ పరస్పర పంతాలు, పట్టింపులతో రెండు ప్రపంచ యుద్ధాలకు వాటి మారణ హోమానికి కారకులైనారు. చివరకు ఇరువదవ శతాబ్ధ ప్రధమార్ధం నుండి ప్రపంచ పీడిత ప్రజా ఉద్యమాలు తమ విజయధంకాను మ్రోగించినవి. సామ్రాజ్యవాదం దాని యుద్ధోన్మాదాన్ని మట్టికరిపించినవి. స్వతంత్రం, సౌహర్ధం, సౌభ్రాతృత్వం,శాంతి ప్రజాస్వామ్య పతాకాలను ఆకాశాని కంట ఎగరవేసినవి. బానిసత్వ అవశేషాలన్నిటిని కూకటి వేళ్ళతో పెకిలించి నిర్మూలించడానికి తమ నిరంతర కృషితో ఉద్యమిస్తున్నాయి. 21వ శతాబ్దిని స్థూలంగా సామ్రాజ్యవాదయుగ నిర్మూలన, ప్రజాతంత్ర యుగారంభంగా సగర్వంగా ప్రపంచ ప్రజలు చెప్పకోగల్గుతున్నారు.

ఈ నాటి ప్రపంచ దేశాలను అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలుగా పేర్కొనడం వాస్తవానికి దగ్గరగానుంటుంది. అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈ.యు) దేశాలు సామ్రాజ్యవాదయుగానంతర అర్ధ శతాబ్దికాలంలోనే పెట్టుబడిదారి వ్యవస్థలోని దోషాల ఫలితంగా సంక్షోభానికి గురికావలసివచ్చింది. స్వార్ధం అక్రమ సంపాదన ద్వారా అష్టైశ్వర్యాలతో, విలాసవంత జీవితాలకు బానిసలుగా మారిపోయిన ధనాఢ్య వర్గాలకు ఈనాటి ప్రపంచం గిట్టు బాటుగాలేదు. సుఖాలకలవాటుపడిన జీవితాలకు తృప్తి, సంతృప్తి కరువైంది. ఈ అసంతృప్తి, అసహనం, అశాంతికి, అంతర్మధనానికి దారి తీస్తున్నది. ఫలితంగా వారి ఆర్థిక సామాజిక జీవితాలు ఆ తర్వాత వారి రాజకీయ వ్యవస్థలు సంక్షుభితంగాక తప్పదు. ఏ దేశం ఎలా మారుతుందో అప్పుడే చెప్పలేకపోయినా ఆయా దేశాల చైతన్యవంత ప్రజాబాహుళ్యం, ప్రజాస్వామ్యం, ప్రజాహితం, సమాజవాద దిశలో ఆత్మ విశ్వాసంతో పయనిస్తుందనుటలో సందేహంలేదు.

సంపన్నదేశాలుగా వెలిగి సంక్షుభిత దేశాలుగా సతమతమవుచున్న దేశాల ఆర్థిక స్థితిగతులను మరింత లోతుగా విశ్లేషించడం అవసరం. మన దేశ ఆర్థిక స్థితిగతులుపై పెట్టుబడిదారి దేశాలతో ముడిబడియుండడం కారణంగా ఈ విశ్లేషణ చాలా అవసరం. మన స్వతంత్ర ఆర్థిక విధానాల రూపకల్పన కొరకు మరీ అవసరం. 2008లో ప్రారంభమైన పెట్టుబడిదారి ఆర్థిక పతనం

త్వరత్వరగా వ్యాపించడం ఆశ్చర్యకరం. అక్కడి అర్ధశాస్త్ర పండితులు ఈ దుస్థితికి గల కారణాలు వాటి నివారణోపాయాలను చెప్పలేక తలలు పట్టుకుంటున్నారు. " ఏమి చెప్పలేమని చెప్పడమే" ఉత్తమమంటున్నారు. 2010 సంవత్సరంలో యూరపులోని సంపన్న దేశాల మొత్తం రుణభారం ఆ దేశాల సగటు వార్షికోత్పత్తికి 3-5 శాతంగానుంటే అది అమాంతంగా పెరిగిపోయి 2011 నాటికి 46 శాతానికి చేరుకున్నది. కొన్ని దేశాల రుణభారం వారి సగటు దేశీయోత్పత్తికి 110 శాతం నుండి 116 శాతానికి పడగెత్తింది. ప్రపంచంలో అన్ని దేశాలకంటే బలమైన ఆర్థిక పునాదులు గలిగిన జర్మని, ఫ్రాన్సు దేశాల రుణభారం వారి సగటు దేశీయ ఉత్పత్తులకు 80 నుండి 90 శాతానికి చేరుకున్నది. అంతర్జాతీయ ద్రవ్యనిధి అంచనా ప్రకారం యూరపులోని దేశాలన్నిటి సగటు దేశీయ ఉత్పత్తి పెరుగుదల రేటు 2010లో 3-4 శాతం ఉండగా 2012 వాటికి అది తగ్గి 1.8 శాతానికి చేరుకున్నది. గత 4-5 సంవత్సరాలు ఆనతికాలంలోనే ప్రపంచ ఉత్పత్తిలో అభివృద్ధి చెందిన దేశాలన్నిటి భాగం అత్యధికశాతం నుండి కేవలం 25 శాతానికి పడిపోగా అభివృద్ధి చెందుతున్న దేశాల భాగం 75 శాతంగా నిలిచింది. ఇందులో అత్యధికభాగం చైనా, భారతదేశాలకే దక్కింది. ఈ పరిణామం ఆసియా దేశాల దేశీయ ఉత్పత్తిరేట్ల పెరుగుదల కంటే అభివృద్ధి చెందిన దేశాల ఉత్పత్తి రేట్ల పతనం కారణంగా సంభవిస్తున్నది. శ్రీమంతులు, విలాసవంతమైన దేశాలు అమాంతంగా ఆర్థికంగా దెబ్బతిని పోవడం కారణంగా వారితో వ్యాపారం చేసే దేశాలకు ఈ పరిణామ దుష్ఫలితాలతాకిడి తప్పదు. మధ్య ప్రాచ్యదేశాల అంతరంగిక ఈతి బాధలెలా ఉన్నా తమ పెట్రోలు ఎగుమతులు పడిపోవడం కారణంగా అవి కష్టనష్టాలకు గురిఅవుచున్నవి.

చైనా దేశం ప్రాశ్చాత్య దేశాలకు చేసే నిత్యావసర వస్తువుల ఎగుమతులు పడిపోవడం కారణంగా తమ ఆదాయాన్ని తీవ్రంగా కోల్పోతున్నది. సాఫ్ట్‌వేర్ యంత్రాల ఎగుమతుల ద్వారా విదేశీ మారకాన్ని సంపాదించే భారతదేశంగూడా తీవ్రంగానే తమ ఎగుమతుల ద్వారా సంపాదించే ఆదాయాన్ని కోల్పోతున్నది. ఏది ఏమైనా యూరపు, అమెరికా దేశాలకు ఆసియా దేశాల నుండి ఎగుమతులు అనగా యూరపు అమెరికా దేశాల దిగుమతులు, ఆసియా దేశాల దిగుమతుల మొత్తంలో కేవలం 14 శాతానికి మించదు గాబట్టి వారు ఆందోళన చెందనక్కరలేదని అక్కడి అర్ధశాస్త్ర పండితులు చెప్పుచున్నారు. ప్రతిదేశం తమ ఆర్థిక స్వతంత్రం, స్వావలంబన గురించి తీవ్రంగా ఆలోచిస్తూ తమ ఇల్లు చక్కబెట్టుకునే తరుణం ఆసన్నమైంది. ప్రపంచీకరణ సృష్టిస్తున్న వినూత్న సమస్యల నేపథ్యంలో ఆత్మవిశ్వాసం సకారాత్మక ధృక్పధంతో వ్యూహాత్మకంగా వ్యవహరించగలిగే దేశాలు భౌతికాభివృద్ధిని, సామాజికాభ్యుదయాన్ని సాధించితీరుతాయనడంలో సందేహంలేదు.

సామ్రాజ్యవాదయుగం అంతరిస్తున్నా సామ్రాజ్యవాద ధృక్పధాలనుండి బయటపడడం, ఆర్థిక సామాజిక ప్రజాస్వామ్యాన్ని గౌరవించడం అమెరికాలాంటి అగ్రరాజ్యాలకి సాధ్యపడడంలేదు. చైతన్యవంతులైన ప్రపంచ ప్రజలు ముఖ్యంగా అమెరికా ప్రజలే తమ పాలకులకు తగిన గుణ పాఠాలను నేర్పుతారని ఆశించవచ్చును. ఆర్థిక అధిక్యతా అహంకారంతో తమ రాజకీయ సైనిక బలప్రదర్శన చేసే సామ్రాజ్య వాద శక్తులు ప్రజాస్వామ్యవాద,బహుముఖ విలువలను అర్ధం చేసుకోకతప్పదు. నల్లజాతికి చెందిన అమెరికన్‌గా ఈసడించబడిన ఒబామా రెండవ పర్యాయం తన సత్తాను చాటుకోగల్గడం సాధారణ తెల్లజాతి అమెరికన్ ఒటరుతో కలిసి ముందడుగు వేయడం మంచి

పరివర్తనకు చక్కని తార్కాణం. ప్రపంచ వ్యాపిత చైతన్యవంతమైన మానవాళి ఈ సత్యాన్ని అర్థం చేసుకోవడం గొప్ప పరిణామం.

## ఆర్థిక ప్రతిష్టంబన అంచులో దేశం

యన్.డి.ఎ. కాలంలో వాజ్‌పాయి గారి సారధ్యంలో భారత్ వెలిగిపోతుందన్నారు. ఆ తర్వాత ప్రధయ యు.పి.ఎ. కాలంలో శ్రీ మన్మోహన్ సింఘ్ గారి నేతృత్వంలో భారత్ మెరిసిపోతున్నదని నమ్మబలికినారు. 2008లో సంభవించిన పెట్టుబడిదారి,ఆర్థిక సంక్షోభం నుండి విజయవంతమైన ఆత్మ రక్షణ చర్యల ఫలితంగా మనదేశం తన ఆర్థిక స్వతంత్రాన్ని పరిరక్షించుకుంటూ మానవాభివృద్ధిని సాధించుకోవలసిన చారిత్రాత్మక కర్తవ్యం దేశం ముందున్నది.

పెట్టుబడి దారి ఆర్థిక సంక్షోభ కేంద్రం ఇటీవల అమెరికానుండి యూరపు దేశాలకు తరలింది. 27 యూరోపియన్ యూనియన్ దేశాల ఆర్థిక పరిస్థితి డోలాయమానంగా మారింది. గ్రీస్, స్పెయిన్ దేశాలైతే ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుచున్నవి. అన్నిటికంటే బలమైన పునాదులపై సుస్థిరంగానున్న జర్మనీ, ఫ్రాన్సు లాంటి దేశాలు తమ ఇల్లు చక్కబెట్టుకునే కార్యక్రమాలను చేపట్టినవి. ప్రపంచీకరణ నేపథ్యంలో పెట్టుబడిదారి దేశాలన్ని ద్రవ్యలోటు, సగటు దేశీయ ఉత్పత్తి రేటు తగ్గుదల, రుణభారం పెరుగుదల, ఎగుమతి, దిగుమతుల మధ్య తీవ్ర అగాధాలు, నిరుద్యోగం లాంటి ఆర్థిక సమస్యల నెదుర్కొంటున్నాయి. పరస్పర ఆర్థిక కట్టుబాట్లను సడలించుకోవడానికి వాటిని పునర్నిర్మించుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నాయి. తామనుభవిస్తున్న సంక్షోభ భారాన్ని తమతో ముడిబడియున్న ఇతర దేశాలపైకి నెట్టడానికి క్షంతవ్యంగాని చర్యలకు తెగిస్తున్నాయి. ఇలాంటి దుష్ట ప్రయత్నాలే వెనకటికి ప్రపంచ యుద్ధాలకు దారి తీసినవి.

21వ శతాబ్ది ప్రపంచం పూర్తిగానే వేరు. నూతనంగా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్న దేశాలు తమ ఆర్థిక, రాజకీయ స్వతంత్రాలను వదులుకోవడానికి సిద్దంగాలేవు. తిరిగి బానిస దేశాలుగా తలలు దించుకోవడానికి ఏమాత్రం సిద్దంగాలేవు. తమలోతాము సఖ్యతతో తమ ఆర్థిక, రాజకీయ స్వతంత్రాలను పరిరక్షించుకోవడానికి పూనుకుంటున్నాయి. బ్రిక్స్ దేశాలుగా అవతరించిన బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాల ఐక్యత ఇందుకు ప్రబల నిదర్శనం. సమ్మూలంగా మారిపోయిన ఈనాటి ప్రపంచ రాజకీయార్థిక వాతావరణంలో దేశాలు ఎవరి సమస్యలను వారు తామే సామరస్యంగా పరిష్కరించుకునే అవసరం, అవకాశం ఏర్పడుచున్నది. దేశ సంపద పెరుగుదల దాని న్యాయసమ్మతమైన పంపకం,ఆర్థిక సంస్కరణల ఆధారంగా నిరంతర ఆర్థికాభివృద్ధి సాధన, ద్రవ్యలోటు, రుణభారం లాంటి బంధాల నుండి విముక్తిని సాధించే దిశలో స్వావలంబన లక్ష్యంతో

ముందడుగు వేస్తున్నవి. సామ్రాజ్యవాద పీడకలలకు స్వస్తి చెబుతూ రాజకీయార్థిక, స్వేచ్ఛా స్వతంత్ర వాయువుల్ని పీల్చుకుంటున్నవి. మానసికంగా అనుభవించబడుచున్న స్వేచ్ఛ, స్వతంత్రం ఇంకా భౌతిక జీవితంలో శ్రామిక జనజీవితంలో ప్రతిబింబించడంలేదు. తరతరాలనుండి ఘనీభవించి అభ్యుదయానికి గుదిబండలుగా మారిన సంస్థలు, వ్యవస్థలు ఇందుకు గొప్ప ఆటంకాలుగా ఇంకా మిగిలియున్నవి. పాలకవర్గాలు "అభివృద్ధి" "సమన్యాయం" "సమ్మిళితాభివృద్ధి" లాంటి మంచి మాటలెన్ని చెప్పినా కరుడుగట్టిన అర్ద భూస్వామ్య ధనాధ్య వర్గాల దళారి దోపిడి విధానాలు ఇంకా

రాజ్యమేలుతున్నాయి. "ప్రజాస్వామ్య " ప్రక్రియలను అధికార సాధనా యంత్రాలుగా మలుస్తూ పాశ్చాత్య విలాసవంత జీవనశైలికి అలవాటుపడుతూ ధనదాహంతో సామాజిక సంపదను కొల్లగొడుతున్నాయి. నేరస్తులు, అవినీతిపరులు, రాజకీయాలను శాసిస్తున్నారు. రాజకీయం నేరమయమయిపోతున్నది. దీనికితోడు సామ్రాజ్యవాద మనస్తత్వంతో, ప్రపంచ రాజకీయార్థిక విధానాలను శాసించే బహుళజాతి సంస్థలు, నూతనంగా స్వతంత్ర దేశాలుగా అవతరించిన ప్రజల స్వతంత్రార్థికాభివృద్ధికి అడుగడుగునా అవరోధాలను సృష్టిస్తున్నవి. ప్రపంచ వాణిజ్యసంస్థ (డబ్ల్యు.టి.ఒ) ద్వారా ప్రపంచ బహుళజాతి సంస్థల ప్రయోజనాల పరిరక్షణకై పడరానిపాట్లు పడుచున్నవి. స్వేచ్ఛా మార్కెటు పేరుతో చిన్న వ్యాపారస్థుల పెద్ద ప్రయోజనాల్ని మ్రింగివేస్తున్నవి. పెద్ద చేప చిన్న చేపలను మ్రింగిన చందంగా తమ ఆర్థిక అధిపత్యాన్ని పదిలపరిస్తూ ఇంకా విస్తరించుకునే విఫల ప్రయత్నాలను కొనసాగిస్తున్నవి. "స్వేచ్ఛా మార్కెటు" పేరుతో పెద్ద గుత్త పెట్టుబడిదారులు చిన్న పెట్టుబడిదారుల ఉనికికే ప్రమాదంగా తయారయినారు. "పెట్టుబడిదారి దోపిడి నుండి పెట్టుబడిదారి విధానాన్ని రక్షించమని" కోరే పరిస్థితికి చేరుకున్నాము. ఈనాటి జాగృత ప్రపంచం, అజేయమైన ప్రజా స్వామ్య యుగం బలహీనమైన, వెనకబడిన, అత్యధికంగా వెనకబడిన దేశాలలో నూతనోత్సాహన్ని నూరి పోస్తున్నది. వారి ఆత్మ విశ్వాసాన్ని బలోపేతం చేస్తున్నది. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రయోజనాత్మకంగా కనబడిన "ఉదారవాదం" ఈనాడు ముదిరి నయా ఉదారవాదం పేరుతో మునిగిపోతున్న తమ ఆర్థిక సామ్రాజ్యాలను రక్షించుకోలేని పరిస్థితి ఏర్పడ్డది. బహుళజాతి గుత్తపెట్టుబడిదార్లు, ద్రవ్య చలామణిని నియంత్రించగల్గే కుబేరుల దృతరాష్ట్ర కౌగిలినుండి చిన్నపెట్టుబడిదారి దేశాల ఆర్థిక ద్రవ్య విధానాలను రక్షించుకోవడం బలహీనమైన దేశాల జాతీయ, అంతర్జాతీయ కర్తవ్యం, సొంత ఉత్పత్తులను పెంచుకుంటూ ఆర్థిక స్వతంత్రాన్ని సాధించుకోవడం వారి ప్రధాన కర్తవ్యం.

ఆరున్నర దశాబ్ధాల సుదీర్ఘకాలంలో భారతావని గడించిన అనుభవసారం అత్యంత కీలకం. స్వతంత్రానంతరం నాలుగు రెట్లుగా పెరిగిపోయిన జనాభాలో 60 శాతం జనాభా తలసరి రోజువారి ఆదాయం కేవలం ఒకటింబావు డాలరు (సుమారు రూ॥ 75)తో బ్రతుకు భారాన్ని ఈడ్చుకోక తప్పడం లేదు. ప్రజా స్వామ్యం కేవలం ఎన్నికల ప్రక్రియలకే పరిమితమైపోతూ ప్రజల ఆర్థిక సమస్యల పరిష్కారానికి ఉపయోగపడడం లేదు. నెహ్రూ గారి నేతృత్వంలో పబ్లిక్ రంగానికి పెద్దపీట వేస్తూ అధికోత్పత్తిని సాధించగలుతామను భ్రమ పటాపంచలైంది. అది "హిందూ రేట్ ఆఫ్ గ్రోత్" గా నత్తకే నడకను నేర్పే తిరోగమనంగా తిరస్కరించబడ్డది. ఆ తర్వాత 1991లో ఆర్థికాభివృద్ధి ద్వారాలను పూర్తిగా తెరిచి ఉదారవాదంతో ప్రైవేటు పెట్టుబడులను అన్ని రంగాలలో, అపరిమితంగా ఆహ్వానించడం ద్వారా ప్రపంచీకరణ ప్రయోజనాన్ని పూర్తిగా పొందడమే ఏకైక మార్గమనే సిద్ధాంతాన్ని పాలకులు ప్రయోగిస్తున్నారు. నాలుగు దశాబ్ధాల సుదీర్ఘ అనుభవంతో దేశం ఉత్పత్తి, ఉపాధి, ద్రవ్యం, రుణం, నిత్యావసర వస్తువుల ధరల లాంటి అన్ని ఆర్థిక సూచికల్లో చెప్పుకోతగిన విధంగా ముందడుగు వేయలేదు. సరికదా వెనుకడుగు వేస్తున్న దుస్థితి భయపెట్టుచున్నది. ఈ ఆర్థిక మాంధ్యానికి గల కారణాలేమిటి? 2011-2012 సంవత్సర చివర మూడు మాసాలలో మన దేశ ఆర్థికాభివృద్ధి 5.3 శాతానికి పడిపోవడం, వార్షికాదాయం పెరుగుదల రేటు 5 శాతానికి పరిమితం కావడం ఆందోళనకరం ఇది యాధృచ్చికం కాదు. దీనికి బలమైన కారణాలున్నవి. కాబట్టి విశ్లేషణ అవసరం మనలో కొందరు

“నేను ఇదివరకే చెప్పలేదా?” అంటూ వాదించేవారు లేకపోలేదు. సబ్సిడీలను రద్దు పరచాలని లేదా తీవ్రంగా కుదించాలని రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించాలని అప్పుడే పెట్టుబడు సమకురుతాయని గూడ్స్ అండ్ సర్వీసెస్ పన్నుల భారాన్ని రాష్ట్రాలపై వేయాలని చిల్లర వ్యాపారాల్లో కూడా విరివిగా విదేశీ పెట్టుబడులను ఆహ్వానించాలని బ్యాంకులు, ఇన్సురెన్స్ రంగాలలో విదేశ ప్రత్యక్ష పెట్టుబడులకు పెద్ద పీటవేయాలనే వారి ఉచిత సలహాలు కొత్తవి కావు ఆర్థిక స్థంభనను శాస్త్రీయంగా సాకల్యంగా విశ్లేషించడం విజ్ఞుల బాధ్యత. పారిశ్రామికోత్పత్తి గత సంవత్సరం (2011-12) 2.5 శాతానికి పడిపోయిందని దిగులుపడటం సహేతుకం కాదు. అలా అయితే అదే సంవత్సరం మన ఎగుమతులు డాలర్లతో 23శాతానికి పెరగడానికి సమాధానం చెప్పలేము.

ఇందులో సగానికి మించిన ఎగుమతులు చిన్న, కుటీర పరిశ్రమలు హస్తకళలకు సంభందించినవేనను వాస్తవాన్ని మరవరాదు. ఈ అంకెలు సరిగా చూచుకొన్న తర్వాతనే ఏదైన నిర్థారణకు రావడం ఉచితం. గత సంవత్సరం పారిశ్రామికాభివృద్ధిపై వెచ్చించిన పెట్టుబడులలో 5.4 శాతం పెరుగుదల స్పష్టంగా కనపడుచున్నది. ఇది ఒకనాటి పెరుగుదల 13-17శాతానికి తగ్గిందే కావచ్చును. 2008 నాటి సంక్షోభ సంవత్సరం పెంచిన 3.4 శాతాని కంటే మించినదే. పెట్టుబడుల తరుగుదల ఒకటే ఈనాటి ఆర్థిక దిగజారుడికి కారణంగాకూడదు. మనం చర్చించుచున్న అంకెలు పెట్టుబడులలో పెరుగుదల శాతం మాత్రమే. జాతీయ సగటు ఆదాయంలో ఈరంగంపై 35శాతం వెచ్చిస్తున్నాము. దాదాపు ఇదేదామాషాతో పెట్టుబడులను పెంచిన గత 5-6 సంవత్సరాలలో సగటు జాతీయ ఉత్పత్తిరేటు నిలకడగానే ఉండింది. ఒకటి అర శాతం తేడా మాత్రం అగుపించింది. కేంద్రం పారిశ్రామికాభివృద్ధిపట్ల చూపిన అశ్రద్ధ, అలసత్యం, ఆర్థిక దిగజారుడు తనానికి కారణమేమో అనుకుంటే ఇదే ప్రభుత్వ పరిపాలనాకాలంలోనే సగటు జాతీయోత్పత్తి గణనీయంగా పెరగడానికి గల కారణాలను వివరించలేం. ప్రధాని మన్ మోహన్ సింగ్ గారి రెండు ప్రభుత్వాల కాలంలో మొదటి సంవత్సరమైన 2004-2005 మరియు 2008-2009 సంవత్సరాలలో మాత్రమే జాతీయోత్పత్తి పెరుగుదల రేటు 8 శాతానికి తగ్గుముఖంగానుండింది. అసమర్థ పరిపాలన కొంత వరకు తన ప్రభావాన్ని చూపినా అది ఈనాటి దుస్థితికి ప్రబల కారణంగా చెప్పలేము. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (యఫ్.డి.ఐ) సంస్థాగతంగా విదేశీ పెట్టుబడులు (యఫ్11) యధాక్రమం సమకూరుతూనేనున్నవి. ఎన్నికలు, యూరపులోని మాంద్యం మన మాంద్యాన్ని స్వల్పంగా ప్రభావితం చేస్తున్న మాట వాస్తవం. విదేశీ, ప్రైవేటు పెట్టుబడుల ఉపసంహారణ ఒక కారణంగా వచ్చునే వాదన లేకపోలేదు. దేశ ద్రవ్యలోటు, రుణభారం, విదేశీ పెట్టుబడుల ఉపసంహారణలాంటి ఆర్థిక ఒడిదుడుకులు ఈనాటివికావు. అవి దీర్ఘకాలిక వ్యాధులు. అవి ఈనాటి 6.5 శాతం రేటు తగ్గుదలకు చెప్పుకోదగ్గ కారణం కాకూడదు. అధిక ధరలు (నోట్లు ముమ్మరం) లేక ద్రవ్యోల్బణం ఎంతవరకు కారణంగావచ్చునని విశ్లేషించడం అవసరమే. ద్రవ్యలోటు, అధికధరలూ సహజీవనం చేస్తున్న సగటు పరిస్థితి. రిజర్వుబ్యాంకు రుణాలపైన వడ్డీరేట్లును తగ్గించకపోవడానికిది ప్రబలకారణం. అయినా 35 శాతం పెట్టుబడిపెట్టగా 6.5 శాతం మేరకు ఆర్థికాభివృద్ధి జరగం పరిశీలించదగినదే.

ఆర్థిక నిపుణుల విశ్లేషణలు ఒక వాస్తవాన్ని వేలెత్తి చూపుచున్నది. 2010-2011 సంవత్సరం సగటు జాతీయ ఉత్పత్తిలో 35 శాతం పారిశ్రామికాభివృద్ధిపై వెచ్చించినపుడు పెరుగుదల రేటు

కనీసం 8-8.5 శాతం ఉండితీరాలి. అంతర్జాతీయ అననుకూలతల కారణంగా ఇది తీవ్రంగా తగ్గడం అర్థం చేసుకోతగినదే. బొగ్గు, విద్యుచ్ఛక్తి లాంటి మౌలికాంశాల సరఫరాలలోటు పరిశ్రమల పనిని తగ్గించి వేస్తున్నది. పూర్తికాలం పనిచేస్తూ తగిన ఉత్పత్తిని చేయలేకపోవడం కొట్టవచ్చినట్లుగా కనబడుచున్నది. ఈ కారణంగా 7.5 శాతం పెరుగుదల ఒక శాతమైనా పడిపోవడం సహజం. మిగతా 0.5 శాతం అంకెల గారడిగా గుర్తిస్తే ఈనాడు కేవలం 5 శాతం పెరుగుదల వెనక కారణం తేటతెల్లమవుతుంది. రానున్న సంవత్సర కాలంలో విద్యుచ్ఛక్తి లోటు, బొగ్గు కొరత తదితర పెట్టుబడుల సమస్యలన్ని సకాలంలో పరిష్కరించబడి పరిశ్రమలన్ని పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయగలిగితే 6.65 శాతం పెరుగుదల రేటు సాధించడం అసాధ్యంగాదు.

అధిక ధరల భారంలేని, స్థిరమైన అభివృద్ధిని సాధించాలంటే ప్రభుత్వాలు పెట్టుబడి ప్రధానమైన పారిశ్రామికాభివృద్ధి వ్యూహాన్ని అనుసరించక తప్పదు. 2003-07 మధ్యకాలంలోని అనుభవం మంచి గుణపాఠం. సగటు దేశీయ ఉత్పత్తి (జి.డి.పి.) 8-9 శాతం ఉండగా ద్రవ్యోల్బణం (ధరల పెరుగుదల) 5-6 శాతానికి మించలేదు. గత నాల్గు సంవత్సరాలుగా సగటు దేశీయోత్పత్తి క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఇది ఈనాడు 5 శాతం అంతకులోపుగా నుండడం గమనార్హం. ధరలపెరుగుదల రేటు (ద్రవ్యోల్బణం) రానున్న రెండు సంవత్సరాల వరకు 6 శాతాన్ని దాటి 6.5-7.0 శాతానికి చేరుకోవచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఉత్పత్తి స్థంభన, ద్రవ్యోల్బణం పెరుగుదల మధ్య అవినాభావ సంభందముంటుందని స్పష్టపడుతున్నది. దీనికి గల కారణాలు పరిశీలించదగినవి. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలే పెట్టుబడుల కొరత కారణంగా ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుచుండగా అక్కడి నుంచి పెట్టుబడులు మనకు ఇతోధికంకావడం దుర్లభం. మన అవసరాలల్లో 80 శాతానికి తగ్గకుండా ఆధారపడే విదేశీ పెట్రోలియం ఉత్పత్తి ధరలు ఆకాశాన్ని అంటుకుంటున్నాయి. మన ఆర్థిక వ్యవస్థను పూర్తిగా అస్తవ్యస్తం చేస్తున్నాయి. దేశ ఆర్థికాభివృద్ధి వాతావరణానికి ప్రతిబంధకంగా మారినవి. పై నుదహరించిన బాహ్యాంశాల కంటే అధికంగా ఆంతరంగిక వాస్తవాలే మన ఆర్థిక మాంద్యానికి స్థంభనకి కారణాలని విజ్ఞుల అభిప్రాయం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్రవ్యలోటే దీనికి ప్రధాన కారణం. ఈలోటు సగటు దేశీయ ఉత్పత్తికి 10 శాతంగా పెరగడం అత్యంత ఆందోళనకరం. రాజకీయాలెలా ఉన్నా పాలకవర్గాలు చేస్తున్న అనుత్పాదక ఖర్చులు, ప్రతి సంవత్సరం పెరిగిపోతున్న రుణభారం, పెరిగిపోతున్న సబ్సిడీల భారం, తగ్గుతున్న పన్నుల రాబడి శాతం ఇంకా అనేకానేక వృధాఖర్చుల కారణంగా నాలుగు శాతానికి మించకుండా జాగ్రత్త పడవలసిన ఆర్థికలోటు క్షంతవ్యంగాని 10 శాతానికి చేరుకోవడం రానున్న ఆర్థిక ప్రమాద పరిస్థితికి ప్రబల సంకేతం. దీన్ని మరింత లోతుగా విశ్లేషించడం అవసరం.

దేశంలో ఉత్పత్తి, దాని వ్యాపారం చేసే వర్గాల వారి వద్ద మిగులు ధనం తగ్గిపోతున్నది. 2008-12 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో ఇది సగటు దేశీయ ఉత్పత్తిలో 6.4 శాతానికి తగ్గింది. దీనికి మూలకారణం ప్రభుత్వాల ఆర్థికలోటు బడ్జెట్లు. పరిశ్రమలు, వ్యాపారాలల్లో పౌరులు తమ పెట్టుబడులను పెంచుకోలేకపోవడానికి ఇది ప్రథమ కారణం. కేంద్ర ప్రభుత్వమను సరించే క్రింది స్వయం కృతాపరాధ విధానాలు రెండవ కారణం. దేశ వ్యాపితంగా లక్షల కోట్ల ఖర్చుతో

నిర్వహించబడుచున్న మహాత్మాగాంధి జాతీయ ఉపాధి హామి పథకమే ఇందుకు ప్రబల నిదర్శనం. సంపద సృష్టికి నోచుకోని భారీ వృధావ్యయం ఇది. రాజకీయ లబ్ధిని ఆశించే జనాకర్షక పథకమని కేంద్ర ప్రభుత్వంచే నియమించబడిన అనేక సోషల్ ఆడిట్ కమిషన్‌లు తేల్చి చెప్పిన సత్యం. రెండవ కారణం ఈ ఆనర్థం వ్యవసాయ కూలీల కొరత రూపంలో వ్యవసాయరంగానికి తీవ్రమైన నష్టాన్ని కలుగచేస్తున్నది. సంక్షేమ పథకాలుగా చెప్పబడే అనేక కార్యక్రమాలు ఇదే బాటలో నడుస్తున్నవి. చేసిన శ్రమకి సృష్టించిన విలువకి మధ్య పొంతనేలేదు. వందల, వేల కోట్ల ధనాన్ని వెచ్చిస్తూ నిర్మించతలపెట్టిన ప్రాజెక్టుల నిర్మాణంలో, వాటికి సంబంధించిన నిర్ణయాలు చేయడంలో అధికార యంత్రాంగం చేస్తున్న అనూహ్యజాప్యం మూడవ ముఖ్యకారణం. ఈ ప్రాజెక్టుల ద్వారా దేశానికి సమకూరే సంపద ఎంతకాలంలో ఎంత మొత్తంలో సాధ్యపడుతుందో కాని వాటి నిర్మాణానికి దశాబ్దాలకాలం విలువైన ధనాన్ని వృదా చేయడం జాతికి తీరని హాని. ప్రస్తుతం వివిధ పేర్లు, విభిన్న లక్ష్యాలు, రేట్లతో నిర్వహించబడుచున్న పరోక్ష పన్నుల విధానాన్ని ఆమూలాగ్రంగా సంస్కరించలేని దుస్థితి నాలుగవ కారణం. ఒకే వస్తువుపై వివిధ రాష్ట్రాలలో విభిన్న రేట్లుండటం కారణంగా దేశంలో రాష్ట్రాల మధ్య కేవలం భౌగోళిక సరిహద్దులేకాక ఆర్థిక సరిహద్దుల అవతరణ జరిగింది. వాణిజ్య వ్యాపారానికి ప్రభుత్వాదాయాల రాబడికి అనేక ప్రతిబంధకాలేర్పడినవి. పైగా పరోక్ష పన్ను విధానం ఆచరణలో అభివృద్ధి నిరోధకమని ఆనేకమంది నిష్ణాతులు చెబుతున్నారు. ఐనా అవినీతికి జాప్యాలకి అలవాటు పడిన బ్యూరోక్రసి దీనిని సంస్కరించడంలో అడ్డుపడుచున్నది. ఆమాత్యులకు అసలు సమస్యలు పట్టవు. దేశ వ్యాపితంగా ఒకే రకమైన గూడ్సు అండ్ సర్వీసెస్ టాక్సు విధానాన్ని ధైర్యంగా ప్రవేశపెట్టి ఆచరించడం వలన రకరకాల పరోక్ష పన్నుల గందరగోళం నుండి విముక్తిని సాధించగల్గుతాం. ప్రభుత్వాల ఆదాయాన్ని పెంచుకోగలుగుతాం. వివిధ రంగాలలో విదేశీ పెట్టుబడుల పాత్ర, దేశంలో ప్రైవేటీకరణ ప్రక్రియల గురించి కేంద్ర ప్రభుత్వ నియంత్రణా విధానాన్ని ఇంకా రూపొందించి ఆచరించకపోవడం అయిదవ ముఖ్యకారణం. ఇతర కారణాలన్నిటిని ప్రభావితం చేయగల్గే పెద్ద కారణం ఇదే. ఇప్పటికే నిరుద్యోగం, అరకొర ఉద్యోగాలతో సతమతమవుతున్న మన దేశ యువత రానున్న పది సంవత్సరాల అనతికాలంలో మరో 13 కోట్ల 30 లక్షల యువతీ యువకుల్ని తమలో చేర్చుకోబోతున్నది. ఇందులో నైపుణ్యత గలిగిన కొందరు మాత్రమే ఉత్పత్తి సహిత ఉపాధిని సాధించగా అత్యధికులు ఉత్పత్తి రహిత ఉపాధి హామితో బ్రతకవలసివస్తున్నది. ఈ రెండవ శ్రేణికి సంబంధించిన నిరుద్యోగ సైన్యం దేశ భవిష్యత్తును తీర్చిదిద్దజాలదు. నైపుణ్యత గల యువత మాత్రమే నిజంగా రానున్న కొన్ని దశాబ్దాల వరకు దేశానికి శ్రీరామరక్షగా నిలుస్తుంది. వారి సంఖ్యాబలం, నేర్పరితనం దేశ పునరుజ్జీవనానికి రాచబాటలు వేస్తుంది. విద్యా విధానంలో మౌలిక సంస్కరణల ద్వారా మాత్రమే ఇది సాధ్యపడుతుంది. ప్రతి సమస్యకు పరిష్కారముంటుంది. మనసుంటే మార్గముంటుంది. త్వరగా సమర్ధవంతంగా, తాత్కాలిక, దీర్ఘకాలిక పరిష్కారాలపై కేంద్రీకరించడం విజ్ఞుల బాధ్యత.

ఇంధనంపై వెచ్చించే సబ్సిడీలను తీవ్రంగా తగ్గించే అవసరమున్నది. అన్ని ఆయిల్ కంపెనీలు భరించే మొత్తంగాక కేంద్ర ప్రభుత్వం చెల్లించే సబ్సిడీ మొత్తం 2012-13 సంవత్సరాలలో 2500 కోట్ల డాలర్ల నుండి 3000 కోట్ల డాలర్ల (దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయలు) వరకుంటుందని

అంచనావేయబడుచున్నది. రాష్ట్రాలు ఈ కుదింపుపై రాజకీయంగా తమ అభ్యంతరాలను లేవదీయకుండా ఉంటే తాము నష్టపోతున్న ఇంధన సబ్సిడికి సరిపడ మొత్తాలను విద్య, వైద్య తదితర మౌలిక అవసరాలు తీర్చడానికి అందచేయడం మేలు. నష్టపరిహారం కొంతవరకైనా లభించిందనే సంతృప్తి రాష్ట్రాలకు మిగులుతుంది. సమర్ధవంతమైన సోషల్ ఆడిట్ ఫలితంగా ఈ మాత్రం మొత్తాన్ని వృధా కాకుండా జాగ్రత్త పడగల్గుతాం.

ప్రపంచ వ్యాపిత ఆర్ధిక (ద్రవ్య) సంక్షోభంతో పాటు మన దేశంలోనే రోజు రోజుకి వెలుగులోకివస్తున్న ఆర్థిక నేరాలు, డబ్బు గల వారిని కూడా పరిశ్రమలల్లో పెట్టుబడులు పెట్టలేని విధంగా నిరుత్సాహరస్తున్నది. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికపై ఒక ఉద్యమ రూపంలో పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించవలసిన ఆగత్యం ఏర్పడినది. పరిశ్రమల నిర్మాణం, నిర్వహణకవసరమైన అన్ని సందర్భాలలో ప్రభుత్వ సహాయ సహకారాలు అందుబాటులోనుంటాయని విశ్వాసం కల్పించవలసియున్నది. అప్పుడే పెట్టుబడులు ఆకర్షించబడతాయి. పారిశ్రామిక రంగంనుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాబడి పెరుగుతుంది. ఉపాధి అవకాశాలు విస్తృతించి జాతీయ సంపద పెరుగుతుంది. గ్రామ స్థాయి, పట్టణ స్థాయి మౌలిక సదుపాయాల నిర్మాణం ఈనాటి పెద్ద అవసరంగా స్పష్టంగా కనబడుచున్నది. ఇందుకొరకు కేంద్ర ప్రభుత్వం వెంటనే నాలుగైదువేల కోట్ల డాలర్ల పెట్టుబడికి తగ్గకుండా వెచ్చించడం అవసరం. ఇదే లెక్కన 10–25 సంవత్సరాలు పెట్టుబడిని వెచ్చించగల్గితే దేశంలోని పట్టణ, గ్రామీణ మౌలిక సదుపాయాలు ప్రపంచ నాగరికతా ప్రమాణాలనందుకుంటాయి. పౌరజీవితం సంతృప్తితో ఆత్మవిశ్వాసంతో మరిన్ని విజయాలను సాధిస్తుంది. ఇంత పెద్ద మొత్తాలు సమకూర్చడానికై కేంద్ర ప్రభుత్వం ప్రపంచ వ్యాపితంగా ఎఫ్.డి.ఐ.ల ద్వారా, బాండ్ల ద్వారా రుణ సేకరణ చేయడం పొరపాటుగా భావించగూడదు.

నాగరికతగల దేశాలన్ని విధిగా చేసిన ప్రక్రియనే ఇది. పరిపాలనలో పారదర్శకత జవాబు దారి తనాన్ని కొంతైనా సాధించగల్గితే ఈనాడు పన్నుల మాఫి, ఎగవేతల ద్వారా కోల్పోతున్నధనం ఇందుకు

సరిపోతుంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్రవ్యలోటుకు మించిన మొత్తం పై ఎగవేతల మొత్తానికంటే చాలా తక్కువగానున్న వాస్తవం గమనించదగినది. నిధులకొరతలేదు. సామాన్యుని కొనుగోలు శక్తిని పెంచాలి. అతనికి ఉత్పత్తిదాయకమైన పనిని కల్పించాలి. స్వశక్తితో స్వావలంబన ద్వారా అంచెలంచెలుగా ఎదిగే అవకాశాలను సమకూర్చాలి.

పైన చర్చించిన అంశాలన్ని ద్రవ్య దుబారాను అరికడుతూ సబ్సిడీలను అర్హతగలవారివరకే పరిమితం చేస్తూ దేశ పారిశ్రామికాభివృద్ధి వేగాన్ని పెంచి దేశ సంపదను ఇనుమడింపచేసే ఉద్దేశంతో చేయబడిన సూచనలు. ప్రపంచీకరణ నేపథ్యంలో సత్వరాభివృద్ధిని సాధించే ప్రయత్నం వీటి లక్ష్యం.

## ఉపాధి రహిత అభివృద్ధి

ఉపాధి రహిత అభివృద్ధి సృష్టిస్తున్న అనేక సమస్యలను విశ్లేషించడం ఈ సందర్భంగా ఉచితం. ఏప్రిల్ 2012 నుండి 12వ పంచవర్ష ప్రణాళికను నిర్వహిస్తున్నాం. ఈ ప్రణాళిక ద్వారా ఆర్ధిక స్వాతంత్రం దిశలో ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయడానికి "సమ్మిళిత ఆర్థికాభివృద్ధి"ని

లక్ష్యంగా ఎంచుకున్నాం. “ సమ్మిళితం” ఒక మిశ్రమ పరిస్థితికి మారుపేరనే సత్యాన్ని గుర్తించాలి. శ్రామికుల ప్రత్యక్ష భాగస్వామ్యం, వారి గుణాత్మకమైన శ్రమ శక్తి వెచ్చింపు, శాశ్వత సంపద సృష్టి లేక ఉత్పత్తి సాధనాల రూప కల్పన వాటి నిర్మాణం, ఇవన్నీ సృజనాత్మకంగా మిళితంకావడమే సమ్మిళిత ఆర్థికాభివృద్ధి అవుతుంది. ఉపాధి రహిత జనాకర్షణ “అభివృద్ధి” నిరుద్యోగ శాశ్వత నిర్మూలనకు తోడ్పడదు. ఉత్పత్తి, సంపద లేని ఉపాధి నిరర్ధకమవుతుంది. సంపద పెరగదు. శాశ్వత కట్టడాలు నిర్మాణాలుండవు. ప్రణాళికా పత్రం ప్రకారం రానున్న 20 సంవత్స రాలకాలంలో మన దేశంలోని శ్రామికుల సంఖ్య 32 శాతానికి పెరుగుచున్నది. చైనాలో పెరగడం కాదుగదా 5 శాతం తగ్గనున్నది. పెరిగే జనాభా విద్యాగంధం కలిగిన సాంకేతిక నైపుణ్యతను సంతరించుకోగలిగితే మన దేశం ప్రపంచాన్నే జయించగల్గుతుంది. ప్రపంచ నలుమూలలనుండి నైపుణ్యతగల శ్రామిక శక్తికై డిమాండు పెరుగుచున్నది. ఈ విధంగా వ్యవసాయం, పరిశ్రమ, సేవారంగాలలో నైపుణ్యతగలిగిన యువశక్తి విప్లవాత్మక మార్పును సాధించగల్గుతుంది. మాతృభూమి యొక్క సర్వతోముఖాభివృద్ధికై పాటుపడగల్గుతుంది. ప్రత్యేకంగా మానవ శ్రమకు ప్రధానమైన వస్తూత్పత్తి రంగాన్ని అతి త్వరలో తీర్చిదిద్దగలుగుతుంది. వ్యవసాయరంగాన్నికూడా ప్రయోజనాత్మకం చేయగల్గుతుంది. ప్రపంచ వ్యాపితంగా పొందిన ఒక అనుభవం గమనార్హం. వ్యవసాయరంగం సగటు దేశీయ ఉత్పత్తి పెరుగుదలరేటుతోపాటు పేదరిక నిర్మూలనలో ఇతర రంగాలకంటే రెట్టింపు ప్రభావం కలిగినది. మన దేశ వ్యవసాయం ఇంకా వెనకబడియుండడం ఆశ్చర్యకరం. అన్ని రకాల పంటల దిగుబడి ఉత్పాదకతలో చాలా వెనకబడియుండం దారుణం. ఈ లోటును తొలగిస్తూ నిరుద్యోగ దిశనుండి విముక్తిని సాధించడం తక్షణావసరం.

వ్యవసాయాభివృద్ధి తప్పకుండా వ్యవసాయేతర రంగాల అభివృద్ధికి దోహదపడుతుంది. 2009లో సగటు దేశ ఉపాధిలో ఇతర ఆసియా దేశాలలో వస్తూత్పత్తి రంగం 30 నుండి 40 శాతం భాగస్వామ్యం కలిగియుండగా భారత దేశంలో మాత్రం ఇది 11 శాతానికి మించకుండా ఉండడానికి మనమనుసరించిన విధానాలే కారణం. వ్యవసాయం, చేతివృత్తులకు సంబంధించిన దళిత, వెనకబడిన తరగతులకు చెందిన కోట్లాది నిరుద్యోగులింకా బ్రతుకు భారాన్ని ఈద్వలేక ఆత్మ హత్యలకు తెగించడం జాతికి గొప్పతలవంపు. వ్యవసాయం, పరిశ్రమ, (ముఖ్యంగా వస్తూత్పత్తిరంగం) సేవారంగాలు పరస్పరారాధితాలు. సామాజికాభివృద్ధితో అత్యున్నత పాత్రలను పోషించే రంగాలు.

ఈనాటికి దేశ జనాభాలో 15 నుండి 20 శాతం జనాభా నిరుద్యోగంతోనుండటం క్షంతవ్యం కాని పరిస్థితి. గత 65 సంవత్సరాల సుదీర్ఘకాలంలో జనాభా పెరుగుదల రేటు 2.5 శాతముంటే నిరుద్యోగిత తరుగుదల కేవలం 0.5 శాతముండడం యాదృచ్ఛికం కాదు. రాజకీయ సంకల్పబలంలేక పోవడమే ప్రధానం. అత్యధికంగా ఎదగబోయే యవత మంచి ఆరోగ్యం, చక్కని విద్యాబలం, నైపుణ్యతలతో కూడిన శ్రమైక జీవులుగా దేశ సమస్యలన్ని పరిష్కరించగల్గుతుంది. ఈనాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయగల్గుతుంది. స్వయం ఉపాధి ద్వారా ఆదర్శమైన, బలోపేతమైన సామాజిక పెట్టుబడిగా రాణించగల్గుతుంది. దేశ సంస్కృతి, సాంప్రదాయాలకు మెరుగులు దిద్దగల్గుతుంది.

మరొకవైపు దేశంలో దారిద్ర్యరేఖ గురించి చర్చోపచర్చలు జరుగుతుండగా పార్లమెంటు మరియు ఆసెంబ్లీలకు గెలిచిన వారి ఆస్తుల స్థితిగతులు ఆసక్తిదాయకంగానుండడం విశేషం. పార్లమెంటుకు 2004 సంవత్సరంలో గెలిచిన వారిలో కోటీశ్వరుల సంఖ్య 156 ఉండగా అది 2009 ఎన్నికల నాటికి పెరిగి 315కి చేరింది. రాష్ట్రాలలో విధాన సభలకెన్నుకోబడిన వారి పరిస్థితి ఇదే విధంగా వందకు మించిన శాతానికి పెరిగింది. చిన్న రాష్ట్రమైన మణిపూర్‌లో ఒక అయిదు సంవత్సరాలలో ఈ సంఖ్య 563 శాతానికి పెరిగింది.

కొందరు " ప్రజాప్రతినిధులతో సహా" ధనవంతులు మరీ ధనవంతులు కాగా సామాన్య ప్రజలు ఇంకా పేదరికంతో అల్లాడిపోవడం, పౌష్టికాహారలోపం, ఆకలి బాధలలో పసిపిల్లలు, వయోవృద్ధుల ఈతి బాధలననుభవించడం యాధృచ్ఛికం కాదు. ప్రకృతి సంపద లేక కాదు ఒక రకమైన భావదాస్యం నుండి ప్రజా ప్రతినిధులు బయటికి రాలేకపోవడం, వారిలో సామాజిక స్పృహలేకపోవడం లేదా లోపించడం స్వార్ధచింతన పెరగడం ఇందుకు మూలం. మౌలిక విధానపర లోపాలనటుంచి సంక్షేమ కార్యక్రమాల ద్వారా సత్వర సమస్యల పరిష్కారానికుద్దేశించబడిన లక్షల కోట్ల ప్రజాధనం అత్యధికంగా వృధాకావడం గమనార్హం. రాజకీయ నాయకులు, ఉద్యోగస్తులు, మధ్యదళారీలు ఉద్దీపనలుగా, సబ్సిడీలుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్వారా ఇవ్వబడుచున్న మొత్తంనుండి కనీసం 50 శాతం కైంకర్యం చేస్తున్నారు. అమాంతగా ధనవంతులయ్యే సంస్కృతిని ప్రణాళికాబద్ధంగా రూపొందించి దాన్ననుసరిస్తున్నారు. దీని కొక వ్యవస్థాపర గౌరవ ప్రదస్థానాన్నికల్పించారు.

ఇదేమి చిన్న మొత్తం కాదు. ప్రత్యక్ష, పరోక్ష పన్నులల్లో రాష్ట్రాలకిచ్చే వాటాలో 25 శాతం దీనికొరకే వెచ్చించబడుతున్నది. రాష్ట్రాలు నిర్వహించే సంక్షేమ కార్యక్రమాల భారంవేరు. కేంద్రంలోని కొందరు ఆర్థిక నిపుణులు అసలు సబ్సిడీల గొడవనే లేకుండా చేస్తే తిరిగి దేశం తన అభివృద్ధి వేగాన్ని పుంజుకుని 9 శాతాన్ని మించి పోతుందని నమ్మబలుకుచున్నారు. ఇది వారు నేర్చిన పెట్టుబడి దారి అర్ధశాస్త్రం అందించే సూచన కావచ్చును. నిజమే సబ్సిడీలు, ఉద్దీపనలు, తాత్కాలికాలేకాని శాశ్వతాలు కావు. కాకూడదు. శ్రమైక జీవుల శ్రమ శక్తికి తగు గౌరవం ఇస్తూ దాని ప్రతి ఫలాన్ని పువ్వుల్లో పెట్టి తిరిగి వారికి అందచేసే సామాజిక స్పృహ గల్గిన సమాజం దాని ప్రభుత్వం యొక్క ఏలుబడిలో మాత్రమే ఇటువంటి విప్లవాత్మక మార్పును చూస్తాం. దళారి పెట్టుబడిదారి విధానం పరాకాష్టకు చెందిన ఈ దశలో అధిక లాభాలు, అత్యధిక లాభాల వేటలో అనేకానేక సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిని రాజకీయాలనుండి తొలగించడం, తరిమివేయడం తద్వారా సురాజ్యానికి బాటలు వేయడం ప్రజాస్వామ్య వాదుల తక్షణ కర్తవ్యం. తాత్కాలిక సహాయాలు సంక్షేమ కార్యక్రమాలన్నిటిని ఖచ్చితంగా అర్హులైన వారికే పరిమితం చేస్తూ క్రమంగా వాటి అవసరమే లేకుండా స్వావలంబన జీవితాన్ని సగౌరవంగా నిర్వహించే సమాజాన్ని నిర్మించడం సభ్యసమాజ కర్తవ్యం. పౌరులందరికి ఉత్పత్తిదాయకమైన ఉపాధిని కల్పించడం ప్రజా ప్రభుత్వ తక్షణ కర్తవ్యంగా గుర్తించబడాలి. సబ్సిడీలు, ఉద్దీపనలు, ప్రధానమైన సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించదానికై బహు జాగ్రత్తగా బాధ్యతగా వాడుకోవడం ఈనాటి కర్తవ్యం. గత కొన్ని దశాబ్దాల సుదీర్ఘ అనుభవాలు మార్గదర్శ కాలు కావాలి. ఉదా: ప్రజా పంపిణీ వ్యవస్థ ఉత్తర భారతంలో అనేక కష్ట నష్టాలతో కూడిన అనుభవాల

నందించగా ఛతీష్‌గడ్, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు ప్రయోజనాత్మక గుణపాఠాల నందిస్తున్నవి. మంచి అనుభవాలపై ఆధారపడుతూ తగు తదుపరి చర్యలను దేశంలోని 28 రాష్ట్రాలల్లో 15 రాష్ట్రాలకు చెందిన 51 జిల్లాలలో అమలు పరుస్తూ 2014 నాటికి దేశ వ్యాపితంగా అమలు పర్చాలని కేంద్రం నిర్ణయించుకున్నది. ఇవన్ని సిద్ధాంత వెలుతురులో శాశ్వత పరిష్కారాలు కాకపోయినా ప్రజాస్వామ్య బద్ధంగా ఆమోదించదగినవే. లాటిన్ ఆమెరికా దేశాలలో ముఖ్యంగా బ్రెజిల్‌లో, ఆఫ్రికా ఖండంలోని దేశాలలో ముఖ్యంగా కెన్యాలోఅమలు పర్చబడుచున్నవి. పేదరికాన్ని క్రమంగానైనా తగ్గించకుండా పెట్టుబడిదాని విధానం మనజాలదనే సూత్రాన్ని అమలు పర్చక తప్పదనే నిర్ణయం అమలులోకి వస్తున్నది. ప్రపపంచీకరణలో సంతరించుకుంటున్న వేగం, విస్తృత శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలు ఆలోచనలను కల్పించడంలో వాటిని ఆచరించడంలో బాగా తోడ్ప డుచున్నవి. ఒక నిరుపేద లేక ఒక వృద్ధుడు, లేక ఒక వికలాంగుడు, ఒక పేద విద్యార్థి తమకు ఉచితంగా ఇవ్వబడే మొబైల్‌ఫోన్ (సెల్‌ఫోన్) ద్వారా "ఆధార్" నెంబరు ఆధారంగా కేంద్ర ప్రభుత్వ మందించే సబ్సిడీని పొందడం ఆందులోనే ఆ మొత్తాన్ని బంగారం లేక భూమిలాగా స్థిరాస్తిగా పదిలపరుచుకోవడం, బ్యాంకు ద్వారా చెల్లింపులు చేయడం ఊహాతీతమనిపించినా ఇది కాబోతున్న నిప్పులాంటి నిజం.

ఈ తరుణంలో సామాజక తాత్విక చింతన కొంతవరకు సందర్భోచితం శ్రమజీవులైన కార్మిక, కర్షకులు, మేధావులు, బుద్దిజీవులంతా కలిసి సృష్టించిన భౌతిక సంపద సామాజికం, అది వారి సొంతం. దీని పంపకంలో తీవ్రమైన అసమానతలు చొటు చేసుకోవడం అనాదిగా వివిధ రూపాలలో కొనసాగుతున్న సామాజిక రుగ్మత. ఈ అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా మానవ శ్రమకి తగు గౌరవం ప్రతిఫలం కావాలనే సామాజిక చైతన్యంతో అనేకానేక వీరోచిత పోరాటాలు కొనసాగి జయాపజయాలు పొందడం మానవ చరిత్ర పరిణామక్రమంలో ముఖ్యాంశం. మనకు తెలిసినంతవరకు వివిధ దేశాలలో విభిన్న సమాజాలలో అవతరించి ఈనాటికి దైవాంశ సంభూతులుగా సమాజాలచే పూచించబడే వారంతా మానవత్వ పరిరక్షణకై ఆత్మార్పణతో సర్వస్వం పరిత్యాగం చేసిన త్యాగధనులే. మత ప్రబోధకులు, తాత్విక వైతాళికుల నుండి సామాజిక రాజకీయ సిద్ధాంతకర్తలంతా భాషా, ప్రాంత తేడాలున్నప్పటికి సామాజిక పురోభివృద్ధికై పాటు పడుతూ అనేక బలిదానాలు చేసిన మానవులే. మహత్ములు, పరమాత్ములుగా కీర్తించబడినప్పటికీ మానవీయ విలువల పరిరక్షణ, పరిపోషణ వాటి ఆచరణకై పాటుబడిన వారుఆదర్శ మానవ మాత్రులే. వీరి ప్రభోధనలు, సిద్ధాంతాలు ప్రవచ నాలన్నింటిలో పూసలలో దారంలాగున్న ఏకైక మానవతా సిద్ధాంతాన్ని అందులోని ఏకత్వాన్ని చూడనిరాకరిస్తూ ఎవరికి వారే తమ సిద్ధాంతం ఒకటే ప్రయోజనకరం, పరమసత్యమంటూ వాదించిన కారణంగానే మత, ప్రాంతీయ, రాజకీయ వైరుధ్యాలు తలెత్తి మానవ వినాశనానికి దారితీసిన చేదు అనుభవాలు భవిష్యత్తు సంస్కరణలకు మార్గదర్శకం కాలేవు. ఆ అనుభవాల గుణపాఠాల వెలుతురులో నడచిన సమాజాలు తక్కువ త్యాగాలతో ఎక్కువ విజయాలను సాధించినవి. అలా చేయని సమాజాలు, జాతులు దేశాలు అనవసరంగా నష్ట కష్టాలననుభవించినవి. మతం, జాతి పేరట ప్రాంతీయ ప్రపంచ యుద్ధాలకు కారణభూతమైనవి. మానవాభివృద్ధి జాతీయా భివృద్ధికి తీరని ఆటంకాలు సంభవించినవి. ప్రపంచ మానవాళి తిరోగమనాన్ని అనుభ వించింది.

స్థూలంగామానవ సమాజాలు వాటి ప్రవక్తలు సృష్టించిన శాంతి, అహింస, సత్యం లాంటి విలువలు శాశ్వతాలు. కాల మాన పరిస్థితులు, సందర్భాల విభిన్న నేపథ్యాలలో అవి ఏ విధంగా ప్రభోదించబడినా సూక్ష్మంగా, నిశితంగా గమనిస్తే అవి సర్వకాల సర్వావస్థలల్లో సజీవమైన విలువలే, ఆచరణలో అనాగరికయుగాల నుండి నాగరికతా వెలుతురులోకి పయనించిన సమాజాలలో గతి తప్పిన మూఢాచారాలు, మూఢ నమ్మకాలు మిగిలి యుండడం సహజం. అవి నిర్జీవమైన జడ పదార్థాలుగా అభివృద్ధికి అవరోధాలుగా మారక ముందే విసర్జించబడాలి. వాటిని చూపెడుతూ గతాన్ని, గత చరిత్రని నిందించడం కేవలం అజ్ఞానం, అనుభవరాహిత్యం. మరో పరమ సత్యం ప్రామాణికమైనది. వ్యక్తులు, వారి నడకలు సమాజ నిర్మాణంలో అత్యంత కీలకమైన పాత్రల పోషకాలు. పై నుదహరించిన శాశ్విత విలువలను వ్యక్తులు పాటించాలని, ఆచరించాలని, పోషించాలని ప్రవక్తలెందరో ప్రభోదించియున్నారు. ఇంకా చేస్తున్నారు. ఇది నిరంతరం కొనసాగించవలసిన యగధర్మం. వస్తు వాహనాలు భౌతిక పరికరాలన్ని మార్కెటు సరుకులుగా లభిస్తాయి గాని సాత్వికత, నిరాడంబరత, వినమ్రత, మానవతలాంటి విలువలు నిజజీవితంలో కామక్రోధ, లోభ, మోహ, మద మాత్పర్యాలతో పోరాడి సాధించవలసినవి. అవి ఆదర్శమానవునికి ఆభరణాలలాంటివి. సమాజ ప్రతినిధులుగా ఎన్నుకోబడే నాయకులు పై విలువల పోషకులుగా, సామాన్యులకు మార్గదర్శకులుగా నుండక తప్పదు. ఇది ప్రజా బాహుళ్యం యొక్క మానసిక వికాసం, క్రియాశీలత, అభ్యుదయానికి తరగని పెట్టుబడి. అభివృద్ధి నిరోధక భావ జాలాన్ని త్యజిస్తూ అభ్యుదయ మార్గాన్ని

ఐచ్ఛికంగా ఎన్నుకోవడం, ఆమార్గాన్ని ఆచరించడం చైతన్యవంత సమాజానికే సాధ్యపడుతుంది. సామాజిక స్పృహతో ప్రజా బాహుళ్యంలో ఈ పటిమను,పట్టుదలను సంతరింపచేస్తూ మార్పును సాధించగలిగిన వాడే ప్రజా నాయకుడు, ప్రజా ప్రతినిధి. కష్టనష్టాలకు గురైన మానవ సమాజాలు తమంతట తాము మార్పును సాధిస్తాయనే వాదన కేవలం ఒక భ్రమ. చైతన్యం కొరవడి, సహనం కోల్పోతూ భ్రాంతికి తలవంచే ఆరాచక శక్తులే ఇలా ఆలోచిస్తూ ప్రజలను వక్రమార్గాన నడిపిస్తాయి. చివరకు తాము, తమతోపాటు తమ అనుచరులు దారి దప్పిన కొందరు మంచివారుగానో, ప్రజాద్రోహులుగానో, చరిత్ర హీనులు గానో మిగులుతారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక నవయుగం మానవాళికి మంచి మార్గాలను చూపెడుతూ మార్పును సుగమం చేయడానికి ఎంతగానో తోడ్పడుతున్నది. అనేకానేక చీకట్లను పారదోలి వెలుగు బాటలు వేస్తున్నది. ప్రజాస్వామ్య వాదులు నిర్మాణాత్మక సృజనాత్మక ఆలోచనా పరులలో కొండంత ఆత్మ విశ్వాసాన్ని నింపుతున్నది. బంగారు భవిష్యత్తును దర్శింప చేస్తున్నది.

## భూ సేకరణ చట్ట సవరణ

టాటా పరిశ్రమాధిపతులు పశ్చిమ బెంగాల్‌లో తమ చిన్నకారు “ నానో ” నిర్మాణానికై మార్క్సిస్టు పార్టీ ప్రభుత్వ కాలంలో రైతుల నుండి వందలాది ఎకరాల భూమిని సేకరించిన విషయం తెలిసిందే. తృణమూల్ కాంగ్రెస్ నేత మమతా బెనర్జి నాయకత్వంలో దీనికి వ్యతిరేకంగా మహోద్యమాల నిర్మాణం జరగడం చివరకు ఆమె పార్టీ గెలవడం అమె నాయకత్వంలో కొత్త ప్రభుత్వమేర్పడడం కూడా తెలిసిందే. తృణమూల్ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టిన తర్వాత శాసనసభలో ఒక చట్టాన్ని ఆమోదించి సింగూర్‌లో పారిశ్రామికావసరాలకై సేకరించబడిన భూములన్నిటిని తిరిగి ఆయా రైతులకు స్వాధీనం చేయాలని నిర్ణయించింది. ఈ చట్టాన్ని ఇటీవలె కలాకత్తా హైకోర్టు ఇది రాజ్యాంగ వ్యతిరేకమని కొట్టివేసింది.

ఈ నిర్ణయాన్ని సుప్రింకోర్టులో సవాల్ చేస్తామని ముఖ్యమంత్రి మమతా బెనర్జి ప్రకటించినారు. వాస్తవాలను విశ్లేషిస్తే ఈ చట్టం గవర్నర్‌గారి ఆమోద ముద్ర పడకుండానే అమలులోకి రావడం రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టు వారి తీర్పు వెనకనున్న ముఖ్యాంశం. మెజారిటి పార్టీగానున్న తృణమాల్ కాంగ్రెస్ అవసరమైన సవరణలు చేసి తిరిగి కొత్త సవరణ చట్టాన్ని ఆమోదించగల్గుతుంది. హైకోర్టు నిర్ణయం వామపక్షాలకు పెద్ద విజయం కాదు, తృణమాల్ కాంగ్రెస్‌కి పెద్ద ఓటమీ కాదు. అసలు విషయం విశ్లేషించదగింది.

పారిశ్రామికాభివృద్ధి కొరకు వివిధ రాష్ట్రాలలో భూములు అవసరం. ఆలాగే దేశ ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనకై వ్యవసాయంపైననే ఆధారపడి బ్రతికే వారి సంఖ్యను క్రమంగానైనా గణనీయంగా తగ్గించడం చాలా అవసరం. అందుకు ప్రత్యామ్నాయంగా పెద్ద, చిన్న పరిశ్రమలను నెలకొల్పడం ఏకైక మార్గం. అభివృద్ధి చెందిన దేశాల చరిత్రలను పరిశీలిస్తే పై పరిణామము అనివార్యము అత్యవసరమని తెలుస్తుంది.

పారిశ్రామికాభివృద్ధికై భూ సేకరణ అవసరం గురించి నొక్కి వక్కాణించే అవసరం లేదు. భూ సేకరణ విధి విధానాల గురించి సాకల్యంగా బాధ్యతగా చర్చించడమే అవసరం. మనదేశంలో అత్యధిక జనాభా గ్రామసీమల్లో నుంటూ రైతులు వ్యవసాయ కార్మికులుగా వ్యవసాయానుబంధ కుటీర పరిశ్రమల కార్మికులుగా జీవిస్తున్న విషయం తెలిసిందే. ఈ జనాభాను తగ్గిస్తూ వారిని పారిశ్రామిక కార్మికులుగా క్రమంగానైనా మార్చవలసిన బాధ్యత ప్రతి నాగరిక ప్రభుత్వంపై నుంటుంది.

ఈ నాటికి ఏలాంటి మౌలిక సవరణకు నోచుకోని 1894లో బ్రిటిష్ వారి ఆధ్వర్యంలో రూపొందించ బడిన చట్టమే అమలులోనున్నది. కాలదోషం పట్టిన ఈ చట్టం రైతుకు భూమి ఎంత ప్రాణప్రదమో గమనించదు. గుర్తించదు. నిర్బంధంగా నామమాత్రం నష్టపరిహారం చెల్లించి భూమి స్వాధీన పరుచుకునే అంశం మాత్రమే తెలుసు. దీనిలో మౌలిక సవరణలు చేసి రైతుల్ని రక్షించే అవసరాన్ని రెండు దశాబ్దాల క్రిందనే గుర్తించినా చట్టాన్ని తదనుగుణంగా సవరించే ధైర్యం రాజకీయ సంకల్పం అధికార పార్టీలకు రావడం లేదు. పారిశ్రామిక వేత్తలు అధికారగణంలో రైతులపట్ల వారి జీవితాల పట్ల ఇంకా మిగిలియున్న నిర్లక్షభావమే దీనికి కారణం. ఇంకా ఈ సవరణ చట్టం పార్లమెంటు సభలలో నాన్చబడుచున్నది. ఒక కొలిక్కి రావడంలేదు. ఇటీవలనే కేంద్ర ప్రభుత్వం ఈ సవరణ చట్టంగురించి తుది నిర్ణయానికి వచ్చినట్లు దాన్ని ఉభయ పార్లమెంటు సభలలో ప్రవేశపెట్టి ఆమోదం

పొందడం జరిగినట్లు వార్తలు తెలియచేస్తున్నాయి. ఇందులో భూ సేకరణ నష్టపరిహారం నిర్ధారణ, పునరావాస సమస్యలన్నిటిలో రైతుకు అనుకూలంగా ప్రతిపాదనలు చేయబడుచున్నట్లు కూడా వార్తలు తెలియచేస్తున్నాయి.

ఈ సవరణచట్టం గురించి ఆలోచించే సందర్భంలో ఈ క్రింది సిద్ధాంతపర అవగాహన కలిగి యుండడం అవసరం. కోట్లాది మానవుల భవిష్యత్తు కొరకు వారందరి జీవనాధారమైన భూ సేకరణ సమస్య గురించి అత్యంత బాధ్యతతో ఆలోచించాలి. క్రయ విక్రయాల రిజిస్ట్రారు కార్యాలయంలో పేర్కొనబడిన రేట్లపై ఆధారపడుతూ దానికి 30 శాతం జత పరిచి నష్టపరిహారాన్ని నిర్ధారణ చేయడం

నిరంకుశత్వమే అవుతుంది. అలాగే వారి పునరావాస సౌకర్యాలంటు కొన్ని చర్యలను చేపట్టడం కంటి తుడుపు సానుభూతి చర్యగా మిగులుతుంది. పార్లమెంటరీ కమిటీ వారు భూమికి నష్టపరిహారాన్ని నిర్ణయించే సందర్భంలో రిజిస్ట్రార్ కార్యాలయంలో నిర్ధారించబడిన రేటుకి నాలుగు రేట్ల నష్టపరిహారంగా చెల్లించాలని సూచించినారు. ఈ నాలుగురేట్ల ప్రకారం పరిశీలిస్తే మొత్తంగూడా చాలా తక్కువగానుంటుంది. ప్రతి ప్రాంతానికి వ్యవసాయ భూములు వాటితోపాటు పట్టణ పరిసరాల భూముల ప్రస్తుత క్రయ, విక్రయాల వాస్తవ రేట్లను పరిశీలించి నిర్ధారించే స్వతంత్ర కమిషన్‌ల నియాకం చట్టబద్ధంగా జరగాలి. రైతు శాశ్వతంగా తన స్వతంత్ర తా హక్కును కోల్పోతున్నాడు కాబట్టి కమిషన్ నిర్ధారించిన రేట్లకు కనీసం రెండు రెట్లకు తగ్గకుండా నష్టపరిహారాన్ని దానికి జతపర్చాలి. వాయిదాలు లేకుండా ఒకేసారి మొత్తం చెల్లించే ఏర్పాట్లుజరగాలి. కావలసింది ఆయా కుటుంబాలకు శాశ్వత జీవనాధారాన్ని కల్పించడమే. అసలు భూ సేకరణ, భూ ప్రాధన్యతా ధృక్పథంలోనే మార్పురావాలి.

పారిశ్రామికావసరాలకు ఉపయోగపడని వ్యవసాయయోగ్యమైన పల్లపు భూములను ఈ కార్యక్రమంలో చేర్చకూడదు. మెట్ట భూములను, రాళ్లు రప్పలతో కూడిన భూములను పారిశ్రామికా వసరాలకు కేటాయించాలి. అవి పట్టణాలకు ఇతర మౌలిక సదుపాయాలకు దగ్గరా లేక దూరమా అనుదానితో నిమిత్తం ఉండకూడదు. పారిశ్రామికవేత్తల సహాయంతో ప్రభుత్వమే అవసరమైన మౌలిక సదుపాయాలన్నిటిని సమకూర్చాలి. రెండవ ముఖ్యాంశం: రైతువద్దనుంచి అతని భూమిపై శాశ్విత హక్కును లేకుండా చేసే ఆలోచనకుబదులుగా పారిశ్రామిక వేత్తలు రైతులనుండి దీర్ఘకాలిక కౌలుపై భూ సేకరణ జరిగే విధంగా ప్రయత్నించాలి. కౌలుకాలం 99 సంవత్సరాలైనా ఎవరికి ఇబ్బంది ఉండరాదు. తన యాజమాన్యపు హక్కు తనకే మిగిలిందనే ఆత్మవిశ్వాసం రైతు సామాన్యానికి అవసరం. దానితోపాటు ఆయా పరిశ్రమలలో రైతుకు తన భూమి విలువ ఆధారంగా వాటా లేక భాగస్వామ్యం ఉండితీరాలి. పరిశ్రమ లాభనష్టాలతో తానుకూడా భాగస్వాములమనే బాధ్యత వారిలో సమకూరాలి. పై సౌకర్యాలు నిత్య జీవితావసరాలకు పెద్దగా తోడ్పడవు. మానసిక సంతృప్తికే అవి అవసరం. రైతుకు విధిగా ఆ పరిశ్రమలో పనికల్పించడం నెలసరి వేతనాన్ని అందించడం అత్యంత కీలకం. అవసరమైన విద్య, పనిలో శిక్షణ నేర్పరితనాన్ని సమకూర్చే సావకాశాలన్నిటిని కల్పించాలి. అప్పుడు మాత్రమే రైతు లేక భూ కామందు సంతోషంగా తమ భూములను వదులుకోవడానికి ముందుకొస్తాడు. మానవతా ధృక్పదం, ప్రజాస్వామ్యం ప్రభవించే ఈ కాలంలో పై చర్యలు సము చితంగానుంటూ పేదరికాన్ని శాశ్వతంగా తొలగించడానికి ఎంతాగానో తోడ్పడతాయి.

ప్రజాహితం, ప్రజాస్వామ్యం తమ సిద్దాంతాలుగా ప్రకటించుకునే రాజకీయ పార్టీలు పౌర సంఘాలు పై విధాలుగా భూ సేకరణ చట్టాన్ని సంస్కరించడానికి కృషి చేయడం, పారిశ్రామికాభి వృద్ధితోపాటు వ్యవసాయాభివృద్ధికి ఏమాత్రం లోటు రాకుండా చూడడం అటు వ్యవసాయంపై అధిక జనాభా ఆధారపడవలసిన అవస్థలనుండి గ్రామీణ పేదలను విముక్తి చేయడం ఏకకాలంలో జరుగుతుంది. భూ సేకరణ ఒక సామాజిక సమస్యగానే కాక దేశాభివృద్ధికి సూచికగా పరిణమిస్తుంది.

పై అవగాహనను అమలు పర్చే సందర్భంలో ఏదో ఒక ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకునే అవకాశం రైతులకుండాలి. బలవంతం, నిర్బంధానికి ఎలాంటి ఆస్కారముండరాదు. ఐచ్ఛికంగా, సంతృప్తితో తమ వ్యవసాయ భూమిని దేశ పారిశ్రామికాభివృద్ధికి ఇస్తున్న భావన రైతు సామాన్యంలో కలగాలి. 2013 ఆగస్టు మాసంలో జరిగిన వర్షాకాల పార్లమెంటు ఉభయ సభలు భూసేకరణ కొత్త చట్టాన్ని సెలెక్టు కమిటీ వారి సూచనల మేరకే ఆమోదించినట్లు తెలుస్తున్నది. అది చాలా వరకు సమస్యల పరిష్కారానికి ఉపయోగపడవచ్చుననే ఆశాభావం వెలువడడం శుభ పరిణామము. అనుభవంలో దాని ఉచితాను చితాలను సంస్కరిస్తూ ప్రయోజనాత్మకం చేయడం అవసరం.

నిరంతర మానవాభివృద్ధి లక్ష్యంగా సృజనాత్మక ధృక్పథంతో పరిశ్రమల స్థాపన అవసరం. విశ్వవ్యాపిత పేదరికం, నిరుద్యోగ నేపథ్యంలో అనతికాలంలోనే లక్షల కోట్లకి పడగలెత్తిన దళారి పెట్టుబడి దారి వర్గ స్వార్థపూరిత వ్యాపార దృష్టి ఒక సిద్దాంతంగా, నవ యువత యొక్క బంగారు భవితను భంగపరుస్తున్న తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సృజనాత్మకతలో ఉపాధి హామినిచ్చే పరిశ్రమల స్థాపన, వాటి పోషణకు పెద్ద పీట వేయడం తక్షణావసరం.

మానవతావాదులు, మానవాభివృద్ధి మార్గదర్శకులు దశాబ్దా ల క్రితమే సూక్ష్మంలో మోక్షాన్ని దర్శించినారు. మానవ సమాజం యొక్క ప్రతి సముదాయం ఒక ప్రత్యేక సంస్కృతి సాంప్రదాయంచే పునీతమైయున్నది. అటువంటి సంస్కృతులను గౌరవిస్తూ వాటిని పోషించడం పురోగమించడం మానవధర్మం. భిన్నత్వం కలిగిన ఈ సంస్కృతులు పరిణామక్రమంలో పరస్పరం ప్రబావితమవుతూ ప్రపంచ మానవాళియొక్క ఉమ్మడి సంస్కృతిగా పరిఢవిల్లక తప్పదు. మతాలు, కులాలు, ప్రాంతాలు ప్రభోదించే విభిన్న ఉపదేశాలు, సందేశాలన్ని పై దిశలోనే పయనిస్తున్నాయి. పరస్పర సంపర్కం,

సహజీవనం, సమ్మిళితం ప్రకృతి ధర్మాలు. దీన్ని గుర్తించి పరిణామ క్రమాన్ని వేగిరపరచడం మానవాళి ఉన్నత మనుగడకు అత్యవసరం. సంస్కృతులలోని ఈనాటి భిన్నత్వాన్ని మాత్రమే గమనిస్తూ ఉత్పన్నమౌతున్న ఏకత్వాన్ని చూడ నిరాకరించడం మూర్ఖత్వమనిపించుకుంటుంది.

తిరిగి సృజనాత్మక, పారిశ్రామికాభివృద్ధి సమస్య గురించి చర్చించడం అవసరం. కష్టజీవులైన రైతులు, లఘు పరిశ్రమలలో చెమటోడ్చే పారిశ్రామికుల పేదరికం, అది సృష్టించిన రుణభారం దాని తరుణోపాయాలను పరిశీలిద్దాం. రైతాంగం యొక్క పేదరికం, గ్రామీణ పేదలనుభవిస్తున్న మోయరాని రుణభారం కారణంగా అందుబాటులోకి వచ్చిన లెక్కల ప్రకారం మన దేశంలో 1997–2006 మధ్య ఒక దశాబ్ద కాలంలోనే 1,66,304 మంది రైతులు, కార్మికులు ఆత్మహత్యలకు తెగించినారు. ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే 2006–2011 మధ్య కాలంలో 2000 మంది చేనేత పారిశ్రామికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వీటిపై దేశం అంతటా నిరసన జ్వాలలు వ్యాపించినవి. ఈ పరిణామము ఒక ప్రధానమైన సత్యాన్ని ఆవిష్కరిస్తున్నది. అత్యధికులుగానున్న శ్రామికులు, ముఖ్యంగా గ్రామీణ పేదలు, అత్యల్పంగానున్న ధనాఢ్య వర్గాల మధ్య అంతరం రోజు రోజుకు పెరిగిపోతున్నది. "అభివృద్ధి" స్రవంతి నుండి పేదలు వెలివేయబడుచున్నారు. సమ్మిళితాభివృద్ధి ధ్యాసనే లేని ఉపాధి రహిత అభివృద్ధిపైననే కేంద్రీకరించడం జరుగుతున్నది. 2020 నాటికి భారతదేశం వెలిగి, మెరిసి ప్రపంచ శక్తిగా పరివర్తన చెందుతుందని 12వ పంచవర్ష ప్రణాళికా రచయితులు నమ్మబలుకుచున్నారు.

బహుముఖ మానవాభివృద్ధిని విస్మరిస్తూ కేవలం సంపదను మాత్రమే సృష్టించే ఆలోచనగల పెట్టుబడిదారి అర్ధశాస్త్ర వేత్తలు మరియు అధికార దాహంతో విలువలకు తిలోదకాలిస్తూ అధికార సాధనకై పడరాన్ని పాట్లు పడుచున్న రాజకీయ వేత్తలు భారతదేశ ప్రత్యేకతలను బాధ్యతతో పరిశీలించడంలో ఘోరంగా విఫలం చెందుతున్నారు. 120 కోట్ల జనాభా గల మన మాతృ దేశానికి అయిదు వేల సంవత్సరాల అతి ప్రాచీన, సుసంపన్న సాంస్కృతిక సాంప్రదాయాలున్నవి. భిన్నత్వంలో ఏకత్వానికి, ప్రపంచంలో మనదేశం ప్రత్యేక గుర్తింపు పొందియున్నది. విభిన్న సంస్కృతి సాంప్రదాయాల మేలి కలయిక గల ఈ దేశంలో పాశ్చాత్య నమూనాపై ఆధారపడే విధంగా “ అభివృద్ధి” పథకాలను రూపొందిస్తున్నారు. దశాబ్దాల ఈ నిరంతర కృషి వాస్తవ మానవాభివృద్ధి రూపంలో రాణించడం లేదు. పేదరికం పెచ్చుపెరిగిపోతున్నది. కూలిరేట్లు జీత భత్యాలు పెరిగినా, పెరిగిన ద్రవ్యోల్బణం (ధరల పెరుగుదల) వాటిని హరించి వేస్తున్నది. పేదలసంఖ్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లు, ప్రపంచదేశాలలో తన ప్రధమ స్థానాన్ని వదలడం లేదు. ధన ప్రభావం, ధన దాహం ప్రణాళికా సంఘ సూక్తులను పటాపంచలు చేస్తున్నవి. అందుకే భారతీయ తాత్వికతతో కూడి భారతీయ ప్రత్యేకతలన్నిటిని సంతరించుకునే విశిష్టమైన, సొంతమైన ప్రత్యామ్నాయ ఆర్థిక విధాన రూపకల్పన, దాని ఆచరణ అవసరం. ఆలస్యం అనర్థదాయకం.

భారతీయ సంస్కృతి, కళలు, పై ప్రత్యామ్నాయమైన అభివృద్ధి మార్గాన్ని ఎన్నుకుని దాని రూపకల్పన చేసే శక్తి సామర్థ్యాలు కలిగియున్నవి. ఈ దేశ హస్తకళలే దేశ జనాభాలో 25శాతం మందికి ఉపాధి కల్పించగల్గుతాయి. ఈశాన్య భారతంలోని మణిపూర్ రాష్ట్రంలో అక్కడి భౌగోళిక సైసర్గిక పరిస్థితుల కారణంగా అత్యధిక ధనాన్ని వెచ్చిస్తూ ఆధునికమైన భారీ పరిశ్రమల నిర్మాణం గురించి చర్యలు చేపట్టడం జరుగుచున్నది. ఆ అడవి ప్రాంతం వెదురు ఉత్పత్తికి వెదురు ఆధారంగా అనేక రకాల వస్తువుల తయారికి పెట్టింది పేరు. వీటిని నాణ్యతలతో తయారు చేసేవారు అనన్య సామాన్యులుగా అనేక మంది కీర్తి ప్రతిష్టలను సాధించియున్నారు. భారీ పరిశ్రమల స్థాపన కంటే పై కుటీర పరిశ్రమల పునరుజ్జీవనం, వాటి వ్యాపకం, వాటి పరిశోధనలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం వలన నిరుద్యోగం, పేదరిక నివారణ సమస్యలు త్వరగా పరిష్కరించబడతాయి. ఈ కుటీర పరిశ్రమాభివృద్ధికి ఆధునిక శాస్త్ర సాంకేతిక సదుపాయాలతోడ్పాటును సాధించి ఆచరిస్తే బంగారానికి వెలగారం సమకూర్చినట్లవుతుంది. సూక్ష్మంలో మోక్షాన్ని దర్శించడమంటే ఇదే. ఈ వస్తువులకు ప్రపంచ వ్యాపితంగా మంచి గిరాకి వున్నది. హస్తకళలు, కళలు అద్భుతమైన ఆకర్షణా శక్తి గల సాధనాలు. భౌగోళిక సరిహద్దులు, భాషా పర విభజనలను సునాయాసంగా అధిగమిస్తూ తోటి మానవ హృదయాలను హత్తుకో గలిగే పరికరాలు ఇవి. దేశాల మధ్య రాజకీయ ఆర్థిక, వాణిజ్య వ్యాపార అడ్డుగోడలను అధిగమిస్తూ, వాటి మధ్య శాంతి సౌహార్ధాలలాంటి మానవీయ విలువలను ప్రేమ బంధాలుగా నెలకొల్పె మహిమాత్మక భావాలను సృష్టించే సాధనాలివి. ఈ లాంటి భావ జాలానికి జన్మనివ్వడమే సృజన. సృజనాత్మక పరిశ్రమలు వాటి పురోభివృద్ధి మార్గాలను కనిపెట్టడానికి ప్రణాళికాసంఘం 2004లో ఒక ఉన్నత కమిషన్‌ను నియమించింది. అది కేవలం లాంఛన ప్రాయమైపోయింది. దాని నివేదికను విశ్లేషించి తదుపరి చర్యల గురించి ఆలోచించడానికి ప్రభుత్వం వద్ద సమయం లేదు. వ్యవస్థాగతమైన భారి పరిశ్రమలు వాటి వాణిజ్య వ్యాపారాలు, కార్పోరేషన్లు వాటి వ్యాపకాలపైనే ప్రభుత్వం తమ

ఆలోచనల్ని కేంద్రీకరించడం జరుగుతున్నది. కుంభకోణాలను సృష్టిస్తూ అవినీతిని వ్యవస్థాగతం చేస్తూ ప్రజా జీవితాన్ని కలుషితం చేయడం స్వార్థ రాజకీయవాదుల దినచర్యగా పరిణమిస్తున్నది. ఈ విష వలయం నుండి సుపరిపాలన దిశలోకి దేశాన్ని మళ్లించలేని అశక్తతతో దేశభక్తులు నిస్పృహతో అల్లాడిపోతున్నారు. ప్రజలు స్థానిక, పాక్షిక ఆత్మరక్షణ ఉద్యమాలకే పరిమితమై సమర్థవంత నాయకత్వ లోటు కారణంగా నిశ్చేష్టులౌతున్నారు. దేశ సంపద సాధనలో కీలకమైన పాత్రను పోషించవలసిన పారిశ్రామిక రంగం ముఖ్యంగా సృజనాత్మక ఉపాధి ప్రధానమైన వస్తూత్పత్తి రంగం తీవ్రంగా వెనక బడిపోవడం జరుగుతున్నది. ఈనాడు అయిదు కోట్ల మంది హస్త కళలపై నైపుణ్యత గల యువతీ యువకులు నిరుద్యోగులుగా ఉండటం మన దేశానికి తలవంపు. అందులో కేవలం 2.5 కోట్ల నిపుణులు పాక్షికంగా పని చేయడం ఫలితంగా ప్రపంచంలో కేవలం రెండు శాతం హస్తకళల వ్యాపారాన్ని నిర్వహించగలుతున్నాం. దీన్ని ప్రధాన రంగంగా గుర్తించి తగు ఆర్థిక వాణిజ్య ప్రోత్సాహన్ని అందించగల్గితే ఇది దేశ పురోభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుంది. హస్తకళల అభివృద్ధి, వస్తూత్పత్తి అభివృద్ధి దేశ దారిద్రాన్ని అనతి కాలంలో తీవ్రంగా తగ్గించే సదవకాశం మనముందే ఉన్నది.

## " వస్తూత్పత్తి లక్ష్యంగా పెట్టుబడులను కేంద్రీకరించాలి."

ప్రభుత్వం తమ పెట్టుబడులను లక్ష్య శుద్ధిలేని తాత్కాలిక ప్రయోజనాలపై కేంద్రీకరించడమే ఈనాడు దేశమెదుర్కొంటున్న పారిశ్రామిక మంద గమనానికి మూల కారణం. అభివృద్ధి గమనం గత తొమ్మిది సంవత్సరాల సగటుకు తగ్గి ఆరున్నర శాతానికి పడిపోయింది. అందులో పారిశ్రామికాభివృద్ధి రేటు గత సంవత్సర (2011-12) చివరి మూడు మాసాలలో 0.1 శాతానికి దిగజారడం ఆశ్చర్యకరం. వనరుల వినియోగంలో ప్రాధాన్యతలను ఎన్నుకుని వాటిని సాధించక పోవడం, అసలు దుర్వినియోగం చేయడం ఈ తిరోగ మనానికి ప్రథమ కారణం. సగటు జాతీయాదాయంలో 35శాతం నిధులను మాత్రమే వివిధ రంగాలలో పునరుత్పత్తిపై వెచ్చిస్తున్నాం. ఇది దేశీయ అభివృద్ధి రేటును తగ్గించడం సహజం. ఇది తీవ్రంగా పరిశీలించదగినది. విదేశీ ఆర్థిక మాంద్యం కంటే స్వదేశీ ఆర్థిక సంస్కరణల కొరత దీనికి ప్రధాన కారణమనే వాదనలో బలముంది. దేశంలో వివిధ స్థాయిలలోనున్న మధ్య తరగతికి చెందిన వారే 60-70 కోట్లకు మించి వున్నారు. వీరికంటే మించిన మార్కెటు ప్రపంచంలో ఎక్కడాలేదు.

అభివృద్ధి అనుభవాల సారాంశంగా గత దశాబ్దంలో ప్రపంచ వ్యాపితంగా విజ్ఞులు తేల్చిచెప్పిన ఒక సత్యం శిరోధార్యం. సూక్ష్మస్థాయిలో ఉత్పత్తుల సృష్టి క్రమంపైననే వనరులను ఇతోధికం చేయడం, తత్ఫలితంగా స్థూలంగా పారిశ్రామికాభివృద్ధి, ఉత్పత్తులు వాటి నాణ్యతల పెరుగుదల సాధ్యపడుతుంది. అలా కాకుండా పరిమితంగా లభ్యమయ్యే ప్రియమైన వనరులను నిర్లక్షంగా వెచ్చిస్తే అది క్షేత్ర స్థాయిలోనున్న సూక్ష్మ ప్రక్రియలకు తోడ్పడదు. మధ్యనే హరించుకుపోయే అనర్థాలు అనేకం. నాణ్యతలు కొరవడి అనతి కాలంలోనే అనువుదప్పే వస్తువులను విధిలేక కొంటూ నష్టపోయే వినిమయ దారులు నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. ఇంతేకాదు ప్రభుత్వ వనరులు అత్యధికంగా అవసరంలేని వారికి ఉద్దీపనలుగా, సబ్సిడీలుగా చేరుతున్నాయి. ఈ లబ్ది అవసరమైన అనేకులు దీన్ని పొందలేక అసలు వ్యవస్థలపైననే నిరాశ, నిస్పృహలను వెలుబుచ్చుచున్నారు. వనరుల వెచ్చింపులో ప్రాధాన్యతల

నిర్ణయంతో పాటు లబ్దిదారులను వాస్తవంగా నిర్ధారించడం రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం. పెట్రోలు ఉత్పత్తులు, విద్యుచ్ఛక్తి సరఫరాలో కొనసాగుతున్న దుబారా ఖర్చులు చౌర్యం, ప్రియమైన వనరుల లోటుకు మరో ముఖ్యకారణం. దీన్ని అరికట్టడానికి అవసరమైన సంస్కరణల అవశ్యకత ఎంతైనా ఏర్పడ్డది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సబ్సిడీలపై వెచ్చిస్తున్న మొత్తం, నాలుగైదు సంవత్సరాల క్రితమే 5 లక్షల కోట్ల రూపాయలకు మించి యుండింది. అందులో అరవై శాతంగానున్న అర్హులకు కేవలం (2) రెండు లక్షల కోట్లు ఇవ్వబడగా, మధ్య తరగతి, ఆపై తరగతులకు చెందిన (40)శాతంగానున్న వారికి (3) మూడు లక్షల కోట్లు ఇవ్వడం జరిగింది. పారిశ్రామికాభివృద్ధికి ప్రోత్సాహకాలుగా కొంత ఉద్దీపననందించడం సబబేకాని దాని పేరట లాభాలు పొందే పెట్టు బడి దారులు కూడా ఈ సహయాన్ని ఆర్థించడం, పొందడం అన్యాయం. ఈ దిశలో అనేక స్థూల, సూక్ష్మస్థాయి సంస్కరణలు అత్యవసరం. దేశీయ ఉత్పత్తిని పెంచుతూ ఉత్పాదకతను గణనీయంగా పెంచడానికి ఇదే ఏకైక మార్గం.

దేశ సగటు ఉత్పత్తిరేటు మందకొడిగా మారుతుండటం, అందులో పారిశ్రామికోత్పత్తి భాగం ప్రత్యేకంగా తగ్గిపోవడం ఆందోళనకరమే అయినా, త్వరపడి అనాలోచిత నిర్ణయాలకు రావడం ఏమాత్రం తగదు. బడ్జెటులో ద్రవ్య లోటును నియంత్రించడంతో పాటు నిధుల సరఫరా కొరకు రిజర్వుబ్యాంకు గూడా విశాలదృష్టిని ప్రదర్శించవలసిన అవసరమున్నది. రుణాలపైన వడ్డీరేటును చాలా కాలం తర్వాత కొద్దిగా తగ్గించడం సబబే కాని ఇంకా తగ్గించవలసిన అవసరమున్నది. ద్రవ్య చలామణి లేనిదే పరిశ్రమలు సక్రమంగా పని చేయలేవు. ఏది ఏమైనా ఆర్థిక క్రమశిక్షణ పాటింపు దేశ ఆర్థిక ఆరోగ్యానికి అనివార్యం. పౌరులతో పాటు ప్రభుత్వాలుగూడా పొదుపరితనంతో వృధా ఖర్చులను అరికడుతూ దేశీయ మార్కెటులో అవసరమున్న మేరకు సరకులన్నటిని సరఫరా చేయగలిగే స్వదేశీ స్వావలంబన స్పృహతో విధులను నిర్వహించడం అవసరం అవసరమున్న సరుకులను అవసరాల మేరకే దిగుమతి చేసుకోక తప్పదు. అందుకవసరమైన విదేశీమారకాన్ని వెచ్చించక తప్పదు. తిరిగి విదేశీ మారకాన్ని పెంచుకోవడానికై మన సరుకులను ఎగుమతి చేయడం వ్యాపార నిపుణులైన పాలకుల కర్తవ్యం. ఎగుమతుల ద్వారా సంపాదించే మొత్తం దిగుమతులకై వెచ్చించె మొత్తాని కంటె అధికంగావుండాలి. తరచుగా ఈ సూత్రం విస్మరించడబడుచున్నది. సమతుల్యాన్ని కోల్పోతున్నది. సకాలంలో సరిచేయనిఎడల ఏదేశమైనా ఆర్థికంగా దివాళాతీసే ప్రమాద మేర్పడుతుంది. రుణగ్రస్తమై పోతుంది. ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కోల్పోతుంది. చివరకు రాజకీయంగా పరాధీన పరిస్థితి ఏర్పడుతుంది. 1991లో అదే జరిగింది. ఈనాడు తిరిగి అదే దుస్థితి దాపురించే ప్రమాదం పొంచియున్నది.

మన దేశ ఆర్థిక స్వతంత్రతకు అప్పుడే ప్రమాదమేర్పడిందని గాని, ఏర్పడబోతుందని గాని భయపడవలసిన అవసరం లేదు. ఐనా ఆర్థిక ప్రమాణాలు, అంతర్జాతీయంగా ఆమోదం పొందిన సూచికలను హెచ్చరికలుగా స్వీకరించకతప్పదు. ఉత్పత్తి పెరుగుదలలో నిలకడ, ఉపాధి ప్రధానమైన పారిశ్రామిక విధాన నిర్వహణ, ద్రవ్య లోటు అంతర్జాతీయంగా ఆమోదయోగ్యమైన నాల్గుశాతానికి మించకుండా జాగ్రతపడడం, దేశంలో ద్రవ్యోల్బణం శాతం కూడా 4-5 శాతానికి మించిపోకుండా నిఘా పెట్టడం ఎగుమతి, దిగుమతుల మధ్య అంతరాన్ని తీవ్రంగా తగ్గిస్తూ లాభసాటి వ్యాపారం

చేయడం, అత్యవసరం. పైసూత్రాలను తూచ తప్పకుండా ఆచరించగలిగే విధంగా ఆర్థిక మంత్రిత్వశాఖ కాపలాకాయడం అవసరం. ద్రవ్య చలామణిని నియంత్రించవలసిన రిజర్వు బ్యాంకు పరిస్థితులను వేల కండ్లతో కనిపెడుతూ, రాజకీయ ఒత్తిళ్ళకు గురికాకుండా కఠినమైన నిర్ణయాలు చేయడం దేశ ఆర్థిక ఆరోగ్యానికి మూలం.

నిరంతరాయమైన నిలకడతో కూడిన దేశీయ ఉత్పత్తి రేటు పెరుగుదల దేశాభ్యుదయానికి ఇరుసు లాంటింది. 1991కి పూర్వం దేశ సంపదలో బహు కష్టంగా 19–20 శాతం మిగులు పునరుత్పత్తిపై వెచ్చించడం జరిగేది. ఈ నాటికి ఇది పెరిగి 30–35శాతానికి చేరుతున్నది. సంపద పెరుగుదల, అసమానతల తొలగింపు పేదరిక నిర్మూలన సాధ్యపడాలంటే వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగంతో కూడిన మూడు మూలస్థంభాలు సుధృడంగా ఉండి తీరాలి. ఉత్పత్తి, ఉత్పాదకత ఆధునిక ప్రమాణాలననుసరిస్తూ రాష్ట్ర దేశ సంపదను ఇతోధికం చేయాలి. పారిశ్రామిక రంగం సహజంగానే అగ్రభాగాన్ని ఆలంకరించాలి. ఈనాడు సేవారంగమే దేశ సంపదను సమకూర్చడంలో 50 శాతానికి మించిన భాగాన్ని సమకూర్చుచున్నది. పారిశ్రామిక రంగమే అగ్రభాగాన్ని అలంకరించడం సుస్థిరాభివృద్ధికి అవసరం. వ్యవసాయరంగం, ఉపాధి కల్పనలో అగ్రభాగాన్ని అలంకరించినా సంపద సృష్టిలో చివరి స్థానంలో నుండడం శాస్త్ర సాంకేతికయుగంలో తప్పదు. ఈ ప్రత్యేకతల్ని గుర్తిస్తూనే ప్రాణికోటికి జీవనాధారమైన వ్యవసాయ విధానాలు రూపొందించబడాలి. ఈ మూడు రంగాలల్లో పరిమాణాత్మక, గుణాత్మక పరివర్తనలు సాధిస్తూ వాటిలో సమతుల్యాన్ని పోషిస్తూ సగటు సంపదను నిరంతరం అభివృద్ధి చేయడం ప్రభుత్వాల విధి. ఆర్థిక మాంద్యం ద్రవ్యోల్బణం దేశానికి శత్రుద్వయం. ఈ రెండు దోషాలు అనగా దేశ ఉత్పత్తి రేటు పడిపోవడం, అధిక ధరలు కలిసి ఏకోన్ముఖంగా దాడి చేసి ప్రజా జీవితాన్ని దుర్భరం చేసే ప్రమాదమేర్పడే ఆస్కారముందని కొందరు ఆర్థిక శాస్త్రవేత్తలు హెచ్చరించగా మరి కొందరు ఆ భయం అక్కర లేదంటున్నారు. ఏదిఏమైనా దేశనాయకత్వం అత్యంత మెలకువతో ఈ సంక్షుభిత వాతావరణంలో మన అభ్యుదయ రథాన్ని ముందుకు నడిపి తమ బాధ్యతను నిర్వహించవలసియున్నది. ముందు జాగ్రత చర్యలుగా అందుకవసరమైన ఆర్థిక రాజకీయ సంస్కరణలపై తమ దృష్టి సారించవలసియున్నది. దేశీయ ఉత్పత్తి తిరోగమనంలో నుండడం యాధృచ్చికంకాదు. గత 5 సంవత్సరాల నుండి ఇది కొనసాగుచున్నది. 5 సంవత్సరాల క్రితం దేశీయ వార్షికోత్పత్తి 9.2శాతం ఉండగా తర్వాత సంవత్సరాలలో ప్రతి మూడు మాసాల అంకెలను పరిశీలించగా 8శాతం, 6.7శాతం, 6.1శాతం మరియు 5.9 గా క్రమంగా పడిపోవడాన్ని గమనించవలసి ఉంది. ఇది తిరోగమనాన్ని సూచిస్తున్నది. దీనికితోడు పారిశ్రామికాభివృద్ధి రేటును గమనిస్తే అది ఈనాటికి 0.1 శాతానికి పడిపోయింది. ఇది ఏమాత్రం సంతృప్తికరంగా లేదు. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల టోకు ధరలతో సహ చిల్లర ధరలు అపూర్వంగా పెరిగి రెండంకెలను దాటడం, ద్రవ్యోల్బణం ధరల పెరుగుదల లక్ష్మణరేఖ అయిదు శాతాన్ని దాటే ప్రమాదపుటంచులోకి చేరే పరిస్థితి ఏర్పడిందని కేంద్ర బ్యాంకులు ఆందోళన చెందుతున్నాయి. ఈవిధంగా ఉత్పత్తి శాతం పడిపోవడం, ధరలు పెరగడం దేశాభివృద్ధికి ప్రమాద సంకేతాలు. ఈ శత్రుద్వయానికి మూలాలు లేకుండా చేయాలంటే ప్రభుత్వ రంగం, ప్రైవేట రంగాలలో పెట్టుబడులను అధికంగా ఉపయుక్తంగా వెచ్చించాలి. మౌలిక సదుపాయాల నిర్మాణంపై ప్రధానంగా సూక్ష్మస్థాయిలో అనగా

గ్రామస్థాయిలో వెచ్చించాలి. అభివృద్ధి, నిరుద్యోగ నివారణ ఏకకాలంలో జరుగుతుంది. మానవాభివృద్ధికి పేదరికాన్ని తగ్గించడానికి తోడ్పడుతుంది. పునరుత్పత్తి, శాశ్వత కట్టడాలపై ఈ పెట్టుబడులను వెచ్చించే విధానాలను రూపొందిస్తూ అమలుపర్చే చర్యలకు ఉపక్రమించాలి. ప్రతి సంవత్సరం పునరుత్పత్తి చేయకుండా వృధా అవుతున్న కనీసం రెండు లక్షల కోట్ల ప్రజాధనాన్ని సద్వినియోగం చేయాలి. రాజకీయ విభేదాలకు ఎలాంటి ఆస్కారమేలేకుండా దేశభక్తిగల వారందరి విద్యుక్తధర్మంగా విస్మరించవీలులేని కర్తవ్యంగా దీన్ని భావించాలి.

ఈ స్థితికి నిరుద్యోగం తోడయితే తిరిగి కోలుకోలేని దుస్థితిని అనుభవించకతప్పదు. ఉద్యోగరంగం ఆశాజనకంగా ఉన్నదని ఇటీవల కొన్ని సర్వేలు తెలియచేస్తున్నాయి. కాని వాస్తవాలు దాన్ని ధృవ పరచడంలేదు. కొన్ని పరిశ్రమలలో కొందరికి ఉపాధి అవకాశాలు కలిగిన విషయం వాస్తవమే కాని ఇంకా దేశ వ్యాపితంగా, ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానంలేని యువత ఉపాధి అవకాశాలకై పోరాడుతునే ఉన్నది. గ్రామీణ మౌలిక సదుపాయాల నిర్మాణంపై పబ్లిక్, ప్రైవేటు పెట్టుబడులను ఇతోధికం చేయడమొక్కటే దీనికి పరిష్కారమార్గం.

## మానవాభివృద్ధి

అభివృద్ధి అనగానే పరిశ్రమలు ప్రాజెక్టుల నిర్మాణంగా భావించే వారు ఇంకా చాలా మంది ఉన్నారు. అది నిస్సందేహంగా స్థూలంగా అభివృద్ధి అవుతుంది. కాని అభివృద్ధి ఫలితంగా దేశ జనాభా జీవన ప్రమాణం క్రమంగా పెరుగుతూ ప్రతి మానవుడు నాగరికతా ప్రపంచ సగటు స్థాయికి చేరుకోవాలి. దేశాభివృద్ధి, దేశ ప్రజల జీవితంలో ప్రతిబింబించాలి. శ్రమజీవులలో అత్యధిక భాగం గ్రామ సీమల్లో నివసిస్తూ ఉండగా భారీ పరిశ్రమలు, భారీప్రాజెక్టుల నిర్మాణానికి ప్రధమ ప్రాధాన్యతనివ్వడం గుర్రంముందు బండిని పెట్టినట్లుగా అర్ధరహితంగానుంటుంది. వ్యవసాయం అనేక పరిశ్రమలకు ముడి సరుకులనందించే మౌలిక ఉపకరణం, జనసామాన్యానికి కడుపునిండా పౌష్టికాహారాన్ని సమకార్చె ప్రాణదాత. అందులోనే అత్యధికులు తమ ఉద్యోగం, ఉపాధిని పొందుతారు కాబట్టి గ్రామీణాభివృద్ధి అత్యంత ప్రాధాన్యతగల అంశంగా గ్రామీణ జీవితంలో నాణ్యతగల విద్యా, వైద్య సౌకర్యాలు, రోడ్డు రవాణా సౌకర్యాల నిర్మాణం, వర్షపు నీటిని నిలువరించే వాటర్ షెడ్, చిన్న నీటి వనరుల నిర్మాణం, భారీ ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణాలకంటే అనేక రెట్లు ప్రాధాన్యతలను పొందవలసిన జీవనాడులు. ఐనా సాత్విక ఆలోచనలు లేని “ధనం మూలం ఇదం జగత్ ” సిద్ధాంతాన్ని నమ్మే ప్రభుత్వాలు తమ విధానాలను తల క్రిందులుగా రూపొందించడం ఖండనార్హం. ఈ సిద్దాంతాన్ని ప్రధమంగా హేతుబద్దంగా ఆ విష్కరించి ఐక్య రాజ్యసమితి గూడా ఆమోదించే వరకు పోరాడిన మానవీయ అర్ధశాస్త్ర వేత్తలు, నోబెల్ బహుమాన గ్రహీత శ్రీ అమర్త్యసేన్ మరియు పాకిస్తాన్‌కు చెందిన కీ॥శే॥ మక్బూల్ ఉల్ హక్ అభినందనీయులు. విద్య, వైద్య సౌకర్యాలకు లోటులేని పౌష్టికాహారానికి కొరతలేని, మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్దులందరికి సంపూర్ణ పరిరక్షణ కలిగి యుండే సమాజ అవసరాన్ని వారు నొక్కి వక్కాణించి శ్రమజీవులందరికి ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత భారం సమాజానిదేనని, ప్రభుత్వాలదేనని ఘంటా పథంగా చెప్పినారు. పాలక పార్టీలు ఎన్ని ఎన్నికల వాగ్దానాలు చేసినా ఆచరణలో అవి ధనవంతులు, బలవంతుల ఉచ్చులోబడి

అసంఖ్యాకంగానున్న పేద ప్రజల పట్ల తమ గురుతర బాధ్యతను విస్మరిస్తున్నాయి. ప్రజాస్వామ్యం కేవలం అధికార సాధన యంత్రాంగంగా మారింది. కష్టజీవుల చీకటి బ్రతుకుల్లో వెలుగు రేఖలను ప్రసరించలేకుండా విఫలమైపోతున్నది.

## ప్రపంచ మార్కెటు వ్యవస్థలో ప్రజాస్వామ్యం

శాస్త్ర సాంకేతిక విప్లవం, సమాచార విప్లవం ఆవరించిన ఈనాటి ప్రపంచంలో ప్రజాస్వామ్యం మానవాభివృద్ధికి ప్రబల సాధనంగా ఉపయోగపడాలంటే ఆయా దేశ ప్రభుత్వాలు, అత్యధిక లాభాల వేటలోనున్న బహుళజాతి పెట్టుబడిదారి సంస్థలు దేశీయ నియంత్రిత మార్కెట్లను చెదరగొట్టకుండా శాసనబద్ధంగా చర్యలు చేపట్టక తప్పదు. విశృంఖలంగా విస్తరిస్తున్న ప్రపంచ మార్కెటు దుష్ప్రభావాలకు అడ్డుకట్టలు వేయక తప్పదు. మన దేశీయ మార్కెటు ప్రపంచ మార్కెటుకు అనుబంధంకారాదు. దేశ ఆర్థిక సార్వభౌమాధికారాన్ని భంగపరిచే రీతిలో వాణిజ్య వ్యాపారులు రాజకీయ నిర్ణయాలు గాని చేయరాదు. " స్వదేశీ " " స్వావలంబన" సిద్ధాంతాల ప్రకారం మన దేశ స్వతంత్ర పారిశ్రామికాభివృద్ధి ఆర్థికాభివృద్ధి, దేశ ప్రజల బహు ముఖాభివృద్ధికి పరిపూర్ణంగా లక్షించబడాలి. ప్రపంచీకరణ పేరుతో ప్రపంచ మార్కెటు ఆదేశాలకు తల ఒగ్గి బహుళజాతి సంస్థల విషవలయంలో చిక్కరాదు. మానవాభివృద్ధి ప్రాతిపదికన దేశాభివృద్ధి లక్ష్యంగా ప్రపంచ మార్కెటు, ప్రపంచ ద్రవ్యనిధి, విదేశీ పెట్టుబడులనుగూడా ఆహ్వానించడం, ఆర్థిక స్వాతంత్ర్యానికి ప్రజాస్వామ్య పరిరక్షణకి దేశ సత్వర సమగ్ర అభివృద్ధికి కీలకం. ఈ ధృక్పదంతో విశ్లేషిస్తే అత్యధిక లాభార్జన చేసే ప్రపంచ కుబేరులకు అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక స్వావలంబన సిద్ధాంతం ఆర్థిక ప్రజాస్వామ్యం గిట్టుబాటుగాఉండదు. ఇందుకే ఈ దేశ ప్రభుత్వాలను ఇక్కడి కార్పోరేటు సంస్థలను తమ కనుకూలంగా మార్చుకోవడానికి పడరానిపాట్లు పడుతున్నారు. తమ ధన బలాన్ని కండ్లకు కట్టినట్లుగా చూపెడుతున్నారు. అవినీతి లంచగొండి తనానికి ప్రజాస్వామ్య ముసుగు వేస్తున్నారు. నేరస్థులు ప్రజాప్రతినిధులుగా, మంత్రులుగా, అధికారులుగా ఎగిసిపడుతున్నారు. చివరకు న్యాయాధిపతులు కూడా నిందితులుగా తెరపైకి వస్తూ ప్రజాస్వామ్యాన్నే నవ్వులపాలు చేస్తున్నారు. ఆర్థిక స్వావలంబన దిశలో,ఆర్థిక సార్వభౌమత్వ స్పృహతో, దేశ స్వతంత్ర మార్కెటు వ్యవస్థ పరిరక్షణ కర్తవ్యంగా రాజకీయ సిద్ధాంతాలు పరివర్తన చెందాలి. దళారి పెట్టుబడిదారి విధానం మరియు ప్రజాస్వామ్యం మధ్య పెరిగిపోతున్న ఈ వైరుధ్యం భారతదేశానికే పరిమితం కాదు. అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో కూడా ప్రతిబింబిస్తున్నది. అక్కడి ఆర్థిక దివాళాకోరుతనం, ఆర్థిక మాంద్యానికి కారణం ప్రజాబాహుళ్యం యొక్క విలాసవంత జీవితాలేనని వారు పొదుపరితనాన్ని పాటించాలని మితవాద రాజకీయ నాయకులంటుంటే అదికానే కాదని ధనాఢ్య వర్గాల ధన దాహం, వారి విలాసవంత జీవిత విధానాలేనని సామాన్య ప్రజలంటున్నారు. ఇక్కడ కూడా దళారి గుత్త పెట్టుబడిదారి వర్గం మరియు సాధారణ పెట్టుబడిదారి వాణిజ్య, వ్యాపార వర్గాల మధ్య విభేదాలు పెచ్చు పెరుగుచున్నాయి. రాజకీయంగా ఎన్నికల ఫలితాల రూపంలో ఇవి బయటపడుతున్నాయి. పెట్టుబడి, పెట్టుబడిదారుల అవసరం సమాజాభివృద్ధికి అత్యవసరమని ఆహ్వానించదగినదని అన్ని దేశాల అభివృద్ధి చరిత్ర రుజువు చేసింది. పెట్టుబడిదారి వర్గం తన సృజనాత్మక, నిర్మాణాత్మక,

ప్రజోపయోగపాత్రను పోషించడం నిజంగా మానవీయం.  గత రెండు శతాబ్దాలకాలంలో పెట్టుబడి దారీ వర్గాలు ముఖ్యంగా పాశ్చాత్య పెట్టుబడిదారి వర్గం తన అత్యధిక లాభాపేక్షతో తమ సృజనాత్మక పాత్రకు తిలోదకాలిస్తూ సామ్రాజ్యవాదులుగా ప్రపంచ మానవాళి విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోవడం జరిగింది  వారి ధనబలం, కండబలం ప్రజల స్వాతంత్రోద్యమాల ముందు పటాపంచలుగాక తప్పలేదు. ఐనా పెట్టుబడిదారి వర్గ సృజనాత్మక పాత్ర నిర్మాణాత్మక పాత్ర వస్తుత: తన ఉనికిని కోల్పోనవసరంలేదు. కార్మికవర్గం, వినిమయ దారి వర్గాలతో తమకుండే మిత్రవైరుధ్యం గురించి ఆందోళన చెందనక్కరలేదు. కాని వారిలో విషమించిన ధనదాహం, రాజకీయ గుత్తాధిపత్యం వారికి ప్రజలనుండి, శత్రువైరుధ్యాలను సమకూర్చినది. చివరకు ప్రజలు,ప్రజాస్వామ్యం,జయించడం జరిగింది. మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో పెట్టుబడిదారి వర్గ అభ్యుదయ పాత్ర అత్యంత ప్రయోజనాత్మకం. మిత్ర వైరుధ్యాలు, శత్రు వైరుధ్యాలుగా దిగజారనక్కరలేదు.  దేశ ప్రజల స్వతంత్రాలను, ఆర్థిక స్వావలంబనను గౌరవించె పెట్టుబడిదారి వర్గ నిర్మాణాత్మక పాత్ర అత్యంత అవసరం. ఆర్థిక స్వాతంత్రం, సార్వభౌమత్వ సిద్ధాంతం పెట్టుబడిదారి వర్గంతోపాటు అందరి ఆశయంగాఉండడం సహజం. ఈ దిశలోనే అభివృద్ధిని ప్రజలందరి సుఖాన్ని, హితాన్ని, ప్రకటించే ఆర్థిక రాజకీయశక్తులు ప్రవర్ధ మానమవుతాయి.  తమ విజయకేతనాన్ని ఎగురవేస్తాయి.

# 2. వ్యవసాయం

భారతదేశంలోని సాధారణ ఆర్థిక జీవితంలో 40 కోట్ల అసంఘటిత శ్రామికులున్నారు. ఇందులో 65 శాతం వ్యవసాయంపై ఆధారపడుచుండగా మిగతా వారు వ్యవసాయేతర వృత్తులపై ఆధారపడుతున్నారు. వీరందరి పేదరికాన్ని అంచనా వేయగా గ్రామసీమల్లో59 శాతం పురుషులు మరియు 89 శాతం స్త్రీల తలసరి ఆదాయం రోజుకి కేవలం 50 రూపాయలేనని, పట్టణాలల్లోనైతే 50 శాతం పురుషులు మరియు 83 శాతం స్త్రీల తలసరి ఆదాయం రోజుకి 55కి మించడంలేదని రూఢిగా తెలుస్తున్నది. వీరికి ఏలాంటి సామాజిక భద్రత లేదు. ఇంతటి పేదరికాన్ని అనుభవిస్తున్నా సగటు దేశీయ ఆదాయంలో వీరి శ్రమ శక్తి పాత్ర 60 శాతంగా ఉండడం గమనార్హం. ఈ అంచనా ఉపాధి హామి పథకానికంటే ముందు కాలానికి చెందినది. ఆ తర్వాత ఆదాయాల్లో చెప్పు కోదగిన మార్పు వచ్చినమాట వాస్తవమే అయినా నిత్యావసర వస్తువుల ధరలు కూడా గణనీయంగానే పెరిగిన సత్యాన్ని విస్మరించలేము. ఇంకా వీరంతా ఈనాటి దారిద్ర్యరేఖకు దిగువగానే ఉన్నారు. సంఖ్యకూడా పెరిగింది. 65 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం దేశ జనాభాలోని 30 శాతంగా ఉన్న సామాన్య శ్రమజీవి భద్రతలేని జీవితాన్ని గడపడం సభ్యసమాజం తలదించుకోవలసిన సందర్భం.

వ్యవసాయం, వ్యవసాయేతర వృత్తులను అధునికీకరించడం, తద్వారా వాటిని లాభ దాయకంగామార్చడం ఆలాగే గ్రామీణ జీవితానికి ప్రాణప్రదమైన మౌలిక సదుపాయాల నిర్మాణంపై నిధులను వెచ్చిస్తూ యువతకు ఉద్యోగభద్రత గ్రామీణ జీవితానికి ఆధునికతను సమకూర్చడం ఈనాటి జాతీయ కర్తవ్యం. పాడి పంటలకు పూర్తిగా అనుకూలమైన భూమి, నదీనదాలు, వాతావరణం కలిగిన మన దేశంలోని వ్యవసాయాదాయం సగటు దేశీయ ఉత్పత్తిలో 1950-51లో 51.88 శాతముండగా 30 సంవత్సరాల తర్వాత అనగా 1980-81లో అది 35.69 శాతానికి తగ్గింది. తిరిగి 30 సంవత్సరాల నాటికి అనగా 2011-12 నాటికి మరీ తగ్గి 14.05 శాతానికి చేరింది. వ్యవసాయ ప్రధానదేశంగా ప్రసిద్ధిచెందిన దేశ జనాభా 30 కోట్ల నుండి ఈనాటికి 120 కోట్లయినట్లు తాజా అంచనాలు తెలియచేస్తున్నవి. పరిశ్రమల ద్వారా వచ్చే ఆదాయం దేశ ఆదాయంలో కేవలం (1950-51) 11.10 శాతం నుండి మొదటి 30 సంవత్సరాలలో 18.05 శాతానికి మాత్రమే పెరిగింది. ఆ తర్వాత మూడు దశాబ్దాలకు 19.22 శాతానికి అంటే నామమాత్రంగా పెరిగింది. తర్వాత మూడవ ప్రాధాన్యతగల సేవారంగం (రవాణా, సమాచార, బ్యాంకింగ్, వైద్యం, విద్య తదితర రంగాలు) నుండి 1951లో దేశీయాదాయంలో 34.63 శాతం ఉండగా మొదటి 30 సంవత్సరాలో పెరిగి 45.26 శాతానికి చేరింది. రెండవ విడతలో ఇంకా పెరిగి 66.77 శాతానికి చేరింది.

అభివృద్ధి చెందిన దేశాల అనుభవాల వెలుతురులో మనదేశ మార్గం తల క్రిందులుగానున్నట్లు రుజువవుచున్నది. అసలు దేశీయ సంపద పెరుగుదలనే మొదటి 40 సంవత్సరాలకు మించిన కాలంలో నత్తనడక నడిచింది. 1991 నుండి ప్రారంభించబడిన సంస్కరణలు, సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణల వేగాన్ని అందుకోలేకుండా పోయినది. ముఖ్యంగా దేశ వ్యవసాయరంగం భూసంస్కరణలు, భూసార సంరక్షణ, భూగర్భజలాల పెంపకంతో పాటు జలవనరుల నిర్మాణం,

శాస్త్రీయ వ్యవసాయ నిర్వహణ, గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల నిర్మాణ రంగాలలో పూర్తిగా వెనుకబడిపోయింది. కొన్ని భారీ ప్రాజెక్టుల నిర్మాణం, మద్దతు ధరల లాంఛన ప్రాయ ప్రకటనలకే పరిమితమైంది. 51 శాతం దేశీయ జనాభాకు ఉపాధిని కల్పిస్తూ 120 కోట్ల జనాభాకి ఆహార భద్రతతో పాటు ఎగుమతులు గూడా చేసే వ్యవసాయరంగం విస్మరించబడింది. ఇటువంటి విధాన ఫలితంగానే ఈ నాటి వ్యవసాయరంగం చతికిలబడిపోయింది.

## రైతాంగ దైన్యం

భారతదేశం వెలిగిపోతున్నదని మురిసే వారున్నారు. వారొకసారి గ్రామాలను దర్శించి సాధారణ రైతు అనుభవిస్తున్న జీవన ప్రమాణాలన్ని తిలకిస్తే రైతాంగ దీనావస్థ కండ్లకు కట్టినట్లుగా అగుపడుతుంది. అసమానతల వివరాలోకి వెళ్తే శాశ్వత జలాదారాలుగల మాగాణి గ్రామాలతో పాటు మెట్ట గ్రామాలు, భూగర్భ జలాధారాలు గల గ్రామాలన్నిటిని కలిపినా సగటు గ్రామీణ ఆదాయం నుండి 10 శాతం జనాభా 43 శాతాన్ని అనుభవించగా 40 శాతం జనాభాగల పేద రైతులు, రైతుకూలీలు, చేతి వృత్తులపై ఆధారపడే వారంతా కలిసి 7-9 శాతం మాత్రమే అనుభవిస్తున్నారు. మిగతా 50 శాతం గ్రామీణ జనాభాగా ఉన్న మధ్య తరగతి రైతులు మిగతా 50 శాతం ఆదాయాన్ని పొందుతున్నారు. వ్యవసాయరంగంలోని ఈనాటి అసమానతలను తొలగించడానికి అవసరమున్నచోట భూ సంస్కరణలను అమలు పర్చుతూ ప్రధానంగా పంటల ఉత్పాదకత, దిగుబడులను రెండుమూడు రెట్ల వరకు పెంచడం తక్షణావసరం. ఆంధ్రప్రదేశ్‌లాంటి వ్యవసాయాభివృద్ధి పొందిన రాష్ట్రంలోనే వరి పంట ఆదాయం ప్రతి సంవత్సరం ఎకరానికి నికరంగా 6 వేలరూపాయలకు మించడంలేదు. ఇది ప్రపంచంలోని ఇతర వ్యవసాయాధార దేశాల నికర ఆదాయంలో సగం కంటే తక్కువే. భూసంస్కరణల చట్టాలను చిత్తశుద్ధితో అమలు పరచని కారణంగా కనీసం 30 శాతం రైతులు కౌలు రైతులుగాఉంటూ వ్యవసాయ కూలీలకంటే హీనమైన ఆదాయాలు పొందుతున్నారు. అసలు భూములు లేక, కౌలు రైతుగా గిట్టుబాటుకాక, రుణ సౌకర్యం అవసరానికి మూడవవంతుకూడా లేక, ఖర్చులు పెరిగి, మార్కెటులో ధర పలుకక వేలాది రైతులు చేతివృత్తులు నిర్వహించేవారు ఆత్మహత్యలకు తెగించడం ఈనాటి గ్రామీణ జీవిత దౌర్బల్యం. ఇది అత్యధికులుగానున్న వెనుకబడిన తరగతులు, దళితులు, ఆదివాసీ వర్గాలకు చెందిన వారి దీనావస్థ.

## అభ్యుదయానికి కేంద్ర బిందువు వ్యవసాయం

మనదేశంలో నిరంతర వ్యవసాయాభివృద్ధికి దాని ఉత్పత్తి, ఉత్పాదకతల పెరుగుదలకి వ్యవసాయ విజ్ఞాన కొరత శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన కొరతలేదు. వ్యవసాయం చేసే స్త్రీ, పురుషుల కొరత అసలే లేదు. ఈ విజ్ఞానాన్ని, ఉపకరణాలని రైతు సామాన్యం, ముఖ్యంగా సన్నకారు, చిన్నకారు రైతుల ముంగిట చేర్చే సావకాశం, సౌలభ్యం కొరత ప్రధాన ప్రతిబంధకంగా పనిచేస్తున్నది. మన దేశంతోపాటు ప్రపంచ వ్యాపితంగా పెరుగుతున్న జనాభాకి తగు మోతాదులో పౌష్టికాహారాన్ని అందించడం రైతులతోపాటు వ్యాపారులు, పాలకులు, ప్రజా ప్రతినిధులందరి బాధ్యత. ఇందులో కీలక పాత్రను పోషించే రైతులు పేదరిక విషవలయంలో చిక్కి తన ఉనికికే ప్రమాదమేర్పడబోతున్నదనే ఆందోళనలో నుండడం అసలు ఆహార భద్రతకే గొప్ప ప్రమాదం. కాబట్టి వ్యవసాయభివృద్ధికి అవసరమైన పరిజ్ఞానం,

పనిముట్లు, పెట్టుబడి, శీతల గిడ్డంగులతోపాటు, మార్కెటు సౌకర్యం, సహకారం, భాగస్వామ్యం, ప్రకృతి వైపరీత్యాలనుండి రక్షణలు సమకూర్చి సమస్యలన్నిటిని బాధ్యతతో విశ్లేషించి పరిష్కరించే విధాన నిర్ణయాలు చేస్తూ వాటిని ఆచరిచడం ప్రభుత్వాల కర్తవ్యం. దీని ఫలితంగా ఆహార కొరతను రూపు మాపడమే కాదు గ్రామీణ పేదరికాన్ని కూడా పారదోలగల్గుతాం.

వ్యవసాయాన్ని కేంద్ర బిందువుగా గుర్తించడమంటే విశాలమైన భూభాగంలో వివిధ వ్యవసాయోత్పత్తులు విరివిగా నిరంతరాయంగా శాస్త్రోక్తంగా పండించబడాలి. మేలు రకం విత్తనాల ఎన్నిక, వాటి ఉత్పత్తి,ఎరువుల వాడకం సస్య రక్షణ చర్యలను చేపట్టడం పండిన పంటలను సహజ శీతల గిడ్డంగులలో రక్షించుకోవడం, వాటిని మార్కెటు చేయడం, మార్కెటులో జరిగే అక్రమాల నెదుర్కోవడం ఇత్యాది చర్యలన్నీ విద్యా విజ్ఞాన బలంతో చేపట్టబడాలి. ఆందుకవసరమైన వేలాది సుశిక్షితులయిన శాస్త్ర వేత్తలు, ఆదర్శ వ్యవసాయదారుల అవసరం ఎంతైనా వుంటుంది. భారతదేశంలాంటి వ్యవసాయ ప్రధాన దేశంలో వ్యవసాయ కళాశాలల్ని నెలకొల్పడం, నిపుణులను తయారు చేయడం గొప్ప కర్తవ్యం. విద్యాశాఖ, వ్యవసాయశాఖలన్ని తలదూర్చి ప్రణాళికాబద్దంగా ఈ కార్యక్రమాలన్నిటిని చేపట్టడం తక్షణావసరం.

విజ్ఞానంతోపాటు మౌలిక సదుపాయాల నిర్మాణంపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈనాటి నామమాత్ర కేటాయింపులతో సంతృప్తి చెందుతూ కాలయాపన చేసే కంటే, పెద్దగా ప్రణాళికాబద్దంగా కేటాయింపులు చేస్తూ యుద్ద ప్రాతిపదికపై వాటిని నిర్మించాలి. అందుకవసరమైన ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని సాధించాలి. నిధుల కొరత, కీలకమైన వ్యవసాయ రంగానికి ఆటంకం కారాదు. అప్పుడే వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదల, నిరుద్యోగ నివారణ ఏకకాలంలో జరుగుతాయి.

భారతదేశానికి వ్యవసాయం, ఆందులో భాగాలైన పశుపోషణ, చేపల పెంపకం, కోళ్ళ పెంపకం, పూలు, పండ్లతోటల అభివృద్ధి, కూరగాయల ఉత్పత్తి అన్ని కలిస్తే ఒక భారీ పరిశ్రమగా ఉంటుంది. దేశీయ అవసరాలను తీర్చడంతోపాటు అభివృద్ధి చెందిన దేశాల అవసరాలు కూడా తీర్చగల్గుతుంది. పరిశోధనల ఫలితాలుగా వచ్చే సదవకాశాలన్నిటిని సద్వినియోగం చేసుకుంటూ ప్రపంచంలోనే హరిత విప్లవ కేంద్రంగా పరిఢవిల్లగల్గుతుంది. ఇక్కడ ప్రజలు భారీ యాంత్రిక పరిశ్రమల మూలంగా ఏర్పడే పర్యావరణ కాలుష్యంనుండి రక్షించబడుతూ పచ్చని ప్రకృతి ఒడిలో చల్లగా బ్రతకగల్గుతారు. తమ ఆహార అవసరాలను తీర్చుకుంటూనే ఎగుమతుల ద్వారా ఇతోధికంగా మిగులు సంపద సాధించగల్గుతారు.

## దేశానికి వెన్నెముక - రైతు ?

మన దేశంలో వ్యవసాయం రైతులపాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే. గ్రామీణ జనాభాలో 60 శాతం ప్రజలు దీనిపైననే ఆధారపడియున్నారు. దేశీయోత్పత్తిలో ఒకనాడు ప్రధానాంశంగానున్న వ్యవసాయదాయం తగ్గుతూ ఈనాటికి కేవలం 14.3 శాతానికి పడిపోవడం శోచనీయం. దీనికి తోడయిన సేవారంగం, పారిశ్రామిక రంగాలు ప్రథమ, ద్వితీయ స్థానాలనలంకరించగా వ్యవసాయం తృతీయస్థానానికి నెట్టివేయబడుచున్నది. నిజమె, వస్తువాహనాలు, వివిధ సేవలకై మార్కెటులో పెరిగిపోయె డిమాండుతో పోల్చగా వ్యవసాయరంగ పెరుగుదల రేటు సహజంగానే వెనకబడి

యుంటుంది. ఐనా పెరిగే జనాభా యొక్క ఆహార అవసరాలు, పౌష్టికాహార అవసరాల నేపథ్యంలో వ్యవసాయోత్పత్తి పెరుగుదల రేటు గణనీయం కావలసియే ఉన్నది. దేశీయ సగటు ఆదాయం తిరిగి 8-9 శాతానికి చేరాలంటే వ్యవసాయరంగ పెరుగుదలరేటు కనీసం 4 శాతం ఉండాలి. 11వ పంచవర్ష ప్రణాళిక దీనినే లక్షించింది కాని విఫలమైపోయింది. తిరిగి 12వ పంచవర్ష ప్రణాళిక ఇదే లక్ష్యంతోనున్నది. ఈసారి గూడా విఫలమైతే పెరిగిపోతున్న మన జనాభా "అన్నమో రామచంద్ర" అను ఆహార అభద్రతను ఎదుర్కోనక తప్పదు.

రైతు ఆర్థికంగా బాదపడుతూ, రుణ బాధతో ఆత్మహత్యలకు పాల్పడే దుర్గతి ఒక పీడకలగా మారి, వ్యవసాయాన్ని ఒక ఉన్నత ఉద్యోగంగా భావించిన నాడే వ్యవసాయం దేశానికి ఆహార భద్రతతో పాటు పచ్చని వాతావరణం, చల్లని కుటుంబ జీవితాలను సమకూర్చుతుంది. కాబట్టి వ్యవసాయాభివృద్ధికి మారుపేరు రైతాంగ అభివృద్ధిగా మారాలి. శాస్త్రవేత్తలు, పౌర సమాజం, ప్రభుత్వాలు ఈ పరమ సత్యాన్ని గుర్తించి తదనుగుణ్యమైన తాత్కాలిక దీర్ఘకాలిక, చర్యలకు ఉపక్రమించాలి. ఆర్థిక, ప్రాధాన్యతలలో దీనికి పెద్దపీట వేయాలి. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పున:శ్చరణ చేయాలంటే మేలురకం విత్తనాల సకాలంలో లభ్యత, నాణ్యతలతో కూడిన ఎరువులు, క్రిమిసంహారక మందుల సరఫరా, సాధారణ, శీతల గిడ్డంగుల సదుపాయాలు, మార్కెటు సౌకర్యాలు అన్నిటికి మూలమైన సులభ రుణ సౌకర్యాల ఏర్పాటు తదితరాలు ముఖ్యం.

వ్యవసాయం అనాదిగా ఉపకరణాలు సమకూర్చుకోవడం కొరకు ఉత్పత్తుల క్రయ విక్రయాలకై వ్యాపారంతో ముడిబడియున్నది. కాల క్రమేణా ఈ అనుబంధం ఉభయ తారకంగాకుండా రైతాంగం వడ్డీ వ్యాపారస్థుల కబంధ హస్తాలలో నులిపివేయబడుతూ చివరకు లక్షలాది రైతులు ఆత్మహత్యలకు తెగించే గతికి దిగజారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని ఈ దీనావస్థనుండి రక్షించలేని స్థితిలో ఉండడం, గ్రామీణాభివృద్ధినే పరిహసించినట్లున్నది.

గత చరిత్ర ఒక పాఠాన్ని నేర్పుచున్నది. పండించే రైతు, వినిమయదారుల మధ్య ఒక నమ్మకమైన, ధృడమైన బంధం వారధి నిర్మాణం అవసరం. వడ్డీ వ్యాపారస్తుల కబంధ హస్తాలనుండి రైతు విముక్తి పొందాలంటే, స్వేఛ్ఛాయుత మార్కెటుపేర కొనసాగుతున్న నిలువుదోపిడి నుండి రైతుకు రక్షణ కలగాలంటే రైతులు, వ్యాపారులు, వినిమయదారులంతా ఒకే కుటుంబంగా సహకరించుకోక తప్పదు. అది లాభార్జనల లక్ష్యాలతో కూడినదిగాకుండా పరస్పర సహాయక సహకార సూత్రాలే ఊపిరిగా, ఐఛ్ఛిక ఒప్పందాలు ఆధారంగా అధికోత్పత్తి, అధిక ఉత్పాదకతను సాధిస్తూ గిట్టుబాటు, లాభసాటి పరిశ్రమగానుండే యంత్రాంగంతో ఒక వారధి కావడం అనివార్యం, అత్యవసరం.

రైతాంగం పండించే పంటలకు ఉత్పత్తులకు కనీస ధరలుగాకుండా లాభసాటి ధరలను స్వేచ్ఛా మార్కెటులో పొందగలిగే సరికొత్త పరస్పర సహాయ, సహకార సంఘాల నిర్మాణం అవసరం. సామ్రాజ్య వాదులకాలంలో రూపొందించబడి స్వార్ధపరులు ఇటు మధ్యదళారులు బాగుపడే 19వ శతాబ్దపు సహకార వ్యవస్థ రద్దు కావాలి. రైతులెన్నుకున్న నాయకత్వానికి సర్వాధికారాలను సమకూర్చుతూ ప్రభుత్వ జోక్యం ఏమాత్రం లేని పరస్పర సహాయ సహకార చట్టాలు రైతులు వినిమయదారుల మధ్య ఉభయ తారకంగా పనిచేసే వ్యవస్థ నిర్మాణం జరగాలి. ప్రభుత్వం వివిధ

బ్యాంకుల ద్వారా రైతాంగానికి అవసరమున్నంత రుణాన్ని చౌకగా అందించాలి. సన్నకారు, చిన్నకారు రైతులకు కొంతకాలం వడ్డీలేని రుణాలనందించాలి. ఇటువంటి బహుళార్థక సహకార సంఘాలకు తమ సభ్యులైన రైతులతో కూడిన కాంట్రాక్టు వ్యవసాయాన్ని నిర్వహించే అవసరం కలుగుతుంది. చిన్న కమతాలు, సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులు ఈ నాటి సాంకేతిక యుగంలో ఉపయోగ పడడంలేదు. స్వార్థరహితంగా, ఉపాధి హామీనిచ్చే నూతన సహకార సంఘాలు మార్కెటు పోటీని తట్టుకోగల్గుతాయి. లాభాలబాటలో నడుస్తూ రైతుల వ్యవసాయం లాభసాటి వ్యాపకంగా తీర్చిదిద్దగలుగుతుంది. ప్రకృతి వైపరీత్యాలవలన నష్టపడే తరుణంలో తమ బ్యాంకు నిలువలను వినియోగిస్తూ రైతును రక్షించగల్గుతాయి.

## చిన్నకమతాల ఏకీకరణ - ఆహార భద్రత అవసరం

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి 70-75 శాతంగానున్న ఈనాటి చిన్న కమతాలను విశాల వ్యవసాయ క్షేత్రాలుగా పున: నిర్మాణం చేయడం ఎంతైనా అవసరం. కేవలం మానవ శ్రమ ఆధారంగా నిర్వహించబడే వ్యవసాయ కమతాలు యాంత్రికయుగంలో గిట్టుబాటుకాజాలవు. అభివృద్ధి చెందిన దేశాలన్నిటితో పోల్చితే దాదాపు అన్నిరకాల పంటల దిగుబడిలో మనదేశం చాలా వెనకబడి యున్న విషయం రైతాంగానికి తీవ్రమైన హెచ్చరిక. పెరిగిపోతున్న వ్యవసాయాధార జనాభాకి గిట్టుబాటుగా నుండే విధంగా వ్యవసాయ పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే శాస్త్రీయ వ్యవసాయం, యంత్రాల ద్వారా జరగడం అనివార్యం.

వ్యవసాయాభివృద్ధికి ఈనాటి అవసరాలైన, మేలురకం విత్తనాల ఉత్పత్తి, వాటి సరఫరా సేంద్రీయ, రసాయన ఎరువులు, వాటిని సమకూర్చడం, భూసార పరిరక్షణ, అందుకవసరమైన పరీక్షలు చేయడం, పంటలకు అవసరమున్నమేరకు పొదుపుగా నీటిని వినియోగం చేయడం, క్రిమి సంహారకాలను శాస్త్రీయంగా వినియోగించడం, పండిన పంటలను ఆధునిక గిడ్డంగులలో నిలువ చేసుకోవడం, మార్కెటు సమస్యలను అర్థం చేసుకుంటూ గిట్టుబాటు ధరలను పొందడంలాంటి బాధ్యతలన్ని విజయవంతంగా నిర్వహించాలంటే రైతులు తమ తమ పరస్పర సహాయ సహకార సంఘాల ద్వారా మాత్రమే చేయగల్గుతారు. అందరికి లాభాలుగాక సొంతలాభాన్ని లక్ష్యంగా పెట్టుకునే పెట్టుబడిదారి సూత్రాలపై నడిచే కార్పోరేటు కాంట్రాక్టు వ్యవసాయం సన్నకారు, చిన్నకారు రైతులకు తీవ్రమైన హని కల్గిస్తుంది. మధ్య ధళారీల వ్యవస్థను మరో విధంగా నెలకొల్పుతుంది. ఆహారోత్పత్తి తగ్గి, ఆహార భద్రత లక్ష్యానికి తీవ్రమైన ప్రతిబంధకంగా పరిణమిస్తుంది.

ప్రపంచ ఆహార సంస్థ నిర్వచనం ప్రకారం (1996) “ చురుకైన, ఆరోగ్యవంతమైన, జీవితానికి వ్యక్తి, కుటుంబం, ప్రాంత, జాతి, అంతర్జాతీయ స్థాయిలన్నిటిలో ఎల్లకాలం అవసరమున్నంత రుచి, శుచికరమైన పౌష్టికాహారాన్ని సమకూర్చడం ప్రధమ ప్రాధాన్యతగల సామాజిక కర్తవ్యం.” ఈ నిర్వచనం ప్రకారం ఆహార పంటలను పండిస్తూ లేక దిగుమతులు చేస్తూ వాటిని కొనుగోలు చేయగల ఆర్థిక స్థోమతను ప్రజాబాహుళ్యానికి కల్పించడం అన్నిరకాల ప్రమాదాలనుండి రక్షించుకుంటూ నిరాటంకంగా ప్రజలకు, ముఖ్యంగా పేద ప్రజలకు దాన్ని అందించడం సామాజిక కర్తవ్యం. రెండవ యు.పి.ఎ ప్రభుత్వం ఈ కర్తవ్యాన్ని నిర్వహించడానికి పార్లమెంటులో ఆహార భద్రతా బిల్లుని ప్రవేశపెట్టింది.

దారిద్ర్యరేఖకు దిగువగానుంటూ ఆహార కొరతతో అలమటించే వారందరికి సబ్సిడీ ధరలకే గోధుమలను, బియ్యాన్ని అందించడం దీని లక్ష్యం. ఇదివరకే కొనసాగుతూ ప్రతి సంవత్సరం 70 నుండి 90 వేల కోట్ల రూపాయల సబ్సిడితో నడుస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం దీని ఉద్దేశం. దేశం మొత్తంలో 6 నుండి 8 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాన్ని సరఫరా చేయడం ఈనాటి కేంద్ర ప్రభుత్వ కర్తవ్యం. వర్షపాతం బాగా ఉండి పంటలు బాగా పండిన సంవత్సరాలలో 6 కోట్ల మెట్రిక్ టన్నుల వరకు ఆహారాన్ని దేశంలోనే రైతులనుండి సేకరించడం సాధ్యపడుతుంది గాని అంతకు మించిన అవసరం కల్గితే విదేశాల నుండి ఆహారాన్ని దిగుమతి చేసుకోక తప్పని పరిస్థితిలో వ్యవసాయం ఈనాడు ఉన్నది. అపూర్వమైన మంచి వర్షపాతంగల 2010–11 సంవత్సరంలోనే దేశంలోని ఆహార ధాన్యాల ఉత్పత్తి 23–24 కోట్ల టన్నులకు మించలేదు. కరువు కాటకాలు సంభవిస్తే మరింత అధికంగా దిగుమతులుతప్పవు. ఈనాటి లోపభూయిష్ట పంపక విధానం ప్రకారం విడుదల చేయబడిన ధాన్యంలో సుమారు 58 శాతం వృధాకావడం, లేక అవసరం లేని వారు పొందడం జరుగుచున్నది.

ప్రజాపంపిణీ వ్యవస్థను తీవ్రంగా సంస్కరించని ఎడల అధిక ధరలు చెల్లిస్తూ గోధుమలు, బియ్యాన్ని దిగుమతి చేసుకోవడం మోయరాని భారాన్ని కొని తెచ్చుకున్నట్లవుతుంది. ఖర్చులు ఒక లక్ష కోట్ల కావడం ఇంకా మించడం అనివార్యంగా మారుతుంది. ధాన్యసేకరణ ధరలను పెంచక తప్పదు. దీని ఫలితంగా ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రంగాక తప్పదు. ప్రజాపంపిణి 6 కోట్ల టన్నులకే పరిమితం కావాలి. ఐనా ఒకటి రెండు కోట్ల టన్నుల ధాన్యం ప్రకృతి వైపరీత్యాల తాకిడిని తట్టుకోవడానికి ఎప్పటికి నిలువ ఉంచుకోవడం తప్పనిసరి. అలాంటి పరిస్థితులలో ఆరు కోట్ల టన్నులకు మించిన ధాన్యాన్ని అనగా మార్కెటులోకి వచ్చే సుమారు 12 కోట్ల టన్నుల గోధుమలు, బియ్యంలో మూడింట రెండు వంతుల ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయకతప్పదు. ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాదు. కూలీల ద్వారా, లారీల ద్వారా గిడ్డంగులలోకి తరలించడం విపరీతమైన ఖర్చులతో కూడినది. ఆహార కార్పొరేషన్‌లో కొన్ని లక్షల మంది హమాలీలకు లాభాలలో నెలకు ఈనాటి 5–6 వేల కోట్ల రూపాయల నుండి 30–40 వేలకోట్ల రూపాయల వరకు పెరుగుతాయి. అంత మాత్రాన కూలీల పొట్టకొట్టాలనికాదు. వృధా ఖర్చులను తగ్గించుకునే కర్తవ్యాన్ని ఎత్తిచూపడమే ఉద్దేశం. పైపెచ్చు ఆంధ్రప్రదేశ్, పంజాబ్‌తో సహ కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు విధించే 5–10 శాతం అమ్మకం పన్నులు కేంద్రం నుండి నిధులను పొందటానికి ఉద్దేశించబడినవే. ఇది కేంద్రమిచ్చే సబ్సిడీలో ఒక భాగమే. ఇంతేకాదు ఈ రాష్ట్రాలలో బోరుబావుల ద్వారా వ్యవసాయం అధికంకాగా బోరు బావులలో నీటి మట్టం ఇప్పటికే ప్రతి సంవత్సరం 33 సెంటీమీటర్ల లోతుకి పడిపోతున్నట్టు శాస్త్రవేత్తల అంచనా! ఇలా జరిగితే భవిష్యత్తు అంధకారమవక తప్పదు. ఈ సందర్భంగా వ్యవసాయ ప్రధానమైన దేశాలతో మన దేశ వ్యవసాయాన్ని పోల్చుకోవడం అవసరం. చైనాలో సగటు వ్యవసాయ కమత విస్తీర్ణం మన కంటె చాలా తక్కువే. ఐనా ఉత్పాదకత దాదాపు రెట్టింపుగానున్నది. చైనాలో వరి పంట సుమారు మూడు కోట్ల హెక్టార్లలో 20కోట్ల టన్నులు పండగా మన దేశంలో 4.5 కోట్ల హెక్టెర్ల భూమిలో కేవలం 15 కోట్ల టన్నుల ధాన్యాన్నే పండిస్తున్నాం. అధిక దిగుబడినిచ్చె పొట్టిరకం వంగడాలను చైనాలో 63శాతం విస్తీర్ణంలో ఉపయోగించగా మనదేశంలో కేవలం 3శాతం విస్తీర్ణంలోనే

ఉపయోగించడం వ్యవసాయ శాఖ దౌర్భల్యం. అతి పెద్ద విస్తీర్ణాల వ్యవసాయ కమతాలు గల బ్రెజిల్ దేశంలో వ్యవసాయం పూర్తిగా యాంత్రికంగా మార్చబడింది. ఒక్కో కమతం 30,000 హెక్టార్ల వరకు ఉన్న కార్పొరేటు వ్యవసాయం లాభదాయకంగా నిర్వహించడం జరుగుచున్నది. ఐతే రైతాంగం పెద్ద ఎత్తున భూములు కోల్పోవడం గూడా జరుగుతున్నది. ప్రభుత్వం అలాంటి పేద రైతులకు నెలసరి నగదు బదిలి ద్వారా తోడ్పడడం జరుగుతున్నది. అది అక్కడి పరిణామం. మనకవసరంలేదు.

ఐనా మన దేశ పరిస్థితి ఆందోళనకరంగానేనున్నది. 2002-2003 వరకు వ్యవసాయరంగం ఎలాంటి సంస్కరణలకు నోచుకోలేదు. ఈ రంగంపై ప్రభుత్వ పెట్టుబడులు తరిగిపోతున్నవి. ఫలితంగా పరిశోధనలు, ఉత్పాకదత, ఉత్పత్తి రేట్లు గూడా నిలిచిపోయినవి. గత రెండు పంచవర్ష ప్రణాళికల కాలంలో వ్యవసాయం స్థంభించిపోయింది కేంద్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ, ఆశాఖ పరిశోధనలతో సహ ప్రతి సంవత్సరం 21,000 కోట్ల రూపాయలు మాత్రమే బడ్జెటులో కేటాయించింది. ఆహార సరఫరాలో వివిధ సబ్సిడీలపై 60,000 కోట్ల రూపాయలు కేటాయించింది. ఇది పెరిగి లక్ష కోట్లకు చేరినా ఆశ్చర్యపడే అవసరం లేదు. ఎంత తేడా! పరిస్థితి తల క్రిందులుగా నున్నది. పాలకుల అవగాహన రాహిత్యం పరిపాలన అసమర్థతకు ఇది నిలువుటద్దం లాంటిది అంతే కాదు. సంక్షేమ కార్యక్రమాల పేరట పారదర్శకత్వం, జవాబుదారితనం లోపించిన అనేక కార్యక్రమాలపై లక్షలాది కోట్లు కేటాయించబడగా కోట్లాది రైతులను దారిద్ర్యం నుండి శాశ్వత విముక్తి కల్పించే రెండవ హరిత విప్లవం పై కేవలం 4,000 కోట్ల రూపాయల్ని కేటాయించడం వ్యవసాయం గురించి పాలకులకున్న అవగాహన లోపమే కాదు, సత్వర రాజకీయ లబ్దిని పొందే అధికార దాహాన్ని స్పష్టం చేస్తుంది. స్వావలంభన, మానవాభివృద్ధి, సుస్థిర గ్రామీణాభివృద్ధి గురించి శాస్త్రీయ అవగాహనా రాహిత్యాన్ని తెలియచేస్తున్నది. బడా పెట్టుబడిదారి సంస్థలకిచ్చె ప్రోత్సాహకాలు, సంక్షేమ కార్యక్రమాలకిచ్చె ప్రాధాన్యతల మధ్య అత్యధిక జనాభా యొక్క జీవనాధారమైన వ్యవసాయం నలిగిపోతున్నది. సంక్షేమ కార్యక్రమాలకివ్వవలిసిన ప్రాదాన్యతను ఏమాత్రం తగ్గించకుండా శాశ్వత ఆర్థికాభివృద్ధి రంగమైన వ్యవసాయం యొక్క ప్రాధాన్యతను ఎత్తిచూపడమే విమర్శల ఉద్దేశం. సంక్షేమ కార్యక్రమాల బరువుమోయరాని విధంగా వుంటె అసలు ఆర్థిక వ్యవస్థ మొత్తం కుప్పకూలక తప్పదు. బాధ్యత గల నాయకత్వం ఈ సత్యాన్ని ఎంత త్వరగా గుర్తిస్తే దేశాభివృద్ధికి అంత మంచిది. వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకతల పెరుగుదల, మార్కెటు సౌకర్యాల విస్తరణ, వ్యవసాయం ఒక లాభసాటి పరిశ్రమగా యువతరాన్ని ఆకర్షించడం అవసరం. పట్టణాలకు చౌకగా ఆహారాన్ని అందించడం కొరకు ముత్తాతల నాడు చేసిన చట్టాలు, నియమ నిబంధనలన్ని పునరాలోచించి వాటిని సవరించడమో, తొలగించడమో సత్వరం జరిగాలి. ఎగుమతి సౌకర్యాలు కూడా కల్పించాలి. దేశీయ ఉత్పత్తిలో వ్యవసాయం యొక్క శాతాన్ని ఒక శాతం పెంచగల్గితే అది పేదరికాన్ని తగ్గించడంలో వ్యవసాయేతర మార్గాల కంటే 2-3 రెట్ల ప్రయోజనకరమనే వాస్తవాన్ని ఏమాత్రం విస్మరించకూడదు. 2008 నాటి ప్రపంచాభివృద్ధి నివేదికలో ఇదే వాస్తవం ఉద్ఘాటించబడ్డది. చైనాలోనైతే ఇది 3.5 రేట్ల తేడాగా కనపడింది. బ్రిజిల్‌లో ఇది 2.7 రెట్లున్నది. వ్యవసాయంపై వివిధ పెట్టుబడులను ఇతోధికం చేయవలసిన అవసరాన్ని పై అంకెలు నొక్కిచెప్పుచున్నాయి. దేశీయ ఉత్పత్తిలో వ్యవసాయరంగ పాత్రను కనీసం 5-6 శాతంగా అధికం చేయడం, పేదలకు పనితో పాటు నగదు బదిలీ విధానాన్ని అమలు పర్చడం, దీన్ని అందించ వీలు

లేని పేదలకు ప్రజాపంపిణి వ్యవస్థ ద్వారా ఆహార ధాన్యాల సరఫరా చేయడంపై విధాన నిర్ణేతలు తమ దృష్టిని సారించాలి. ఇతర మౌలిక సంస్కరణలతో పాటు వ్యవసాయరంగ బహుముఖ సంస్కరణల ద్వారానే పేదరికం త్వరగా తగ్గడం జరుగుతుంది తప్ప ఇంతకు సులభతర మార్గమంటూ ఉండదు.

## రెండవ హరిత విప్లవం

70వ దశకంలో ప్రారంభించబడిన మొదటి హరిత విప్లవం ప్రధానంగా నీటి పారుదల సౌకర్యాలున్న ప్రాంతాల వ్యవసాయాభివృద్ధికి ఉపయోగపడ్డది. దేశంలో వ్యవ సాయోత్పత్తిలో 44శాతం వర్షాధారమైన మెట్ట వ్యవసాయం నుంచే ఉత్పత్తి చేయబడుచున్నది. 40శాతం దేశ జనాభా మెట్ట వ్యవసాయంపైననే ఆధారపడియున్నది. వ్యవసాయ భూమిలో 60శాతం భూమి మెట్ట వ్యవసాయంగా సాగు చేయబడుచున్నది. మొత్తం పంటలలో 85శాతం నుండి 95శాతం ఆహారధాన్యం, 85శాతం పప్పులు, 80శాతం నూనె గింజలు, 65 శాతం ప్రత్తి మరియు 45 శాతం బియ్యం మెట్ట వ్యవసాయం ద్వారా పండించబడుచున్నవి. ఐనా ఈ వ్యవసాయంపై పెట్టుబడులు, శాస్త్ర సాంకేతిక చర్యలు చాలా తక్కువగా నుండడం వలన పంటల దిగుబడులు చాలా తక్కువగానుండి గిట్టుబాటు కావడం లేదు. నీటి కొరత, వ్యవసాయ విస్తరణ చర్యల లోటు, చిన్నచిన్న కమతాల కారణంగా మెట్ట వ్యవసాయం కుదించుకుపోతున్నది. ఫలితంగా అత్యధిక జనాభాకు జీవనాధారంగా నున్న మొత్తం వ్యవసాయ రంగం దేశీయ ఉత్పత్తిలో సేవారంగం, పారిశ్రామిక రంగం తర్వాత కేవలం 14 శాతంగా ఉండడం దేశాభివృద్ధికి ఒక సవాలుగా పరిణమిస్తున్నది. వ్యవసాయ రంగానికి గల అపార అవకాశాల్ని సద్వినియోగం చేసుకోలేకపోవడం పెద్ద సమస్య. రెండవ హరిత విప్లవం దీన్ని లక్ష్యంగా ఎంచుకోవలసి ఉన్నది.

పరిశ్రమలు, వాణిజ్య వ్యాపారాలను నిర్వహించే సంస్థలు వ్యవసాయాన్ని తమలో ఒక భాగంగా భావించి పెట్టుబడులను ఇటు మళ్ళించి, ఆధునికమైన పరిజ్ఞానాన్ని అనుసరించి పెద్ద కమతాల భారీ వ్యవసాయం చేయగలిగితే దీనికి సమాధానం లభించే అవకాశాన్ని లోతుగా పరిశీలించవలసియున్నది. చిన్న కమతాలు గల సన్నకారు రైతులు ఇంతటి భారాన్ని మోయజాలరు. ప్రభుత్వం సహకార సమిష్టి వ్యవసాయాల పేరుతో అనేక ప్రయోగాలు చేసి విఫలమైంది. ఉద్యోగస్తులుగానున్న అధికారులకు సూక్ష్మ వ్యవసాయ పరిశ్రమలో పాటించవలసిన అనేకానేక సూక్ష్మస్థాయి మెళుకువలపై అవగాహన ఉండదు. శ్రద్ధాసక్తులు అసలుండవు. యజమానులైన సన్నకారు, చిన్నకారు రైతులకున్న శక్తి స్థోమతలు ఏమాత్రం సరిపోవు. పెద్ద కమతాలపై శాస్త్రీయంగా మెట్ట వ్యవసాయం చేసి అధిక దిగుబడులను లాభాలను పొందాలంటే పెట్టుబడులతో పాటు వ్యవసాయ శాస్త్ర నిపుణుల తోడ్పాటు అత్యంత ప్రధానం. దీన్ని సాధించేదెలా? రైతులకు తమ కమతాలపై గల యాజమాన్య హక్కు ఏమాత్రం భంగపడకుండా, రైతుకు విధిగా ఉపాధిని కల్పిస్తూ ఆధునిక వ్యవసాయాన్ని నిర్వహించే సృజనాత్మక, ఆచరణయోగ్యమైన విధాన రూపకల్పన జరగాలి. పారిశ్రామిక సంస్థలు వ్యవసాయాన్ని తమ అంతర్భాగంగా గుర్తించి నిర్వహించడం ఆచరణ యోగ్య ప్రత్యామ్నాయంగా అగుపడుచున్నది. రైతును తమ వాటాదారునిగా గుర్తిస్తారా, ఉద్యోగిగా గుర్తించి అతని పని తనానికనుగుణ్యమైన జీతభత్యం చెల్లిస్తారా అనుభవంలో తెల్చుకోవలసిన విషయం. ఏది ఏమైనా రైతుకు ప్రాణప్రదమైన తన

భూకమతంపై యాజమన్యపు హక్కును కాపాడడం కీలకాంశం. దేశాన్నెదుర్కొంటున్న ఈ ప్రధాన సమస్య పరిష్కారంలో రైతు బాంధవులు, రైతు సంఘాలు, రాజకీయ పార్టీలు ప్రభుత్వాలు బాధ్యతగా ప్రయోజనాత్మకంగా ఆలోచించి సముచిత నిర్ణయాలు వెంటనే చేయాలి. పరిశ్రమలు లేక సహకార సంస్థలతో ఒక నిర్ణీతమైన ప్రాంతాన్ని మెట్ట వ్యవసాయానికి కేటాయిస్తూ రూపొందించబడే ఈ నూతన వ్యవస్థలో, సహకార, శాస్త్రీయ సమష్టి వ్యవసాయ సూత్రాలతోపాటు పెట్టుబడుల కేంద్రీకరణ, శాస్త్ర సాంకేతిక, వ్యవసాయ పద్ధతుల వినియోగం కలిసి ప్రయోజనాత్మకం కావడం గొప్ప అవసరం. అధికోత్పత్తి, ఉత్పాదకతలు పొందే ఈరంగం దేశీయోత్పత్తిలో తన సముచిత భాగాన్ని కనీసం 25 శాతం జతపర్చుగల్గుతుంది. ప్రకృతి సిద్ధంగానే వ్యవసాయం, సేవారంగం, పారిశ్రామికరంగాల ఆదాయాలతో పోటీపడలేదు. క్రమంగా వ్యవసాయ రంగంపై ఆధారపడియున్న అధిక జనాభా ఇతర రంగాలకు మళ్ళక తప్పదు. కాని ఉత్పత్తిలో మాత్రం దేశీయాదాయంలో గణనీయభాగాన్ని సమకూర్చక తప్పదు. వ్యవసాయానికి పూర్తిగా అను కూలమైన నైసర్గిక భౌగోళిక వాతావరణం గల భారతదేశం పచ్చని పంటలు, అడవులతో నిరంతర హరిత భూ మండలంగా మారుతుంది. వివిధ ఆహార అవసరాలన్నిటిని దేశ, విదేశీ ప్రజలకందించ గల్గుతుంది. కొన్ని ప్రయోగాలు, అందించే విలువైన అనుభవాల ఆధారంగా ఈ నూతన పరిశ్రమలో తగు సంస్కరణలు చేయగల్గుతాం. దేశంలో ఇదివరకే నిర్వహణలోనున్న వ్యవసాయాధార పరిశ్రమల సముదాయాలు వాటి అనుభవాలు క్రమంగా వ్యాపించి దీని ఔచిత్యాన్ని రైతు సామాన్యానికి అర్థం చేయించగల్గుతాయి.

రైతులు ప్రధానంగా మెట్ట ప్రాంతాల రైతులు తమ ఉత్పత్తుల ఆధారంగా ఇతర ఆహార పదార్థాలను తయారుచేసే పరిశ్రమల ప్రక్రియలలో (ప్రాసెసింగ్) భాగస్వాములు కావడం అవసరం. పంటల నాణ్యతల్ని పెంచడం, మార్కెటు చేయడం ద్వారా వచ్చే అదనపు లాభాలల్లో కూడా భాగస్వాములవుతూ తమ ఆర్థిక స్థోమతను పెంచుకోగల్గుతారు. ఇంతకుమించి ఆహారపదార్థాల తయారి పరిశ్రమ మన దేశంలో కేవలం 6 శాతం మాత్రమే ఉండడం ఆశ్చర్యకరం. వివిధ స్థాయిలలోనుండే ఈ పరిశ్రమల్లో లక్షలాది గ్రామీణయువత ఉపాధిని పొందగల్గుతున్నది. ఆహారపు అలవాట్లు బాగా మారిపోతున్న ఈ తరుణంలో ఆహార వస్తువుల తయారి పరిశ్రమ గ్రామీణ ఆర్థికాభివృద్ధికి ముఖ్యమైన చోదకశక్తిగా పరిణమిస్తున్నది నిలొదొక్కుకొని మనగల్గుతుంది.

ప్రభుత్వం వర్షాధార ప్రాంత రైతాంగాన్ని వ్యవసాయంతోపాటు వ్యవసాయధార పరిశ్రమల నిర్మాణంలో వాటి అభివృద్ధిలో పెద్దగా తమతోడ్పాటును అందించడం చాలా అవసరం. రుణ సౌకర్యాలను విస్తరించడం, వడ్డి రేట్లను తగ్గించడం, ఉత్పత్తులపై వివిధ పన్నుల బరువు భారాన్ని తీవ్రంగా తగ్గించడంలాంటి ప్రోత్సాహకాలను అందించగల్గుతుంది. మార్కెటు చట్టాన్ని తీవ్రంగా సవరిస్తూ రైతుకు అనుకూలమైన వ్యాపారాన్ని ప్రోత్సహించగల్గుతుంది. ఈ విధంగా రైతు రక్షణను కేంద్ర బిందువుగానుంచుకుంటూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు వ్యవసాయాన్ని పెట్టుబడికి కొదవలేని, కాంట్రాక్టు, సహకార సూత్రాల ఆధారంగా పారిశ్రామిక వ్యవస్థతో ముడిబెట్టడం అనివార్యం. దాని పరిరక్షణకై పాటు బడడం అత్యవసరం లేనిచో చిన్న కమతాలతో పేదరిక బాధల సుడిగుండంలో కొట్టు మిట్లాడు చున్న బక్క రైతులు అధికోత్పత్తి ఉద్యమములో భాగస్వాములుకాలేరు. సారవంతమైన

భూములుండి కూడా వర్షాభావం వలన మన దేశంలోని సగానికి మించిన ప్రాంతంలోని రైతాంగ వ్యవస్థ చతికిలబడిపోతూ అభివృద్ధి ప్రక్రియలకు దూరంగానుంటూ దివాళా తీసిపోతుంది. పేదరికం ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లు స్థిరపడిపోతుంది.

## వ్యవసాయరంగానికి పెట్టుబడుల మళ్ళింపు

ఇది ఇతోధికం కావాలి ఎంతగావాలి? ఈ ప్రశ్న విశ్లేషించదగింది. వ్యవసాయోత్పత్తులను గణనీయంగా, కనీసం రెండురెట్లు పెంచగలిగే సదవకాశం మన కండ్లముందున్నది. పంటల పెంపకం, విత్తనాల వృద్ధి, సేంద్రీయ ఎరువుల వాడకం పరిమితంగా క్రిమిసంహారకాల వినియోగం లాంటి శాస్త్రీయ చర్యలతోపాటు అన్ని స్థాయిలలో రైతు రక్షణ ధ్యేయంగా వ్యవసాయాన్ని ముఖ్యంగా మెట్ట వ్యవసాయాన్ని యాంత్రికం చేయగలిగే విస్తృత క్షేత్రాల వ్యవసాయం మాత్రమే ఉత్పత్తి, ఉత్పాదకతల లక్ష్యాన్ని సాధించగల్గుతుంది. అధికోత్పత్తి మాత్రమే ఆహార సరుకుల అధిక ధరలను అదుపు చేయగల్గుతుంది. అందుకే వ్యవసాయం యాంత్రికం చేయబడాలి. ఈ అవసరాన్ని ఇప్పటికే కొంత వరకు గుర్తించి వాటిని ఆచరించడం జరుగుతున్నది. అప్పులపాలయినా ఆ తిప్పలు తప్పడం లేదు. పెట్టుబడుల మళ్ళింపు ప్రభుత్వం ప్రైవేటు మార్గాల ద్వారా అత్యవసరం. ఈనాడు దేశీయ వ్యవసాయోత్పత్తిలో 4 శాతంగా నుండే నిధులను ప్రభుత్వ రంగం ద్వారా 12 శాతం నిధులను ప్రైవేటురంగం ద్వారా మొత్తంగా దేశీయ వ్యవసాయోత్పత్తికి 16 శాతంగా నుండే నిధులను వెచ్చించుచున్నాం. ఇందులో నీటిపారుదల రంగ మొకటే సింహ భాగాన్ని హరించుకుపోతున్నది. వ్యవసాయ ఆధునికీకరణ, నిధుల కొరత కారణంగా త్వరత్వరగా జరగడంలేదు. జరిగిన చోట మంచి ఫలితాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఉత్పత్తులు ఉత్పాదకతలు పెరిగి దేశీయ ఉత్పత్తిలోనే వ్యవసాయరంగం సముచిత పాత్రనలంకరించె మంచిరోజులు కనుచూపు మెరలో స్పష్టంగా అగుపడుచున్నది. ప్రపంచవ్యాప్తంగా సాధించబడే ఉత్పత్తి విలువలో 2 శాతం విలువ వ్యవసాయం, దానికి సంబంధించిన వివిధ రంగాల అభివృద్ధిపై వెచ్చించబడగా మన దేశంలో మాత్రం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేస్తున్న కేటాయింపులు సగటు దేశీయాదాయానికి అరశాతం కంటే మించడం లేదు. అందులో అత్యధిక దోహదం సబ్సిడీలు, ఉద్దీపనలు, నష్టపరిహారాల రూపంలో నుండడం గమనార్హం. దీన్ని ప్రపంచస్థాయికి అనగా రెండు శాతానికి పెంచాలని రైతు సంఘాలు ఉద్యమించడం ఈనాటి తక్షణావసరం.

పెట్టుబడులు ఇతోధికం చేసి యాంత్రిక వ్యవసాయాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించినచోట వ్యవసాయరంగం నుండి సాధించిన మిగులు రెండు సంవత్సరాల అనతికాలంలోనే పెట్టుబడికి 12 శాతం నుండి 20 శాతానికి పెరిగింది. సంపద సృష్టించబడుతుంది. రుణాలు, వ్యాపారాల ద్వారా పొందే సంపద అసలు సంపద కాదు. ప్రకృతి సిద్ధమైనది. వ్యవసాయం వ్యవసాయాధారంగా పరిశ్రమలు, వాటి ద్వారా ఉత్పత్తి చేయబడేది. సంపదల ఫలితమే సేవారంగం ఈ మూడు రంగాలు మానవావసరాలు, పరస్పరాధారితాలు, వీటి మధ్య సమతుల్యాన్ని సమకూర్చడం, పోషించడం నాగరిక సమాజం దాని ప్రభుత్వ కర్తవ్యం.

వ్యవసాయంలో చిన్నకమతాలె ఉత్పత్తి దాయకమని సుప్రసిద్ధ వ్యవసాయ అర్ధశాస్త్రవేత్తలైన అశోక గులాటి, సుర్జిజైన్ గారలు వాదిస్తున్నారు రైతుల పేదరికాన్ని త్వరగా తగ్గించడానికి వారు చేసే సూచనలు పరిశీలించదగినవి.

1. గత నాలుగు దశాబ్దాల కాలంలో దేశంలో సగటు వ్యవసాయ కమతం యెక్క విస్తీర్ణం 2-3 హెక్టార్ (ఒక హెక్టార్ రెండున్నర ఎకరాలు) నుండి 1-2 హెక్టార్‌కి పడిపోయింది. ఇంకా రెండు దశాబ్దాలకాలం వరకూ ఇలా పడిపోక తప్పదు. 2010-11 నాటి అంచనా ప్రకారం వ్యవసాయ కమతాలో 85 శాతం కమతాలు అయిదెకరాలు అంతకు లోపు భూములు గల కమతాలె. ఈ కమతాలో 44 శాతం సాగు భూమి ఉన్నది. నలభై ఏండ్ల క్రితం ఈ విస్తీర్ణం 21 శాతముండింది. ఈ నాటికి రెట్టింపైంది. ఇలా చిన్నకమతాల సంఖ్య పెరుగుతూ పోయి వాటి క్రింద వ్యవసాయం కూడా కుదించుకుపోతే ఈనాటి పోటీ ప్రపంచంలో సన్నకారు, చిన్నకారు రైతులు బ్రతికేదెలా? వారు తమకు రకరకాల ఉపకరణాలను అమ్మేవారితో బేరసారాలు చేసేదెలా? తమ పంటలను కొనుగోలు చేసి వ్యవసాయాధార పరిశ్రములు నిర్వహించే పెట్టుబడిదారులు చిల్లర వర్తకులతో వ్యవహరించేదెలా? పై సమస్యలు ఈనాడు సన్నకారు చిన్నకారు రైతులను ఆందోళనకు గురిచేస్తూ ఉన్నవి. గత్యంతరం లేక ఈ రైతులు నష్టాలను భరిస్తున్నారు. పైన పేర్కొన్న వ్యవసాయార్ధశాస్త్ర వేత్తలు సమస్యలు పరిష్కార సాధ్యాలేనని భయపడనవసరం లేదని భరోసానిస్తున్నారు. వారు చైనాను ఉదహరిస్తున్నారు.మన దేశం కంటె దాదాపు సగం విస్తీర్ణం మాత్రమే అనగా 0.65 హెక్టార్ లేక సుమారు ఒకే ఒక ఎకరం విస్తీర్ణం గల కమతాలలో మనం పండించే దానికంటే రెట్టింపు అంతకుమించి గూడా పంటను పండిస్తున్నారు. వరి ధాన్యాన్నే చూస్తే, వారు సాగు చేస్తున్న సుమారు మూడు కోట్లహెక్టార్లలో 20కోట్ల టన్నుల ధాన్యాన్ని పండించగల్గుతున్నారు. భారతదేశంలో నాలు గున్నర కోట్లహెక్టార్ భూమిలో కేవలం సుమారు 15 కోట్ల టన్నుల ధాన్యాన్నిపండించగల్గుతున్నాం.

అంటె మన కంటె రెట్టింపు పండించగల్గుతున్నారు. అలాగే మెక్కజొన్న పంటలో చైనా ప్రతిహెక్టారుకు 5.3 టన్నులు పండించగా భారతదేశంలో రెండు టన్నులు మాత్రమే పండి స్తున్నాం. భారతదేశంలో గూడా వ్యవసాయ కమతం సగటు విస్తీర్ణం అధికంగానున్న పంజాబు రాష్ట్రంలో ప్రతి ఎకరా దిగుబడి కంటె అన్ని రాష్ట్రాల కంటె చిన్న కమతాలుగల కేరళలోని ప్రతి ఎకరా దిగుబడి అధికంగా నున్నది.

చిన్న కమతాలల్లో పెద్దగా లాభాలను సమకూర్చే వాణిజ్య పంటలను పండించడమే ఇందులోని రహస్యం. కమతాలు పెద్దవైనా, చిన్నవైనా, ఉపయోగించబడే మేలు రకం విత్తనాలు, నీరు, ఎరువులు ఒకటే కాబట్టి పంటలకు కమతాలకు పొంతన ఉండగూడదని వారి వాదన. చిన్న, సన్నకారు రైతులకు సకాలంలో అవసరమున్నంత రుణం తక్కువ రెట్లపై వ్యవస్థాగతంగా లభ్యంకావడం జరిగితే తేడాలేమి రావని వారి వాదన. వ్యవసాయం యాంత్రికమవుతూ రుణాల అవసరం పెరిగిపోతే చిన్న కమతాలు ఈ పోటిని తట్టు కొలేక పోవచ్చునని వారి సంకోచం. దీని నుండి బయట పడుతూ చిన్న కమతాల ఉత్పత్తిరేటు పెంచాలంటె ఈనాడు వ్యవసాయ పని ముట్లను ఆధునీకరించాలి లేదా చిన్నకారు, సన్నకారు రైతులు పెద్దరైతులనుండి సాగుభూమిని విరివిగా కౌలుకు పొందే సౌకర్యం కల్పించాలి.

చైనాలో వ్యవసాయ భూముల కౌలుదారిచట్టాన్ని తీవ్రంగా సవరించి బేదఖలును అరికట్టిన ఉదంతాలను కూడా ఉదహరిస్తున్నారు. అక్కడి రైతులు కార్పోరేటు సంస్థలకు తమ వ్యవసాయభూములను 30 సంవత్సరాల వరకు కౌలుకిచ్చె అవకాశం అక్కడి ప్రభుత్వం కల్పించింది. ఈ విధంగా చిన్న కమతాలు పెద్దకమతాలుగా మారటం, ఉపకరణాలన్ని ఉపయుక్తం కావడం, పంటల ఉత్పత్తి, ఉత్పాదకత పెరగడం జరుగుచున్నది. సన్నకారు, చిన్నకారు రైతులు తమ కమతాల విస్తీర్ణాన్ని పెంచుకునే సదుపాయంతో పాటు, ఈ రైతులు ఒక సముదాయంగా, సంఘటనగా వ్యవహరిస్తె తప్ప ఈనాడు మార్కెటు పోటీని తట్టుకోజాలరని గూడా వారు హెచ్చరిస్తున్నారు. అది చైనాలో సత్ఫలితాలనిస్తున్నదని తెలియజేస్తున్నారు. ఆ ఐక్యతలేని ఎడల అనుభవించవలసిన అనేక అనర్ధాలను గుర్తు చేస్తున్నారు. రైతు సంఘటనలు సహకార సంఘాల రూపంలో ఉండగలిగితే చక్కని ఫలితాలు పొందవచ్చని వారి నిశ్చితాభిప్రాయం. పంటలు పండిన తర్వాత వాటిని సాధారణ గోదాములతో పాటు శీతల కేంద్రాలలో భద్రపరచడానికి వ్యాపారం సక్రమంగా జరగడానికి  ఉత్పత్తి దారులతో వ్యాపారస్థుల సంబంధాల ఆవశ్యకత గురించి గూడా వారు నొక్కి వొక్కాణించినారు. పై వాదనలన్ని, వ్యవసాయాభివృద్ధికి దాని ఉత్పత్తి,  ఉత్పాదకతల పెరుగుదలకి అవసరమైన  ఉపకరణాలు, వాటిసాధన, వాటి వినియోగం గురించి   అనుసరించవలసిన విధానపర చర్యలను బలపరుస్తున్నవే కాని చిన్నకమతాల ప్రాధాన్యతను వాటి ప్రాముఖ్యతను సమర్ధించడంలేదు. ఏది ఏమైనా ప్రతి దేశానికి ఒక వ్యవసాయ నేపధ్యంలో చారిత్రక భూమిక ఉంటుంది. వాటి వెలుతురులో అధికోత్పత్తిని సాధించి  ఆహార భద్రతను నెలకొల్పడం అత్యవసరం ఈ క్రమంలో మేలు రకం విత్తనాల వాడకం, సేంద్రీయ ఎరువుల వినియోగం సస్య రక్షణకై క్రిమిసంహారక మందుల ఉపయోగం, వ్యవస్థాగత రుణ సౌకర్యాలను చౌకగా విరివిగా పొందడం, పండిన పంటలను లాభసాటి వ్యాపారానికై భద్రపరచడానికి గిడ్డంగులు, శీతల గిడ్డంగుల నిర్మాణం చేయడం, రైతు కనుకూలంగా మార్కెటు వ్యవస్తను తీర్చి దిద్దడం వంటి సంస్కరణలు తక్షణావసరాలు, ఇందులో కమతాల తేడాలేదు. కాలక్రమేణా చిన్నకమతాలు విడివిడి యాజమాన్యాలతో నుండినా, ఉత్పత్తి దారులు వ్యాపారులు వినియెగదారుల సహకార వ్యవస్థలుగా ఆధునిక వ్యవసాయం చేయగల్గుతాయి, చైనా, అభివృద్ధి చెందుతున్న ఇతర ఆసియా దేశాల అనుభవం దీనినే బలపర్చుచున్నది. పారిశ్రామిక విప్లవ నేపధ్యంలో వందల సంవత్సరాల క్రింది ప్రాశ్చాత్య దేశంలోని వేల ఎకరాలు కమతాల వ్యవసాయ అనుభవాలు యధాతధంగా మనకు ఉపయోగపడవు. మనదారి మనదే. అధికోత్పత్తి గలిగిన గిట్టుబాటు వ్యవసాయంతో కోట్లాది రైతులకు ఉపాధి భద్రతలను సాధించడం మన తక్షణ లక్ష్యం.

## వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం మన అవసరం

ఇటీవల వ్యవసాయ పంటల ధరల నిర్ణాయక సంఘం ఆధ్యక్షులు శ్రీ అశోక్ గులాటిగారు కేంద్ర ప్రభుత్వానికి ఒక తీవ్రమైన హెచ్చరిక జేసినారు. గోధుమ పంట సేకరణ కాలం జూన్ మాసం ఆఖరు వరకు ప్రభుత్వం వద్ద 7 కోట్ల 25 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు నిలువలుంటాయని అందులో మూడవవంతు ధాన్యం బహిరంగ ప్రదేశాలలో నిలువ చేయబడ్డదని, అది ఎండకు ఎండి వానకు తడిసి చెడిపోతున్నది గాబట్టి దాన్ని త్వరత్వరగా ఖాళీ చేయాలని సుస్పష్టంగా చెప్పినారు. ప్రభుత్వ గిడ్డంగులలో కేవలం 5 కోట్ల టన్నుల ధాన్యాన్ని నిలవచేసుకొనే శక్తి మాత్రమే ఉన్నది

కాబట్టి వాటిని ఖాళీచేసే పని కొనసాగాలని మరీ హెచ్చరించినారు. ఈ ధాన్యాల ఎగుమతికి కూడా చక్కని అవకాశాలున్నాయి. వాటన్నిటిని సద్వినియోగం చేసుకోవడం తక్షణావసరం. అసలు ఆహార ధాన్యాల సేకరణ, వాటి భద్రత, పంపంకంలో క్రమంగానైనా ప్రభుత్వం తమ భారాన్ని తీవ్రంగా తగ్గించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడానికి ఆహార ధాన్యాల దేశ వ్యాపిత రవాణా, ఎగుమతిని నియంత్రించే అత్యవసర సరుకుల చట్టంలో మౌలికమైన సవరణలు చేయడమవసరం. మార్కెటు చట్టాలను సంస్కరిస్తూ పన్నుల భారాన్ని తీవ్రంగా సడలించడం కూడా అవసరం. కేంద్ర ప్రభుత్వ ఆహార విధానం ఫలితంగా ఈనాడు పేదలకందించే ఇతర సంక్షేమ సహాయాలకంటే మించిన పెట్టుబడిని ఆహార ధాన్యాల సేకరణ వాటిని విలువ చేస్తూ రక్షించుకోవడంలో వెచ్చించడం జరుగుతున్నది. ప్రజాభిప్రాయాన్ని గౌరవించే ప్రభుత్వం శ్రీ అశోక్ గులాటి గారి విలువైన హెచ్చరికలకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ దేశ వనరులు వృధాగాకుండా చూడవలసియున్నది.

ఆహార ధాన్యాల ఎగుమతి వ్యాపారంతో విలువైన అనుభవాలను పొందడం జరిగింది. వాటిని శ్రద్ధగా గమనించి విశ్లేషిస్తూ విధానాల రూప కల్పన చేయడం అవసరం. అభివృద్ధి, మానవాభివృద్ధిలో మన దేశం వెనకబడిపోయిన విషయం వాస్తవమేనయినా, ఆహార ఉత్పత్తుల ఎగుమతిలో గణనీయంగా ముందడుగు వేస్తున్నట్లు రుజువవుచున్నది. స్వతంత్రం సాధించిన కాలంలో 30 కోట్ల జనాభా కలిగి సుమారు 4-5 కోట్ల టన్నుల ఆహార ధాన్యాన్ని పండించేవారం. అప్పటి కరువులకు ప్రధాన కారణం ఆహార ధాన్యాల పంటల కొరతకంటే ఆహార ధాన్యాలను దాచిపెడుతూ కృత్రిమంగా కరువును సృష్టించే చీకటి వ్యాపారమే. ఈనాటికి ఈ చీకటి వ్యాపారం, కల్తీ వ్యాపారం కొనసాగుతున్నా పౌర సమాజం మేల్కొంటున్నది. దేశ జనాభా 30 కోట్ల నుండి 120 కోట్లు అనగా నాల్గురెట్లు పెరిగింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి సుమారు 4 కోట్ల టన్నుల నుండి 25 కోట్ల టన్నులకు అనగా ఆరు రెట్లుకు పైగా పెరిగింది. నాగరికతా వ్యాప్తి ప్రపంచీకరణల కారణంగా దేశ ప్రజల ఆహార ఆలవాట్లలో సంతోషదాయకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కూరగాయలు, మాంసాహారాల వాడకం ఇతోధికమైంది పాలు, పాల ఉత్పత్తులు, చేపల వినియోగం పెరిగింది. వాటి ఉత్పత్తులు కూడా పెరిగినవి. ఇంకా పెరిగే అపూర్వ అవకాశాలు దిన దినం అందుబాటులోకి రావడం ముదావహం. అంతమాత్రాన దేశంలో ఆహారలోపం, పౌష్టికాహారలోపాలను ఏ మాత్రం తక్కువ అంచనా వేయడానికి వీలులేదు. పేద జనాభా నివసించే పెద్ద దేశంగా మన బరువు బాధ్యతలు పెరుగుచున్నాయి. త్వర త్వరగా అందరికి పౌష్టికాహరాన్ని అవసరమున్నంతగా చౌకగా అందించే సంపన్నదేశంగా పరిణితి చెందవలసిన కర్తవ్యం. ఒక సవాలుగా మనముందున్నది.

ఆహార ధాన్యాలు, కూరగాయలు, పండ్లు ఫలాలు, మాంసాదుల ఎగుమతి అవకాశాల పెరుగుదల మనమనుభవిస్తున్న అపూర్వ వినూత్న అంశం. ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ పరిశ్రమాభివృద్ధిని సాధించడం మన అవసరం. దేశ చరిత్రలోనే ప్రప్రథమంగా ప్రభుత్వ సంస్థల ఆధీనంలో ఏడున్నర కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు నిలువగానుండడం ఒక అదృష్టమే, ఇంతటి ధాన్యాగారాలలో సుమారు 20 శాతం సరుకు దొంగలు, క్రిమికీటకాలు, ఎలుకలు, పందికొక్కులు, తడిచి కుళ్ళిపోవడం కారణంగా తీవ్రమైన కష్టనష్టాల నెదుర్కోవలసి రావడం దురదృష్టకరం. పాలకుల నిర్లక్ష్యం, నిర్లిప్తత దీనికి కారణం.

ఏది ఏమైనా వ్యవసాయరంగంలో కొన్ని తాత్కాలిక మరికొన్ని దీర్ఘకాలిక విధానపర సంస్కరణలను చెపట్టడం అత్యవసరం. ప్రజల మారుతున్న ఆహార అలవాట్లను దృష్టి యందుంచు కుంటూ మాంసకృతులు, విటమిన్లు అధికంగా నుండే పాడిపంటలు, కూరగాయలు, ఫలాల ఉత్పత్తిని అధికం చేయాలి. అందుకవసరమైన ప్రోత్సహకాలను ఉత్పత్తిదారులకందించాలి. గత అయిదు సంవత్సరాలల్లో నాలుగు సంవత్సరాలుగా రుతుపవనాల అనుకూలత వలన దేశంలో పంటలు బాగా పండినవి పండిన పంటలకనుకూలంగా ప్రభుత్వ ఆధీనంలో గిడ్డంగులు లేవు. పైగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధంగా ఆహార ధాన్యాల సేకరణ ప్రక్రియలను చేబడుతున్నవి, కేంద్ర అత్యవసర సరుకుల చట్టం ఆధారంగా ప్రైవేటు వర్తక వ్యాపార రంగానికి ఇబ్బందులను కల్పిస్తున్నవి. మార్కెటు పన్ను, అమ్మకం పన్నుల నధికతరం చేస్తూ ఎగుమతుల వ్యాపారాన్ని తీవ్రంగా ఆరికట్టజూస్తున్నవి. వ్యవసాయ ఉత్పత్తులు సమాజానికి అత్యవసరాలేననుటలో సందేహంలేదు. వాటిని తగు మోతాదుల్లో నిలువచేస్తూ ప్రజలకు ముఖ్యంగా పేద ప్రజలకందించే ప్రభుత్వ బాధ్యతను ఏమాత్రం తగ్గించడానికి ఆస్కారం లేదు. వ్యవసాయ ఉత్పత్తులు పారిశ్రామిక సరుకుల్లాగా దీర్ఘకాలం చెడిపోకుండా ఉండేవి కావు. ఇప్పటికే శీతల గిడ్డంగుల లోటు కారణంగా కూరగాయలు, పండ్లు, ఫలాలు వినియోగదారుడికి చేరకమునుపే కుళ్ళిపోవడం, రైతులు దివాళా తీసి ఆత్మహత్యలకు కూడా తెగించడం నిత్యం చూస్తున్న సత్యం. కాబట్టి ప్రభుత్వం, వ్యాపారస్తులు అత్యంత మెళుకువతో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతి వ్యాపారాలను నిర్వహించడం అవసరం.

2011-12 సంవత్సర అనుభవం రైతాంగానికి ఆశావహంగానున్నది. దేశం ఒక కోటి టన్నుల బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేయగలిగినట్లు శుభవార్త. బియ్యం ఎగుమతులలో థాయలాండ్, వియత్నాం దేశాల తర్వాత మనది మూడవ దేశం. 600 కోట్ల విదేశీ మారకాన్ని సాధించింది. వచ్చే సంవత్సరం 2012-13లో కూడా ఇదే విధంగా జరిగి మన నిలువలకు తగిన అదనపు విలువ సమకూరే అవకాశమున్నట్లు తెలుస్తున్నది. గోధుమలను ఉత్పత్తిచేసే రష్యా, యూక్రెన్ దేశాలు తమ పంట ధరలను తగ్గించుకోవడం వలన మనకు వారితో పోటీ పడే శక్తి లేదు.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యతలల్లో అత్యంత ప్రధానమైన ఆహార సరఫరా విధాన రూపకల్పనలో సమన్వయం, సహకారలోపం తీవ్రంగానున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించే లెవీలు, పన్ను విధింపులలో ఇది కొట్టవచ్చినట్లుగా అగుపడుచున్నది. పంజాబ్, హర్యానా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఈ లెవి 12 నుండి 14 శాతముంటే గుజరాత్ రాష్ట్రంలో కేవలం 3 శాతమే ఉండడానికి కారణం గోచరించదు. అలాగే అమ్మకం పన్నులు మార్కెట్ టాక్సులల్లో ఉండే అసమానతలు సమర్ధనీయంకావు. సమన్వయం చేయవలసిన కేంద్ర ప్రభుత్వ నిర్లిప్త, నిర్లక్ష్య విధానాలే దీనికి ఏకైక కారణం. ఏమైనా భారతదేశం ఆహార పంటలు వాటి ఉత్పత్తులలో స్వయం పోషకత్వాన్ని సాధించడంతోపాటు ఎగుమతులు కూడా చేయగలిగే స్థితికి చేరుకుంటున్నది. పై నుదహరించినట్లు 2011-12 సంవత్సరంలో ఒక కోటి టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేస్తూ ప్రపంచంలో మూడవ ఆహర ఎగుమతుల దేశంగా ఎదిగింది. రైతాంగానికి, వర్తక వ్యాపారస్తులకు తగు ప్రోత్సహకాలు, సౌకర్యాలుంటే మనదేశం ఈ రంగంలో ప్రధమ స్థానాన్ని అలంకరించడం సుసాధ్యం. ఇది సహజసిద్ధం.

ఇదే 2011-12 సంవత్సరంలో జంతుమాంసం ఎగుమతి వ్యాపారంలో 17 లక్షల టన్నులు ఎగమతి చేస్తూ దేశం ప్రథమ స్థాయికి చేరింది. 300 కోట్ల డాలర్లు సంపాదించింది. ఈ రంగంలో అగ్రగాములుగానున్న బ్రెజిల్, ఆస్ట్రేలియా, అమెరికా దేశాలను వెనక్కి నెట్టగలిగింది. చేపల ఎగుమతితో 340 కోట్ల డాలర్లు, ప్రత్తి ఎగుమతితో 430 కోట్ల డాలర్లు సంపాదించింది. నూనె పదార్ధాల ఎగుమతితో 240 కోట్లు, గార్లం పదార్ధ ఎగుమతితో మరో 330 కోట్ల డారల్లు స్వంతం చేసుకోగల్గింది. మొత్తంగా 2012-13వ సంవత్సరంలో వ్యవసాయోత్పత్తుల ఎగుమతి ద్వారా 3700 కోట్ల డాలర్లు సంపాదించగా వాటి దిగుమతులపై 1700 కోట్ల డాలర్లను వెచ్చించింది. ఆహార ఉత్పత్తులను ఎగుమతి చేసే పెద్ద దేశంగా స్పష్టంగా అవతరించింది. గత రెండు దశాబ్దాల కాలంలో ఇదే పరిస్థితి ఉన్నదంటే ఇది మనకు ప్రకృతి ప్రసాదిస్తున్న గొప్ప వరం. మొత్తం దేశ వ్యాపారంలో వ్యవసాయరంగ పాత్ర 1990లో కేవలం 5 శాతముండగా ఈనాడు 18 శాతానికి చేరడం ప్రోత్సాహం కలిగిస్తున్నది. పాలకులు ఈ రంగంపై తగు శ్రద్ధాశక్తులు చూపెడితే ఈనాటి పోటి ప్రపపంచంలో మన దేశం అంతరంగికంగానున్న పౌష్టికాహారలోపాన్ని సులభంగా అధిగమిస్తూ ప్రపంచానికే అన్నదాతగా వెలుగొందడం అసాధ్యంగానేకాదు!

ఒక సంవత్సరం ప్రపంచ దేశాల బియ్యం ఎగుమతి 3 కోట్ల 20 లక్షల టన్నులలో ఒకకోటి టన్నుల బియ్యాన్ని ఒక్క మన దేశమే ఎగుమతి చేయడం పెద్ద విషయమె కావచ్చు. అలాగని ధాన్యాల ఎగుమతిని ప్రధాన ఆదాయ వనరుగా భావించడం అంత ఆరోగ్యకరం కాకపోవచ్చు. ప్రపంచ మార్కెటులో ఈ ధరలు పడిపోవచ్చునుకూడా. వ్యవసాయ పంటలు ముఖ్యంగా బియ్యం, ధాన్యాలు, కూరగాయలు అత్యంత ప్రియమైన నీరు, విధ్యుచ్ఛక్తి లాంటి ఉపకరణాలపై ఆధారపడినవి. ఒక కె.జి. బియ్యాన్ని ఉత్పత్తి చేయడానికి మూడునుండి అయిదువేల లీటర్ల నీరు అవసరం. నీటినందించా లంటే ప్రియమైన విద్యుచ్ఛక్తి వాడకం అవసరం. వీటిపై గణనీయంగా సబ్సిడిని వెచ్చించడం గత్యంతరంలేని అవసరం. ఒకకోటి టన్నుల బియ్యం ఎగుమతి చేయడమంటే మూడు వేల నుండి అయిదువేల కోట్ల క్యూబిక్ మీటర్ల అరుదైన నీటిని ఎగుమతి చేసినంత భారం. ఇంతటి అపురూప ఉపకరణాలను వెచ్చించినప్పుడు వాటిపై విధించబడుతున్న ఎగుమతి పన్నులను పెంచె అంశం పునరాలోచించదగిందని శ్రీ గులాటి కమిటీ వారి నిశ్చితాభిప్రాయం. లేనిచో ప్రతి సంవత్సరం పెరగగలిగే ఆహార సరుకుల ఎగుమతుల ఫలితంగా దేశీయ వనరులు తీవ్రంగా తరిగిపోయే ప్రమాదముంటుంది.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈ ఉపకరణాలపై ప్రథమ ప్రాధాన్యతతో అరుదైన వనరులను వెచ్చిస్తున్నవి. ఒక కిలో బియ్యం ఉత్పత్తికి ఎన్ని లీటర్ల నీరు ఎంత విద్యుత్తు అవసరమో సంబంధిత శాస్త్రజ్ఞులు పేర్కొని ఇప్పటికే హోరెత్తుతున్నారు. వాటిని పొదుపరితనంతో వాడుకోవాలని హెచ్చరికలు చేస్తున్నారు కూడా. కాబట్టి కేంద్ర ప్రభుత్వం వీటి ఎగుమతులపై ప్రపంచ వాణిజ్య అనుభవాలు గల వారి సలహాలపై ఆధారపడుతూ ఎగుమతి సుంకాన్ని విధించడం అవసరం. దీని వలన వీటిపై వెచ్చించబడే సబ్సిడీలను తగుమోతాదుల్లో తిరిగి రాబట్టుకునే సావకాశం కల్గుతుంది. ఎగుమతి సుంకం దిగుమతి పన్నులు లాంటి అంశాలు మన దేశ ఆర్థిక స్థితిగతుల వెలుతురులో నిష్ణాతులైన అర్ధశాస్త్రవేత్తల

సలహాల ఆధారంగా చేయబడాలి. ఆనాలోచితంగా ఎగుమతి, దిగుమతుల నిషేదానికి గాని నియంత్రణ రహిత ప్రోత్సహకాలనివ్వడం కాని పనికిరాదు.

రైతులు, వ్యవసాయాధార పరిశ్రమల ప్రయోజనమే పై నిర్ణయాలకు కేంద్ర బిందువుగా నుండక తప్పదు. 12వ పంచవర్ష ప్రణాళికను ఆమోదించిన జాతీయ అభివృద్ధి మండలి దేశ సమ్మిళితాభివృద్ధికి వ్యవసాయం యొక్క ప్రధాన బాధ్యతను సుస్పష్టంగా ఎత్తి చూపడం గమనించదగినది. నీరు, విద్యుచ్ఛక్తి వినియోగం ఎంత కీలకమో నొక్కి వక్కాణించడం జరిగింది. గ్రామీణ మౌలిక సదుపాయాల నిర్మాణం గూడా దేశాభివృద్ధికి ఎంత అనివార్యమో ఎంత ప్రాణ ప్రదమో తెలియచేయడం కూడా జరిగింది.

ప్రస్తుతం మన దేశ బడ్జెటులో కనీసం రెండు లక్షల కోట్ల రూపాయలకు తగ్గకుండా పట్టణ, గ్రామీణ పేదలకి ఆహారం ఎరువుల సరఫరాలో సబ్సిడిపై వెచ్చిచిస్తున్నాం. ఈ మొత్తాన్ని అమాంతంగా తొలగించడం అర్హులైన పేదలకు తీరని ఆన్యాయాన్ని తలపెట్టినట్లవుతుంది. ఇందులో జరుగుతున్న అనేక అక్రమాలను అరికడుతూ దుబారాలను తొలగించగలిగితే పై రెండు లక్షల కోట్లను సగానికి సగం కుదించవచ్చును. అర్హులైన పేదలకెలాంటి అభ్యంతర ముండదు సరికదా సంతోషిస్తారు కూడా. ఇది జరగాలంటే వ్యవసాయశాఖ, గ్రామీణ యంత్రాంగం ప్రధాన బాధ్యతలను నిర్వహించక తప్పదు. ప్రజా ప్రంపిణీ వ్యవస్థలో 50 నుండి 60 శాతం పెట్టుబడులు వృధా లేక దుబారా అయిపోతున్నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులను గమనిస్తున్నవారేవరూ కాదనలేరు. ఆహార ధాన్యాల సేకరణ, నిలవ చేయుట, పంపకం చేయుటలో దశాబ్దాలుగా గూడు కట్టుకుని ఉన్న వ్యవస్థాగత, వ్యక్తిగత ఆనర్ధాలను తొలగించడం ప్రజా జీవితంలో ప్రమేయమున్నవారంతా దేశభక్తితో రాజకీయాలకతీతంగా పట్టుదలతో పరస్పర సహకారంతో చేయవలసిన కర్తవ్యం. ఈ నేపథ్యంలో కొత్తగా ప్రవేశపెట్టబడుచున్న " షరతులతో కూడిన నగదు బదిలి పథకం " అహ్వానించదగినదే. అర్హత గల లబ్దిదారులను ఎంపికచేసు కోవడంతో అందరి సహాయ సహాకారం అత్యవసరం. అలాగే ప్రియమైన ఎరువుల వాడకంలో 50 శాతంగా జరిగే వృధా ఖర్చును చైతన్యవంతులైన రైతులు నియంత్రించగల్గుతారు. పేద రైతులు తమ ధాన్యాన్ని ధాన్య సేకరణలో తక్కువ ధరలకే అమ్ముకోవలసి రావడం తిరిగి అదే ధాన్యాన్ని అధిక ధరలకు కొనడం, ఈ క్రమంలో దేశ సంపద వృధాకావడం, అవినీతి పెరగడం, అనర్ధదాయకంగానున్నది. సామ్రాజ్యవాద, రాచరిక వ్యవస్థల కాల దోషం పట్టిన ఆవశేషాల కొనసాగింపుగానున్నది. ఈ అరిష్టాన్ని వ్యవసాయరంగతోపాటు ఇతర రంగాలలో కూడా అరికట్టడమేకాదు, అంతమొందించడం జాతీయ కర్తవ్యం. నగదు బదిలి సూత్రాన్ని సమర్ధ వంతంగా ఉపయోగించకుండా రాజకీయ స్వార్ధాలతో దీన్ని సూత్రబద్దంగానె వ్యతిరేకించే వారి రాజనీతిజ్ఞత, దేశభక్తి ప్రశ్నార్ధకం. ఈనాడు అమెరికాతోపాటు అభివృద్ధి చెందిన దేశాలు తీవ్రమైన ఆర్ధిక మాంద్యంలో కూరుకుపోవడాన్ని గమనిస్తున్నాం. దాని తాకిడి వలన అసలే పేద దేశాలుగానున్న మన దేశంతో సహా ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా, మధ్య ప్యాశ్చాత్య దేశాలన్ని ఆత్మరక్షణలో బడి కొట్టుమిట్టాడుచున్నవి. ఉదాహరణకి 16 లక్షల కోట్ల డాలర్ల రుణాలకు వడ్డీలు కూడా చెల్లించలేక దారి తెన్నూ తోచని అమెరికా దేశ దీనావస్థ ప్రపంచ దేశాలన్నిటికి కనువిప్పు కల్గించాలి. దురాశ

దు:ఖానికి హేతువన్న సామెతను సార్ధకం చేసిన ఆర్ధిక దిగ్గజం అమెరికా అక్కడి జనాభాలో కేవలం ఒకే ఒక శాతంగానున్న కుబేరులు తమ ధన దాహంతో విశ్రుంఖల విలాసవంత జీవనశైలితో 40 శాతం సంపదను మేస్తున్న ఉదంతం ప్రపపంచ మానవాళి సహజ జీవితానికి తీరని కష్టనష్టాలను తెచ్చిపెట్టింది. మన దేశ ఆత్మరక్షణ చర్యలలో భాగంగా పెరిగిపోతున్న ద్రవ్యలోటు, ద్రవ్యోల్బణం, ఎగుమతి, దిగుమతుల మధ్య అంతరంలాంటి మౌలిక ఆర్ధిక రుగ్మతలను అరికట్టాలి. ఆర్ధిక క్రమశిక్షణను సాధించాలి. ఈ బృహత్కార్య సాధనలో పైనుదహరించిన సబ్సిడి నియంత్రణ ప్రధానం. ఆహార ధాన్యాల సరఫరాతోపాటు దేశ వ్యవసాయంలో అయిదెకరాలు అంతకులోపు సాగుభూమి కమతాలుగానున్న 44 శాతం భూమిని సాగు చేస్తున్న 85 శాతం సన్నకారు, చిన్నకారు రైతులు ఎరువుల వాడకాన్ని తగ్గించగల్గుతారు. ఆ మేరకు సబ్సిడి భారాన్ని కుదించగల్గుతారు. ప్రియమైన ఎరువుల దిగుమతి భారం తగ్గి దేశీయ ఎరువుల పరిశ్రమలు పూర్తి స్థాయిలో పనిచేయగల్గుతాయి. దీని వలన 15 నుండి 20 వేల కోట్ల ప్రజాధనాన్ని ఆదా చేయగల్గుతామని అంచనా. దీనికి తోడు గోధుమలు, బియ్యం లాంటి ఆహార ధాన్యాల ఎగుమతి లాభాసాటిగానుంటుంది. గోధుమల నిలువ ఇప్పటికే దేశ అవసరాల కంటె మూడు రెట్లుగా మించి పోయింది. ప్రతి సంవత్సరం వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి ద్వారా 3700 కోట్ల డాలర్లు సంపాదించగా 1700 కోట్లు డాలర్లను వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై వెచ్చిస్తున్నాం. మంచి లాభసాటి వ్యాపారమే చేస్తున్నాం. అనవసరంగానున్న ధాన్యం నిలువల నుండి వెయ్యి టన్నుల ధాన్యాన్ని ఎగుమతి చెయగల్గినా కనీసం 16000 కోట్ల రూపాయల్ని ఏలాంటి సబ్సిడీలు లేకుండా సంపాదించుకోగల్గుతాం. ఈ విధంగా ఆర్ధిక లోటును క్రమంగా తగ్గిస్తూ, దేశ వార్షిక ఉత్పత్తిరేటును పెంచుకోగల్గుతాం. మన ప్రజలకు విలాసవంతమైన జీవితాలు అక్కరలేదు. కష్ట జీవులుగా పౌష్ఠికాహారం సుఖసంతోషాలతో బ్రతకడం వారికి మహాభాగ్యం, మహదానందం.

పాడి పరిశ్రమలో భారతదేశానికి తలమానికంగానున్న గుజరాత్ రాష్ట్రంలోని ఆనంద్‌లో గల సహకార పాడిపరిశ్రమ ప్రపంచానికే మార్గదర్శకమనిపించుకుంటున్నది. ఈ అముల్ డెయిరీ యొక్క మేనేజింగ్ డైరెక్టర్‌గారైన శ్రీ రాహుల్ కుమార్ గారు పశుపోషణ ప్రాధాన్యతపై తమ అనుభవాలను చక్కగా వివరిస్తున్నారు. ఆహార భద్రతా చట్టం దారిద్ర రేఖకు దిగువగానున్న పేదలకెంత అవసరమో నోరులేని పశువుల సంరక్షణ అంతే అవసరమని తెలియచేస్తున్నారు. దేశంలో 120 కోట్ల జనాభాలో 70 శాతంగానున్న 80 కోట్ల జనాభాకి పౌష్టికాహార అవసరాలను తీర్చే పాడిపరిశ్రమ, కోళ్ళ పరిశ్రమ, మత్స్య పరిశ్రమల ప్రాధాన్యతను ఏ మాత్రం తగ్గించి చూడరాదు. ప్రపంచంలోనే ప్రధమ స్థానాన్ని అలంకరించిన ఈ పశుసంపద దేశ వ్యవసాయ ఉత్పత్తిలో 25 శాతం భాగాన్ని సమకూర్చుచూ దేశ ప్రజల పౌష్టికాహార అవసరమైన 'ప్రోటీన్'ను అందచేస్తున్నది. మూడున్నర కోట్ల రూపాయల విలువగల పాల ఉత్పత్తి 90 వేల కోట్ల రూపాయల విలువగల చేపల పెంపకం, 45 వేల కోట్ల రూపాయల విలువగల కోడిగ్రుడ్లు, కోడిమాంసం ఉత్పత్తితో ఆహార భద్రతలో కీలకమైన పాత్రను పోషిస్తున్నది. సంఖ్యలో 30 కోట్లున్న పాడి పశువులు 2013-14 సంవత్సరాంతానికి ఒక కోటి 35 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి చేస్తూ 90 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేసే అమెరికా దేశ పాడి పరిశ్రమను రెండవస్థాయికి నెట్టే అవకాశమున్నది. అమెరికా జనాభా 30 కోట్లు కాగా భారతదేశ జనాభా అందుకు

నాల్గురేట్లు అధికమనే వాస్తవాన్ని మరువరాదు. ప్రోటిన్ ఉత్పత్తి చేసే డెయిరీ, పౌల్ట్రీ, ఫిషరీస్ పరిశ్రమలను ఎంత విస్తరించినా అది ఈనాటి జనాభా యొక్క కనీస అవసరాలకు తక్కువే అవుతుంది.

భారతదేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తిలో నిరుపయోగంగా అగుపించే గడ్డి, చొప్ప, ఊక తవుడులాంటి పదార్ధాలు పాడిపరిశ్రమ, కోళ్ళ పరిశ్రమలో ఆహారంగా ఉపయోగపడే ప్రత్యేకత ఉన్నది. మనం పండించే 95 లక్షల మెట్రిక్ టన్నుల గోదుములు, 105 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం, 7.5 లక్షల మెట్రిక్ టన్నుల నూనె గింజలలోని ముతక పదార్ధాలు పాడిపరిశ్రమ తదితర పశుపోషణ ప్రక్రియల ద్వారా విలువైన ప్రోటిన్‌గా మార్చబడి సమాజానికి పుష్టికర ఆహారంగా వినియోగపడడం ప్రకృతి ఇచ్చిన వరం. కీ॥శే॥ వర్గీస్ కురియన్ గారి చొరవ అంకితభావం, సృజనాత్మకతల ఫలితంగా 1970 నాడు కేవలం 20 వేల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేసిన ఆనంద్‌లోని పాడిపరిశ్రమ 2000 సంవ త్సరాంతానికి 80 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని సాధించింది. 30 సంవత్సరాల కాలంలో ఈ పెరుగుదల నాల్గురేట్లు దాటింది. ఇజ్రాయిల్ దేశం ఈ పాడిపరిశ్రమ అభివృద్ధికి పెట్టింది పేరు. ఆ దేశంతో పోటిపడాలంటే పశుపోషణలో పశువులకు పౌష్టికాహారాన్ని సమకూర్చడం చాలా అవసరం. పౌష్టికాహరలోపం గోధములు, బియ్యం లాంటి ఆహార ధాన్యాలను అధికంగా సరఫరా చేయడం కాని అతి చౌకగా సరఫరా చేయడం ద్వారా గాని పూడ్చబడదు. పరిశుభ్రమైన తాగునీరు, పండ్లు ఫలాల అందుబాటు, ప్రొటిన్‌లు అధికంగానుండే పాలు, పెరుగు, గ్రుడ్లు, మాంసాల వాడకం ద్వారానే తొలగిపోతుంది. దానికి కావలసింది. మిగులు ద్రవ్యం. ఆహార భద్రతా చట్టం ఈ వాస్తవాన్ని గుర్తించడంలేదు.

రెండు శాతం ప్రపంచ భూబాగంలో ప్రపంచ పాడిపశువుల్లో 17 శాతంగా గల మన పాడిపశవులు మనుషులలాగే పౌష్టికాహారలోపంతో భాధపడుచున్నవి. ప్రతి ఈతలో ఇవ్వవలసిన పాలు అభివృద్ధి చెందుతున్న దేశాల సరాసరికి తగ్గుచున్నది. పశువులకు మంచి పౌష్టికాహారాన్ని అందించడంద్వారానే అధికోత్పత్తిని సాధించగల్గుతాం. ఎండుగడ్డి లోటు 25 శాతం, 65 శాతం పచ్చిమేత లోటు, 60శాతం దానాలోటుతోనున్న మన పశువులు తగు మాంసకృతులు గల ఉత్పత్తులనివ్వలేవు. దేశం ప్రతి సంవత్సరం రెండు లక్షల టన్నుల తవుడు మరియు 8500 కోట్ల రూపాయల విలువగల నూనెగింజల పిండిని ఎగుమతి చేస్తున్నది. పశుపోషణ చౌకగా జరగాలంటే ఈ ఎగుమతులు వెంటనే నిలిపివేయాలి.

## గనులు

రైతును అతని ఆదాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న గనుల విధానాన్ని తీవ్రంగా ఆలోచించి సంస్కరించవలసియున్నది. గనుల త్రవ్వకంలో రైతు కేవలం బాధితుడేగాక తన స్థిరాస్తిని_కోల్పోతున్న యజమానిగూడా కాబట్టి గనుల విధాన రూపకల్పన చేసే ప్రభుత్వం దీర్ఘాలోచన చేసి మానవీయ దృక్పధంతో వ్యవహరించాలి. ఒరిస్సా రాష్ట్రంలోని నియంగిరి కొండలలో నిక్షిప్తమైన బాక్సైట్ గనుల త్రవ్వకం కేసులో గనుల యాజమాన్యం సమస్యలు దేశంలో స్పష్టంగా వెలుగులోకి వచ్చినవి. కోర్టులిచ్చిన విభిన్న తీర్పుల వలన గందరగోళం పెరిగింది కాని ఎవరి యాజమాన్యమెంత అను అంశం తేలలేదు. సమగ్ర ఆలోచనలతో స్పష్టంగా రూపొందించే చట్టం. ఈ అంశంతో మార్గదర్శకత్వం వహించాలి.

సుప్రీంకోర్టు ద్వారా వెలువడిన తీర్పులు పరస్పరం విరుద్ధంగా ఉండడం ఆశ్చర్యకరం. గనులు దేశ ప్రజలందరికి చెందినవిగాబట్టి దేశ ప్రభుత్వం మాత్రమే వాటిపై యాజ మాన్యపు హక్కు కల్గియుంటుందని ఒక తీర్పులో పేర్కొంటే, మరో తీర్పులో గనులు ఎవరి భూగర్భంలోనుంటే వారే వాటికి యజమానులౌతారని ప్రకటించడం జరిగింది. కొన్ని ప్రాంతాలలో ఎవరి యాజమాన్యంలేని భూములు, అడవులున్నవి. అక్కడ నివాసముంటూ అడవి సంపదపై ఆధారపడి బ్రతికే ఆటవిక జాతులున్నవి. కాబట్టి లక్షలాది గిరిజనులు, గ్రామస్థులు నివసించే ప్రాంతాల ప్రజలందరికి గనులపై యాజమాన్యపు హక్కును కల్పించాలి. తద్వారా సమకూరే ఆదాయంలో గణనీయమైన భాగంపై స్థానికులకు యాజమాన్యపు హక్కులను స్పష్టపరచాలి. రత్న గర్భయను నామమొందిన దేశం బొగ్గనుగాని తదితర ధాతు సంబంధమైన ముడిసరుకుల్ని దిగుమతి చేసు కోనవసరంలేదు.

## రైతులు: వ్యవస్థీకృత రిటైల్ వ్యాపారంతో విదేశీ పెట్టుబడులు

వ్యవసాయం యొక్క సామాజిక లక్ష్యం కేవలం పంటలను పండించడ మొక్కటేకాదు, పండించే రైతు జీవితంలో సంతృప్తిని సంతోషాన్ని పండించడం వాటిని సమకూర్చడం గూడా. ఈధృక్పధంతో సాత్వికంగా లోతుగా ఆలోచిస్తే భూమితో పాటు, నీరు, ఎరువులు, విద్యుచ్ఛక్తి, గిడ్డంగులు శీతల గిడ్డంగులు, రోడ్లు, రవాణా సౌకర్యాలు, మార్కెటు వ్యవస్థ ఎగుమతి దిగుమతి వ్యాపారాలన్ని వ్యవసాయ దారుల జీవితాల్ని తీవ్రంగా ప్రభావితం చేసే కీలకాంశాలె. వ్యవసాయానికి అనుకూలం, ఉపాధికల్పనలో ప్రధాన పాత్రను పోషించే వ్యవ సాయరంగంలో ఆరున్నర దశాబ్దాల స్వాతంత్ర్యానంతర సుదీర్ఘకాలంలో ప్రాణప్రదమైన పై మౌళిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉండడం పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా ఉన్నది. పౌర సమాజానికి తలవంపుగాఉన్నది. వివిధ అంచనాల ప్రకారం మనదేశ వార్షికాదాయానికి మించిన పెట్టుబడిని వెచ్చిస్తే గాని పై కనీస సౌకర్యాల నిర్మాణం సాధ్యపడదు. దశాబ్దాలుగా లోటు బడ్జెట్లు, వడ్డీలుగూడా చెల్లించజాలని రుణభారం, సబ్సిడీ భారంతో చతికిలబడి పోతున్న మన ఆర్ధిక పరిస్థితి పై సవాళ్ల నెదుర్కొనే శక్తిని సంతరించుకోలేక పోతున్నది. తీవ్రమైన ఆర్ధిక సంస్కరణలను చేబడుతూ ఒక తీరానికి చేరే ప్రయత్నంలో కొట్టుమిట్టాడుచున్నది. 1991 తర్వాత ప్రారంభించబడిన ఆర్ధిక సంస్కరణల ఫలితంగా దేశం వివిధ రంగాలలో ముందడుగు వేస్తున్నట్లు విశ్వాసం కల్గుచున్నది. గత రెండు దశాబ్ధాల కాలంలో వివిధ శాఖలలో విదేశీ పెట్టుబడుల వినియోగం స్వదేశీ పెట్టుబడుల ఉపయోగం సత్ఫలితాలనిస్తున్నట్లు రాష్ట్ర, కేంద్ర ఆదాయ వ్యయాల పెరుగుదలలు రుజువు చేస్తున్నవి. సంఘటిత రిటైల్ వ్యాపారంలో విదేశీ పెట్టుబడులకు ఆస్కారం కల్పిస్తూ చేసిన నిర్ణయం పై లక్ష్యసాధనలో ఒకటి. వనరులను సమకూర్చుకోవడం మౌలిక సదుపాయాల సత్వర నిర్మాణం, ఫలితంగా వ్యవసాయాదాయాన్ని ఇతోధికం చేయడం గ్రామీణ నిరుద్యోగాన్ని తగ్గించడం, క్రమంగా తొలగించడం గొప్ప జాతీయ కర్తవ్యం. ఆదాయాలలో కొంత పెరుగుదల, వినియోగదారుల చైతన్యం పెంపొందటం వలన వారి ఆహార అలవాట్లలో చెప్పుకోదగిన మార్పు కనబడుచున్నది. పాల ఉత్పత్తుల వినియోగం కూరగాయలు, మాంసాదుల వాడకంలో వారి ఆసక్తి దీన్ని రుజువు చేస్తున్నది. వీటి ఉత్పత్తికి పెట్టుబడులు అధికంగా అవసరమవుచున్నది. ఇవి త్వరగా చెడిపోయేవి కాబట్టి వాటిని శీతల గిడ్డంగులలో భద్రపరుస్తూ త్వరత్వరగా రవాణా చేయడం పట్టణాలకు అంద జేయడం అవసరం. అలా చేయలేని

పరిస్థితులలో రైతులు తాము కష్టపడి ఉత్పత్తి చేసిన పాడి పంటలలో కనీసం మూడవవంతు కుళ్ళి పాడవడమేకాక వెచ్చించిన పెట్టుబడిలో 15 శాతం వరకూ మాత్రమే తిరిగి పొందగల్గుతున్నారు. మార్కెటు చట్టాల సంస్కరణలు మాత్రమే రైతు రక్షణ చర్యగా ఉపయో గపడగల్గుతాయి. రిటైల్ వ్యాపారంలో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం వలన వ్యవసాయ ఆధునికీకరణ, పంటల పరిరక్షణ, వాటి లాభసాటి వ్యాపారం సుసాధ్య మౌతుంది. స్వదేశీ పెట్టుబడులకు అవకాశమున్నా ఆచరణలో అది ఏమాత్రం సరిపోక సంతృప్తికర అభివృద్ధి కనబడడంలేదు.

ఉత్పత్తిదారులు, వినిమయదారుల మధ్య సరుకులు ఒకటి రెండు కాదుగదా 5-6 చేతులు మారడం ఎవరి లాభాలు వారు ఏదో విధంగా దండుకోవడం, ఫలితంగా ఉత్పత్తిదారుడు, వినిమయ దారులు తీవ్రంగా నష్టపోవడం జరుగుతున్నది. కొందరు దళారులు ఆహార సరుకుల కల్తీకి గూడా తెగిస్తున్నారు.

దేశంలో రిటైలు వ్యాపారస్థులుగానున్న సుమారు మూడు కోట్ల చిల్లర వ్యాపారస్థులు విదేశి, స్వదేశి గుత్త పెట్టు బడిదారుల రంగ ప్రవేశం కారణంగా, తమ చిల్లర వ్యాపారాలు కోల్పోయి నిరు ద్యోగులుగా రోడ్డపై పడిపోతారనే విమర్శ ప్రబలంగా జరుగుతున్నది. సాంకేతికాభివృద్ధి, ఆధునికతల కారణంగా, ఈనాటి పోటీ ప్రపంచంలో ఈ పరిణామం తప్పదనడంలో కొంత సత్యం లేకపోలేదు. జౌళి పరిశ్రమతో పాటు అనేకానేక వస్తూత్పత్తి పరిశ్రమలలో కొందరు నైపుణ్యతలేని కార్మికులు, వ్యాపారస్థులు తాత్కాలికంగా దెబ్బతినడం అనివార్యం, బాధ్యతలెరిగిన పాలకులు ఇలాంటి పరిణామాలనూ ఊహించి తగు జాగ్రత చర్యలను చేపట్టాలి. ఆయా శాఖలకు తగు కనీస సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చే ఏర్పాట్లన్ని సకాలంలో చేయాలి. వారు ఆధునికీకరణ ప్రక్రియల్లో ఇమిడి పోవడమో, స్వయం ఉపాధి సాధించే విధంగా తోడ్పడటమో జరగాలి.ఐనా ఈ మార్పు క్రమంగా జరిగేది. ఎంత పెద్దపెట్టుబడి దారులైనా చిన్న చిన్న విషయాలన్ని టిని పరిగణలోకి తీసుకున్న తర్వా తనే పెట్టుబడిని వెచ్చిస్తారు. ఏమయినా కాలంముందుకే వెళ్ళుతుంది కాని ఆగదు. కాలానుగుణ్యంగా సంబంధితులు సంస్కరించు కోవడం యుగధర్మం.

ఈ రంగంలో విదేశీ పెట్టుబడుల ఆహ్వాన విధానంలో రైతాంగానికి గ్రామీణులకు అత్య వసరమైన ఒక అంశం గమనార్హం. 51 శాతం విదేశీ పెట్టుబడిలో ఖచ్చితంగా 50 శాతం నిధులను ఆయా రాష్ట్రప్రభుత్వాల సూచనల మేరకు అక్కడి మౌలిక సదుపాయాల నిర్మాణంపై వెచ్చించాలి. ఆ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి. వనరుల కొరత లోటు బడ్జెట్లతో సతమతమవుతున్న కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఈ సదవకాశాన్ని గ్రామీణాభివృద్ధికై ఉపయోగించుకోగల్గుతాయి. రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులతోనే ఈ విధానం అమలు జరుగుతుంది. ఆహార ఉత్పత్తులు వాటి తయారీ పరిశ్రమల అవసరం కాలక్రమేణా పెరుగుచున్నది. పండ్లు ఫలాలు ప్రాసెసింగ్ పరిశ్రమల డిమాండు అత్యధిక మైనది. ఇది సాధ్యపడాలంటె వ్యవసాయరంగం బహుముఖంగా విస్తృతపరచటం నిపుణతగల శ్రామి కులకు ఉపాధిని కల్పించడం తక్షణావసరం. అందుకే పెద్దగా పెట్టుబడులు అవసరం. దీనివలన కిరాణా షాపులన్ని మూత బడిపోతాయని చిన్నవర్తకులు నష్టపోతారని చివరకు తోపుడు బండ్లతో పండ్లు కూరగాయలమ్ముకునే వారు నిరుద్యోగులవుతారనే కువిమర్శలకేలాంటి అర్థంలేదు. చైనా,

తదితర ఆసియాదేశాల అనుభవాల వెలుతురులో రిటైల్ వ్యాపారాన్ని వ్యవస్థాగతం చేయడం వలన చిల్లర వర్తక వ్యాపారులు, రెండు మూడు దశాబ్దాలకాలం వరకు తమ సంఖ్యా బలాన్ని పెంచుకుంటారు తప్ప తగ్గరు. ఐతే దీర్ఘకాలంలో మొత్తం వ్యాపారంలో వారి సంఖ్యాశాతం తగ్గుతుంది. కాబట్టి అన్ని రంగాలలో శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని ఆహ్వానించక తప్పదు. ఈనాడు వ్యవసాయం చేసే రైతుల్లో 80 శాతం చిన్నకారు, సన్నకారు రైతులే. వారు సమైక్యంగా పరస్పర సహకార సంఘాల ద్వారా బహుళార్ధ కార్యక్రమాలను చేపడుతూ సమ్మిళితాభివృద్ధిని సాధించాలను కుంటున్నారు. రైతునాయకులు, రాజకీయ మార్గదర్శకులు అటువంటి సహకార వ్యవస్థలను నిర్మిస్తూ నిర్మాణాత్మక పాత్ర నిర్వహించగలిగితే దేశ విదేశీ పెట్టుబడి దారులు, వారి పెట్టుబడులు ఎంతోకాలం అవసరముండదు. లేనిచో వ్యవసాయ వృత్తి తన ఉనికిని గూడా కోల్పోతూ విదేశీ దిగుమతులతో తప్ప ఆహార అవసరాలను తీర్చుకోవలసిన పూర్వపుగతి పునరావృత్తంగాక తప్పదు. కాబట్టి పెట్టుబడి దేశానిదయినా, విదేశాలదైనా అది సృజనాత్మకత, మౌలిక సదుపాయాల కల్పన. వ్యవసాయోత్పత్తుల ప్రోసెసింగ్ పరిశ్రమల్లో కొద్దిపాటి నైపుణ్యతతో అనేకులకు ఉపాధి సమకూర్చుతుంది. కిరాణాషాపులన్ని మూతబడి పోతాయని తోపుడుబండ్ల వారంతా రోడ్లపై పడిపోతారనేది పసలేని ప్రచారం మాత్రమే. ఇలా తాత్కాలిక రాజకీయ లబ్దిని ఆశించి గొంతు చించుకునే వారు తోటి ఆసియాదేశాలు, ముఖ్యంగా చైనాదేశ అనుభవాలను విశ్లేషించడం అవసరం.

వ్యవసాయం ఆహర భద్రతకు కీలకంగా డెయిరీ, పౌల్ట్రీ, ఫిషరీ పరిశ్రమలు పౌష్టికాహరానికి మూలం. పౌష్టికాహరలోపం కారణంగా దేశంలో అత్యధికులైన పిల్లల తల్లులు, వృద్ధులు అనారోగ్యానికి గురికావడం అకాల మరణం చెందడం పెద్ద జాతీయ ఆరోగ్య సమస్యగా గుర్తింపుపొందింది. మాంసకృతులతో కూడిన ఆహరం మాత్రమే పుష్టినిస్తుంది. రోగనివారణ జేస్తుంది. పట్టణ గ్రామ సీమల్లో నివసించే సుమారు 80 కోట్ల జనాభాకి తలసరి 5 కే.జి.ల మేరకు ప్రతినెలా ఆహారాన్ని అందించే బాధ్యతను స్వీకరించే ప్రభుత్వం పౌష్టికాహరాన్ని సృష్టించే పై రంగాల గురించి గూడా తన దృష్టిని సారించడం అవసరం. దేశంలో వ్యవసాయ ఉత్పత్తిలో 25 శాతం భాగం పంచుకునే పాడిపరిశ్రమ, కోళ్ళ పరిశ్రమ, మత్స్య పరిశ్రమల అభివృద్ధికై తీవ్రమైన ఆలోచనతో పెట్టుబడులను కేంద్రీకరించడం అవసరం. ఇప్పటికే మనం 3,50,000 కోట్ల రూపాయల విలువగల పాల ఉత్పత్తిని జేస్తున్నాం. 90 వేల కోట్ల రూపాయల విలువగల చేపలు, 45 వేల కోట్ల రూపాయల విలువలగల కోడిమాంసం, కోడిగుడ్లను ఉత్పత్తి చేస్తున్నాం. ప్రపంచంలో మనమే ప్రధమం. వ్యవసాయం దీనికి మాతృక.

సుమారు 70 కోట్ల మందికి ఆహార భద్రతను కల్పించే ప్రభుత్వ విధానం 30 కోట్లకు మించిన పాడిపశువులకు గూడా ఆహార భద్రత కల్పించాలి. వాటి ఉత్పత్తులు పెంచాలి. వాటికి దాణాగా ఉపయోగపడే పదార్ధాల ఎగుమతిని నియంత్రించాలి. దాన్ని చౌకగా పశుపోషణ జేసే రైతులకందచేయాలి. పౌష్టికాహర సరఫరాకై ఈ చర్యలు అవసరం. మార్కెటు సిద్ధాంత రహస్యం సరుకుల ఉత్పత్తి దార్లు, వాటిని కొనే వారి మధ్య విశ్వాసాన్ని సమరసభావాన్ని కల్పించి వ్యాపారాన్ని ఉభయ తారకం చేయడమే. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ చట్టం ఈ మూల సూత్రాన్ని విస్మరిస్తూ

వ్యవసాయదారులకు కంటకంగా మారిపోయింది. మార్కెటు పన్నుభారముతోపాటు మధ్య దళారీల జోక్యానికి ఆస్కారం కల్పిస్తున్నది. రైతులు ఆర్థికంగా తీవ్రమైన కష్టనష్టాలకు గురిచేయబడుతున్నాడు. త్వరగా కుళ్లిపోయి చెడిపోయే పంటల వ్యాపారం అత్యంత కష్టసాధ్యమై పోతున్నది. కాబట్టి అసలు వ్యవసాయ ఉత్పత్తుల ప్రాధమిక మార్కెటింగు చట్టాన్ని పూర్తిగా ఎత్తివేయడం చాలా అవసరం. వ్యవసాయరంగ ప్రాధాన్యత తెలియని కాలంలో ప్రభుత్వ ఆర్థిక వనరులను పెంచుకునే ఆలోచన పరులు తలపెట్టిన రైతు వ్యతిరేక చట్టమిది. రైతాంగాన్ని రక్షించాలంటే చేతికందిన పంటను చేతులారా కొల్పేయే బాధనుండి రైతును విముక్తి చేయాలి. గుజరాత్ రాష్ట్రంలో కుళ్లి చెడిపోయే ఉత్పత్తులకు మార్కెట్ చట్టం నుండి మినహాయించడం జరిగింది. బీహార్ రాష్ట్రంలో శ్రీ నితీష్ కుమార్ ప్రభుత్వం అసలు వ్యవసాయోత్పత్తుల చట్టాన్నే తొలగించడం జరిగింది. దేశ వ్యాపితంగా ఈ చట్టాన్ని రద్దు పర్చడం రైతాంగానికి గొప్ప సహాయాన్ని అందించినట్లుగానుంటుంది. ఇతర మౌలిక సౌకర్యాలలాగే మార్కెట్ యార్డులను ప్రభుత్వమే నిర్వహించడం, వ్యాపారంలో ప్రభుత్వ జోక్యాన్ని లేకుండా చేయడం, కొనుగోలుదారులు సరుకుల నాణ్యత ఆధారంగా పోటీలో కొనుగోలు జేయడం జరిగితే అటు రైతులు, ఇటు కొనుగోలు దారులకి మధ్య స్వేఛ్ఛా వ్యాపారం జరిగి ప్రజలందరికి సంతృప్తి సమకూరుతుంది.

బయో టెక్నాలజి వినియోగం ద్వారా ఆహారోత్పత్తుల నాణ్యత, వాటి దిగుబడిని పెంచే ఆత్యాధునిక వ్యవసాయంపైనున్న భిన్నాభిప్రాయాలను ఒక కొలిక్కి తేవడం అత్యవసరం. ప్రపంచ వ్యాపిత అనుభవాల వెలుతురులో ఈ చర్చను సుఖాంతం చేయాలి. ప్రజాబాహుళ్యం ఆరోగ్యం, అవసరం ముఖ్య మార్గదర్శకాలుగానుండాలి.

ప్రధమ హరిత విప్లవం మాగాణి పంటలలో విప్లవాత్మకంగా ఉండగా రెండవ హరిత విప్లవం మెట్ట వ్యవసాయంలో విప్లవాత్మక మార్పును సాధించాలి. అలాగే మూడవ హరిత విప్లవం జీవ, జన్యు శాస్త్రాన్ని వ్యవసాయానికి వర్తించే విధంగా ఆలోచించాలి. జీవ జన్యుశాస్త్రం ప్రపంచ వ్యాపితంగా అత్యున్నత శిఖరాలనందుకుంటున్నది. మానవారోగ్యం, పశు పక్ష్యాదుల పోషణ పరిరక్షణ, విద్య, పారిశ్రామికాభివృద్ధి మరెన్నో రంగాలలో ఉపాధి, ఉద్యోగ కల్పనతోపాటు అసలు మానవ జీవితాన్నే మార్చివేసే మహితాత్మక శాస్త్రమిది. ఇందులో మన దేశం చాలా వెనకబడియుండడం మన దౌర్భాగ్యం. దీనిపై శ్రద్ధాసక్తులను కల్పిస్తూ దీన్ని అభివృద్ధి చేయనిదే శరవేగంగా ముందడుగులు వేస్తున్న ఈ రంగంలో మన పాత్ర శూన్యమవుతుంది. జీవ వైవిధ్యతలో అగ్ర తాంబూలం పుచ్చుకున్న మనదేశం ఈ శాస్త్రీయరంగంలో అత్యంత వేగంగా ముందడుగు వేయగల్గుతుంది. పరిమాణాత్మకంగా, గుణాత్మకంగా గూడా సాయుధులైన లక్షలాది యువతీయువకులకు ప్రపంచవ్యాప్తంగా ఉపాధి ఉద్యోగాలను సమకూర్చగల్గుతుంది. వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంపై ఎడతెగని చర్చలు జరుగుచున్నవి. వీటి వాడకం ఫలితంగా ప్రజల ఆరోగ్యం చెడిపోతున్నదని గొప్ప ప్రచారం. అంతేకాదు ఇవి క్యాన్సర్‌లాంటి ప్రాణాంతక వ్యాధికి కారకాలని, పుట్టె బిడ్డలు వికలాంగులుగా పుడతారనే విష ప్రచారంకూడా జరుగుచున్నది. శాస్త్రజ్ఞులెవరూగూడా పై వాదన శాస్త్రబద్ధమని గాని హేతబద్దమనిగాని చెప్పడం లేదు. సంఘ సేవకులమని చెప్పుకునే వారిలో కొందరు, వాణిజ్య వ్యాపార వర్గ ప్రయోజనాల పరిరక్షకులు కొందరు పై వాదనను లెవనెత్తుచున్నట్లగు

పడుచున్నది. మార్పును స్వీకరించడంలో ప్రజాబాహుళ్యం సహజంగానే అనుమానం, భయంలాంటి మానసికతత్వంతో సంకోచిస్తారు. కొన్ని విజయవంతమైన ప్రయోగాలను కండ్లారా చూచిన తర్వాతనే మార్పుకు సిద్ధపడతారు. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం ఫలితంగా పంటల దిగుబడి బాగా పెరిగిన ఉదాహరణలు ప్రపంచ వ్యాప్తంగానున్నవి. అంతేకాదు జన్యుమార్పిడి ప్రక్రియల ద్వారా పంటల నాణ్యతలను ఇను మడించిన ఆశ్చర్యకర ఆవిష్కరణలను జన్యు శాస్త్రజ్ఞులు రంగ ప్రవేశం చేసినారు ఇది పౌష్టికాహారాన్ని అందించడానికి అపారంగా తోడ్పడుతుందని రుజువు చేసినారు కూడా. పాశ్చాత్య దేశాలతోపాటు ఆసియా ఆఫ్రికాదేశాలు ఈ మార్గాన్ని అనుసరిస్తూ సత్ఫలితాలను పొందుతున్నవి. చైనాగురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ప్రతి శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణను అనతికాలంలోనే ఉపయోగించే నాయకత్వం అక్కడున్నది. మనదేశంలో 14 కోట్ల 80 లక్షల హెక్టార్ల భూమి వ్యవసాయం చెయబడగా జనాభాలో మనకంటే మించిన చైనాలో 12 కోట్ల 80 లక్షల హెక్టార్ల భూమి మాత్రమే వ్యవసాయంలో ఉన్నది. మనకంటే 200 శాతం రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు 300–400 శాతం అధికంగా వాడుచున్నారు. ప్రపంచ ఆహార సంస్థ అంచనా ప్రకారం భారతదేశ వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడి విలువ 90 వేల కోట్ల డాలర్లు. రసాయనిక ఎరువుల వాడకం, క్రిమిసంహారక మందుల వినియోగం గురించి ఇంతకు మించిన తర్కం అనవసరం. అజ్ఞానం వలన భూసార పరీక్షలు నిర్వహించకుండా ఎరువులు వాడి నష్టపడిన ఉదంతాలనేకమున్నవి. యూరియా వాడకం అందులో ముఖ్యమైంది. సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువులతో రసాయనిక ఎరువుల్ని వివిధ మోతాదుల్లో కలిపి వాడకం వలన పంటల దిగుబడి పెరగడంతోపాటు భూసార సంరక్షణ జరుగుతుంది. శాస్త్ర శాంకేతిక పరిజ్ఞాన వెలుతురులో వ్యవసాయ శాస్త్ర నిపుణుల సలహాలను పాటించడం ఈనాటి వ్యవసాయానికి అత్యంత ఉపయోగం.

# 3. పరిశ్రమలు

దేశ పారిశ్రామికాభివృద్ధిలో భారీ పరిశ్రమల పాత్ర గురించి అధికంగా చెప్పవలసిందేమి లేదు. అభివృద్ధి చెందుచున్న దేశాలలో భారీ పరిశ్రమలు కొత్త పరిశ్రమల ఏర్పాటుకు దోహదం చేసే పరిశ్రమల అభివృద్ధి రేటులో మనదేశం ఇంకా చాలా వెనకబడే ఉన్నది. 1991 నాటి సరళీకరణ తర్వాత దేశ విదేశీ పెట్టుబడులు ఈరంగంలో గణనీయంగా వినియోగించడం కారణంగా ఈరంగం అభివృద్ధి మార్గాన నడుస్తున్నది. బ్యాంకులు నిర్ణయించే వడ్డీరేట్లు, ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానం అందులోని అనేక ఇబ్బందులు ఇంకా కొనసాగడం కారణంగా అభివృద్ధిలో అగ్రగామిగా ఉపయోగపడే పరిశ్రమలు ఇంకా ఆశించిన విధంగా అభివృద్ధి చెందడం లేదు. ప్రపంచీకరణ, సరళీకరణల ఫలితంగా ఆత్యా ధునిక భారీ పరిశ్రమలనుగూడా అభివృద్ధి చెందిన దేశాలనుండి దిగుమతి చేసుకోవడం లాభసాటిగా ఉండడం ఒక విధంగా ఉపయోగకరంగా ఉంటున్నది. పరిశ్రమలన్నిటిలో వస్తూత్పత్తి పరిశ్రమ అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తున్నది. ఈనాటి వినిమయ ప్రపంచమంతా నాణ్యతగలిగిన అందమైన, అందుబాటు ధరలకు దొరికె వస్తు వాహనాలపై తమ ఆలోచనల్ని కేంద్రీకరిస్తున్నది. పెరిగిపోతున్న మధ్య తరగతి కుటుంబాలు గొప్ప మార్కెట్లుగా అవతరిస్తున్నవి. భారత దేశం, తమ దేశంలోనే విస్తారంగానున్న మధ్య తరగతి వర్గాలకు వివిధ వస్తువులను సరఫరా చేయగల్గుతున్నది. అందుకు కావలసిన ముడి సరుకులు, మానవ వనరుల కొరత లేనే లేదు.

కేంద్ర ప్రభుత్వం పంచ వర్ష ప్రణాళికల ద్వారా రానున్న 15 సంవత్సరాలలో 10 కోట్ల మందికి ఉపాధిని కల్పించాలని సంకల్పించింది. భారీ పరిశ్రమలతో పోల్చినప్పుడు వస్తూత్పత్తి పరి శ్రమలలో ఉపాధి అవకాశాలు, విస్తరించి అందులో నైపుణ్యతగల కార్మికుల శ్రమ అత్యధికంగా అవసరమవుతున్నది. సగటు దేశీయ ఉత్పత్తిలో ఈనాడు వస్తూత్పత్తికి గల 16 శాతం పాత్రను 2025 నాటికి 25 శాతానికి పెంచాలని నిర్ణయించింది. అది సాధ్యపడాలంటె వస్తూత్పత్తి పెరుగుదల వేగం జి.డి.పిలో 3 శాతమైనా ఉండాలి. సరుకుల నాణ్యత, ఆకర్షణ పెరిగితే వాటి ఎగుమతికి మంచి అవకాశాలున్నవి. అది విజయవంతమైతే ఎగుమతులు, దిగుమతుల మధ్య ఈనాడున్న తేడా (కరెంటు అకౌంటు లోటు) తగ్గి సమతుల్యాన్ని సాధించుకోగల్గుతాం. కానీ "వాషింగ్టన్ కాన్సెస్" పేరట చేయబడిన ఆలోచనల్లో పారిశ్రామికాభివృద్ధిలో మార్కెటు జోక్యమే తప్ప దేశ ప్రభుత్వాల ప్రమేయాన్ని సహించడం లేదు. ప్రభుత్వాలు తమ దేశ ఆర్థిక సౌష్టవాలను దృష్టియందుంచుకుంటూ స్వావలంబన స్ఫూర్తితో తమ పారిశ్రామిక విధాన రూపకల్పన చేయడం అంతర్జాతీయ మార్కెటు సంస్థకు మింగుడు పడడం లేదు. 1991 నాటి సంస్కరణల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గూడా ఇందులో తమ జోక్యాన్ని చాలా వరకు తగ్గించుకుంటున్నది ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించుకుంటేనే దేశ ఆర్థిక పరిస్థితి బాగుపడుతుందనే భ్రమ వ్యాపించింది. ఆర్థిక పరిస్థితి సంస్కరణల తర్వాత నిజంగానే కొంత బాగుపడినా ఒడిదొడుకులు లేకుండా పోవడం లేదు. వస్తూత్పత్తి పరిశ్రమ తన ప్రధాన చోదక శక్తి పాత్రను పోషించడం లేదు. చాలా వెనుకబడిపోయింది. దేశ వార్షిక సంపద ఉత్పత్తిలో వస్తూత్పత్తి పరిశ్రమ భాగం ఈనాడు కేవలం 16శాతం మాత్రమే ఉన్నందువలన దేశ సంపదతో పాటు ఎదుగుచున్న

యువ తరానికి అవసరమున్న కనీస ఉపాధి, సౌకర్యాన్ని కల్పించ లేకుండా నిలిచిపోయింది. 2025 నాటికి దీని శాతం25కి పెరగడం అవసరమని ఆర్థిక నిపుణుల అంచనా కేంద్ర ప్రభుత్వం,ప్రణాళికా సంఘం గూడా ఇదే దిశలో ఆలోచించడం అవసరం. అందు కవసరమైన మౌలిక సదుపాయాల రూపకల్పనపై కేంద్రీకరించడం అత్యవసరం వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాలలో, పరిశ్రమలో భాగమైన వస్తూత్పత్తి పరిశ్రమ, కుటీర పరిశ్రమల పాత్ర విశిష్టమైంది. వీటితో ఉపాధి కల్పన నిరంతరాయంగానుంటూ సంపద సృష్టి నిత్య నూతన అంతస్థులకు చేరుకుంటుంది. ప్రపంచ మార్కెటులో పోటీని తట్టుకుంటుంది. ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ వాణిజ్య సంస్థల సలహాల ఆధారంగా రూపొందించబడిన "వాషింగ్టన్ ఏకాభి ప్రాయం" అను పాచిక అంతటా పారడం లేదు. ఈ మార్గాన్ని అనుసరించిన ఆగ్నేయాసియాలోని కొన్ని దేశాలు పారిశ్రామికాభివృద్ధిలో చతికిల పడిపోవడాన్ని ప్రపంచం గమనించింది. ఇప్పుడు చైనాతో సహా అభివృద్ధి చెందుతున్న దేశాలన్ని వస్తూత్పత్తి పరిశ్రమల ప్రాధాన్యతని గుర్తించినవి. గత 22 సంవత్సరాల సంస్కరణానంతర కాలంలో మనం గూడా బాగా గమనించినాం. వస్తూత్పత్తి లేక తయారి పరిశ్రమాభివృద్ధికి అపారమైన అవకాశాలుగల మన దేశం వాటన్నింటిని జారవిడుచుకుంటున్నది. నిరుద్యోగుల సైన్యం పెరిగిపోవుచున్నది. వాషింగ్టన్ ఏకాభిప్రాయానికి కేంద్రమైన అమెరికా దేశం గూడా ఈ వస్తూత్పత్తి పరిశ్రమల ప్రాముఖ్యత, అందులో ఉపాధిని కల్పించగల సామర్థ్యాన్ని గుర్తించి, తమ దేశ పారిశ్రామిక విధానాన్ని సవరించుకోవలసిన పరిస్థితికి చేరుకున్నది. అందుకవసరమైన ప్రోత్సాహకాలను అందజేయాలనుకుంటున్నది. ఆసియాలోని దేశాలన్నిటి కంటె మించిన అవకాశాలున్న భారతదేశం ఈ రంగంలోని తమ వెనుకబాటు తనాన్ని ఎంత తొందరగా తొలగించుకుంటే అంత మంచిది. వెనకటినుండే ఈ పరిశ్రమను తమ ఆర్థికాభివృద్ధికి ప్రధానచోదక శక్తిగా నిరంతరాయంగా కాపాడుకుంటున్న జర్మనీ, జపాన్ దేశాలే కాదు ఇటీవల రంగ ప్రవేశం చేసిన చైనాతో పాటు మిగతా ఆసియా దేశాలు ఈ వస్తూత్పత్తి పరిశ్రమల రంగాన్ని తమ ప్రధాన పారిశ్రామిక విధానంగా రూపొందించుకున్నాయి. భారత దేశం ఇంకా మేల్కొనక పోవడానికి ఇక్కడి పాలకులు, వారి సలహాదారుల భావ దారిద్ర్యమే కారణం.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందుకవసరమైన కార్యాచరణ చర్యలకుపక్రమించాలి. ఇతర దేశాలను అనుకరించడం గానీ పారిశ్రామిక యాజమాన్య విధివిధానాలను సంస్కరించడం గానీ పెద్ద విషయం కాదు. ఏ దేశానికి ఆదేశం, అందులో వివిధ విభిన్న ప్రాంతాలలో ఈ పరిశ్రమాభివృద్ధికి సహజ సిద్దమైన అవకాశాలుంటాయి. వాటిని గుర్తించి తదనుగణ్యంగా నిర్వహణ చర్యలను చేపట్టడం అవసరం. చైనా సంస్కర్త డెంగ్‌గారన్నట్లు నీటిలో నడుస్తున్నపుడు అరికాళ్ళకు తగిలే రాళ్లను ఆధారం చేసుకుంటూ నడవడం మంచిది. ఎక్కడ, దేనికి, ఏ సౌకర్యం సహజ సిద్ధంగా లభిస్తే అక్కడ ఆ పరిశ్రమను నెలకొల్పడం. సులభం, లాభదాయకం. వృత్తి, నైపుణ్యతలతో కుటీర పరిశ్రమల నిర్వహణ చేయగలిగే కుల వృత్తులు గల మన దేశంలో కుల నిర్మూలన ఉద్యమాలకు ఎంత గానో ఉపకరిస్తుంది. దీనితో పాటు కొన్ని ఇబ్బందులుగాకనబడే కార్మిక చట్టాల సవరణ భూసేకరణలో ఏర్పడే అడ్డంకులు పర్యావరణ పరిరక్షణ చట్ట సవరణలు ప్రజాహితంగా పౌర సంఘాల సహాయ సహకారాల ద్వారా

స్థానిక ప్రభుత్వాల చొరవతో పరిష్కరించుకోగల్గుతాం. ఆర్థికాభివృద్ధి, ఉపాధి విస్తరణ లాంటి గొప్ప ప్రయోజనాల సాధనలో చిన్న ప్రయోజనాలను పెద్ద ప్రయోజనానికి అనుబంధం చేయడమో లేక త్యాగం చేయడమో విజ్ఞత అవుతుంది. గ్రుడ్డిగా ఎవరి పట్టుదలపై వారుంటే దేశాభివృది అసాధ్యం, సమున్నత సమగ్ర సమహితభావంతో సంకుచిత భావాల్ని జయించాలి. భారత దేశాభివృద్ధికి భారతీయ మార్గదర్శకాలున్నాయి. వాటిననుసరించాలి. ప్రపంచీకరణ కారణంగా ద్రవ్య ప్రవాహనికి సరుకుల క్రయవిక్రయాలకు దేశాల సరిహద్దులు ఏలాంటి ఆటంకాన్ని కల్పించరాదనే స్వేచ్ఛా మార్కెటు వాదన ఒకటైతే ప్రజాస్వామ్య పద్ధతులతో నిర్వహించబడే దేశీయ ప్రభుత్వాలు తమ దేశ ప్రజలకవసరమైన ఉపాధి కల్పనకు ఆటంకాన్ని కల్పించే విధానాలను విడనాడి స్వదేశీ విధానాలను చేపట్టాలనేది రెండవ వాదన. ఈ రెండింటిలో ప్రజాహితం ఉన్నది. ఈ రెండు అవ గాహనలను ఆచరించే సంద ర్భాలలో వాటి మధ్య వైరుధ్యాలు బయటపడతాయి. దేశంలోనే కొన్ని సరుకులను సకల నాణ్యతలతో కూడినవిగా ఉత్పత్తి చేస్తూ దేశ ప్రజలకు శాశ్వతంగా ఉపాధి కల్పిస్తుండగా తిరిగి అవే సరుకులను "స్వేచ్ఛా మార్కెటు" "ప్రపంచీకరణ" పేరుతో విదేశాల నుండి దిగుమతి చేసి దేశీయ ఉత్పత్తులకు పోటీ పెట్టడం ఏమాత్రం భావ్యం కాదు సరికదా దేశ భక్తి రాహిత్యమవుతుంది. తమ దేశీయ ఉత్పత్తులను అవసరమైన నాణ్యతా ప్రమాణాల మేరకు ఉత్పత్తి చేయడం, వాటిని మార్కెటు చేయడం సహజ న్యాయం. ఈ వ్యాపారానికి అడ్డు వచ్చే విదేశీ సరుకుల దిగుమతులను నిషేదించడం గాని తమ దేశీయ ఉత్పత్తులకు రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయడం గానీ ప్రపంచీ కరణలోని సదుద్దేశాలను వ్యతిరేకించడంకానే కాదు. అభివృద్ధి చెందిన దేశాల చరిత్ర దీనికి ప్రబల తార్కాణం. దేశీయ ఉత్ప త్తులను అనవసర, అనారోగ్యకర పోటీ నుండి రక్షించుకున్న కాలాల్లోనే అవి అభివృద్ధిని సాధించినవి. ఐతే కొన్ని పెట్టుబడిదారి దేశాలు తమ అర్థ బలం, సైనికబలంతో బలహీనమైన దేశాల ఆర్థిక రాజ కీయ స్వతంత్రాలను హరించిన సామ్రాజ్యవాద యుగంగడిచింది. 21వ శతాబ్ధి స్వతంత్ర దేశాల ప్రజాతంత్ర పరివర్తన దశ ప్రారంభంలోనున్నది. ప్రపంచీకరణ ప్రయోజనం దేశాలమధ్య ఐచ్ఛిక సహాయ సహకారాలను సుగమం చేయడంలోనున్నది. దేశాల స్వతంత్రాభివృద్ధిని ప్రపంచీకరణ స్వేచ్ఛా వ్యాపారం పేరుతో అడ్డుకోవడం ఎట్టి పరిస్థితిలో అనుమతించడానికి వీలులేదు. దేశీయ వస్తూత్పత్తి పరిశ్రమలను గుణాత్మకంగా అభివృద్ధి చేస్తూనే ఉత్పత్తులకు విదేశీపోటీ నుంచి భద్రత, రక్షణ కల్పించడం ప్రజాస్వామ్య ప్రభుత్వాల కర్తవ్యం. మన దేశం 1991 నాటి సంస్కరణల పేరుతో వాణిజ్య వ్యాపారాలకు విచక్షణారహితంగా దేశ ద్వారాలను తెరిచింది. ప్రపంచీకరణలో సత్ఫతితాల కంటె చేదు అనుభవాలనే పొందింది. దేశ విదేశాల ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానించడం మంచిదే. అది చాలా మంచి ఫలితాలనిస్తున్నది. విదేశీ పెట్టుబడులకు విచక్షనాయుత పరిమితి ఉండి తీరాలి. స్వదేశ స్వతంత్రా భివృద్ధికి అవసరమైన లక్ష్మణ రేఖలను అన్ని రంగాలలో స్పష్టంగా ఏర్పాటు చేయ డం అవసరం. విచక్షణా పూర్వకంగా ఉభయ తారకంగా నుండే విధానాలను దేశాలు అనుసరిస్తూ ఎవరి అభివృద్ధి మార్గాన్ని వారు అనుసరించడం ప్రపంచ శాంతి సహ జీవనానికి ప్రాణప్రదం, ప్రపంచీకరణ దీనికి లోబడి ఉండాలి. 2012 మే మాసంలో రెయోడిజనరీలో జరిగిన అగ్రరాజ్యాల మహాసభలో దేశాల స్వతంత్ర ఆర్థికాభివృద్ధి పారిశ్రామికాభివృద్ది, ప్రత్యేక చర్చనీయాంశమైంది. అమెరికాతో సహ భాగస్వామ్య

దేశాలన్ని స్వతంత్రపారిశ్రామికాభివృద్ధి, అనారోగ్యకర పోటీ నివారణ, రక్షణ కవచాల ఆవశ్యకత సూత్రాలను ఏకగ్రీవంగా ఆమోదించినవి. ఇదే వెలుతురులో భారత ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వస్త్రోత్పత్తి పరిశ్రమలను బహుళంగా నిర్మించి 2025 నాటికి 16 కోట్ల మంది యువతీ యువకులకు శాశ్వత ఉపాధిని కల్పించాలని నిర్ణయించింది. 12వ ప్రణాళికలో దీనికి పెద్ద పీట వేయాలని నిర్ణయించింది.

## ఉద్యోగాల సృష్టి : సమ్మిళితాభివృద్ధి

సమ్మిళితాభివృద్ధి సాధించబడాలంటే పారిశ్రామిక రంగంలో ఉద్యోగాలను సృష్టించి, యువతకు శాశ్వత ఉపాధిని సమకూర్చడమొక్కటే శాస్త్రీయ మార్గం. ధన దాహం గల పెట్టుబడిదారి ప్రపంచం ఆర్థిక మాంద్యం దిశలో కొట్టుమిట్టాడుతున్న గత దశాబ్ధి కాలంలో భారత దేశాభివృద్ధి తొమ్మిది శాతానికి చేరడాన్ని ప్రపంచమంతా సంభ్రమాశ్చర్యాలతో స్వీకరించింది. విజ్ఞాన యుగంలో భారత దేశం ముందుకు దూసుకు పోగలిగే సామర్థ్యాలు గలిగియున్నందుకు తమ హర్షామోదాలను ప్రకటించింది.

"సగటు" దేశీయ పారిశ్రామికాభివృద్ధి వెనక దాగి యున్న వాస్తవాలను నకారాత్మకంగా ఆలోచించి గమనించని వారున్నారు. ప్రపంచంలోనే అత్యంత పేద దేశాలుగానున్న ఆఫ్రికాఖండంలోని 20 దేశాలలోనున్న పేదవారి సంఖ్యకు మించిన పేదలు ఒక్క భారత దేశంలోనే ఉన్నారు. మొబైల్ (సెల్) ఫోన్లు గల కోట్లాది మందికి మించిన జనం పరిశుభ్రమైన మల మూత్రశాలలు లేక బాధ పడుతున్నారు. ఆఫ్రికా ఖండం మొత్తంలో విద్యుచ్ఛక్తి కొరత కంటె భారత దేశంలో ఈ కొరత అధికం. ఆకలి, పౌష్టి కాహరలోపాల నివారణ కొరకు ఆహార భద్రతను సాధించే దిశలో బహు ప్రయత్నాలలో ఇంకా సత మతమవుతున్న భారతదేశంలో కంటికి కనబడే సగటు దేశీయాభివృద్ధి లేక జాతీయాభివృద్ధి సుమారు 40-50 కోట్ల భారతీయుల నిజజీవితంలో ప్రతిబింబించడంలేదు. ఆగుపించే అభివృద్ధి సమ్మిళితాభివృద్ధి అనిపించుకోదు. ఇది సార్వ జనీననాభివృద్ధికాదు, సంపద పంపకంలో సమన్యాయం లేదు. పేదరిక నివారణ పేరుతో లక్షల కోట్ల రూపాయల వ్యయంతో నిర్వహించబడుతున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి కల్పన పథకంగాని ఆహర భద్రతా చట్టంగాని పేదరికాన్ని శాశ్వతంగా తొలగించే విధంగాలేవు. అవి పేదల కంటితుడుపు లాంటి తాత్కాలిక చర్యలు మాత్రమే. కావలసింది లక్షలాది ఉద్యో గాల సృష్టి ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల విస్తరణ స్వయం ఉపాధి అవకాశాల ఆవిష్కరణ, ప్రభుత్వాలు తమ దృష్టిని తాత్కాలిక, ఉపశమన చర్యల నుండి మళ్లించి సమ్మిళితాభివృద్ధికి అవసరమైన విధానపర చర్యలను చేపడుతూ తమ నియంత్రణాధి కారాలను పరిపూర్ణంగా వినియోగిండంతోపాటు మార్కెటుతో సహ మధ్య మధ్యన సృష్టించబడే అవాంతరా లన్నింటిని తొలగించాలి కూడా. అప్పుడే పేదరికం క్రమంగానైనా, వేగంగానే తగ్గుతుంది, తొలుగుతుంది.

వస్త్రోత్పత్తి, గార్మెంట్లు లాంటి సరుకుల తయారి, పిల్లలకు ఆట వస్తువులను తయారు చేయడంలాంటి వందల రకాల పనులుంటాయి. వాటిని వెతికి, ఆయా వర్గాల ప్రజలను వివిధ సంస్థలలో సమీకరించి, సులభంగా లభ్యమయ్యే ముడి సరుకుల సాధన సదుపాయాలన్ని సమకూర్చి

ఉత్పత్తులు చేయించడం అందుకు అవసరమైన ప్రోత్సాహకాలను అందించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధమ కర్తవ్యం. గత రెండు దశాబ్దాలుగా ఆసియా దేశాలు ముఖ్యంగా చైనా దేశం. ఈ ప్రక్రియలో ముందుండగా భారతదేశం ఆలస్యంగా మేల్కొన్నది, ఈ దిశలో అరకొర చర్యలతో సంతృప్తిని పొందుచున్నది. ఇటువంటి "చిన్న" బాధ్యతల నిర్వహణలో క్షంతవ్యం గాని, నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్న మన దేశం పేరుకుపోతున్న నిరుద్యోగాన్ని పేదరికాన్ని నివారించలేక పోవడం ఆశ్చర్యం కాదు. ఈనాడు మన కంటే చిన్నగానుండి ముడి సరుకులు వనరుల కొరతలతో బాధపడే ఆసియా దేశాలు వస్తువుల తయారి పరిశ్రమతో ముందు శ్రేణిలో నుండడం మనకొక గుణపాఠం. కోట్లాది గానున్న భారత యువత ఉపాధి సాధన కొరకు ఎక్కడికి వెళ్ళాలి? ఏం చేయాలి? ఆర్థిక సంస్కరణలు చేపట్టబడిన రెండు దశాబ్ధాల తర్వాత గూడా ఇంత దారుణ పరిస్థితి కొనసాగడానికి కారకులెవరు? మానవ శ్రమ ప్రధానమైన తయారి పరిశ్రమల్లో తమ పెట్టుబడులు పెట్ట నిరాకరిస్తూ దేశాన్ని వెనకకు నెట్టడానికి కారకులైనవారెవరు? పాలక వర్గాలలో, అధికార యంత్రాంగంలో గూడు కట్టుకొనియున్న స్వార్ధపరుల అర్థ ఫ్యూడల్, లేక బానిసభావాలె, అపారంగానున్న మానవ సంపదను ఫల ప్రదంగా ప్రయోజ నాత్మకంగా వినియోగించే సదవకాశాల ప్రాధాన్యతను గుర్తించి గూడా ఆచరణలో నిరాకరించే మనస్తత్వమే, స్వతంత్ర భారతావనిలో గూడా యువతకు చక్కని భవిష్యత్ బ్రతుకు మార్గాన్ని చూపలేని నాయకత్వ నిర్వాకమే. ఉన్న మేరకు కార్మికులు తమ హక్కు భుక్తాలకై ఉద్యమిస్తుంటె అసలు మానవ శ్రమ ప్రధానమైన పరిశ్రమలను మూసివేసి తక్కువ మంది కార్మికులతో ఎక్కువగా పని చేసే సాంకేతికపరమైన పరిశ్రమలను ప్రోత్సహించడం తమ కర్తవ్యంగా భావించడం భావ్యం కాదు. ఈవిధంగా వస్తువుల తయారి పరి శ్రమలను నిర్లక్ష్యం చేస్తూ భారీ పరిశ్రమలగురించి ఆలోచించడం, ప్రభుత్వరంగంలో వాటిని ప్రోత్సహించడం ఫలితంగా నిరుద్యోగం మరింత వ్యాపించడం స్వయం కృతాపరాధం కారణంగానే జరుగుచున్నది. వస్తూత్పత్తి పరిశ్రమలకి కావలసినంత మార్కెటు మన దేశంలోనే ఏర్పడి విస్తరిస్తున్నది. చైనా లాంటి దేశం చిన్న దేశాలతో సహా ఈ మార్కెటును తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి వినియోగించగల్గుతుండగా మన దేశీయ కుటీర పరిశ్రమలు వస్తువుల తయారీ పరిశ్రమలు ముందుకు రాలేకపోవడం యాధృచ్చికంగాదు. మన దేశ పారిశ్రామిక విధాన లోపమే అసలు కారణం. పెట్టుబడుల సమీకరణలోపం, చిన్న పెట్టుబడిదారి వర్గాన్ని తగు విధంగా ప్రోత్సహించలేకపోవడం మూల కారణం. స్థూలంగా చెప్పాలంటే ఈ దిశలో పాలక వర్గాల అవగాహనా రాహిత్యం, సంకల్ప బలలోపమే కోట్లాది శ్రమ జీవులనుభవిస్తున్న శాపం, ప్రజాతంత్ర వాదులు, సంఘాలు, రాజకీయ పార్టీలు అత్య వసర ప్రాతిపదికపై ఉద్యమిస్తూ ప్రభుత్వ విధాన మార్పు ద్వారా దేశ విదేశాలలో గల అవకాశాలను సద్వినియోగంచేసికోవడం, కోట్లాదిగా పెరిగిపోతున్న మన యువతకు అవసరమైన కనీస సాంకేతిక నైపుణ్యతను సంతరింపచేస్తూ మానవ శ్రమ ప్రధానమైన వస్తువుల తయారి పరిశ్రమల్ని ప్రోత్స హింపజేయాలి. దేశీయ ఉత్పత్తి రేటు పెరుగుదల నిజంగా దేశ మానవాభివృద్దిగా ప్రకాశించాలి.

దేశాభివృద్ధి చరిత్రలో 1991 నాటి సంస్కరణల తర్వాత రెండు దశాబ్దాల కాలంలో సేవారంగం ప్రధాన పాత్రను పోషించింది. ప్రధాన రంగమైన వ్యవసాయ రంగం నత్తనడక నడిచింది. ద్వితీయమైన

పారిశ్రామిక రంగం, అందులో వస్తువుల తయారి వస్తూత్పత్తి పరిశ్రమ ఆశించినంతగా భాగ స్వామికాలేదు. ఇటీవల మరింతగా తగ్గింది. మూడవ ప్రాధాన్యత గల సేవా రంగం ముందంజ వేసింది. అందుకే దేశీయాదాయ అభివృద్ధి రేటు 9 శాతానికి చేరింది. ఇటీవలి ప్రపంచ పరిణామాల ఫలితంగా ఇదిగూడా తగ్గి సగటు దేశీయ ఆదాయ అభివృద్ధి రేటు ఇపుడు 5 శాతానికి చేరింది. రానున్న రెండుమూడు సంవత్సరాల వరకు ఈ రేటు 7 శాతానికి మించకపోవచ్చునని ఆర్థిక నిపుణుల అంచనా. మూడు రంగాలు అభివృద్ధి కావలసినవే. ఐతె వస్తూత్పత్తి పరిశ్రమ లేక తయారీ పరిశ్రమాభివృద్ధికి కీలకమైన మానవ వనరుల కొరత ఏమాత్రం లేని మన దేశం త్వరితగతిన ఆశించిన మేరకు అభివృద్ధిలో తన పాత్రను పోషించగల్గుతుంది. కుటీర పరిశ్రమల్లోని యంత్రాలు, భవనాలు తదితర సదుపాయాలు ఒక నాటికి క్షీణించవచ్చునుగాని అందులో ఆర్జించిన విజ్ఞానానికి వార్ధక్యంలేదు. నిత్యనూతన ఆవిష్కరణల ఆధునిక ప్రపంచంలో విజ్ఞాన సాధన అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తున్నది. దీన్ని ఏదేశం ఎంత ఆప్యాయంగా ఆస్వాదించి వినియోగించగలగితే అది అంత గొప్ప దేశంగా ఎదుగుతుంది. గత శతాబ్ద కాలంలో, ఈనాటికి గూడా జర్మనీ, జపాన్ దేశాలు ప్రపంచంలో ఆదర్శంగా మిగిలినవి. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన ఆవిష్కరణ, ప్రయోజనాత్మకంగా దాని వినియోగం వారి సొంతం. కాబట్టి పై విలువైన అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుంటూ అన్ని దేశాల కంటే మించిన మన యువతకి సామర్థ్యాన్ని పెంచే విద్యా రంగం మనకు ప్రాణప్రదం. ఇది చిరగని వస్త్రం. తరగని ద్రవ్యం. అనూహ్య ఫలితాలను సునాయాసంగా అందించగలిగే అనన్య సామాన్యమైన శక్తి. రాజకీయ సంకల్పబలముంటే రానున్న 15 సంవత్సరాలల్లో మన ప్రణాళికా సంఘం కన్న కల నిజమై పోతుంది. దేశం సుసంపన్నమై సుభిక్షమవుతుంది. సశ్యశ్యామలమవుతుంది.

ఈ ప్రక్రియలో వివిధ శ్రేణులలో తమ మేధాశక్తితో పాటు శారీరక శ్రమను వెచ్చించే కార్మిక లోకం గురించి ఈనాడున్న అవగాహనలో విప్లవాత్మక మార్పురావడం చారిత్రికావసరం "కూలీలు", దినభత్యం ఇస్తే పనిచేసి పోతారనే చులకనభావం పూర్తిగా మారాలి. భౌతిక, మానవీయ విలువలను సృష్టించె కర్మవీరులు వారు. నిత్య విద్యార్థులుగా వారు గూడా మారాలి. తమ పని తనాన్ని పెంచు కోవాలి.వారి కందించే జీతభత్యం ఒక పారితోషికమనే సత్యాన్ని యాజమాన్యం, ప్రభుత్వం గుర్తించాలి. అదే విధంగా వారిని గౌరవించాలి. అవసరముంటే పని కల్పించాలి లేదంటె తొలగించాలనె "హైర్ అండ్ ఫైర్" ధృక్పధానికి చరమవాక్యం పలకాలి. కర్మాగారాలు విజ్ఞాన ప్రయోగశాలలుగా సంపద ఉత్పత్తికి పుణ్యక్షేత్రాలుగా పరిగణించబడాలి. అందులో పని చేసే యాజమాన్యం, కార్మిక వర్గం భాగస్వాములుగా నిత్య విద్యార్థులుగా తమ సామర్థ్యాలను పెంచుకోవాలి.

## అపార అవకాశాలు

ప్రపంచ వ్యాపితంగా సామాన్య కార్మికుల సేవలపై ఆధారపడే అవసరాలు అందుకు గల అవకాశాలు అపూర్వంగా విస్తరిస్తున్నాయి. నైపుణ్యతగల విద్యావంతులకు గల అవకాశాల గురించి వేరే చెప్పనక్కరలేదు. భారతీయ యువత, వయస్సు, సంఖ్యాపరంగా ఈఅవకాశాలను సద్వినియోగంజేసుకోగలిగె స్థితిలోనున్నది. ఇప్పటికే విదేశాలల్లో పని చేసే కార్మికుల సంఖ్య గణనీయంగానున్నది. కేవలం ప్రాథమిక విద్య దాటిన వారి సంఖ్య అక్షరాశ్యులల్లో 70శాతంగా

నుండడం ఆందోళనకరం. ఉన్నత ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొన వలసిన యువత అవసరాని కంటే 10 కోట్లు తగ్గిన పరిస్థితి ఉండడం దిగ్భ్రాంతికరం. కొద్దిపాటి లేక మధ్య రకం నేర్పరితనం గల కార్మికుల ఉద్యోగావసరాలు తగ్గిపోతున్నవి. ఉన్నవారిలో మూడవ వంతు మాత్రమే వ్యవసాయంలో ఇమిడి పోతున్నారు. మిగతా శ్రామికులు అవసరమైన నైపుణ్యత లోపం కారణంగా పనిలేకుండా మిగిలిపోతున్నారు. ఆడ పిల్లలు ఉన్నత విద్యాలయాలలో అడుగు గూడాపెట్టలేక ఎటూగాని దుస్థితి నెదుర్కుంటున్నారు. ఫలితంగా వయస్సు రీత్యా ఏదో ఒక పని చేయగలిగి యుండి గూడా చేయలేని స్థితిలోనున్న వారి సంఖ్య కనీసం 25శాతంగా ఉండడం బాధాకరం. ఆదాయాల్లో అసమానతలు ఆధికమవుతున్నాయి. అత్యల్ప ఆదాయాలతో అసమానతలు ఆధికమవుతున్నాయి. బ్రతుకు భారాన్ని మోయవలసిన వారు కోట్లాదిగా మిగిలిపోతున్నారు. పై సమస్యలను ఎదిరించే విధంగా విద్య, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించగలిగితే ప్రపంచ వ్యాపితంగా విస్తరిస్తున్న ఉపాధి అవకాశాలను మన యువత సద్వినియోగం చేసుకోగల్గుతుంది. విశ్వసించదగిన ఒక అంత ర్జాతీయ సంస్థ విశ్లేషణ ప్రకారం ఆర్థికాభివృద్ధి చెందిన దేశాలలోనే నైపుణ్యత గల కార్మిక వర్గ సంఖ్య తరిగిపోతున్నది. రెండవ వైపు వారి అవసరాలు పెరుగుచున్నవి. కళాశాల విధ్యనభ్యసించిన నిపుణుల అవసరం ఈదేశాలలో 2020 నాటికి దాదాపు రెండు కోట్ల సంఖ్యకు చేరుతుంది. ప్రపంచ వ్యాపితంగా పెరిగిపోతున్న కార్మిక కొరతను చైనాదేశం 2030 నాటికి 13శాతం పూరించగల్గుతుంది. భారత దేశంలో 2030 నాటికి అదనపు కార్మికుల సంఖ్య ఈనాడున్న 4.7 కోట్ల సంఖ్యను దాటి 6.3 కోట్లకు చేరుతుంది. వీలుంటే ప్రపంచ వ్యాపితంగా కార్మికులను సరఫరా చేయగలగుతుంది. సాంకేతిక విజ్ఞాన ప్రధానమైన రంగాలకు భారీగా పట్టభద్రులను అందించగల్గుతుంది. దేశంలో ఉన్నత విద్యస్థాయిలోనె సాంకేతిక విజ్ఞానం అతి తక్కువుగా ఉండడం మన విద్యా విధానంలోని ప్రథమ లోపం, ఉన్నత, కళాశాలల స్థాయిలలో మధ్యరకం, ఉన్నత రకం సాంకేతిక విజ్ఞానాన్ని యువతకందిస్తే వారు తమ బాధ్యతలను నిర్వహించగల్గితె మొత్తం ప్రపంచ అవసరాలలో సింహ భాగాన్ని భారత యువత ఆక్రమించుకోగల్గుతుంది. ఇది ఈనాటి ప్రపంచీకరణ నేపథ్యంలో మన విద్యా విధానం ఎదుర్కుంటున్న గొప్ప సవాలు. ఈ రంగాన్ని తీవ్రంగా ప్రక్షాళన చేస్తే తప్ప 2020 నాటికైనా అవసరంలో కనీసం 10 శాతం విజ్ఞాన వంతులను తయారు చేయలేము. ఇది సాధ్య పడాలంటె ఈనాటి పాఠశాలలు, అధ్యాపకులు, వారికివ్వబడె శిక్షణా సౌకర్యాలు రెట్టింపు కావాలి. అందుకనవసరమైన పెట్టుబడులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇతోధికం చేయాలి. దేశాభివృద్ధికి, ఉపాధి, అవకాశాల వినియోగానికి విద్యా విధానంలో తక్షణ సంస్కరణల, ప్రాధాన్యతల మౌలికమైన మార్పులు అవసరం.

పరిశ్రమలకు సాంకేతిక సామర్థ్యం ఎంత ప్రధానమో బహుముఖ సామాజికాభివృద్ధికి ప్రజాస్వామ్యం మనుగడకు మానవ వనరులంతే ప్రధానం. అందుకె విజ్ఞులు ఈకాలానికి విజ్ఞాన యుగమనే పేరు పెట్టినారు. ఈ యుగ ధర్మాన్ని గుర్తించి మన సమాజం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే మన విద్యారంగాన్ని తీవ్రంగా సంస్కరించుకోవాలి. అర్థ ఫ్యూడల్, సామ్రాజ్య వాదయుగ అవశేషాలన్నిటిని కూకటి వ్రేళ్ళతో పెకిలించి పారద్రోయాలి. స్వాతంత్ర్యానంతరం ఆరున్నర దశాబ్దాల సుదీర్ఘకాలంలో దేశ ప్రభుత్వాలు ఈ దిశలో సాధించింది అత్యల్పం సంస్కరణల "మీ మాంస"లతో పుణ్య కాలం గడచి పోయింది. ఇకనైనా మేల్కొనలేకపోతె చరిత్ర క్షమించదు.

ఆర్థికాభివృద్ధిని వేగపరుస్తూ పేదరికాన్ని త్వరత్వరగా తగ్గించిన మూడు కీలకాంశాలను తూర్పు ఆసియా దేశాలైన జపాన్, దక్షిణ కొరియా. థాయ్‌లాండ్, చైనా దేశాలు మన మందుంచు చున్నవి. ఆయా దేశాల ప్రభుత్వాల శ్రద్ధాసక్తులు సమర్ధవంతమైన జోక్యంతో మాత్రమే ఇది సాధ్య పడింది. ప్రపంచదేశాలన్ని ఈ పరివర్తనను గుర్తించినవి.

ప్రప్రథమమైన అంశం వ్యవసాయరంగం. ఈ రంగంలోనే అత్యధిక శ్రామికులు ఉపాధిని పొందుతూ ఉత్పత్తిని ఇతోధికం చేయగల్గుతారు. వ్యవసాయ సంస్కరణలు, భూ సంస్కరణలతో సహప్రభుత్వ జోక్యంతో చేపట్టబడాలి. చిన్న కమతాలైనా ప్రాధమిక స్థాయిలో అవే అధికోత్పత్తిని మానవశ్రమ ప్రాధాన్యతలో విజయవంతంగా సాధించగల్గుతాయి. దీని ఫలితంగానే నిరుద్యోగులందరికి ఉపాధి లభిస్తుంది. వారి కొనుగోలు శక్తి పెరిగి తమ నిత్య జీవితావసరాలు, సేవలను అనుభవిస్తారు.

ప్రభుత్వాలు తమ సమర్ధవంతమైన జోక్యంతో ప్రాధాన్యత నివ్వవలసిన రెండవ ముఖ్యాంశం. కుటీర పరిశ్రమలు. చిన్న పరిశ్రమల స్ధాపన వాటిని ప్రోత్సహించడం ఇందులో ప్రాధమిక నైపుణ్యతలు మాత్రమేగల లక్షలాది శ్రమజీవులకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. ఇందులో తయారయ్యే వస్తువాహనాలు, బొమ్మలు, క్రీడాపరికరాలలన్నిటికి తగిన మార్కెటు ఏర్పడి ఈ పరిశ్రమలు లాభసాటిగా పనిచేయగల్గుతాయి. మనదేశ పారిశ్రామిక సరుకుల ఎగుమతుల్లో సింహభాగం ఈ విధంగా తయారు చేయబడిన వస్తువులదేనను వాస్తవాన్ని గుర్తించాలి. ఈ పరిశ్రమల్లో వినియోగించబడే యంత్ర సామాగ్రి సరసమైన ధరలకే ప్రపంచ వ్యాపితంగా దొరుకుతాయి.

మూడవ ముఖ్యాంశం పై రెండు రంగాలకవసరమైన పెట్టుబడిని సమకూర్చడం ప్రభుత్వ జోక్యంతోనే సులభసాధ్యం. చిన్న మొత్తాల్లో రుణ సదుపాయాల్ని చిన్న రైతులు, చిన్న పారిశ్రామిక వేత్తలకు గ్రామ సీమల్లో నిర్వహించడం పెద్దకష్టంతో కూడిందని రుణదాతలైన బ్యాంకర్ల ఏకాభిప్రాయం. ఐనా సామాజిక స్పృహ దేశాభివృద్ధి ధృక్పదంతో ప్రభుత్వాలు తమ జోక్యం ద్వారా సాధించగల్గుతాయి. ఆర్థికాభివృద్ధి పరివర్తనలో పై మూడు కీలకాంశాలు గొప్ప పాత్రను పోషించినవి. ఇంకా పోషించ గల్గుతాయి. పరివర్తనను వేగవంతం చేయగల్గుతాయి. తయారీ పరిశ్రమ (మ్యానుఫ్యాక్టరింగ్) ప్రాధాన్యత అభివృద్ధి చెందుచున్న దేశాలన్నిటిలో అక్కడి పారిశ్రామికాభివృద్ధిలో వస్తూత్పత్తి పరిశ్రమలు అనగా వస్తువుల తయారీ పరిశ్రమల ప్రాధాన్యత అత్యధికంగా ఉంటుంది.

మన ఎగుమతుల్లో సగభాగం ఆదాయం ఈ తయారి పరిశ్రమల ద్వారా సమకూరుచున్నా మొత్తం పారిశ్రామికాభివృద్ధి చిత్రపటంలో దీని పాత్ర తీవ్రంగానే తగ్గుతూ చివరకు నకారాత్మక ఫలితాలు రావడం ఆందోళనకరం. అసలు సగటు దేశీయ వార్షికోత్తత్పి గత దశాబ్దకాంలో ఎన్నడూలేని విధంగా 5 శాతానికి పడిపోవడమే ఆశ్చర్యకరం కాగా అందులో కీలక భాగస్వామ్యం వహించవలసిన వస్తూత్పత్తి పరిశ్రమ పాత్ర 15 శాతంలోనే స్ధిరపడిపోవడం ఆలోచించవలసిన అంశం. శ్రామిక జనాభాలో కేవలం 12 శాతం మాత్రమే ఈ పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. వస్తూత్పత్తి పరిశ్రమలో ఒకరికి ఉద్యోగం లభిస్తే సేవారంగంలో అంతకు మూడురెట్ల ఉద్యోగాలను సృష్టించ బడతాయనే

వాస్తవం ఈ రంగ ప్రాధాన్యతను ఎత్తిచూపుతున్నది. ప్రభుత్వం ప్రకటించిన నూతన వస్తూత్పత్తి పరిశ్రమాభివృద్ధి అంచనా ప్రకారం 2022 నాటికి ఇది మన దేశీయ సగటు వార్షికోత్పత్తిలో 25 శాతం భాగస్వామ్యం వహించాలి. ఆనాటికి కొత్తగా 2.2 కోట్ల ఉద్యోగాలు సృష్టించబడాలి.

పై విధానాన్ని విజయవంతం చేయాలంటే రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఈ రంగంలో అంకితభావంతో పనిచేయవలసియుంటుంది. జాతీయ సంపదను పెంచేందుకు ఉపాధి అవకాశాలను కల్పించే ప్రయోజనం మన యువతకి ప్రధానం ప్రభుత్వాల వ్యూహాలను ఉన్న ఉద్యోగాలను రక్షించే అంశానికంటే మించి శ్రద్దాసక్తులను కొత్త ఉద్యోగాలను సృష్టించే అంశాలపై కేంద్రీకరించాలి. అలాగే కార్మిక విధానాల రూపకల్పనలో కార్మికుల సంక్షేమం వారి జీతభత్యాలతోపాటు వారి ఉద్యోగం ఉపాధి పరిరక్షణగూడా అంతే బాధ్యతతో ఆలోచించాలి. ఉపాధి కల్పన పరిశ్రమ నిర్వహణ బలమైన పునాదులపైనుంటేనే ఉద్యోగాలు స్దిరంగా లాభసాటిగానుండం సాధ్యపడుతుంది. వస్తూత్పత్తి పరిశ్రమల్లో కార్మికులు అధిక సంఖ్యలో పనిచేస్తూ ఉపాధిని పొందగల్గుతారు. అభివృద్ధి చెందుచున్న చైనా, బ్రెజిల్, దక్షిణాఫ్రికాలాంటి దేశాలల్లో నిరుద్యోగాన్ని తీవ్రంగా తగ్గించడంలో ఈ పరిశ్రమల పాత్ర అసామాన్యం. భారతదేశంలో దీనికి కావలసిన ముడి సరుకులు, నైసర్గిక భౌగోళిక పరిస్దితులు అనుకూలంగానున్నా, పాలక వర్గాలు దీని ప్రాధాన్యతను గమనించి ఆచరించడంలో విఫలం కావడం దురదృష్టకరం. అందుకే ఈ దిశలో దేశం తన శక్తియుక్తులను కేంద్రీకరించవలసిన అవసరమున్నది.

ఈ వస్తూత్పత్తి, పరిశ్రమాభివృద్ధి మరోమంచి పరిణామానికి తెరతీస్తుంది. ఈనాడు దేశంలో వ్యవసాయంపై ఆధారపడి జీవించే జనాభా సంఖ్య తీవ్రంగా తగ్గుతుంది. 2030 నాటికి ఈనాడున్న 58 శాతం తగ్గి కేవలం 25 శాతానికి చేరగల్గుతుందని నిపుణుల అంచనా. వస్తూత్పత్తి రంగం అధిక జనాభా ప్రత్యేకంగా అధిక సంఖ్యలోని గ్రామీణ నిరుద్యోగ జనాభాగల్గిన దేశంలో విప్లవాత్మకమైన మార్పులకు దారి తీస్తుంది. చైనా, బ్రెజిల్ దేశాలు అప్పుడే చౌకగా లభించే కార్మికుల కొరతను ఎదు ర్కుంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యంగా అబివృద్ధి జెందిన పాశ్చాత్యదేశాలు ఈ సరుకులకి మంచి మార్కెట్లుగా పనిచేస్తాయి. అంతేకాదు మన దేశంతోపాటు ప్రపంచ వ్యాపితంగా దినదినా భివృద్ధితో విస్తరిస్తున్న మధ్యతరగతి ప్రజలు చాలా గొప్ప మార్కెటుగా పరిణమిస్తారు. కాబట్టి భారత దేశంలోని చిన్న, మధ్యతరహ పరిశ్రమల ఉత్పత్తులకు మార్కెటు కొరత అంటూ వుండదు. కాబట్టి ఈనాడున్న వస్తువుల ఉత్పత్తి ఎగుమతి 12-14 శాతం నుండి 20-25 శాతానికి పెరగాలి. అప్పుడే ఆశించిన లక్ష్యాలన్ని చేరుకోల్గుతాం.

చిన్న, మధ్యరకం తయారి పరిశ్రమల్లో దేశంలోని 40 శాతం పారిశ్రామికులు పనిచేస్తూ 45 శాతం వస్తూత్పత్తిని జేస్తున్నారు. ఈ పరిశ్రమలే లక్షలాది కార్మికులకు ఉద్యోగాలు సమకూర్చుచున్నవి. ఇంకా అత్యధికులకు ఉపాధిని కల్పించే శక్తిని కలిగియున్నది. వారికి సాంకేతిక శిక్షణతోపాటు అత్యాధునిక పరికరాలను సమకూర్చి వైవిధ్యంతో గూడిన సరుకుల తయారిని చేయగల్గితే దేశ సంపదకు కొరువ ఉండదు. నిరుద్యోగాన్ని పారద్రోలే పరిస్దితి అందివస్తుంది. అందుకవసరమైన నిధుల వెచ్చింపు గురించి తగు ప్రాధాన్యతతో ఆలోచించాలి. ఇప్పటికే ఈలాంటి పరిశ్రమల్లో 60

శాతం కార్మికులు ఆహార పదార్థాల తయారి, జౌళి పరిశ్రమలు, దుస్తుల తయారి, తోళ్ళు తయారు చేసే అనేకానేక పరిశ్రమల్లో కేంద్రీకరించబడియున్నారు. వ్యవసాయం తర్వాత మానవశక్తి ప్రధానమైన ఇలాంటి పరిశ్రమలు సాంకేతికంగా ఆధునికీకరించబడితే నిరుద్యోగ నిర్మూలనతోపాటు దేశ సంపదను అతి త్వరగా పెంపొందించుకోగల్గుతాం. పాలకులు ఈ వాస్తవాన్ని గ్రహిస్తూనే ఈ దిశలో తమ ప్రయత్నాలని కేంద్రీకరించలేకపోవడం యాధృచ్ఛికంగాదు. పాలకులు చేసే దేశ పారి శ్రామిక విధాన రూపకల్పనలో దేశ స్వతంత్ర, స్వావలంబనలతో కూడిన స్వదేశీ సూత్రాల పట్ల అవ సరమయినంత అంకితభావం సంకల్పం కొరవడడం బడా పెట్టుబడిదారి వర్గాలు వారి దళారీల అభీష్టం మేరకు ధనార్జనే ప్రధానమైన ఆపత్కాల విధానాలకు పరిమితమైపోవడం దూరదృష్టి కోల్పోవడం ఈ నాటి రాజకీయ బలహీనత. సమగ్రతతో కూడిన దార్శినికత, ఉపాధి, ఉద్యోగాలు సమిష్టి అవసరాలను సంకల్పశుద్ధితో అమలు పర్చలేకపోవడం రాజకీయ దౌర్బల్యం.

ఈ సందర్భంగా చిన్న మధ్యరకం పరిశ్రమల నిర్వహణలో ప్రాణప్రదమైన విద్యుచ్ఛక్తి ఉత్పత్తి, సరఫరాలోనున్న గొప్ప లోటును విస్మరించలేం. ప్రియమైన బొగ్గు దిగుమతుల స్థానే విస్తారంగా దొరికే దేశీయ బొగ్గును వెలికి తీయడం శుభ్రపరచడం గ్యాస్, చమురులాంటి ముడి సరుకులను వీలున్నంత చౌకగా సమకూర్చుతూ విద్యుత్తు ఉత్పాదనను అనేక రేట్లు పెంచుకోవడం గొప్ప జాతీయ కర్తవ్యం. ఈ ముడి సరుకుల రవాణా ఖర్చుల్లో 70 శాతం ఖర్చులు రోడ్ల ద్వారా రవాణా చేయడం వలన భారవంతమని అనుభవజ్ఞుల ఆందోళన. రైల్వే లైన్లు వేస్తూ ఈ దుబారా ఖర్చుల్ని సగానికి సగం తగ్గించుకోగల్గుతామని వారి అభిప్రాయం.

తయారీ పరిశ్రమలు లేక వస్తూత్పత్తి పరిశ్రమలు లేక చిన్న, మధ్యతరహ పరిశ్రమల స్థాపన, వాటి సమర్థవంత నిర్వహణ జరగాలంటే వాటితో ముడిబడియున్న పాలనా పర సంస్కరణలు చాలా అవసరం. ఈ పరిశ్రమలకవసరమైన భూమి మానవ శ్రమ పెట్టుబడులు అందు బాటులో ఉండాలి. ఇలాంటి పరిశ్రమల్ని స్థాపించగల్గే దేశ విదేశీ పెట్టుబడిదార్లని ఆకర్షించే ఇతర రంగాలన్ని తీవ్రంగా సంస్కరించబడాలి. పరిశ్రమల స్థాపనలోగాని వాటి మూసివేతలోగాని ప్రభుత్వాల జోక్యం అందులో జరిగే జాప్యం పారిశ్రామికవేత్తలకు భయంకరంగా తయారైంది. ప్రభుత్వం వివిధ శాఖాధిపతులు వేసే యుక్షప్రశ్నలకు సమాధానం చెప్పలేక విసిగి వేసారి చివరకు వారు తప్పుకునే వరకు వేధించడం వాస్తవం, కేవలం స్వయంకృతం. పరిపాలనా సంస్కరణలు యుద్ధ ప్రాతాపదికన జరిగితే ఈస్థితి మారుతుంది. కొత్తగా పరిశ్రమ ప్రారంభంకాగానే కార్మికశాఖ జోక్యం ఆశ్చర్యకరం. వారి దృష్టిలో ఉపాధి అవకాశాల ప్రోత్సాహంకంటే కార్మికుల వ్యక్తిగత సమస్యల పరిష్కారం ముఖ్యంగావడం ఆశ్చర్యం. ప్రపంచ బ్యాంకువారి తాజా అంచనా ప్రకారం మనదేశం పరిశ్రమల స్థాపనలో ప్రపంచంలోని 183 దేశాలల్లో 164వ స్థానంలో నున్న దేశంగా, నిర్వహణలో 134వ స్థానంలో మిగిలింది. ప్రభుత్వాలతో చేసుకోబడిన అగ్రిమెంట్లను అమలు జరిపించుకోవాలంటే ఇతర దేశాలన్నిటి కంటే రెండింతల సమయం వృధా అవుచున్నది. వివిధ అనవసర అవినీతి కార్యక్రమాలపై వెచ్చించబడే ధనం మొత్తం పెట్టుబడికి 40 శాతంగానుండడం జాతికే అవమానకరం. ఇవన్ని సంస్కరించబడనిదే మన దేశం సగౌరవంగా

ఆత్మ స్థైర్యంతో అబివృద్ధిని సాధించజాలదు. ఈనాటి ప్రపంచ పారిశ్రామిక ప్రగతి ముఖచిత్రంలో వస్తూత్పత్తి పరిశ్రమలు అభివృద్ధి చెందిన దేశాల కంటే అభివృద్ధి చెందుచున్న దేశాలచే అధికంగా ఆకర్షించబడుచున్నవి. చైనా అప్పుడే ఈ రంగంలో స్వావలంబనను సాధించుకుంటున్నది. ఈ లోటును భర్తి చేయగలిగే శక్తి భారతదేశానికి ఉన్నదని పారిశ్రామిక వ్యాపారవేత్తలు నమ్ముచున్నారు. భూమి, మానవవనరులు కోకొల్లలుగా లభ్యమయ్యే దేశంలో పెట్టుబడులను ఈ రంగానికి మళ్ళించడానికి అత్యధిక సంఖ్యలో ఔత్యాహికులు ముందుకువస్తున్నారు. భారత ప్రభుత్వాలు తమ పాలనా పరమైన జాడ్యాలనుండి విముక్తి పొందగలిగితే పారిశ్రామికాభివృద్ధి నిరుద్యోగ నిర్మూలన ఒక సమస్యకాదు. ఒకటి రెండు దశాబ్దాల అనతికాలంలో ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యంగావడంతోపాటు శ్రేయోరాజ్యాలన్నిటిలో ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించిన అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా పరిడవిల్లుతుంది.

# 4. మానవ వనరులు - విద్య

ప్రాథమిక విద్యా రంగం అత్యంత ప్రాధాన్యత గలిగిందన్న విషయం చెప్పనక్కర లేదు.ఇది దేశ భౌతికాభివృద్ధితో పాటు భారతీయ సాంస్కృతిక, నైతిక విలువలను పునరుజ్జీవింప జేయగల శక్తివంతమైన సాధనం. ఇంతటి జాతీయ బాధ్యతను నిర్వహించడానికి, ప్రభుత్వం ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా రాజ్యాంగ బద్ధం చేయడం హర్షించదగినది. ఇంతవరకు భారత రాజ్యాంగంలోని 4వ విభాగంలోని 45వ పరిచ్ఛేదంలో "విద్య" అను అంశాన్ని 4వ విభాగంనుండి మార్చి విధిగా అమలు పర్చి తీరవలసిన హక్కులుగల 3వ విభాగంలో చేర్చడం జరిగింది. దీన్ని ఒక ప్రాథమిక హక్కుగా గుర్తించడం మంచిమార్పు. ఈ బాధ్యతను నిర్వహించడానికై చేయవలసిన కృషి అపారమైనది. 6-14 సంవత్సరాల వయస్సు గలిగిన బాలబాలికల్లో కేవలం 20 శాతం ప్రైవేటు పాఠశాలల్లో చదువగా 80 శాతం లాంఛన ప్రాయంగా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలుస్తున్నది. బడికి రాకపోవడమో విద్యను చాలించడమో పెద్ద సమస్యగా భయపెడుచున్నది. అందులో బాలికల సంఖ్య అత్యధికంగా ఉండడం ఆందోళనకరం. నిర్బంధ ప్రాథమిక విద్య పూర్తిగా ఆచరణలోకి రావాలంటే రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఈ రంగంపై నిధులను గణనీయంగా వెచ్చించడంతో పాటు అనేక నిర్మాణపరమైన చర్యలను చేపట్టక తప్పదు. ఈనాటి విద్యాలయాలల్లో సుశిక్షిత, ఉపాధ్యాయుల సంఖ్య కనీసం రెట్టింపుకావాలి. విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలైన గదులు, టాయిలెట్లు, మంచినీటి సౌకర్యాలను కల్పించడంతో పాటు వాటిని పరిశుభ్రంగా నిర్వహించే ఏర్పాట్లు జరిగితీరాలి. మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించడం విశేషమయినా దాని నిర్వహణ ఏర్పాట్లు అంతకంటె గొప్పవి. చక్కని వంట శాలలు సకల సౌకర్యాలు గల భోజన శాలలు, పౌష్టికాహారాన్ని పరిశుభ్రంగా తయారు చేసి సరఫరా చేయడం బాలల ఆరోగ్యాన్ని కాపాడడం ఒక పవిత్ర భావిభారత పౌరుల రూపకల్పన కర్తవ్యంగా భావించాలి. చక్కని ప్రమాణాల ప్రాతిపదికపై నిర్వహించబడే సకల సౌకర్యాలు గల ప్రాథమిక విద్యాలయాలు, రాజ్యాంగ 86వ సవరణ ద్వారా కొత్తగా చేర్చబడిన 21-ఎ పరిచ్ఛేదాన్ని సార్థకం చేయగల్గుతాయి. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెలుతురులో ఈ చట్టం దేశ పునరుజ్జీవనానికి ప్రబల సాధనంగా ఉపయోగపడుతుంది. మత మౌఢ్యాలను ఛేదిస్తూ కులతత్వాల అడ్డుగోడలను కూలద్రోస్తూ, ఆర్థిక అసమానతలనధిగమిస్తూ బాల్యావస్థలోనే దేశ భిన్నత్వం లోని ఏకత్వాన్ని, మన విశిష్టమైన, మిశ్రమ సంస్కృతిని దర్శింపజేయగల్గుతుంది. ప్రజాతంత్రం మానవత్వానికి రాచబాటలు వేయ గల్గుతుంది. మంచి సంస్కారం సత్సాంప్రదాయాలతో పాటు నీతి నియమాలను క్రమంగా బాల్యావస్థలోనే వారికి ఒంటబట్టించడం జరుగుతుంది. సుప్రీంకోర్టు తన చరిత్రాత్మక తీర్పుతో గొప్ప సామాజిక సంస్కరణకు తెరతీసింది. అధిక ఖర్చులతో కూడి నాణ్యత గల విద్య నేర్పె ప్రైవేటు విద్యాలయాలల్లో ఇంత వరకు ఆర్థిక సామాజిక బడుగు బలహీన వర్గాలకు చెందిన బాలబాలికలు చదువుకునే అవకాశం ఉండేది కాదు. ఇప్పుడు ప్రైవేటు పాఠశాలల్లో గూడా నిర్బంధంగా కనీసం 25శాతం సీట్లు ఈ వర్గాలకు రిజర్వు చేయబడాలని సమున్నత న్యాయస్థానం నొక్కివక్కాణించింది. దీనికి అవసరమయ్యే నిధులను ప్రభుత్వమే భరించాలని ఘంటాపథంగా చెప్పింది. ఈ 25 శాతం సంఖ్య ఉండి తీరాలని ఖాళీలుండడానికి వీలులేదని ఉద్ఘాటించింది. ప్రతి విద్యార్థి పేర ప్రతి సంవత్సరం 10 వేల నుండి

20 వేల రూపాయల వరకు ప్రభుత్వమే చెల్లించక తప్పదని అంచనా. ప్రభుత్వ పాఠశాలల్ని మౌలిక సదుపాయాల కల్పన, విద్యా బోధన, ఉపాధ్యాయుల సామర్థ్యం జవాబు దారి తనంలో సంస్కరించడం జరిగితే ప్రైవేటు పాఠశాలలన్నిటితో అన్ని విషయాలల్లో పోటీపడడం అందులో నెగ్గడం ప్రభుత్వ పాఠశాలలకు అసాధ్యం కాకూడదు. విద్యను ఓ వ్యాపారంగా చేయరాదు. ఏది ఏమైనా పై విద్యా చట్ట సవరణ ఫలితంగా విద్యా గంధం లేకుండా కాయకష్టంపైననే ఆధారపడవలసిన అభాగ్యులెందరో ఏకలవ్యులుగా రాణించగల్గుతారు. సామాజిక పురోభివృద్ధికి తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించగల్గుతారు.

దేశ బహుముఖాభ్యుదయానికి ఇరుసుగా పని చేయగలిగే విద్యలో మన మెక్కడున్నామో చూద్దాం. సంఖ్యాపరంగా,గుణాత్మకంగా విద్యా వ్యాపకానికి మన కర్తవ్యమేమిటో తెలిపే వివరాలలోకి పోతె మనపై నున్న గురుతర బాధ్యత ద్యోతకమవుతుంది. దేశ ప్రజల్లో తమ ఇంటి ఖర్చులలో విద్యపై వేచ్చించే భాగం క్రమంగా పెరుగుచున్నది. బిడ్డల చదువులపై వెచ్చించే ఉద్దేశంతో ఆదాయాలను పొదుపుగా వెచ్చించె అలవాట్లు పెరిగిపోతున్నవి. జాతీయ సాంపుల్ సర్వే వారి తాజా అంచనాల ప్రకారం కుటుంబ ఆదాయంలో ఇప్పటికి సింహ భాగం ఆహారంపైన వెచ్చించబడుచున్నా, దాని మోతాదు తగ్గుతూ ఆహరేతర అవసరాలపై ఖర్చులు పెరుగుచున్నవి. విద్య, ఆరోగ్యం వస్తు వాహనాలు, వివిధ సేవలు రవాణా లాంటి అవసరాలపై ఖర్చులు గణనీయంగానే పెరిగినవి. అందులో విద్య అగ్ర భాగాన్నలంకరిస్తుండడం విశేషం. 1993–94, 2011–12 మధ్య కాలంలో ఒక కుటుంబ వార్షిక వ్యయంలో విద్యపై వెచ్చించబడే భాగం 2శాతం నుండి 7శాతానికి పెరిగింది.

గత 5–6 సంవత్సరాలలో దేశ వినియోగ మార్కెటు యొక్క సగటు పెరుగుదల ప్రతి సంవత్సరం 14–15 శాతముండగా విద్యపై వెచ్చింపు ప్రతి సంవత్సరం 21 శాతానికి పెరిగింది. 2004–05లో గ్రామీణ ప్రజల్లో 40 శాతం, పట్టణ ప్రజల్లో 57 శాతం కుటుంబాలు తాము విద్యపై అధికంగానే వెచ్చిస్తున్నామని తెలియచేశారు. ఇదే లెక్కన 2009–10 నాటి పరిస్థితిని అంచనా వేస్తే గ్రామీణ కుటుంబాలలో 63 శాతం, పట్టణ కుటుంబాలలో 73 శాతం విద్యపై ఇతోధికంగా వెచ్చిస్తున్నట్లు తెలియచేసినారు. అందరి అంచనాలను గమనించగా దేశ వ్యాపితంగానున్న కుటుంబాలన్ని తమ కుటుంబ ఖర్చుల నుండి 2011–12లో 1,50,000 కోట్ల రూపాయల్ని విద్యపై వెచ్చిస్తున్నారని తేలింది. సాధారణంగా పట్టణ ప్రాంతంలోని ప్రతి కుటుంబం ప్రతి నెల విద్యపై 1,035 రూపాయలు, గ్రామీణ ప్రాంతంలో ప్రతి కుటుంబం ప్రతి నెల విద్యపై 295 రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తున్నది. 7 సంవత్సరాల క్రితం పట్టణ, గ్రామాలలో పై అంకెలు కేవలం రూ॥ 322 మరియు రూ॥ 88 మాత్రమే ఉండినవి. విద్యపై అధికంగా వెచ్చించే రాష్ట్రాలలో ఉత్తరప్రదేశ్, మహరాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నున్నవి. ఈ పెరగుదల రేటు 2004–05, 2009–10 మధ్యకాలంలో 21.7 శాతంగా తేలింది. 5 సంవత్సరాల అనతికాంలో సుమారు 22 శాతం పెరుగుదల గణనీయం, గర్వకారణం.

కుటుంబాలల్లో వారి నిత్య ఖర్చుల్లో విద్యపై పెరిగిపోతున్న ఖర్చులకు కారణం తల్లి తండ్రులు ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చదివించడానికి ఇష్టపడుతున్నారు. విద్య ప్రియమైన సరుకుగా మారింది. దేశ విద్యాలయాల్లో 80 శాతం ప్రభుత్వ నిర్వహణలోఉన్నా

ప్రైవేటు విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య (2012) మొత్తంలో 37 శాతముండడం గమనార్హం. ప్రైవేటు పాఠశాలలో విధానం పాతదైనా విద్యాబోధన గుణాత్మకంగా ఉన్నత శ్రేణికి చెందడం 10-12వ తరగతి పరీక్షల్లో ఫలితాలు ఆకర్షణీయంగా ఉండడమే దీనికి కారణం. దీనికి తోడు ప్రభుత్వ పాఠశాలలతో పోల్చగా ప్రైవేటు పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు సానుకూలంగా ఉండడం మరో బలమైన కారణం. విద్యగరిపే విధానంతో పాటు, మౌలిక సదుపాయల ఏర్పాటు, విద్యార్థులు, ఉపాధ్యాయల మధ్య దామాషా, ఉపాధ్యాయలు పాఠశాలల్లోకి రాకుండా తప్పుకునే పరిస్థితి. పాఠశాలల ఎంపికలో తల్లి తండ్రుల ఆలోచనల్ని ప్రభావితం చేస్తున్నవి. కొన్ని స్వతంత్ర సంస్థల పరిశీలన ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయల గైరు హాజరు 27 శాతం నుండి 40 శాతం వరకు ఉండడం ఆశ్చర్యకరం. కొన్ని ప్రాంతాల్లో అసలు ప్రభుత్వ పాఠశాలలు లేని కారణంగా ప్రైవేటు పాఠశాలలకు అధిక ఖర్చులు భరించి తమ బిడ్డల్ని పంపవలసిన దుర్గతి ఇంకా ఉన్నట్లు తెలుస్తున్నది. మంచి విద్యా బోధనతోపాటు విద్యార్థుల్లో మంచి వ్యక్తిత్వాన్ని నిర్మించగల ప్రైవేటు పాఠశాలల్లో చదివి మంచి ఉద్యోగం సంపాదించడం, ఆర్థికంగా ఎదగడం కూడా ప్రైవేటు పాఠశాలల ఆకర్షణకి పెద్ద కారణం, ప్రజల ఆదాయాలు, ఖర్చులు, మిగులు సంపదలపై ఒక బాధ్యతగల సంస్థ చేసిన విశ్లేషణ ప్రకారం దేశ ప్రజల్లో విద్యా బలానికి గుర్తింపు పెరిగింది. ఇంకా పెరుగుచున్నది. విద్యా విహీనుడైన నిరక్ష రాస్యుని ఆదాయంకంటే ప్రాధమిక విద్యనభ్యసించిన వ్యక్తి ఆదాయం 21 శాతం అధికం, మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన వ్యక్తి ఆదాయం 62 శాతం అధికం, ఇంటర్ పూర్తి చేసిన వ్యక్తి 130 శాతం అధికం, గ్రాడ్యుయేటు అయిన వ్యక్తి ఆదాయం 203 శాతం అధికం కావడం అందరు గమనిస్తున్న వాస్తవాలు. స్థూలంగా విద్యపై ప్రజలు, ప్రభుత్వము చేస్తున్న ఖర్చుల ఫలితాన్ని అక్షరాస్యత పెరుగుదలలో పరిశీలిస్తే సంతృప్తికరమే. 2001లో అక్షరాస్యత శాతం 65% ఉండగా పది సంవత్సరాలల్లో 2011 నాటికి అది 74% శాతానికి చేరడం అభినందనీయమే. దేశ ఆర్థిక ప్రగతికి విద్యా విధానమే మూలమని ప్రపంచమెన్నడో గుర్తించింది. మన దేశ విద్యా వ్యాపకం దాని గుణాత్మక పరివర్తనలో, ఇంకా మనమెంతో దూరం ప్రయాణం చేయవలసియున్నది.

ఇంత ఖర్చు చేసినా ఇంకా 25 శాతం జనాభా నిరక్షరాస్యులుగాఉండడం, పాఠశాలలో ప్రవేశించిన విద్యార్థుల్లో కేవలం 15 శాతమే ఉన్నత విద్య స్థాయికి చేరడం అత్యంత దారుణం. వివిధ శాఖల్లో పట్ట భద్రులుగా ఎదిగిన వారిలో అత్యధికులు ఆయా శాఖల్లోనే ఉద్యోగాలకి అనర్హులుగా ఆయా పారిశ్రామికవేత్తలు ప్రకటిస్తున్నారు. నిరుద్యోగం కాదు, చదివిన చదువు ఉద్యోగానికి పనికి రాకపోవడం దేశాభివృద్ధికి ప్రధాన ప్రతిబంధకంగా మిగిలింది. నాణ్యతగల విద్య ఆవశ్యకత విద్యావిధానాన్ని గుణాత్మకంగా సంస్కరించడం గురించి ఇంతకు మించి చర్చించనవసరంలేదు. ఇందుకు బాధ్యులంతా కలసి ఆలోచించి యుద్ధప్రాతిపదికపై విద్యా విధాన సంస్కరణలకు కంకణ బద్దులు గావడం చరిత్రాత్మక కర్తవ్యం.

విద్యా విధాన సంస్కరణ గురించి కేంద్ర ప్రభుత్వం ఒకటిగాదు, నిష్ణాతులతో గూడిన 5-6 కమీషన్‌లకు నియమించింది. వారంతా చక్కని సలహాలతో కూడిన నివేదికలను సమర్పించియున్నారు. దశాబ్దాలు గడిచినా వాటిని ఆచరించాలనే సంకల్పం ప్రభుత్వాలకి కలగడం లేదు. ఇది యాదృచ్ఛికం

కాదు. ప్రజా బాహుళ్యంలో చైతన్య జ్యోతులను వెలిగించాలనే కర్తవ్య ప్రాధాన్యతను పాలకవర్గం గుర్తించ నిరాకరిస్తున్నది. వారిని సాధికారులుగా తీర్చిదిద్దడానికి సంసిద్ధత పాలకులలో కొరవడింది. ఈనాటి విజ్ఞానయుగం, పోటి ప్రపంచంలో స్వాతంత్ర్యానికి షష్టిపూర్తి జరిగిన తర్వాతగూడా మన దేశం విద్యాధికులు నిపుణుల సంఖ్యలో అట్టుడుగునే ఉండడం ఇంకా సహించరాని నిర్లక్ష్యం. నిర్బంధ ప్రాధమిక విద్యాచట్టం అమలులోకి వచ్చి గూడా 2013 ఏప్రిల్ నాటికి మూడు సంవత్సరాలు పూర్తి అవుతున్నప్పటికీ " సర్వ శిక్ష అభియాన్ " ఇంకా పురుటి నొప్పులతోనున్నది. మానవ వనరుల రూపకల్పనలో కేంద్ర బిందువైన నూతన విద్య, ప్రజారోగ్య రంగాల సంస్కరణలకు అంటే ఆధునిక మానవ వనరులకు, ప్రధమ స్థానం నివ్వడంలో పాలకులు విఫలమవుచున్నారు. ఇంకా వివరాలలోకి వెళ్ళితే ప్రాధమిక విద్యలో సుమారు 80 శాతం విద్యార్థులున్న ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలు కొకొల్లలు. పాఠశాలల్లో గదులు, కూర్చునే బల్లల కొరత మొదటిది కాగా మధ్యాహ్నం భోజన స్థలం, వంటగది, మంచినీటి సదుపాయం కొరత రెండవది. పిల్లలకు, మహిళా ఉపాధ్యాయులకు మల, మూత్రశాలలు లేకపోవడం వాటిని శుభ్ర పరిచే ఏర్పాట్లలేమి మూడవ ముఖ్యలోపం. పై మౌలిక సదుపాయాల కొరతల మధ్య నిర్వహించబడే విద్యా ప్రమాణాలు ఆశాభంగం కలిగించడం సహజం. అనేక స్వతంత్ర సంస్థల అంచనాల ప్రకారం విద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థుల్లో కనీసం 40 శాతం విద్యార్థులు అసలు బడికి రారు. ఉపాధ్యాయులలో 50 శాతం వంతుల వారిగా సెలవులు పెడుతూ గైర్హాజరవుతారు. ఏకోపాధ్యాయ పాఠశాలలనేకం. అక్కడ ఒకే ఉపాధ్యాయడు రెండు మూడు తరగతుల బాలబాలికలకు విద్య నేర్పడం బాధాకరం. ఉపాధ్యాయుల విద్యా స్థాయి, వారికి శిక్షణలోటు విద్యా ప్రమాణాల దిగజారుడు తనానికి మూలకారణం. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరవలసిన భావి భారత నిర్మాతల పునాదులే ఇంత బలహీనంగా ఉండడం దేశ పాలకులతో పాటు పౌర సమాజం గూడా ఆత్మ విమర్శ చేసుకోవలసిన అంశం.

పైనుదహరించినట్లు 6-14 సంవత్సరాల మధ్య వయస్సుగల బాల బాలికల్లో సగటు 80 శాతం పిల్లలు ప్రాధమిక విద్య నభ్యసించగా ఇందులో చదువు మానేసే వారు పోగా 15 శాతం విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. మౌలిక సదుపాయాలలోటు, శిక్షణ పొందిన ఉపాధ్యాయల కొరతలు వారి గైర్హాజర్ లాంటి ఇబ్బందులు, ఉన్నత స్థాయి పాఠశాలల్లో గూడా విద్యా ప్రమాణాన్ని దిగజార్చుచున్నవి. ఈనాటి పరిస్థితులకనుగుణ్యంగా సాంకేతిక శాస్త్రీయ, విద్య, దాన్ని అందించే విధి విధానాలలో మనదేశం పూర్తిగా వెనకబడియుండడం అత్యంత శోచనీయం. ఉన్నత విద్యారంగం వాటి కళాశాలలు, అందులో సాంకేతిక పాఠశాలలు కళాశాలలో ఉత్తీర్ణులయ్యే 5-10 శాతం " విద్యావంతులు " ఆచరణలో తమ ఉద్యోగ ధర్మ నిర్వహణలో అసమర్థులనిపించుకొంటున్నారు. దేశం విద్యపై ఎంత వెచ్చించినా విద్యను తీవ్రంగా సంస్కరించి గుణాత్మకంగా ప్రపంచ పోటీని తట్టుకునే విధంగా తీర్చిదిద్దడం గొప్ప జాతీయ కర్తవ్యం. ఇందుకు ప్రధాన ఉపకరణాలైన పాఠ్యాంశాలు, ఉపాధ్యాయ శిక్షణా ప్రక్రియల్లో ఆమూలాగ్రం సంస్కరణలు అవసరం. వాటి గురించి సంబంధిత వారందరితో ఏకాభిప్రాయాన్ని నెలకొల్పడం కూడా అంతే అవసరం. అందుకవసరమైన ఆర్థిక కేటాయింపులు చేయడం మరీముఖ్యం.

ఆధునిక ప్రపంచంలో, చిన్న పెద్ద వస్తు వాహనాల ఉత్పత్తికి వాటి వాణిజ్య వ్యాపారాలకు ఇదివరకెన్నడులేని అవకాశాలు ముందుకొస్తున్నాయి. అదే విధంగా సాంకేతిక పరి జ్ఞానం గల వారి ఉద్యోగ అవసరం అపూర్వంగా పెరిగిపోతున్నది. అభివృద్ధి చెందిన పెట్టుబడి దారి దేశాలు ఆర్థిక మందగమనంతో కొట్టుమిట్టాడుతున్న ఈ తరుణంలో మన లాంటి అభివృద్ధి చెందవలసిన దేశాలలో కుటీర పరిశ్రమలు, స్వయం ఉపాధినిచ్చే చిన్న పరిశ్రమలు త్వరగా ముందడుగు వేయగల్గుతాయి. చైనా, మలేషియా, ఇండోనేషియాలాంటి ఆసియా దేశాల అనుభవం మనకు మార్గదర్శకం. అందుకే సాంకేతిక నైపుణ్యతగల లక్షలాది యువతీ యువకుల్ని ఎంత త్వరగా తీర్చిదిద్దితే ప్రపంచ మార్కెటుతో పాటు, అనుదినం విస్తరిస్తున్న స్వదేశీ మార్కెటులో వారిని ప్రవేశపెడుతూ నిరుద్యోగాన్ని నిర్మూలించడంతో పాటు జాతి సంపదను ఇతోధికం చేయడం అసమానతలను తగ్గించడం కష్ట సాధ్యం కానే కాదు. పాలక, ప్రతిపక్ష పార్టీల్లో తగిన అవగాహనతోపాటు అవసరమున్న సహ కారాన్ని సాధించడం అత్యవసరం. విద్యా విధానాన్ని ఆమూలాగ్రం అత్యాధునిక స్థాయికి లేవ నెత్తడం ఎంత మాత్రం విస్మరించరాని ప్రజాహిత కర్తవ్యం.

కళాశాల విద్య, విశ్వవిద్యాలయ విద్య, ఆ తర్వాత డాక్టరేటు, పోస్టు డాక్టరేటు విద్యలో పాఠ్యాంశాలు వాటిలక్ష్యం నూతన మానవుని సృష్టిస్తూ ఆదర్శవంతమైన ప్రపంచ పౌరులను సృష్టించడంగా ఉంటుంది. ఈ నాటి శాస్త్ర సాంకేతిక యుగధర్మంకూడా అంతె ఉండాలి. అనతి కాలంలోనే మానవీయ విలువల్ని పెంచి పోషించగలిగే నూతన మానవ సమాజాల ఆవిర్భావం, వాటి ప్రాభవం పెరుగుతుంది. పెరగాలి. ప్రశ్నించే చొరవ, సాహసం, విమర్శిస్తూ విశ్లేషించే సామర్థ్యం, సృజ నాత్మ కతలుగల విద్యా వేత్తల సంఖ్య అత్యధికంగా పెరగాలి. విషయ విజ్ఞాన దాహంతోనిరంతరం నిత్య నూతన శిఖరాలనధిరోహించే తపనగల సమర్దుల సంఖ్య ఇనుమడించాలి. ఈనాడు సంఘ సంస్కర్తలు, రాజకీయ నాయకులు ఎదుర్కొంటున్న గొప్ప సమస్యలకు కారణం పై నుదహరించిన అశాస్త్రీయ స్వీయ మానసిక ఆలోచనా విధానమే. ఈ ఆలోచన, పవిత్ర మానవ హృదయంలో స్వార్థం, ద్వేషం, నిరాశ, నిస్పృహ, నకారాత్మకతలను సృష్టిస్తుంది. దాన్ని వ్యాపింపజేస్తుంది. అ విద్య అణచివేతల అంధకారంలోనున్న అశేష ప్రజాజీవనమేకాదు, విద్యా వేత్తలనబడే వారు, పండితులు, తుదకు సిద్ధాంతకర్తలు కూడా ఈ సంకుచిత భావజాలానికి కూపస్థమండూక మనస్తత్వానికి గురి అవుతూ కుహనా సిద్దాంత కర్తలుగా తయా రైనారు. కాలచక్రాన్ని అడ్డు కుంటున్నారు. కాలం చలనసహితం, మార్పు నిత్యం, సహజమనే ప్రకృతి ధర్మాన్ని మరిచి పోతున్నారు. సంస్కర్తలకి, ఈ ప్రకృతి ధర్మం సహకరిస్తుంది. అభివృద్ధి నిరోధక ఆలోచనల సిద్దాంతాలనీ వాటి భజన పరుల్నీ ప్రకృతి ధర్మం కాలగర్భంలోకి నెట్టి వేస్తుంది. నవోదయం జరిగితీరుతుంది.

పైన ఆశించిన భావ విప్లవం సమాజంలో క్రమంగానైనా రావాలంటే ప్రాథమిక స్థాయి నుండి అత్యున్నత స్థాయి వరకు ఈనాటి విద్యా విధానంలో మౌలిక మైన మార్పులు అవసరము. వాటి ఆవశ్యకత గురించి చర్చించినాము.మరింత లోతుగా ఆలోచిస్తే విద్య యొక్క తాత్వికత సంస్కరించ బడవలసిన అవసరం మన ముందున్నది. అలనాటి బానిస యజమానులు, పరాన్నజీవులైన రాజులు, చక్రవర్తులు ఆ తర్వాత భూ స్వాములు వారి తాబేదార్లంతా అనుసరించిన స్వార్థపర, అణచివేతధృక్పధం సామాజికనాయకుల మనస్తత్వాన్ని ప్రభావితం చేసింది. స్వీయ మానసిక తత్వాన్ని పోషించింది.

అందుకే మన ప్రజా బాహుళ్యం ప్రతి మార్పుపట్ల అపనమ్మకం, సందేహం, సంశయాత్మకతని ప్రదర్శిస్తున్నది. అనేకానేక అనుభవాలు, పోరాట గుణపాటాల తర్వాతనే సత్యాన్ని, మంచి మార్పుని సాధించగల్గుతామనే ఆత్మవిశ్వాసాన్ని స్వీకరించడానికి సంసిద్ధమవుతున్నది. విద్య ఈ మూఢ నమ్మకాలను ఛేదిస్తూ మంచి మార్పు మంచి భవిష్యత్తుపై విశ్వాసాన్ని కలిగిస్తూ వాటిని ప్రోత్సహించే దిక్సూచిగా దీక్షాపథంగా ఉపకరించాలి. ప్రజల చైతన్యవంతమైన ఉద్యమాలకు ఊపిరిపోస్తూ వారిలో తమ మంచి భవిష్యత్తు పట్ల కొండంత ఆత్మవిశ్వాసాన్ని సంతరింప చేయ గల్గుతుంది. 20వ శతాబ్దపు ప్రపంచ ప్రజా ఉద్యమాలన్ని నేర్పిన గుణపాఠమిది. దీని ద్వారా 21వ శతాబ్ది ప్రజాతంత్ర ఉద్యమాలు మరింత ఆత్మ విశ్వాసంతో అఖండ విజయ పరంపరలను సాధించగల్గుతాయి.

ఈనాటి స్వార్ధపర వర్గాలు పురాతన విద్యా విధానాన్ని సంస్కరించకుండా సామాన్యునికి సాత్విక విద్యాగంధం దొరకకుండా ప్రజాబాహుళ్యాన్ని వెలుగుబాటులోకి రాకుండా మరింత కాలం భావ దారిద్ర్యం, భావ దాస్యంలోనే ఉంచే విఫల ప్రయత్నాలు ఇంకా చేస్తున్నాయి. విజ్ఞులు, సామాజిక విప్లవకారులు ఐక్యంగా ప్రయత్నించి ఈ శృంఖలాల్ని బ్రద్దలు కొట్టడం అవసరం.

## ప్రైవేటు రంగం విద్య

ఈనాడు దేశవ్యాపితంగానున్న మొత్తం 13 లక్షల ప్రాథమిక పాఠశాలల్లో కేవలం సుమారు ఒక లక్ష మాత్రమే ప్రైవేటు పాఠశాలలున్నవి. ఇవి చాలవు. పట్టణ గ్రామ సీమల్లో ప్రభుత్వ పాఠశాలలో విద్యకంటే ప్రైవేటు పాఠశాల విద్యపై ఆకర్షణ బాగా పెరిగింది. ఉచిత నిర్బంధ విద్యా చట్ట సవరణ అమలు జరిగిన తర్వాత కూడా సీట్ల కొరత తీవ్రంగానే ఉంటుంది. ప్రభుత్వం మాత్రమే ఈ కొరతను పూడ్చజాలదు. ప్రైవేటు రంగంతో భాగస్వామ్యం ప్రభు త్వానికి అత్యవసరం. ప్రైవేటు – పబ్లిక్ పాఠశాలల అవతరణ, వాటి విస్తరణ ఈనాటి అవసరం. వాటిని అన్ని విధాలా ప్రోత్సహించడం విజ్ఞులందరి ధర్మం. ప్రైవేటు విద్యపై విధించిన అనేక నిర్బంధాలను సడలిస్తూ వాటికి ప్రోత్సహకాలను ప్రకటించడం అవసరం. ఇలా చేస్తే వెంటనే 10 వేల కోట్ల రూపాయలతో రంగ ప్రవేశం చేసేవారున్నారని ఒక అంచనా. బలహీనవర్గాల పిల్లలకు చక్కని అవకాశం అందుబాటులోకి వస్తుంది. నాణ్యతలతో కూడిన ప్రాథమికవిద్య విస్తరిస్తుంది. నూతన పాఠశాలల నిర్మాణం ఉపాధ్యాయల నియామకం తదితర మౌలిక సదుపాయాల రూపకల్పనలో ఒక అంచనా ప్రకారం ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రతి విద్యార్ధిపై 13000 రూపాయల ఖర్చు చేయవలసివస్తే అందులో అత్యధికభాగం ప్రైవేటు రంగం భరించగా ప్రభుత్వం కేవలం బలహీనవర్గాల ఫీజులు మాత్రమే భరించడం విద్యావ్యాప్తికి మంచి మార్గమే. దీన్ని క్రమబద్ధంగా ఉపయుక్తంగా అమలు పర్చడం దేశాభివృద్ధికి అత్యవసరం. ప్రభుత్వరంగంలో ప్రాథమిక విద్యతోపాటు ఉన్నత విద్యనుగూడా నిర్వహించే ప్రస్తుత విధానాన్ని వదులుకోవడంగాని తగ్గించడం గాని జరగరాదు. విద్య గురించి చేయబడిన చట్టాలను ఖచ్చితంగా అమలు పరుస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలన్నిటిని ఆదర్శవంతంగా సంస్కరించి అమలు పర్చవలసిందే. ఉపాధ్యాయలు విద్య ప్రమాణాలను పోషిస్తూ స్థానిక సంస్థలకు విద్యా కమిటీలకు జావాబుదారిగానుండి తీరవలసిందే. ప్రైవేటు, ప్రభుత్వ రంగాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలి. అది పెరగాలి. ఫలితంగా విద్య ప్రమాణాలు పెరగడంతోపాటు విద్య విస్తరణ వేగవంతమ

వుతుంది. జాతి బంగారు భవిష్యత్తు బహుముఖ నిపుణతలుగల యువతరంపైననే అధారపడుతున్న సత్యాన్ని సంపూర్ణంగా గ్రహించి దాన్ని సాధ్యం చేయాలి.

శాస్త్ర సాంకేతిక యుగంలో రంగప్రవేశం చేసిన సాధనాలన్నిటిని సమకూర్చుకునే నైపుణ్యతతో ఉపయోగించగల్గితే పబ్లిక్, ప్రవేటు రంగాల మధ్య ఈనాడున్న వ్యత్యాసాన్ని తొలగిస్తూ రెండిటి మధ్యనున్న తేడాలను తొలగించి మొత్తం విద్యా ప్రమాణాల్ని ఇతోధికం చేయగల్గుతాం. ప్రపంచీకరణ ప్రయోజనాల ఫలితంగా జాతీయ అంతర్జాతీయ విద్యవిజ్ఞాన వ్యాప్తిని గుణాత్మకంగా విస్తరించగల్గుతాం.

మాతృభాషలోనే ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్య నేర్పాలనే సిద్ధాంతాన్ని విధిగా ఏలాంటి మినహాయింపులేకుండా పాటించాలి. అదే విధంగా ఉన్నత విద్యకూడా నిర్వహించబడాలి. బాల్యావస్థలోనే ఒకటికి మించిన భాషలు నేర్చుకోగలిగే శక్తి పిల్లల్లో ఉంటుందని ప్రపంచమంతా గుర్తించింది. ఈనాటి ప్రపంచీకరణ నేపథ్యంతోపాటు భారతదేశంలో విభిన్న భాషలున్న వాస్తవాన్ని దృష్టి యందుంచు కుంటూ ప్రాథమిక, ఉన్నత స్థాయిలలో ఇంగ్లీషు భాషకు రెండవ స్థానమివ్వక తప్పదు.

తల్లిపాల శ్రేష్టత అందులోని రోగ నిరోధకశక్తి శారీరక దారుఢ్యతను పెంచేబలం ఎంత ప్రధానమో, మాతృభాష మాధ్యమంగా ఉండడం విజ్ఞానార్జనకి అంతే ప్రధానం. మాతృభాషలో విద్యనభ్య సించడం ఫలితంగా బాల బాలికల మస్తిష్కంలో నేర్చిన విద్య హత్తుకపోవడం, జ్ఞాపకముంచుకోవడం, మొదదులో నిర్మాణాత్మక సృజనాత్మకత సృష్టించబడడం సహజంగా సులభంగా జరుగుతుంది. పది సంవత్సరాల విద్యాకాలంలో ఉన్నత విద్యనభ్యసించిన వారందరిలో నైపుణ్యతలతో కూడిన వృత్తి విద్యలు ప్రగాఢంగా నాటుకుంటాయి. ప్రయోజనాత్మకంగా విస్తరిస్తాయి. ఫలప్రదంగా ప్రభవిస్తాయి. ఉపాధిని సమకూర్చుతూ నిరుద్యోగాన్ని నిర్మూలిస్తాయి. రెండవ భాషగా నేర్పబడిన ఇంగ్లీషు భాష కళాశాల విద్యనభ్యసంచడానికి తోడ్పడుతుంది. మాతృభాష మాధ్యమంగా నేర్చిన విద్య ఇతర భాషల్లో పెద్ద ఇబ్బంది లేకుండా రాణిస్తుంది. విజ్ఞానం వేరు, భాష వేరు. విజ్ఞానం ఇతి వృత్తమైతే భాష దానికి వాహనం కొత్త భావాలు సరికొత్త ఆలోచనలతో కూడిన విజ్ఞానానికి మాతృభాష వాడుక భాషలే చక్కని వాహికలుగా, మాధ్యమంగా ఉపకరిస్తాయి. అటువంటి పునాదులపై నిర్మితమయ్యే అదనపు విద్యతో భావం మూలం, భాష, మాధ్యమం ఆ తర్వాతనే. అందుకే పరాయి భాషల్లో విజ్ఞానాన్ని పొందిన పట్టభద్రులుకూడా పునాదులు లేని భవనాలులాగా ఉపాధి, ఉద్యోగావకాశాలని కోల్పోతున్నారు. కనీస ప్రమాణాలను సాధించలేకుండాపోతున్నారు.

దేశ ఉన్నత విద్య, ఉన్నత ప్రమాణాలతో సంతృప్తికర స్థాయికి చేరలేకపోవడం మన ఉన్నత విద్యా విధానాన్ని ప్రశ్నాత్మకం చేస్తున్నది. దేశ అభివృద్ధిలో అత్యంత ప్రధాన పాత్రను పోషించే వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాలతోపాటు పరిపాలనా రంగాన్ని సమర్ధవంతంగా నిర్వహించే గురుతర బాధ్యత ఉన్నత విద్యాధికులదే. వీరి విజ్ఞాన స్థాయి, శక్తి సామర్థ్యాలే దేశ బహుముఖాభివృద్ధిలో ప్రతిబింబిస్తాయి. దేశ సగటు, అంతరంగిక ఉత్పత్తి రేటు పెరుగుదలతోపాటు దేశ పౌరుల్లో ప్రతిబింబించే నాగరికత ఉన్నత ప్రమాణం, సంస్కార సమున్నత స్థాయి, నీతినియమాల సుగంధం, దేశ ప్రగతికి సాక్ష్యాలు వేలాది సంవత్సరాల సుసంపన్న సంస్కృతికి వారసులైన అనేక మంది విద్యాధికులు వివిధ జీవనరంగాలల్లో సంస్కారహీనులేకాదు నేరస్థులుగా కూడా ముద్రబడిపోవడం భరించలేని అవమానం.

ఈ దుస్థితిని నివారించడానికి, నిర్మూలించడానికి ఉన్నత విద్యా విధానం తన వంతు చర్యలను చేపట్టడం అత్యవసరం. నీతి నియమాల ప్రమాణాలతోపాటు శాస్త్ర సాంకేతిక రంగంలో గూడా అవసరమైన సంస్కరణలు దేశ నాయకుల దృష్టిని ఆకర్షిస్తున్నవి. శాస్త్రీయ దృక్కోణలోపం, మానవీయ విలువలపట్ల వైముఖ్యం నిత్య జీవితాన్ని సమస్యల వలయంలో బంధిస్తున్నది. మహిళాలోకం, ప్రత్యేకంగా పురుషాధిక్య విష సర్పాల పడగనీడల్లో బ్రతుకు భారాన్ని ఈడ్వవలసి రావడానికి ఇటీవల పెచ్చరిల్లుతున్న అరాచకమే సాక్ష్యం విద్యలో అన్ని స్థాయిల్లో నైతిక విలువల్ని బోధించకపోవడం. ధన దాహం, విలాసవంత జీవనశైలిని విశృంఖలం చేయడం ప్రబలకారణాలు. శాస్త్రవేత్తల కొరతతో పాటు దాదాపు అన్ని రంగాలల్లో పరిశోధనలను తగినంతగా ప్రోత్సహించకపోవడం కారణంగా ఏర్పడిన నైపుణ్య తాలోపం. నూతన ఆవిష్కరణలను అసాధ్యం చేస్తున్నది. ఫలితంగా ఉత్పత్తి కుంటుపడుతూ సరుకుల నాణ్యత తీవ్రంగా దెబ్బతింటున్నది. విశ్వ విద్యాలయాలే ఈ సమస్యలకు తగు సమాధానాలు చెప్పాలి. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు పరిశోధనా రంగానికి నిధులను ఇతోధికం చేయాలి. ఇదే దేశ ఆర్థిక స్వాతంత్ర్యానికి, స్వావలంబనకి ప్రాణప్రదం బహుముఖాభివృద్ధికి సోపానం. నవ నాగరికతకు రాచబాట.

దేశ సమస్యలన్నిటి పరిష్కారంలో "విద్య" పాత్ర గురించి ఎంతలోతుగా అధ్యయనం చేయ గలిగితే ఆ అధ్యయన ఫలితాల్ని ఆచరించగలిగితే అంత తొందరగా జాతి బహుముఖ వికాసంతో తేజోవంతమవుతుంది. సంక్షిప్తంగా పునశ్చరణ చేయాలంటే విద్యా విధాన సంస్కరణలు పాఠ్యాంశాల ఎంపికతో ప్రారంభం కావాలి. ఆధ్యాపకుల నైపుణ్యత, నడవడి, అందులోని ప్రతి అడుగు విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి. విద్య కేవలం పాఠాన్ని అప్పగించేశక్తి (రోటు) లేక విద్యార్థుల జ్ఞాపకశక్తిని పెంచే నిర్జీవ సాధనంగా మారరాదు. విద్యార్థులలో వారి మనో నేత్రాలకు సులోచనలుగా పనిచేస్తూ వారిలో బహుముఖ విద్యా సమస్యలపై ఆకళింపు, సామాజిక సృహ, ఉత్తమ పౌరులుగా ఎదిగే సామర్థ్యం, ప్రశ్నిస్తూ, వాటి సమాధానాలపై ఆలోచించే చింతన మేల్కొనాలి. ప్రజా స్వామ్యం, సహకారం, సహచర్యం, సద్భావం, పరిమళించే సాత్విక ధృక్పధానికి బలమైన పునాదుల నిర్మాణం జరగాలి. సకారాత్మక భావజాలం, సత్యశోధన ప్రవృత్తి రూపకల్పన జరగాలి. సామాజిక జీవితంలో బహుముఖ ప్రజ్ఞాపాటవాల ఆధారంగా ప్రజా జీవితాన్ని నిత్య నూతన రూపు రేఖల సంస్కృతీ పరిమళాలతో సుసంపన్నం చేయగలిగే దిశానిర్దేశం జరగాలి. ఇవన్ని అమాంతంగా అన్ని పాఠశాలల్లో ఆచరణ సాధ్యమనే భ్రమలో పడకుండా బాధ్యతగల నాయకత్వం ధృడ సంకల్పంతో కంకణ బద్ధులు కావడం శుభారంభం. అదే అంతిమ విజయానికి నవభారత నిర్మాణానికి తిరుగులేని సాక్ష్యం. విద్యా విధాన స్థితిగతులు వాటిని సంస్కరించవలసిన అంశాలపై నివేదించాలన్న కమిటి తమ రెండు నివేదికలలో నొక్కిచెప్పిన ఈ క్రింది అంశాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకం.

1. విద్య అన్ని స్థాయిలలో మాతృభాషల్లోనే గరపాలి. దానితోపాటు ఇంగ్లీషు లేక హింది భాష గూడా విధిగా నేర్పించాలి. భారత జాతీయ సమగ్రత నిర్మాణానికిది అత్యవసరం.

2. విద్యార్థులకు ప్రాధమిక స్థాయినుండి ఉన్నత స్థాయి వరకు భారతీయ సాంస్కృతిక విలువలు, నీతి నియమాలు వాటి పోషణ గురించి ప్రత్యేకంగా బోధించాలి. నాగరిక ప్రపంచంలో ముందడుగు వేయవలసిన బాధ్యత గురించి నొక్కి వక్కాణించాలి.

3. ప్రపంచంలో జనాభాలో రెండవ పెద్ద దేశంగావడం వలన ఆర్థికంగా విద్యావ్యాపకం గురించి అవసరమున్నంత పెట్టుబడిని వెచ్చించలేకపోవుచున్నాం. ప్రాథమిక విద్య అనేక సమస్యల వలయంలో చిక్కుకుని విద్యార్థుల విద్యా ప్రమాణాలు ప్రపంచంలోనే అత్యంత బలహీనంగా నుంటూ ఉన్నత స్థాయిలో గూడా కనీస ప్రమాణాలనందుకోలేకపోతున్నది. నిధుల వెచ్చింపు ప్రమాణాల హెచ్చింపుపై ప్రత్యేక శ్రద్ధ వహించక తప్పదు.

4. అనేక బాధ్యతలుగల ప్రామాణిక విశ్లేషకుల అభిప్రాయాల ప్రకారం 2025 సంవత్సరం నాటికి భారతదేశంలోని యువతరం అత్యధికంగా చిన్న వయె ప్రమాణంకలిగి యుంటుంది. అది విద్యా విజ్ఞాన బలం గల్గిన శక్తిగా మార్చబడాలి. దేశం వేగవంతంగా అభ్యుదయాన్ని సాధించాలంటే విద్య మాత్రమే ప్రధాన చోదకశక్తిగా అవతరిస్తుంది. పాలక వర్గాలు మేధావి వర్గాలు ఈ ప్రశ్నకు తగు సమాధాన్ని సమకూర్చవలసిన చారిత్రాత్మకావసరం ఏర్పడ్డది.

5. చివరి అంశమైనా అన్ని బలహీనతలకు హేతువుగానున్న మౌలిక సదుపాయాలు పాఠశాలల్లో పూర్తిగా కొరబడడం 90 శాతం పాఠశాలల్లో పరిశుభ్రమైన త్రాగునీరు, మల, మూత్రాల విసర్జన సౌకర్యాల కొరత అతి దారుణంగా వెంటాడుచున్నది. ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికపై ఈ లోటును పూడ్చుతూ, నాగరికతా ప్రమాణాలకనుగుణ్యంగా పై నిర్మాణాలను చేపట్టి పూర్తి చేయాలి.

# 5. మానవ వనరులు - ఆరోగ్యం

## ప్రజారోగ్యం

మానవ వనరుల నిర్మాణంలో విద్యతో పాటు అంతే ప్రాధాన్యతను సంతరించుకున్న రెండవ ముఖ్యాంశం ప్రజారోగ్యం. అవిద్య, అనారోగ్యమనే రెండు దోషాలు స్వతంత్ర భారతావని అభివృద్ధిని తీవ్రంగా అరికట్టడం కండ్లారా చూస్తూ నిస్సహాయులుగా మిగిలిపోతున్నాం. ఇంతటి ప్రాధాన్యతగల రంగాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లిప్త, నిర్లక్ష్య వైఖరి క్షంతవ్యం గానిది. ఈ రంగాలకివ్వబడుచున్న ప్రాధాన్యత, నిధుల కేటాయింపు వాటి వెచ్చింపు వాటి నిర్వహణ మానవ హక్కులనుల్లంఘించే స్థితిలోనున్నది. వైద్యం, విద్యతో కూడిన మానవ వనరులకు ప్రధమ ప్రాధాన్యత నిస్తూ దేశాభివృద్ధిని వేగిర పర్చడం సుపరిపాలన కోరేవారందరి ముందున్న గొప్ప కర్తవ్యం.

భారతదేశ వైద్య విధానానికి ఇంకా ఒక స్పష్టత సమకూరకపోవడం దురదృష్టకరం. కాల గమనం, విజ్ఞాన వ్యాపకం ప్రైవేటు ప్రభుత్వ రంగాల సహజ కృషి ఫలితంగా 1960లో కేవలం 40 సంవత్సరాలున్న సగటు ఆయుర్దాయం ఈనాటికి 67 సంవత్సరాలకు చేరి ప్రపంచ సరాసరి(సగటు) నందుకోగల్గడం గొప్ప అదృష్టమే. చక్కని వైద్య విధానం దాని సమర్ధవంత నిర్వహణ జరిగియుంటే ఈనాటి అకాల మృత్యువాతబడే మాతా శిశువుల సంఖ్య తీవ్రంగా తగ్గి సగటు ఆయుర్దాయ పరిమితిని త్వరగా అత్యధికం చేయడం అసాధ్యమేమికాదు. దేశ నైసర్గిక భౌగోళిక స్థానబలం, ప్రపంచంలోనే అత్యధికంగా పౌష్టికాహర పదార్ధాలను పండించగలిగే భూమి, వర్షపాతం, వాతావరణం కలిగిన దేశం మనది. మీదు మిక్కిలి ప్రపంచ అవసరాలల్లో దాదాపు 60 శాతం ఔషధ మొక్కలు లభ్యమయ్యే జీవ వైవిధ్య సంపదను సమకూర్చే సంజీవని మనపుణ్య భూమి. ఐనా రోగపీడుతులలో సగం జనాభాకి ఆధునిక ఔషధాలనందించే వ్యవస్థలేదు. దేశీయ ఉత్పత్తిలో కనీసం 1.5 శాతం నిధులైనా ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో కలిపి ప్రజారోగ్యం, వైద్యంపై ఖర్చు చేయడంలేదు. నిర్ధిష్ట విధాన లేమి, నిధుల కొరత ఈ రంగాన్ని పీడిస్తున్నది.

వైద్య విధాన రూపకల్పన చాలా సంక్లిష్టమైనదనే వాస్తవాన్ని కాదనలేము. ఇందులో ఇమిడియున్న సమస్యల గురించి ప్రభుత్వానికి ఒక స్పష్టమైన శాస్త్రీయ అవగాహన ఉండడం అవసరం. రోగ నివారణ, రోగ నిరోధన ప్రప్రధమమైనది. రోగ నిర్మూలన రెండవది. దేశ ప్రజలందరికిముఖ్యంగా సగం జనాభా నుండి మూడువవంతుల జనాభాకి వైద్య సేవలను ఉచితంగా అందుబాటులోనుంచడం మూడవ ముఖ్యాంశం. వివిధ వైద్య విధానాలను సమభావంతో ప్రోత్స హించడం వాటి ప్రయోజనాన్ని అందరి ఆరోగ్య రక్షణకూ సమర్ధవంతంగా వినియోగించడం నాల్గవ బాధ్యత. నిత్యం పెరిగిపోతున్న ఔషధాల ధరలను నియంత్రిస్తూ ప్రజా బాహుళ్యానికి అందుబాటు ధరలకే వాటిని అందించే సౌకర్యాన్ని కల్పించడం అయిదవ కర్తవ్యం. ప్రైవేటు రంగం ప్రభుత్వ రంగాల మధ్య సమన్వయాన్ని సమకూర్చుతూ పటిష్టవంతమైన ప్రభుత్వరంగానికి ప్రధాన పాత్రను పదిలపరచడం ఆరవ అంశం. ఇన్ని రంగాల్లో అత్యాధునికతలుగల వ్యవస్థల నిర్మాణం. వాటి నిరంతర కొనసాగింపుకవసరమైన నిధులను సమ కూర్చడం అందుకు సగటు దేశీయ వార్షిక సంపదలో కనీసం 2.5 శాతం నిధులను కేటాయించడం

వాటిని సద్వినియోగం చేయడం చివరి కర్తవ్యం. వందల సంవత్సరాలుగా అభివృద్ధి జెందిన పాశ్చాత్య దేశాల అమూల్యమైన అనుభవాలు మనతోపాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాల అనుభవాల వెలుతురులో పైనుదహరించిన సమస్యలను గుర్తించడం జరిగింది. ఆచరణలో మరిన్ని సామాన్య అంశాలు సమస్యలుగా పరిణమించే అవకాశాలు లేకపోలేదు. సమర్ధవంతమైన యాజమాన్యం మాత్రమే బాధ్యతగా ఈ సంక్లిష్ట సమస్యలకు సరళ, సాధారణ, పరిష్కారం సాధ్యం చేయగల్గుతుంది.

మనదేశానికి ఈ రంగంలో స్వాతంత్ర్యానంతర అనుభవాల కొరతలేదు. 11వ ప్రణాలికను పూర్తిచేసుకుంటూ ఎప్రిల్ 2012 నుండి 12వ ప్రణాళికలో చేరినాం. గడచిన 65 సంవత్సరాలల్లో మొదటి 40 సంవత్సరాలల్లో ప్రజారోగ్యం వైద్య సేవల్లో ప్రభుత్వ రంగ ప్రాధాన్యత దాని నియంత్రణ పాత్ర స్పష్టంగా కనబడింది. ఆ తర్వాత 25 సంవత్సరాలలో క్రమ క్రమంగా ప్రైవేటు, కార్పొరేటు సంస్థలు ఈ రంగంలో ప్రవేశించినవి. ప్రభుత్వం ప్రత్యక్షంగా, పరోక్షంగా వీటి ప్రాధాన్యతలకు దోహదపడడమేగాక ప్రోత్సహించింది. ఈరంగంలోనున్న ప్రభుత్వ నాయకత్వపాత్రను ప్రభుత్వమే ఉద్దేశపూర్వకంగా తగ్గించుకుంటున్నది. ఫలితంగా తీవ్రమైపోతున్న ఆర్థిక అసమానతల నేపధ్యంలో జనాభాలో సుమారు 60 శాతం పేదరికంలో 30 శాతం కటిక దారిద్ర్యంలో బాధపడుచున్నవారందరికి తమ ఆరోగ్య రక్షణ మోయలేని భారంగా పరిణమించింది. కార్పొరేటు ఆసుపత్రులలో ఔషదాల ఖరీదుకంటే ఆరోగ్య పరీక్షలపై ఖర్చులు అధికమైపోతున్నవి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైద్య విధానాలు సామాన్యులకు గాక సంపన్న వర్గాల ప్రయోజనాలకే అనుకూలంగా మారినవి. దీని ఫలితంగా " అందరికి ఆరోగ్యం " "అందని ద్రాక్ష"గా మారింది. ఇది ఇలాగే కొనసాగితే ద్రవ్యోల్బణం నిరుద్యోగంతో భాధపడుచున్న కోట్లాది ప్రజలు మరింతగా రోగ పీడితులుగా మారి మరింత దీనావస్థలోకి నెట్టబడక తప్పదు. పాలకవర్గ పార్టీలు, పౌర సమాజం ఈ పరిణామాన్ని ఒక సవాలుగా స్వీకరిస్తే తప్ప "అందరికి ఆరోగ్యం" ఒక కలగానే మిగులుతుంది.

రోగ నిర్మూలనకంటే అత్యధిక ప్రాధాన్యతగల అంశం రోగ నిరోధం లేక నివారణం, ఈ సత్యం ఈనాడు కొత్తగా వెలుగు చూచిందికాదు. శతాబ్దాల కాలంనుండి నిపుణులు, నిష్ణాతులైన శాస్త్రవేత్తలు గొంతెత్తి చెప్పిన అంశం. పరిశుభ్రమైన త్రాగునీరు ప్రాణప్రదం. పరిశుభ్రతలేని త్రాగునీటి ద్వారా క్రిమి కీటకాలు శరీరంలోకి ప్రవేశించి రోగాలను సృష్టించడం, ఆనారోగ్యకర మైన ధాతువులు ఫ్లోరైడులాంటివి అవసరానాకి మించి నీటి ద్వారా శరీరములో చేరడంవలన కనీసం 70 శాతం నుండి 80 శాతం రోగాలు తలెత్తుతున్నాయని అనేక విధాలుగా తెలియవస్తున్నది. రక్షిత నీటి సరఫరాకే అర్ధశాతాబ్దకాలం అవసరమైన దేశంలో పరిశుభ్రమైన త్రాగునీటిని ప్రజలకందించడం గొప్ప బాధ్యత. ఈనాటికి కూడా జనాభాలో సగభాగానికి శుభ్రమైన మంచినీరు లేదుగదా రక్షిత మంచినీటి సరఫరాకుకూడా వారు నోచుకోలేదు. రోగ నిరోధక చర్యల్లో ఇది ప్రధమం. దీనితోపాటు పరిశు భ్రమైన పరిసరాలు గల గృహ వసతి, మురికి కాలువల నిర్మాణం, వాటినిర్వహణ మరుగుదొడ్ల నిర్మాణం, విధిగా వాటి వినియోగం, వాటిని శుభ్రపరిచే సదుపాయం, చక్కని పర్యావరణం, ఆరోగ్య సంరక్షణకు కీలకం. ఇంతేకాదు పేదరికం అజ్ఞానం వలన ప్రజలు ఆనారోగ్య కారక వ్యసనాలకు

అలవాటు పడిపోయి వాటిని వదులుకోలేని స్థితిలో నున్నారు. కూరగాయలు, పండ్లుఫలాలు, పాలు, పాల ఉత్పత్తులనూ, అనేక రకాల పీచు పదార్థాలనూ ఉత్పత్తి చేసి అమ్ముకుంటున్నారుగాని వాటిని తమ నిత్య ఆహారంలో ఒక భాగం చేసుకోవడంలేదు. ఆకలితో ఆలమటించే కటిక దారిద్ర్యంలో నున్నవారు జనాభాలో 3 శాతం ఉండగా పేదరికంతో సతమతమయ్యేవారు 25-30 శాతం కాగా 5 సంవత్సరాలకులోపు వయస్సుగల బాలల్లో 45 శాతంగా నున్నవారంతా పౌష్టికాహార లోపం కారణంగా అనేకానేక రుగ్మతల వాతబడుతున్నారు, మరణిస్తున్నారు. కోకొల్లలుగానున్న గోధుమలు బియ్యం ప్రత్యక్షంగానో, నగదు బదిలి ద్వారానో వారికందించగల్గుతాము గాని వారిలో పౌష్టికాహార అవసరాన్ని గుర్తింపులోకి తేవడం, ప్రభుత్వం, ప్రజా సంస్థల బాధ్యత. స్త్రీలు ఈ విషయంలో గొప్ప పాత్రను పోషించగల్గుతారు. వారికి ఈ చైతన్యం అవసరం. మహిళా స్వశక్తి సంఘాలు ఈ దిశలో విప్లవాత్మక పాత్ర నిర్వహించగల్గుతాయి. ఇంకా బడి పిల్లల్లో స్థూలంగా 60-70 శాతం బాల బాలికలు రక్తహీనత బలహీన శరీర నిర్మాణ రుగ్మతలతో బాధపడుచుండడం జాతి చైతన్యలేమికి ప్రబల నిదర్శనం. వికలాంగులు మానసిక వికలాంగుల సంఖ్య తగ్గడంలేదు. ఈ పౌష్టికాహారలోపం బాల్యావస్థ నుండి వృద్ధాప్యం వరకు మనల్ని వెంటాడుతూనే ఉన్నది. ఇవి చాలవన్నట్లు అధికంగా ఉప్పు, కారం, వేపుడుతో కూడిన పదార్థాలు అవసరానికి మించిన మోతాదులో ఆహారంలో చేర్చుకోవడం అనేక రకాల జబ్బులకు హేతువవు చున్నది. సారాయి తదితర మత్తు పదార్థాల వాడకం. ధూమపానం ప్రాణాంతకంగా పరిణమించింది. వీటి నివారణకై ప్రభుత్వం పంచాయితి రాజ్ వ్యవస్థలు ఇందుకు అవసరమైన నిధులను వెచ్చిస్తూ పై దోషాలను నిర్మూలించే గురుతర బాధ్యతల్ని స్వీకరించాలి. ప్రజల్ని చైతన్యపరచాలి. రోగనిర్మూలన ఆ తర్వాత చర్య. ఇందుకు వైద్య పరీక్షలు వైద్యులు ఆవసరం. ప్రాథమిక చికిత్స కేంద్రాలకురానున్న ప్రణాళికాకాలంలో నిధులను కనీసం రెట్టింపు చేస్తూ అక్కడ నిపుణులైన సిబ్బంది నియామకం ద్వారా ఆరోగ్యపరీక్ష కేంద్రాల నిర్వహణ ప్రజారోగ్యానికి అత్యవసరం. సామాన్యమైన రోగ పీడితుడు వారి కుటుంబం ప్రాథమిక చికిత్స కొరకూ పట్టణాలకు వెళ్ళి రావడం బహు ప్రయాస, ఖర్చులతో కూడినది. ప్రభుత్వం తమ విధాన సంస్కరణ, నిధుల హెచ్చింపు ద్వారా పేదలు బలహీన వర్గాలకు అండగా నిలువగల్గుతుంది. రోగ నివారణ రంగాన్ని తమ విశిష్ట నాయకత్వంలోనే నిర్వ హించ గల్గుతుంది.

ప్రైవేటురంగం ఈ అంశంలో ప్రభుత్వంతో పోటికి రాలేరు. వచ్చినా నిలబడలేదు. కార్పోరేటు వైద్యశాలలకు రోగ నిరోధం వలన గొప్ప ప్రయోజనం లేదు. రోగ నిర్మూలనకంటే చికిత్స చేయడం ఉపయోగకరం. లాభదాయకంగూడా. ప్రభుత్వం స్థానిక స్వపరిపాలనా వ్యవస్థలు ముఖ్యంగా చైతన్య రథ సారథులైన స్వచ్ఛంద సంస్థలు, పౌరసంఘాలు, ఇతర ప్రముఖులు ఈ బాధ్యతను విజయవంతంగా నిర్వహించగల్గుతారు. గ్రామీణ మౌలిక సదుపాయల నిర్మాణం దీనికి గొప్పగా తోడ్పడుతుంది. ప్రజలకి చేతినిండా పని కల్పిస్తూనే వారి చైతన్యస్థాయిని పెంచగలుగుతుంది. మన దేశంలోనున్న వైద్య విధానాలు, ప్రకృతి చికిత్స, ఆయుర్వేద, యునాని, హోమియోపతి, అల్లోపతి, ఇవన్ని శతాబ్దాల తరబడి కాల పరీక్షలకు నిలబడి ప్రజారోగ్య పరిరక్షణలో ప్రముఖపాత్రలను పోషించినవి. ప్రపంచ వ్యాపితంగా యుగయుగాలుగా స్థానిక వైద్య విధానాలు అవతరించి ఉపయోగంలోకి వచ్చినవే. అన్ని వైద్యాలకు మూలం వన మూలికలు, వాటి ఫలాలే. మనదేశం ఔషధ మొక్కలకి వనమూలికలకి

ప్రపంచంలో గొప్ప పేరుగాంచింది. ప్రపంచ అవసరాలలో మూడవవంతు మూలికలు ఇక్కడే లభ్య మవుతున్నవి. అన్ని రకాల వైద్యంలో, రసాయనాల వాడకం కొన్ని మోతాదుల్లోనున్నా, అత్యధిక భాగం వివిధ రూపాలు, మోతాదుల్లో వాడబడే మందులు ఔషధ మొక్కలు వాటి ఉత్పత్తులకు సంబంధించనవే. మనదేశం జీవ వైవిధ్యానికి దాని బహుముఖ ప్రయోజనానికి పెట్టిందిపేరు. వివిధ వైద్య విధానాల ఆచరణ, వాటి ప్రయోజనం రోగనిర్మూలనకు ఎంత వరకు ప్రయోజనాత్మకమో కాలం, అనుభవం నిర్ణయిస్తుంది. వీటికి తగిన ప్రోత్సాహన్ని అందజేస్తూ, వీటి మధ్య అనారోగ్యకర వైరుధ్యాలకు ఆస్కారం లేకుండా చూచే బాధ్యత సమకాలీన ప్రభుత్వాలపైనుంటుంది. ఆయా వైద్యుల పైన వారి అనుచరులపై నుంటుంది. ప్రపంచ వ్యాపిత గుర్తింపు, ఆదరణ పొందిన ఆధునిక శాస్త్రీయ అల్లోపతి వైద్య విధానం అన్నిటికంటే బాగా ప్రచారంలోనున్న విషయం తెలిసిందే. ఇందులో గూడా వనమూలికలు, రసాయనాలు, లవణాలు, వివిధ రూపాలలో విభిన్న మోతాదుల్లోనుండడం గమనార్హం. శస్త్ర చికిత్స దీనిలో అదనపు ఆకర్షణ. అత్యాధునిక పరీక్షలు, శరీర భాగాలన్నిటిని ఛాయాచిత్రాల ద్వారా విశ్లేషించగలిగే శాస్త్ర సాంకేతిక యుగంలో అల్లోపతి వైద్య విధానానికి ప్రపంచ వ్యాపితంగా, మనదేశంలోగూడా ప్రాచుర్యం, ఆదరణ బాగా పెరిగింది. ఐనా కొన్ని రకాల జబ్బుల శాశ్వత నిర్మూలనలో దేశీయ వైద్యం తన ప్రాచుర్యాన్ని కోల్పోలేదు. ఈ విధానాలన్ని సహజీవనం చేస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో స్నేహ పూర్వకంగా పోటి పడడం అవసరం. వీటి మధ్య వైరుధ్యాలుండడం అనర్ధదాయకం. అఖిల భారత వైద్య కౌన్సిల్ అల్లోపతి వైద్య విద్యలో పట్ట భద్ర సర్టిఫికెట్ కొరకు 5-6 సంవత్సరాల కాలపరిమితిని నిర్ణయించడం ఎవరికి అభ్యంతరం కాకూడదుగాని పెరిగిపోతున్న ప్రజా బాహుళ్యానికి కనీస ప్రాథమిక వైద్య సేవలనందించడానికై మూడు సంవత్సరాల అలోపతి కోర్సుల ఏర్పాటుచేసి తగిన గుర్తింపునిస్తే అవసరమున్న మేరకు వైద్యులు లభించడం, వైద్య సదుపాయాలను కల్పించడం సాధ్యపడుతుంది. అలాగే స్త్రీ, పురుషులైన నర్సుల సంఖ్యకూడా మూడు, నాలుగురెట్లకు పెంచుకోవడం తక్షణావసరం. ఈ విషయంలో ప్రభుత్వమనుసరిస్తున్న పట్టుదలతోకూడిన పిడివాద వైఖరి మారాలి. ఈ గుర్తింపు రోగ నిరోధన నివారణ బాధ్యతల నిర్వహణకు అవసరమైనది. దేశంలోనున్న 23 వేల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 5 వేల కేంద్రాలైనా సకల సౌకర్యాలతో రోగ పీడితులకు సంతృప్తికరంగా పనిచేయడంలేదు. ప్రభుత్వం వెంటనే అన్ని కేంద్రాలను అధునికీకరిస్తూ మరిన్ని కేంద్రాలను కొత్తగా స్థాపించగల్గుతుందనుకోవడం అసమంజసం. అలాగని ఈ రంగాన్ని అమెరికాలాగా పూర్తిగా ప్రైవేటీకరణ చేయడం, చైనాలాగ ప్రభుత్వమే నిర్వహించడం ఏ మాత్రం ఉపయుక్తంగాదు. బ్రిటన్‌లాగా ఖర్చుల్లో సింహభాగాన్ని ప్రభుత్వమే భరిస్తూ కార్పొరేటు ప్రైవేటు రంగాలను ప్రోత్సహించడమే మేలు. ప్రభుత్వం తన నియంత్రణా వ్యవస్థకు పదును పెడుతూ అన్ని రంగాల సౌహార్దం, స్నేహ పూర్వక పోటీ ద్వారా శీఘ్రగతిన ప్రజారోగ్యాన్ని ఉన్నత ప్రమాణాలతో సాధించడం అత్యుత్తమ పరిష్కార మార్గం. ఆరోగ్య భీమాపథకం ఈ రంగానికెంతో తోడ్పడుతుందనేది సత్యం. ఇది ప్రపంచ వ్యాపిత అనుభవం. ఈనాడు పాక్షికంగా అమలు చేయబడుచున్న ఈ పథకాన్ని క్రమంగా విస్తరిస్తూ ఆర్థిక భారాన్ని పేదలకు తగ్గించే ఆలోచనలు చేయడం ఉపయుక్తం. ప్రజారోగ్య పరిస్థితి ఈనాడున్న అత్యంత దయనీయ స్థితినుండి సాధ్యమైనంత త్వరగా బాగు పడాలనే ఉద్దేశంతోనే ప్రైవేటురంగ సహాయాన్ని, భాగస్వామ్యాన్ని కోరుకోవడం సాధించడం, తక్షణ పరిష్కారమార్గం. శాశ్వత పరిష్కారంగా

ప్రభుత్వాలే ఆరోగ్య భీమా పథకాల ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణ భారాన్ని స్వీకరించడం జరగవలసిన పని. ప్రజల ప్రాధమిక విద్య, ప్రాధమిక ఆరోగ్య బాధ్యతలు సంపూర్ణంగా లాభార్జన ప్రధానమైన కార్పోరేటు రంగాలకు వదలరాదు.

శాస్త్ర సాంకేతికయుగ ఫలంగా 20వ శతాబ్దిపూర్వార్ధ భాగ చివరి దశకంలో కీ॥శే॥ అలెగ్జాండర్ ఫ్లెమింగ్ అను వైద్యశాస్త్ర పరిశోధకుడు " పెనిసిలిన్ " అను రోగ కారక సూక్ష్మ క్రిమి సంహారక ఔషధాన్ని ఆవిష్కరించినారు. రోగకారక సూక్ష్మ జీవులను నిశ్శేషం చేయడం దీనిపని. వందలాది రుగ్మతలకు కారణభూతమయ్యే సూక్ష్మ జీవులను హతమార్చుతూ రోగులకు వర ప్రదాయినిగా ఆల్లోపతి వైద్యశాస్త్రం,వైద్యరంగంలోనే విప్లవాత్మక మార్పులు తెచ్చింది.ఇందుకు శ్రీ ఫ్లెమింగ్ నోబెల్ బహుమానం తో సన్మానించబడినారు. గత దశాబ్దాలుగా సాధించిన అనుభవం మరో సత్యాన్ని ఆవిష్కరించింది. ఈ ఔషధాలు రోగ కారక సూక్ష్మజీవులను హతమార్చడంతోపాటు మానవారోగ్య రక్షక సూక్ష్మ జీవులను హతమార్చుతు కూడా హతమార్చుతూ రోగులకు అనేకానేక కొత్త సమస్యలను సృష్టించడం జరిగింది. దీన్నెదుర్కోవడం ఈనాటి వైద్య శాస్త్రజ్ఞులకు పరిశోధకులకు కొరకరాని కొయ్యగా పరిణ మించింది."ఆంటిబయోటిక్ " ఔషధాలను అత్యంత జాగ్రత్తగా ఉపయోగించడం అసలు కొన్నింటిని నిషేధించడం అవసరమని నిపుణుల వాధన. ప్రపంచ వ్యాపిత అనుభవాల వెలుతురులో వైద్య పరిశోధకులు ఆచరణాత్మక ప్రయోజనాత్మక నిర్ణయాలకిరావడం వాటిని ఆచరించడం వెనువెంటనే నిర్వహించవలసిన ప్రజారోగ్య కర్తవ్యం.

దేశాభివృద్ధికి ఆరోగ్యకర మానవ వనరుల అవసరాన్ని స్థూలంగా గమనించిన వారంతా దీనిలో అధ్యాపకులు, వైద్యులు అనుసరించవలసిన అద్వితీయ పాత్రను విస్మరించలేరు. వీరి నైపుణ్యత, నిస్వార్థ సేవాతత్పరత జాతి నిర్మాణానికి ప్రాణప్రదం. అటువంటి కరుణామయుల సృజనాత్మకత, శక్తి సామర్ధ్యాలను నిరంతరం పెంచి పోషించడం జాతి కర్తవ్యం.వీరి సేవలను, సేవా ఫలితాలను వారికందించే జీత భత్యాలతో తూకం వేయలేము. ఇది అమూల్యమైన అసమానమైన సేవ. ఐతే వీరికి ఈనాడిస్తున్న పారితోషికం తక్కువ. ప్రైవేటు రంగంలో వారు పొందే పారితోషికంతో పోల్చదగిన జీత భత్యాలను వారికి అందచేయడం ప్రభుత్వ విధి. విద్యా, వైద్య సేవల విస్తరణలో నిధుల కొరత ఎట్టి పరిస్థితులలోకూడా ఆటంకంగా మారరాదు.

శ్రీయుతులు జీవ్ డ్రెస్, నోబెల్ బహుమాన గ్రహీత అమర్త్యసెన్ గారలు కలిసి ఇటీవల రచించిన " ఓ అస్థిర గాంభీర్యం " అను గ్రంధంలో భారతదేశాభివృద్ధి మార్గాల గురించి లోతుగా విశ్లేషించినారు. అందులో ప్రజారోగ్యం గురించి చెప్పిన ఆసక్తికర వివరాలు గమనార్హం. వారి అభిప్రాయంలో అభివృద్ధి మార్గాల అన్వేషణకై ఏదో ఒక దేశాన్ని అనుకరించడం ఏ మాత్రం సరైందికాదు. ప్రపంచదేశాలు మరియు మన దేశంలోని వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల్లో విభిన్న అనుభవ సంపద సిద్ధంగానున్నది. చైనా, జపాన్‌లతోపాటు ప్రజారోగ్య పరిరక్షణ గురించి మనం నేర్చుకోడానికి బ్రెజిల్, మెక్సికో, థాయలాండ్, వియత్నాం లాంటి దేశాల్లో చక్కని అను భవాలున్నవి. అక్కడి అనుభవాలను మనదేశ పరిస్థితులకన్వయిస్తూ పట్టువిడుపులతో ఆచరించగల్గితే మంచి ఫలితాల్ని పొంద గల్గుతాం. ప్రాధమిక విద్య విషయంలో మన కేరళ రాష్ట్రం సాధించిన చక్కని అనుభవాల్ని అనుకరిస్తున్న

తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు సంతృప్తిగా ముందంజ వేస్తున్నాయి. ప్రజారోగ్యం విషయంలో మన దేశం ప్రపంచంలోనే బాగా వెనకబడి పోవడాన్ని పలువురు వేలెత్తి చూపడం తలవంపుగా నున్నది. పక్క దేశమైన బంగ్లాదేశ్ మన దేశ తలసరి దేశీయాదాయంలో సగభాగం గూడా లేని దేశమైనా ప్రజారోగ్యంలో మన దేశానికంటే మంచి స్థానాన్ని ఆక్రమించియుండడానికి గల కారణం అక్కడి పాలకులు ఈ రంగానికిచ్చే ప్రాధాన్యతే.

20 సంవత్సరాల క్రితం ఈ రంగంలో మనకంటే చాలా వెనకబడిన ఈ దేశం ఈనాడు మనల్ని వెనక్కి నెట్టగల్గడానికి గల కారణాలను 2006లో ఉభయ దేశాలల్లో చేయబడిన సర్వే వివరాలు తేటతెల్లం చేస్తున్నవి. బంగ్లాదేశ్‌లో 82 శాతం పసిపిల్లలు, పిల్లలు సంపూర్ణంగా ఇమ్యూనైజ్ అయినారు. అంటువ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందారు. 88 శాతం పిల్లలకు విటమిన్ 'ఎ' సరఫరా అవుతున్నది. 89 శాతం పసిపిల్లలకు పుట్టిన ఒక గంటలోగానే తల్లిపాలు పట్టే వ్యవస్థను ఏర్పాటు చేసినారు. 85 శాతం అతిసార వ్యాధికి గురైన బిడ్డలకి సమయానికి ద్రవ పదార్థాల ద్వారా బలాన్ని అందించే చక్కని సౌకర్యాలు అందుబాటులో నుంచడం జరుగుతున్నది. ఇదే అంశాలల్లో ప్రతిదానిలో భారతదేశం సగానికంటే ఎక్కువగా వెనబడియున్నట్లు అంకెలు రుజువు చేస్తున్నాయి. విటమిన్ 'ఎ' సమకూర్చడంలోనైతే ఆ అంకె 25 శాతానికి మించడంలేదు. ఇంతే కాదు అనేక రోగాలు అంటువ్యాధులకు హేతువైన బహిరంగ ప్రదేశాలలో మల విసర్జన చేసే దురలవాటు మనదేశ "జనాభాలో 60శాతం ముండగా" బంగ్లాదేశ్‌లో 10 శాతంకంటే మించిలేదు. ప్రజారోగ్యం దారుణంగా నిర్లక్షానికి గురిఅవుతున్నది. ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులే విద్యా, వైద్య రంగాలలోని వెనకబాటుతన్నాన్ని రుజువుచేస్తున్నవి. భారతప్రభుత్వం ఎరువులు, పెట్రోలు ఉత్పత్తుల పంపకంలో ఇచ్చే సబ్సిడికంటే తక్కువ మొత్తం మానవవనరుల నిర్మాణంపై వెచ్చించడం జరుగుచున్నది. ఎరువులు, పెట్రోలు ఉత్పత్తులపై ఇచ్చే సబ్సిడి మొత్తం సగటు దేశీయ ఉత్పత్తి (జి.డి.పి)కి 1.5 శాతం ఉండగా ఆరోగ్య పరిరక్షణపై 1.2 శాతం మాత్రమే ఉన్నది. చైనాలో ఇది 2.7 శాతం. అభివృద్ధి చెందిన దేశాలలో సగటు 6.5 శాతం ఉండడం గమనార్హం. ఇంకా వివరాల్లోకి వెళ్ళితే భారతదేశం ప్రతి మనిషిపై ప్రతి సంవత్సరం ఆరోగ్య పరిరక్షణకై 39 డాలర్లు వెచ్చించగా చైనా 203 డాలర్లు బ్రెజిల్ 483 డాలర్లు, శ్రీలంకగూడా 66 డాలర్ల మొత్తాలు వెచ్చించడం మన పాలకవర్గాల బుద్ధి హీనతకు ప్రబల నిదర్శనాలు. పాలక వర్గాలు ఉద్దేశపూర్వకంగానే ఈ కీలకరంగాలైన ప్రజారోగ్యం విద్య రంగాలను ప్రైవేటు కార్పోరేట్ రంగాలకు పూర్తిగా వదిలేస్తున్నవి. భారీ పరిశ్రమల రంగాన్ని తమ చేతిలోనుంచుకునే కంటే అంతకంటే భారీ అయిన మానవ వనరుల రంగంలో సింహభాగాన్ని ప్రభుత్వమే నిర్వహించడం అత్యవసరం. ఏ సిద్ధాంతం దీనికి వ్యతిరేకంకాదు. ప్రయోజనాత్మక విద్య, ప్రజారోగ్యం ద్వారానే పారిశ్రామికాభివృద్ధి సాధన చారిత్రిక సత్యం. వెనకబాటుతనానికి కారణం వనరుల కొరత కానేకాదు. మానవాభివృద్ధి లక్ష్యం గురించి పాలకులకున్న అవగాహనారాహిత్యం, నిర్లక్ష్యం, ప్రాధమిక ఆరోగ్యం, విద్యారంగాలు దేశ ఆదాయ వ్యయ పట్టికలో ప్రప్రధమ స్థానాన్ని అలంకరించిననాడే దేశ భవిష్యత్తు బాగుపడుతుంది. సామాజిక ఆర్థిక వ్యత్యాసాలున్నంతకాలం బడుగు బలహీన వర్గాల ప్రాధమిక సమస్యల పరిష్కార ప్రాముఖ్యం పాలక వర్గాల గుర్తింపులోకి రావు. సామాజిక స్పృహతో అట్టడుగు వర్గాల అభివృద్ధికి అంకితమయ్యే పౌర సమాజం మేల్కొని రంగ ప్రవేశం చేస్తూ రాజకీయాలతోపాటు

పాత అలవాట్లు మూఢనమ్మకాల చీకటి కోణాలనుండి సామాన్య స్త్రీ, పురుషుల్ని వెలుగుబాటలోకి ఆకర్షించడం తక్షణ కర్తవ్యం.

" ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం మురికి కాలువల నిర్మాణం, వాటిని శుభ్రపరచడంపై ఒక డాలరు వెచ్చించితే 9 డాలర్ల విలువైన సామాజిక ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది. ఇంతటి గొప్ప ప్రయోజనం సాధించబడాలంటే " విశాల ప్రాతిపదికపై బలోపేతమైన ఉద్యమాల ద్వారా ప్రజాస్వామ్య పరివర్తనలు సాధించడమొక్కటే పరిష్కార మార్గం. పరిణత ప్రజాచైతన్యం, పదునెక్కిన ప్రజా ఉద్యమాలే దీనికి బాసట.

ప్రకృతి చికిత్సలో కీలకమైన ప్రాణాయామం, వ్యాయాయం ప్రతి వయస్సులో ఆరోగ్య రక్షణకు కీలకం. శరీరంలోని ప్రతి అవయవానికి తగినంత ప్రాణవాయువును సమకూర్చడం అ అవయవాలన్ని తమ పాత్రల్ని చురుకుగా సమర్థవంతంగా నిర్వహించే విధంగా చూడడం ఈ చికిత్స లక్ష్యం. మానసిక శాంతి, క్రమశిక్షణదీని ప్రయోజనాలు. ప్రతి రుగ్మత లక్షణాలను శాస్త్రోక్తంగా గమనించి శరీరానికి కొరవడిన ధాతువులను రక్తం ద్వారా సరఫరా చేయడం, ఆహార విహార దోషాలను ఆరికట్టడం ఆయుర్వేదం చేసే గొప్ప పని. వ్యాధి శాశ్వత నిర్మూలనతో పాటు నివారణోపాయాలను తెలియచేసే వైద్యశాస్త్రమిది. యునాని వైద్యం మధ్య ప్రాచ్యం నుండి అందుబాటులోకి వచ్చింది. దీని పరీక్షావిధానం చికిత్సా విధానం కాల పరీక్షలన్నిటిలో నెగ్గిన ఆయుర్వేద వైద్య విధానంతో పోల్చదగింది. హోమియోవైద్య విధానం పుట్టుకతో పాశ్చాత్య విధానమైనా మన దేశంలో మంచి ప్రాచుర్యాన్ని పొందింది. వ్యాధిని క్షుణ్ణంగా పరిశీలించడం అందుకు కారణభూతమైన సూక్ష్మ జీవులు,లవణాల కొరతను గుర్తించడం దీని ప్రథమ దశ. ఆ తర్వాత రోగానికి హేతువైన విషపదార్థాన్ని చిన్న మోతాదుల్లో చక్కెర అనుపానంతో క్రమంగా రోగికి చికిత్సగా ఇవ్వడం రెండవదశ. రోగ నిర్దారణ, రోగ కారకాల నిర్థారణ ఇందులోకీలకం. రక్త నాళాలుగాక, నరాల స్పర్శ మాధ్యమంగా ప్రతి రోగానికి శాశ్వత చికిత్స జరుగుతుందని దీని సిద్ధాంతం. ముల్లును ముల్లుతోనే తీసె సామెతను సార్ధకం చేస్తూ ప్రజల మన్నన పొందుచున్న ఈ చికిత్స ఏలాంటి ప్రతిక్రియలు లేనిది, చౌకగా దొరికేదిగా గుర్తింపు పొందింది.

ఏది ఏమైనా యుగయుగాల మానవ నిరంతర అనుభవాల ఫలితాలే ఈ వైద్య విధానాలు, తమ కంటూ శాస్త్రీయ పునాదులను పటిష్టంగా నిర్మించుకుని కాల పరీక్షలో నిలదొక్కుకున్నవి. జీవ వైవిధ్యాలు గల ప్రకృతి ప్రసాధించిన వైద్య విధానాలివి. జ్ఞాన విజ్ఞాన పరిణామక్రమంలో అవ తరించి ప్రజారోగ్యానికి శ్రీరామరక్షగా నిలచిన ఈ విభిన్న వైద్య విధానాలు ఇంకా సూక్ష్మంగా పరిశోధించబడి ప్రజారోగ్య సాధనలో ప్రబలంగా తోడ్పడాలని " అందరికి ఆరోగ్యం" అనతికాలంలో అందుబాటులోకి రావాలని మానవతావాదులందరి మనోవాంఛ. పై నుదహరించిన విభిన్న వైద్య విధానాలు రోగులకు ఏలాటి నష్టం, కష్టం కాకుండా పైగా ఉపయుక్తంగా నుండే అవకాశాలుంటే వీటిని సమీకృతం సమ్మిళితం చేసే దిశలో ప్రయోగాలు ప్రయత్నాలు ప్రోత్సహించదగినవి. అన్నిటికి ఒకే మాతృక అయినప్పుడు ఇటువంటి ప్రయత్నం ఉపయుక్తం కావచ్చును. సృష్టికి ప్రతి సృష్టిని సాకారం చేయగలిగే శాస్త్రవేత్తల మేధాశక్తి మహితాత్మకం.వారికి నివేదించడమే పౌర సమాజబాధ్యత.

విశృంఖలంగా ఇటీవల జరుగుచున్న వాణిజ్య వ్యాపార విస్తరణ, ధనార్జన దుష్ప్రభావం ఔషధాల ధరల పెరుగుదలలో కొట్టవచ్చినట్లగుపడుచున్నది. అత్యాధునిక వైద్య విధానమైన " అల్లోపతి" చికిత్సకై ఎన్నుకోబడిన ఔషధాల ధరలు సామాన్యునికి అందని చందమామగా పరిణమించినవి. అధిక లాభాల వేటలో దేశ, విదేశీ ఫార్మా కంపెనీలు ఈ రంగంలో స్వైర విహారం చేస్తున్నవి. ప్రభుత్వం తమ నియంత్రణ పాత్రను దాదాపు వదులుకుంటున్నది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈ కీలకరంగంలో ప్రవేశంచేస్తూ తగు రక్షణచర్యలను చేపట్టడం అత్యవసరం. వైద్య విధానంలో ప్రైవేటు రంగానికి స్థానాన్ని కల్పిస్తూనే ప్రజారోగ్య రంగంలో ప్రభుత్వం నిర్ణయాత్మకపాత్రను పోషించక తప్పదు. సమాజంలో సగభాగానికి మించిన మధ్యతరగతి దారిద్రరేఖకు దిగువగానున్న 35 శాతం ప్రజలు, పెన్షన్లపై ఆధారపడే వయోవృద్ధులందరికి అన్ని రకాల ఔషధాలు చౌకగా అందుబాటులోకి వచ్చే విధానాన్ని ఖచ్చితంగా అమలు పరచాలి. ఈ రంగంపై ప్రస్తుతం వెచ్చిస్తున్న దేశీయాదాయంలోని 1.5 శాతం బడ్జెట్‌ను కనీసం 2.5 శాతానికి పెంచితీరాలి. అప్పుడే దేశాభివృద్ధిలో మానవవనరుల పాత్ర రాణిస్తుంది. అభివృద్ధి వేగం పెరుగుతుంది. సురాజ్య సాధన సాధ్యపడుతుంది. పటిష్టవంతమైన మానవ వనరుల నిర్మాణంపై వెచ్చించే ప్రతి పైసా చక్రవడ్డి మాత్రమే కాదు, అసలుకు కొన్ని వందల రెట్లుగా సంపదను సృష్టిస్తూ దేశ ఆదాయాన్ని పెంచుతుంది. విదేశీ మారకాన్ని ఇనుమడింప చేస్తుంది. ఉపాధి ఉద్యోగాల సమస్యలను లేకుండా చేస్తుంది. 2020 నాటికి దేశంలో సగటు వయస్సు 25 సంవత్సరాలుగల యువత 52 కోట్లకు మించిపోతారంటున్నారు. వీరిని నిపుణతలతో ఆరోగ్యంగల బుద్ధిమంతులుగా తీర్చిదిద్దగలిగితే వీరు ప్రపంచాన్నే జయించగల్గుతారు. వీరే జాతికి తరగని సంపద. తిరుగులేని బలం. ఇటీవలనే నోబెల్ గ్రహీత శ్రీ అమర్త్యసేన్ గారు ఓ విద్యావేత్త శ్రీ రఘువీర్ శ్రీనివాసన్ గారి ప్రశ్నలకు ప్రజారోగ్యంపై ఆసక్తి కర సమాధానాలిచ్చినారు. స్థూలంగా వాటిని పరిశీలించడం అవసరం.

ప్రతి మనిషికి పనికి ఆహార భద్రతని చట్టబద్ధం చేస్తూ లక్షల కోట్ల ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నట్లే ప్రతి పౌరుని ఆరోగ్య భద్రత చట్టబద్దంగా ప్రభుత్వం స్వీకరించడం అత్యవసరం. కొద్ది గొప్ప తేడాలున్నప్పటికి, అమెరికాలాంటి ధనిక దేశాన్ని మినహాయిస్తే ప్రపంచదేశాలన్ని దేశవాసుల ఆరోగ్య భీమా ఖర్చులను భరిస్తున్నవి. చైనా లాంటి దేశం 1979 వరకు కేవలం 10శాతాన్ని భరించగా ఆ తర్వాత తన తప్పును గుర్తించింది. ఇప్పుడు 96 శాతం జనాభా యొక్క ఆరోగ్యభీమా ఖర్చుల్ని ప్రభుత్వమే భరిస్తున్నది. ప్రపంచ వ్యాపితంగా ప్రాథమిక విద్యతోపాటు ఆరోగ్య భీమా ఖర్చుల్ని ప్రభుత్వాలే భరించడం ప్రజల ప్రాథమిక హక్కుగా గుర్తింపుపొందింది. భారత ప్రభుత్వం ముందు ఒక ప్రజారోగ్య విధానమంటూ లేకపోవడం ఆశ్చర్యకరం.

ఆరోగ్యభద్రత ఆయా వ్యక్తుల నిత్యజీవితానికి సుఖశాంతులను సమకూర్చడంతోపాటు దేశీయ వార్షికాదాయాన్ని ఇనుమడింపజేస్తుంది. దేశ సంపదను పెంచుతుంది. దేశ ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచుతుంది. జాతి ఔన్నత్యానికి గల దారులను సుగమం చేస్తుంది. విద్య, ఆరోగ్యంగల పౌరులు, యువశక్తిని సాధించజాలనిదంటూ ఉండదు. కాబట్టి భారత ప్రభుత్వం ఈనాటి బాధ్యతారాహిత్యాన్ని

వదులుకొని అందరికి ఆరోగ్యమనే విధానాన్ని చేపట్టాలి. ప్రజారోగ్యందిశలో తమ దృష్టిని కేంద్రీకరించాలి.

మానవ శక్తి సామర్ధ్యాల పెరుగుదల దేశీయాదాయం పెరుగుదలతో ముడిబడియున్నప్పుడు ఏది ముందు అను మీమాంసతో కాలయాపన చేయడం కేవలం బాధ్యతారాహిత్యమేగాదు. అనైతికం గూడా! మానవశక్తి సామర్ధ్యాల పెరుగుదల ఫలితంగానే దేశీయాదాయం పెరుగుతుంది. విద్య, విజ్ఞానం, ప్రజారోగ్యంపై నిధులను హెచ్చించడానికి అదిదారి తీస్తుంది. తిరిగి ఆ నిధుల రెట్టింపు ప్రజాబాహుళ్యం ఆరోగ్యం, విద్యాబలం, బుద్ధిబలాన్ని అనేక రెట్లు పెంచడానికి తోడ్పడుతుంది. జాతి బహుముఖాభివృద్ధికి రాచబాటలు వేస్తుంది. ఇందులో అంతర్లీనంగా పనిచేసే స్వశక్తి, ఆత్మగౌరవం, దేశభక్తి, ఆత్మవిశ్వాసం, అనన్యసామాన్యం అమోఘం. అవి సృష్టించి పోషించే విలువల ప్రతాపం, ప్రభావం మానవ మనుగడకే శ్రీరామరక్ష. ఇంతటి బృహత్ కార్యాభారాన్ని నిర్వహించడానికి ప్రభుత్వాలకు నిధుల కొరత ఒక గుదిబండగా మారిందని వాదిస్తున్నారు. దేశానికి ప్రాణవాయువులాంటి విద్య, వైద్య రంగాలపై వెచ్చించబడే ప్రతిపైసా జాతి భవిష్యత్ నిర్మాణం కొరకు వెచ్చింపులాంటిది. ఉక్కు, ఇనుము, దుస్తుల కర్మాగారాల నిర్మాణం పూర్తిగా ప్రైవేటు రంగానికి వదలినామంచిదే గాని విద్యా, వైద్య రంగాలకై ఏలాంటి కొరత గుదిబండగా రాదు. ఈ ఖర్చులు పౌరుల ప్రాథమిక హక్కుల సాధన కొరకేకాదు. అత్యంత ప్రధానమైన దేశావసరాలకై అనివార్యంగా చేయబడేవి. ప్రభుత్వానికి ఇంతకు మించిన బాధ్యత మరొకటి లేదు. మనసుంటే మార్గముంటుంది. వెనకటికి కేరళ రాష్ట్రం చాలా వెనకబడిఉండేది. ఈనాడు చాలా ముందుండడానికి విద్యాబలమే మూలకారణం. తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు అదేబాటననుసరించడం ముదావాహం. అనుదినం పెరిగే ప్రజాచైతన్యం, ప్రజారోగ్యం దేశానికి అనూహ్యమైన శక్తి సామార్ధ్యాలను సమకూర్చుతుంది. జాగృత ప్రజలు జాతి పునాదులను బలోపేతం చేయగల్గుతారు. బలమైన పునాదులపై నిర్మించబడే ప్రతిజాతి అత్యంత వేగంగా అభివృద్ధిని సాధిస్తుంది. ప్రజాస్వామ్యాన్ని సఫలం చేస్తుంది.

# 6. సంస్కరణలు

కాలదోషం పట్టిన ఒక సంస్థ, వ్యవస్థ, లేక భావం ఆశించిన మార్పును ప్రగతిని సాధించలేదని అనేక పర్యాయాలు రుజువైన తర్వాత వాటిలోని లోపాలను పాక్షికంగానో, పరిపూర్ణంగానో సవరించడం " సంస్కరణ" అవుతుంది. లక్ష్యాలని సాధించే అనుభవం ఆయా సంస్కరణల ఉపయోగాన్ని రుజువు చేస్తుంది.

వివిధ దేశాల చారిత్రక అనుభవాలు పై సత్యాన్ని ధృవీకరిస్తున్నవి. మన దేశ ప్రాచీన వాఙ్మయాన్ని పరిశీలిస్తే వేదాలు ఉపనిష్పత్తులలో "మార్పును" "పరిణామాన్ని" "నూతనత్వాన్ని" "గుణాత్మకతని" సమాజానికి వాటి విశిష్టతను అనేక సందర్భాలలో నొక్కి వక్కాణించడం జరిగింది. ఇతర దేశాలలోని ప్రాచీన సాంస్కృతిక సంపదలో ఇదే సత్యం వేరు వేరు సందర్భాలల్లో నిక్షిప్తమై ఉన్నట్లు తిరుగులేని సాక్షాధారాలు స్పష్టపరుస్తున్నాయి. ఆధునిక సామాజిక శాస్త్రవేత్తలంతా "మార్పు" "పరిణామం" "నిత్య నూతనత్వం" లాంటి లక్షణాలను "శాస్త్రీయ ప్రమాణా"లుగా " శాశ్వత విలువలు" గా గుర్తిస్తూ వాటిని అనుసరిస్తున్నారు. "మార్పు" "పరిణత"లేని భావాలను వాటి గతిని "జడత్వం"గా "నిర్జీవంగా", "ప్రగతి నిరోధక మృత గతంగా" ప్రక్కన పెడుచున్నారు.

చరిత్రకారులు, సామాజిక, రాజకీయ శాస్త్రవేత్తలు భవిష్యత్ పరిణామాన్ని దర్శించడానికి సంబంధిత భావాల పూర్వాపరాలను వాటిలోని సంస్కరణలను గమనంలోకి తీసుకుంటారు. అప్పుడే సత్యం, లేక సత్యానికి చేరువలోనుండే అభిప్రాయాన్ని రూపొందిస్తుంటారు. కార్యసాధనలో విజయాల్ని సాధించడమో లేక పరాజయాన్ని నివారించడమో సాధిస్తారు. "సంస్కరణ" మహిమాన్వితమైన శక్తివంతమైన ఆవిష్కరణ, ఒక భావ విప్లవం, సృష్టిలోని సంజీవని. మానవ సమాజాలు విశాల విశ్వంలో అత్యాధునిక, పరిణత సమూహాలుగాబట్టి వాటి ప్రగతికి అభ్యుదయానికి ప్రకృతి సిద్ధమైన సంస్కరణ వజ్రాయుధం లాంటిది. సంస్కరణకు నోచుకోని సమూహం, సమాజం, వాటి వ్యవస్థలు, సంస్థలు మృత పదార్థాలుగా కాలగర్భంలో కలిసిపోతాయి. మహాత్మాగాంధి, కారల్‌మార్క్స్ లాంటి సంస్కర్తలు, విప్లవ కారులు. ప్రపంచ మానవచరిత్రను తీవ్రంగా ప్రభావితం చేసినారు. వారి భావాలు, మూఢనమ్మకాలుగా మారి కాలగమనానికి అటంకాలుగా మారకూడదని వారే తమ సంస్కరణలలోని నిరంతరాయతని, శాశ్వత తత్వాన్ని సుస్పష్టంగా ప్రవచించినారు. సిద్ధాంతాలన్నిటిని అభ్యుదయ సాధనలో ఆచరణకి చోదక శక్తులుగా ఉండాలని అలా లేకుంటే అవిగూడా సంస్కరించబడాలని బోధించినారు. వేదాంతాలు, మెట్ట వేదాంతాలుగాగాక అనుష్టాన వేదాంతాలుగా వెలుగొందాలన్నారు మన వివేకానందుడు.

భారతదేశ చరిత్రలో 1857తో ప్రారంభమై, అమరజీవి భగత్‌సింగ్ ఆత్మబలిదానంతో పదునెక్కి అనేకానేక విప్లవాత్మక ప్రజా ఉద్యమాల ద్వారా విస్తరించిన చైతన్యవంత ప్రజా బాహుళ్యం 1947 ఆగస్టు 15నాడు రాజకీయ స్వాతంత్ర్యాన్ని సాధించింది. 26 జనవరి 1950 నాడు స్వతంత్ర, సర్వ సత్తాక భారత రాజ్యాంగాన్ని ప్రకటించింది. గాంధీ, నెహ్రూల నాయత్వంలోని భారత జాతీయ కాంగ్రెస్ ప్రధాన రాజకీయ పార్టీగా స్థిరపడ్డది. 1931లో కరాచి నగరంలో జరిగిన జాతీయ కాంగ్రెస్

మహాసభ “సోషలిస్టు తరహా” “అభివృద్ధి”తమ భవిష్యత్ కార్యాచరణ లక్ష్యంగా ప్రకటించు కున్నది. స్వాతంత్ర్యానంతరం 1956లో తమిళనాడులో ఆవడిలో జరిగిన కాంగ్రెస్ మహాసభ తిరిగి అదే “సోషలిస్టు తరహా అభివృద్ధి” తమ దార్శనికతగా పున:శ్చరణ చేసింది. 1917లో జరిగిన రష్యా విప్లవం దానికి నాయకత్వం వహించిన లెనిన్ గారి పాత్ర వారి సోషలిస్టు సిద్ధాంతం ప్రపంచ వ్యాపిత స్వాతంత్ర్య సమరయోధులతోపాటు ప్రధాని పండిట్ జవహరర్‌లాల్ నెహ్రూ గారి ఆలోచనల్ని ప్రభావితం జేసింది. ఒక సంవత్సరం తర్వాతనే భారత పార్లమెంటు ఈ సిద్ధాంతమే ప్రజాహితమని, ఆచరించదగినదని సాధికారంగా స్పష్టంగా ప్రకటించింది. ఆ తర్వాత అనగా రెండు దశాబ్దాల సుదీర్ఘ కాలంలో నమ్మిన సిద్దాంతానికి కార్యరూపమివ్వడానికి అనేక అవసరాలు, అవకాశాలు కల్గినవి. ఐనా నెహ్రూ నాయత్వంలోని కాంగ్రెస్‌పార్టీ, దాని ప్రభుత్వం ఈ దిశలో ఏలాంటి చర్యలను చేపట్టలేదు. 1975లో శ్రీమతి ఇందిరాగాంధి తమ రాజ్యాధికార పరిరక్షణకై ప్రకటించిన అత్యవసర పరిస్థితిలో 1976లో ఈ అంశాన్ని మన రాజ్యాంగ ఉపోద్ఘాతం –(ప్రియాంబుల్)లో ప్రముఖంగా చేర్చడం జరిగింది.“సోషలిజం” స్థూలంగా ప్రజల సాధికారిత, ప్రజాహిత ఆర్థిక సామాజిక జీవితానికి పర్యాయపదంగా అప్పటికి, ఇప్పటికి నిలిచింది. ఈ ఉపోద్ఘాత సవరణ, ప్రచారానికి, బ్యాంకుల జాతీయకరణ, రాజకీయ విపక్షాల అణచివేత కెంతగా ఉపయోగడ్డదో అందులో అణుమాత్రంకూడా సమ్మిళిత ఆర్థిక ప్రగతికి ఉపయోగపడలేదు సరికదా దేశంలోని స్వార్థ భూస్వామ్య ధనాఢ్యవర్గాలు కాంగ్రెస్ సంస్థను తమ ప్రబల సాధనంగా మార్చుకోవడానికి స్వాతంత్ర్య సమరయోధుల కలలను కల్లలుగా మార్చడానికి బాగా ఉపయోగడ్డది. ఎగుమతి – దిగుమతుల మధ్య ఏర్పడిన తీవ్ర అగాధం – ద్రవ్యలోటును పూడ్చుకోవడానికంటూ చేసిన ఆర్థిక సంస్కరణలు ప్రపంచబ్యాంకు నుండి విపరీతంగా రుణాలు పొందడంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న దళారి పెట్టుబడిదారివర్గం నిర్వహిస్తున్న ఆర్థిక నేరాలకు ప్రబలంగా తోడ్పడ్డది. ఇవి దేశ ఆర్థికాభివృద్ధికని ప్రకటించిన ఆనాటి ఆర్థికమంత్రి ఈనాటి ప్రధానమంత్రిగారి వాదనలో పాక్షిక సత్యం ఉన్నా దేశ బహుముఖ వికాసానికి ఒక దిక్సూచిగానైనా ఈ “సోషలిస్టు తరహా అభివృద్ధి” ఏ మాత్రంలేదు. ఆచరణలో ఈ విధానం ప్రపంచ మార్కెటు ఆధీన, నియంత్రణా రహిత స్వేఛ్ఛా వ్యాపారంగా మిగిలింది. చీకటి వ్యాపారం, దళారి పెట్టుబడిదారి విధానం, పాలకవర్గం నుండి నియంత్రణ కాదుగదా, సంపూర్ణ సంఘీభావాన్ని సాధించింది, విస్తరించింది. సంస్కరణల సదుద్దేశాలు ఏమాత్రం సాధించబడలేదు. “సంస్కరణ”ల తర్వాత గడచిన 22 సంవత్సరాల్లో జరిగిన, జరుగుతున్న భారీ ఆర్థిక నేరాలు దీనికి ప్రబల నిదర్శనం. 2జి స్పెక్ట్రం, కామన్‌వెల్త్, కోల్ లాంటి కుంభకోణాలు దీనికి మచ్చుతునకలు మాత్రమే. దేశీయ ఆర్థిక విధానాన్ని నిర్ణయించవలసింది దేశ విదేశీ మార్కెట్లుకాదు దేశ ప్రయోజనాలను రక్షిస్తూ ప్రజల అవసరాలను తీర్చవలసిన స్వతంత్ర సర్వ సత్తాక ప్రజాస్వామ్య ప్రభుత్వమొక్కటే. ఐతే ప్రజాహితం, దేశ, విదేశీ మార్కెట్ల నుండి విడిపోతే సాధ్యపడదు. ప్రజా ప్రతినిధులు ఈ సత్యాన్ని విస్మరించరు. ఈనాడు శాస్త్ర సాంకేతిక, యుగ ధర్మంలో సంకుచిత ఆలోచనా విధానానికి ఎలాంటి ఆస్కారం లేదు. విప్పారిన కండ్లు, చెవులతో ప్రపంచ పరిణామాలు వాటి ప్రభావాలను గమనిస్తూ వాటిని సునిశితంగా పదునైన మేధోశక్తితో విశ్లేషిస్తూ స్వదేశీ వాస్తవికతకు అన్వయించక తప్పదు. అప్పుడే ప్రపంచ ప్రవాహంలో తల ఎత్తుకు తిరగగల్గుతాం. విశాల ప్రపంచ దృక్పథంతో నిర్దిష్టంగా దేశాభివృద్ధి

జరగడమొకటే శాస్త్రీయం. మన ప్రాచీన సంస్కృతి సాంప్రదాయాలు, సామాన్య, జీవనశైలి నిరాడంబర జీవన విధానాలను నేర్పినవి. అందుకవసరమైన ప్రకృతి వనరులు దేశంలో కోకొల్లలుగా ఉన్నవి. విలాసవంతమైన జీవనశైలి, ధన దాహం, మన సాంప్రదాయాలకు విరుద్ధం. అర్థ శాస్త్ర విమర్శకుడు శ్రీ స్వామినాథన్ అంకలేశ్వర్ అయ్యర్‌గారి అభిప్రాయం ప్రకారం భారత దేశానికి రెండు రకాల సంస్కరణలు అత్యవసరం. దేశంలో లక్షలాది సామాన్య చిన్న మధ్య రకం ఉత్పత్తి దారులున్నారు. వారిని సాధికారులుగా జేసే ఆర్థిక సంస్కరణ అవసరం. పెద్ద పెట్టుబడిదారులు, వ్యాపార, వాణిజ్య వేత్తలు సర్వాధికారాలుగలిగి యుండగా సామాన్యులకు అవి సంక్రమించక పోవడం వివక్షతగానుంటుంది. రెండవ ముఖ్యమైన సంస్కరణ పరిపాలనా వ్యవస్థకు సంబంధించినది ప్రభుత్వం ద్వారా ప్రజలకందే సేవలన్ని న్యాయ,పోలీసు వ్యవస్థలతో సహ సవ్యంగా సమభావంతో ప్రజలకంద జేయడం. ఐ.ఎమ్.యఫ్, ప్రపంచ బ్యాంకు సంయుక్తంగా నిర్వహించిన బిజినెస్ రిపోర్టు ప్రకారం ప్రపంచంలోని 183 దేశాల్లో వ్యాపార సరళిలో భారతదేశం 132వ స్థానంలోనేనున్నది. ఆర్థిక సంస్కరణలు ప్రారంభించిన 21 సంవత్సరాల తర్వాత ఇటువంటి పరిస్థితి మిగిలి ఉంటె మన "సరళీకరణ" ఉదారవాదాల గురించి ఏమనుకోవాలి?

కొత్తగా పరిశ్రమలు ప్రారంభించే ఔత్సాహికులకు అన్నిటికంటె ముఖ్యం. వారికి ప్రోత్సహన్ని కల్పించడం ఈ లెక్కలో భారతదేశం 183 దేశాలల్లో 166వ స్థానంలో ఉండడం ఇక్కడి ఔత్యాహికులకు మిగిల్చింది నిరుత్సాహం మాత్రమే. ఐదు సంవత్సరాల క్రితం మన దేశం 68వ స్థానంలోఉండింది. ఇంతలోనే ఇంతగా దిగజారిపోవడం ఆశ్చర్యం. వివరాల్లోకి వెళ్లితె ఇంకా చాలా ఆశ్చర్యాలు వెలుగులోకి వస్తాయి. పరిశ్రమ నిర్మాణానికి ప్రభుత్వ అనుమతి అవసరం. ఇటువంటి అనుమతులు పొందడానికిగల సౌలభ్యం లెక్కల్లో 183 దేశాల్లో భారతదేశం 181వ స్థానంలోనుండడం సంస్కరణల విమర్శకులే ఆలోచించాలి. ఈ "అనుమతులు" పెద్ద లంచాలకు పాడి గేదెల్లాంటివి. ప్రపంచ వ్యాపిత అనుభవం ఘోషిస్తున్న సత్యం పరిపాలనలో సంస్కరణల అనివార్యత, సుపరిపాలన సాధన 1991 సంస్కరణల పర్వానికి ముందు కాలంలో "లైసెన్సు", " పర్మిట్ల " సాధనలో అవినీతి తాండవించింది. ఇప్పుడు కొంత మేలు. ఇంకా పాలనా సంస్కరణలనేకం మిగిలియున్నవి. ఇవి జరిగితే సగటు దేశీయ సంపద పెరుగక మానదు. మరో ఉదాహరణ చాలు. ప్రభుత్వం, ప్రైవేటు వ్యక్తులతో చేసుకున్న ఒప్పందాల (కాంట్రాక్టుల) ఉల్లంఘన దేశ ఆదాయానికి పెద్ద గండిగా పరిణమించింది. వీటిపై వ్యాజ్యాలు కోర్టుల్లో మూల్గుచున్నవి. తేలడం లేదు. ఇలా కాంట్రాక్టుల ఉల్లంఘన ప్రపంచ రికార్డును పాలక పార్టీలు వారి గౌరవ ప్రతినిధులు గమనించాలి. పైనుదహరించిన 2012 బిజినెస్ రిపోర్టు ప్రకారం కాంట్రాక్టుల ఉల్లంఘనలో కోల్పోతున్న నిధులను ర్యాంకుల్లో ప్రపంచంలోని 183 దేశాలల్లో మన దేశం 182వ ర్యాంకులోనున్నది. కాంట్రాక్టులు అమలుపరచబడితే దేశ సగటు ఆదాయం ఇనుమడిస్తుంది. ఈ వాస్తవం మన న్యాయ వ్యవస్థ ఎంత అన్యాయంగా పని చేస్తున్నదో తేటతెల్లం జేస్తుంది. శాసన కర్తలు వెంటనే తమ దృష్టిని ఇటు మళ్లించడం దేశ భక్తియుత ధర్మం.

కొలంబియా విశ్వవిద్యాలయ ప్రొపెసర్ పానాకార్య చేస్తున్న విమర్శ ప్రకారం ప్రతి సంస్కరణ సమర్థవంతమైన దేమి కాదు. ప్రతి విధానం ప్రయోజనాత్మకంకాక పోవచ్చును. వాటిని పరిశీలించాలి.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం ఎదుర్కుంటున్న ఆర్థిక లోటు బడ్జెట్లు, వాటి ఫలితంగా పెరిగిపోతున్న రుణభారం, వడ్డీల మోతపై కేంద్ర ప్రభుత్వంచే నియమించబడిన విజయ కేల్కర్ కమిటీ సమర్పించిన నివేదిక అమలు జరిగితే అత్యంత ప్రయోజనాత్మకంగా ఉంటుంది. దేశీయ ఆదాయం పెరిగి సమతుల బడ్జెట్ల రూపకల్పనకు ఉపయోగపడుతుంది. దేశీయ ఆదాయంతో పన్నుల రాబడి నిష్పత్తిని ఇతోధికం చేయడం ఈ నివేదికలోని ప్రధానాంశం దేశంలో దారిద్ర్యాన్ని తగ్గించడం, క్రమంగా తొలగించడం, సంక్షేమ కార్యక్రమాలను సంతృప్తిగా నిర్వహించడం, దేశాభివృద్ధి కార్యక్రమాలన్నిటిని నిరంతరాయంగా సమ్మిళితంగా నిర్వహించడానికి కంకణ బద్ధమైన ప్రతి ప్రభుత్వం ఈ నిష్పత్తిని పెంచక తప్పదు. దేశాభివృద్ధి స్వావలంబనపై ఆధారపడాలి. రుణ గ్రస్తమైన ప్రభుత్వం ఎంతో కాలం సర్వస్వతంత్రంగా మనజాలదు. 2007-08లో ఈ నిష్పత్తి సగటు దేశీయ ఆదాయానికి 12 శాతముండగా 2011-12వ సంవత్సరంలో తగ్గి 10 శాతానికి చేరింది. అభివృద్ధి ఫలితంగా పన్నుల రాబడి శాతం పెరగ వలసింది పోయి తగ్గడం ఆర్థిక ఆరోగ్యానికి చేటు కాబట్టి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు పన్నుల పరిధిని పెంచడంతో పాటు రేట్లను గూడా ఇతోధికం చేయాలి. ప్రత్యక్ష పన్నుగా ఆదాయపు పన్ను ఉండగా వేరే ప్రత్యక్ష పన్ను విధింపు గురించి పునరాలోచించాలి. ప్రత్యక్ష పన్ను విధానంలో పన్ను భారం నుండి తప్పించుకోవడానికి అనేక మార్గాలుంటాయి. ఉన్నవి చాలు, ఇంకా పెంచుకోనక్కరలేదు. పరోక్ష పన్నులు వసూలు చేయడానికి కొంత ఇబ్బంది కలిగినా అనేక విధాలుగా అది ఉపయుక్తమైనది. పన్నులు వసూలు చేసే యంత్రాంగాన్ని సమర్థవంతం చేయడానికి అవసరమైన చర్యలన్నిటిని చేపట్టాలి. వివిధ సంస్థల్లో ఉన్న ప్రభుత్వ వాటాలను అనుమతించదగిన మేరకు అమ్ముతూ నిధులను సమీకరించడం ప్రయోజనాత్మకమైనదే. ప్రభుత్వ వాటాలు దేశ, విదేశీ ప్రైవేటు పెట్టుబడిదారుల హస్తగతంగావడం వలన ఆయా పరిశ్రమలకు వచ్చే నష్టమేమి ఉండదు పైగా వాటి నిర్వహణ సామర్థ్యం పెరుగుతుంది. పరిశ్రమల ఉత్పాదకత పెరిగి నష్టాలు రాకుండా, లాభాలబాటలో పోటి ప్రపంచంలో నిలదొక్కుకుంటాయి. ఈనాడు దాదాపు 200గాఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో సగానికి సగం ఆధునికీకరణకు నోచుకోక ప్రభుత్వంచే నియమితమయ్యే యాజ మాన్యపు లోటుపాట్ల కారణంగా తీవ్రమైన నష్టాల నెదుర్కోక తప్పడం లేదు. లాభాల బాటలోనున్న ప్రభుత్వ పరిశ్రమలు వ్యవస్థలు సంపాదించిన మొత్తాలు పై నష్టాలను పూడ్చడానికి గూడా సరిపడడం లేదు. కార్మికులు, యాజమాన్యం, దేశం అంతా నష్టాలు కష్టాలను మూటగట్టుకోవడం జరుగుతున్నది. అంతమాత్రాన ప్రభుత్వ రంగమే నిరుపయోగమనే తీర్మానానికి రావడం ఏమాత్రం సరికాదు. అదే విధంగా ప్రైవేటు పెట్టుబడిదారి విధానం సమూలంగా నష్ట జాతకముతో కూడినదని త్రోసివేయడం సబబుగాదు. పబ్లిక్, ప్రైవేటు రంగాలు సహజీవనం చేస్తూ ఎప్పటికప్పుడు ఆధునికీకరించబడుతూ దేశ సంపదను ఇతోధికం చేయడం ప్రజల అవసరాలన్ని తీరడం, ఆర్థికలోటు స్థానే మిగులు పరిస్థితి ఏర్పడడం సుపరిపాలన ఆంతర్యం. భారీ మరియు కీలక పరిశ్రమల్లో ప్రభుత్వానిదే పైచేయిగా ఉంటూ అనేకానేక వస్తూత్పత్తి రవాణాలాంటి మధ్య రకం, చిన్నరకం పరిశ్రమలను ప్రైవేటు కార్పొరేటు రంగాల ద్వారా నిర్వహించడం వాటిపై ప్రభుత్వ నియంత్రణ ఉభయతారకంగా కొనసాగడం శీఘ్రగతిన దేశాభివృద్ధికి ఏకైక రాచబాట. వ్యూహాత్మకమైన రాచబాట నిర్మాణానికి దాని ఆచరణకి చాలా కాలం అవసరం కావచ్చును. మధ్య కాలంలో పేదరికం ఇంకా పెరిగి పోకుండా చూడాలంటే సంక్షేమ కార్యక్రమాల

నిర్వహణ, సబ్సిడీల కొనసాగింపు అనివార్యమని రాజకీయ పార్టీలు రాజకీయ నాయకుల అభిప్రాయం. అందుకు ఎలాంటి అభ్యంతరం ఉండనవసరం లేదు కాని ఎప్పటికెయ్యేది. ప్రస్తుత మన్నట్లు ప్రతి సాధారణ ఎన్నికలకు ముందు ఓటర్లకు ఆచరణ సాధ్యం గాని వాగ్ధానాలు చేయడం, వాటిని అమలు పర్చలేక మరిన్ని కొత్త వాగ్దానాలు చేయడం ఫలితంగా తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టు మిట్టాడడం వలన దేశ భవిష్యత్తుకు తీరని హాని జరుగుతున్నది.

సంక్షేమ కార్యక్రమాలు సబ్సిడీల పంపక ప్రక్రియలపై బాధ్యతగా, లోతుగా క్షుణ్ణంగా ఆలోచించడం ప్రతి పౌరుని బాధ్యత, అభివృద్ధి చెందిన దేశాల అనుభవాల వెలుతురులో మన దేశ భవిష్యత్తు గురించి ఆలోచిస్తే విద్యార్థులందరికి ఉన్నత విద్య వరకు నాణ్యతలతో కూడిన విద్యను ఉచితంగా అందజేయడం అవసరం. అంతే ప్రాధాన్యతతో అవసరమున్న వారందరికి నాణ్యతలతో కూడిన ఆరోగ్య రక్షణ రోగ నివారణ, నిర్మూలన చర్యలన్నిటిని సకాలంలో అందజేయడం అవసరం. ఈ రెండు రంగాలకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం తమ బడ్జెట్లలో కేటాయింపులను క్రమంగానైనా గణనీయంగా పెంచి తీరాలి. ఆ తర్వాత ప్రాధాన్యతా క్రమంలో ఆహారం, వ్యవసాయం చేతి వృత్తులు ఉపాధి రంగాలలో ఖచ్చితంగా అర్హతలు గల వారిని శాస్త్రీయంగా ఎంపిక చేసి సబ్సిడీలను సంక్షేమ నిధులనంద జేయాలి. పెరుగుచున్న సగటు దేశీయ ఆదాయం ఫలితంగా దేశంలో ఐశ్వర్యం 10శాతం పెరగగా పేదరికం అరశాతం మాత్రమే తగ్గుచున్నది. ఈ లెక్కన పేదరికాన్ని రూపుమాపడానికి మరో 65 సంవత్సరాల సుదీర్ఘ కాలమవసరమవుతుంది. ఈలోగా సంపద కుబేరుల హస్తగతం అవుతూ, పంచడానికి నిధుల కొరతలు భయంకరంగా మారిపోవచ్చును. కాబట్టి పన్నుల ఎగవేతద్వారా లక్షల కోట్ల ప్రజాధనం నల్ల బజారుల్లో విదేశీ బ్యాంకుల్లో చలామణి అయే వినాశకర ప్రక్రియలను ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అరికట్టాలి. ఒక విశ్వసనీయ అంచనా ప్రకారం మన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించవలసిన రుణాలకి రెట్టింపు ధనం నల్లధనంగా విదేశీ బ్యాంకుల్లో మూల్గుచున్నది. రెవిన్యూ ఆదాయాన్ని పెంచు కుంటూ మాత్రమే విషతుల్యమైన ద్రవ్యలోటును తగ్గించుకోగల్గుతాం. సమతుల బడ్జెట్లను రూపొందించగల్గుతాం. రానున్న రెండు లేక మూడు పంచవర్ష ప్రణాళికలలో అనగా 2028 నాటికి దేశంలో పేదరికం చాప చుట్టబడాలి. ప్రతి పౌరుడు ఆరోగ్యంగా ఎదో ఒక వృత్తి నైపుణ్యత గలిగి స్వయం పోషకత్వంతో సగర్వంగా తల ఎత్తుకొని తిరగగలగాలి. ఈ లక్ష్యం చేరడం కష్టసాధ్యం కావచ్చును గాని చిత్తశుద్ధి ఉంటే అసాధ్యం ఏమాత్రం కాదు "కృషితో నాస్తి దుర్భిక్షం" అనునానుడి అక్షర సత్యంగా నిలుస్తుంది.

వ్యవసాయ ప్రధాన దేశం మన దేశం. పారిశ్రామిక దేశాలుగా పేరొందిన పాశ్చాత్య దేశాలు చారిత్రికంగా తమ స్థానాన్ని పొందినవి. వ్యవసాయ ప్రధాన దేశాలన్ని వీటి అడుగు జాడల్లోనే నడవనవసరం లేదు. సమాచార విప్లవం శాస్త్ర సాంకేతిక యుగ ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రత్యేకంగా కాలుష్య రహిత పర్యావరణ పరిరక్షణకై పరితపించే ఈ రోజుల్లో అన్ని దేశాలు పారిశ్రామిక దేశాలుగానే ఎదగవలసిన అవసరముండదు. హరిత వాతావరణ ప్రదాతగా నిలిచిన వ్యవసాయం, అడవులు, వ్యవసాయాధార పరిశ్రమలైన కుటీర పరిశ్రమలు వాటికి తోడుగా కొన్ని భారీ పరిశ్రమలు పరస్పరాధారంగా దేశ ఆర్థిక వ్యవస్థను విజయవంతంగా నిర్వహించగల్గుతాయి. ప్రపంచ మార్కెటు

వ్యవస్థ ప్రజాస్వామ్య స్ఫూర్తితో పని చేస్తూ దేశాల మధ్య ఆర్థిక సమన్వయాన్ని సమర్థవంతంగా నిర్వహించ వచ్చును. ప్రపంచీకరణ ప్రయోజనాన్ని ప్రపంచ దేశాలన్నిటి సమతులాభివృద్ధికి దోహదపడే మానవీయ కర్తవ్యాన్ని సాధ్యం చేయవచ్చును. శాస్త్రవేత్తలు, అర్థశాస్త్ర కోవిదులు ముఖ్యంగా రాజకీయ దురంధరులంతా ఈ దిశలో ఆలోచించడం యుగ ధర్మం.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వినియోగమే సర్వ రోగ నివారిణి కాదని కుప్పగూలిపోతున్న పాలనావ్యవస్థ, పాలక యంత్రాంగం న్యాయ వ్యవస్థలను సంస్కరిస్తూ వాటిని పునరుద్దరింపజేయడం తక్షణ అవసరమని దీపక్ పరేఖ్ అను అనుభవజ్ఞులు వాదిస్తున్నారు. భారత దేశం పని అయిపోయిందని ప్రపంచ మేధావివర్గం రెండు సంవత్సరాలుగా హోరెత్తినా ఇటీవలనే కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంస్కరణల గురించి ఆలోచిస్తున్నట్లు కనబడడం ఆశావహం. మన ఇల్లును మనమే చక్కబెట్టుకోక తప్పదు. విదేశీ పెట్టుబడులకు ఆయా పెట్టుబడిదారి వర్గ ప్రయోజనాలసాధన ప్రధానం ఏయే రంగాలలో ఎంత కాలం ఎంత పెట్టు బడిని వెచ్చించాలో వారే నిర్ణయించుకుంటారు. వారి ప్రయోజనానికి ఉపకరించదన్న మరు క్షణమే తమపెట్టుబడులను ఉపసంహరించుకుంటారు. మన ఔదార్యమే ప్రధానం ఈ అంశాన్ని చిలువలు పలువలుగా చిత్రిస్తూ విదేశీ పెట్టుబడుల వలన దేశ సర్వసత్తాక హక్కుకే గొప్ప ప్రమాదమేర్పడబోతుందని భయపడడం నిరర్థకం. మన దేశీయ ఉత్పత్తిలో రెండు శాతానికి మించని దాని గురించి అంతగా ఆందోళనజెందడం అనవసరం. స్వదేశీ సంపదను ఇతోధికం చేస్తూ దాని సద్వినియోగం ద్వారా ఉపాధిని క్రమంగా ఇనుమడించుకునే సంస్కరణల గురించి సమైక్యంగా ఆలోచించాలి. వాటికి ఆటంకంగా నిలిచిన శక్తులు, వ్యక్తుల ఆటలనుకట్టించాలి. స్వదేశీ పెట్టుబడుల వినియోగమే అభివృద్ధికి కీలక, నిర్ణయాత్మక వనరుగా ఆలోచించాలి, ఆచరించాలి. ఆహారం, ఎరువులు, గ్యాస్, డీజిల్ సరఫరాలపై ఇస్తున్న లక్షల కోట్ల సబ్సిడీ ధనాన్ని సగానికి మించి కబళిస్తున్న అనర్హులను నిర్దాక్షిణ్యంగా ఏరివేయడం, విలువైన సంపదను ఆదా చేస్తూ ఉత్పత్తిదాయక రంగాలలో వెచ్చించడం ఆహ్వానించదగు సంస్కరణ. అనుత్పాదక సంస్థలు నష్టజాతకమైన వ్యవస్థల నుండి అరుదైన ప్రభుత్వ పెట్టుబడులను ఉపసంహరిస్తూ వీలున్న మేరకు ఆయా సంస్థలను ప్రైవేటు రంగానికి హస్తగతం చేయడం తక్షణ కర్తవ్యం. విద్యుత్ ఉత్పత్తి, విద్య వైద్య రవాణా రంగాలకవసరమైన సదుపాయాల రూపకల్పనకై పెట్టుబడులను మళ్లించడం అత్యవసరం

కొన్ని సంస్కరణలు కొందరికి రుచించకపోవచ్చును.అందరు అన్నిటిని ఆమోదించడం ప్రజాస్వామ్యంలో సాధారణంగా జరిగే పని కాదు. నలుగురు మంచివాళ్లు కలిసి ఒక మంచి పనిని నెరవేర్చడం సంస్కారం అవుతుంది. ఇది వరకే చర్చించబడినట్లు ప్రభుత్వంతో చేసుకున్న (కాంట్రాక్టు) ఒప్పందాన్ని గౌరవించకుండానే వేలాది కోట్ల ప్రజాధనం నిష్ప్రయోజనంకావడం అభివృద్ధికి గొడ్డలి పెట్టులాంటిది అదే బిజినెస్ రిపోర్టులో ఈవిధంగా వ్యాజ్యాలల్లో ఇరుక్కున్న 185 దేశాలల్లో భారతదేశ స్థానం 184గా ఉండడం మన న్యాయ వ్యవస్థకి మాయనిమచ్చగానున్నది. మన న్యాయవ్యవస్థను సంస్కరించ నంత కాలం ఈ కష్టం, నష్టం తప్పదు. ఇంగ్లాడులో ప్రతి 10 లక్షల జనాభాకి 50 మంది జడ్జీలు, అమెరికాలో 107 మంది జడ్జీలుండగా మన పుణ్యభూమిలో ఒకే ఒక జడ్జీ ఉండడం దురదృష్టకరం. హైకోర్టుల్లో, మంజూరి పొందిన జడ్జీల ఖాళీలల్లో కేవలం 33శాతం భర్తీ అయినట్లు

అంచనా. న్యాయ శాస్త్ర పట్టభద్రులై అనుభవంగడించిన వేలాది యువతీ యువకులకు కొదవ లేదు. జడ్జీల పదవి విరమణ కాలాన్ని పొడగించవచ్చును, దీని వలన అదనపు ఖర్చుకి కనీసం 20 రెట్ల లాభాన్ని గడించవచ్చును కేసుల పరిష్కారమూ జరుగుతుంది. సుపరిపాలన సుగమమవుతుంది. ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడంతోపాటు మరో వినూత్న ఆలోచన ద్వారా దేశ సంపదను పునరుత్పత్తి రంగానికి మళ్లించగల్గుతాం. అది ప్రభుత్వం, ప్రైవేటు పెట్టుబడిదారుల సంయుక్త రంగం. పి.పి.పి.గా పేర్కొనే ఈ ప్రాజెక్టులు వివిధ రంగాలలో ఉపయుక్తంగా పని చేస్తూ ఆర్థిక సామాజికాభివృద్ధికి ప్రబల సాధనాలుగా వెలుగొందుతాయి. విద్య, వైద్య, రవాణా రంగాలలో ప్రైవేటు రంగాల ప్రత్యక్ష భాగస్వామ్యం, ప్రభుత్వాధికారుల పర్యవేక్షణాధికారం, స్థానిక సంస్థల ప్రతినిధుల సహకారంతో చక్కని ఫలితాలనందిస్తాయి. ప్రజా బాహుళ్యంలో సంతృప్తిని సంతోషాన్ని సృష్టిస్తాయి. వృధాఖర్చులు బాగా తగ్గి ప్రయోజనాత్మకత అందుబాటులోకి వస్తుంది. ఈ సిద్ధాంతం పొందే విజయాలు దీని విస్తరణకు దోహదం చేయడం జరుగుతుంది. ఇదొక మంచి సంస్కరణ. చైనా, ఇండోనేషియా లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇతర దేశాలకందిస్తున్న విలువైన అనుభవం. అభ్యుదయ కాముకులంతా ఆలోచించదగిన అంశం.

సంస్కరణల జాబితాలో మరో మంచి అవకాశం ప్రభుత్వ దృష్టిని ఆకర్షించడం లేదు. మన దేశం సమాచార విప్లవ సంబంధిత సాంకేతిక నిపుణులకు పెట్టింది పేరు. ఐనా దీన్ని వినియోగించలేకపోవడం పాలకుల సృజనాత్మక ఆలోచనలోపమే కాని మరొకటికాదు. ప్రభుత్వ కార్యాలయాలన్నిటిలో “ఇ”సేవా ప్రయోజనాన్ని ఉపయుక్తం చేయలేక పరిపాలనలో అనేక జాడ్యాలను తొలగించలేకపోవడం జరుగుచున్నది. “ఇ” కోర్టుల నిర్వహణ ద్వారా ఎలక్ట్రానిక్ యంత్రాల సహాయంతో సాక్ష్యాలు రికార్డు చేయడం, విచారణ జరపడం సులభంగా సాధ్యపడే దశలో దేశ వ్యాపితంగా జిల్లా కోర్టుల్లో కేవలం 14000 కంప్యూటర్ల నిర్వహణ గగనం కావడం మన వెనకబాటు తనానికి ప్రబల నిదర్శనం. గృహ నిర్మాణ కార్యక్రమాలలో నిర్మాతలు ప్రభుత్వ పర్మిట్లు పొందడానికి 9 మాసాలనుండి 18 మాసాల కాలం పడుతుందని, అందులో అవినీతి తాండ విస్తున్నదని “బిజినెస్ రిపోర్టు” పత్రిక తెలియచేస్తున్నది ఆధునిక, “ఈ సేవ” ద్వారా పారదర్శకత జవాబుదారి తనాన్ని సాధించడమే కాదు పనులన్ని సకాలంలో పూర్తి చేయగల్గుతాము. ప్రభుత్వాలు కార్పొరేటు సంస్థల సామర్థ్యంతో పోటీ పడాలంటే పరిపాలనలో “ఈసేవా”పద్ధతిని వినియోగించడం అత్యవసరం.

ఆర్థిక మాంద్యం, ద్రవ్యలోటు కారణంగా నిలిచిపోతున్న అభివృద్ధి కార్యక్రమాలను తిరిగి ప్రారంభించి వాటి నిర్మాణాన్ని వేగవంతం చేయడానికి నిధుల కొరత తీవ్రంగానున్నది. నిధుల కొరత–అభివృద్ధి స్థంబన విషవలయం నుండి బయట పడటానికి వృధా ఖర్చులకు స్వస్తి చెప్పడం అనర్హులకిచ్చే సబ్సిడీలను నిలిపివేయడం, పన్నులుచెల్లించే వారికిచ్చే రాయితీలను కుదించడం లాంటి సంస్కరణ చర్యలను చేపట్టి అమలు పరచడమొకటే పరిష్కారమార్గం. షుమారు 14 లక్షల కోట్ల భారత ప్రభుత్వ వార్షిక బడ్జెటునుండి పెట్టుబడిదారులకు కనీసం 4 లక్షల కోట్ల రూపాయల పన్నుల రాయితీలా? రాజకీయ ప్రయోజనాల సాధన కొరకు వీటిని కొనసాగిస్తూ మరిన్ని కొత్త వాగ్దానాలు చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చడం ఆత్మహత్యసదృశమవుతుంది. అనుత్పాదకంగా పెను

భారంగానున్న కనీసం 5-10 ప్రభుత్వ రంగ సంస్థలను పునరుద్ధరించాలి. అది చేతగాని ఎడల వాటిని ప్రైవేటీకరణ చేస్తే పెద్దమొత్తం నిధుల సమీకరణ జరుగుతుంది. వాటిని రక్షించడానికై ప్రతి సంవత్సరం చెల్లించే ప్యాకెజీల భారం ఇకనైనా తొలగించలేకపోవడం కేవలం భావ దారిద్ర్యం లేక భావదాస్యమని పించుకుంటుంది. టైర్లు, స్కూటర్లు, ఘడియారాల తయారి పరిశ్రమల నిర్వహణకు ప్రైవేటు సంస్థలు లేవా? వాటి తయారి పరిశ్రమల్ని ప్రభుత్వం నిర్వహించడం హేతుబద్ధమా? న్యాయబద్ధమా? గత సంవత్సరమే వెలుగులోకి వచ్చిన ఆశ్రిత పక్షపాతం ప్రభుత్వరంగ రహస్యాన్ని బట్టబయలు చేస్తుంది. ప్రభుత్వరంగంలో గల " స్కూటర్స్ ఇండియా" అను పరిశ్రమ పూర్తిగా దివాళా తీసి రద్దు చేయబడె స్థితికి చేరితే ఆర్థికమంత్రి అభి ప్రాయాన్ని గూడా కాదని కేవలం పై నాయకులను తృప్తిపరచడం కొరకు ప్రధాని కోరికపై కేంద్ర మంత్రివర్గం ఆ పరిశ్రమ పునరుజ్జీవనానికనే పేరుతో 200 కోట్ల రూపాయలు మంజూరి చేయడం కేవలం భావ దాస్యమనిపించుకుంటుంది. ప్రజా ప్రయోజనాన్ని ఫణంగా పెడుతూ పార్టీ ప్రయోజనానికి ప్రాధాన్యత నివ్వడం అప్రజాస్వామికం, అనైతికంగూడా.

ప్రభుత్వోద్యోగులలో దేశభక్తి, సేవా తత్పరత, జవాబు దారి తనాన్ని కల్పిస్తూ వారు ఆత్మ విశ్వాసంతో తమ కర్తవ్య నిర్వహణలో ఏమాత్రం అలసత్వాన్ని ప్రదర్శించకుండా చూడడం ఉన్నతాధికారులందరి తక్షణ కర్తవ్యం. లంచగొండితనం పెనుభూతంగా వెలుగులోకి రావడం ప్రతిరోజు వందల వేట కోట్ల కుంభకోణాల పిడుగులాంటి వార్తలు రావడం మంచి ఉద్యోగులకు గుండెల్లో గునపాలు గుచ్చుకున్నట్లుగా పరిణమించింది. దేశ ద్రోహన్ని సాహసోపేతంగా ఎదిరించే ధైర్యం కంటే బాధ్యతలను తగ్గించుకునే దారిలో వారు ఆలోచించడం జరుగుతున్నది.

పరిపాలనా సంస్కరణల ద్వారా ప్రాజెక్టులకు సంబంధించిన ఫైళ్లు త్వరితగతిన ఆమోదం పొందే విధంగా చూడాలి. ఉదాహరణకి పర్యావరణ, అడవిశాఖల్లో వేలాది కోట్ల ఖర్చులతో కూడిన ప్రాజెక్టుల ఫైళ్లు సంవత్సరాల తరబడి నిలిచిపోవడం క్షంతవ్యంగాదు. మౌలిక సదుపాయాల నిర్మాణం, స్పెక్ట్రం, ఇంధనం, విద్యుఛ్ఛక్తి, గనులలాంటి కీలకాంశాల ధరల స్థిరీకరణ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణను వేగవంతం చేయడం అవసరం. దార్శనికత కొరవడి రాజ్యాధికార సాధనే సర్వం అనే భావాల్లో మునిగితేలే ప్రభుత్వాలు దేశ ప్రజాస్వామ్యానికి తీరని హానిని కల్గించుచున్నాయి. ఆర్థిక మందగమనం, దేశ సంపద కొరత, ఉపాధి ఉద్యోగావకాశాల స్థంభన, పేదరికం, అసమానతల విస్తరణలు పరిపాలన అసాధ్యమనే బాధని నైరాశ్యాన్ని పెంచుతున్నది. వీటి నుండి కోలుకొని తిరిగి 8-9 శాతం వృద్ధి రేటుకు చేరడం కష్టసాధ్యం. భారతదేశ శ్రామికశక్తిలో కేవలం 2.5 శాతం సంఘటిత శక్తి ప్రైవేటురంగంలో మరో 2 శాతం సంఘటిత శక్తి సంపదను సృష్టిస్తూ దేశానికి వెన్నెముకగా ఉన్నది. దాదాపు 95 శాతం శ్రామిక శక్తి వ్యవసాయం, వ్యవసాయ కూలిరంగం, వ్యవసాయధార పరిశ్రమలు, స్వయం ఉపాధి దినకూలీలుగా బ్రతుకుభారాన్ని ఈడ్చుచున్నారు. ఈ పరిస్థితిని త్వరత్వరగా మార్చివేసే సాంకేతిక యుగంలో ఉన్నదానికే ప్రమాదం ఏర్పడే పరిస్థితిలో పడిపోవడం రాజకీయార్థిక, సాంఘిక నాయకత్వం తమ సంజాయిషీని చెప్పుకోవలసిన ఆగత్యం ఆసన్నమైంది.

ఎగుమతులు తగ్గి, దిగుమతులు పెరిగి వాటిమధ్య తేడా (కరెంటు అకౌంటులోటు) (వాణిజ్య లోటు) మరింత పెరిగి, ఆర్థిక మాంద్యం పెచ్చుపెరిగి ద్రవ్యలోటు భయంకరమైపోతూ రుణభారం మోయడానికి వీలులేని దుస్థితికి చేరిన ఈ తరుణంలో మళ్ళీ మంచి రోజులొస్తాయని ఆర్థిక పునరుజ్జీవన సాధ్యపడుతుందంటే నమ్మశక్యంగావడంలేదు. 2011లో 8 శాతంగానున్న దేశీయ ఉత్పత్తి రేటు పెరగుదల ఇంతలోనే 5 శాతానికి పడిపోతుందని ఉహించలేదు. దీనికి ప్రభుత్వ ద్రవ్యలోటుతోపాటు ప్రైవేటు పెట్టుబడులు క్షీణించడం పెద్దకారణం. 2014వ సంవత్సరం ఎన్నికల సంవత్సరం కాబట్టి అనుత్పాదక ఖర్చులు పెరుగుతాయి. ఈనాడు దేశీయ ఉత్పత్తిలో 2 శాతంగానున్న సబ్సిడీ భారం మరింత పెరిగే అవకాశమున్నది. ఈ సంవత్సరం పూర్తి కాల బడ్జెటుకు బదులు ఓట్ ఆన్ అకౌంటు బడ్జెటును ప్రవేశపెట్టారు. ఆర్థికశాఖ అంకెలగారడి చేస్తూ 6.2 శాతంగా పెరిగే ద్రవ్యలోటును తగ్గిస్తూ లక్షించిన 5.3 శాతంగా చూపెట్టవచ్చును. సబ్సిడీల భారం, అది వస్తు రూపమైనా లేక నగదు బదిలి అయినా, తగ్గడానికి వీలులేదు. పన్నుల వసూళ్ల అంచనాను పెద్దగా చూపిస్తూ చిత్రగుప్తుని లెక్కలు ఆమోదించవచ్చును. రానున్న దశాబ్దంలో పనిచేసే వయస్సుగల యువతీ యువకుల సంఖ్య మనదేశంలో చైనాకంటే మించిపోతుందని అందువలననే ప్రపంచంలో అతిపెద్ద ఉత్పాదకశక్తిగల దేశంగా ఎదుగుతామనే వాదన ఆకర్షణీయంగా ఉన్నా మన యువశక్తికి, చైనా యువతకున్న నాణ్యత, ఉత్పాదకత కొరత ఉండదనే సత్యాన్ని విస్మరించరాదు. దానిని పూరించాలంటే సంస్కరించిన విద్యా విధానం ద్వారా వృత్తి నైపుణ్యత గలిగిన నాయకత్వం ఎదగడానికి ఒకటిగాదు కొన్ని దశాబ్దాలు పడుతుంది. శాస్త్ర, సాంకేతిక విద్యావంతులు చైనాలో ప్రతి 1000 జనాభాకి 8.1 మంది, కొరియాలో 46 మంది, జపానులో 110 మంది, జర్మనిలో 86 మంది, అమెరికాలో 55 మంది ఉండగా మన భారతదేశంలో కేవలం 3.5 మాత్రమే ఉండడం బాధ్యతగల వారంతా దీర్ఘంగా, లోతుగా విచారించదగిన అంశం. సంబంధించిన రంగాలన్నింటిని సంస్కరించనిదే మానవాభివృద్ధి సాధ్యపడదు. మనదేశం శరవేగంతో యువశక్తి సామర్థ్యాన్ని సమకూర్చుతూ చైనాను దాటిపోవాలంటే ఈనాటి అవగాహన, సంస్కరణల సరళి, ఆర్థిక స్థోమత ఏమాత్రం సరిపోవు. ఐనా ఆశావాదులుగా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయడం తప్ప మరో మార్గంలేదు. మనసులో చోటుచేసుకుంటున్న ఆందోళనకు కార్యరూపాన్నిచ్చి చైనాలాగా సంస్కరణల బాటలో నడవాలి. ఏది ఏమైనా చివరకు మనదేశ సంపద, పెరిగే మన జనాభా అవసరాలను తీర్చగలిగితేచాలు. నిత్యావసర వస్తువులనుగూడా అధిక ధరలపై దిగుమతి చేసుకోవలసిన పరాధీనత ఎంత తొందరగా తొలగిపోతే అంతమంచిది. ఆ తర్వాతనే ఎగుమతుల ప్రయోజనం అర్థవంతమ వుతుంది. అబివృద్ధి చెందుచున్న 34 దేశాలన్నిటిలో 2025 నాటికి భారత్-చైనా దేశాల ఆర్థిక స్థితి అభివృద్ధి చెందిన జి.7 దేశాలకంటే మెరుగైన స్థాయికి చేరుకుంటుందనే సంతోషకర వార్త ప్రచారంలోకి వస్తున్నది. కాని ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయాల ప్రకారం అన్ని బాగా ఉంటే భారతదేశం మధ్యస్థాయికి మ్రాతమే ఎదగగల్గుతుంది. కాని పై స్థాయికి చేరుకోవడం దుర్లభం. పై నుదహరించిన విధంగా సంస్కరణల పర్వం విజయవంతమైతే సంపద పెరిగి దారిద్ర్యం చాలా వరకు తగ్గవచ్చు. ఇంత వరకనుసరించిన "నిధుల పంపకం ద్వారా అభివృద్ధిని సాధించడం" అనే అర్థరహిత ఆపత్కాల విధానాలన్నింటిని ఆ మూలగ్రంగా సంస్కరించి అభివృద్ధిని సాధిస్తూ అర్హులైన వారికి సంపూర్ణ సహాయాన్నందించే ప్రయోజనాత్మక ఆర్థిక సూత్రాన్ని అనుసరించడం

అత్యుత్తమ మార్గం. అప్పుచేసి పప్పుకూడు నారగించే కాలదోషం పట్టిన విధానాన్ని కూకటి వ్రేళ్లతో పెకిలించివేయ్యాలి. సత్వర అభివృద్ధి సాధనలో అనేక మార్గదర్శకాలున్నవి. అన్నిటికంటే ఉత్తమమైనది నిరంతరం నిలకడగా అభ్యుదయ పథంగా ఉండేది స్వావలంబన విధానమే. స్వదేశీ పెట్టుబడులపై ఆధారపడే ప్రగతి పథమే, విదేశీ పెట్టుబడులు ఒక పరిమితిలో, కొన్ని షరతులకు లోబడినవైతే ఆహ్వానించదగినవే. ప్రపంచీకరణ నేపథ్యంలో మన దేశ బడా పెట్టుబడిదారి వర్గం గూడా ఇతర దేశాల అభివృద్ధికి దోహదం చేయడం వాస్తవం. పరస్పర సహకారంతో సగౌరవంగా సహాయపడడం ఎంత ప్రజాహితమో, మన స్వతంత్రార్ధికాభివృద్ధిని సత్వరం సాధించడంగూడా అంతే ప్రజాహితం. దీన్ని రాజకీయం చేయడం ప్రపంచ రాజకీయ పరిణామాల్ని అపార్దం చేసుకున్నట్లవుతుంది. ఒక అమెరికన్ విద్యావేత్త అన్నట్లు " నిజం తెలుసుకోవడానికి రెండు తప్పులు చాలక పోతే మూడవ తప్పునుగూడా చేసి చూడాలి"

సంస్కరణల ఆవశ్యకతను మరింత క్షుణ్ణంగా అర్దం చేసుకోవాలంటే చైనా దేశ ప్రముఖ తాత్వికుడు కన్ఫ్యూషియన్‌గారి క్రింది ప్రబోధాన్ని పాటించాలి. " ఉన్నత మానవుడు ఏది సాత్వికమో అట్టె గ్రహిస్తాడు. అధముడు ఏది లోకంలో చలామణి అవుతుందో దాన్నే పట్టుకుంటాడు". దేశ పారి శ్రామికాభివృద్ధి సంపద సృష్టికి మూలం, నైపుణ్యతల విద్య విజ్ఞానగంధంగల యువత మాత్రమే. ఇది పరమసత్యం. వీరి సేవలకు ప్రపంచదేశాలు, సేవలనాణ్యతకు ఆకాశమే హద్దు. వీరి మిగులు సంపద మాతృదేశాభివృద్ధికి మూలధనం.

మరోకోణం నుండి దేశ ప్రగతిని దర్శించడం అవసరం కావలసింది వ్యాపార విస్తరణ, ధనార్జన మాత్రమేకాదు. మౌలిక సదుపాయాల నిర్మాణంలో ఈనాడున్న ప్రాంతీయ అసమానతల్ని తొలగించి అనతికాలంలోనే అందరికి అన్ని అందుబాటులోకి వచ్చే విధానాన్ని అమలు పర్చాలి. ధనార్జన, అధికార సాధనల పార్లమెంటరీ సుడిగుండం నుండి బయటపడి ప్రజలందరి జీవన ప్రమాణాన్ని పెంపొందించే గురుతర భాధ్యతను ప్రభుత్వాలు నిర్వహించి తీరాలి. దేశం దేశీయ పెట్టుబడిదారి వర్గం తమ ప్రయోజనాల సాధనకు తోడ్పడే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన షరతులను తొలగిస్తూ సరళీకరణకై ఒత్తిడి తేవడం సహజం. సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తూ అవసరాల మేరకు సరళీకరణ విధానాన్ని చేపట్టడం ప్రాపంచికం. దేశాభ్యుదయానికి అవసరమైన " ప్రతిబంధ"కాలను కొనసాగించడం అందుకై దేశంలోని కొన్ని ద్వారాలను మూసి ఉంచడం అవసరమే. దేశీయ యువత, కార్మిక, శ్రామిక వర్గాలు, శాస్త్ర సాంకేతిక విద్యనభ్యసిస్తూ ఉపాధి అవకాశాలను పూర్తిగా ఉపయోగించుకోగలిగే వరకు మన ఔదార్యాన్ని నియంత్రించుకోవడం దేశభక్తియుత కర్తవ్యం. ఉదారంగా, అతి ఉదారంగా సరళీకరణ ప్రక్రియలను చేపట్టడం కొందరి స్వార్ధానికి తీయని పానీయమే అయినా దేశానికి మాత్రం చేదు అనుభవమే. దేశ స్వతంత్రాభివృద్ధికి ఏలాంటి హాని కలగకుండా, పైగా దానికి దోహదకారిగా ఉండే సరళీకరణ ఆవశ్యం. ఆలస్యం అనర్ధదాయకం. వివరాలలోనికెళ్ళితే దేశంలో సాంకేతిక విద్య, ఇంధనం, రోడ్డురవాణా సౌకర్యాల అవసరం, సాగు, త్రాగునీరు వసతుల నిర్మాణం, మరుగుదొడ్లు, మురికి కాలువల సమస్యల సత్వర పరిష్కారం కొట్టవచ్చినట్లుగా ఉంటూ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య సంరక్షణకి సవాలుగా ఉండగా కొందరు భాగ్యవంతుల

సేవలకవసరమయ్యే వస్తు వాహనాల కొనుగోలుపై విలువైన విదేశీ మారకాన్ని విచ్చలవిడిగా వెచ్చించడం ఈకాలంలో ఇంగిత జ్ఞానమున్న ప్రభుత్వాలు చేయరాదు. సరళీకరణ జరిగిన గత 22 సంవత్సరాల అనుభవం పై సత్యాన్ని రుజువు చేస్తున్నది. 1991 నాడున్న కరెంటు అకౌంటులోటు నాటి సగటు జాతీయాదాయానికి 1.1శాతం కాగా ఈనాడది 4.8 శాతానికి పెరిగింది. సంస్కరణల ప్రయోజన మింతేనా? విదేశీ సరుకుల అమ్మకానికి ఎర్రతివాచిని పరిచి చక్కని మార్కెటును కల్పిస్తూ స్వదేశీ సరుకులను ఈపోటీ ప్రపంచంలో కారుచౌకగా విదేశాలకు ఎగుమతి చేయడంగాదా? "వాషింగ్టన్ ఏకాభిప్రాయం" " ప్రపంచ మార్కెటు" సలహాలు మనకు మార్గదర్శకాలుకాకూడదు. మహత్ముడు నేర్పిన " స్వావలంబన" " స్వతంత్ర ఆర్థికాభివృద్ధి" మనకు శిరోధార్యం. మానవాభివృద్ధికి మౌలిక సదుపాయలను సమకూర్చడం సత్వర అవసరం. స్వదేశీ ప్రభుత్వం లేక ప్రభుత్వాలు ఈ పరమ సత్యాన్ని విస్మరించవీలులేదు. ఆర్థిక విధానాలల్లో స్వదేశీ పరిశ్రమల పరిరక్షణ, ఉత్పత్తుల లాభసాటి ఎగుమతుల సాధన సరళీకరణ విధాన ఫలితమే అయినా, సరళీకరణ వలన పొందగలిగే విదేశీ ప్రైవేటు పెట్టుబడులరాక, స్వదేశ పెట్టుబడిదారులతో వారి సమైక్యత, సమన్వయం వాటి ఫలితంగా దేశీయ అభివృద్ధి పెరుగుదలలో సాధించగలిగిన దానిలో నాల్గవ లేక మూడవ వంతుకూడా గత 22 సంవత్సరాల సరళీకరణలో సాధించలేదు. 1991 నాటి ద్రవ్య సంక్షోభంలోగూడా విదేశీ పెట్టుబడులలో ప్రతి సంవత్సరం ఒక శాతమే ఉపసంహరించబడేది. ఈనాడు ఆ ఉపసంహరణ శాతం 30కి పెరగడం ఆశ్చర్యం. మనదేశ ఆర్థిక, సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయాల ప్రకారం సరళీకరణ ఎంత జరిగినా, ప్రభుత్వ యంత్రాంగంలో మందకొడితనం తగ్గలేదు. రెండవది, ఉద్యోగులతోపాటు రాజకీయ నాయకుల లంచగొండితనం, ఏమాత్రం తగ్గలేదు. మూడవది మనం తలదించుకోదగినది మహిళలపై జరిగే అత్యాచారాల పరంపర, ఈ పాలనాపరమైన, సామాజిక కారణాలు మన స్వతంత్రాభివృద్ధిని తీవ్రంగా ఆటంకపరస్తూ దేశగౌరవాన్ని భంగపరుస్తున్నాయనే అంశం గమనార్హం. సమస్యలకి పార్శ్వాలెన్నో వాటన్నిటిని గురిపెట్టి సంస్కరించడం కష్టసాధ్యమే కావచ్చు. మన ప్రజాస్వామ్య వ్యవస్థకు నాయకత్వం వహిస్తున్న రాజకీయ పార్టీలు,వాటి అధినాయకులందరికి ఇది పరీక్షా సమయం. ఉమ్మడి సమస్యల ఎంపిక, వాటి పరిష్కారానికి ఉమ్మడిగా ఉద్యమించడం వారి కర్తవ్యం. ఉద్యమ నిర్వహణ అవసరం. ప్రజాస్వామ్యంలో ఆయా సమస్యల బాధితుల సంఘటిత, సంచలనాత్మక, శాంతియుత నిరసన ప్రదర్శన అవసరం. ఉద్యమంతో సంబంధంలేని వారందరి నినాదాల హెూరు, జెండాల రెపరెపలు ఎంత ఆకర్షణీయంగా ఉన్నా బాధితుల చైతన్యయుత ఆగ్రహాన్ని పూరించజాలవు. విజయాన్ని సాధిం చలేవు. అల్పసంతోషం వినా సాధించే విజయం శూన్యం. ప్రజా ఉద్యమాలు సృష్టించే చైతన్యమే ప్రజా స్వామ్యానికి ప్రాణప్రదం, అభ్యుదయ పథానికి ఆలంబన.

భారత రిజర్వుబ్యాంకు ఇటీవల జరిపిన సర్వే ప్రకారం దేశ సంపద దేశాభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకై ఉపయోగపడాలంటే దేశ ఆర్థిక వ్యవస్థను దిగజార్చుచున్న త్రివిధ జాడ్యాలను నిర్మూలించే సంస్కరణలను చేపట్టాలి. వాటిని విజయవంతం చేయాలి. ద్రవ్యోల్బణ నియంత్రణ మొదటిది. వాణిజ్యలోటు, ఎగుమతి, దిగుమతుల మధ్య అంతరాయాన్ని ( కరెంటు అకౌంటు లోటు) సగానికైనా తగ్గించడం రెండవది. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో ప్రతి సంవత్సరం కనబడే ద్రవ్యలోటును జి.డి.పి. కి 4-4.5 శాతానికి మించకుండా చూడడం, నిర్మూలించడం మూడవది. పెరిగే సంపదలో సింహభాగం

దేశాభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించడం నిజమైన అభివృద్ధికి దోహదం చేస్తుంది. ఈ సమస్య తీవ్రతను గమనించాలంటే 2000-2001 సంవత్సరంలో దేశ వ్యాపిత ఆర్థిక వ్యవస్థల మిగులు, దేశ సగటు వార్షికాదాయంలో 22.8 శాతముండగా దేశాభివృద్ధికుపకరించే ఆర్థిక మిగులు 12.7 శాతముండినది. 2010-11 నాటికి దేశ వ్యాపిత మిగులు దేశీయాదాయంలో 32.3 శాతముండగా దేశాభివృద్ధికి మిగిలింది పదిశాతమే 10 సంవత్సరాలకాలంలో దేశ సంపదలో మిగులు భాగం సుమారు 10 శాతం పెరిగినా అందులోనుండి దేశాభివృద్ధికి ఉపయోగపడే భాగం 2.7 శాతం తగ్గడం గమనార్హం. ఇందుకు ప్రధాన కారణాలు మూడు భారతీయ కుటుంబాలల్లో ముఖ్యంగా మధ్యతరగతికి చెందిన వారి పాత అలవాట్ల ప్రకారం బంగారాన్ని కొనిదాచుకోవడం ఒకటి, కాగా స్థలాలను కొని, ఇండ్ల నిర్మాణానికి పూనుకోవడం రెండవది, వృధా ఖర్చులను పెంచుకోవడం మూడవది.

నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల(ద్రవ్యోల్బణం) 2000-01లో 3.8 శాతం ఉండగా 2011-12 నాటికి అది 8.4 శాతానికి పెరిగింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ద్రవ్యోల్బణం 3 శాతానికి మించకూడదు. అలాగే కుటుంబాలు బ్యాంకుల్లో డిపాజిటు చేసుకున్న మొత్తం 2001 నాడు దేశీయ ఉత్పత్తికి 8.5 శాతమైతే 2011-12 నాటికది 8.3 శాతానికి దిగింది. సంపద పెరిగిన దామాషా ప్రకారమైనా బ్యాంకు నిలువలు పెరగలేదు. సరికదా తగ్గుముఖంలో ఉండడం విజ్ఞులంతా ఆలోచించదగిన అంశం.

ఆర్థిక సంస్కరణల ప్రయోజనం సమ్మిళితాభివృద్ధిలో కనబడాలి. మానవాభివృద్ధిగా విద్యా, వైద్య, ఉపాధి, ఉద్యోగావకాశాల విస్తరణ, పేదరిక నివారణ, నిర్మూలన అసమానతల తగ్గింపులో సాదృశ్యంగా కనబడాలి. 22 సంవత్సరాల సుదీర్ఘకాలం తర్వాత మనదేశీయ, జాతీయాభివృద్ధి జరిగినా అది పైనుదహరించిన ప్రమాణాల్లో అగుపించకపోవడం యాదృచ్ఛికం కాదు, పాలక పార్టీలు ఎన్ని చెప్పినా ఆచరణలో మాత్రం అది సంఘ వ్యతిరేక దళారి పెట్టుబడిదారి వర్గానికి పరాన్నజీవుల ప్రయోజనానికి తోడ్పడుచున్నది. వారు దేశ ప్రజల కష్టార్జితమైన అరుదైన మిగులు ధనాన్ని కాజేస్తున్నారు. అనుత్పాదక, కార్యక్రమాలపైన ఖర్చులేకాక దేశ విదేశాలల్లోకి తరలించి అక్కడ దాచుకుంటున్నారు. దేశీయ ప్రభుత్వాలు తెలిసిగూడా తెలియనివారుగా నటిస్తూ వాటిని అరికట్టే చర్యలకు పూనుకోవడం లేదు. అందువలననే ఆర్థిక సంస్కరణల వైఫల్యం కొట్టవచ్చినట్లుగా కనబడుచున్నది. అభివృద్ధికి రాచబాటలుగా ప్రపంచామోదం పొందిన క్రింది రంగాలలో ఈ వైఫల్యం రాజకీయ నాయకత్వాన్ని హెచ్చరిస్తున్నది. ఏ.సి.డి.ఆర్. డైరెక్టర్, ఉపకులపతి, మేధావి అయిన యస్. మహేంద్రదేవ్‌గారు ఈ క్రింది అయిదు రూపాలను సోదాహరణంగా వివరిస్తున్నారు. దేశవ్యాపితంగా మౌలిక సదుపాయాల నిర్మాణలోపం మొదటి వైఫల్యం ఇందులో ముఖ్యమైనది విద్యుచ్ఛక్తి కొరత. 12వ పంచవర్ష ప్రణాలి కాంతానికి ఒక లక్ష కోట్ల డాలర్ల (సుమారు 55 లక్షల కోట్ల రూపాయల) పెట్టుబడితో ఈ మౌలిక సదుపాయాల రంగం అభివృద్ధిని సాధించాలనుకున్నాం. అందులో 47 శాతం ప్రైవేటురంగ పెట్టు బడికిచ్చినాం. ఎంతవరకు విజయాన్ని సాధించినామో అంకెల ద్వారా తెలుస్తుంది. ప్రజల దృష్టిలో అటువంటి విశ్వసనీయత అగుపించడంలేదు. ఆర్థిక లావాదేవీలలో చైనా తర్వాత స్థానాన్నలంకరించినా అభివృద్ధి రేటులో బంగ్లాదేశ్ కంటే వెనకబడి ఉండడం వాస్తవం. మౌలిక సదుపాయాల నిర్మాణం

ఫలితంగా వెలుగుచూచిన సత్యం గమనార్హం. రోడ్ల నిర్మాణాన్ని విస్తరించడం ద్వారా సంక్షేమ కార్యక్రమాలకంటే మించిన విధంగా పేదరిక నిర్మూలన సాధించవచ్చును. బీహర్ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ గారి నాయకత్వంలో బీహార్ రాష్ట్రం సాధించిన గొప్ప విజయంగా దీన్ని పలు రాజకీయ విశ్లేషకులు శ్లాఘిస్తున్నారు.

మానవ శ్రమ ప్రధానమైన వస్తూత్పత్తిని పెంచుతూ వాటి ఎగుమతి ద్వారా అభివృద్ధికి నిధులను సమకూర్చుకోలేని అశక్తత రెండవ ముఖ్య వైఫల్యం. 2010 సంవత్సరంలో ఈ కీలకరంగమైన వస్తూత్పత్తి లేక తయారి రంగంలో పనిచేసే కార్మికుల భాగం మొత్తం శ్రామిక, పారిశ్రామికవర్గంలో 11-12 శాతం ఉండింది. వస్తువుల ఎగుమతి ప్రపంచంలో కేవలం 1.4 శాతం ఉండినది. చైనా ఎగుమతి 15 శాతంతో పోల్చుకుంటే మనమెక్కడున్నాం? భారీ పరిశ్రమలకిచ్చే ప్రాధాన్యత ఇంకా మారలేదు. కుటీర పరిశ్రమలు, వస్తూత్పత్తి లేక వస్తు తయారి పరిశ్రమలకివ్వవలసిన ప్రాధాన్యత, అవగాహన ఇంకా గుర్తింపులోకి రావడంలేదు. వ్యవసాయరంగం ఉపాధి సాధనలో ముఖ్యమే. అయినా అంతిమ లక్ష్యంలో ఆ రంగ అధికోత్పత్తి ప్రక్రియ ప్రధానం. అలాగే పారిశ్రామికరంగ అభివృద్ధిలో భారీ పరిశ్రమలకుండే ప్రాధాన్యత ప్రశ్నార్ధకం కాకపోయినా ఈనాటి ప్రపంచ పరిణామక్రమంలో కుటీర, చిన్న పరిశ్రమల వస్తూత్పత్తి రంగ ప్రధమ స్థానాన్ని కాదనలేము. ఈ రెండు రంగాల ద్వారా సాధించే ఆర్ధిక స్తోమత మూడవరంగమైన సేవారంగ వ్యాప్తికి ఉపకరిస్తుంది. వీటిమధ్య ఉండే ఆరోగ్యవంతమైన సమతుల్యత ద్వారానే సంపద సమ కూరుతుంది, ఇనుమడిస్తుంది.

నైపుణ్యత గల్గిన యువతరాన్ని సృష్టించజాలని పనికిమాలిన బానిస (అన్ని స్థాయిలలోని) విద్యావిధానాన్ని సంస్కరించలేకపోవడం మూడవ ముఖ్యవైఫల్యం పెరిగిన జానాభా ప్రయోజనాత్మకంగా దేశానికుప కరించాలంటే అది నైపుణ్యతను పొంది తీరాలి. ఆ దృక్పథం విద్యా విధానంలో వచ్చితీరాలి. నైపుణ్యతగల యువశక్తే మన సుస్థిర సంపద. బంగారం, భూములకంటే మించిన ఆస్తి. 2010లో అన్ని పనుల్లో నిమగ్నమైన పారిశ్రామికులలో కనీసం 52 శాతం నిరక్షరాస్యులుగానో లేక ప్రాధమిక విద్యకే పరిమితమైనవారుండగా ఈనాడు 15-59 సంవత్సరాల వయస్సుగల శ్రామికులలో కేవలం 10 శాతం మాత్రమే ఎదో ఒక వృత్తిపరమైన విద్యాగంధం కలిగిన వారుండడం గమనార్హం. కాబట్టి విద్యావిధానాన్ని అన్నిస్థాయిలలో సంస్కరించడం అత్యవసరం. సంస్కరణల దిశ నిర్దేశించని ప్రణాలికలు ఎన్నైనా అభివృద్ధి లక్ష్యానికి చేరలేవు. నిరక్షరాస్యత, నిరుద్యోగ తీవ్రత దేశశాంతి భద్రతల పరిరక్షణలో గొప్ప సమస్యగా తయారవుతున్నది.

నత్తనడకలో కొనసాగుతున్న సామాజికాభివృద్ధి క్రమం నాల్గవ ముఖ్య వైఫల్యం. 1993-94, 2009-10 మధ్యకాలంలో దేశ పేదరికంలో తగ్గుదల రేటు ప్రతి సంవత్సరం 0.97 శాతమున్నదని మానవాభివృద్ధి నివేదిక తెలియచేస్తున్నది. ఇది కేవలం 0.5 శాతం మాత్రమేనని అర్ధశాస్త్ర నిపుణుల అవగాహన. ఈ తగ్గుదల గిరిజనుల్లో చాలా మందకొడిగా ఉన్నట్లు రూఢిగా తెలుస్తున్నది. పల్లెల్లో నుండి పట్టణాలకు ఉపాధికై వలసలు పోయే ప్రక్రియ పెరుగుచున్నది. దీనివలన అసమానతలు పెరగడం. ఒక సమస్యగా మారుతున్నది. 2005-2010 మధ్య కొద్ది కాలంలో పేదరికం తగ్గుదలరేటు

పుంజుకొని 1.5 శాతానికి చేరిందని ఒక అంచనా. అలానే జరిగితే మంచిదే. ఏది ఏమైనా పేదరికాన్ని అనతికాలంలోనే పూర్తిగా తగ్గించగలిగే సావకాశాలు అధికంగా ఉన్న దేశం మనది. ఈనాటి దేశీయ ఉత్పత్తిని నీతి నిజాయితీలతో పంపకం చేయగలిగితే ఒకేఒక దశాబ్దకాలంలో పేదరికాన్ని రూపుమాపగల్గుతాం. దళితులు, గిరిజనుల జీవితాలు కలకలలాడే విధంగా చేయగల్గుతాం. సామాజిక అభ్యున్నతి మరింత ఆర్ధికాభివృద్ధికి దోహదం చేస్తుంది. సంస్కరణలు ఇందుకు సోపానంగానుంటాయి.

2012-13 మానవాభివృద్ధి నివేదిక ఆర్థిక సామాజిక అసమానతుల కారణంగా ఏ మేరకు ఏ అభివృద్ధి ఎంత నష్టపడుతుందో వివరించింది. ఈ అవగాహన సంస్కరణల ఆవశ్యకత, వాటి ప్రయోజనాన్ని ఎత్తి చూపుతున్నది. అసమానతల కారణంగా 43 శాతం నష్టపోతున్నది విద్యారంగం.

ఆ తర్వాత 34 శాతం నష్టపోతున్నది ఆరోగ్య రంగం. ఆ తర్వాత 16 శాతం ఉపాధి రంగం నష్టపోతుంది. ఈ విధంగా అసమానతల కారణంగా మానవాభివృద్ధి సగటున కనీసం 32 శాతం నష్టపోతున్నది. అయిదవ వైఫల్యం సుపరిపాలనను సాధించలేకపోవడం. పరిపాలనా యంత్రాంగాన్ని, సంస్థల్ని తీవ్రంగా సంస్కరించనిదే సుపరిపాలన సాధ్యపడదు. ప్రజాస్వామ్య సిద్ధాంతానికి అవసరమున్న గుర్తింపును సాధించలేము. సామ్రాజ్యవాద వ్యవస్థ, రాచరిక వ్యవస్థల కాలంలో గూడు గట్టుకొని వ్రేళ్ళూని, ఊడలు దిగిన ప్రజా వ్యతిరేక, స్వార్ధపూరిత అధికార సంస్థలన్ని ప్రక్షాళన కావాలి.

ఉద్యోగ బృందానికివ్వబడిన హక్కులు, బాధ్యతలు తీవ్రంగా సంస్కరించబడి ప్రభుత్వ యంత్రాంగం తమ విధి నిర్వహణలో అంకితభావం, జవాబుదారితనం, పారదర్శకతను పాటించే మార్పురావాలి. వేల కోట్ల, లక్షల కోట్ల ప్రజాధనం మటుమాయమయిపోయే అవకాశాలేమి లేకుండా నిబంధనలన్నిటిని తీవ్రంగా సంస్కరించితీరాలి. దేశ బహుముఖాభివృద్ధిని త్వరగా సాదించాలని తపించే మేధావులు, విజ్ఞులంతా పాలనా వ్యవస్థ సంస్కరణలే ఏకైక పరిష్కార మార్గమని ముక్తకంఠంతో నొక్కి వక్కాణిస్తున్నారు. ఆలస్యం అమృతం విషం. ఇది రాజకీయాలకతీతంగా పాలక, ప్రతిపక్షాలు సామాజిక స్పృహతో నిర్వహించవలసిన తక్షణ కర్తవ్యం. దీన్ని గూడా రాజకీయం చేస్తూ ఆసలు రాజకీయాన్నే భ్రష్టుబట్టించే వారిని సంఘ వ్యతిరేక శక్తులుగా వెలివేయడం గూడా ముఖ్య కర్తవ్యం. అదీ సంస్కరణనే అవుతుంది.

## అప్రమత్తత అత్యవసరం

ఒకనాడు దేశీయ ఉత్పత్తి రేటు 8-9 శాతానికి చేరిన ఆర్థిక వ్యవస్థ కలిగిన వారమని 2012 నాటి వృద్ధి రేటు 5 శాతం మాత్రమేనను ధీమాతో చేయవలసిన సంస్కరణలు చేయకుండా పోతే వృద్ధిరేటు ఇంకా తగ్గి ప్రపంచదేశాలలో మిగిలియున్న పరపతిని కూడా కోల్పోయే ప్రమాదం పొంచి కూర్చున్నది. 2012-13 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఎన్నికల రాజకీయాలకే పరిమితమైపోయి ఆర్థిక సంస్కరణలపై సానుకూల ప్రజాభిప్రాయాన్ని సాధిస్తున్నట్లు లేదు. ఆర్థిక సర్వే నివేదిక దీన్ని నిరూపిస్తున్నది. 6.5 శాతం అభివృద్ధి సాధించగల్గుతామనే భ్రమను ఈ సర్వే నివేదిక తొలగించింది. దశాబ్దాల క్రింది 5 శాతం మాత్రమే ఈ సంవత్సరం సాధించగల్గినామని చల్లగా చెప్పింది.

మనదేశం 1991 నాటి దారుణ ఆర్థిక దివాళాస్థితి, అందుకు కారకమైన ఆత్మహత్య సాదృశ్యమైన ఆర్థిక విధానాల నుండి సంస్కరణల ఫలితంగా కొంతైనా బయటపడి ప్రపంచ దేశాలతో

పోటీ పడగల్గుచున్నది. సరుకులు, ముఖ్యంగా ఉత్పత్తి సాధనాలు, అత్యవసర సరుకలపై విధించబడిన దిగుమతి పన్నురేటు 7.8 శాతం నుండి 7 శాతానికి తగ్గించడం, బ్యాంకుల వద్ద నిలువలుగానున్న అనుత్పాదక ఆస్తులు 2.6 శాతం నుండి 2.5 శాతానికి తగ్గడం, కుటీరపరిశ్రమలు, చిన్న పరి శ్రమలనుద్ధరించే పేరుతో వాటికి సుమారు వేయి సరుకులను కేటాయించడం, చివరకు పెద్ద పరిశ్రమలు రాకుండాపోయి చిన్న పరిశ్రమలు పెట్టుబడి మార్కెటు కొరత కారణంగా చతికిలపడిపోయి రెంటా చెడ్డరేవడి తనాన్ని కొంతైనా తొలగించడంలాంటి మార్పులను సాధించగలిగాం. కాని ఆర్థిక వ్యవస్థ స్థూలంగా పటిష్టవంతమయ్యే చర్యలు చాలా మిగిలి ఉన్నవి. ఫలితంగా ద్రవ్య లోటు, ద్రవ్యో ల్బణం, వాణిజ్యలోటు రుణభారాన్ని తగ్గించడం కష్టసాధ్యమవుచున్నది. సంస్కరణల అవసరం గురించి విశ్వసించేవారు ధైర్యంగా ముందడుగు వేయగలిగితే తప్ప దేశాభివృద్ధి వాతావరణం ఆశాజనకంగా మారదు. ఆసియా దేశాలన్నిటిలో పై కీలకాంశాలలో మనదేశం వెనకబడియుండడం ఘోరం. ప్రపంచ దేశాలన్నిటిలో ఆర్థికంగా రెండవ పెద్ద దేశమనే సంతృప్తి 50 కోట్ల మంది పేదలు, నిరు పేదల వెనకబాటుతనాన్ని తొలగించలేదు. పేదల సంఖ్య అధికంగానున్న మొదటి దేశంగా, అందరు వేలెత్తి చూపే విధంగా తలదించుకుంటాం. రానున్న ఆర్థిక మాంద్య ప్రమాద ఘంటికల మోతనుండి తప్పించు కోలేం. రెండంకెల అభివృద్ధిరేటుతోనున్న చైనాదేశం 7వ అంకెకు దిగింది. బ్రెజిల్ దేశం 4.5 శాతం నుండి 2 శాతానికి చేరింది. రష్యా 8 శాతం నుండి 4 శాతానికి పడిపోయింది. భారతదేశం 9 శాతం నుండి 5 శాతానికి చేరింది. ఆర్థిక మాంద్యం ప్రపంచ వ్యాపితమైతే ఏ దేశానికాదేశం తమ ఆంతరంగిక సంస్కరణల ద్వారా ఆత్మరక్షణతోపాటు అభివృద్ధి పథాన్ని కాపాడుకోక తప్పదు. పై నుదహరించిన 4-5శాతం ఆర్థికాభివృద్ధి ప్రమాణాల లక్ష్మణ రేఖలు అన్ని రాజకీయ పార్టీలకు శిరోధార్యం. వాటిని పాటించని వారికి చట్టబద్ధమైన ఆంక్షల భయముండాలి. క్రమశిక్షణ ఉంటేనే ప్రజాస్వామ్యం మనగల్గుతుంది. కొన్ని రాజకీయ పార్టీలకు జనాకర్షణ పథకాల ఆధారంగా తమ అధికారాలను రక్షించుకుంటూ దేశ శాశ్వతాభివృద్ధిని తాకట్టు పెట్టే అధికారం ప్రజాస్వామ్యంలో ఉండరాదు. ఉదా: అర్హతలున్న వారికి చౌకగా డీజిల్, ఆయిల్ సరఫరా నిమిత్తం కేంద్రం ప్రతి సంవత్సరం 43600 కోట్ల రూపాయలు కేటాయిస్తే ఆచరణలో అది రెండురెట్లకు మించి పెరిగినట్లు వాస్తవ అంకెలు తెలియచేస్తున్నాయి అలాగే అమలులోకిరానున్న " అందరికి ఆహార పథకం" తదితర సరుకులపై సబ్సిడి కారణంగా ద్రవ్యోల్బణం హద్దులుదాటుతున్నది. ద్రవ్యలోటును అరికట్టలేని దుస్థితి ఏర్పడుతుంది. ప్రియమైన నిత్యజీవితావసర వస్తువులను అర్హతగల వారికి చౌకగా సరఫరా చేయడం ఎంత పవిత్ర ప్రజాహిత కర్తవ్యమో ఆయా సబ్సిడీలు అనర్హులకు చేరకుండా జాగ్రత్త పడడం అంతకు మించిన దేశభక్తియుత కర్తవ్యం. రాజకీయ వాదులు ఈ వాస్తవాన్ని గుర్తించి ఇందులో భిన్నాభిప్రాయాలకు ఆస్కారం లేకుండా కలసికట్టుగా కృషి చేయడం ప్రథమ కర్తవ్యం. ఈ సందర్భంగా నియమించబడిన శ్రీ విజయ్‌కేల్కర్ గారి నివేదికలోని కొన్ని ముఖ్యాం శాలనైనా అమలు పరచని ఎడల దేశభవిష్యత్తు అంధకారంలోకి త్రోసివేయబడినట్లు అవుతుంది. ప్రజల హక్కుల సాధనకై పోరాడే ఉద్యమకారులు ఈ బాధ్యతల గుర్తింపుకై అవిశ్రాంత కృషి చేయడం అవసరం. సంస్కరణలను, సుపరిపాలనను, సాధించకుండా దేశ కష్టార్జితమైన అరుదైన సంపద సద్వినియోగంలోకి రాదు.

ప్రణాళిక వనరుల సమీకరణ సంస్కరణలపై ఆధారపడ్డది. రేపటి 12వ పంచవర్ష ప్రణాళిక (2012-17)కవసరమైన సుమారు ఒక ట్రిలియన్ డాలర్ల పెట్టుబడిలో 80 శాతం పెట్టుబడి స్వదేశ కీలకరంగాల మిగులునుండి సమకూర్చుకోవాలని అంచనావేయడం జరిగింది. అందులో విద్యుచ్ఛక్తి రంగంనుండి (34 శాతం), రోడ్డు రవాణా నుండి (18 శాతం), టెలికాం నుండి (17 శాతం) రైల్వే రంగాలనుండి (11 శాతం) సేకరించాలని అంచనా వేయడం జరిగింది. తతిమ్మ 20 శాతం పెట్టుబడిని దేశ విదేశీ, ప్రైవేటు పెట్టుబడులుగా ఆకర్షించాలనే అవగాహన ఏర్పడ్డది. ఇందులో విద్యుచ్ఛక్తితో పాటు పైన పేర్కొన్న నాల్గు రంగాలు అనేక అంతర్గత సమస్యలతో సతమతమవుచున్న వాస్తవం ఎవరికి తెలియనిదిగాదు వాటిని త్వరగా సంస్కరిస్తూ సుస్పష్టమైన ప్రభుత్వ విధానాలను రూపొందించి అమలు పరచనిదే అక్కడ మిగులు అంటూ ఉండదు. అందులో ప్రైవేటురంగ పాత్ర, దేశ, విదేశీ రుణ సౌకర్యాలపాత్ర అత్యంత కీలకమైనవి. ప్రభుత్వ యంత్రాంగంలో చోటుచేసుకున్న అసమర్ధత, అవినీతి కారణాలవలన కీలకాంశాల ఫైళ్ళు కనబడడంలేదు. ఒక వేయికి తగ్గకుండా, పార్లమెంటు ఆమోదానికై నిలిచిపోయిన తీర్మానాలు, ఒక లక్ష కోట్ల కర్చుతో ముడిబడిన ప్రాజెక్టులకు మోక్షంలేదు. దేశ, విదేశీ పెట్టుబడి దారులేకాదు ప్రభుత్వ, ప్రభుత్వేతర దేశ హితైషులకు స్వదేశీ పరిపాలనపై విశ్వాసం తీవ్రంగా తగ్గుచున్నది. ఈ వాతావరణంలో గుణాత్మకమార్పురానిదే ప్రణాళికా నిదుల సమీకంణ వాటి సక్రమ వెచ్చింపులు సాధ్యపడవు. పాలకుల సుస్పష్ట అవగాహన, అంకితభావం పాలనా యంత్రాంగం యొక్క క్రమశిక్షణ నిబద్దత ఈనాటి అత్యవసర రాజకీయ ఉపకరణాలు. ఈ అంశంపై దేశభక్తియుత రాజకీయ నాయకత్వం ముఖ్యంగా అతివాదులు ప్రజాస్వామ్యానికి అంకితమైనవారంతా సమష్టిగా సమైక్యంగా సమాలోచనలు జరపాలి. దేశాభ్యుదయానికి అవసరమైన విధంగా నాయకత్వ శూన్యతనుభర్తి చేయాలి. ఈనాడేర్పడియున్న నకారాత్మక రాజకీయ, పాలనాపర వాతావరణాన్ని తొలగిస్తూ మంచి ఆశావహ భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేయాలి.

ఒక మేధావి ఒక చిన్న ఛలోక్తిని ఉటంకించారు. "దొంగ ఎవరో దొరికినాడా" అని తన బంటుని అడిగినాడట ఒక అధికారి. "అవును దొరికినాడు వాడిని పట్టుకొచ్చినాను" అన్నాడట ఆ బంటు "ఐతే వారిని నాముందు ప్రవేశపెట్ట"మన్నాడు ఆ అధికారి. "వాడెవరోకాదు మనమే" అన్నాడట ఆ బంట్రౌతు. మన దేశ రాజకీయార్ధిక సంక్షోభం ఈ విధంగానున్నది. సి.యు.టి.యస్ అను అంతర్జాతీయ సంస్ధకి ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీ ప్రదీప్ యస్ మెహతా గారు పై సంక్షోభాన్ని తొలగించడానికి క్రింది ఆరు సంస్కరణల ఆవశ్యతను ఎత్తిచూపుచున్నారు. కాకలు తీరిన దేశ నాయకులంతా సంప్రదించుకొని దేశ రాజకీయ నాయకత్వాన్ని చెప్పిన పని చేసేవాడు గాక సమర్ధత గలిగిన సారధి చేతిలోబెట్టాలి ఇది మొదటిది. దేశ సంపదను పెంచే బాధ్యత దేశ ఆర్ధికమంత్రి, ప్రతిపక్ష పార్టికి చెందిన ఆర్ధిక నిపుణుడి సంయుక్త అధ్యక్షతలో ఏర్పాటుచేసే కమిటీకి సంక్రమించే ఏర్పాటు చేయాలి. ఇది రెండవ సూచన. వివిధ రంగాలలో వివిధ కార్య క్రమాలను తొందరగా పూర్తి చేయగలిగే నిఘా బాధ్యతను ఆవిద్యలో నిష్ణాతులైన వారికి అప్పగించాలి. ఇది మూడవ ముఖ్య సూచన. స్వతంత్ర లోక్‌పాల్ చట్టాన్ని పటిష్టంగా అమలు పర్చడం, సిబిఐకి సంపూర్ణ స్వేచ్ఛనివ్వడం, చౌలా కమిటి నివేదికను తూచతప్పకుండా అమలు పరుస్తూ దళారి పెట్టుబడిదారి విధానాన్నీ, అవినీతినీ తరిమివేయడం నాల్గవ సూచన. అన్ని స్థాయిలలో జరిగే రాజకీయ నాయకత్వ

ఎన్నిక ప్రక్రియ దాని ఖర్చులు, విధిగా ప్రభుత్వమే భరించాలి. ఇది అయిదవ సూచన. న్యాయశాస్త్ర సంస్కరణలు చేపడుతూ న్యాయం అత్యంత వేగంగా సంబంధిత కక్షిదారుల కందించడం ఆరవ, చివర సూచన. వీటిని సందర్భోచితంగా వివిధ అంశాలలో చర్చించడం జరుగుతుంది.

మనదేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యదేశమని, జనాభాలో ఆర్థిక వ్యవస్థలో రెండవ గొప్ప దేశమని చెప్పుకోవడం న్యాయమే అయినా నిజజీవితంలో ఆర్థిక సామాజిక ప్రపంచ ప్రమాణాల వెలుతురులో మనదేశం సుమారు 177 ప్రపంచదేశాలల్లో 126వ స్థానానికి దిగువన ఉన్నదనే హెచ్చరిక గమనార్హం. ఎవరినీ నిందించడంకాదు గాని ఆత్మస్తుతి కొరకు గొప్పలు చెప్పుకోవడం ఈనాడు పరిపాటైంది. ఈ విషయంలో ఒక నగ్నసత్యం ప్రతి విజ్ఞుని పరిణత ఆలోచనని పరీక్షిస్తున్నది. స్వతంత్రం సాధించిన నాటినుండి జనాభా నియంత్రణకై తగు ప్రచారంతో ప్రోత్సహించడం జరిగింది. ఫలితంగూడా ఉన్నది. ఐనా 30 కోట్ల జనాభా ఈనాటికి 120 కోట్లకు పెరగడం గత్యంతరంలేని పరిస్థితి. 2025 నాటికి సగటు వయస్సు 25 సంవత్సరాలుగల యువత 52 కోట్లవుతుంది. ఇది అమెరికా, ఐరోపా దేశాల మొత్తం జనాభాకు సమానం. పెరిగే జనాభాను పోషించడం, వృద్ధులందరి యోగక్షేమాలను కనిపెట్టడం, పెరుగుతున్న బాల బాలికలందరికి చక్కని వాతావరణంలో విలువలతో కూడిన విద్యాబుద్ధులు నేర్పడం ప్రధానంగా యువత సంపాదించే సంపదపై ఆధారపడియుంటుంది. రానున్న రెండు పంచవర్ష ప్రణాళికలల్లో పైన వివరించిన విధంగా గుణాత్మకంగా ప్రయోజనాత్మకమైన విద్యా సంస్కరణలు అమలు పర్చాలి. అలా జరిగితేనే 2025 నాటికి అస్త్రశస్త్రాలతో సంసిద్ధంగానుండే యువత తమ బ్రతుకు పోరాటంలో విజయాన్ని పొందుతుంది. ఇందుకు సమకాలీన ప్రభుత్వాలు ఈనాటికంటే రెండు మూడురెట్లుగా నిధులను వెచ్చించాలి. విద్య, వైద్య రంగాల సంస్కరణలతోపాటు నిధులను ఇతోధికం చేసే తదితర సంస్కరణలు సమర్ధవంతంగా అమలు పరచాలి. ఈనాడు మనమెక్కడన్నాం? మరెంత వేగంగా పయనించాలో తెలిసికోవడం అవసరం.

2025 నాటికి కనీసం 25 కోట్లమంది నిపుణతగల వారందరికి ఉపాధి అవకాశాలను కల్పి స్తామని చెప్పుకోవడం ప్రభుత్వాల ఉత్సాహం కావచ్చుకాని ఈనాటి ప్రగతి తీరు అందులో 5 శాతానికికూడా సరిపడదు. బ్రిక్స్ దేశాలల్లో (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) మన మొక్కడున్నామో చూచిన తర్వాత అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకుందాం. మన జనాభాతో పోల్చగా ఆరవవంతు, ఎనిమిదవవంతు జనాభాగలిగిన బ్రెజిల్, రష్యా దేశాల దేశీయ సగటు వార్షికోత్పత్తి మనకంటే వరుసగా 36 శాతం 20 శాతం అధికంగాఉన్నది. చైనా మన జనాభాతో పోల్చగా 10శాతం అధికమయినా సగటు దేశీయ వార్షికోత్పత్తిలో నాల్గురెట్లు మించి యున్నది. ఈ విధంగా తలసరి దేశీయోత్పత్తిలో మనకంటే బ్రెజిల్ 8.5 శాతం అధికం, రష్యా 10 శాతం అధికం, చైనా 3.6 శాతం అధికం అని తేలిపోతున్నది. బ్రెజిల్ దేశానికి చెందిన ప్రతి పౌరుడు ప్రతి సంవత్సరం తమ దేశీయ సంపదకు, భారతీయుడికంటే నాల్గురెట్లు సంపదను చేకూర్చుచున్నాడు. ప్రతి రష్యన్ పౌరుడు 7 రెట్లు, ప్రతి చైనా పౌరుడు 5 రెట్లు సంపదను సమకూర్చుచున్నాడు. అదే విధంగా అభివృద్ధి చెందిన అమెరికాలోని ప్రతి పౌరుడు ప్రతి భారతీయునితో పోల్చగా 5 రెట్లు, జపాన్ 4 రెట్లు, జర్మనీ 8 రెట్లు, బ్రిటన్ 3 రెట్లు సమకూర్చుచున్నారు. ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి

శాస్త్రవేత్తల అధికార పూర్వక విశ్లేషణలో మన దేశ సగటు పౌరుని సామర్థ్యం పైవిధంగా స్పష్టపడుచున్నది. మనదేశ పౌరుని సగటు ఉత్పాదకత అత్యంత వెనబడియుండడం మనదీనావస్థకి మూలకారణం. మానవ వనరులు మొదలుకుని న్యాయవ్యవస్థ, పాలక వ్యవస్థ, ఎన్నికల వ్యవస్థలన్నిటిలో తీవ్రమైన సంస్కరణలను చేపట్టి యుద్ధ ప్రాతిపదికపై పూర్తిచేస్తే తప్పశాస్త్ర సాంకేతికయుగంతో ప్రపంచీకరణ నేపథ్యంలో ఎన్నటికి పైకిరాలేము. రాజకీయ వాదులు, ప్రజాస్వామ్య ప్రేమికులు, దేశభక్తులంతా ఈ ఉమ్మడి కర్తవ్య నిర్వహణకై కంకణ బద్ధులుగావడం వినా గత్యంతరం లేదు. అంతవరకు జనాభా పెరుగుదల, యువత సంఖ్యాధిక్యత వలన కలిగే ప్రయోజనం శూన్యం. అలాగే మనమెంతో సాధించినామని, మొదటి ప్రజాస్వామ్య పెద్ద దేశమని, రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థగల దేశమని, 2025 నాటికి ప్రపంచంలోనే ప్రథమ స్థానాన్ని పొందగల్గుతామని భ్రమించడం కేవలం ఆత్మవంచన అనిపించుకుంటుంది.

ఏది ఏమైనా దేశంలోని అన్నికీలక రంగాలలో ఏకధాటిగా సంస్కరణల ఉద్యమాలు చేపట్టి త్వరగా సత్ఫలితాలను చేబట్టలేక పోతే దేశం శాశ్వతంగా వెనకబాటు తనంలో మ్రగ్గియుండక తప్పదు. నిన్న, మొన్నటి ఆర్థిక సర్వే ప్రకారం దేశీయ సగటు వార్షికోత్పత్తి 5 శాతానికి పడిపోయిందని రుణభారం వార్షికోత్పత్తికి 70 శాతానికి చేరుకున్నదని వాణిజ్యలోటు (ఎగుమతులు, దిగుమతుల మధ్యతేడా) ఇదివరకెన్నడూలేనంతగా సుమారు 4 శాతానికి చేరిందని అలాగే 2012-14 ద్రవ్యలోటు 4 శాతముండబోతుందని, ద్రవ్యోల్బణం ( ధరల పెరుగుదల రేటు) 6 శాతం ఉంటుందని తెలుస్తున్నది. ఇవన్ని పరస్పర ఆధారరితాలే అవి ఏ విధంగాగూడా ఆశాజనకంగాలేవు. రాజ్యాన్ని నడిపించే రాజకీయ పార్టీలు వారి కూటముల అవగాహనతో నిమిత్తం లేకుండా చివరకు పార్లమెంటులో తీర్మానాల అవసరం కూడా లేకుండానే కేంద్ర యంత్రాంగం చేయదగిన పాలనా పర నిర్ణయాలని సకాలంలో సవ్యంగా చేయకపోవడం వలన లక్షలకోట్లకు మించిన విలువలుగల కార్యక్రమాలు అమలులోకి రాకుండా నిలిచిపోయినవైనం ఆశ్చర్యకరం.

రెండవ అడ్మినిస్ట్రేషన్ రిఫార్మ్స్ కమిటి కొన్ని దశాబ్దాలుగా పాలనా సంస్కరణలపై కేంద్రానికి 15 నివేదికలను సమర్పించింది. వీటిని పరిశీలంచి ఆమోదముద్రలు వేయడానికై నాల్గుస్థాయిలలో ఫైళ్లు ఆమోదం పొందాలని నిర్ణయించారుగూడా. మొత్తం 1490 రెకమెండేషన్లతో 1005 రెకమెండేష్లన్లు నాల్గుస్థాయిలలోగూడా ఆమోదాన్ని పొందినవి. ఇందులో 90 శాతం అనుమతి ముద్రలకై 5 సంవత్సరాల నుండి నిలిచిపోయినవి. ఇందులో దేశ విదేశీ పెట్టుబడుల వినిమయానికి సంబంధించి నవే అధికం. క్షంతవ్యంగాని ఈ అలస్యానికి ఎవరు సమాధానం చెప్పాలి? ఉత్పత్తులు పెరగడం, దేశ సంపద పెరగడం పన్నులు వసూలు కావడం సంక్షేమ పథకాలు సకాలంలో సక్రమంగా నిర్వ హించబడడం కంటే మించిన ప్రయోజనాలే రాజకీయ నాయకులు అధికారుల దృష్టిని ఆకర్షిస్తుంది. వాటి పేర్లే అవినీతి, బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతం అలసత్వం వీటికి విరుగుడు సంస్కరణల దివ్యౌషధం మాత్రమే. కేంద్ర ప్రభుత్వంచే నియమించబడిన ముఖ్యమైన కమిటిలు సమర్పించిన నివేదికలు పాలనా సంస్కరణల గురించి చక్కని సలహాలివ్వడం జరిగింది. 1966 నాటి పరిపాలనా సంస్కరణల ప్రథమ కమిషన్ నివేదిక, అయిదవ సెంట్రల్ పె కమిషన్ నివేదిక, 2000 సంవత్సరానికి చెందిన వినిమయ

సంస్కరణల కమిషన్ నివేదిక, ఇటీవల రెండవ పాలనా సంస్కరణల నివేదిక, అందులోని 13వ ఉప నివేదిక అత్యంత విలువైన సూచనలు సలహాలతో కూడినవి. ఇన్నిటిలో ఏ ఒక్క సూచన గూడా అమలు పర్చబడలేదు. రాజ్యాంగంలో పెర్కొన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పనివిభజనకు సంబంధిత షెడ్యూళ్లన్ని పునరాలోచించవలసిన అవసరం ఏర్పడ్డది. దీర్ఘకాల దృష్టితో సమస్యల శాశ్వత పరిష్కార లక్ష్యంతో ప్రజాస్వామ్య ప్రియులంతా కలిసి ధృఢమైన రాజకీయ వజ్ర సంకల్పంతో విప్లవాత్మక సంస్కరణల బాట నడిచి దేశాన్ని బహుముఖాభివృద్ధి పథంలోకి మళ్ళించి తీరాలి.

# 7. కుల వ్యవస్థ

అభ్యుదయ ఆర్థిక సంస్కరణలు అమలు పర్చబడి సమసమాజం దిశలో దేశం ముందడుగు వేయాలంటే దేశ పునర్నిర్మాణానికి అవసరమైన సామాజిక రాజకీయ సంస్కరణలు అనివార్యం. కోకొల్లలుగానున్న యువశక్తి సంస్కరణల ప్రక్రియలో అత్యంత ధైర్య సాహసాలతో యుద్ధ ప్రాతిపదికపై సామాజిక రాజకీయ సంస్కరణల మహోద్యమంలో క్రియాశీల ఉద్వేగం, ఉత్సాహంతో పాల్గొనాలి.

భిన్నత్వంలో ఏకత్వం అనేకత్వంలో ఏకత్వం భారతదేశ విశిష్ఠతగా ప్రపంచ నలుమూలల్లో చాటుకున్నా, మనం చెప్పుకున్న దానిలో  సాంస్కృతిక ఏకత్వం మినహ జాతీయతా నిర్మాణంలో ఒకటంటే ఒక శాతం గూడా ఏకత్వం కొరవడడం మన దేశాభివృద్ధికి తీరని హానిని కలిగిస్తున్నది. ఈ హానికి ప్రధాన కారణభూతమైంది దేశంలో ఉన్న కుల వ్యవస్థ. పుట్టుకతోనే వేర్పాటు గుణం, సామాజిక అసమానతల తత్వాన్ని పుణికి పుచ్చుకుంటున్న భారత మాత బిడ్డల్లో దేశ భక్తి, దేశ సమైక్యతా భావాలు సంతరించుకోవడం కష్టసాధ్యంగానున్నది. ఆర్థిక అసమానతలు పెరగడం, ఆర్థిక వర్గ వైరుధ్యాలు పెచ్చు పెరగడం, ఈ చీలికకు అగ్నికి ఆజ్యం పోసినంత పనిచేస్తున్నవి. ప్రపంచ వ్యాపితంగా మానవ సమాజాల పరిణామ క్రమాలను పరిశీలించగా అటవిక జీవన విధానాల  నుండి నాగరిక జీవన ప్రవేశక్రమంలో కొన్ని సమాజాలు ముందూ మరి కొన్ని వెనక నాగరికతా స్రవంతిలో కలిసి పోవడాన్ని చూడగల్గు తున్నాం. స్థానిక భౌగోళిక, నైసర్గిక, సామాజిక అవరోధాలు ఆయా పరిణామాలను తాత్కాలికంగా అడ్డుకున్నా ఆయా మానవ సముదాయాలు తమ సంఘటిత శక్తితో ఆయా అవరోధాలన్నిటిని జయించి నాగరికతా స్రవంతిలో చేరిపోవడాన్ని ఆసక్తితో పరిశోధించి గమనించినాం. ప్రపంచంలో ఎక్కడ గూడా సమాజాలు  భౌగోళికంగా కలిసిఉంటూనే శాశ్వతంగా వేల సంవత్సరాల సుదీర్ఘకాలంగా అంటరాని వారుగా హెచ్చుతగ్గులుగల సముదాయాలుగా తమ వృత్తి ధర్మాలకే ముడిబడిన “కులాలు”గా నుండడం చూడలేదు. భారతదేశానిదే ఈ ప్రత్యేకత. వేద కాలాలకు పూర్వం నుండి, అంటే కనీసం అయిదు, ఆరు వేల సంవత్సరాల సుదీర్ఘకాలం నుండి ఈ కుల వ్యవస్థ మన సామాజిక జీవనాన్ని ప్రభావితం చేస్తున్నది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య,శూద్ర వర్ణాలుగా విభజన పొందిన సమాజం చలనరహితంగా స్థిరపడి పోయింది. ఈ చాతుర్వర్ణ సమాజం, పరిణామ క్రమంలో ఆలస్యంగా సామాజిక జీవితంలో కలవడం వలననో లేక వైరి సమాజాలతో జరిగిన యుద్ధాలల్లో ఓడిపోయిన కారణంగా బానిసలుగా చేరిన కారణంగానో చివరలో చేరిపోయిన వారుగా పంచములుగా అందరికి బానిసలుగా తమ వ్యక్తిత్వం ఆత్మ గౌరవం గూడా కోల్పోయిన దీనులుగా, అంటరానివారుగా  జీవిస్తూవచ్చారు. వారిని ఈనాడు పేరుకు హరిజనులుగా, దళితులుగా, గిరిజనులుగా కొంత గౌరవంగా సంబోధిస్తున్నాం. రాజ్యాంగంలో  గుర్తింపునిచ్చి ఆదరిస్తున్నాం. ఐనా పుట్టుకతోనే తెచ్చుకున్న వంచన, శూద్రభావం వారిని వెన్నాడుతునేయున్నది.

మన దేశానికి ప్రాప్తించిన చాతుర్వర్ణ పంచమ వర్గాలల్లో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్గాలు ఉన్నతమైనవిగా శూద్రులు, అతిశూద్రులు (పంచములు) న్యూనతగలవిగా వాడుక భాషలో పెద్ద, చిన్న కులాలుగా ఈనాటికి చూడబడడం దేశ దౌర్భాగ్యం. ఈ వర్ణ, వర్గ కుల విభజన ఏ కాలంలో,

ఎవరిచేత, ఎందుకొరకు సృష్టించబడినదో ప్రపంచ వ్యాపిత చరిత్ర పరిశోధకులు కనీస ఆధారాల సహితంగా చెప్పలేక పోవడం సత్యశోధన ప్రక్రియకే మాయని మచ్చ. పరిశోధనల వైఫల్యం ఎలావున్నా శతాబ్దాల కాలం నుండి గడిచిన చరిత్ర సాధికారికంగా, సాక్ష్యాలయుక్తంగా “సనాతన ధర్మ శాస్త్రం” దాని రచయిత “మను”, వారి అనుచరులు ఈ దురాచారానికి బాధ్యులనే భావం ప్రబలంగానున్నది. ఈ వర్ణవిభజనను సమర్థిస్తూ బ్రాహ్మణ మేధావులు రచించిన సాహిత్యం, వారు తమ నిత్యకృత్యంగా ఆచరించిన జీవన సరళి వారిని వేదాలు ఉపనిషత్తుల్లో సుమారు అయిదు వేల సంవత్సరాల క్రితమే విద్య, విజ్ఞానానికి సృష్టికి సృజనకి మూలకారకులుగా భావించడం, దైవాంశ సంభూతులుగా వాసికెక్కించడం, వారనుభవిస్తున్న సామాజిక ప్రత్యేకత ఈ అవగాహనకి కారణాలుగావచ్చును. రమారమి 5-6 వేల సంవత్సరాల క్రితమే రూపొందిన కుల వ్యవస్థ వేద కాలానికి గూడా పూర్వపుదని హరప్పా, మహెంజుధారో త్రవ్వకాలల్లో వెలువడిన ఉత్పత్తి సాధానాలు రుజువు చేస్తున్నవని పురావస్తు శాస్త్రవేత్తలు ఘంటాపథంగా చెప్పుచున్నారు. ఆనాటి పట్టణ పరిధిలో ఒకే రకమైన పనిముట్లు ఒకే వీధిలో లభించడం, ఆ వీదిలో ఆయా వృత్తులకు జెందిన వారే నివసించేవారని వారి నిర్ధారణ.

అంతేకాదు చివరి మూడు వేల సంవత్సరాలుగా కులాలు వృత్తుల ఆధారంగా స్దిరపడి నప్పటికి అంతకు ముందు కాలంలో ఒక కులం వారు తమ వ్యక్తి నైపుణ్యత ఆధారంగా పై కులాలో చేరిపోయిన, యుగముండిందని చరిత్రకారుల ఊహ. శూద్రులు వైశ్యులుగా, క్షత్రియులుగా, బ్రాహ్మణులుగా కూడా మారి ఆయా కులాలకి వన్నెతెచ్చినట్లు స్మృతులు శృతుల ఆధారంగా తర్కిస్తున్నారు. పరిణామం పరివర్తనశీలమై హిందూ తాత్విక చింతనలకు మూలాలైన వేదాలు ఉపనిషత్తులలో నిర్థుష్టంగా ఈ వాస్తవాన్ని పేర్కొన్నారని వారి వాదన మానవ సమాజ పరిణామ చరిత్రలో ఇంకా చాలా చీకటి కోణాలున్నవి అందులో ఇదొకటిగావచ్చును. జ్ఞానవిజ్ఞాన బలంతో ప్రకృతి రహస్యాలను వెలుగులోకి తెచ్చే బ్రాహ్మణవర్గం, శత్రు దుర్గాలను ఛేదిస్తూ వారిని ఓడిస్తూ తమ సమాజాలను కాపాడిన క్షత్రియవర్ణం, సమాజానికి కడుపు నిండా పండ్లూ ఫలాలు వ్యవ సాయోత్పత్తులను సమకూర్చి వాటి వ్యాపారం చేస్తూ సమాజానికి వెన్నుదన్నుగా నిలిచిన వైశ్యులు అగ్రవర్ణాలుగా ఆమోదించబడగా మిగతా వారంతా సైనికులుగా వ్యవసాయ కూలీలుగా, సమాజానికి దాని వ్యవసాయానికి అవసరమైన వస్తు వాహనాలను పనిముట్లను తయారు చేసే వృత్తి పనుల వారంతా ఆయావృత్తులకు చెందిన కులాలుగా మిగిలిపోయినారు. వృత్తి ధర్మం, వృత్తి ప్రాధాన్యతల ఆధారంగా ఈ శూద్ర వర్ణంలో కూడా అనేక కులాలు, ఉప కులాలు చోటు చేసుకున్నవి. అదే విధంగా హెచ్చుతగ్గులు పెద్ద చిన్న తనాలు, చీలికలను పెంచినాయి. శూద్రులుగా అతిశూద్రులుగా జనాభాలో అత్యధికులుగా శ్రమజీవులు, కృషీవళలులుగా, సంపద సృష్టి కర్తలుగా సమాజ రక్షకులుగా నున్న ఆనాటి శూద్రులే ఈనాడు వెనకబడిన తరగతి, దళితులు, అతిశూద్రులు పంచములుగా సంఘంలో చివరిమెట్టుగా మిగిలి భావదాస్యంతో అణగారిన వారే ఈనాటి బహుజనులు. ఇంతటి చీలికలు పేలికలతో ఛిన్నా భిన్నంగా, పరస్పర అనురాగాలను కోల్పోయి అపనమ్మకం సంకుచిత భావం భావదాస్యం, భయంతో ఆత్మగౌరవానికై ఆరాటపడే అశేష కర్మవీరులే. వీరు ఐక్యత, ఆత్మ గౌరవం, ఆత్మాభిమానం దేశ భక్తి భావం కొరవడిన ఈదేశాన్ని సులభంగా జయించి దేశ సంస్కృతి సాంప్రదాయాలను మంటగలపి వందలు, వేల సంవత్సరాలుగా

తమ సామ్రాజ్యాలను ఏలిన దురాక్రమణదారుల భుజబలం కంటె మన దేశ ప్రజల ఆంతరంగిక దౌర్బల్యమే ఈ సుదీర్ఘ బాని సత్వానికి మూలం. జాతి నవనాడుల్ని పీల్చి నిర్వీర్యం చేసిన దుర్వ్యవస్థ.

భారతీయ ఆత్మగా భాసిల్లి ప్రపంచ వ్యాపితంగా హిందూ ధర్మ విశిష్టత సర్వ ధర్మ సమబావాన్ని చాటి చెప్పిన మన వివేకానందుడు హిందూ మతం, దానితత్వం మానవ సృష్టియేనంటూ వేదాంతం మెట్ట వేదాంతం కారాదని అది మానవుడిని మానవుడిగా తీర్చిదిద్దే పదునైన విజ్ఞాన శాస్త్రంగా పని చేయాలని, అనుష్టాన వేదాంతం కావాలని ఘోషించినారు. అగ్ర కులాలనబడే వర్ణం వారు చాతుర్వర్ణ సిద్ధాంతాన్ని పాటిస్తూ, ప్రవచిస్తూ చేసిన రచనలు, నిర్వహించిన కార్యక్రమాలు, సాంప్రదాయాలను సునిశితంగా విమర్శిస్తూ ఒకింత కోపంతో కూడా ఆయన అన్న మాటలు మన వర్ణవ్యవస్థ సృష్టించిన అనర్థాలకు అద్దం పడుతుంది. “ఆర్య పూర్వీకుల వారసులమని ఎంతో గొప్పలు చెప్పుకున్నా, ప్రాచీన భారతీయ సంస్కృతి మహోన్నతమైందని ఎంతతియ్యగా ఎడతెగకుండా గానం చేసినా, అగ్రకులంలో జన్మించామని ఎంత గర్వంగా మీరు ప్రకటించుకున్నా మీరు బ్రతికి ఉన్న వ్యక్తులమని అనుకుంటున్నారా? మూర్ఖుల్లారా! మీరు పదివేల సంవత్సరాల నాటి ఎండు పీనుగలు, ఎప్పుడో చనిపోయిన ప్రాచీన భారతీయ శవానికి కనిపించే రక్తమాంసాలు. మీరు తొందరగా ఈ మట్టిలో ఎందుకు ఖననమై కలిసిపోరు? గాలిలో ఎందుకు కలిసి పోరు? మీ స్థానంలో ఒక కొత్త ఉజ్వలమైన భారతదేశ సూర్యుడు ఉద్భవిస్తాడు శూద్రులు పరిపాలనచేసే రోజు ఒక నాటికి తప్పక వస్తుంది.” (“విజయవిహారం” మార్చి 2005 నుండి) అంటూ కులవ్యవవస్థను ఖండించినారు.

దళితులు, శూద్రులు మహిళల స్వతంత్రాన్ని హరించి, వారిని శాశ్వత బానిసలుగా మార్చిన పరిణామం ఈనాడయినా వారిని శాశ్వతంగా బంధ విముక్తుల్ని చేయవలసిన అవసరం కుల నిర్మూలన అవసరం గురించి మన దేశ నాయకులు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, మహత్మా గాంధీ లాంటి వారి అభిప్రాయాలను విహంగ వీక్షణంగా గమనిస్తే సమస్యకు గల కారణాలు, దాని పరిష్కార మార్గాలపై మరింత వెలుతురు ప్రసరిస్తుంది. కుల వ్యవస్థ చోటుచేసుకోవడానికి గల కారణాలెలా వున్నా భారత జాతికి ఆత్మహత్యా సదృశ్యంగా మారిన ఈ దుర్వ్యవస్థ నిర్మూలన ఎలా జరగాలనేది ప్రాజ్ఞులు పరిశీలించి పరిష్కరించవలసిన ప్రధానాంశం. కారల్ మార్క్సులాంటి గొప్ప తాత్వికుడు తాను ఆముద్రితంగా భద్రపరచిన రచనల్లో భారతదేశ కులవ్యవస్థపట్ల తమ ఆశ్చర్యాన్ని వెలుబుచ్చి యున్నారు. ఈ దుర్వ్యవస్థ ఏ కాలంలో ఎందుకు స్థిరపడిందో ఎంత శోధించినా బోధపడడం లేదన్నారు. ఏది ఏమైనా శ్రమజీవుల మధ్య ఐక్యత ఒకటే మానవ సమాజాల్ని, దోపిడి వ్యవస్థను మట్టి కరిపించి మానవత్వాన్ని సాధించగల్గుతుందని తమ ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటించినారు. మార్క్సు, ఎంగెల్సు లాంటి తాత్వికులతోపాటు, అనేక కోణాల నుండి ఈ కుల వ్యవస్థను విశ్లేషించిన భారతీయ తాత్వికులైన వివేకానందుడు, మహత్మాగాంధి, నెహ్రులాంటి సుప్రసిద్ధ సామాజిక, రాజకీయ నాయకులు చరిత్రకారులు భారతదేశంలోని ఈ కులవ్యవస్థను వేనోళ్ళ ఖండించినారు. మానవులంతా ఒక్కటేనను సిద్ధాంతాన్ని చాటి చెప్పినారు ఉద్యమించినారు. దీని కారణంగానే క్రమక్రమంగా ఈ వర్ణ వ్యవస్థ ప్రజాబాహుళ్యంలో తన పూర్వపు స్థానాన్ని కోల్పోయింది. సనాతన ధర్మం, ధర్మ శాస్త్రంగా వెలుగొందిన ఈ దుర్వ్యవస్థ పతనావస్థలోకి నెట్టబడుచున్నది. మరిన్ని వివరాలు గమనార్హం. ఐక్యరాజ్య సమితి

“వెనుకబడిన దేశా” లనే  పేరు మార్చి నవనాగరిక భాషలో “ అభివృద్ధి చెందుతున్న” దేశాలుగా వాటికి నామకరణం చేసినట్టె మన దేశ అత్యధిక జనాభాతో కూడిన వెనకబడిన తరగతులు” అనే బదులు అభివృద్ధి చెందుతున్న వర్గాలవారందరికి తాత్కాలిక సహాయాలుగా తోడ్పడే సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు, ఉపాధి, ఉద్యోగ సౌకర్యాలు పంచాయతీ రాజ్ వ్యవస్థలతో పాటు శాసనసభలు, పార్లమెంటులో గూడా వారి జనాభా దామాషా కనుగుణ్యంగా సీట్లు రిజర్వుచేసే విధానాన్ని రాజ్యాంగ సవరణ ద్వారా వారికి సంక్రమింపజేయు రాజకీయ సాధికారమే సర్వరోగనివారిణి అని అభివృద్ధి చెందుచున్న అన్ని వర్గాల నాయకులు ముక్తకంఠంతో కోరుకుంటున్నారు.

ఈ జఠిలమైన సమస్య ఉత్పత్తి,  దాని వికృతరూపం, కుల నిర్మూలనపై డా॥ బాబా సాహెబ్‌గారి విలువైన అభిప్రాయాలు గమనించి గుర్తించదగినవి. పాశ్చాత్య దేశాల నుండి ఆర్యులనే తెగకు సంబంధించినవారు భారతదేశంపై దురాక్రమణ దాడులు చేసినారని, వారె సింధూనదీ తీరాలను ఆక్రమించి నవనాగరితకు అంకురార్పణ చేసినారని, స్థానికులను ఓడించగా వారంత ఆత్మరక్షణార్థం దక్షిణ భారతదేశానికి వలసబోయినారని వారే ద్రవిడులని, విజేతలైన ఆర్యులు ఆగ్రవర్ణాలు అనబడే బ్రాహ్మణ, క్షత్రియ వైశ్య వర్గాలని పాశ్చాత్య చరిత్రకారులు నిరంతరం ప్రచారం చేసినారు. భాషలో కొన్ని సారూప్యతలను దీనికి సాక్ష్యంగా ఉదహరించారు. సొంత జ్ఞానం, అనుభవం చరిత్ర పరిశోధనా విజ్ఞానం లోపించిన మన దేశ పండితులు పాశ్చాత్య పండితుల అనుచరులేనన్నారు.  దాన్ని బహుళంగా ప్రచారంగూడా చేసినారు.  భాధ్యతాయుత పురావస్తు పరిశోధకులంతా డా॥ ఆంబేద్కర్‌తో సహా ఈ “ఆర్యుల దురాక్రమణ” సిద్ధాంతాలువట్టి బూటకమని ఒక కట్టుకధయని పరిశోధించి తెల్చివేయడం గొప్ప విశేషం. వేద కాలానికి పూర్వంనుండే సింధూనదీ తీరాలలో ఆపూర్వమైన అరుదైన సాక్ష్యాధారాలుగల నాగరికత  వెలిసియుండిందని ఇది ప్రపంచ పురాతన నాగరికతా చరిత్రలన్నిటికంటే పురాతనమైనదని పాశ్చాత్య పురావస్తు పండితులచే ఒప్పించడంగూడా జరిగింది. అప్పటినుండి, గత శతాబ్ది ఆరంభం నుండి ఈ “ ఆర్యులు ద్రావిడుల”నే కట్టుకథ ప్రచారంలో వెనకబడిపోయింది. భారతీయ నాగరికత యొక్క ఔన్నత్యం దాని విశిష్ఠత గుర్తింపులోకి రావడం జరిగింది. ఈ నేపథ్యంలో మనదేశంలో కులవ్యవస్థ ఎలా తలెత్తింది? శూద్రులు, అతిశూద్రులు పంచములు తమ స్వతంత్రాన్ని కోల్పోవడానికి అంటరాని వారుగా అధములుగా సమాజం నుండి వెలివేయబడిపోవడానికి గల కారణాలేమిటి? పరిశోధకులు, చరిత్రకారులు అనేకానేక ఆధారాల సహితంగా కుల వ్యవస్థ దేశంలోనే సృష్టించబడ్డదని తీర్మానించినారు. డా॥అంబేద్కర్‌తో సహా విద్యా, విజ్ఞాన వేత్తలంతా ఇలాంటి తీర్మానానికి తమ హర్షామోదాలను తెలియచేసినారు.

హిందూతత్త్వ శాస్త్రకోవిదులు, ప్రకృతి ధర్మాల గురించి సాధికారంగా ప్రవచిస్తూ హెచ్చరికలు గూడా చేసే వర్గం, ఆవృత్తిని ఆచరించేగణం, వారి వారసులంతా బ్రహ్మజ్ఞానం గల వారుగా ఆ విజ్ఞానం వారి సొంతంగా ప్రకటిస్తూ తమ చుట్టూ దడిగట్టుకున్నారు.  ఈ దడి ఎవరో తమ పరాక్రమంతో ఒకనాడే నిర్మించిందికాదు.  యుగయుగాలుగా వివిధ వృత్తుల్లో సమర్థులుగా దార్శ నికతలు గలిగిన విజ్ఞానవంతులుగా కూడా గుర్తింపు పొందినవారంతా అత్యున్నత బాధ్యతలు నిర్వ హించగలిగే బ్రాహ్మణ తెగలో చేరిపోయినారు.  ఆవృత్తి విశిష్టతల వివరణల కవసరమైన సిద్ధాంతాల్ని అనుభవాల్ని కథలు,

కథలుగా కర్ణాకర్ణిగా స్మృతులు, శృతులుగా ప్రచారంలోకి తెచ్చినారు. ఇలాగే తమ శక్తి సామర్థ్యాల ప్రమాణాల అధారంగా క్షత్రియ, వైశ్య, శూద్ర కులాల అవతరణ జరిగింది. వేల సంవత్సరాల సుదీర్ఘ పరిణామం ఫలితంగా క్రమ క్రమంగా ఈ వర్గవిభజన జరిగింది. అంతరంగిక ఘర్షణలు యుద్ధాలలో ఓడిపోయిన గణనాయకులంతా హతమైపోగా వారి అనుచర పామర జనం సైనికులతో సహబందీలుగా సమాజానికి బానిసలుగా మారారు. వారే అతిశూద్రులు లేక పంచములు. ఈ వర్గ మానవులు అనుభవించని కష్టం, చిత్ర విచిత్ర హింస లంటూ మిగలలేదు. ఈనాడు దళితులనబడే కులాలు ఉపకులాల పూర్వులు వేల సంవత్సరాల కాలం అగ్ర వర్గాలకు దాసులుగా దస్యులుగా నరకయాతనలనుభవించిన మానవాకారంలోని అస్పృశ్యులు, అధములు. కొన్ని వేల సంవత్సరాలుగా బానిసలుగా ఆత్మాభిమాన స్పృహనుకూడా కోల్పోయిన దైన్యులు. కాల క్రమంలో వీరినుండి విరిసిన విజ్ఞాన సంపన్నులే వేదాలు, ఉపనిషత్తులను గూడా రచించి సంస్కరించగలిగిన వారుదయించడం మానవునిలో దాగియున్న ప్రతిభకే ప్రబల తార్కాణం ఏది ఏమైనా కాలచక్రం శరవేగంగా కదలింది. స్థిరపడి దారితెన్నూ చూడ కండ్లు గూడా లేని సమాజాలు తిరిగి తమ స్వతంత్ర పోరాటాలను కొనసాగించినవి. విజయ పతాకాలని ఎగురవేసినవి చక్రవర్తులు, రాజుల దమనకాండకు చరమవాక్యం పలుకుతూ ప్రజాస్వామ్య బ్రహ్మరథాలకి రాచబాటలను వేసినవి. తిరిగి వెనక్కుమళ్లితే ఈ వర్గ విభజన క్రమంలో ఎందరో శూద్రులు, వైశ్యులు, క్షత్రియులుగా, బ్రాహ్మణులుగూడా పరిణితి చెందిన ఉదాహరణలున్నవి. అందుకే ఈ వర్గ విభజనను శాస్త్రవేత్తలు, నిపుణులు నిష్ణాతులు నిచ్చెనమెట్ల సిద్ధాంతంగా ప్రవచించినారు. ఇందులోని విశిష్టత గమనార్హం. క్రింది మెట్టుపై నున్నవాడు అస్తమానంపై మెట్టు ఎక్కే ఆలోచనతో ఆశతోనుంటాడు. అంతేకాదు తన కంటె క్రిందిమెట్టు పై నున్నవారికంటె తాను ఉన్నత స్థానాన్ని అధిరోహించగలిగినానని ఒకింత అహంభావంతో కొందరుంటారు. ఇలాంటి ఉన్నత-న్యూనత, పెద్ద చిన్న, అను మానసిక వైవిధ్యాలు, వైరుధ్యాల మధ్య సామాజిక స్పృహ, సామాజిక ఐక్యత, సమభావం, జాతీయత, జాతీయ ఐక్యతా భావాలు కొరవడిన జాతిదేశం తమ సంఘటిత శక్తిని సాధించలేని దురవస్థ పాలవకుండా ఉండలేదు. అందుకే దేశంలోపల జరిగిన ఆధిపత్య యుద్ధాలు, విదేశీ దురాక్రమణ దారుల దాడుల కారణంగా దేశ స్వతంత్రాన్ని సులభంగా కోల్పోవడం జరిగింది. స్వతంత్రం, ప్రజాస్వామ్య సిద్ధికి వందల సంవత్సరాల పోరాటం అవసరమైంది. లక్షల సంఖ్యలో స్వాతంత్ర్య సమరయోధులు తమ ఆత్మార్పణ చేయవలసి వచ్చింది.

డా॥ అంబేద్కర్, వారి అనుయాయుల పదునైన ఆలోచనల ప్రకారం భారతీయులు అటవిక జీవితాలకు స్వస్తి చెప్పి సామాజిక నాగరిక జీవితాలల్లో అడుగు బెట్టిన సమాజాలన్నిటిలో అగ్రగణ్యులు. అయిదు వేల సంవత్సరాల క్రితమే సింధూ నదీతీరాల్లో సకల సౌకర్యాలుగల పట్టణాలు తీర్చిదిద్దబడినట్లు హరప్పామహెంజుదారో త్రవకాలు రుజువు చేయడం మన అదృష్టం. ఇంతటి ఔన్నత్యం సాంస్కృతిక వారసత్వం గల భారతీయుల మనస్తత్వంలో అనుకరణ, అనుసరణ అను సద్భావాలు లోతుగా నాటుకొని ఉన్నాయని వారి విశ్లేషణ. వృత్తుల ఆధారంగా చేస్తున్న పనుల ఫలితంగా సమూహాలు ఏర్పడడం, ఉత్పత్తి సాధనాలను సమైక్యంగా వినియోగించడం, ఈ విధంగా తమ చుట్టూకులమనే దడిగట్టుకోవడంలో పై అనుసరణ భావం ప్రబలంగా పనిచేసిందని వారి నమ్మకం. వందలుకాదుగదా వేల సంవత్సరాలుగా

ఈ విభజనలు ఘనీభవించడం పరిమిత పరిధుల్లో జరిగిన పెండ్లి పేరంటాలుగూడా తమ కులాల మధ్య అడ్డుగోడలుగా మారిపోయిఉంటాయి.

శత్రువర్గ సైనికులుగా, పరాజితులైన అతిశూద్రులకు అత్యంత హీనమైన పనులనప్పగించగా సాధారణ శూద్రులు మెరుగైన పనులను తమ వృత్తులుగా చేసుకున్నట్లు అవగతమవుతున్నది. ఏది ఏమైనా ఈనాడు మనమంతా గర్వకారణంగా చెప్పుకోగలిగే సద్గుణాలయిన ప్రేమభావం అనుకరణ, అనుసరణ, సహనం, శాంత ప్రవృత్తి ప్రపంచంలోనే ఉన్నత సంస్కృతికి బీజాలు. వీటికి వారసులమయిన భారతీయలం ధన్యులం. ఈ సుగుణాలన్నిటిని సమర్ధవరంతగా వినియోగిస్తూ ఇప్పటికే కదిలిపోతున్న కుల వ్యవస్థను కూకటి వ్రేళ్ళతో పెకిలించి కూలద్రోయడం నాగరికులు బుద్ధి జీవులందరి ప్రధమ కర్తవ్యం.

ఈ సమస్య పూర్వాపరాలను వెలుగులోకి తెచ్చి తమ జీవితాంతం కుల నిర్మూలనకై పోరాడిన పాక్షికంగానైనా విజయాన్ని సాధించగలిగిన ధీశాలి. సంస్కర్త డా॥ ఆంబేద్కర్‌గారయితే వారికి పూర్వం వారి తర్వాత ఈ దిశలో కృషి చేసిన ఇంకా చేస్తున్న దేశభక్తుల అనన్య సామాన్య కృషికి నివాళు లర్పించకుండా ఉండలేము. డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్‌లాంటి మహా మనీషి, రాజ్యాంగ నిర్మాణ సంఘ ఆధ్యక్షులుగా కూడా పనిచేసిన బాధ్యతాయుత నాయకుడు. రాజ్యాంగంలో దళితులు, గిరిజనుల అభ్యున్నతి కొరకు చేసిన అపారకృషి, అభివృద్ధి చెందుతున్న (వెనుకబడిన) కులాల అభ్యున్నతి కొరకు చేయలేకపోయినారనే కువిమర్శ లేకపోలేదు. రాజ్యాంగ సభ ఈ అంశాలపై చర్చించిన కాలం, చర్చలలో పాల్గొన్న వారి భావజాలాన్ని దృష్టిలో పెట్టుకుంటే వారు దళితులు, గిరిజనుల సంక్షేమానికి వారి రాజకీయ ప్రాతినిధ్యానికి చేసిన పోరాటం, సాధించిన విజయం శ్లాఘించదగిందని ఆనాటి చర్చల సరళిని గుర్తించిన వారంతా వేనోళ్ళ పొగడి తీరుతారు. అభివృద్ధిచెందుతున్న (బడుగు, బలహీనవర్గాలు) వారందరి సంక్షేమం కొరకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4), 16(4)లతో ఆనాడు సంతృప్తి పొందడం జరిగింది. వాటి ఆధారంగానే సంబంధిత వర్గాల వారందరి సాంఘిక సంక్షేమం, విద్య, వైద్య, ఉపాధి, ఉద్యోగరంగాలలో తగుస్థానాన్ని పొందడం జరిగింది. వీటన్నిటికి కొనసాగింపుగా పనిచేసే వెనకబడిన తరగతుల రాజకీయ రిజర్వేషన్ కొరకు పోరాడే సమయం ఎనాడో ఆసన్నమైంది. మరింత సంఘటితంగా, సమైక్యంగా, ఉద్యమబలంతో ఈ విజయాన్ని గూడా సాధించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో కొంత కష్టసాధ్యమైనా అసాధ్యం అసలేకాదు.

మహాత్ముడుగా, ప్రపంచ మేధావులందరికి పూజనీయుడుగా నిలిచిన మన జాతిపిత ఈ వర్గాల అభ్యున్నతికి రాజకీయ రిజ్వర్వేషన్ల ఆవశ్యకతను కాదనేవారుకాదు. అన్ని మతాలు గణాల మధ్య అంతరాలన్నిటిని అర్ధం చేసుకున్న సంపూర్ణమైన మానవతావాదిగా అభివృద్ధి చెందుచున్న ఈవర్గాలకు అన్ని స్థాయిలలో రాజకీయ రిజర్వేషన్ నినాదాన్ని పూర్తిగా బలపర్చియుండెడివారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో బహుళార్ధకమైన సాధికారత సాధన దేశభక్తులందరి తక్షణ కర్తవ్యం. మౌలికమైన ఈ మార్పే పౌరులందరి సుఖశాంతులకు దారిదీస్తుంది. ప్రపంచవ్యాపిత సంఘటిత శ్రమజీవులతో కలిసి " వసుధైక కుటుంబకం" అను సమాజాన్ని సాధిస్తుంది.

కుల వ్యవస్థ పుట్టిన నాటినుండే కుల వ్యతిరేక ఉద్యమంగూడా పుట్టియుండాలె. వివిధ ఘటనలని పరిశీలిస్తే దేశ స్వాతంత్ర్య సాధనకు జరిగిన పోరాటానికి ఏ విధంగాను తీసిపోని లోతుపాతులతో ఈ కుల నిర్మూలన మహోద్యమాలు నిర్వహించబడినవి. మానవత్వం, సమానత్వాన్ని నమ్మిన మహ నీయులెందరో ఈ కుల వివక్షత సృష్టించిన అంతరాలు,అంతర్యుద్ధాలకు ఆహుతైనారు. మహరాజుగా జన్మించి రాజ్యమేలవలసిన బుద్ధుడు రెండున్నర వేల సంవత్సరాల క్రితమే ఈ వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగుబాటు బాపుటా నెగరవేసియున్నారు. హేతువాదానికి, సమభావానికి అంకురార్పణ చేసిన వారి అనుచరులు అశోక చక్రవర్తితోసహా బౌద్ధ సిద్ధాంతం, హేతువాదాన్ని దేశమంతా ప్రచారం చేయడమేకాదు ఆచరణ సాధ్యం చేయడానికి ఉద్యమాలు నిర్వహించినారు. భారతదేశంలో పుట్టి పెరిగిన బౌద్ధమతం ఖండాంతరాలకు వ్యాపించి చైనా, బర్మా, జపాన్, ఆగ్నే యాసియాలలో స్దిరపడింది. కాని తన జన్మభూమి అయిన భారతదేశంలో విజయం సాధించలేక పోయింది. హిందూత్వం పుట్టకలోనే ఈ విభజన బీజాలుండినవి. వేదాలు వేదోపనిషత్తుల కాలానికి వేల సంవత్సరాలకు పూర్వమే ఈ కులతత్వానికి బలమైన పునాదులు పడియుండాలి. వేద వేదాంతాలలలో గూడా చేయబడిన విమర్శలకు సమాదానాలు లేవు. ఆది శంకరాచార్యలు అనుభవించిన ఒక ఉదంతం ఆసక్తిదాయకం. వారు గంగానదిలో స్నానం చేసి ఒడ్డుకు చేరే సందర్భంలో ఒక ఛండాలుడు తన మూడు కుక్కలతోసహా శంకరాచార్యలు వస్తున్న దారిలో ఎదురైనారు. ఆ ఛండాలుడిని తమ కుక్కలతో సహ ప్రక్కకు పొమ్మ న్నారు. అంతట ఆ ఛండాలుడు “ ఆచార్యా! ఎవరిని ఎవరు ప్రక్కకి తప్పుకొమ్మంటున్నారు? నేను మీరు ఒకే ఆత్మకు ప్రతిరూపాలేకదా? పరమాత్మలో భాగమే కదా? మీరంటున్నది మాయ,మిధ్యయేగదా! అన్నాడట. ఆది శంకరాచార్యులు భిన్నుడై సమాధాన మివ్వలేక ఆత్మవిమర్శచేసుకున్నారట. నిజమే హిందూమత ప్రబోధం ప్రకారం మానవరూపాలు వేరయినా అందరిలో పరమాత్మప్రతినిధిగా ఆత్మ అను అపరశక్తి దాగియున్నది. దాన్ని మేల్కొలుపుతూ దాని ఆజ్ఞల్ని పాటిస్తూ విశ్వవ్యాపిత పరమాత్మను గమనించి గుర్తించి దానిలో లీనమైపోవడమె ప్రతి మానవుని కర్తవ్యమైనప్పుడు తోటి మానవున్ని, ఆత్మ స్వరూపున్ని భగవత్ స్వరూపాన్ని అడ్డు తొలగమని ఆజ్ఞాపించడం కేవలం అజ్ఞానమేకదా ఇది హిందూత్వమెలా అవుతుంది? ఇదంతా భౌతిక జీవిత వ్యామోహనాపరులు, హిందూమతం పేరిట సృష్టించి,పెంచిపోషించిన వైషమ్యంకాదా!వేదాంతాలు, ఉపనిషత్తులు వాటి శృతులు, స్మృతులపేర్లతో పుణ్యపురుషుల భాష్యాలకు వక్రభాష్యంచెబుతూ తాము బ్రహ్మజ్ఞానం కలిగిన “బ్రాహ్మణుల”మని అసత్యం చెప్పుకునే తుచ్చ మానవ దుష్ట చర్య కాదా! దీనికి హిందూమత మూలాలతో ఏలాంటి సంబంధంలేదు. గీతాచార్యుడైన కృష్ణుడు ఈ వర్ణ వ్యవస్థను సృష్టించింది తానేనని, ఐతే అది మానవుల “ గుణ కర్మల ” ఆధారంగా సృష్టించబడిన సృజనాత్మక విధానంగా సెలవిచ్చారు. పుట్టకతోనే సంభవించి, శాశ్వతం చేయడం “ గీత ”లో సాక్షాత్తు కృష్ణ భగవానుడు చెప్పిందే ప్రబల సాక్ష్యమని కులతత్వవాదులు వాదించడం కేవలం నిర్హేతుకం, నిరర్ధకం, హిందుమత మూల సిద్దాంతాలకే తగని అపచారం కూడా. “ గుణకర్మ” అను విస్తృతార్దంగల పదం ఈనాటి పరిభాషలో వివరించబడితే “ అత్యున్నత విద్యావేత్తలు ఆచరించే ఆదర్శవంత” జీవిత విధానమే. ఈనాడుగూడా అన్ని రంగాలలో వారు పూజనీయులు, ఆదర్శమూర్తులు వారంతా కీర్తి కిరీటాలను ధరించిన గొప్పవారుగా ఆరాధించ బడు తున్నారు. అన్ని కులాల్లో శూద్రులు, మహిళా

లోకంలోనూ జాతిరత్నాలుగా దశ దిశలలో తమ వెలుగురేఖల్ని ప్రసరిస్తూ భరతమాత ఘనతను చాటడంలేదా! ఈనాటి "కులవ్యవస్థ"ను గీతాచార్యుని "గుణకర్మ"ల పవిత్ర పదజాలంతో ముడిబెట్ట జూడడం, అపార్థాలు కల్పించడం హిందుత్వ వ్యతిరేకమేకాదు, సంఘ వ్యతిరేకంగూడా ప్రతి సత్యాన్ని మానవీయ ధృక్పధంతో చారిత్రిక నేపథ్యంలో చూడకుండా స్వీయ మానసిక ధోరణితో అపార్థాలను కొనసాగించడం ఛాదస్తం, అజ్ఞానం. సద్భావనల సమాహారమే సంస్కృతి, నూతన విలువలతో దాన్ని మరింత అలంకరించడం సంస్కర్తల కర్తవ్యం.వక్రభాష్యాలన్నిటిని ఛేదించి సత్యాలను ఆవిష్కరించడం వారి ధర్మం.

సామాజిక పరిణామ శాస్త్రాన్ని నమ్మే హేతువాదులు కులాల సృష్టి వాటిలో శతాబ్దాల కాలం నుండి కలిగిన సంచలనం వాటి నిరంతర పరిణామం. చివరకు వాటి స్దిరీకరణ, వాటి వెనక స్వార్ధ పరుల హస్తం, వాటి దుష్పరిణామాలను సులభంగా గమనించగల్గుతారు. కాల చక్రానికి ఏర్పడిన ఆటంకాల అడ్డును తొలగించగల్గుతారు. అలనాటి బుద్దుడు, జ్యోతిరావు ఫూలె, బాబాసాహెబ్ అంబేద్కర్, మహత్మాగాంధీ కోట్లాదిగానున్న వారి అనుచరగణం, శిష్యబృందం కులనిర్మూలన ఉద్య మాలలో అనన్యసామాన్య త్యాగాలు చేసి అనేక విజయాలు సాధించియున్నారు. వాటన్నిటి ఉద్దేశాన్ని రాజ్యాంగబద్ధం, చట్టబద్ధం చేయించవలసిన బాధ్యత మిగిలియున్నది. మహత్మాగాంధి గారు తాము మహాత్ముడుగా ప్రజా బాహుళ్యంచే గుర్తింపుని సాధించకముందే మహారాష్ట్రలో జ్యోతిరావుఫూలె నాయకత్వంలోని కుల వ్యతిరేక విప్లవోద్యమాలతో స్ఫూర్తినిపొంది తానే తననోట ఫూలెగారు మహాత్ముడని కొనియాడడం చరిత్రాత్మకం.

బుద్దుడు, ఆశోకుడు, మహాత్మాగాంధి, మహాత్మాఫూలె, డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్ గారలు కులవ్యతిరేక మహోద్యమాలకు పైతాళికులుకాగా దేశవ్యాపితంగా వేలాది ప్రజా నాయకులు, మేధావులు, పాత్రికేయులు, పౌర సమాజ నిర్వాహకులు ఈ రాజకీయ సంస్కరణకై రాజీలేని ఉద్యమాలను నిర్వ హిస్తున్నారు. ఈ అభ్యుదయ మానవీయ ఉద్యమాలు జయించి తీరతాయి. దళితులు, గిరిజనులకు వారి జనాభాకనుగుణ్యంగా రాజకీయ రిజర్వేషన్‌లు సాధించుకోబడి వాటి సత్ఫలితాలు కొంత సంతృప్తిని కలిగించగా స్ధానిక స్వపరిపాలనతో ప్రభుత్వోద్యోగాలలో రిజర్వేషన్లు అమలు పర్చబడి దళితులు, గిరిజనులతోపాటు బి.సి.లు, కొంతవరకు మహిళలు సంతృప్తికరంగా తమ విధ్యుక్తధర్మాన్ని పాటించగల్గుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంటుల్లో గూడా వీరందరికి రిజర్వేషన్లు రాజ్యాంగబద్దం చేయడాన్ని అడ్డుకుంటున్న సైంధవులు, ధన దాహం అధికారమత్తు వదలని కొందరు మాత్రమేనన్న సత్యం స్పష్టమవుతున్నది. వీరు అసలు ప్రజాస్వామ్యానికే వ్యతిరేకులు. అత్యధికంగానున్న కష్టజీవులు, శ్రమజీవుల వర్గాలకు, అధికార పగ్గాలు అందకుండా చూచే కాపలాకుక్కలు, రాష్ట్రాలు, కేంద్రంలో గూడా గణనీయమైన సంఖ్యాబలాన్ని సాధించినప్పుడు వేర్వేరు పార్టీలలో విభజించబడి సమైక్యంగా ఈ హక్కు సాధనకై పోరాడలేని బి.సి. నాయకులు తమ పరాధీనతను వదిలి, స్వతంత్రతను చాటి చెప్పాలి. ఈ సందర్భంలో రాజకీయపార్టీల రాజనీతిని ఉటంకించడం సందర్భోచితంగా నుంటుంది.

కుటుంబపాలనా సంస్కృతి ధనాఢ్యవర్గాల ప్రాబల్యంలోనున్న కాంగ్రెస్ పార్టీ సంగతి చెప్ప నక్కరలేదు. రాజకీయాలకు కేంద్రబిందువుగా పనిచేసే శాసనసభలు,పార్లమెంటు తమచే జారిపోకుండా

చివరి వరకు ప్రయత్నించడం తమ విధిగా ఆపార్టీ భావిస్తున్నది. బి.సి. వర్గాలు నాయకత్వం వహిస్తున్న పార్టీలు తమలో ఐక్యతను నెలకొల్పుకుంటూ నూతన జాతీయ ప్రజాస్వామ్య పరివర్తనకై చేయవలసిన ఉద్యమానికంటే రాష్ట్రాలకే పరిమితమై తమ అధికారాలను పదిలపరుచుకోవడమే ఉత్తమమనే అల్ప సంతోష బాల్యచాపల్య మాయలో కొట్టుమిట్టాడుచున్నాయి. వివేకానందుడంతటి దార్శనికులెందరో, ఎనాడో నొక్కి వక్కాణించిన సత్యానికి తిరుగంటూ ఉండబోదు. వీరు వారనే తేడా లేకుండా దేశవ్యాపిత ప్రజాస్వామ్య, సమహితవాదులు, చట్టసభల్లోగూడా రిజర్వేషన్ సూత్రం అమలు పర్చబడాలని ఆకాంక్షించడం శుభసూచకం. సోషలిస్టుపార్టీ ప్రస్తుతం మటు మాయమై పోయినా వివిధ జనతా పార్టీలనాయకులుగా నేటిదేశ రాజకీయాలల్లో నిర్మాణాత్మక పాత్రను పోషించగల్గడం మంచి పరిణామానికి నమ్మదగిన సాక్ష్యం. ఈ సందర్భంగా సుప్రసిద్ధ సోషలిస్టు నాయకులు, భారత రాజకీయాలపై తమదైన శాశ్వత ముద్ర వేయగలిన కీ॥శే॥ డా॥ రామమనోహర్ లోహియాగారి సింహగర్జనలు ప్రతిధ్వనించకమానవు. భారతీయతని సాహసంతో ప్రకటిస్తూ గాంధి గారి సత్యాహింసల మార్గాన నడచిన ధీశాలి కీ॥శే॥ రాం మనోహర్ లోహియా, బి.సి.ల రాజకీయ రిజర్వేషన్కై తనదైన శైలితో అధికారపార్టీని పార్లమెంటులో ఇంటా బయటా నిలదీసిన సమసమాజ సమర సేనాని. బి.సి.ల పార్టీలల్లో ఈనాడున్న అనైక్యతనే వారి పోరాటానికి ప్రధాన ప్రతిబంధకమని ఆయా నాయకుల నిజాయితీని బహిరంగంగా శంకించిన సత్యశోధకుడు.

కమ్యూనిస్టు పార్టీలు మొదటినుండే బిసి రిజర్వేషన్ సమస్యపై ముభావంగాఉంటూ మౌన వ్రతాన్ని పాటిస్తున్న అంశం భారతీయ రాజకీయ నాయకులందరిని దిగ్భ్రాంతికి గురిచేస్తున్న చిదంబర రహస్యం. రాజకీయ విప్లవం ద్వారా మాత్రమే సామాజిక సమస్యల పరిష్కారం సాధ్య పడుతుందని బిసి నినాదం ప్రజాస్వామ్య విప్లవ శ్రేణుల్ని ఐక్యపర్చడానికంటే విభజించే విప్లవ ప్రతీ ఘాత శక్తులకు పకరిస్తుందని వారి భయం. మార్క్సిస్టు సిద్ధాంతం పరిభాషలో ఆర్ధిక వర్గ వ్యవస్థ ఒక పునాది ఐతే కుల వ్యవస్థ దాని ఉపరితలం. చేతనైతే పునాదిని కూల్చాలే తప్ప ఉపరితలాన్ని కూల్చడం అసంభవం. కాబట్టి వర్గ విప్లవ విజయానికి అన్ని కులాల పేదలు, సమసమాజ భావకులు తోడ్పడాలనేది వారి సైద్ధాంతిక ప్రాతిపదిక. మార్క్సిజం మహోన్నతమైన సామాజిక శాస్త్రమనుటలో ఏలాంటి సందేహం లేదు. చారిత్రిక భౌతికవాదం, సామాజిక పరిణామక్రమాన్ని సునిశితంగా పరిశీలించి అటవిక జీవితంనుండి ప్రధాన సామాజిక జీవితంలో ప్రవేశించిన వివిధ సమాజాల ప్రత్యేకతల్ని విశ్లేషిస్తుంది. ఆదిమ సమాజాలు తమ బ్రతుకుదెరువుకై ఆధారపడిన ఉత్పత్తి సాధనమైన భూమి, తదితర పరికరాలను తమ ఉమ్మడి ఆస్తిగా పరిగణించేవారు. వారిలో నాగరతికత చోటు చేసుకున్న మేరకు వారి మధ్య పని విభజన జరిగింది. ఉత్పత్తి సాధనాల వినియోగంతో పరివర్తన చోటు చేసుకున్నది. వందలు, వేల సంవత్సరాల సామాజిక జీవన ప్రయాణంలో వారి మధ్య పని విభజనతో పాటు వర్గ విభజన కూడా జరిగింది. ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం కలిగిన వర్గమొకటైతే, ఆయా ఉత్పత్తి సాధనాలపై యాజమాన్య హక్కు లేకుండా వాటిని ఉపయోగిస్తూ సంపదను సృష్టిస్తూ దాన్ని యజమానికి హస్తగతం చేసే శ్రామికులోక వర్గంగా అవతరించడం వర్గ సమాజ ఆరంభదశ. ఈ రెండు వర్గాల మధ్య ఉత్పత్తి సంబంధాలే తర్వాత కాలంలోని వివిధ దశలలో విభిన్న వర్గ సమాజాల అవతరణ, వాటి మధ్య మిత్ర–శత్రు సంబంధాలు, వాటి సమాజాల అవతరణ, వాటి సామాజిక రాజకీయ స్థితిగతులకు

పునాదిగా ఉండడం చారిత్రిక సత్యం. ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యంగల వర్గాలు ఆయా సమాజాల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రాజకీయ వ్యవస్థలనే ఉపరితలాన్ని నిర్ణయించి నిర్వహించడం, ఒక గొప్ప మార్కిస్టు చారిత్రికావిష్కరణ అనుటలో ఏలాంటి సందేహంలేదు. శతాబ్ది, సహస్రాబ్ది సుదీర్ఘకాల వర్గ పోరాటాలు వాటి జయాపజయాల గురించి చర్చ ఇక్కడ అసందర్భం. ఐతే భారతదేశ కుల వ్యవస్థ పునాదిలో భాగమా లేక ఉపరి తలంలోని విభాగమా అనుమీమాంస మార్క్సిస్టు సిద్ధాంత అనుచరుల ముందున్న సమస్య. భారతదేశ కులవ్యవస్థ ఉపరితలం మాత్రమేకాని మరొకటి కాదని వారిలో అత్యధిక భాష్యకారులభావం. పైనుదహరించినట్లు కారల్‌మార్క్సు గారికే ఆగమ్య గోచరంగా నుండింది ఈ సమస్య.

చారిత్రిక భౌతిక వాదం పదునైన విశ్లేషణ, సత్యశోధన ద్వారా విభిన్న మానవ సమాజాల పరిణామక్రమాన్ని విశదీకరించాలంటే, శాస్త్రీయ విజ్ఞానంతోపాటు శాస్త్రాల ఆచరణలో సాధించిన ఉద్యమ అనుభవ సంపన్నులపాత్ర ప్రధానం. ఇదిలోపించడం కారణంగా మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నమ్మిన వారు పొందిన చేదు అనుభవాల జాబితాపై ఇపుడిక్కడే చర్చ అనవసరం. కొందరు రాజకీయ అనుభవజ్ఞులు వినమ్రతాపూర్వకంగా మనవి చేస్తున్న అంశం ఆలోచించదగింది. భారతదేశ కుల వ్యవస్థ ఏనాడుగూడా మార్క్సిస్టు పరిభాషలోని పునాదికాదు, ఉపరితలమూకాదు. వేల సంవత్సరాల సామాజిక పరిణామక్రమంలో ఉత్పత్తి సంబంధాలపై ఆధారపడే వర్గ సమాజ రూపకల్పనకు ముందే ప్రాథమిక పని విభజన దశలోనే జరిగిన వర్గ విభజన ఇది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్గాలు ఆనాటి అత్యవసరాలు తీర్చడానికవతరిస్తే శూద్ర, అతి శూద్ర, పంచమ వర్గాలు తర్వాత శతాబ్దాల కాలంలో రంగ ప్రవేశం చేసిన బానిసలు, యుద్ధాలలో నాయకులు మృత్యువాతబడిపోగా మిగిలిన సైనికులు, బందీలుగా అమానుష శిక్షలననుభవించిన అతిశూద్రులు పంచములు. సామాజిక పరిణామక్రమంలో సహజంగా చోటుచేసుకున్న ఈ వైవిధ్యానికి మాంర్క్సిస్టు పరిభాషలోని చారిత్రిక భౌతికవాద "ఉత్పత్తి సాధనాలపై యాజమాన్య గీటురాయి"తో ఏలాంటి సంబంధంలేదు. అంతమాత్రాన చారిత్రక భౌతికవాద సిద్ధాంతం భారతీయ సమాజానికి వర్తించదనే వాదనలో ఏలాంటి పసలేదు. తప్పకుండా వర్తిస్తుంది. సత్యాన్వేషణకుపకరిస్తుంది. సామాజిక పరివర్తనను వేగవంతం చేయడంలో మార్గదర్శకత్వం వహిస్తుంది. స్థిరీకరించబడిన మూడువేల సంవత్సరాలకు పూర్వం కొన్ని వేల సంవత్సరాలకాలం అవి వ్యక్తుల గుణకర్మలకే పరిమితమై ఒక కులం వారు వేరొక కుల ప్రవేశం పొందడం తమ తమ ప్రతిభల ఆధారంగా మారడం జరిగినట్లు, ఆ తర్వాత ఆవతరించిన స్మృతుల మాధ్యమంగా వెలుగుజూచిన వేదాలు, వేదాంతాలు ఆతర్వాత ఉపనిషత్తుల ప్రబోధాలు రుజువు చేసినవి. రెండున్నర వేల సంవత్సరాల క్రితమే బుద్ధుడు వారి అనేకమంది అనుచరులు అర్థం చేసుకొని కుల నిర్మూలనకై చేసిన విఫల ప్రయత్నాల గాథలు దీన్ని మరీ మరీ రుజువు చేసినవి. ఈనాటి ఆధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞానయుగంలో " పునాది–ఉపరితల" చర్చ పూర్తిగా నిర్హేతుకం. సమాచార విప్లవం ప్రపంచవ్యాపిత మానవాళి కళ్లుతెరిపించింది. లక్షలాది వర్గ పోరాటాలు వందలాది విప్లవాత్మక పోరాటాల ఫలితంగా రాగల్గే సామాజిక చైతన్యం సమకాలిక చరిత్రల పరిణామ వేగం కొలది దశాబ్దాల ఐక్య ప్రజా ఉద్యమాల ద్వారా సాధ్యమౌతుంది. అభివృద్ధి నిరోధక శక్తుల ప్రతీఘాతక శక్తి నిర్వీర్యమై అభివృద్ధికాముకుల ఐక్య కంఠారావం. అభ్యుదయ శంఖారావంగా పరిణతిజెందుతుంది. మార్పులు

వేగవంతంగా సంభవించగల్గుతాయి. తక్కువ త్యాగాలతో అత్యధిక విజయాలు సాధ్యపడుతాయి. ప్రజాస్వామ్యం ఒక పదునైన ఆయుధం, సామాజిక జీవన విధానం, రాజకీయ వజ్రాయుధం. దీన్ని సక్రమంగా వినియోగించగలిగే ప్రజా ఉద్యమాలకు పరాజయమంటూ ఉండదు. గత ఆరు దశాబ్దాల అనతికాలంలో రాజకీయ రిజర్వేషన్ ద్వారా దళితులు, గిరిజనులు సాధించిన విజయాన్ని ఏమాత్రం తక్కువ అంచనావేయలేము. ఐతే ఆర్థిక సామాజిక రంగాలలో వారు మరెన్నో విజయాలను సాధిస్తే తప్ప నాగరిక ప్రపంచంలో తమ శ్రేణులనలంకరించలేరు. బి.సి.లు (అభివృద్ధి చెందవలసిన వర్గాలు) తమ సంఘటిత శక్తి, బలంతో త్వరత్వరగానే నిచ్చెన మెట్లనెక్కగల్గుతారు. బానిసత్వ పీడవిరగడైంది. శ్రమ జీవులుగా తమ విద్యా విజ్ఞాన సుగంధంతో ఈనాటి పోటీ ప్రపంచంలో విజయపరంపరలను సాధించగల్గుతారు. కీ॥శే॥ రాం మనోహర్ లోహియా గారు తరచూ ఛలోక్తిగా చెప్పినట్లు దళితులు, బిసిలు తమలోనున్న రెండు నకారాత్మక ప్రవృత్తులను వదులుకోవాలి. ద్వేష ప్రవృత్తి మొదటిదైతే, దాస ప్రవృత్తి రెండవది. ప్రజాస్వామ్య ప్రవృత్తి రామబాణంలాంటిది. అందరిని కలుపుకుపోతుంది. శత్రువులను గూడా నిరుత్తరుల్ని నిరా యుధుల్ని చేస్తుంది. నిప్పులాంటి నిజాన్ని నెగ్గిస్తుంది.

ప్రజాస్వామ్య ప్రభుత్వకాలంలోనే 1953లో వేయబడిన కాకా కలేల్కర్ కమిషన్ ఆ తర్వాత 1977లో వేయబడిన మండల్ కమీషను బిసిల బహుముఖాభివృద్ధికై చక్కని నివేదికలు అందించాయి. వాటిని అమలు పరుచుకునే ప్రజా ఉద్యమాలల్లో ఏర్పడిన చీలికలే వీటిని వెలుగు చూడనీయలేదు. ఆలస్యం అమృతం విషం. అత్యవసర ప్రాతిపదికన బి.సి. సంఘాలు ఐక్యంగా కృషి చేయగలిగితే బిసి వర్గాల రాజకీయ రిజర్వేషన్ సాధన ఎంతో దూరంలేదు. జనాభాలో అత్యధికభాగంగానున్న వీరి రాజకీయ విజయం దేశ ఆర్థిక సామాజిక సాంస్కృతిక విప్లవాలకు తెరతీస్తుంది.

అసలు భారతదేశానికి ప్రతిరూపమే దళిత, గిరిజన, మైనారిటి, బిసి వర్గాలు. ఆకలిచావులు అనేక సామాజిక ప్రాంతీయ అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి, అలసి ఆత్మహత్యలకు తెగించే యువకిశోరాలల్లో ఈ వర్గలవారే అత్యధికులు. ప్రతి రోజు మృగాళ్ల అత్యాచారాల, అవమానాలను భరంచలేక ప్రాణాలు కోల్పోతున్న బాలికలు, మహిళల్లో ఈ వర్గాలకు చెందిన వారే అత్యధికం.

కాబట్టి మహిళలతో సహా బడుగు బలహీనవర్గాల బహుముఖాభివృద్ధి సమస్య భారతదేశాభివృద్ధి సమస్య. వివిధ వర్గాల సబ్ ప్లానులు, ప్రత్యేక బడ్జెట్లు, ప్రత్యేక ప్యాకేజీలు ఈ వర్గాల కంటి తుడుపు చర్యలు మాత్రమే. పైన వివరించిన సామాజిక ఆర్థిక సంస్కరణల్ని చిత్తశుద్దితో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యంతో వికేంద్రీకరణ వ్యవస్థ ద్వారా అమలు పరచడమొక్కటే సమస్యలన్నిటికి శాశ్విత పరిష్కారం. ప్రతి సంవత్సరం పప్పు, బెల్లాల సబ్సిడీల పేరుతో మూడవవంతు దేశ జనాభాపై దాదాపు రెండు లక్షల కోట్ల ధనాన్ని మాత్రమే వెచ్చిస్తూ మూడున్నర లక్షల కోట్ల రూపాయల సబ్సిడీలు, పన్ను రాయితీలు మాఫీల రూపంలో ఒకే ఒకశాతం ఉన్న ధనాఢ్య వర్గాలకు అందిస్తూ వారిని పోషించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలనంతమొందింపజేయాలి. కష్టజీవులందరి నిరంతర కృషి ఆధారంగా పెంచే దేశీయ ఆదాయాన్ని పునరుత్పత్తి, ఉపాధి,ఉద్యోగ కల్పన లక్ష్యాలతో వినియోగించడం దారిద్ర్య నిర్మూలన, బహుముఖాభివృద్ధికి శాశ్వత పరిష్కారం, ఈ వర్గాల ప్రజాసంస్థలు వారి ప్రతినిధులు ఈ కార్యక్రమాలు గలిగిన ఎన్నికల ప్రణాళికలతో గెలవాలి. గెలిచి తమ వాగ్దానాలను తూచా తప్పకుండా

అమలుపర్చాలి. ఆనాడే నవ భారతం, నవీన సంస్కృతి అవతరిస్తుంది. కుల, మత విభేదాలు శాశ్వతంగా అంతరిస్తాయి. ధనార్జన అధికార సాధనాలే లక్ష్యాలైతే ఈనాటి పరిస్థితి మరింత విషమించి అసలు ప్రజాస్వామ్య వ్యవస్థకే తీరని హానిగా పరిణమించే ప్రమాదం పొంచి కూర్చున్నది. బి.సి.ల సాధికారతా ఉద్యమం, ఆర్థిక సామాజిక, సమహిత సిద్దాంతాల ఆచరణల దిశలో పురోగమించాలి. ఈ గుణాత్మక మార్పు పరివర్తన లేకుండా గ్రుడ్డిగా ధనదాహం, అధికార వ్యామోహాల దిశలోనే ఉద్యమాలు కొనసాగితే తాత్కాలిక విజయాలతోపాటు శాశ్వత లక్ష్యాలు అసంభవాలుగా మారక తప్పదు. కుల నిర్మూలన లక్ష్యం కులాతీత, మానవీయ వినూత్న సమసమాజ సృష్టిగావాలి. అదే దేశభక్తులందరి ఆదర్శం, అభిమతం.

శరవేగంగా అలుముకుంటున్న ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచంలోని దేశాల ఆంతరంగిక వ్యవస్థలు విడదీయరాని విధంగా సమ్మిళితంకావడం గమనించి గుర్తించవలసిన గొప్ప అవసరం. కులనిర్మూలన అంశం, ఇతర అంశాలు ముఖ్యంగా రాజకీయపార్టీ, పార్టీ వ్యవస్థ, ఎన్నికల వ్యవస్థ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలతో ముడిబడి ఉన్న సత్యం గమనార్హం. రాజకీయరంగ సంస్కరణలు కుల నిర్మూలన ప్రయత్నాలన్నిటికి నిర్మాణాత్మక తోడ్పాటునిస్తాయి. కులాల సాధికారిత, రాజకీయ రంగ సంస్కరణలు, కుల నిర్మూలన ప్రయత్నాలన్నిటికి సకారాత్మక తోడ్పాటునిస్తాయి. కులాల సాధికారిత, రాజకీయ రిజర్వేషన్‌ల సంస్కరణ, కుల నిర్మూలన మహోద్యమానికి చేయూత నివ్వడమేగాక అంతిమ విజయాన్ని అనతికాలంలోనే సాధించడానికి బహుళంగా ఉపయోగపడతాయి.

పంచాయితి రాజ్ వ్యవస్థలో దాదాపు దేశవ్యాపితంగా అన్ని రాష్ట్రాలలో దళిత, గిరిజనుల కివ్వబడిన రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లతోపాటు మహిళలు, బిసిలకు కూడా తర తమ తేడాలతో రిజర్వేషన్ నిర్ణయాలు ఆచరించబడుతున్నవి. అలాగే విద్యాలయాలల్లో అడ్మిషన్‌లతో సహా ఉపాధి ఉద్యోగాలల్లో గూడా రిజర్వేషన్ సిద్దాంతమే రాజ్యాంగ స్ఫూర్తికి మౌలికసూత్రాలకు వ్యతిరేకమని కోర్టుల్లో వ్యాజ్యాలు వేయడం గూడా కొన్ని దశాబ్దాల క్రితమే జరిగింది. సుప్రీంకోర్టు కొన్ని మధ్యంతర నిర్ణయాలు చేసినా అంతిమంగా బిసిలకు ఉపాధి ఉద్యోగాల కల్పనపై ఆర్టికల్ 15(4), 16(4)ల వెలుతురులో 50 శాతానికి మించినవిగా ఉద్యోగాలివ్వరాదని అంతకులోపుగా ఇవ్వడం సమర్థనీయమని చెప్పింది. సంవత్సరానికి 4 లక్షలు అంతకు మించిన ఆదాయంగల కుటుంబాల వారిని క్రీమీలేయర్‌గా ప్రకటించాలని, దీనిపైనున్న వారు అందరితోపాటు పోటీపడాలి తప్ప రిజర్వేషన్ సూత్రం వర్తించదని తేల్చి చెప్పింది. మండల్ కమీషన్ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వోద్యోగాలలో రిజర్వేషన్ని 27 శాతానికి పరిమితం చేయడం అందుకే జరిగింది. అప్పటికే తమిళనాడులో అధికారంలో ఉండిన బిసి నాయకత్వంలోని డియంకె మరియు అన్నాడియంకె పార్టీలు 69 శాతం ఉద్యోగాలనిచ్చి కూర్చున్నవి. విధిలేని, మార్గాంతరంలేని పరిస్థితిని అధిగమించడానికి కేంద్ర పార్లమెంటు ఒక తీర్మానం ద్వారా తమిళనాడుకు సుప్రీంకోర్టు ఆజ్ఞనుండి ప్రత్యేక మినహాయింపునివ్వడం జరిగింది. దేశ వ్యాపితంగా బలోపేతంగానున్న బిసి వర్గాల సాధికార ఉద్యమ శక్తి తన ఉనికిని చాటడమే కాకుండా రాజకీయ రిజర్వేషన్‌ల సాధనదిశతో ముందడుగు వేయగలగడానికిది ప్రబల సూచికగా ఇది నిలుస్తుంది.

దేశ సమున్నత న్యాయస్థానం అనుసరించిన వైఖరి హేతుబద్ధమై ఆలోచించదగినదే. ప్రజా స్వామ్య ఎన్నికల ప్రక్రియలలో మహిళలతో సహా దళితులు, గిరిజనులు, మైనార్టీలు అలాగే జనాభా ప్రాతిపదికపై బిసిలకు షుమారు 80 శాతం జనాభాకు రాజకీయ రిజర్వేషన్ ఇవ్వడమంటే రిజర్వేషన్ సూత్రానికే అర్ధముండదు. రిజర్వేషన్ ఒక రక్షణ కవచం. అసమాన పోటీనుండి బలహీన వర్గాలను కాపాడే మానవీయ సూత్రం. దీన్ని శాశ్వతం చేసే ఆలోచన అశాస్త్రీయం. కాల పరిమితి నిర్ణయం సామాజిక ప్రతినిధుల బాధ్యత.

సామాజిక శాస్త్రవేత్తల్లో అనుభవజ్ఞులైన వారు ఈ రిజర్వేషన్ల కాలపరిమితి గురించి ఈ క్రింది విధంగా ఆలోచిస్తున్నారు. కుల నిర్మూలన కేవలం ఉపదేశాలు, సందేశాలవలన జరగదు. ఈనాడు మనిషి పుట్టుకకు వృత్తికి (కులానికి)అవిభాజ్యమైన సంబంధమున్నది. వృత్తి నిర్ణయాత్మక పాత్రను పోషిస్తున్నది. దేశం పరాధీనత నుండి విముక్తి సాధించి ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రయాణం చేయడం కుల నిర్మూలన ప్రయత్నానికి గొప్ప అవకాశాన్నందిస్తుంది. 65 సంవత్సరాల ప్రజా స్వామ్యయుగంలో ఇంకా దేశీయ సంపదలో కేవలం 14% ఆదాయంపై వ్యవసాయం దానికి సంబంధించిన వృత్తులలోని 80 శాతం వెనుకబడిన కులాల వారు, దళితులు, గిరిజనులు ఆధారపడుతున్నారు. అవిద్య, అజ్ఞానం, నైపుణ్యతలేని మిడి మిడి జ్ఞానంతో నుంటూ తమ కులవృత్తులను వదిలి ఆధునిక పట్టణ జీవితంలోకి మళ్ళలేకపోతున్నారు. విధిలేక, గతిలేక అదే గ్రామీణ సాంప్రదాయబద్ధ జీవితాలు గడుపుచున్నారు. ఆర్ధిక సంస్కరణల ఫలితంగా గ్రామీణాభివృద్ధిపై, మౌలిక సదుపాయాల నిర్మాణంపై దేశానికవసరమున్న ఒక ట్రిలియన్ కోట్ల డాలర్ల ధనాన్ని అనగా వంద లక్షల కోట్ల రూపాయల్ని రానున్న రెండు ప్రణాళికల కాలంలో వెచ్చించగల్గితే గ్రామీణ వెనకబడిన దళిత యువత త్వరగా పట్టణ జీవితంలోకి తరలి బహుముఖ వృత్తులను చేపడుతుంది. నాణ్యతతో గూడిన తమ శ్రమ శక్తిని వినియోగించి సాంప్రదాయ వృత్తులకు స్వస్తి చెపుతుంది. దీని ఫలితంగా నూతన జీవన విధానంలోకి వివిధ కులాల కార్మికులతో సంపర్కం పెరుగుతుంది. అలాగే స్త్రీలు సాధికారులు విద్యావంతులైతే వారిలో గూడా పై మార్పు వేగిరంగా చోటు చేసుకో గల్గుతుంది. ఫలితంగా యువత మారుమూల గ్రామీణ జీవితంనుండి బయట పడుతుంది. విభిన్న కుల మతాలవారు అనుసరించే బహుముఖ వృత్తుల్లో కలిసి పనిచేసే వినూత్న సంస్కృతిని అలవర్చుకుంటుంది. స్త్రీ స్వాతంత్ర్యం విద్య, విజ్ఞానం వారిలో వర్ణాంతర వివాహలను ప్రోత్సహిస్తుంది. కుటుంబ ఒత్తిళ్ళు గాని, కులమత పడికట్లుగాని వ్యక్తి స్వాతంత్రాన్ని అరికట్టలేవు. ఒకటి రెండు శాతం విఫలమైనా అత్యధికశాతం తమ నిర్ణయాలపై నిలదొక్కుకోగల్గతుంది.

ఈ విధంగా మాత్రమే కుల వ్యవస్థ నిర్మూలించబడుతుంది. దేశాభివృద్ధిని కోరేవారంతా మొదలు ఆర్ధిక సంస్కరణలను ప్రకటించాలి. కావలసిన నిధులన్ని గ్రామీణాభివృద్ధి వృత్తుల ఆధు నికీకరణకై వెచ్చించి ప్రజల ఆర్ధిక జీవితంలో గొప్ప మార్పును సాధించాలి. సామాజిక పరివర్తనలు, కుల కట్టుబాట్లు, అసలు కులాలే క్రమంగానైనా చరిత్రలో వేగంగానే మాయమైపోతాయి. సామాజిక మార్పు ప్రధానమా లేక ఆర్ధిక విప్లవం ప్రధానమా అను నిరర్ధక మీమాంస పండితుల పాండిత్యాన్ని నిరుపయోగం చేయడం గొప్ప ఆశ్చర్యం. నిజజీవితంలోని కఠోర వాస్తవికతలను చూడలేని వారిని

బాధించే రుగ్మత ఇది. సామాజిక సంస్కరణకి ఆర్థికాభివృద్ధితోనున్న అవినాభావ సంబంధం ఇది. సామాజిక ఆర్థిక పరివర్తనల మేలుకలయిక ఇది. అందుకే 50 శాతం రంగాన్ని బహిరంగంగా అందరికి పోటీపడటానికి వదిలివేస్తూ మిగతా 50 శాతానికి లోబడి రిజర్వు చేయడం హేతుబద్ధం న్యాయసమ్మతమనిపించుకుంటుంది. ఐతే ఈ జఠిలమైన సమస్యను సుదీర్ఘంగా ఆలోచించి మంచి పరిష్కార మార్గాన్ని అనుసరించడం అవసరం. లేదా తమిళనాడులాగే ఉద్యమాలు కట్టలు త్రెంచుకోవచ్చు. ఆయా రాజకీయ నాయకులు చేతులెత్తి వేయవచ్చు. సమస్య క్లిష్టతరమై, వికృత రూపంగూడా ధరించవచ్చును. సైద్ధాంతికంగా సహజ న్యాయం, చట్టబద్ధ న్యాయాలమధ్య ఘర్షణలకు దారి తీయవచ్చును. ఈ సందర్భంగా రాజకీయ సామాజిక ఉద్యమ నాయకులు, న్యాయశాస్త్ర పండితులు, రాజ్యాంగకోవిదులు ఈ క్రింది ప్రతిపాదనను సాకల్యంగా ఆలోచించవలసిందిగా కోరుచున్నారు. మేధావివర్గం దీనిపై సానుకూలంగా ఆలోచించి తమ విలువైన సూచనల్ని జాతి కందివ్వడం అవసరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ సమున్నత న్యాయస్థానం విధించిన లక్ష్మణరేఖకు లోబడి కేంద్ర, రాష్ట్ర శాసనసభల్లో బి.సి. వర్గాలకు వారి గ్రూపులకు రాజ్యాంగబద్దంగా 25-27 శాతం రాజకీయ ప్రాతినిధ్యాన్ని రిజర్వుచేయాలి. దేశీయసగటు ఆదాయం పెరుగుదల రేటు ఈనాడు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అయిదు శాతం అంతకు తగ్గే పరిస్థితులేర్పడితే బలహీన వర్గాలకు రాజకీయ రిజర్వేషన్ అవసరం ఇంకా బలపడుతుంది కాబట్టి రాజ్యాంగబద్ధంగా నిర్ణయించిన రిజర్వేషన్‌లను కదలించవలసిన అవసరంరాదు కాని దేశీయాదాయం చాలామంది ఆశిస్తున్నట్లుగా ప్రతి సంవత్సరం ఒక శాతం పెరిగినా దీని ఫలితంగా దారిద్ర్యరేఖకు దిగువనున్న 35 శాతం జనాభా ప్రతిసంవత్సరం 1.5 శాతం నుండి 2 శాతానికి తగ్గిపోయే అవకాశముంటుంది. అదే విధంగా దేశ జనాభాలో ధనవంతుల శాతం రెండు రెండున్నర అంకెవరకు పెరిగే ఆస్కార ముంటుంది. అప్పుడు క్రీమీలేయర్‌ను నిర్ధారించే వార్షికాదాయంగల వారి పరిధి విస్తృతంగాక మానదు. ఫలితంగా సుప్రీంకోర్టు వారు బహిరంగ పోటికొర్కై నిర్దారించిన 50 శాతం పరిధి విస్తరించి ప్రజాస్వామ్యబద్దంగా ప్రజా ప్రాతినిధ్యచట్టం ప్రకారం పోటీ జరిగే మైదానంగూడా విస్తరించడానికి 50 శాతం నుండి 60 శాతానికి చేరవచ్చును. ప్రతి 10 సంవత్సరాలకొక పర్యాయం ఎన్నికల కమీషన్ పర్యవేక్షణలో బహిరంగ పోటీరంగం పరిధి విస్తరణ పునర్నిర్ణయానికి అవకాశముంటుంది. పరిపాలనలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. రిజర్వేషన్ కవచాల అవసరం తీరిపోతుంది. కులవ్యవస్థ తన ఉనికిని కోల్పోతున్నట్లుగా మంచి జరగనున్నట్లుగా కుల నిర్మూలన ఉద్యమాలు విజయఢంకా మోగించనున్నట్లుగా ధైర్యంగా చెప్పు కోగల్గుతాం. లేనిచో ఈనాటి రాజకీయ, ఉద్యోగ, విద్యా విషయక రిజర్వేషన్ విధానాలల్లో మార్పుం డదు. రక్షక కవచాలు యధావిధిగా కొనసాగుతాయి. సమ్మిళితాభివృద్ధి, మంచి పరిణామాలతో మంచి మార్పులనాశించే ఆశాజీవులు సాత్వికులంతా ఈ దిశలో సృజనాత్మక క్రియాశీల ఉద్యమాలతో ముందడుగు వేయకతప్పదు. రాజకీయాలు, ప్రజా ప్రాతినిధ్య విధానాలన్నీ ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారా పవిత్ర లక్ష్యాలైన సమత, బహుజన హితం, బహుజన సుఖాన్ని సాధించే మార్గాలేనని గమనించాలి.

పరిశ్రమ మాత్రమే బ్రతుకు పోరాటానికి పరమావధిగా శ్రామికులంతా సమానులనే సామాజిక స్పృహతో శత సహస్రాబ్దాలకాలం పరిఢవిల్లిన భారతీయ సంస్కృతిలో పనిని దానిలోని పనితనాన్ని సొంతం చేసుకునే ప్రక్రియలో కుల విభజన బీజాలు పడినట్లుగా అర్ధమవుతున్నది. ఆయా పని లేక

వృత్తి ప్రాధాన్యతల కారణంగా ఈ విభజనలు ఘనీభవించి దడులుగా, అడ్డుగోడలుగా పరిణమించినట్లు ద్యోతకమవుతున్నది. ఆతర్వాత స్థిరీకరణకు లోనవుతూ సమాజానికి ఉపయోగం, అవసరాల ఆధారంగా పెద్ద,చిన్న అనుభవాలు చోటుచేసుకొన్నట్లు ఊహించ గల్గుతాం. ఈ పరిణామాన్ని అధికారంలోఉన్న అగ్ర వర్ణాలు, వర్గాలు, విభజన ప్రక్రియకు దైవత్వాన్ని, ప్రకృతి సిద్ధమనే తత్వాన్ని ఆపాదిస్తూ తమ పరిపాలనను సునాయాసంగా కొనసాగించుకోగల్గినట్లు ద్యోతకమవుతుంది. కాలక్రమంలో బ్రతుకు తెరువుకై ప్రాంతాల ఆక్రమణకై వివిధ గణాల మధ్య జరిగిన యుద్ధాలలో ఓటమిపాలైన అనాధలు గెలిచిన గణ నాయకత్వానికి కట్టుబానిసలుగా మారి అతి శూద్రులుగా మారిన తీరుగురించి పైన చర్చించినాం. ఈ పరిణామాలన్ని కుల విభజనక్రమానికి మరింత ఆజ్యం పోసినట్లు అర్ధమవుతుంది. ఏది ఏమైనా పరిశ్రమనే మానవావతారానికి మూలమైనట్లుగా పరిశ్రమలోని భిన్నత్వం పని పంపకం కులాల అవతరణకు కారణమని గమనిస్తే ఈనాటి శాస్త్ర, సాంకేతికయుగంలో మానవులు సాధించిన విప్లవాత్మక ఆవిష్కరణల నేపధ్యంలో పని (పరిశ్రమ) అందరి సొత్తుగా అందరికి సొంతంగామారింది. సమాజంలో నిత్యనూతన రూపాంతరం పొందే జీవనశైలిలో కులాల అడ్డుగోడల్ని కూల్చడం నవ సమాజాన్ని నిర్మించడం కష్టసాధ్యం కావచ్చునుగాని అసాధ్యంకాదు. కలసి పనిచేయడం, కలిసి బ్రతకడం, కలిసిఉండడం, కలిసి పోరాడి తమ జీవన ప్రమాణాల్ని పెంచుకోవడంలాంటి ఐక్యత కులాల మధ్య దృఢతరం అవుచున్నది. కులాంతర వివాహాలు మిశ్రమ కుటుంబాలు నూతన సంస్కృతిని సృష్టించుచున్నవి. ఈ దిశలో విజ్ఞులంతా ఆలోచించి చేయూత నిస్తారని అనతికాలంలోనే కులాల మధ్య ఈనాడున్న అసహజ విభజన అంతమవుతుందని ఆశిద్దాం, సాధిద్దాం. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో రిజర్వేషన్ సూత్రాన్ని ఖచ్చితంగా పాటిస్తూనే ఆయా కులాలలోఉన్న ఆణగారిన ప్రజల సంక్షేమ కార్యక్రమాల సక్రమ నిర్వహణకై ఆయా కులసంఘాల నాయకత్వ సేవలను అధికారి కంగా వినియోగించడం ఈ దిశలో గొప్పగా తోడ్పాటునిస్తుందని విజ్ఞుల విశ్వాసం. ఆర్థిక, సాంస్కృతిక, సాన్నిహిత్యాలు ఈ నాటి అడ్డుగోడల్ని కూల్చడంతో అందరు సమానులనే గుర్తింపు, పరస్పర ప్రేమ, అభిమానం కుదర్చడంతో అత్యధికంగా తోడ్పడుతాయని వారి ధృడ నమ్మకం. పై చర్యలన్ని ఏక కాలంలో చేపట్టి కొనసాగడం కుల విభజనను శాశ్వతంగా తొలగిస్తుందని పరిపూర్ణ విశ్వాసం.

# 8. రాజకీయ వ్యవస్థ

పేరులోనే అర్థం అవగతమౌతుంది. సమాజాలు, దేశాలలో పాలిత పౌరులు, పాలక వర్గాల మధ్య వారధి ఈ వ్యవస్థ. ప్రపంచ వ్యాపితంగా జరిగిన సామాజిక పరిణామాల సునిశిత విశ్లేషణల్లో బయటపడిన సర్వసాధారణ అనుభవసారం గమనార్హం.

ఆటవిక జీవితంనుండి సామాజిక జీవితంలో అడుగుబెట్టిన తర్వాత వందలు, వేల సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో ఆయాసమాజాలల్లో చోటుచేసుకున్న ఆర్థిక సామాజిక, పాలనాపరమైన నియమ నిబంధనల అవసరం ఏర్పడ్డది. సమాజం వర్గ సమాజంగా రూపాంతరం చెందింది. ఉత్పత్తి దాని పంపక ప్రక్రియ గొప్పపనిగానో, సమస్యగానో నిత్యం పౌర జీవితాన్ని ప్రభావితం చేసింది. ఉత్పత్తి క్రమంలో ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం గలిగినవారు, ఉత్పత్తి చేసే వారి మధ్య వైరుధ్యాలేర్పడి అవి తీవ్ర శత్రుత్వాలుగా మారి చిన్న,పెద్ద సంఘర్షణలకు దారితీసినవి. విభిన్న ప్రయోజనాలుగల విభిన్న వర్గాలుగా సామాజిక జీవితాన్ని శాసించినవి. కాలక్రమేణా ఉత్పత్తి సాధనాలపై యాజ మాన్యంగల వర్గం పై చేయి చేసుకుంటూ ఉత్పత్తి క్రమంలో కష్టజీవులుగా శ్రమించే పారిశ్రామికులపై పెత్తనం చేయడం, ఉత్పత్తి చేయబడిన విలువలో తామే సింహభాగాన్ని అనుభవించడం, ఉత్పత్తి దారులకు వారి నిత్య జీతభత్యాలిస్తూ అంతటితో సంతృప్తి పడమని చెప్పింది. ఇదే వర్గ విభజన, వర్గ సంఘర్షణల్లో తమ ఆధిక్యతను సాధించిన వర్గాలు చరిత్రక్రమంలో పాలక వర్గాలుగా, అసాధారణ, సాధారణ పౌరులుగా విభజన జరిగింది. ప్రాబల్యం పెత్తనం తమ సొంతంగా మార్చుకున్న వర్గాలు "బానిస యజమానులు - బానిసలుగా", "భూస్వాములు-రైతులుగా", "పెట్టుబడిదారులు- పారిశ్రామిక కార్మికులు"గా వర్గ విభజనలు జరిగి ఆయా దేశాల సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను శాసించినవి. ఈ విభజన ప్రపంచ వ్యాపితంగా ఒకేకాలంలో ఒకే రకంగా ఒకే విధంగా జరగలేదు. వివిధ సమాజ పరిణామాల విశ్లేషణ, పరిశోధనలతో వెలుగుజూచిన అనుభవాల సారూప్యత ఆధారంగా పరిణామశాస్త్రాన్ని చలనసహిత సమాజ సిద్ధాంతంగా నమ్మి నిరూపించిన శాస్త్రం మార్క్సిజం. దీని వెలుతురులో అనేకానేక సామాజిక రాజకీయ సమస్యలను పరిష్కరించిన ప్రాజ్ఞులున్నారుగాని దీనిని ప్రశ్నిస్తూ కాదనగలిగే పండితులు కనబడలేదు. సామాజిక పరిణామ శాస్త్రానికే జీవం పోసింది మార్క్సిజం. రాజకీయ వ్యవస్థకు సంబంధించిన చర్చలో చారిత్రిక భౌతికవాద దృక్పథం అత్యంత విలువైన దార్శనికత నందజేస్తుంది. సంపద ఉత్పత్తి క్రమంలో పోషించిన పాత్ర, నిర్వహించిన పని ఆధారంగా, అంటే సమాజ ఆర్థిక పునాది ఆధారంగా, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, న్యాయ తదితర వ్యవస్థల రూపకల్పన జరుగుతుంది. ఒకటి ఆర్థిక పునాదిగానుంటే దాని రక్షణకై నిర్మించబడిన వ్యవస్థలన్ని దాని ఉపరితలంగా అవతరించడం జరుగుతుంది. పునాది వ్యవస్థలో సర్వాధికారంగల యాజమాన్యవర్గం, తన వర్గ ప్రయోజనాల పరిరక్షణకై ఉపరితల వ్యవస్థల రూపకల్పన చేస్తుందని దీని సారాంశం.

ఒక వర్గ వ్యవస్థ మారి రెండవ వర్గ వ్యవస్థ దాని స్థానాన్ని ఆక్రమించడం సుదీర్ఘకాల వర్గ రాజకీయ ఉద్యమాలు వివిధ రకాల పోరాటాలు చివరకు యుద్ధాలుగూడా జరిగిన తర్వాత (మార్పు)

సాధ్యమైంది. చరిత్రల్లోని బానిసలు, రైతులు, వ్యవసాయ కార్మికులు అతిశూద్రులు, పంచములు, అంటరానివారుగా పేర్కొనబడేవారంతా తమ బ్రతుకు పోరాటంలో ఓటమి పాలై పరాయీకరణ పొందినవారే. జయాపజయాలలో రాటుదేలిన కష్టజీవులు వీరు. గత మూడు శతాబ్దాల క్రితం భూస్వామ్య రాచరిక వర్గాలను ఢీకొని పారిశ్రామిక విప్లవాలను పాశ్చాత్య దేశాలలో విజయవంతం చేసింది వీరే. పాలకవర్గాలు ఎవరైనా తమ స్వార్థ ప్రయోజనాల సాధన ఉద్దేశాల కనుగుణ్యంగా తమ ఉపరితల వ్యవస్థలను నిర్మిస్తారు. విద్యావిధానంలోని పాఠ్యాంశాలు, చరిత్రలోని కథలు కట్టుకథలు, న్యాయశాస్త్రంలో న్యాయ సూత్రాలు చివరకు దేశ రాజ్యాంగంలోని ఆదేశాలు అన్ని పాలకవర్గ ప్రయోజనాల పరిరక్షణకై ఉద్దేశించబడినట్లు స్థూలంగా అర్థమవుతుంది. ఇలాంటి స్థూల సిద్ధాంతాలు అన్ని దేశాలల్లోని అన్ని సమాజాల వాస్తవ పరిణామక్రమం స్థితిగతులను తెలియ జేస్తాయిగాని సంక్లిష్టంగాఉన్న వ్యవస్థలో సూక్ష్మంగా పనిచేస్తూ పరిణామ చోదకశక్తుల నిజ స్వరూపాన్ని చూపలేవు. ప్రతి సామాజిక పరిణామ క్రమాన్ని క్షేత్రస్థాయి ప్రత్యేకతల వెలుతురులో విభిన్న వర్గాల బలాబలాల ప్రమాణాల విశ్లేషణ ద్వారా మాత్రమే ఉద్యమ వ్యూహాలు, ఎత్తుగడల నిర్ధారణ సాధ్యపడుతుంది. తొందరలో ఓపికలు నశించిన వేళలో స్వీయ మానసిక నిర్ణయాలు చేస్తూ నిర్వహించబడిన గొప్ప ఉద్యమాల అనుభవాలు తర్వాత కాలానికి అనుభవ సంపదగా మార్గదర్శకాలుగా ఉపకరించినవి. సత్య శోధనలోకి వెళ్ళి సూక్ష్మ దృష్టితో ఆలోచించగా చాలా సందర్భాలలో ప్రజల చైతన్యవంతమైన ఉద్యమ ప్రభావంతో ఆర్థిక పునాదులను ప్రభావితం చేసే విధంగా ఉపరితల వ్యవస్థలే మారినట్లు ఆ తర్వాత తదనుగుణ్యంగా ఆర్థిక పునాదులు మారడం నూతన వ్యవస్థ నిర్మాణం జరిగినట్లుగూడా అనుభవ సంపద తెలుపుతున్నది.ఇలాంటి మౌలిక పరిణామాలు సాధ్యపడగల్గుతాయని మార్క్సిస్టు సిద్ధాంతకర్తలు గుర్తించకపోలేదు. ఏది ఏమైనా సామాజిక పరిణామమనునది పరమ సత్యం. విభిన్న వర్గాల మధ్య సంఘర్షణలు, సైద్ధాంతిక పోరాటాలు సాగడం నిష్ఠుర సత్యం. శ్రామికులు పారిశ్రామికుల అంతిమ విజయం శిలాక్షరం. ఈ సందర్భంగా మార్క్సిస్టు సిద్ధాంత అనుచరుల విలువైన దృష్టిని ఆకర్షించే అవసరం ఏర్పడుతుంది. చారిత్రిక భౌతికవాదం, మార్క్సిజం పేరుతో 20వ శతాబ్దిలో ప్రపంచ వ్యాపితంగా అనేక దేశాలలో విప్లవోద్యమాలు నిర్వహించబడినవి. అందులో కొన్ని విజయవంతంకాగా మిగతావి ఓటమి పాలుకావడం జరిగింది. విజయవంతమైన విప్లవాలు, రష్యా, చైనా, తూర్పు యూరపు దేశాలలో "పునాది ఉపరితల" సిద్ధాంతం అక్షరాల ఆచరించబడ్డది. "కేంద్రీకృత ప్రజాస్వామ్యం" పేరిట కమ్యూనిస్టు పార్టీలు వాటి పోలిట్‌బ్యూరోలు వాటి నిర్వాహకులైన ప్రధాన కార్యదర్శిగారలు చేసిన నిర్ణయాలు అందరికి శిరోధార్యమని శాసించడం జరిగింది. బహుజనాభిప్రాయ మైన ప్రజాస్వామ్య భావం. ఆయా పోలిట్ బ్యూరోల భావాలకు వ్యతిరేకమైతే అది అన్యవర్గభావంగా తోసివేయబడడం జరిగింది. కాలక్రమేణా సర్వసాధారణమైన ప్రజాస్వామ్యంగా వ్యవహిరంచబడిన నియంత్రత్వం (కార్మికవర్గ నియంతృత్వ సిద్ధాంతం) ఘోర పరాజయం పొందింది. శ్రమజీవులంతా దిగ్భ్రాంతికి గురికావలసివచ్చింది. "సోవియట్ తరహా సోషలిజం" లోపభూయిష్టమైందని ప్రపంచవ్యాపిత మార్క్సిస్టు పార్టీలు తమ సిద్ధాంతంపై పునరాలోచిస్తూ అవసరమైన సంస్కరణల్ని చేపట్టడం, ప్రజాస్వామ్యాన్ని పునరుజ్జీవం చేయడం ఈనాటి గొప్ప అనుభవం.

భారతదేశంలో సర్వసత్తాక రిపబ్లిక్ రాజ్యాంగ వ్యవస్థ అమలులోనున్న అర్ధశతాబ్దకాలం తర్వాత గూడా స్థూలంగా భూస్వామ్య పెట్టుబడిదారి వ్యవస్థలే ఇక్కడి సమాజాన్ని శాసిస్తున్నవి. ఆయా వర్గాల ప్రయోజనాలను పదిలంగా చూచే రాజకీయ పార్టీలు అధికారంలోఉన్నవి. సామాజిక రాజకీయ పరిణామక్రమాలను సూక్ష్మదృష్టితో పరిశీలిస్తూ వ్యూహరచన చేయవలసిన గురుతర బాధ్యత రాజకీయ పార్టీలపైఉన్నది. సుదీర్ఘ స్వాతంత్రోద్యమం, అమరవీరుల త్యాగఫలితంగా నిర్మించుకున్న ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థ ఆధారంగా ప్రజా ప్రతినిధులు సామాజిక ఆర్ధిక విజయాలను సాధించే అవకాశమున్నది. వివిధ శ్రామిక, పారిశ్రామిక ఉద్యమాల ఫలితంగా స్వార్ధపర వర్గాల వర్గ పునాదులను కదిలించడమే కాదు పెకిలించే ఆస్కారమున్నది. ఐతే ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ రెండు మార్గాలను, వర్గ పోరాటం– నిర్మాణ కార్యక్రమాలను సముచితంగా సమన్వయం చేస్తూ భావ విప్లవాన్ని సాధ్యం చేస్తూ అభ్యుదయకరమార్పును సాధ్యం చేయ గల్గుతాం కాబట్టి రాజకీయ పార్టీల సిద్దాంతాలు వాటి రూపకల్పన, ప్రజాస్వామ్య పద్ధతులపై సార్వత్రిక ఎన్నికల నిర్వహణ, ప్రజాస్వామ్యబద్ధంగా రాజ్యాంగ సవరణలతో సహచట్టబద్ధ పరిపాలనను కొన సాగించే శాసనసభలు, పార్లమెంటు సభల నిర్వహణ ఇందుకు అత్యంత ప్రధానమైనది. పునాది మారిన తర్వాతనే అన్ని రకాల ఉపరితలం మారుతుందనే విడివాదానికి కాలం చెల్లింది. ఉత్పత్తి, సంబంధాలలో కీలకపాత్ర నాక్రమించి కూర్చున్న దోపిడీ వర్గం దాని అధికార యంత్రాంగంతో వర్గ పోరాటాల అవసరం లేకుండానే ఉపరితల వ్యవస్థలను సంస్కరిస్తే ప్రశాంతంగా మార్పు సాధ్యపడుతుందనే సంస్కరణవాదం అంతే పిడివాదంగా మారుతుంది కాబట్టి రెండిటిమధ్యఉన్న అవినాభావ సంబంధాన్ని యుక్తితో వాస్తవికతల వెలుతురులో సమన్వయం చేయగల నాయకత్వం తక్కువ కష్టనష్టాలు, త్యాగాలతో అత్యధిక విజయాలను సాధించగలిగే వినూత్న ఉద్యమాల వాతావరణం ఏర్పడ్డది. సమరశీలం, చైతన్యవంతమైన ఓటర్ల నిర్ణయాత్మక పాత్ర ప్రజాస్వామ్య వ్యవస్థకు పట్టుగొమ్మగా నిలుస్తుంది. రాజకీయ వ్యవస్థలో కీలకమైన మూడు అంశాలల్లో సత్వర సంస్కరణల ఆవశ్యకతను గత 65 సంవత్సరాల స్వాతంత్రానంతర చేదు అనుభవాలు ఘోషిస్తున్నాయి.

## రాజకీయ పార్టీలు

స్వాతంత్రానంతర అర్ధశతాబ్దికి మించిన, సుదీర్ఘ అనుభవం వెలుతురులో రాజకీయ శాస్త్రవేత్తలంతా చెప్పగలిగే పరమ సత్యం గమనార్హం అధికారంలోఉన్న రాజకీయ పార్టీలు వాటి మంత్రి వర్గాలు దేశ బహుముఖాభివృద్ధికై సాధించింది బహు స్వల్పం దేశ జనాభా సుమారు నాల్గు రెట్లకు పెరిగి,దేశ సంపద పెరుగుదల పదిరెట్లకు మించినప్పటికి ఇంకా 35 కోట్ల దేశ పౌరులు అర్ధాకలితో, దారిద్రరేఖకు దిగువగానున్నారు. వంద కోట్ల జనం కేవలం 60 రూపాయల దినసరి ఆదాయంతో తమ బ్రతుకు భారాన్ని ఈడ్చుచున్నారు. మధ్యతరగతిగా పరిగణించబడే 75 కోట్ల జనం అభద్రతాభావంతో తమ ఉపాధి, ఉద్యోగ ధర్మాలను నిర్వహిస్తూన్నారు. రెండవవైపు ప్రతి సంవత్సరం, ఉత్పత్తి చేయబడుచున్న సుమారు వంద లక్షల కోట్ల రూపాయల ప్రజల కష్టార్జితంలో 20 లక్షల కోట్ల ధనం కొన్ని వేలుగానున్న పన్నుల ఎగవేతదారులు లేదా పెట్టుబడిదారి వర్గం చేతిలో లెక్కకు రాకుండా పంపకానికి దొరకకుండా అదృశ్యమౌతున్నవైనం ప్రభుత్వ లెక్కలే తేల్చి చెప్పడం గొప్ప ఆశ్చర్యం. సంపద ఉత్పాదకత రేటు మందకొడిగా పరిణమించగా ఆర్ధిక నేరస్తులు స్వైరవిహారం చేయడం ఒక గొప్ప శాపంగా మారింది.

రాజ్యాన్ని నిర్వహించే రాజకీయ పార్టీల గురించి చర్చించే సమయంలో పైనుదహరించిన విశ్లేషణ అత్యంత సందర్భోచితం. పండిట్ జవహర్‌లాల్ లాంటి దార్శనికుడు ప్రధానిగాఉన్న నాటినుండి సౌమ్యుడు, అర్ధశాస్త్ర పండితుడైన ప్రధానిగా మన్ మోహన్ సింగ్ గారి వరకు ఈ దేశానికి 12 పంచవర్ష ప్రణాళికల ఆచరణ తర్వాత కూడా ఒక నిర్ధిష్టమైన సిద్ధాంతం పటుతర రాజకీయ విధానాలు కొరవడడం క్షంతవ్యంగాని గొప్ప రాజకీయ నేరం. "పునాది ఉపరితల" సిద్ధాంతం వెలుతురులో అధికార పార్టీలకు (ఉపరితలం) దోపిడి వ్యవస్థతోగల సంబంధాలను విస్మరించలేం. ప్రత్యేక వర్గమైన క్రొనీ క్యాపిటలిజం (దళారి పెట్టుబడిదారివర్గం) ఆవతరణను విస్మరించజాలం. పరిశ్రమలే లేకుండా దేశ సంపదను కొల్లగొట్టగలిగే ఈ వర్గ లీలల్ని ప్రతిరోజు ఆశ్చర్యంగా గమనిస్తున్నాం. 1980 తర్వాత కాలంలో ప్రవేశించిన మిశ్రమ ప్రభుత్వాల కాలంలో పై నుదహరించిన సైద్ధాంతిక రాజకీయలోపాలు మరింత స్పష్టంగా, కొన్ని సందర్భాలలో వెగటుగా, అసహ్యంగా గూడా దిగజారినవి. మన రాజ్యాంగ స్ఫూర్తిపై ఆధారపడి చేయబడే చట్టాలు తక్కువే. చేయబడిన కొద్దిపాటి చట్టాల ఆచరణ, అత్యధికులల్లో ఏవగింపు, ఆసహనాన్ని సృష్టిస్తున్నది. గత 10 సంవత్సరాల కాలంలో సమాచార విప్లవం పుణ్యమా అంటూ అనేకానేక రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో జరిగిన కుంభకోణాలు వాటి మూలంగా దేశం నష్టపోయిన లక్షలాది కోట్ల ధనానికి సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి వస్తూ సభ్యసమాజాన్ని నిరాశ నిస్పృహలలో ముంచెత్తుచున్నవి. చివరకు రాజకీయ ప్రజాస్వామ్యంపైన గల విశ్వాసాన్నే సడలింపచేస్తున్నది.

ప్రజాస్వామ్యం, అత్యంత బలోపేతమైన ప్రజాశక్తిని నిర్మించే ప్రబల సాధనం. ఈ శక్తి నిర్మాణానికవసరమైన భావ సారూప్యతను, భావ విప్లవాన్నిగూడా సృష్టించగలిగే పదునైన పరికరం. సహజ సిద్ధంగానే విడి విడిగా ప్రజాబాహుళ్యంలో నిద్రాణమైయున్న పరివర్తనా చైతన్యాన్ని తట్టిమేల్కొల్పి వారిని మార్పు కొరకు సుసంఘటితం చేయగలిగే ఆధునిక సామాజిక యంత్రం. ఇది భావసారూప్యతగల చైతన్య శీల ప్రజాఉద్యమాల చోదకశక్తి, సక్రమ వ్యూహాల రూపకల్పన చేస్తూ ఆచితూచి అడుగులు వేసే నాయకత్వానికి పరాజయమంటూ లేకుండా విజయాన్ని సమకూర్చే విప్లవశక్తి, ఇన్ని విధాల శక్తి సంపన్నమైన దేశ భవిష్యత్తుకే దిక్సూచిగానున్న దేశ రాజ్యాంగంలో సువర్ణాక్షరాలతో నిక్షిప్తమైన మన రాజకీయ ప్రజాస్వామ్యం ఈనాడు నిర్వీర్యం నిరుపయోగంగావడం వెనక దేశ రాజకీయ పార్టీలలో ముఖ్యంగా అధికార పార్టీలల్లో గూడుగట్టుకొనియున్న సామాజిక స్పృహ రాహిత్యం, వ్యక్తి లేక వర్గ స్వార్ధం, ప్రజలకు సమాచారాన్ని, సమాధానాన్ని నిరాకరించే పరాన్న జీవి మనస్తత్వం. దీని వలననే రాజ్యాంగబద్ధ ప్రజాతంత్రానికి వీడని గ్రహణం దాపురించింది.ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన జవాబుదారితనం పారదర్శకత ప్రహసనంగా మారినవి. ప్రజాస్వామ్యం నిర్జీవం, నిరర్ధకమై కేవలం ఎన్నికలను నిర్వహించే యంత్రాంగంగా మిగిలిపోయింది. ఈ కఠోరసత్యాన్ని రాజకీయ పార్టీలు గమనించి, గుర్తించి అవసరమైన కాయకల్ప చికిత్సకై ఉపక్రమించడం, యుద్ధప్రాతిపదికపై తమ తమ కార్యక్రమాలు, కార్యవిధానాలను కేంద్రీకరించడం జాతి అవసరం.

బహుముఖ, సజీవ, సంచలనాత్మక ప్రజాజీవితంలో ప్రధాన చోదకశక్తిగా ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే వందల వేలుగానుండే చైతన్య శీల సామాజిక సేవకులు, వారి నాయకులు రాజకీయ

పార్టీలనలంకరించాలి. వర్గరహిత సమసమాజ ఆవిర్భావానికి సుశిక్షిత సైనికులుగా కదలాలి. పదునైన, దేశభక్తి పూర్వకమైన భావజాలాన్ని ప్రసరిస్తూ నీటిలో చేపల్లా ప్రజాబాహుళ్యం మధ్య నివసిస్తూ పనిజేసే స్థితి ప్రతి స్థలంలో ప్రత్యక్షంగావాలి. ఇటువంటి ఆదర్శవంతమైన దృశ్యాలు సామ్రాజ్యవాద వ్యతిరేక, రాచరిక వ్యతిరేక విప్లవోద్యమాలకాలంలో అడుగడుగునా అగుపడేవి. పామర ప్రజాజీవితంలో ప్రాణం పోస్తూ వారిని స్వాతంత్ర సమరయోధులుగా తీర్చిదిద్దినవి. అడుగడుగనా దర్శనమిచ్చే సమరశీల పోరాటాలు, అన్యాయాలు, అక్రమాలకు వ్యతిరేకంగా సాగిన ఒక అంతర్యుద్ధ వాతావరణాన్ని స్ఫురణకు తెచ్చేవి. ఈనాటి పరిస్థితి పూర్తిగా భిన్నం. రాజకీయ పార్టీలు తలుచుకుంటే తమ సిద్ధాంతాలకు పదునుపెడుతూ రాజ్యాంగమందించిన ప్రాథమిక హక్కుల బలంతోనే వేలాది సమర సేనానుల నిర్మాణం అసంభవంగాదు. పార్టీలు, పార్టీల నాయకులు రాజకీయ సంకల్పబలాన్ని సంతరించుకోగల్గితే ప్రజాస్వామ్యబద్ధ వ్యవస్థలో అభ్యుదయ శక్తులనడ్డుకునే దుష్ట శక్తులను మట్టి కరిపించడం ఒక సమస్యకాదు గతంలో ప్రజా పోరాటాలు సాధించిన జయాపజయాల విశ్లేషణ ఈ సత్యాన్ని రుజువు చేస్తున్నది. అధికార దాహం, అమాంతగా కుబేరులుగా మారాలనే తృష్ణ, కుల మత మౌఢ్యం, అతివాద తీవ్రవాద వికృతాలోచనలు, విడివిడిగా, సమ్మిళితంగా ప్రజాతంత్ర రాజకీయ రంగాన్ని కలుషితం చేస్తూ ప్రజాస్వామ్యానికి వీడని గ్రహణంగా పరిణమించినవి. రాజకీయ పార్టీలు వాటి నాయకులు రాజ్యాంగం వెలుతురులో ఎన్ని చెప్పినా ఆచరణలో వారి వారి స్వీయ మానసిక తత్వాలకే బానిసలైపోతున్నారు. వాస్తవాన్ని చూడలేని కబోదులుగా మిగిలిపోతున్నారు.

ప్రజాస్వామ్య రిపబ్లిక్‌గా పేరుగాంచిన దేశంలో, రాజకీయ పార్టీల పాత్ర నిర్ణయాత్మకం మహిమాన్వితంగానుండే పరిస్థితుల్లో ప్రతి రాజకీయపార్టీ జవాబుదారితనం, పారదర్శకతలను పాటించాలి. ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో నిష్పక్షపాతంగా పనిచేసే సంస్థచే గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రజాతంత్ర నిర్మాణ ప్రక్రియపై పర్యవేక్షణ ఉండాలి. సభ్యత్వ చేర్పు మొదలుకొని అన్ని స్థాయిలలోని నాయకత్వం ఎన్నికలు శాసనసభల ఎన్నికలకై అభ్యర్థుల ఎంపికలను వారు పర్యవేక్షించాలి. రాజకీయ పార్టీలు సంపాదించే నిధులు పారదర్శకంగా వెచ్చించబడాలి. ప్రజా స్వామ్యంలో ఈ చర్య నిరంకుశత్వ పోకడగా అగుపించినా అసలు అత్యున్నత ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకై ఇది అనివార్యం. రాజకీయ పార్టీల్లో అనుమతించగూడని వ్యక్తిస్వామ్యం, కులతత్వం, కుటుంబపాలన లాంటి నిరంకుశ పోకడల దోషాలను అరికట్టడమే ఈ సంస్కరణ ముఖ్యోద్దేశంగా గుర్తించాలి.

జాతీయ ప్రాంతీయ పార్టీలల్లో నాయకత్వంలోఉన్న అత్యధికులు తమ పార్టీ ప్రకటిత మూల సిద్ధాంతంపై గూడా విశ్వాసంలేక, సామాజిక స్పృహ, ప్రజాస్వామ్య విలువలపై నమ్మకంలేక, దేశభక్తి లేశమాత్రంగూడా లేక స్వార్థపర దోషాల విషవలయంలో చిక్కినవారే. వీరు దేశాభ్యుదయానికే ప్రతిబంధకాలుగా మారినారు. కులబలం, ధనబలం, చివరకు కండబలాన్ని ఆధారం చేసుకుంటూ దేశాభివృద్ధికి అడ్డుగోడలుగా నిలుస్తున్నారు. అభ్యుదయ పార్టీవారుగూడా ఇలాంటి అవకాశవాదుల ఆగడాలను అడ్డుకోలేని నిస్సహాయ స్థితిలో పడిపోతున్నారు. ఆదర్శవంతమైన రాజకీయ విలువలకు నిలయంగా పుణ్యభూమిగానున్న దేశం స్వార్థపరులు సృష్టించిన రాజకీయ కాలుష్యంలోపడి విలవిలలాడిపోతున్నది. వీటి తక్షణ ప్రక్షాళన ప్రథమ కర్తవ్యం.

పేరుకే రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం సమ సమాజంపై తమ విశ్వాసాన్ని ప్రకటిస్తూ ఆచరణలో కాలదోషం పట్టిన " కార్మికవర్గ నియంత్రత్వం", "సాయుధ విప్లవం"వంటి సిద్ధాంత గందరగోళ రాజకీయాలోచనలనుండి బయటబడజాలక, దారీతెన్నూ తోచక నిష్క్రియాపరులుగా సిద్ధాంతాలను వల్లెవేసే ఛాందసులుగానున్నవారు మరి కొందరు. వీరిలో అధికార దాహంలాంటి స్వార్ధపర దోషాలు లేనప్పటికి తమలో నరనరాన జీర్ణించుకుపోయిన మూఢనమ్మకాల విష సంస్కృతి కారణంగా అమాయక యువత నిరాశ నిస్పృహలకు గురికావడం జరుగుచున్నది. " సచ్ఛీలురు" " సాత్వికులు"గా పేరున్న ఈ " పెద్ద " మనుషుల వలన మంచి పార్టీలు గూడా కృంగి కృశించి పోవడం కేవలం దురదృష్టం. నూతన చైతన్య వ్యాప్తికి నష్టదాయకం. వీరి ఆలోచనా సరళిలో స్థిరపడిన నకారాత్మక మనస్తత్వం విశ్లేషించగదిగినది. ప్రతికొత్త మార్పును వ్యతిరేకించడం లేదా సందేహించడం మానవ ప్రకృతిలో సహజం ఇది ఆటవిక జీవితం నుండి నాగరిక జీవితంలో ప్రవేశించిన నాటినుండి మానవు లెదు ర్కుంటున్న మానసిక రుగ్మత. ఐతే యుగయుగాల బ్రతుకు పోరాట విజయ చిహ్నంగా మిగిలింది సకారాత్మక, హేతుబద్ధమైన ఆలోచనా సంస్కృతి. అన్నిటిని శంకిస్తూ అడుగుగూడా ముందుకు వేయలేని సంశయాత్ములు. ప్రతి చిన్న పెద్ద విషయాన్ని తమ సుదీర్ఘ ఆలోచనకు గురిచేస్తూ ఒక నిర్ణయానికి రాలేని సందేహ మనస్కులు సమాజాభివృద్ధికి నిష్ప్రయోజనం. వీరు సత్యాన్ని గుర్తించి దాన్ని ఆస్వాదించి ఆమోదించలేరు. వారు మారరు. ఇతరులను మారనివ్వరు. కాలంమార్పును సునిశితంగా గమనిస్తే ప్రజా చైతన్య స్థాయిని అర్ధం చేసుకుంటూ రాగల్గే అవరోధాలు ఆటంకాల పట్ల అప్రమత్తంగాఉంటూ మంచి మార్పును ధైర్య, సాహసాలతో ఆహ్వానించడం మన దేశం తన సుదీర్ఘ జీవిత పోరాటంలో సాధించిన అమూల్యమైన సంస్కృతి. ఇందులో సమతుల్యత, ప్రగతి, పరిణామక్రమం తగిన పాళ్ళలోనుండడం విశేషం. ముందడుగు, పరిణతికి ప్రగతికి అత్యవసరమైనది. ప్రకృతి ధర్మం. ఇదే సాత్వికత. దీనినే నిర్మాణాత్మకత లేక సకారాత్మకత లేక (పాజిటివ్) ఆలోచనా సరళిగా అభ్యుదయ కాముకలంతా గుర్తిస్తారు. ఇటువంటి పూర్వరంగంలో శాస్త్రసాంకేతిక నేపధ్యంలో రాజకీయరంగ నాయకత్వం గురించి చర్చించడం అవశ్యం, అవసరం. రాజకీయ రంగం సామాజిక జీవన రంగాలన్నిటిని ప్రభావితం చేయగల్గే సూర్యరశ్మిలాంటిది. ప్రజాస్వామ్యం పరిణత రాజకీయానికి మారుపేరు. సామ్రాజ్యవాద యుగధర్మాలు భూస్వామ్య రాచరికయుగ లక్షణాలు వాటి అవశేషాలు ప్రజాస్వామ్య యుగంలో మిగిలియుండడం సహజం. వాటన్నింటిని ప్రక్షాలనచేస్తూనే ప్రజాస్వామ్యం యొక్క పవిత్రతను పరి రక్షించడం సాధ్యం. కార్యాచరణలో కనబడే ఆత్మవిశ్వాసం, ఆటంకాలనెదిరించే సాహసం పదిమందిచే గుర్తింపు ప్రోత్సాహన్ని పొందడంలో పొందే ఆత్మాభిమానం ఆయా నాయకుడు లేక కార్యకర్తలలో నూతనోత్సాహన్ని నూరిపోస్తుంది. సమాజంలో అతని స్థాయి ఇనుమడిస్తుంది. సమాజం మారుతుంది. నాయకత్వం ఎదుగుతుంది.

దేశంలో కులమత ప్రాంతీయ విభేదాలను తగ్గిస్తూ పౌర సమాజంలో జాతీయత అంత ర్జాతీయతా భావాలను బలోపేతం చేయడం చారిత్రికావసరం. సహజంగానే జరుగుతున్న ఈ పరిణామాన్ని చైతన్యవంతమైన సమాజందీన్ని వేగిరపరచవచ్చును. ఆరోగ్యకర దిశలో ప్రోత్సహించ వచ్చును. పౌర సమాజం సంచలనాత్మకంగా తమ పాత్రను పోషించాలంటే వివిధ వర్గాల ప్రజలతో కూడిన సామాజిక కార్యక్రమాలు విస్తరించబడాలి. సాధారణ పౌరుల్లో హేతుబద్ధ శాస్త్రీయ ఆలోచనలను

పెంచగలిగే విజ్ఞాన వేత్తలు ముఖ్యంగా విశ్రాంత ఉద్యోగులు తమ విలువైన సమయాన్ని ఈ కర్తవ్య నిర్వహణకై కేటాయించాలి. ఐక్య రాజ్యసమితి నిర్ణయించిన బహుముఖ కార్యక్రమాలతోపాటు దేశీయ ప్రాంతీయ పండగల సందర్భాలను సంఘ సేవకులు దీనికై సద్వినియోగం చేసుకోవడం ఉపయుక్తం.

కుల మత విభజనలు అధిగమించబడి సద్భావనలు పెంపొందాలంటె ఈ కృత్రిమ ఎడబాటు వేర్పాటుల వెనుక చరిత్రలు వాటిపై ప్రజాబాహుళ్యంలోనున్న అపార్ధాలు పటాపంచలు చేయబడాలి. అది సాధ్యపడాలంటే విభిన్న కులమతాలతో సన్నిహిత సంబంధ బాంధవ్యాలను ఇతోధికం చేస్తూ వాటిని ప్రయోజనాత్మకం చేయడం అవసరం. కులమత సంఘాలను మానవతా దృక్పధంతో సామాజికం చేయాలి. ప్రభుత్వం, స్థానిక స్వపరిపాలనా యంత్రాంగం కుల సంఘాలను, కుల పెద్దలను సాధికారంగానే దైనందిన ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములుగా చేయాలి. సంక్షేమ కార్యక్రమాలు విద్యా,వైద్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో వారి పాత్ర ఉపయుక్తం, ప్రయోజన కారిగాఉంటుంది. సామాజిక సంస్కరణలు,మూఢనమ్మకాల తొలగింపులో కులమతాలపట్ల నకారాత్మక వైఖరి, వ్యతిరేక వైఖరి ప్రజలమధ్య దూరాన్ని పెంచుతూ మరింత చీలికకు దారితీస్తుంది. వారందరిలో వెలిగించే లౌకిక నాగరికతా జ్యోతులే అజ్ఞానపు చీకట్లను పార ద్రోలగల్గుతాయి. మానవులంతా ఒకటేనను విశ్వాసాన్ని సుదృఢం చేస్తాయి.

రాజకీయ పార్టీలు మరో సామాజిక బాధ్యత గురించి తీవ్రంగా ఆలోచించడం జాతీయతాభివృద్ధికి అత్యవసరం. పౌర సంఘాలను ప్రోత్సహించడం కుల, మత సంఘాల వేదికలను సకారాత్మకంగా నిర్మాణాత్మకంగా హేతుబద్ధ చైతన్య వ్యాప్తికి వినియోగిస్తూ ప్రజాసంఘాలను ఆయా పార్టీలకను బంధంగాకుండా రాష్ట్ర, దేశ వ్యాపిత ఐక్య సంఘాలుగా అందరికి ఆమోదయోగ్యమైన ఆచరణ సాధ్యమైన కనీస కార్యక్రమంతో నిర్మించడం ఆయా వర్గ ప్రయోజనాల సాధనకై అవసరం. అను బంధంగానుండే ప్రజాసంఘాలు పార్టీ పరిమితులకులోనై ఉన్నందున ఆయా వర్గ సమస్యల సాధనకై విజయవంతమైన పోరాటాలు చేయలేకపోతున్నవి. బహుళత్వం ప్రధానాంశంగానున్న భారత రాజకీయాలలో అభ్యుదయకర ప్రభుత్వాలను నిర్మించాలంటే జాతీయ ప్రాంతీయ పార్టీలు ఉమ్మడి కార్యక్రమ ఆధారంగా ఐక్య సంఘటనలు నిర్మించవలసిన తరుణంలో ప్రజాసంఘాలు మరింత విశాల ప్రాతి పదికన అభ్యుదయ నినాదాలకై ఉద్యమించడం అభ్యుదయ రాజకీయాలను మరింత ప్రభావితం చేయడం జరుగుతుంది. ఉమ్మడిగా శత్రువర్గాల కుతంత్రాలను ఇంకా సులభతరంగా ఎండగట్టి వాటిని ఓడించడం సులభసాధ్యమౌతుంది. వ్యక్తిగత ఇష్టాయిష్టాలు, పట్టింపులు, సైద్ధాంతిక పడికట్లన్ని సడలిస్తే తప్ప విశాల ఐక్యత సాధ్యపడదు. రాజకీయ పార్టీల కార్యవిధానాల సంస్కరణలలో ఈ అంశం ప్రధమ ప్రాధాన్యతను పొందాలి. ఇదే ఈ దేశ సిద్ధాంతంగా గుర్తించబడాలి.

క్రమశిక్షణ రాజకీయ పార్టీలకు ప్రాణప్రదం. స్వార్ధం, అధికార దర్పమే పరమావధిగా భావించే వ్యక్తులు నాయకత్వంలోనున్న పార్టీల్లో ప్రధానంగా క్రమశిక్షణా రాహిత్యం ఒక తీవ్రమైన సమస్యగా తయారైంది. ఎ.సి.బి. తదితర నేర పరిశోధన సంస్థలు ఈ నేరపూరిత రాజకీయాలను బట్టబయలు చేస్తున్నవి. సభ్య సమాజం దిగ్భ్రాంతి, ఆ తర్వాత నిరాశ, నిస్పృహలతో తలబట్టుకుంటున్నది. దేశ భవిష్యత్తు అంధకారమనే ఆలోచనతో వణికిపోతున్నది. దీన్ని సత్వరం సంస్కరించలేని ఎడల "నా

నడకనే నా సందేశమన్న ” మహాత్మాగాంధి గారికి లక్షలాది స్వాతంత్ర సమరయోధులకు వారి త్యాగాలపట్ల క్షంతవ్యంగాని అపచారం చేసి నట్లవుతుంది.

## ఎన్నికలు

బ్రిటన్‌లోని పార్లమెంటరీ వ్యవస్థననుకరించిన మన రాజ్యాంగం అక్కడి ఎన్నికల విధానాన్ని గూడా అనుకరించి ఆచరిస్తున్నది. ఒక స్వతంత్ర సంస్థ ఎన్నికల కమీషన్ ఆధ్వర్యంలో ప్రతి అయిదు సంవత్సరాలకొక పర్యాయం సాధారణ ఎన్నికలు జరిగి రాష్ట్రాలలో శాసనసభలు, కేంద్రంలో పార్లమెంటు ఎన్నికకావాలని నిశ్చయించింది.ప్రభుత్వ ప్రతినిధిగా దేశాధ్యక్షులు ఎన్నికకాగా స్వతంత్ర ప్రతిపత్తిగల దేశ వ్యాపిత న్యాయవ్యవస్థను నెలకొల్పింది. 1950 నుండి గత 64 సంవత్సరాల ప్రజాస్వామ్యం దాని ఎన్నికల వ్యవస్థ అత్యంత విలువైన అనుభవాలనందించింది. స్వతంత్ర సంస్థలుగా పనిచేస్తున్న ఎన్నికల కమిషన్లు రాష్ట్ర, కేంద్ర స్థాయిలతో పనిచేస్తున్న న్యాయవ్యవస్థలు నిష్పక్షపాతం, సహజన్యాయం, సామాజిక న్యాయ నిర్ధారణలో చట్టబద్ధతను ఆచరించడంలో ప్రపపంచంలోనే గౌరవ స్థానాన్ని అలంకరించగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటి ఆధీనంలో పనిచేసే వ్యవస్థలు ప్రపంచంలోనే అధమ స్థానానికి పడిపోవడం దేశం ఎదుర్కుంటున్న జఠిలమైన సమస్య. యుద్ధప్రాతిపదికన దీన్ని సంస్కరించని ఎడల జాతి గౌరవం మట్టిలో కలిసి పోవడంతోపాటు ప్రజాస్వామ్యాన్ని నమ్ముకున్న ప్రజలకు తీవ్రమైన కష్టనష్టాలు తప్పవు. ఈ వైఫల్యాన్ని అదునుగా చూచి దేశం లోపలా, వెలుపలా పొంచి కూర్చున్న తీవ్రవాద ఆరాచక శక్తులు తమ జడలు విప్పి దేశ శాంతి భద్రలతోపాటు దేశాభివృద్ధికి తీరని ప్రమాదాన్ని కల్పించే పరిస్థితి భయపెడుచున్నది. రాజకీయ పార్టీలు సంస్కరించబడి ఎన్నికల విధాన సంస్కరణకు పక్రమించవలసిన సమయమాసన్నమైంది. రాజకీయ నాయకత్వాన్ని ఎన్నుకోవడం వారి పరిపాలనలో అనేకానేక సంస్కరణలను ప్రవేశపెట్టి వాటిని అమలు పర్చడమెంత ప్రదానమో ఈ గురుతర బాధ్యతను నిర్వహించే ప్రజల (ఓటర్ల) చైతన్యస్థాయిని పెంచడం అంతే ప్రధానం. కోట్లాది ఓటర్ల అవిద్య, అజ్ఞానం, పేదరికాన్ని ఆసరాచేసుకుంటూ వాటిని “ అనతి”కాలంలో తొలగించే వాగ్దానాలుజేస్తూ తత్కాలం ఎన్నికల్లో ఓట్లు దండుకునే దుష్ట సంస్కృతి ప్రబలిపోయింది. దూర దృష్టిలోపించి తక్షణావసరాల పరిష్కారానికందించే పప్పుబెల్లాల్లాంటి జనాకర్షణ పథకాలకు ఆకర్షితులయ్యే ఓటర్ల సంఖ్య ఇంకా దేశంలో గణనీయంగాఉండడం దౌర్భాగ్యం అంతేకాదు ఓటర్లలో ఉన్న ఈ బలహీనతను తమ ఎన్నికల విజయానికి సోపానంగా గమనిస్తూ దాన్ని సాధ్యమైనంత ఎక్కువకాలం కొనసాగించాలనే సంకుచిత మనస్తత్వంగల పార్టీలు, నాయకులుండడం, దేశాభివృద్ధికంటే తమ రాజ్యాధికారానికి ఆధిక ప్రాధాన్యతనిచ్చే వారి ద్రోహబుద్ధి ఇంకా రాజకీయాలను ప్రభావితం చేయడం సభ్యసమాజానికే అవమానం. ప్రజా చైతన్యాన్ని పెంచుతూ ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థల ప్రక్రియలను సార్థకం చేయగోరే పౌర సమాజం ఈ దిశలో త్వరపడడం వారి గొప్ప కర్తవ్యం. ప్రజాస్వామ్యంపై విశ్వాసమున్న పార్టీలు, పౌరులంతా ఎన్నికల విధాన సంస్కరణోద్యమం తమ తక్షణ రాజకీయ కర్తవ్యంగా భావించి అందుకుపక్రమించాలి. పౌర, స్వచ్ఛందసంఘాల రాజకీయ సామాజిక పాత్ర ఆద్వితీయమైనది. విద్యార్థులు, యువకులు ప్రత్యేకంగా మహిళలు ఈ పౌరశక్తి నిర్మాణంలో చక్కనిపాత్రను పోషించగల్గుతారు. పారిశ్రామిక నాగరికత ప్రాబల్యం విస్తరించిన ప్రాశ్చాత్య దేశాలలో వివిధ వర్గాలు విభిన్న అంశాలపై కొనసాగిస్తున్న పౌర సంఘాలు, ప్రజా చైతన్యాన్ని అభివృద్ధి పరచడంలో

నిర్ణయాత్మకపాత్ర నిర్వహించడం అభివృద్ధి చెందవలసిన మనలాంటి దేశానికి గుణపాఠం. గొప్ప సాంస్కృతిక సంపదకు వారసులుగావడమేగాక ఆధునిక నాగరికతలోని మానవీయ విలువల్ని గుర్తించి పాటించే శక్తి సామర్థ్యం మన రక్తంలోనున్నది. సాంస్కృతిక, సామాజిక నాయకత్వం తమ నిర్లిప్తతను వదిలించుకుంటూ సృజనాత్మకంగా ఈ సాంస్కృతిక ఉద్యమాలను దేశాభివృద్ధికి ప్రబల సాధనాలుగా మలుచుకోగల్గుతుంది. పాశ్చాత్య నాగరికత పేరుతో దినదినం పెచ్చు పెరుగుతున్న క్రమశిక్షణా రాహిత్యం, ఆహర విహర వికృత అలవాట్లు, వినిమయ సంస్కృతి యువతరాన్ని దేశీయ సంస్కృతి సాంప్రదాయాల నుండి అన్య మార్గాల్లోకి ఆకర్షించడం కుటుంబ జీవితాలల్లో కలహాలకి కారణభూతమై పోతున్నది. ప్రభుత్వ, ప్రైవేటు సాంస్కృతిక శాఖలు వాటి నిర్వాహకులు మేల్కొని భారతీయతా పునాదులపైన నవ నాగరికతా సౌధాల్ని నిర్మించే విధానాల రూపకల్పన చేయాలి. పౌర సమాజాల ప్రాధాన్యతను గుర్తిస్తూ వినూత్న సంఘాలను నిర్మించాలి.

మన రాజ్యాంగ నిర్ణేతలు రాజ్యాంగాన్ని రూపొందించే సందర్భంలో రకరకాల ప్రజాస్వామ్య ఎన్నికల పద్ధతులను సూక్ష్మంగా నునిశితంగా పరిశీలించడం జరిగింది. పాశ్చాత్య వ్యవస్థలోనున్న ప్రగాఢ వైజ్ఞానిక సంబంధంతో ప్రభావితమై అక్కడి వ్యవస్థ అనుకరణపట్ల సానుకూల నిర్ణయంచేసినారు. గత అరున్నర దశాబ్దాల సుదీర్ఘ అనుభవం మనకు మన కండ్లు తెరిపించినంత పనిచేసింది. సుదీర్ఘకాల బానిసత్వంవలన మన అక్షరాస్యత అత్యంత వెనకబడియుండడం మొదటిలోటు. పేదరికం రెండవ బలహీనత. భూస్వామ్య ధనాఢ్యవర్గాలు ఉపయోగించే కులమత తత్వాలను ఎదిరించి ధనబలం, కండబలాన్ని తట్టుకోలేని శక్తి హీతన మూడవది. స్వార్ధపూరిత రాజకీయ వర్గాలు ఇన్ని రకాల బలహీనతల్ని సమర్థవంతంగా వినియోగిస్తూ తమ అధికారాన్ని పదిలపర్చుకుంటున్నారు. ఈనాటి ఎన్నికల చట్టంలోనున్న బలహీనత వీరికి బాగా ఉపయోగపడుచున్నది. ఓట్లల్లో పాల్గొన్న ఓటర్ల ఓట్లను ఏ అభ్యర్థి అధికంగా పొందగలిగితే అతడే,ఆమేనే గెలిచినట్లు ప్రకటించడం ఈ నాటి సార్వత్రిక ఎన్నికలలో అనుసరిస్తున్న మౌలికాంశం. అసలు పోల్‌అయిన ఓట్లల్లో సగానికి మించిన ఓట్లు సాధించిన అభ్యర్థి గెలిచినట్లు గుర్తింపు పొందడం సహజన్యాయం కాని అభ్యర్థుల మధ్య ఓట్ల పంపకంలో మెజారిటీ సూత్రానితో సంబంధంలేకుండా ఎవరు అధిక ఓట్లు సాధిస్తే వారే గెలిచినట్లుగా చట్టముండడం వలన ప్రజాస్వామ్య ఎన్నికల సూత్రానికే తీరని హాని కలుగుచున్నది. కులం, మతం, కండబలం, ధనబలం బాగా పనిచేస్తూ మంచి అభ్యర్థులు ఓడిపోవడమో లేక ఎన్నికలకే దూరంగా నుండడమో జనుగుతున్నది. గత మూడు దశాబ్దాల అనుభవం వెలుతురులో జనాకర్షణ నినాదాలతోపాటు, ధనబలం ఎన్నికలను తీవ్రంగా ప్రభావితం చేయడాన్ని నిస్సహాయంగా చూస్తున్నాం. డబ్బుతో గెలిచే వారు అధికారాన్ని వినియోగించి తాము వెచ్చించిన ధనానికి అనేకరెట్ల ప్రజాధనాన్ని దోచుకుంటున్నారు. గత పది సంవత్సరాలుగా వెలుగుచూస్తున్న కుంభ కోణాల్ని విశ్లేషిస్తే లక్షల కోట్ల ప్రజాధనం, అభివృద్ధి కార్యక్రమాలనుండి దారితప్పి ఈ దుస్సా హసానికి తెగించిన రాజకీయ నాయకుల దరిజేరుచున్నది. నల్లధనంగా మారి దేశాన్నే అప్పులపాలు జేస్తున్నది. భారతీయ శ్రామికుల శ్రమ ఫలితం ఖండాంతరాల బ్యాంకుల్లో చేరిపోతున్నది. దీనిలో ఎన్నికల ప్రజాస్వామ్యం నవ్వులు పాలుగావడంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమై పోతున్నది. జాతి విలువలు, నీతి నియమాలు మంటగలిసి పౌర జీవితం కలుషితమై పోవుచున్నది.

ప్రపంచ వ్యాపితంగా ఆచరణలోనున్న ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థలన్నిటిని పరిశీలించగా కొన్ని పాశ్చాత్య దేశాలలో విజయవంతంగా పనిచేస్తున్న దామాషా ప్రాతినిధ్య వ్యవస్థ మనదేశ సమస్యల పరిష్కారానికి చక్కగా ఉపయోగపడే ప్రత్యామ్నాయంగా ఉంటుందని నిష్ణాతుల అభిప్రాయం. ఈ వ్యవస్థలోనున్న పరిణత ప్రజాస్వామ్యతత్వం గమనార్హం. ఈనాడు మనమనుభవిస్తున్న పరుగు పందెం లాంటి పద్ధతి పూర్తిగా రద్దవుతుంది. ఎన్నికలలో అభ్యర్థిగా నిలిచిన వ్యక్తి ప్రాధాన్యత స్థానే ఆ అభ్యర్థిని నిలబెట్టిన పార్టీకే ప్రాధాన్యత ఉంటుంది. గత ఎన్నికల్లో కనీసం 3-5 శాతం ఓట్లను సంపాదించగలిగిన రాజకీయ పార్టీ మాత్రమే రాష్ట్రంలోనో లేక కేంద్రంలోనో తన గుర్తింపు పొందుతుంది. ఎన్నికల ప్రకటన నాటికి ఆ పార్టీ ఎవరెవర్ని ఏ నియోజకవర్గ అభ్యర్థులగా నిల బెడుతుందో లిస్టు ద్వారా ప్రకటిస్తుంది. ఎన్నికల ప్రచారం పరిమిత నిధుల వ్యయంతో ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో జరుగుతుంది. ఆ మొత్తం లెక్కలు కమిషన్‌కి అందచేసి ప్రభుత్వంనుండి తిరిగి పొందుతుంది. పోలయిన ఓట్లలో ఆ పార్టీ సాధించిన ఓట్ల దామాషాకనుగుణ్యంగా ఆపార్టీ ప్రకటించిన లిస్టు నుండి వరుస క్రమంలో తగు సంఖ్యలో వారిని గెలిచిన అభ్యర్థులుగా ఎన్నికల కమిషన్ ప్రకటిస్తుంది. ఈ విధంగా ఆయా శాసనసభ లేక పార్లమెంటు సభ్యుల్ని ఆయా పార్టీల ప్రతినిధులుగా ప్రకటిస్తారు. మెజారిటీతో గెలిచిన వారు తమ తమ పార్టీల ఆదేశాల ప్రకారం ఒంటరిగానో లేక మిశ్రమంగానో ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తారు. ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయగలిగే నిబంధనల రూపకల్పన జరుగుతుంది. ఈ దామాషా ప్రాతినిధ్య వ్యవస్థలోని సుగుణాలు రెండు. సమర్థులైన వారే శాసనకర్తలుకాగలిగేది మొదటిదైతే ఎన్నికల పేరుతో విలువైన ప్రజాధనం యొక్క దుర్వినియోగాన్ని అరికట్టడం రెండవది. సమర్థులైన ప్రజా ప్రతినిధులు ప్రజాబాహుళ్యం యొక్క మనో వాంఛనలను నిర్భీతిగా, నిజాయితిగా ప్రతిధ్వనింపచేయగల్గుతారు. శాసనసభ్యులు, పార్లమెంటు యొక్క విలువైన సమయాన్ని పూర్తిగా ఫలప్రదంగా వినియోగించి సురాజ్యాన్ని స్థాపించగల్గుతారు. రాజకీయ పార్టీలు పౌరులంతా పై భావాల ఔచిత్యాలను గుర్తిస్తూ ఎన్నికల విధాన మార్పుకై కలిసికట్టుగా కృషిచేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఫల ప్రదం చేస్తారని ఆశించవచ్చును.

పై నుదహరించబడిన రాజకీయ పార్టీ వ్యవస్థ సంస్కరణ, ఎన్నికల వ్యవస్థ సంస్కరణ, ద్వారా కొలువుదీరే శాసనసభ లేక పార్లమెంటుల నిర్వహణ సమస్య సులభంగా పరిష్కారమవుతుంది. త్రిమూర్తులుగా నుండే స్పీకర్ (అధ్యక్షులు), సభా నాయకుడు (ముఖ్యమంత్రి లేక ప్రధానమంత్రి), ప్రతిపక్ష నాయకుడు (ప్రధాన ప్రతిపక్ష పార్టీ నాయకుడు) విజయవంతంగా, సర్వసత్తాక శాసనసభ గౌరవానికి ఏలాంటి భంగం రాకుండా హుందాతనంతో ప్రజాసమస్యల్ని సాకల్యంగా చర్చించి పరిష్కరించబగల్గుతారు.

ప్రజాస్వామ్య వ్యవస్థ చారిత్రికంగా త్రిముఖమైనది. శాసనసభ, పాలక వ్యవస్థ (కార్యనిర్వాహక వర్గం), న్యాయవ్యవస్థలు మూడు స్థంబాలు గత కొన్ని దశాబ్దాలకాలంనుండి సమాచార వ్యవస్థ లేక మీడియా నాల్గవ స్థంబంగా గుర్తింపులోకి వస్తున్నది. ఈ నాలుగు పాదాలపై నిర్విఘ్నంగా పరస్పర సంయమనం, సమన్వయంతో నడిచే ప్రభుత్వం దేశ బహుముఖాభివృద్ధికి వికాసానికి శ్రీరామ రక్షగా పనిచేస్తుంది. ప్రపంచ దేశాలన్ని పరిణత ప్రజాస్వామ్యాలను తమ కార్య విధానాలుగా ఆచరిస్తే మొత్తం

ప్రపంచ మానవాళి శాంతి సౌభాగ్యాలతో నిత్య నూతన ఔన్నత్యంతో స్వర్గసీమగా మారుతుంది. ఈ నాటి పరిస్థితి ఇంకా ఆశాజనంగా మారలేదు. రాచరిక అవశేషాలు, సామ్రాజ్యవాద దురహంకారాలు మధ్య యుగాల నాటి పీడనలు, వాటి నీడలు, ప్రపంచంలోని ఆధిక జనాభాను ఆందోళనకు గురిచేస్తునవి. ఐక్య రాజ్య సమితి, భద్రతామండలి నామ మాత్ర విశిష్టంగానుంటూ ప్రపంచ దేశాల మధ్య స్వాతంత్రం సహకారం, సహజీవనం లాంటి మానవీయ విలువల్ని నెలకొల్పలేకుండా ఒక విధంగా అచేతనంగా మిగిలిపోయినవి. ఆరుదశాబ్దాల అనుభవ సంపదనుండి సాధించవలసినంత పరిణితిని సాధించలేకపోతున్నవి. ప్రజాస్వామ్యయుగ ధర్మం వీటి పరివర్తనకి, దోహదం చేస్తుందని ఆశించవచ్చును.

పైన చర్చించిన నాలుగు అంశాలపై అవగాహనా రాహిత్యం, పాక్షిక దృక్పథం కారణంగా వాటిమధ్య ఘర్షణలు చోటుచేసుకొని ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క పతిష్టత, ప్రాచుర్యాలు దెబ్బతిన్న సందర్భాలున్నవి. వాటిని సకాలంలో సవరించుకుంటూ సమిష్టి కార్యాచరణ దిశలో పురోగమిస్తున్న సుసంస్కృతిగూడా ఇతోధికం కావడం శుభసూచికం. ప్రాధమిక మానవ హక్కులు, ఆదేశిక సూత్రాలను వాటి విచక్షణా పూర్వక ఆచరణను చాటి చెప్పిన మన రాజ్యాంగ చట్టాన్ని సమున్నత న్యాయస్థానంతోపాటు మొత్తం న్యాయవ్యవస్థ నిజాయితీతో గౌరవిస్తూ ఆచరిస్తున్నదని సంతృప్తిని వెలిబుచ్చవచ్చును. కాని చట్ట సభలచే రూపొందించబడే చట్టాలు వాటి నియమనిబంధనలు రాజ్యాంగ స్ఫూర్తిని విస్మరిస్తూ దానికి వ్యతిరేకంగా గూడా నిర్ణయాలు చేయడాన్ని న్యాయస్థానాలు అనేక పర్యాయాలు తప్పు పట్టడం శాసనకర్తల అసమర్ధతను తెలియచేస్తున్నది. ఈ విమర్శ రోజురోజుకి పెచ్చు పెరగడం ఆందోళనకరం. శాసనసభల కార్యనిర్వాహకవర్గం తమ విద్యా, విజ్ఞానబలంతో సంక్లిష్ట సమస్యల సముచిత పరిష్కారరీతిలో, స్పష్టత, సాత్వికత గలిగిన చట్ట నిర్మాణ సామర్ధ్యాన్ని సాధించుకోక తప్పదు. ఈ విషయంలో మనం సాధించిన అనుభవం విలువైనది. స్వతంత్రంగా, నిర్భయంగా పనిచేయవలసిన శాసనసభకార్యదర్శి, ఆయన సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగాఉండడం పూర్తిగా మారాలి. అందుకొరకు అఖిల భారత పార్లమెంటరీ సిబ్బంది వ్యవస్థ నిర్మాణం జరిగి తీరాలి. శాసనసభా కార్యకలాపాలు ముఖ్యంగా శాసనసభా సంఘాల నివేదికల తీరు, స్థాయి పాలక వ్యవస్థ లేక కార్యవర్గ ఇష్టాయిష్టాలకనుగుణ్యంగానుండడం మొదటి బలహీనత. సమున్నత శాసనసభ కమిటీ సూచనలను పాటించని ప్రభుత్వ కార్యదర్శులకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు చేపట్టలేని అశక్తత రెండవ బలహీనత. అసలు శాసనసభ నిర్వహణ అవసరాలకై కావలసిన నిధుల కొరకు ఆర్ధిక మంత్రిత్వశాఖ చుట్టూ తిరగవలసిరావడం మూడవ ముఖ్య బలహీనత. హైకోర్టు, సుప్రీంకోర్టులు వ్యవహరించే తీరుగా శాసనసభ స్పీకరు తమ స్వతంత్రతను వినియోగించగలిగితే పై దోషాల నివారణ సులభసాధ్యం. పాలకవర్గం లేక కార్యనిర్వాహక వర్గం యొక్క పనితనం అత్యంత లోపభూయిష్టంగా మారిపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకే మాయని మచ్చగా పరిణమించడానికి మూల కారణం మన రాజకీయ వ్యవస్థలోగూడుగట్టుకొనియున్న జాప్యం, లంచ గొండితనం, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతంలాంటి ప్రాణాంతక దోషాలే. పరిపాలనలో రాజకీయ జోక్యం కొట్టవచ్చినట్లుగా పెంచే విష సంస్కృతికి వ్యతిరేకంగా రాజకీయ సిద్దాంతాలు, రాజకీయపార్టీల ఎన్నికల సంస్కరణల లాంటి కాయకల్ప చికిత్సలు విజయవంతమైననాడే సుపరిపాలన సాధ్యపడుతుంది.

శాసనసభల ఔన్నత్యం సాధించబడి పోషించబడాలంటే దానిచే ప్రతి సంవత్సరం ఎన్నుకోబడే ఆర్థిక సంఘాలు, పబ్లిక్ అకౌంట్సు కమిటీ, అంచనాల సంఘం, ప్రభుత్వరంగ సంస్థల పర్యవేక్షక సంఘాల పని, పనితనం తీవ్రంగా సంస్కరించబడాలి. ఇతర సంక్షేమ సంఘాల ప్రాధాన్యతను ఏ మాత్రం తక్కువగా అంచనా వేయకుండా ఆర్థిక సంఘాల ప్రాముఖ్యతను పరిరక్షించుకోవడం తక్షణావసరం. శాసనసభకిచ్చిన అధికారాలన్నిటిని మన రాజ్యాంగం ఈ సంఘాలకు దఖలు పర్చింది. పాలక అధికార బృందం ఈ సంఘాలకు వారడిగిన ప్రశ్నలన్నిటికి సమాధానం చెప్పవలసిన జవాబు దారితనం కలిగియున్నది. కేంద్రప్రభుత్వం రాజ్యాంగబద్దంగా నియమించే కాగ్ సంస్థ అన్ని రాష్ట్రాలు కేంద్రం రూపొందించిన ఆదాయ వ్యయ పట్టికలన్నిటిని సూక్ష్మ దృష్టితో నిశితంగా విశ్లేషిస్తుంది. దూర దృష్టితో వీటి ఔచిత్యాన్ని బేరీజువేస్తుంది. ఆదాయం, వ్యయం, సమతూకంగాలేని కారణాలను క్షుణ్ణంగా విశ్లేషిస్తుంది. ప్రధానంగా ప్రజాధనం వృధా అయ్యే ప్రతి సందర్భాన్ని, కుంభకోణాల్ని వెలుగులోకి తెస్తుంది. ఇంతటి బాధ్యత, నైపుణ్యతగల అధికారులు సమర్పించే నివేదికలు అత్యంత ప్రధానమైనవి. వీటి పట్ల పాలనాధికారాన్ని నిర్వహించే అధికారులు, మంత్రులు ఈనాడను సరిస్తున్న నిర్లిప్త నిర్లక్ష్య వైఖరిపట్ల ప్రగాఢ విచారాన్ని తెలియచేయడం తప్ప గత్యంతరంలేదు. శాసన కర్తలు, సంఘాలకు ఆధ్యక్షత వహించే ప్రజాప్రతినిధులు ఆత్మవిమర్శతో సరిదిద్దు కార్యక్రమాలను చేపడతారని పవిత్ర ప్రజాస్వామ్య వ్యవస్థకు జవసత్యాలను సమకూర్చుతారని ఆందోళనతోనైనా ఆశిద్దాం.

ఇటీవల కాలంనుండి శాసనసభల, పార్లమెంటులోని కార్యక్రమాలను, ప్రచార ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయబడడం మంచి మార్పు, పారదర్శకతకు ప్రతిరూపం. ఐతే ఈ సాంకేతికవిజ్ఞాన ప్రమేయం వలన మంచి, చెడు పరిణామాలు రెండూ చోటుచేసుకోవచ్చును. చట్ట సభల హుందాతనాన్ని మొక్కవోకుండా పోషించగలిగితే దాని అధికారం, అవసరం మంచి ప్రాచుర్యాన్ని పొందుతుంది. తద్విరుద్ధంగా శాసనసభలు నిర్వహించబడితే అసలు చట్ట సభల ఔచిత్యాన్ని ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రాభవాన్నే ప్రశ్నించే విధంగా ప్రజాభిప్రాయం దిగజారిపోవచ్చును అది దురదృష్టకరం. ఈనాటి శాసనసభలు దేశ పార్లమెంటు వేదికలపై జరిగే చర్చల సరళి వాటి తీరు తెన్నులు ప్రజాస్వామ్య వాదులందరికి తలవంపులుగా మారడం వెనక ఆయా రాజకీయపార్టీల సిద్దాంతాలు వాటిని పాటించే ప్రజాప్రతినిధుల స్థాయి ప్రశ్నార్థకంగా మారినపరిస్థితి ఉంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ప్రాణ ప్రదమైన ప్రశోత్తరాలు ప్రభుత్వాల జవాబుదారితనాన్ని వారి పనిలో పారదర్శకతని చూపెడుతూ, ప్రజాబాహుళ్యం రాజకీయ చైతన్యాన్ని పెంచగలిగే విధంగా, ప్రయోజనాత్మకంగానుంటాయి, మంత్రులిచ్చే బాధ్యతాయుత సమాధానాలు, సభ్యులడిగే ప్రశ్నలు, ఉప ప్రశ్నలు ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసాన్ని ఇనుమడించే మంచి పరిణామానికి దోహదం చేస్తాయి. కాని ఆచరణ దీనికి తోడ్పడడంలేదు.ప్రశ్నోత్తరాల పేరుతో జరిగే హేతుబద్ధ చర్చ నడివీధిలో నిర్వహించబడే వాగ్యుద్ధాలలాగా ప్రతిరోజు ప్రతి అంశంపై జరగడం అసహ్యం. పార్లమెంటు లేక శాసనసభ ప్రాంగణాలను పవిత్ర దేవాలయాలుగా, ప్రజా సమస్యలను చర్చించి పరిష్కరించే న్యాయస్థానాలుగా ప్రజాదరణను పున రుజ్జీవంపజేయవలసిన బాధ్యత రాజకీయ వేత్తల బుద్ధికుశలతకు వదలడం వినా ప్రత్యామ్యాయం లేదు. యుగ యుగాల బానిసత్వాన్ని నిరంకుశత్వాన్ని ఓడించి సాధారణ ప్రజల తలలో నాలుకగా నుండే ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థ ప్రజల సామాజిక ఆర్థిక స్వావలంబనకు బాసటగా నిలుస్తుంది. స్వార్థపరుల కబంధ

హస్తాల నుండి దేశాన్ని రక్షించడం, పోషించడం ప్రజాసేవకులందరి పవిత్రకర్తవ్యం. ఆర్థిక పునాదిని ఉపరితల సిద్ధాంతాన్ని గ్రుడ్డిగా నమ్మే వారు, స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థనే సర్వరోగనివారిణి అని నమ్మే ఉదారవాదులందరితో చర్చిస్తూ వారిని సంస్కరిస్తూ ప్రజాబలంతో ప్రజల దైనందిన సమస్యలను పరిష్కరిస్తూ ప్రజా ఉద్యమాలల్లో సమన్వయాన్ని సాధించడమే పదునైన పార్లమెంటరీ వ్యవస్థ లక్ష్యం.అది ప్రజలందరికి శిరోధార్యం, ప్రగతికి మెట్టు అవుతుంది. అలా మారాలి.

శాసనసభలో నీతి నియమాలను గౌరవ సభ్యులచే తూచ తప్పకుండా పాటింపజేసే లక్ష్యంతో కేంద్ర పార్లమెంటు ఉభయ సభలు, రాష్ట్రాలలోని శాసనసభలు వాటి ఎగువ సభలు, సమర్థులు సీనియర్ శాసనసభ్యులతో గూడిన నీతి నియమాల సంఘాలను నిర్మించడం జరిగింది. గౌరవ సభ్యులు శాసనసభా ప్రాంగణం, శాసనసభలో సభా మర్యాదలను పాటించడాన్ని సునిశితంగా పర్యవేక్షిస్తూ నిబంధనలనుల్లంఘించే వారిపై క్రమశిక్షణ చర్యలను చేపట్టడం దీని ఉద్దేశం. శాసనసభాపతి గారే ఈ కమిటీకి ఆధ్యక్షత వహించడం దీని సర్వోన్నత స్థాయిని తెలియచేస్తుంది. గౌరవ సభ్యులు తమ తమ పార్టీలకు విధేయులుగాఉంటూ పార్టీ విధానాలను సభల్లో ప్రకటించే వారి అధికారాన్ని ఎవరూ ప్రశ్నించరాదు. అది వారి రాజకీయ బాధ్యత. ఐతే శాసనసభ కార్యక్రమాన్ని సవ్యంగా ప్రజోపయోగకరంగా నిర్వహించడానికి ప్రత్యేక నిబంధనలున్నవి. సభాపతికి సర్వోన్నత అధికారాలున్నా గౌరవ పార్టీ నాయకులకు, పార్టీ ప్రతినిధులకు ఇతోధికమైన అధికారాలు గూడా ఆ నిబంధనావళిలో పొందు పరచడం జరిగింది. గౌరవ సభ్యునికి ఎవరైనా అధికార, అనధికారులు వారి విధి నిర్వహణలో అనుచిత అటంకాలను కల్పించినట్లయితే వారు తమ సభాహక్కుల తీర్మానాన్ని ప్రతిపాదించి సభా హక్కులను భంగపరచిన వారిపై తగు విచారణ జరిపి శిక్షించే ఏర్పాట్లు గూడా ఉన్నవి. అత్యున్నతాధికారులను సహితం ఇటువంటి చర్యలకు గురిచేసిన సందర్భాలనేకమున్నవి. శాసనసభ్యుల గౌరవ ప్రతిపత్తిని కాపాడుతూ వారికి తమ కర్తవ్య నిర్వహణలో ఎవరూ ఎలాంటి అనుచిత ఆటంకాలు కల్పించకుండా కాపాడడమే ఈ హక్కుల ఉద్దేశం.

గత మూడు నాలుగు దశాబ్దాలకాలంనుండి గౌరవ శాసనసభ్యులకు ఉన్న మర్యాదలు భంగపాటు కావడంలో ఇతరులకంటే వారి స్వయంకృతాపరాధాలే ప్రబలకారణమై పోవడం విచారకరం. ఎవరి మర్యాదలను వారే కాపాడుకోవడం మన సాంప్రదాయం. గౌరవ శాసనకర్తలకు " సభాహక్కుల " కవచాన్ని సమకూర్చడం వారిని వారినెన్నుకున్న ప్రజల గౌరవాన్ని కాపాడుతూ స్వేఛ్ఛగా నిర్భీతిగా తమ కర్తవ్య నిర్వహణ చేయగల్గడానికి రక్షణ కల్పించడమే. మొదటి రెండు, మూడు దశాబ్దాలకాలంలో ఈ హక్కు సద్వినియోగమౌతూ దీన్ని భంగపరచ ప్రయత్నించే వారిలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం దాని శక్తి పట్ల వినయ విధేయతలు భయభక్తులు చోటుచేసుకున్నవి.

ఎం.ఎల్.ఎ. అంటే నిజంగా గౌరవనీయుడనే భావం కలిగేది. కాలక్రమేణా పరిస్థితి దిగజారిపోయింది. దీనికి గల కారణం గమనార్హం. పూర్వం స్వాతంత్ర సమరయోధులు, త్యాగధనులు, స్వార్థరహిత ప్రజాసేవా తత్పరులు ఈ పీఠాలనలంకరించేవారు. తమ నడక, జ్ఞాన విజ్ఞానం, ఉపన్యాస శక్తి సామర్థ్యం, అధికార విపక్షాల తేడా లేకుండా గౌరవ సభ్యుల పాత్ర, బయట ప్రజలకు ఆదర్శంగానుంటూ సందేశాత్మకంగానుండేది. ఈనాడు ఇతర సామాజిక రంగాలలాగే ఆలాంటి వ్యక్తులు

దాదాపు కనుమరుగైపోతున్నారు. మిగిలినవారు లోపించిన తమ సంఖ్యాబలంతో విజృంభించే ధనబలం, కండబలంగల "ప్రజాప్రతినిధుల"తో తలబడలేక నిశ్చేష్టులవుతున్నారు. ఈ పరిస్థితి నుండి ఏ అధికార పార్టీకి మినహాయింపులేదు. నిబంధనలపట్ల విధేయతలు అంకితభావం సేవాతత్పరతగల వారసలే లేరని చెప్పలేం. కాని వారి ఉనికి లోకానికి అగుపించడంలేదు. ధనదాహం, అధికార వ్యామోహాలకు శాసనసభ్యులను వినియో గించే పార్టీలు నాయకుల ప్రాచుర్యం, ప్రాబల్యం పెరిగిపోతున్న ఈ కాలంలో పవిత్ర శాసన సభల విలువలు గూడా దిగజారిపోవడం ఆశ్చర్యాన్ని కల్పించదు. గౌరవ ప్రజాప్రతినిధులు తమ వాగ్యుద్ధ పరిధులనతిక్రమిస్తూ అధ్యక్ష పీఠాన్ని చుట్టుముట్టి వారాల తరబడి శాసనసభ, పార్లమెంటు కార్యక్రమాలను స్దంభింపచేయడం దాదాపు నిత్యకృత్యమై పోయింది. సభా నిబంధనలు, నీతినియమాల సంఘం విధించిన హద్దులను బాహటంగా ధిక్కరిస్తూ తమ సభ్యులను సభా కార్యక్రమాల నడ్డుకోవడానికి నాయకులే ప్రోత్సహించడం క్షంతవ్యంగాని అప్రజాస్వామిక చర్య. వీటన్నిటికి కారణం ఆయా స్దానాలనలంకరించే వ్యక్తుల చులకన వ్యక్తిత్వం, వారి రాజకీయ చైతన్య రాహిత్యం, దేశభక్తి, దేశ సేవ పట్ల వారికున్న నామమాత్ర స్పృహ రాజకీయ పార్టీలు, ఎన్నికల విధాన సంస్కరణలు విజయవంతంగా ఆచరించిననాడే శాసనసభల ఔనత్యాన్ని, ఆదర్శాన్ని తిరిగి అనుభవించగల్గుతాము. గౌరవ సభ్యులంతా తమ ప్రసంగాల ద్వారా సాత్వికత, విజ్ఞాన వెలుతురును ప్రసరించగల్గుతారు. ప్రజాస్వామ్య విలువల పతనం, విజృంభిస్తున్న అవినీతి, ముఖ్యంగా మహిళలపై, అందులోనూ పసిపాపలపై అనుదినం జరుగుతున్న పాశవిక అత్యాచారాలు, దేశ విదేశాలలో అమాంతంగా పడిపోయే భారతీయ నాగరికతా సంస్కృతులపై తీవ్రమైన విరక్తిని వ్యక్తపరుస్తున్నవి. ఈ దేశంలో తమ పెట్టుబడులను పెట్టడానికి గూడా కొందరు సంకోచిస్తున్నారంటే దేశమేమైపోతుందనే ఆందోళన ప్రజల్ని ద్రిగ్భాంతికి గురిచేస్తున్నది. రాజకీయ సంస్కరణలను, పరిపాలనా సంస్కరణలను ఎంతగా యుద్ధ ప్రాతిపదికపై చేపట్టి నిర్వహించాలో అర్దమవుతుంది.

రాజకీయ లంచగొండితనాన్ని నిరోధించే ఉద్దేశంతో ఆలోచనాపరులు చేస్తున్న వాదన గమనార్హం. ఎన్నికల ఖర్చులు దానికి సంబంధించిన అంశాలపై వారి విలువైన భావాలు ఆసక్తి దాయకం. అమెరికా దేశంలో రాష్ట్రస్దాయి ప్రజాప్రతినిధుల ఎన్నిక, దేశాధ్యక్షుని ఎన్నుకోవడానికై చేసిన ఖర్చులు 2012 సంవత్సరంలో 35000 కోట్ల రూపాయలు. అధ్యక్ష ఎన్నికపైననే 16000 కోట్ల రూపాయలు వెచ్చించినట్లు అంచనా. 30 కోట్ల జనాభాగలిగి అత్యాధునిక ప్రచార ప్రసార మాధ్యమాలుండి రవాణా సౌకర్యాలకు లోటులేని దేశంలోనే 35000 కోట్ల రూపాయలతో ఎన్నికలు నిర్వహించగా అంతకు సుమారు నాలుగురెట్ల జనాభాకలిగి అన్ని సౌకర్యాలు కొరవడిన మనదేశంలో ఎంత మొత్తం అవసరమవుతుందో సులభంగానే గ్రహించగల్గుతాం. 22 భాషలు మాట్లాడే 40 రాజకీయ పార్టీలు పనిచేస్తున్న దేశం మనది. సాధారణ అవగాహనలో ప్రతి పార్లమెంటు సభ్యుడి ఎన్నికపై 55 కోట్ల రూపాయలు ఖర్చవుతున్నట్లు అంచనా. మన పార్లమెంటులో 545 స్దానాలున్నవి ప్రతి నియోజకవర్గం 22 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఎన్నికల వ్యయంతో ఈనాడు పెరిగిపోయిన అనేకానేక అంశాలను పరిగణనలోకి తీసుకోగా దేశానికి ప్రతి ఎన్నికల్లో 30000 కోట్ల రూపాయలు ఖర్చు అవసరమవుతుంది. అలాగే 4120 స్దానాలుగల రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో మరో 30000 కోట్ల రూపాయలవసరమవుతాయి. అదే విధంగా దేశంలోని 100000 పురపాలక సంఘ స్దానాల

ఎన్నికలకవసరమయ్యే ఖర్చు ఒక లక్ష కోట్ల రూపాయలు. ఈ అంశంలో ఖర్చును సగానికి సగం అనగా 50000 కోట్లకు కుదించినా దేశానికి ప్రతి ఐదు సంవత్సరాల కొకసారి లక్ష నుండి లక్షన్నర కోట్ల రూపాయల అవసరముంటుంది. ఇందులో హెచ్చు తగ్గులు అనూహ్యమైన ఖర్చులకు స్థానాన్ని కల్పించినా ప్రతి అయిదు సంవత్సరాలకొక పర్యాయం రెండు లక్షల కోట్ల రూపాయలు అంటే ప్రతి సంవత్సరం సుమారు 40000 కోట్ల రూపాయల్ని ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థల నిర్వహణకై ఖర్చు చేయడం పెద్ద విషయం కాదు. రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్‌కి సమర్పించే లెక్కల ప్రకారం ప్రతి సంవత్సరం 35000 కోట్లు మాత్రమేనని తెలుస్తున్నది. కాని ఆచరణలో ఆయా పార్టీలు చేసిన ఖర్చులు వారు చూపించిన ఖర్చులకంటే కనీసం 4-5 రెట్లు అధికంగాఉంటాయని అనుభవజ్ఞులందరి నమ్మకం. సాధారణ లంచగొండితనం ఈ తేడాను విశద పరచలేదు. వివిధ రంగాలలో భూమి, గనులు, స్పెక్ట్రం, విమానయానం, రైల్వేలు, రక్షణరంగంతో సహా అనుదినం వెలుగుజూస్తున్న కుంభకోణాలు ఈ ప్రశ్నలకు సమాధానంగానున్నవి. ఈ నేపథ్యంలో ఎన్నికల ఖర్చులను ప్రభుత్వమే భరించాలనే ప్రతిపాదన, అభ్యర్థులు చేసే చట్ట వ్యతిరేక ఖర్చులకు శిక్షగా వారిని ఎన్నికలకే అనర్హులుగా ప్రకటించే యోచన హేతుబద్ధం, అవసరమైందిగూడా ఈ ఖర్చు దేశీయ వార్షికాదాయానికి రెండు శాతానికిమించకపోవడం ప్రాజ్ఞులు, అభివృద్ధి కాములు సానుకూలంగా ఆలోచించవలసిన అంశం.

మనదేశ రాజకీయ మేధావులు ఆలోచించవలసిన మరో ముఖ్యాంశం, స్వాతంత్ర్యానంతర కాలంలో దేశ ప్రజల ఆలోచనా సరళిలో ఒక వినూత్న పోకడ చోటుచేసుకుంటున్నది. ఇది జాతీయ ఐక్యతకంటే జాతీయ అనైక్యతను పెంచే దిశలో కొనసాగుతున్నది. అత్యధికులుగానున్న శ్రమ జీవులు వివిధ కులాలు వర్గాలుగా విడిపోయియున్నారు. ఈ వర్గ వ్యవస్థ కులాలు, కులవృత్తుల పేరిట పెద్ద, చిన్న అను అంతరాలుగా గూడా కలిగియున్నది. కులవ్యవస్థ, ఆర్థిక వర్గ వ్యవస్థలు పైపైన ఒకటిగా అగుపించినా ఆవి సమ్మిళతమైయున్నవి. అగ్రవర్ణాలకు చెందిన వారు తమ తమ వృత్తులలో ఒకే విధంగా శ్రమించి పనిచేసినా అంతే పరిశ్రమించే దళితులను తమ సోదర కార్మికులుగా పరిగణించరు. సామాజిక విభజన పైచేయిగానున్నది. సమాజం ఎంత పేదరికాన్ని అనుభవించినా ఒకటిగా లేదు. అందుకే స్వాతంత్ర్యానంతరకాలంలో క్రమంగా ఈ వర్గాలకు సంబంధించిన వారు తమ ఉనికి గుర్తింపుకై ఆరాటపడుచున్నారు. తమిళనాడు, ఉత్తరప్రదేశ్, బీహార్ లాంటి రాష్ట్రాలలో ఈ సామాజిక వర్గాలు అగ్రవరాల అధికృతను ఓడించి తమ రాజకీయ ప్రాబల్యాన్ని సాధించినాయి. ఈ క్రమం దేశమంతటా కొనసాగుతున్నది. అందులో అంతర్భాగాంగాఉన్న హెచ్చుతగ్గులు వారిని వివిధ పార్టీలుగా మార్చుచున్నది. కాబట్టి ఆర్థిక వర్గ ఐక్యత ఐక్య ఉద్యమాల ఆలోచన చేసే రాజకీయ విశ్లేషకులు ఈ వాస్తవాన్ని గుర్తించకతప్పదు. మహిళలు, గిరిజనులు, మైనారిటి వర్గాలు ఇటువంటి మానసికతత్వం, ఎడబాటు భావంతో జాతీయ స్రవంతిలో వేర్పాటు మనస్తత్వంతోనే నిరుత్సాహంతో కొనసాగుచున్నారు.

కులాలు, వర్గాల పేరుతో పిలుచుకొంటున్న శ్రమజీవుల్లోని భిన్నత్వం తొలగిపోవాలంటే వాటికి పునాదిగా పనిచేస్తున్న ఆర్థిక వ్యవస్థ ఆమూలాగ్రంగా మారాలని " మార్క్సిజం" పేరుతో ఒక మేధావి వర్గం చేస్తున్న వాదన. కులాలు, వర్గాలన్ని ఆయా ఆర్థిక పునాదులపై నిర్మించబడిన ఉపరి తలం మాత్రమేనని వారి తర్కం. స్వయంగా కారల్ మార్క్సుగారే అనేక సందర్భాలలో విశదీకరించినట్లు

ఉత్పత్తి, సంబంధాలను సాకల్యంగా ఆలోచించి అర్ధం చేసుకోవాలి. ఆయన వివరణ ప్రకారం శ్రమజీవులు (కార్మికులు) చేసే ఉత్పత్తి సామాజికం, కాని దానిఫలితాన్ని అనుభవించేది వ్యక్తిగతం (పెట్టుబడిదారులు) అసమానతలను సృష్టించే ఇలాంటి ఉత్పత్తి సంబంధం మౌలికంగా మారాలి. దీని రక్షణకై కొనసాగింపుకై నిర్మితమైన విద్యా, రాజకీయ తదితర ఉపరితల వ్యవస్థలు అప్పుడు మారక తప్పదు. నూతన వర్గ పొందికలు, రాజ్యాంగ తదితర (ఉపరితల) వ్యవస్థలు వాటిని తొలగించి, వాటి స్ధానే నూతన సమాజానికనుగుణ్యమైన వ్యవస్థలను స్థాపిస్తాయి. ఉత్పత్తి సంబంధాలలో కనబడే వ్యక్తి దోపిడిని మాత్రమే చూచే మేధావులు, వ్యవస్థలను సంస్కరించియో లేక విప్లవం ద్వారానో పాత ఉత్పత్తి సంబంధాల్ని కూలద్రోసే శ్రమజీవులందరి మధ్య (కార్మికులు) సమరశీల ఐక్యత ఆవశ్యతను విస్మరిస్తున్నారు. వివిధ వర్గాలుగా విభజించబడిన శ్రామిక వర్గఐక్యత నిర్మాణంకానిదే సంస్కరణలు విప్లవాలు విజయవంతంకావు. పాత ఉపరితలం మారి కొత్త ఉత్పత్తి సంబంధాలకు, కొత్త ఉపరితల రూపకల్పనకు ఆస్కారముండదు. మనదేశంలో కార్మికుని, శ్రమశక్తితోపాటు వాని కులం, దాని సగౌరవ ఉనికి విడదీయరాకుండా ముడిబడియున్నవి. ఈ వాస్తవాన్ని గమనించి గుర్తించనిదే ఉద్యమ వ్యూహం విజయవంతంకాదు.

భారతదేశంలోని వర్గ పొందికలు వాటి రాజకీయం బలాబలాలను బేరీజువేసే రాజకీయ వేత్తలు మరో మౌలిక వాస్తవాన్ని గుర్తించాలి. కుల, మత, వర్గ, ప్రాంతీయ లింగ భేదాలతో చీలి యున్న మన సమాజం బహుళం, బహుముముఖమైనది. సామ్రాజ్యవాదులు, రాజులు, మహరాజులు, చివరకు " ప్రజాస్వామ్య "బద్ధంగా ఎన్నికైన స్వార్ధ పర నాయకులు పై బహుళత్వాన్ని, భిన్నత్వాన్ని సంపూర్ణంగా వినియోగించుకుంటూ తమ అధికారాలను నిర్వహిస్తున్నారు. " భిన్నత్వంలో ఏకత్వం" అను మన సాంస్కృతిక నినాదం జాతి సమైక్యతా ప్రచారానికుపయోగపడేదేకాని దేశ సమగ్రాభివృద్ధి, సురాజ్యం, సమ సమాజ సాధనకు ఉపయోగపడింది చాలా తక్కువ. పైన చర్చించినట్లు శ్రామికవర్గ ఐక్యతా నిర్మాణానికి అనేక అవాంతరాలున్నవి. ఒకే పరిశ్రమ ప్రాంగణంలో పనిచేస్తూ ఒకే వర్గ దోపిడికి గురి అయ్యే వారి మధ్య ఏర్పడే ఐక్యత, ఐక్య పోరాటాల చైతన్యం, త్యాగ పటిమ ఈ దేశంలో కష్టసాధ్యం. మొత్తం శ్రామికుల్లో తాజా అంచనా ప్రకారం 7 శాతం మాత్రమే సంఘటిత పారిశ్రామిక కార్మిక వర్గ ముండగా 93 శాతం అసంఘటిత పారిశ్రామికులు వివిధ వృత్తులు వ్యవ సాయం తదితర రంగాలలో స్వయం ఉపాధి రంగాలలో వేరుపడి ఉన్నారు. ఈ విభజనను అడ్డుగోడలుగా మార్చే కుల విభజన వున్నది. కాబట్టి దేశ రాజకీయ పార్టీలు వాటి నాయకులు, వాటి మేధావులు ఈ బహుళత్వాన్ని గమనించకుండా వ్యూహరచన చేయలేరు. కుల వృత్తులు కులాల ప్రాధాన్యతను గమనించి వారిని సంఘటితపరచిన తర్వాతనే వారి రాజకీయ కార్యశీలత ఇను మడిస్తుంది. వారందరి రాజకీయ సాధికారత సాధిస్తేనే సామాజిక ఆర్ధిక పరివర్తన సాధ్యపడుతుంది. వెనకబడిన తరగతులుగా రాజ్యాంగంలో గుర్తించబడినవారు ఇంత వరకే గుర్తింపు పొందిన దళిత, గిరిజన వర్గాలు, మైనారిటీలు, స్త్రీలు ఒక వేదికపైకి రానిదే వారు తమ శంఖారావాన్ని పూరించనిదే, అవసరమైన సమరశీల ఉద్యమాలలో త్యాగాలకు కూడా సిద్ధంగానిదే సాధించుకున్న స్వరాజ్యం, సురాజ్యంగా వాసికెక్కదు. పైనుదహరించిన భారతీయ ప్రత్యేకతలు రాజకీయార్ధిక వ్యూహ రచనలలో గమనార్హం.దీని సాధన సమ సమాజ స్ధాపన మహోద్యమాలన్నిటి విజయానికి అభయహస్తం.

కేంద్ర ప్రభుత్వం ఇంతకాలంగా అనుసరించిన రాజకీయార్థిక సామాజిక విధానాలు ఆశించిన ఫలితాలనివ్వడంలేదని అందరూ విమర్శిస్తున్నారు. అధికార పార్టీలు, వాటిలోని వివిధ గ్రూపులు, ముఠాలే ఈ విమర్శల్లో ముందుండడం మన రాజకీయ వ్యవస్థ దౌర్భాగ్యం. స్థూలంగా స్వాతంత్ర్యోద్యమ కాలంలో స్వతంత్ర భారతదేశంలో రామ రాజ్యమేర్పడుతుందన్నాం. స్వాతంత్రానంతరం పండిట్‌జి కాలంలో సోషలిస్టు తరహా రాజ్యమన్నాం. శ్రీమతి ఇందిరాగాంధి గారి కాలంలో (గరీబీ హటావో) పేదరిక నిర్మూలన మన పరమావధి అని ప్రకటించినాం. రాజీవ్ గాంధి గారి పరిమిత కాలంలో ఆధునిక భారత నిర్మాణం మనధ్యేయమని చెప్పుకున్నాం. శ్రీ పివి నరసింహారావుగారి కాలంలోఅంత వరకనుసరించిన ఆర్థిక విధానాలన్నింటిని సంస్కరిస్తే తప్ప దేశానికి మంచి భవిష్యత్తు లేదని సంస్కరణల పర్వాన్ని చేపట్టినాం. సరళీకరణ, ప్రైవేటీకరణల ద్వారానే ఈనాటి ప్రపంచీకరణయుగంలో ఉత్పత్తి, ఉత్పాదకతలు పెరిగి సంపద పంపకం సులభతరమవుతుందన్నాం. బిజెపి కాలంలో హిందూత్వం, సాంస్కృతిక విప్లవం సాధిస్తేనే దేశం బహుముఖాభివృద్ధి సాధిస్తుందని ప్రచారం చేసినాం. జనతాదళ్ కాలంలో అస్థిరత్వం నేపథ్యంలో ఎవరికివారే యమునాతీరే లాంటి నినాదాలకు పరిమిత మైనాం. శ్రీమతి సోనియాగాంధి గారి నేతృత్వంలోని యుపిఎ రాజ్యంలో ఓటర్లను జనాకర్షణ, పథకాల ఎరతో ఆర్థికంగా " దినదిన గండం" వాతావరణంలో బండిని లాగుతున్నాం. ఒక్కమాటలో చెప్పాలంటే ఆదినుండి ఈ నాటివరకు కేంద్రంలలోని పాలకవర్గాలకు ఒక దార్శనికతంటూలేనేలేదు. రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడం, దాన్ని పదిలపరుచుకోవడం, దాని ద్వారా అధికార పార్టీలు వారి అనుయాయులంతా ప్రజాధనాన్ని వీలున్నంతవరకు పంచుకోవడం, అటువంటి ఆర్థిక నేరస్థులందరికి శిక్షలుబడకుండా కాపాడుకోవడం ఏకైక కర్తవ్యంగా మిగిలింది. దార్శనికత, లక్ష్య శుద్ధి, రాజకీయ సంకల్పబలముంటే 65 సంవత్సరాల స్వాతంత్ర్యానంతర సుదీర్ఘకాలంలో మూడవవంతు కాలంలో అనగా 20 సంవత్సరాలకాలంలో పేదరికాన్ని పారద్రోలి శ్రేయో రాజ్యంలో సుపరిపాలనను సాధించగల్గేవారం.

చర్వితచరణం లేకుండా సూటిగా ఈనాటి దేశ సామాజిక ఆర్థిక చిత్ర పటాన్ని గమనిస్తే భావి భారతం గురించి అనేక హెచ్చరికలు వినబడుచున్నవి. సకాలంలో మేల్కొనని ఎడల దాపురించే అరాచకం భయపెడుచున్నది.

1. మహిళలు, మైనారిటీలతో సహ దళిత గిరిజన, వెనకబడిన తరగతులవారందరికి విద్య, వైద్య ఉపాధి రంగాలన్నిటిలో రిజర్వేషన్ సూత్రాన్ని ఖచ్చితంగా పాటించాలి. మహిళలు వెనకబడిన తరగతులవారికి వరుసగా 33 శాతం 27 శాతం రాజకీయ రిజర్వేషన్‌లను రాజ్యాంగబద్ధం చేయాలి. ఈ చర్య ప్రజాబాహుళ్యంలో చోటుచేస్నుకున్న సగం నిర్లిప్తత నిష్క్రియత్వాన్ని పారద్రోలుతుంది. తమ తమ ఆర్థికాభివృద్ధి కొరకు ఉద్యమించడానికి వారిని ప్రోత్సహిస్తుంది.

2. రాజకీయరంగంలో, రాజకీయ పార్టీల సంస్కరణ, ఎన్నికల సంస్కరణ, పార్లమెంటరీ వ్యవస్థ సంస్కరణల ఆవశ్యకత ఎంతైనా ఉంది. (వాటిని గురించి పైన సాకల్యంగా చర్చించియున్నాం.) వాటి ఆచరణ ప్రజాస్వామ్య వ్యవస్థకు అవసరమైన జవసత్వాలను సమకూర్చుగల్గుతుంది.

3. ఆర్థిక సంస్కరణల గురించి సందర్భానుసారంగా ఇంతకుముందు చర్చించడం జరిగింది. మనదేశం ఎదుర్కుంటున్న సమస్య, సక్రమ ఆర్థిక విధానాలను ప్రకటిస్తూ వాటిని పూర్తిగా లోపరహితంగా అమలు పరచడమే తక్షణావసరం. దేశాల ఆర్థిక సామాజిక స్థితిగతులపై సదవగాహన ఏర్పడాలంటే ఈ క్రింది మౌలికాంశాలు గమనార్హం.

(1) సగటు దేశీయ ఉత్పత్తి రేటు పెరుగుదల లేక తరుగుదల

(2) దేశం భరించే రుణభారం అది దేశీయోత్పత్తిలో ఎంతశాతం?

(3) దేశీయ ఉత్పత్తిలోని మూడు ముఖ్యాంశాలైన వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల భాగమెంతెంత?

(4) రాష్ట్రాలు, దేశం యొక్క వార్షిక ఆదాయ, వ్యయం అందులో మిగులా లేక లోటా? ఆర్థికలోటెంత?

(5) దేశ జనాభాలో సంఘటిత కార్మికులు, అసంఘటిత కార్మికులు రైతుల శాతమెంత.

(6) దారిద్ర్య రేఖ అనగానేమి. దానికి దిగువగాన్ను జనసంఖ్య ఎంత? జనాభాలో దానిభాగం ఎంత?

(7) ద్రవ్యోల్బణమెంత, హోల్‌సేల్, రిటైలు వివరాలేమిటి.

(8) ఏ మాత్రం చిన్న అంశంగానటువంటి కరెంటు అకౌంటులోటు ( సి.ఎ.డి) అనగా మనదేశం నుండి సరుకుల ఎగుమతులు చేసి ఇతరత్రా సంపాదించిన మొత్తం విదేశీమారకం కంటే విదేశాలనుండి సరుకులను దిగుమతిచేసుకొవడంలో వెచ్చించే మొత్తం అధికంగా ఉండడం ఈ లోటు ప్రత్యేకత. దీనినే కరెంటు అకెంటు లోటంటారు. ఇది నామమాత్రమే ఉంటే పరవాలేదుగాని శృతిమించితే దేశ ఆర్థిక విధానానికి ఇబ్బందులు తప్పవు. ఆలాగే దేశ రాజకీయ పలుకుబడి పరపతిగూడా పడిపోతుంది. కీ॥శే॥ రాజీవ్ గాంధిగారు ప్రధానిగా నున్నప్పుడు ప్రారంభించిన శక్తికి మించి ఖర్చులు చేసే అలవాటు శ్రీ చంద్రశేఖర్ గారు తాత్కాలిక ప్రభుత్వ ప్రధానిగానున్న సమయానికే మోయరాని భారంగా పరిణమించింది. రిజర్వుబ్యాంకులో నిలువగానున్న 67 టన్నుల బంగారాన్ని ప్రత్యేక విమానాల ద్వారా ఇంగ్లాండుకు తరలించి తాకట్టుపెట్టి అంతర్జాతీయ ద్రవ్యనిధినుండి 220 కోట్ల డాలర్లు అత్యవసరంగా అప్పుతీసుకొని పరిపాలన కొనసాగించవలసి వచ్చింది. 1991లో కీ॥శే॥ పి.వి. నరసింహారావుగారు ప్రధాని, శ్రీ మన్‌మోహన్ సింగ్‌గారు ఆర్థిక మంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత క్రమంగా తాకట్టును విడిపించుకోవడం జరిగింది. ఈనాటి కరెంటు అకౌంటులోటు అంతకు రెండింతలైపోగా దాన్ని తీర్చేదెలా అని అర్థశాస్త్ర పండితుడైన మన ప్రధాని తలబట్టుకుంటున్నారు.

(9) చివరిదైనా సామాన్యుని సంపదను కర్చు చెయకముందే కరిగించి వేసేది రూపాయి విలువ తరుగుదల. ఈనాటి ప్రపంచీకరణ వాతావరణంలో ఇది పేద, మధ్యతరగతి వర్గాలకు

మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా పరిణమిస్తున్నది. ద్రవ్యోల్బణానికి తోడై బ్రతుకు భారాన్ని మరింతగా పెంచుచున్నది.

స్థూలంగా పైనుదహరించిన సూచికలు, వాటి ప్రమాణాలు దేశ ప్రగతి లేక అధోగతిని తెలియ చేస్తున్నాయి. మన దేశాన్ని ఈ నిలువుటద్దంలో చూస్తే ఈ క్రింది పరిస్థితి ద్యోతకమవుతుంది. దేశీ యోత్పత్తి రేటు గత దశాబ్దంలో సుమారు 8–9 నుండి ఈనాటికి 5 శాతానికిపడిపోయింది. దేశ రుణభారం దేశీయ వార్షికోత్పత్తికి అనుమతించగల్గే 25 శాతానికి దాదాపు రెండు రెట్లు పెరిగింది. దేశీయ ఉత్పత్తిలో కేవలం 14 శాతం మ్రాతమే 40 శాతం జనాభా కృషిఫలితంగా వ్యవసాయంనుండి వస్తున్నది. ప్రపంచంలో అతిపేద దేశాల సరసననున్నది. పారిశ్రామికోత్పత్తి అన్నిటికంటే అధికంగా నుండడం అభివృద్ధికి ప్రబల సూచకం. అటువంటిది 25–30 శాతం మ్రాతమే ఉండడం దారుణం. సేవారంగం 50 శాతానికి మించిన ఆదాయాన్ని సమకూర్చడం అసాధారణం. ఐనా సంతృప్తికరమే. పారిశ్రామికోత్పత్తి ప్రథమ స్థానాన్నలకరించడం సుస్థిరాభివృద్ధికి అవసరం. వార్షిక బడ్జెట్లలో ప్రతి సంవత్సరం లోటు కొట్టవచ్చినట్లగుపించే దుస్థితి. ద్రవ్యలోటు సగటు వార్షికోత్పత్తికి 3–4 శాతానికి మించకుండా ఉండడం ఆరోగ్యకరం. అటువంటిది 5–6 శాతానికి చేరడం దేశాన్ని రుణ గ్రస్తం చేసుకోవడమవుతుంది. పారిశ్రామికవర్గంలో సంఘటిత కార్మికుల సంఖ్య కేవలం 6–7 శాతమే. అదిగూడా వారి కుటుంబసభ్యులతో కలిపియుండడం గమనార్హం. రైతుల్లో,కౌలు రైతులు 50 శాత ముండగా అసంఘటిత కార్మికుల సంఖ్య సుమారు 40 శాతముండడం పేదరికానికి ప్రబల తార్కాణం. దారిద్ర్యరేఖకు దిగువగానున్న జనాభా మొత్తం, జనాభాలో 35 శాతముండడం ఆందోళనకరం. దేశ ఉత్పత్తి ఒక శాతం పెరిగిన నాడే వీరి సంఖ్య అరశాతం మాత్రమే తగ్గింది. అసలు ఉత్పత్తి పెరుగుదల స్థంభించిన గత నాల్గు సంవత్సరాలలో దీని తగ్గుదలకాదుగదా ఇంకా పెరిగిఉంటుంది. ఈ అంశం ఈనాడు ప్రశ్నార్థకమైంది. ప్రజల కొనుగోలు శక్తి పెరుగుదల ప్రామాణికంగావాలి. ధరల పెరుగుదల ముఖ్యంగా చిల్లర ధరల పెరుగుదల, అందులో కూరగాయల ధరల పెరుగుదల ప్రతి సంవత్సరం 50 శాతం నుండి 100 శాతముండడం మధ్యతరగతితో సహ పేదల జీవితాల్ని దుర్భరం చేస్తున్నది. ఇది 3–4 శాతంకంటే మించగూడనిది అమాంతంగా పెరిగిపోయింది. సాధారణ ధరల పెరుగుదల 6 శాతముండగా ఆహార సరుకులధరల పెరుగుదల సూచి 10 శాతానికి మించి పోయింది. ఫలితంగా స్త్రీలలో పౌష్టికాహారలోపం 5 శాతముండగా పిల్లల్లో ఈ లోపం 75 శాతానికి జేరింది. అతిపేద దేశాల సరసన భారతదేశం చేరిపోవడాన్నిచూడలేం.

" అంగట్లో అన్నీ ఉండి అల్లుని నోట్లో శని " అనుసామెత వర్తిస్తుంది. కరంటు అకౌంటు లోటు మరీ దిగ్భ్రాంతికి గురిచేస్తున్నది. మనవద్ద నిలువగానున్న విదేశీ మారకాన్నంతా వెచ్చించినా రుణ విముక్తి జరిగేటట్లు లేదు. మన సరుకుల ఎగుమతి ద్వారా సాధించే విదేశీ మారకమొకటే సంపద పెరగడానికి శాస్త్రీయ మార్గం. ఈ సూచికలన్ని పౌర సమాజాన్ని కలవరపెడుతూ ద్రిగ్భాంతికి గురిచేస్తున్నవి. పరిస్థితిని సకాలంలో సవరించలేక పోతే కాలం మనల్ని క్షమించదు.

ఈ దయనీయ పరిస్థితి, దుర్భర దారిద్ర్యం నుండి మధ్యతరగతితో సహా 80 శాతం జనాభాకు రక్షణ కల్పించేది రాజకీయ పొందికల మార్పు మాత్రమే. అందుకు మచ్చుకొక ఉదాహరణచాలు.

గత సంవత్సరం దేశంలో రాష్ట్రాలతో సహా ద్రవ్యలోటు 5,21,980 కోట్ల రూపాయలు (5.9 శాతం జిడిపికి) ఉండగా అదే సంవత్సరం ప్రభుత్వం ఎవరడగకుండానే స్వయంగా 5,29,432 కోట్ల రూపాయల పన్ను రాయతీలను ప్రకటించింది. ఇది దశాబ్ధాలకాలం నుండి కొనసాగుతున్న అధికార పక్షపాతం. సరళీకరణ, ప్రైవేటీకరణ తర్వాత 20 సంవత్సరాల కాలంలో ఈ ధోరణి బాగా పెరిగింది. పరిపాలనలోనే అనివార్య భాగమైంది. అదే వసూలయితే (సేకరణ అయితే) రుణ భారం తగ్గడమే గాకుండా లక్షలాది యువతీ యువకులకు చేతినిండా పని కల్పించే మౌలిక సదుపాయాల నిర్మాణం జరిగియుండేది. ఉత్పత్తి గణనీయంగా పెరిగియుండేది. దేశ ప్రజల కొనుగోలు శక్తి పెరిగియుండేది. అసలు దేశాభివృద్ధికి ప్రబల చోదకశక్తి ప్రజల కొనుగోలు శక్తి మాత్రమే ఈ వాస్తవం తెలిసిగూడా కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల ప్రయోజనాలని ప్రక్కనపెడుతూ దేశ, విదేశీ గుత్తపెట్టుబడిదారుల అధిక లాభాల హీనసంస్కృతికి తలవంచడం,ప్రజాస్వామ్యంలో అభ్యుదయ రాజకీయ నాయకత్వం సిగ్గుతో తలదించుకోవలసిన సందర్భం. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ మన మాతృ భూమి ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యాన్ని బలోపేతం చేయడానికుపయోగపడాలి గాని పేదలు, నిరు పేదలవడానికి కాకూడదు.

అఖిల భారత, రాష్ట్రీయ పార్టీలు వారి నాయకులు కరుడుగట్టిన పిడివాదాలకు, స్వార్ధాలకు స్వస్తి చెపుతూ ఐక్య ప్రజా ఉద్యమాల బలంతో దేశ రాజకీయాల దిశను పూర్తిగా మార్చి వేయవలసిన తరుణమాసన్నమైంది. ప్రజాబాహుళ్య ప్రయోజనాలకు పార్టీప్రయోజనాలను అను బంధం చేసే విశాల రాజకీయ సంస్కృతిని అలవర్చుకోవడమొక్కటే మార్గం.

ఈ అభ్యుదయ సంస్కృతి ఒంటబట్టాలంటే దేశ అభ్యుదయాన్ని కోరే రాజకీయ పార్టీలు తక్షణ కనీస ఉమ్మడి కార్య క్రమంపై కలిసి పోరాడి ప్రజాభిమతాన్ని పొంది సంకీర్ణ ప్రభుత్వాలను నిర్వహించడానికి సంసిద్దం గావాలి. సంకీర్ణం దేశ, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన లక్షణంకాబోతుంది. ఈ దేశంలో సుదీర్ఘకాలం పరిపాలననందించగల్గుతుంది. కులమతాల బహుళత్వాన్ని ఏకత్వంగా మార్చడంలో విశిష్టపాత్రను పోషిస్తుంది. తమ తమ ఉనికిని చాటుకోవడానికై పడరానిపాట్లు పడుతున్న వారందరికి గౌరవస్థానాన్ని కల్పిస్తూ జాతీయ సమైక్యతా నిర్మాణంలో జాతీయతా రూపకల్పనలో అనూహ్యమైన ఐక్యతా చైతన్యాన్ని సృష్టిస్తుంది. ఈనాటి భారతదేశ రాజకీయం ఈ పరిస్థితికి సమాధానం కోరుతున్నది. వివిధ కులాల నాయకులు, రాజకీయ పండితులు ఇంకేమాత్రం సమయాన్ని వృధా చేయకుండా కొత్త ప్రత్యామ్నా యాన్ని ఏర్పాటు చేయగల్గుతారు. కనీస ఉమ్మడి కార్యక్రమం ఆధారంగా దేశాన్నెదుర్కుంటున్న సామాజిక ఆర్ధిక సమస్యలనుండి విముక్తిని సాధించగల్గుతారు. అర్ధశాస్త్రవేత్తల మధ్య ఒక ఆసక్తికరమైన చర్చ జరుగుతున్నది. సంపూర్ణ రాజకీయ స్వాతంత్ర్యం, ప్రజాతంత్ర ప్రభుత్వాలుగల దేశాల్లో ఆర్ధికాభివృద్ధిగూడా అంతే సంపూర్ణంగా కొనసాగుతుందా? అర్ధిక స్వతంత్రంగలిగి రాజకీయ స్వాతంత్ర్యం ప్రజాస్వామ్యం కొరవడిన దేశాలలో ఆర్ధికాభివృద్ధి రేటు అంతకు అధికంగానున్నదా? చాలా దేశాల రాజకీయ, ఆర్ధికాభివృద్ధి ప్రమాణాలను పరిశీలించి పరస్పరం పోల్చగా రెండవ ప్రశ్నకే సానుకూల సమాధానం అభించడం ఆశ్చర్యకరం. ఆర్ధికాభివృద్ధి అను అంశాన్ని సునిశితంగా సూక్ష్మంగా పరీక్షిస్తే దేశ సంపద పెరుగుదల, దేశ ప్రజలలో సుఖ సంతోషాలు

చోటుచేసుకోవడం రెండు వేరు వేరు అర్థాలను సమకూరుస్తున్నాయి. రాజకీయ స్వాతంత్ర్యం దాని పరిపాలన ఫలితంగా దేశ సంపద పెరగవచ్చును. పెరగకుండా నిలిచిపోయికూడాయుండవచ్చును. ఆర్థిక స్వాతంత్ర్యం మాత్రం దేశ సంపదను ఉన్న మేరకు ప్రజా బాహుళ్యంలో సమభావంతో పంపకం చేయవచ్చును. ఐనా సంపద సాధనలో వెనకబడిపోయి గూడా ఉండవచ్చును. పేదరికాన్ని సమపాళ్ళలో పంపకం చేసిన స్వతంత్ర దేశాల అనుభవముగూడా ఉన్నది. కాబట్టి నిరంకుశత్వం స్థానే రాజకీయంగా సంపూర్ణ స్వతంత్ర ప్రజాస్వామ్య ప్రభుత్వం అవసరం. ఆర్థిక స్వాతంత్ర్యమున్నప్పటికి అది దేశ వాసులందరికి సుఖసంతోషాల్ని కల్పించేదిగా నుండాలే. అభివృద్ధికి పరమార్థం మానవాభివృద్ధి. కేవలం సగటు దేశాభివృద్ధికాదు. అలా అయితే మన భారతదేశం చాలా కాలంనుండి గణనీయమైన అభివృద్ధి చెందుతున్నట్లు అంకెలు చెబుతున్నాయి. లక్షాధికారులు కోటికి పడగలెత్తడం జరగగా పేదరికం ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చందంగా నున్నది. మధ్యతరగతిగా ఉండే జనాభా రెండు దశాబ్దాలలో రెండు రెట్లనుండి నాల్గురెట్లకు పెరగడం నూతన పరిస్థితిలోని విశిష్టత. ఈ వాస్తవాన్ని గుర్తిస్తూ రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సంస్కరిస్తూ పరిపూర్ణ ఆర్థిక ప్రజాస్వామ్యానికై వ్యూహరచన చేయాలి. మానవాభివృద్ధి లక్ష్యంగా సమాజం లోని శ్రమజీవు లందరికి సుఖ సంతోషాలను సమకూర్చే విధానాల రూపకల్పన జరిగి వాటి ఆచరణకై ఉపక్రమించాలె. కేంద్ర ప్రభుత్వం అతి సామాన్యమైన కలంపోటుతో చేయదగిన పరిపాలనా సంస్కరణలను గూడా చేయలేకపోవడం, పూర్వాచారాన్ని కొనసాగించడం వలన ప్రతి సంవత్సరం కొన్ని వేలుగాదు, లక్షల కోట్ల రూపాయలు ఆదా కాకపోగా వృధాకావడం జరుగుచున్నది. ఉదాహరణకి ఎరువుల సరఫరా బాధ్యతను కెమికల్ పెట్రో కెమికల్ ఎరువుల శాఖ నుండి తప్పించి వ్యవసాయశాఖకు అప్పగించడం వలన ప్రతి ఏటా 75 వేల కోట్ల ధనం ఆదా అవుతుందని ఉభయ శాఖల అంచనా. ఎవరో ఎందుకో తమకాలడ్డం పెట్టడంవలన ఈ మార్పు జరగడంలేదు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తూ పూర్తిగా అన్ని విధాలా దివాలా తీసిన ఎరువుల పరిశ్రమల నిర్వాహకులే ఈ సైంధవపాత్రను పోషిస్తున్నారని బలమైన అనుమానం. అలాగే అంగన్‌వాడీల్లో పిల్లలకు పౌష్టికాహారాన్ని సరఫరాచేసే బాద్యత ఈ నాటికి మహిళా, శిశు సంక్షేమ శాఖ క్రిందనే ఉన్నది. ప్రపంచ వ్యాపితంగా ఈ బాధ్యత ఆరోగ్యశాఖే నిర్వహిస్తున్నది. ఆరోగ్యశాఖ వారికి దీనితో అత్యంత లోతైన సంబధ ముంటుంది. పౌష్టికాహారంలో చేర్పులు, మార్పులు పిల్లల నిర్దిష్ట అవసరాల్ని వారికంటే బాగా గుర్తించి వాటిని తయారు చేయించే పని మహిళా శిశు సంక్షేమ శాఖ వల్ల కాదు. ఈలాంటి అనేక నిర్ణయాలు పెట్టుబడి అవసరమేలేని నిర్ణయాలు చేయ సాహించలేని ప్రభుత్వాల రాజకీయ దౌర్భల్యం. నిస్సహాయత క్షంతవ్యంగానివి.

## అంతర్జాతీయం

ప్రపంచంలోనే అతి గొప్ప ప్రజాస్వామ్య దేశమని పాశ్చాత్య దేశాల నాయకులు భారతదేశ రాజకీయ వ్యవస్థను పొగడడం, ఆశ్చర్యంగాఉంటుంది. స్వాతంత్ర్యాన్ని రాజకీయ, ఆర్థిక, సమతాభావాల నుండి పూర్తిగా విడదీసి మాట్లాడడం వారికే చెల్లుతుంది. వారి ఆలోచనల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారి భారతదేశాన్ని తమ ప్రక్కన ఉంచుకోవడం ప్రధానాంశం. ఆర్థికంగా,

రాజకీయంగా తమ ప్రాబల్యాన్ని కోల్పోతున్న ఈ పాశ్చాత్య దేశాలు ప్రపంచ రాజకీయాలు ఆర్ధిక వనరుల పున:పంపకం కొరకు ఏలాటి చర్యకైనా తెగించగల్గుతాయి. భారతదేశం తన సర్వసత్తాక శక్తితో దేశం, దేశ ప్రజల బహుముఖాభివృద్ధిని ఏకైక లక్ష్యంగా స్దిరచిత్తం, స్దితప్రజ్ఞతో నిలదొక్కుకోవడం, ప్రపంచ సమస్యల పరిష్కారం కొరకు ఐక్యరాజ్యసమితిని వేదికగా తగు చేర్పులు మార్పులతో ప్రజాతంత్ర వేదికగా ఆధునికీకరింపజేసే ప్రయత్నం చేయడం అవసరం. బాండుంగ్( ఇండోనేషియా) మహాసభలో కీ॥శే॥ పండిట్ జవహార్‌లాల్ నెహ్రూ, ఈజిప్టు అధ్యక్షులు కీ॥శే॥ అబ్దుల్ నాసర్, యుగోస్లావియా అధ్యక్షులు కీ॥శే॥ మార్షల్ టిటోగారలు చేసిన పంచశీల ప్రకటన ఆధారంగా ప్రపంచదేశాలు తమ మధ్య సంబంధాలను పునర్మిస్తూ ప్రపంచ ప్రజల సుఖ శాంతులకూ పాటుబడడం ఏకైకమార్గం.

# 9. న్యాయ, పోలీస్ వ్యవస్థలు

మన దేశంలోని న్యాయ వ్యవస్థ సంస్కరణలకై సుదీర్ఘకాలంనుండి ప్రయత్నం జరుగుతూనే ఉన్నది. ఇటీవల కాలంలో " ప్రజాస్వామిక సంస్కరణల ఫౌండేషన్ " అను స్వచ్ఛంద సంస్థ, దాని ప్రధాన కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యులు " లోక్ సత్తా " నాయకులైన డా॥ జయప్రకాష్ నారాయణగారు ఈ కృషిని విశ్లేషించారు. ఫలితంగా దేశంలో ఈనాడున్న అత్యున్నత న్యాయశాస్త్ర కోవిదులైన జస్టిస్ వి.ఆర్. కృష్ణ అయ్యర్, జస్టిస్ ఎం.ఎన్. వెంకటాచలమయ్య, జస్టిస్ జె.యస్. వర్మగారలతో గూడిన త్రిసభ్య బృందం న్యాయవ్యవస్థ, పోలీస్ వ్యవస్థలపై తమ సుదీర్ఘ నివేదికను గౌ॥ ప్రధానమంత్రి శ్రీ మన్ మోహన్ సింఘ్ గారికి సమర్పించింది. భారత లోక్‌సత్తా సమన్వయకర్తగారైన డా॥ జె.పి. గారు గూడా న్యాయవ్యవస్థ సంస్కరణల ప్రాధాన్యతను తెలియచేస్తూ ప్రధానమంత్రి గారికి తమ నివేదికను సమర్పించియున్నారు. ఈ నివేదికలు మన న్యాయవ్యవస్థలో సంస్కరణల అవశ్యకతపై అమూల్యమైన సమాచారాన్ని వెలుగులోకి తెస్తూ వాటి గురించి నొక్కి వక్కాణించినవి.

## న్యాయవ్యవస్థ సంస్కరణ తక్షణావసరం

స్వతంత్ర, నిష్పక్షపాత, సత్వర, సహజ, చట్టబద్ధ న్యాయం నాగరికతకు మూలం. మన దేశంలో స్వాభావికంగానే న్యాయవ్యవస్థ మోయరాని బరువు, నత్తనడక, అసమర్ధతల కారణంగా సామాన్యుడికి ఉపయోగంలేనిదిగా మారింది. పురాతత్వం, అంతులేని జాప్యంగల ఈ పరాయి సాంప్రదాయం మన సమాజం. దాని పరిపాలనను తీవ్రంగా నష్టపరిచింది. చట్టాలు వాటి నిర్వచనం, నిర్ణయం కక్షిదారులకు కొరకరాని కొయ్యగా పరిణమించడం కారణంగా వారు చట్టాలకతీతమైన మార్గాలననుసరించవలసి వస్తున్నది. ప్రతి చిన్న పనికి చట్టబద్ధ మార్గాలు ఉపయోగపడని దుస్థితి పౌర సమాజాన్ని పీడిస్తున్నది. ఫలితంగా గ్రామాలతో సహా పట్టణాలు, బస్తీలల్లో చట్టాన్ని తమ చేతిలోకి తీసుకుంటూ దౌర్జన్యాలకు తెగించే గూండా వర్గాలు తలెత్తినవి. కండబలంతో సమస్యల పరిష్కారాలు చేయడం, ధనం కూడబెట్టుకోవడం వీరి నిత్య విధిగా తయారైంది. అన్ని రాష్ట్రాలలో ఇలాంటి గూండాతండాలు తమ ధనబలం, కండబలంతో రాజకీయ రంగప్రవేశం చేస్తూ అధికార వర్గాలకు సన్నిహితం కావడం లేక అధికారాన్ని హస్తగతం చేసుకోవడాన్ని ఆశ్చర్యంతో గమనిస్తున్నాం. అన్ని రాష్ట్రాలలో అనుభవించిన ఈ పరిణామాలకు ప్రధమకారణం ఆయా న్యాయ వ్యవస్థల వైఫల్యమే. ఈ అనాగరిక ప్రత్యామ్నాయాలు కోర్టులు చేయలేని పనులను గూడా చేసి పెడతాయనే చెడ్డ భ్రమలను కల్పిస్తున్నాయి. ముఠాకోర్లు, రౌడీలు, గూండా తండాలు విపరీతంగా పెరిగిపోతూ అమాయక, నాగరిక పౌరజీవితంలో ప్రశాంతతను హరించివేస్తున్నాయి. స్వతంత్ర నిష్పక్షపాత సత్వర న్యాయం అందుబాటులోనుంటే సమాజానికి ఈ పాశవిక పరిస్థితి దాపురించేదేకాదు. న్యాయవ్యవస్థ సంస్కరణ, పోలీస్ వ్యవస్థ ఆధునికీకరణలో ఇంకెంతమాత్రం జాప్యం అనుమతించడానికి వీలులేదు.

(2) కోర్టుల మధ్య పనివిభజన లోపభూయిష్టంగానుండడం హైకోర్టులాంటి ఉన్నత న్యాయస్థానం తన పరిధిని విస్తరించుకోవడం వలన కోర్టుల పనిభారం మోయజాలనిస్థితికి చేరింది. రిట్ పిటిషన్‌ల

ప్రయోజనం, ప్రజా ప్రయోజనాలకొరకు కోర్టుల జోక్యాన్ని ఆకర్షించ కోరే కోరికలు శృతికి మించిన విధంగా తయారయినవి. ఒక ప్రభుత్వోద్యోగి తన ఉద్యోగ సమస్య పరిష్కారానికి రిట్ పిటిషన్ వేయడం, వాయిదాలు, స్టే ఆర్డర్ల ద్వారా అనవసర కాలయాపన జరగడం క్షంతవ్యంగాని అంశం. అలాగే పౌరులు తమ సామాజిక ఆర్థిక వ్యవహారాలను ఐచ్ఛికంగా, సుళువుగా స్వతంత్రంగా పరిష్కరించుకోవడానికి ఉద్దేశించిన సహకార సంఘాల నిర్మాణాంశాలు వాటి ఆంతరంగిక ఆంశాలల్లో కోర్టులు జోక్యంచేసుకోవడం స్వతంత్ర పౌర జీవితానికి దాని ఐచ్ఛిక నిర్మాణానికి గొప్ప హానికలుగుచున్నది. సహకార సంఘాలు రిజిష్టరు అయినంత మాత్రాన అవి ప్రభుత్వరంగ సంస్థలంటూ కోర్టులు తీర్పులివ్వడం తమ జోక్యాన్ని సమర్థించుకోవడం మరీ ఆశ్చర్యకరం. పౌర జీవితం, దాని సమస్యలను పౌరులే స్నేహం, సహకారం, సమిష్టి ప్రయోజనం, స్వావలంబన సూత్రాలపై ఆధారపడి పరిష్కరించుకునే విధంగా పాత్ర వహించవలసిన కోర్టులు ప్రతి అంశాన్ని తమ పరిధిలోకి తీసుకోవడం సమాజికాభివృద్ధికి తగనిపని. ప్రభుత్వోద్యోగులు తమ ఉద్యోగ ధర్మ సూత్రాల ఆధారంగా తమ ఉన్నతాధికారికి జవాబుదారిగా ఉండేబదులు ధిక్కార దోరణిని పెంచుకోవడం జరుగుతున్నది. కోర్టుల పరిధి, పనిభారం, సత్వర న్యాయం గురించి చిరకాలంగా ఆలోచిస్తున్న సంస్కరణలు అత్యవసరం.

(3) కోర్టుల్లో జరిగే జాప్యం వర్ణనాతీతం. ఒక అంచనా ప్రకారం దేశవ్యాపితంగా అన్ని కోర్టుల్లో దాదాపు 3 కోట్ల 80 లక్షల కేసులు పరిష్కారంకాకుండా మిగిలియున్నవి. ఇందులో 2 కోట్ల కేసులు జిల్లా కోర్టులు, హైకోర్టులు, సుప్రీంకోర్టు స్థాయిల్లో పేరుకొనియుండగా ఒక కోటి 80 లక్షల కేసులు క్రింది కోర్టుల్లో మ్రగ్గిపోయినవి. దీనిలో అత్యంత నిరాశ నిస్పృహలతోపాటు విపరీతంగా డబ్బు వృధాకావడం జరుగుచున్నది. తమ కేసులు విచారణలో ఉండగా అండర్ ట్రయల్ ఖైదీలుగా ఉన్న వారు మానసిక క్షోభకు గురికావడం ఆందోళనకరం. చాలా సందర్భాలలో ఇలాంటి ఖైదీలు ఇదివరకే అనుభవించిన జైలు శిక్షలు, నేరారోపణ నిజమైతే అనుభవించవలసిన అత్యధిక కాలం జైలు శిక్షలు అండర్ ట్రయల్ నేరస్తులుగానే గడిపియున్నారు. న్యాయాన్ని అందించడంలో జరిగే విపరీత జాప్యం అసలు న్యాయ సిద్ధాంతానికే మాయని మచ్చగా మిగులుతుంది. విచారణ తతంగాలన్ని పరాయిభాష ఇంగ్లీష్‌లో జరగడం, అనేక చిక్కు ముళ్లతో కూడిన వ్యవహారశైలి ఈ విపరీత జాప్యానికి ప్రధానకారణం. ప్రపంచంలో ఎక్కడాలేని న్యాయస్థానాలు, న్యాయ మూర్తులలోటు మనదేశంలో ఉండడం తలవంపుగా ఉన్నది. పది లక్షల జనాభాకు పదకొండుమంది మాత్రమే జడ్జిలున్న మనదేశం న్యాయాన్ని సమకూర్చడంలో దాదాపు విఫలమైపోయిందని బాధపడకతప్పదు. సంపూర్ణ న్యాయాన్ని సమకూర్చే నెపంతో అంతులేని వాయిదాలు వేయడం, వాయిదాల మధ్య మాసాలు గడచిపోవడం, దస్తావేజులు, ఉప దస్తావేజుల విశ్లేషణలు ఈ కాల హరణానికి మూలం. జడ్జీల కొరత అన్నిటికి మించిన అవరోధం. యుద్ధ ప్రాతిపదికపై కాయకల్ప చికిత్స వినా " ధర్మాన్ని " దక్కించుకోలేం.

(4) న్యాయవ్యవస్థ వైఫల్యం సమాజంలో అనేక ఆనర్థాలకు దారి తీస్తుంది. మంచి ప్రభుత్వం పౌరులందరిని మంచి పనులను చేయడానికి ప్రోత్సహించి, చెడుకు దూరంగా ఉంచుతుంది. చెడు చేసినందుకు తగిన శిక్ష తప్పదనే భయం, చట్టం పట్ల విశ్వాసం, ప్రభుత్వం పట్ల భక్తి, చట్టం ముందు అందరూ సమానులనే విశ్వాసం సంఘం, సమాజంపట్ల అభిమానాన్ని కల్పిస్తుంది. సంఘ వ్యతిరేక

శక్తులపట్ల ఏహ్యాభావాన్ని కల్పిస్తుంది. అలాంటి పరిస్థితులలో సంఘ వ్యతిరేక శక్తులకు ఆదరణ పూర్తిగా తగ్గుతుంది. తమ న్యాయసమ్మత సమస్యల పరిష్కారానికి నలుగురు పెద్ద మనుష్యులు, బుద్ధిమంతుల తోడ్పాటు అవసరమవుతుంది. స్నేహం, సహకారం, సాత్వికతలాంటి సద్గుణాలు సామాజిక జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. దుర్మార్గులు సంఘ వ్యతిరేక శక్తులు సంఘానికి భయపడతారు. రాజకీయాల్లో తల దూర్చడానికి సాహసించరు. రాజకీయ కాలుష్యం తగ్గి ప్రజా స్వామ్యం న్యాయంపట్ల ప్రజాబాహుళ్యం తమ విశ్వాసాన్ని ఇనుమడించుకుంటుంది. నేరస్థులకు రాజకీయ రక్షణ తొలగినప్పుడు పరిశుభ్రమైన రాజకీయాలు నేరమయం కానేరవు. న్యాయ దేవత ఆత్మ విశ్వాసంతో తన ధర్మస్థాపన కర్తవ్యాన్ని నిరాటంకంగా నిర్వహిస్తుంది.

(5) న్యాయవ్యవస్థ వైఫల్యం కారణంగా సమాజం, రాజకీయం, నేరమయమైపోయే హెచ్చరికను గమనించినాం. రాజకీయాలు నేరమయమై ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తూ అసలు శాంతి భద్రతలకే తీరని హాని జరిగే దుస్థితి నాగరిక ప్రపంచాన్ని కలవరపెడుచున్నది. ఎన్నికల కమీషన్ వారి అంచనా ప్రకారం అన్ని రాష్ట్రాలల్లోని 4072 మంది ఎన్నికయ్యే శాసనసభ్యుల్లో 700 మందికి పైగా నేర చరిత్రగలవారున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం వీరి శాసనసభ సభ్యత్వాలను రద్దు చేసినా వీరు తమ రాజకీయ సంబంధ బాంధవ్యాల బలంతో, ధనబలం, కండబలంతో కొనసాగిస్తున్న దౌర్జన్యకాండ సమసిపోదు.వారు చేసే అకృత్యాలు అన్యాయాలకు తెరపడదు. న్యాయవ్యవస్థ మేల్కొని పౌర జీవితానికి శ్రీరామరక్షగా పునరుజ్జీవం పొందడమొక్కటే సామాజిక ఆరోగ్యం, శాంతి భద్రతల పరిరక్షణకు శాశ్వత పరిష్కారం. నేరం రాజకీయ రక్షణ పొందడం, రాజకీయం నేరమయంకావడం, వీటి మధ్య న్యాయం కనుమరుగైపోవడం ఈనాడు దేశ వ్యాపితంగా అల్లుకుపోతున్న అంటువ్యాధి దీన్ని పోషించి రక్షించేవారు త్రిమూర్తులు 1. రాజకీయ నాయకులు, 2) పోలీస్ అధికార్లు, 3) నేరస్థులు. వీరు ఒకరినొకరు రక్షించుకుంటూ సమాజాన్ని నిలువుదోపిడికి గురిచేస్తున్నవారు. పైన వివరించినట్లుగా బలమైన న్యాయవ్యవస్థ యొక్క ధృడమైన జోక్యం మాత్రమే ఈ ముఠాను చేదించి చీల్చి చెండాడగల్గుతుంది. ఈలక్ష్యంతో న్యాయవ్యవస్థల సంస్కరణ జరగాలి.

(6) న్యాయ పంచాయితీలు వ్యవస్థీకృతం కావడం అత్యవసరం. చరిత్రలో న్యాయ పంచాయితీల ద్వారా సాధించి సత్వర న్యాయం గురించి చాలా సంతృప్తిగా విన్నాం. నేరస్థులు నేరానికి గురైనవారు న్యాయ నిర్ణేతలంతా ఒకే గ్రామస్తులు కావడంవలన నేరారోపణల వెనకగల సాక్ష్యాదారాలను న్యాయ నిర్ణేతలు సులభంగా అవగతం చేసుకునేవారు. నేర నిర్ధారణకురాగల్గేవారు. నలుగురు నిర్ణయించిన విధంగా తీర్మానం చేసేవారు. అవసరమైన మేరకు శిక్షలుగూడా విధించేవారు. సొంత గ్రామం గావడం, భాషాపరమైన ఇబ్బంది అసలే లేకపోవడం, విచారణ క్రతువును సులభంగా నిర్వహించ గల్గడం, నేరస్తుడిని నలుగురిలో లేక గ్రామ సభలో ఛీత్కరించడం ఆ తర్వాత జరిగిన తప్పును వెంటనే సరిదిద్దడం లేదా నలుగురి అభిప్రాయం ప్రకారం శిక్ష విధించడం జరిగేది. సత్యానికి మారు పేరుగా నిలిచిన ఈ న్యాయ పంచాయితీలు సత్వర న్యాయాన్ని సుసాధ్యం చేసినవి. ఈనాటి నాగరికతా ప్రపంచంలో వివిధ చట్టాలు విభిన్న నిబంధనల కారడవిలో పూర్వపు గ్రామ న్యాయ పంచాయితీ వ్యవస్థ యధాతథంగా కొనసాగడం దాదాపు అసంభవమని చెప్పువచ్చును. ఐనా గ్రామీణ సమస్యల్లో

కనీసం సగం సమస్యలు గ్రామ స్థాయి న్యాయ సంచాయితీ పరిధిలోకి రాగల్గుతాయి. న్యాయ పంచాయితీల నిర్మాణానికి దేశ వ్యాపిత ప్రచారం, ప్రయత్నం చట్టం ముసాయిదా రూపకల్పన గూడా జరిగింది. కాలక్రమేణా ఇతర మంచి పనులలాగే ఈ మంచి ప్రయత్నం కూడా మరుగున పడింది. తగు సంస్కరణల ద్వారా పరిమిత అధికారాలనిస్తూ ఈ న్యాయ పంచాయితీ వ్యవస్థ పునరుజ్జీవింపజేయదగింది. జిల్లా స్థాయి తదితర ఉన్నత స్థాయి న్యాయ వ్యవస్థపై అనవసర భారాన్ని తీవ్రంగా తగ్గించగల్గుతాం. దీని వలన కండబలంతో విర్రవీగే అసాంఘిక శక్తుల ఆటకట్టించవచ్చు. ప్రజాస్వామ్య పునాదులను పటిష్టం చేయవచ్చును. శాసనసభల్లో, పార్లమెంటులో చేసే అనేక ప్రజాహిత చట్టాల ఆచరణ బాధ్యతలను న్యాయబద్ధంగా గ్రామ పంచాయిత్,న్యాయ పంచాయిత్‌లకు దఖలుపరచవచ్చును. మండల, జిల్లా కార్యలయాలచుట్టూ తిరిగే గ్రామీణులకు వ్యయప్రయాసలు చాలావరకు తగ్గుతాయి. భూ పంపకం, భూ సంస్కరణచట్టాల ఆచరణ, పౌర సరఫరా వ్యవస్థ నిర్వహణ సాంఘిక సంక్షేమ కార్యక్రమాల సక్రమ ఆచరణ కుటుంబ తగాదాలు, ఆస్తి పంపకం వ్యాజ్యాలు లాంటి అత్యధిక కార్యక్రమాలను గ్రామీణ స్వపరిపాలన వ్యవస్థ సహాయంతో విజయవంతంగా నిర్వహించవచ్చు. ఏవైనా సమస్యలు తలెత్తితే అక్కడికక్కడే పరిష్కరించవచ్చు. న్యాయ పంచాయిత్‌గా న్యాయాలయ వ్యవస్థల నిర్మాణం వాటి పనితనం గురించి దేశ వ్యాపితంగా అనేక అనుభవాలున్నవి. వీటి గురించి “ లా కమీషన్” వారు తాము ప్రభుత్వానికి సమర్పించిన 114వ నివేదికలో వివరాలను పొందుపరచియున్నారు. అందులో వాటి విధులు, పరిధి, పరిమితుల గురించి చక్కని సలహాలను పొందుపరచియున్నారు.

(7) న్యాయ నిర్వహణ చట్టాలు, వాటి నిబంధనలు సరళంగాఉండి సామాన్యునికిగూడా అర్ధమయే విధంగాఉండాలి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల న్యాయశాఖలు ఈ ప్రధాన అంశాన్ని తమ లక్ష్యంగా పెట్టుకోవాలి. న్యాయ ప్రక్రియలన్నీ సూటిగా చిక్కులు లేని విధంగా జాప్యానికి వీలులేకుండా ఉండాలి. చట్టాల సరళీకరణ,నిబంధనల నవీకరణ, కోర్టు ప్రక్రియల సౌలభ్యం సాధ్యపడుతూ సత్వర న్యాయం ప్రజలకి అందుబాటులోకి రావాలంటే మన రాజ్యాంగంలోని 312 పరిచ్ఛేదం క్రింద భారతీయ న్యాయసేవా సంస్థ అను అధికార వ్యవస్థ నిర్మాణం చేయడం అవసరం. ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్‌లలాగే జిల్లా స్థాయి జడ్జిలంతా ఈ ఐ.జె.యస్ ట్రైనింగు పొందినవారై ఉండాలి. అప్పుడు వారిలో తమ శక్తి సామర్థ్యాలు అవగాహనా సామర్థ్యం తగు మోతాదులో సంతరించుకుంటాయి. వారు తమ బాధ్యతల్ని పారదర్శకంగా జవాబుదారితనంతో ఉన్నత స్థాయిలో నిర్వహించగల్గుతారు. అన్యవర్గ అలవాట్లన్నిటికి దూరంగా ఉంటూ పవిత్ర న్యాయ నిర్లేతల స్థానానికి గౌరవ ప్రతిపత్తులను సమకూర్చుతారు. వీరే జిల్లా స్థాయికి దిగువగానుండే న్యాయాధికారులను ఎంపికచేస్తూ వారి పనితనాన్ని పర్యవేక్షించగల్గుతారు. దీనితోపాటు న్యాయ నిర్వహణ విధానాల్లోగూడ మౌలిక సంస్కరణ ఎంతైనా అవసరం.

(8) ఆధునిక న్యాయశాస్త్రం వెలుతురులో సివిల్, క్రిమినల్ సాక్షాల సేకరణ (ఎవిడెన్స్‌లా) చట్టాలు వాటి సిద్దాంతాలు ఈ నాటికీ అనివార్యం, ఆచరణయోగ్యమేఅయినా శతాబ్దాల తరబడి వాటినను సరించడంలో చోటు చేసుకున్న బూజును వదిలించవలసియున్నది. చేసిన పనినే తిరిగి చేయడం, రాసిందే రాయడం కారణంగా న్యాయ నిర్దారణ ప్రక్రియల్లో అనేకమైన అనవసర పద్ధతులు

చోటుచేసుకున్నవి. అనవసర జాప్యానికి అర్థరహిత వాయిదాలకిదే మూలం. దీని ఫలితంగా కక్షిదారులు, వారి ప్రతినిధులు విసిగివేసారి పోతున్నారు. "ఆలస్యం అమృతం విషం " అన్నట్లు చివరకు న్యాయ నిర్ణయమే జరిగినా అది సకాలంలో జరగనందున నిష్ప్రయోజనం అవుతున్నది. న్యాయనిర్ణయం అన్యాయంగా పరిణమిస్తుంది. సిద్ధాంతాలు, సూత్రాలు ఎంత శిరోధార్యమైనవి. వాటికి కాలదోషం పట్టరాదు. వాటిని కాలానుగుణంగా సంస్కరిస్తే తమ ప్రయోజనాన్ని పరిరక్షించుకుంటాయి.

ఉదాహరణకి ఒక నేర నిర్ధారణ సూత్రాన్నే పరిశీలిద్దాం. 100మంది నేరారోపణల్ని ఎదుర్కుంటుంటే వారిలో 90మంది నేరస్థులు నిర్దోషులుగా శిక్షలనుండి తప్పించుకున్నా ఫరవాలేదుగాని మిగిలిన పదిమంది అమాయకులు అన్యాయంగా శిక్షించబడగూడదని నేర నిర్ధారణ న్యాయశాస్త్రం చెబుతున్నది. సత్యం పట్ల అపారమైన నమ్మకాన్ని ప్రకటిస్తున్నట్లు అందరిని ఆకర్షిస్తున్నది. కాని జరుగుచున్నదేమిటి? ఈ సూత్రాన్ని అడ్డంపెట్టుకుని నిజంగానే అత్యధికులుగాఉన్న నేరస్తులు శిక్షలనుండి తప్పించుకుంటున్నారు. వారే తిరిగి నేరాలకు తెగిస్తున్నారు. ఈనాటి సామాజిక పరిస్థితి దీనికి ప్రబల సాక్ష్యం. న్యాయస్థానాలు న్యాయశాస్త్రాలు సమాజాన్ని ఉద్ధరించడానికి ఉద్దేశించ బడినవిగాని నేరస్థులను సంఘ వ్యతిరేక శక్తులకు ప్రేరణ కల్పించడం కొరకుకానేకాదు. " సాక్ష్యం" న్యాయ నిర్ధారణకు ప్రాణప్రదమే. ఐనా అన్ని సమయ సందర్భాలలో సాదృశ్యసాక్ష్యం లభించక పోవచ్చును. పరిసరాలు, నిష్పక్షపాత సాక్షి కథనాలు నేర నిర్ధారణలో అమూల్యమైనవి కావచ్చును. సామాజిక స్పృహ, శాస్త్రీయ విజ్ఞానాన్ని సమన్వయ పరుస్తూ సముచిత నిర్ణయం చేయవలసిన న్యాయ మూర్తి సమాజానికవసరం. ఇదే విధంగా పన్నులు, కాంట్రాక్టులు, భూ సంబంధ చట్టాలు తదితర చట్టాలను అమలు పర్చడంలో న్యాయాధీశుల పరిణత చట్టబద్ధతను ఇనుమడించడం చాలా అవసరం. సభ్యసమాజం తలదించుకునే విధంగా స్త్రీలపై పెరిగిపోతున్న అత్యాచారాలు, తెల్లచొక్కా నేరాలు పౌర జీవితాన్ని దుర్భరం చేస్తున్నవి. మనదేశంలో పెట్టుబడులు పెట్టదలచుకున్నవారు గూడా వెనకడుగువేస్తున్నారనే వార్తలు దేశ గౌరవానికి ఘోరమైన భంగపాటు పరిస్థితి కల్పిస్తున్నాయి. న్యాయ వ్యవస్థలోని కొన్ని సిద్ధాంతాలు, అనేకమైన పద్ధతులు, కార్య విధానాల సంస్కరణకై దేశానికి ఒక సర్వోన్నత జ్యుడిషియల్ కమిషన్ నియామకం, జ్యుడిషయల్ సర్వీసెస్‌లాంటి ట్రైనింగ్ వ్యవస్థ రూపకల్పన వాటి ఆచరణ అత్యవసరం. సమున్నత కోర్టుల మధ్య పనివిభజన పని విధానంపై గూడా సంస్కర్తలు తమ దృష్టిని పారించడం అవసరం. హైకోర్టులు, సుప్రీంకోర్టులల్లో నిర్వహించదగిన ప్రధానాంశాలు, రాజ్యాంగ అంశాల నిర్వచన, రాష్ట్రాల మధ్య ఏర్పడే వ్యాజ్యాలకే పరిమితం కావాలని ఆమేరకు జడ్జీల సంఖ్యను తగ్గించాలేగాని పెంచగూడదని అనుభవజ్ఞుల అభిప్రాయం. వివరాలను జ్యుడిషియల్ కమిషన్ వారికి వదలినా నగ్నంగా కనబడే " వాయిదాలు ", వాయిదాల కాలపరిమితి మొత్తం కేసు పరిష్కరించే కాల నిర్ణయం లాంటి అంశాలను ఇక్కడ గుర్తు చేయక తప్పదు. దేశ ప్రధానిని హత్య చేసిన హంతకులకు శిక్ష విధించడానికి ఒక దశాబ్దానికి మించిన కాలం అనసరమైంది. ఒక పరిశ్రమాధిపతి చెల్లించవలసిన పన్నుల బకాయిలను తేల్చడానికి ఒకటిన్నర దశాబ్దం అవసరమైంది. ఈ లోగా ఆ పరిశ్రమ మూతపడటమో లేదా వేరే పేరుతో పునరుద్ధరణ జరగడమో జరిగిపోతున్నది. నల్లధనం కూడబెట్టి " హవాలా " పద్ధతిలో వేలకోట్ల ప్రజాధనం సప్తసముద్రాలు దాటి పోయిన తర్వాత రుణ దాతలైన బ్యాంకర్లు చేతులు ముడుచుకొని నిశ్చేష్టులుగా ఉండి పోవడం

ప్రతి పారిశ్రామిక కేంద్రంలో అనుదినం అనుభవిస్తున్న అక్రమం. బ్యాంకుల యజమానులు తమ కాగితాలపై నున్న " నిష్ప్రయోజనకర ఆస్తుల చిట్టాలను " (ఎన్.పి.ఎ) చూస్తూ రోదించడం గమనార్హం. గ్రామ సీమల్లో భూములు, గనులకు సంబంధించిన కుంభకోణాల కథనాలు వింటే కంట తడిబెట్ట వలసిన దుర్గతి మన మేధావి వర్గానికి దాపురించింది. న్యాయవ్యవస్థలో జరిగే సంస్కరణలు ఇందులో సగం దు:ఖాన్ని తగ్గించగల్గుతాయి.

జ్యుడిషియల్ కమిషన్ నియమాకం ప్రస్తావన, న్యాయ వ్యవస్థ సంస్కరణతో విడదీయరాని విధంగా ముడిబడియున్నది. ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థలుగల ప్రపంచ దేశాలన్నిటిలో ఈ కమిషన్‌లు పనిచేస్తున్నవి. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు వారు ఇటీవల ఒక కేసులో తీర్పునిస్తూ చెప్పిన సిద్ధాంతంతో పూర్తిగా విభేదించిన న్యాయశాస్త్ర కోవిదులు తమ భిన్నాభిప్రాయాన్ని కుండ బ్రద్దలు గొట్టినంత స్పష్టంగా తెలియచేస్తున్నారు. వ్యవస్థ ఎంత సమున్నతమైనదైనా తన నిర్వాహకులను తామే నియమించుకోవడం అప్రజాస్వామ్యం, అసంగతం. సుప్రీంకోర్టు జడ్జీలతో సహ హైకోర్టు జడ్జీల నియామకంలో న్యాయ నిర్లేతలతోపాటు కార్యనిర్వాహకవర్గం, శాసనసభల పాత్ర ఉండితీరాలి. ఎవరెవరు ఎంతెంత మాత్రమనే వివరాలు సంబంధించిన వారి విజ్ఞతకే వదలడం ఉచితం. అలాగే ఒక అప్రయోజకుడైన జడ్జిని పదవీచ్యుతుడిని చేసే విధానాన్ని రాజ్యాంగం పొందుపర్చింది. గత ఆరుదశాబ్దాల కాలంలో పార్లమెంటు ఒకే ఒక జడ్జిగారి నిర్వాకం గురించి చర్చించగల్గింది. ప్రజాస్వామ్య బద్ధంగా నియమించబడే జ్యుడిషయల్ కమీషన్ జడ్జీల నియామకం, పర్యవేక్షణ, వారి తొలిగింపు బాధ్యతల్ని సమర్ధవంతంగా నిర్వహించగల్గుతుంది.

(9) శాసనసభ, కార్యనిర్వాహకవర్గం, న్యాయ వ్యవస్థలు సుపరిపాలనలో అత్యంత కీలకమైన పాత్రలను పోషించే రంగాలు. ఇవి ప్రజలచేత, ప్రజల కొరకు ప్రజల ద్వారా ఎన్నికగాని, ఎంపికగాని అయ్యే సేవా సంస్థలు. ఇది అనుదినం అభ్యుదయకర పరివర్తనలతో, సమ్మిళితంగా ప్రజాసమస్యలన్నిటిని పరిష్కరిస్తూ ప్రజాస్వామ్యాన్ని మున్ముందు నడిపించవలపిన సృజనాత్మక, క్రియాశీల వ్యవస్థలు సాధ్యమైనంత త్వరగా సంక్షేమ, సమసమాజాన్ని స్థాపించి బహుజనహితాన్ని బహుజన సుఖాన్ని సాధించవలసిన కీలక వ్యవస్థలు.

వందల సంవత్సరాల వలసపాలన రాచరిక పాలనలనుండి స్వాతంత్ర్యాన్ని పొందిన మన ప్రజలు రాజకీయ నాయకులు తమ వాగ్దానాలను నిలబెట్టుకుంటూ దేశ బహుముఖాభివృద్ధికి పాటుపడతారని ఆశించి నాల్గు పంచవర్ష ప్రణాళికలు గడిచినా సామాన్యుని పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండడాన్ని చూస్తూ నైరాశ్యానికి గురి అయినారు. ఆ తర్వాత మరో నాల్గు పంచవర్ష ప్రణాళికలకాలంలో ప్రభుత్వ యంత్రాంగం పంచాయితీ రాజ్ వ్యవస్థలు తమను ఉద్ధరిస్తాయని భ్రమపడ్డారు. వారి ప్రచారపటాటోపాన్ని నమ్మినారు కాని మాటలు కోటలు దాటడమే కాని కాలు గడపదాటలేదు. చివరకు మిగిలిన న్యాయవ్యవస్థ తమ స్వతంత్ర, నిష్పక్షపాత, నిర్ణయాలతో సామాన్యుడిని గూడా మేల్కొల్పింది, తట్టి లేపింది. ధర్మ దేవత విజృంభించి అన్యాయాలన్నిటిని అంతమొందిస్తుందని ఆశించినారు. ఇప్పటికి ఆశిస్తున్నారు. దేశ బంగారు భవిష్యత్తుకు బాసటగా న్యాయవ్యవస్థ నిలుస్తుందని మనసా వాచా నమ్ముచున్నారు. న్యాయవ్యవస్థలో గూడా చోటుచేసుకునే

అపభ్రంశాలు అవాంతరాల గురించి వింటున్న వార్తలు దిగ్భ్రాంతికి గురిజేస్తున్నాయి. ఆశావాదులుగా "ధర్మాత్ములైన" భారతీయులుగా కాలం గడుపుచున్నారు.

పై మూడు స్థంభాలకు తోడుగా నాలుగవ స్థంభంగా సమాచార వ్యవస్థ అద్వితీయంగా అభివృద్ధిలోకి వచ్చింది. సమాచారం సదాచారంగా ప్రజాచైతన్యాన్ని పెంచవచ్చునుగాని అభ్యుదయానికి మూలమైన ఉత్పత్తి సాధనాలను స్థూల, సూక్ష్మ మౌలిక సదుపాయాల్ని కల్పించలేదు. ఈ లోటును తొలగించగలిగేవారు రాజకీయ నాయకులు, అర్థశాస్త్రవేత్తలు, సామాజిక శిఖామణులు వారి అనుయాయులు మాత్రమే. వీరందరిలో సాత్వికతా సుగంధం, సమన్వయం, ప్రజాభిప్రాయ నిర్మాణానికి ప్రబలంగా తోడ్పడుతుంది. ఈ 4వ ప్రజాస్వామ్య స్థంభమైన (ప్రచురణ, ప్రసరణ)ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అందిస్తున్న సేవలు కొనియాడదగినవి. ఇందులో గూడా కాలక్రమేణా చోటుచేసుకుంటున్న అవ్యవస్థను మొగ్గలోనే త్రుంచివేయడం విజ్ఞులంతా అంగీకరిస్తున్న అవసరం. చరిత్ర పుటల్ని తిరగేస్తే తేటతెల్లంగా అగుపించే పరమసత్యం ప్రజాచైతన్యం. చైతన్యవంతులైన ప్రజలు తమ సుసంఘటిత శక్తితో సాధించని అభ్యుదయమంటూలేదు. వెనకటికి సామ, దాన, భేద, దండోపాయాలననుసరించి విజయఢంకా మోగ్రించినారు. ప్రపంచీకరణ నేపధ్యం, సమాచార విప్లవ సాధనంతో అత్యల్ప త్యాగాలతో అత్యధిక విజయాలను సాధించే మంచి రోజులు వచ్చినవి.

## పోలీస్ వ్యవస్థ

పోలీసును చూడగానే పాలక వ్యవస్థ నిజ స్వరూపం కండ్లకుగట్టినట్లుగా ఆగుపడుతుంది. న్యాయవ్యవస్థ నిష్పాక్షికతను తెలియచేయడానికి ధర్మదేవతకు రెండు కండ్లు అగుపడకుండా కట్టుగడుతారు కాని అంతటి నిష్పక్షపాత మార్గదర్శకుడు పోలీస్ వాడు గూడానేమో అనిపిస్తుంది. పోలీసు వ్యవస్థ నిర్వహిస్తున్న బరువు బాధ్యతల్ని వివరిస్తే సంస్కరణల అవసరం. ఆ శాఖలో అత్యంత ప్రధానమనే సత్యాన్ని కాదనే వారు ఉండదు. వారు అష్టకష్టాలు పడుతూ నిర్వహించే కొన్ని బాద్యతలు పరిశీలనార్థం. నేర నిరోధం, అరాచకాల నియంత్రణ, గూఢచార వ్యవస్థ నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల రక్షణ, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాధికారుల భద్రత వారు నిర్వహించే కొన్ని బాధ్యతలు వీటి వలన వారి ప్రధాన కర్తవ్యమైన నేర నిరోధక, శాంతి భద్రతల పరిరక్షణ తీవ్రంగా దెబ్బతిన్నది. సామ్రాజ్యవాదం, దాని పునాదులుగా పనిచేసిన రాచరిక అర్థ ఫ్యూడల్ వ్యవస్థలకాలంలో పోలీసులచే నిత్యం చాకిరి చేయించుకోవడంతోపాటు గ్రామీణ, పట్టణ ప్రజల్ని ప్రభుత్వాలకు బానిసలుగా తయారుచేయడం ఎదురు మాట్లాడినవాడిని క్రూరంగా హింసించి అణచివేయడం గూడా వారికి అప్పుడున్న అమానుషనమైన బాధ్యత. పాలక వర్గాల మొత్తం సిబ్బందిలో పోలీస్ శాఖకు సంబంధించిన వారే నేరం, హింస, అణచివేతల్లాంటి పాశవిక చర్యలు, వాటికర్తలకు అతి సన్నిహితంగా ఉండవలసిన సంస్కృతి సాంప్రదాయాలకు వారసులు కావలసివచ్చింది. పోలీసులు చెప్పిందే న్యాయం చేసేదే ధర్మంగా చలామణిలోకి వచ్చింది. దీన్ని ప్రశ్నించేవారంతా దండనలననుభవించవలసిన అభాగ్యులు. ఇంతటి పటుతర అవ్యవస్థను సంస్కరించడం అసలు సాద్యమా అని ప్రశ్నించేవారు లేకపోలేదు. ప్రజాస్వామ్యం ప్రజలందరి శాంతియుత సుఖమయ జీవితానికి అలవాలం. అన్ని రంగాలలో ఈ సుఖ శాంతులను సాధించడానికి అవసరమైన మానవ శక్తి పోలీస్ వ్యవస్థనే. దాన్ని తాత్వికంగా విశ్వ

విజ్ఞానపరంగా ప్రజాస్వామ్య వ్యవస్థ చేతిలో పదునైన సాధనంగా తీర్చిదిద్దడమే పోలీసు వ్యవస్థ సంస్కరణల ప్రధానోద్దేశం.

ఈనాడు మన దేశ ప్రభుత్వాల బహుముఖ వైఫల్యాలను వేలెత్తి చూపని పౌరుడంటూ లేడని అంటేదాన్ని కాదనే వారుండరు. ప్రభుత్వం తీవ్రమైన పాలనా సంక్షోభంతో కొట్టుమిట్టాడు చున్నది. శాంతి భద్రతల పతనం రాజకీయాలు జనాకర్షణ పథకాలల్లో పోటీపడడం అవి నేరమయం కావడం, ధనబలం, కండబలం, రాజకీయం సమ్మిళితం కావడం, అధికారం అపారంగా కేంద్రీకృతం కావడం అసమర్థ న్యాయవ్యవస్థ ఇవన్ని పై సంక్షోభానికి చిహ్నాలు, వీటన్నిటిలో అగ్ర తాంబూలాన్నందుకునే నేర నిరోధం, శాంతి భద్రతల పరిరక్షణ, చట్టబద్ధ పరిపాలన నివ్వడంలో విఫలత చెందిన వ్యవస్థ పోలీస్ వ్యవస్థనే. దురదృష్టవంతుడైన సామాన్య పోలీసును చూడగానే పై చిత్రపటం ఆవిష్కృత మవుతుంది. (2) శాంతియుత పౌర జీవితానికి తగు భద్రతను సమకూర్చలేని పోలీస్ వ్యవస్థ, త్వరగా చౌకగా న్యాయాన్ని అందించలేని న్యాయవ్యవస్థల కారణంగా సామాజిక జీవితం దుర్భరమై పోతున్నది. ఈనాటి పోలీసు వ్యవస్థ వైఫల్యాల గురించి ఎంతో విమర్శించవచ్చు. కాని ప్రతి మంచి పరిపాలన నిర్వహణకి మంచి పోలీస్ వ్యవస్థ అనివార్యం. పేరులోనే దాగియున్న 'బలప్రయోగం' 'నిర్బంధం' 'పోలీసు'కు మారుపేర్లు. చెడును అణచివేస్తేనే మంచికి రక్షణ ఉంటుంది. బహుముఖాలుగా వ్యాపించిన సామాజిక జీవితానికి సమర్థవంతమైన పోలీసు వ్యవస్థ ప్రాణప్రదమైంది. ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రేళ్ళూనాలంటే కొందరికే పరిమితమయిఉన్న అధికార కేంద్రీకరణస్థానే పదిమంది భాగస్వాములయ్యే అధికార వికేంద్రీకరణ సాధ్యపడాలి. అధికారం రుచిమరిగిన వ్యక్తులు, సమాజాలు తమ అధికారాన్ని సులభంగా వదలుకోరు. అవసరమైతే తమ అధికారాన్ని పదిలపరచుకోవడానికి పడరాని పాట్లు పడతారు. ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రతిష్టించడం మొదలుకొని అది పుష్పించి ఫలించే వరకు దానికి రక్షణ కవచం అవసర ముంటుంది. ఆ రక్షక భటులే " సేవ "కు కంకణ బద్ధులయిన పోలీసులు, వారి అధికారగణం, వారి అమూల్య వ్యవస్థ. ప్రజాస్వామ్య వ్యవస్థలో పోలీసులు మరో అవతారంతో మానవీయ విలువల్ని పోషిస్తారు.

(3) స్వేఛ్ఛాయుత జీవితం, చట్టబద్ద పరిపాలన అందరికంటే అధికంగా ఆర్థికంగా, సామాజికంగా, బలహీనంగానున్న వర్గాలకవసరం. ఈ వర్గాలే అందిరికి లోకువ. వీరి హక్కుల రక్షణ సామాజిక బాధ్యత ప్రభుత్వాలవిధి. పోలీసులే ఆ విధి నిర్వాహకులు. శారీరకంగా, మానసికంగా, శక్తివంతమైన పోలీస్ వ్యవస్థ ఆయా ప్రభుత్వాల మనుగడకే శ్రీరామరక్ష. అంతటి సేవా సంస్కృతిని ప్రదర్శిస్తూ సామాజిక ఔన్నత్యాన్ని చాటి చెప్పగల రంగానికి ఎన్ని సేవలనందించినా తక్కువే. సుపరిపాలన సాధన దిశలో సంస్కరణల పాఠ్యాంశాల్లో ఈ అంశానికి ప్రధాన పాఠంగా ఎన్నుకోవడం అందుకే.

ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థ నిర్వహణలో చట్టాలకి చట్టబద్ద పాలనకి ఎనలేని ప్రాధాన్యత ఉంటుంది. పౌరులందరికి చట్టబద్ద పాలనను సమానంగా అందించడం ప్రజా ప్రతినిధులతోపాటు ప్రజాసేవలో మొదటి శ్రేణికి చెందిన పోలీసులదే. వారు చట్టాన్ని గౌరవించి పాటించే వారికి గౌరవాన్నీ చట్టాన్ని ధిక్కరించే వారికి దండన, నిర్బంధాలకుగురిచేస్తారు. న్యాయాన్ని మనం రక్షిస్తే అది మనల్ని

రక్షిస్తుంది. ప్రజావ్యతిరేక పాలనా వ్యవస్థల రక్షణలో పొందిన అప్రతిష్ట నుండి బయటపడడానికి పోలీసులు చాలాకాలం కష్టపడవలసి వస్తుంది. ఇంతగా అభివృద్ధి సాధించిన దేశంగా గొప్పలు చెప్పుకునే మన దేశంలో సుమారు సగం జనాభా నిరక్షరాస్యులుగాను కేవలం 2.7 శాతం జనాభా సంఘటిత కార్మికవర్గంగానుండడం గమనార్హం. శ్రామిక శక్తిలో 90 శాతం భద్రతలేని జీవితాలనను భవిస్తున్నారు. సంఘటిత పౌర సమాజమే అత్యధికులుగానున్న పామర జనానికి బాసట. అలాంటి సమయంలో మార్గదర్శకులుగా ఉండవలసిన వారిలోనే స్వార్థం, ద్వేషం,కక్షలు, కార్పణ్యాలు, సంఘ వ్యతిరేక చర్యలు, దౌర్జన్యాలు పెచ్చుపెరిగి సామాజిక జీవితాన్ని దుర్భరం చేయడాన్ని కండ్లారా చూస్తున్నాం. వెనకటి గుణం మారని పోలీస్ వ్యవస్థ వీరికి వెన్నుదన్నుగా నిలిచి సంఘ సంస్కర్తలుగా ఉన్న కొద్దిపాటి పౌరులను రాజకీయంగా ఇతరత్రా ఓడించె పనికి పూనుకోవడం లేక తోడ్పడడం ప్రజాస్వామ్య వాదులముందు గొప్ప ప్రశ్నగా నిలుస్తున్నది. అత్యధిక ప్రజలకు అత్యధికమేలును సమకూర్చవలసిన బుద్ధి జీవుల, ప్రజాతంత్ర వాదుల పక్షాన పోలీసులుండడం భావ్యం. చారిత్రక కర్తవ్యం. పాత పాఠాలన్నిటికి స్వస్తి వాచకం పలుకుతూ ప్రజాస్వామ్య, ప్రజాహిత పాఠాలను పోలీసులకు ఒంటబట్టించాలి. నూతన పాలకవర్గంగా అవతరించిన ధనాఢ్య వర్గాలు తమ ధన ధాహం, అధికార వాంచతో పోలీసు వర్గాలను ఉపయోగించుకుంటున్నారు. అన్ని దురలవాట్లకు గురిచేస్తూ పోలీసు వ్యవస్థకు మిగిలిన మచ్చను కడిగివేయలేకపోతున్నారు 1857 నాటి ప్రధమ స్వాతంత్ర్య పోరాటం అనుభవాల్ని దృష్టియందుంచుకొని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం 1861లో యావద్భారతదేశానికి ఒక పోలీసు చట్టాన్ని రూపొందించి అమలు పర్చింది. దేశభక్తి, దేశ స్వాతంత్ర్యం కొరకుగాని ప్రజల పౌరహక్కుల సాధన గురించిగాని నిర్వహించే ప్రతి ప్రజా ఉద్యమాన్ని తీవ్రంగా అణచివేయడం ఉద్యమ వాదులను కఠిన నిర్బంధాలకు గురిచేయడం ఈ చట్టం ముఖ్య ఉద్దేశం. తిరగుబాటు దప్ప ఈ చట్ట శృంఖలాలనుండి తప్పించుకునే మార్గంలేదు. అమరజీవి, విప్లవకారుడు షహీద్ భగత్‌సింగు నుండి సత్యాగ్రహి అయిన మహాత్మాగాంధి వరకు ఈ ధిక్కార మార్గాన్ని అనుసరించినారు.

ఇంతటి దుర్మార్గమైన 1891 నాటి పోలీసుచట్టం పూర్తిగా రద్దు అయ్యి దాని స్థానే స్వతంత్ర భారత ప్రజాస్వామ్య వ్యవస్థకుపకరించే నూతన పోలీసు చట్టాన్ని రూపొందించడం తక్షణ కర్తవ్యం. ఏది ఏమైనా ఈ విప్లవాత్మక మార్పును సాధించితీరాలి. పోలీసు వ్యవస్థ ప్రజాస్వామ్య వ్యవస్థ చేతిలో పదునైన ఆయుధంగా మారాలి. నామకహ రాజకీయ స్వాతంత్రాన్ని పొంది ఆ తర్వాత 6-7 దశాబ్దాల సుదీర్ఘకాలం గడచిపోయినా ఆర్థిక సామాజిక ప్రజాస్వామ్యం కొరకు 70 శాతం దేశ జనాబా పరితపించి పోతున్నప్పటికి దేశం మంచి భవిష్యత్తు గురించి ఆశించడం మాత్రమే మిగిలింది గాని దానిపై ప్రజలకు విశ్వాసం కలగడంలేదు. ధన్యాఢ్యవర్గాలు, కార్పోరేటు సంస్థలు తమ దేశ విదేశీ దాయాదుల బలంతో సాధ్యమైనంతకాలం ఆర్థిక, సామాజిక ప్రజాస్వామ్యానికి మంచి రోజులు రాకుండా పడరాని పాట్లు పడుతున్నారు. వీరు పోలీసు వ్యవస్థ సహాయ సహకారంతో ప్రజాతంత్ర ఉద్యమాలను అణచడానికై విశ్వ ప్రయత్నాలు జేస్తున్నారు. ఈనాటి పార్లమెంటరీ ఎన్నికల ప్రక్రియను వినియోగిస్తూ తమ ప్రాబల్యాన్ని సురక్షితం చేసుకోవాలనుకుంటున్నారు. నూతన ఆలోచనలకు ఆస్కారం లేకుండా కేవలం అధికారపక్షం చేతిలో వారి ప్రత్యర్థులనణచివేసే యంత్రంగానే పోలీసు వ్యవస్థ మిగిలితే దేశభవిష్యత్తు అంధకారబంధురమవుతుంది. ప్రజాస్వామ్య వాదులంతా సమయ స్ఫూర్తితో సంఘటితంగా

జోక్యం చేసుకోవడం అవసరం. అధికారాన్ని అనుభవిస్తున్న వర్గం కల్పించే అవరోధాలన్నిటిని సంఘటితంగా ఎదిరించి ఓడించవలసిన తరుణం అసన్నమైంది.

(4) అధికార పీఠానికి విధేయతతోపాటు పోలీస్ వ్యవస్థను పాతతరానికి ముడిబెట్టిన అంశాలు చాలా ఉన్నవి. కాలంచెల్లిన చట్టాలు వాటి నిబంధనలు, ప్రజాబాహుళ్యం అసహ్యించుకునే అలవాట్లు, గ్రహపాట్లు, ఎంత త్వరగా సంస్కరించబడితే ప్రజాస్వామ్యానికి అంత మేలు చేకూరుతుంది కాని అన్నిటిలాగే ఈనాటి అధికారగణం అడుగడుగునా సంస్కరణలకి అడ్డుగా మారుతున్నది. వాగ్దానాలు చేసి గూడా వాటిని భంగపరుస్తున్నట్లే పోలీసు సంస్కరణల గురించి దశాబ్దాలుగాచేసిన వాగ్దానాలను తుంగలో త్రొక్కేస్తున్నది. పుణ్యకాలందాటి పోవాలని చూస్తున్నది.

పోలీసు వ్యవస్థ వైఫల్యాలన్నిటిలో ముఖ్యమైంది నేర నివారణ రంగం. సమర్ధవంతమైన పోలీస్ వ్యవస్థ, న్యాయవ్యవస్థలుంటేనే ఈనాటి ఆధునికయుగంలో నేర నివారణ, నేర నిర్మూలన గురించి త్వరలోనే సాధ్యమని ధైర్యంగా చెప్పుకోగల్గుతాం. కాని ఆర్థిక వనరులు, కండబలం, ఆధునిక సమాచార ఆయుధ బలాబలాలల్లో పోలీసులకంటే నేరస్థులే అన్ని అంశాలలో బలీయంగా నుండడం గమనార్హం. న్యాయమూర్తులు అపార్ధం చేసుకోకపోతే దేశవ్యాపితంగా నేరానికి శిక్షించబడే వారి సంఖ్య 3 శాతం నుండి 6 శాతానికి మించకపోవడం యాధృచ్ఛికం కాదు. చట్టంలోని లొసుగులు ప్రభుత్వ న్యాయవాదుల సామర్థ్యంలోపం, న్యాయ నిర్ణేతల నిర్లిప్తత, పోలీసు అధికారుల జవాబుదారితనలోపం దీని వెనకనున్న ముఖ్యకారణాలు. ప్రజా జీవితాన్ని దినదిన ప్రవర్ధమానం చేసే లక్ష్యశుద్ధిగల వ్యక్తులు పార్టీలు రాజ్యమేలిననాడు, పౌర సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు తమ నిఘాను కేంద్రీకరించిన వేళ శాంతియుత, నేర రహిత సమాజం విశ్రాంతితో నిట్టూర్పు విడు స్తుంది. దేశం బాగుపడుతున్నదను ఆత్మ విశ్వాసంతో పౌరజీవితం విద్యాబుద్ధులతోముందడుగువేస్తుంది.

(5) నేర నివారణలో నేర విచారణ కీలకాంశం. దేశంలో అన్ని రాష్ట్రాలల్లో పోలీసు వ్యవస్థపై ఇంచు మించు ఒకే విధమైన బరువు బాధ్యతలు కేంద్రీకృతమైయున్నవి. దేశమంతా వలస పాలకుల వారసత్వాన్ని పొందింది. దేశ వ్యాపితంగా ఉమ్మడిగా బాధ్యతల నిర్వహించకతప్పని వ్యవస్థ ఇది. నేర విచారణ, దోపిడి దొంగల్ని పట్టుకోవడం, శాంతిభద్రతల్ని పరిరక్షించడం కొరకు అరాచక శక్తులందరిని అదుపులోనుంచుతూ వారిని నియంత్రించడం, గూఢాచార వ్యవస్థని పకడ్బందిగా నిర్వహించడం, ప్రభుత్వ ఆస్తులను రక్షించడం,ప్రముఖ పౌరులు, మంత్రులు శాసన కర్తల రక్షణ, ఇవి ఆ ఉమ్మడి కర్తవ్యాలు, సంఖ్యాబలంతో సహా అన్ని విధాలా బలహీనంగాఉన్న ఈ పోలీసుబలగానికి నిజంగానే ఇది శక్తికి మించినపని, మోయరాని ఈ బరువు బాధ్యత అణచివేత వినా మరో సాత్విక విద్యాబలం తెలియని అజ్ఞానం, ఆధునికయుగ ధర్మాల ఒత్తిడి, వారిలో ఒక మిశ్రమ మనస్తత్వాన్ని సంక్లిష్టమైన సంస్కృతిని సృష్టించింది. దీన్ని వివరించాలంటే ఆగ్రహం తప్ప అనుగ్రహంలేని అధికార వ్యవస్థ ఇది. పాపభీతి లేని పుణ్యఫలం ఆశించని నిర్జీవ యంత్రాంగమిది. పోలీసు వేషంలోనున్న రక్తమాంసాలుగల మానవమూర్తులేవీరు. స్వార్ధపర రాజ్యాధికార వ్యవస్థలు ఒకటికంటే మించి మరొకటిగా నేర్పిన అణచివేత విద్యలకు వారసులు వీరు. వేష భాషలు మొదలు కొంటే బుద్ధి కుశలతలవరకు తోటి మానవులతో విడదీయబడిన నిర్భాగ్యులు వీరు. వీరిని సంస్కరిస్తేనే వీరు సమాజానికి మేలుచేయగల్గుతారు.

వీరిలోగూడుగట్టుకునివున్న నకారత్మక గుణం స్థానే సకారాత్మక (నిర్మాణాత్మక) సద్గుణాన్ని ప్రవేశపెట్టడం జాతీయకర్తవ్యం. ఏది ఏమైనా ప్రతి ప్రభుత్వానికి వారి దృష్టిలో దుష్ట సంహరణ, శిష్టరక్షణలు దీని ప్రధాన కర్తవ్యమని ఇది అనివార్యమని ఆరంభంలోనే గమనించినాం. మంచిని అణచివేసే మారణా యుధాన్ని ఆ మూలాగ్రంగా సంస్కరించి మంచిని పెంచే, సద్భావనలను సృష్టించే సాత్విక దృష్టిగలిగిన వ్యవస్థగా, గుణాత్మకంగా మార్చాలి. ఇది సాధ్యం ప్రజాస్వామ్యంలో వారిలో నిద్రాణమై యున్న మానవీయ విలువల్ని మేల్కొల్పుతూ మానసిక విప్లవాన్ని సాధించగల్గుతాం. క్రమక్రమంగా దేశ భక్షక భటులుగా అపకీర్తిని మూటకట్టుకున్నవారందరికి కీర్తికిరీటాలు ధరింపచేయ గల్గుతాం. సంస్కర్తలకు విశ్వాసం అవసరం.

తిరిగి ఈనాటి పోలీసు వ్యవస్థ గురించి ఆలోచిస్తే శాంతి భద్రతల రక్షణ, నేర నివారణ, నిర్మూలన కర్తవ్యాలల్లో ఈనాడు పొందుతున్న వైఫల్యాలను సూక్ష్మదృష్టితో చూస్తేనే పరిస్థితిలో మార్పును సాధించగల్గుతాం. ఎవరో వస్తారు, ఏమో చేస్తారనే నిర్లిప్త మనస్తత్వంతో అధికార, ప్రతిపక్షాలు వ్యవహరిస్తే పరిస్థితిలో మార్పురానేరాదు. సూక్ష్మంలోనే మోక్షమున్నదన్నట్లు సంస్కరణల ప్రక్రియ ప్రారంభంగావాలి. అంశం చిన్నదైనా వనరులు కొంచెమైనా లక్ష్యశుద్ధితో ప్రారంభించాలి. ప్రతి సంస్కరణలో సాధించిన విజయమెంత చిన్నదైనా దాని పట్ల కొండంత విశ్వాసం ప్రజాబాహుళ్యంలో ఏర్పడుతుంది. వారి ప్రత్యక్ష భాగస్వామ్యం పరోక్ష చైతన్య వ్యాప్తికి దోహదపడుతుంది. అనతికాలంలో ఆయా సంస్కరణలు వేగవంతం కావడం జరుగుతుంది. సంస్కరణ భావం శక్తిమంతం కావడం జరుగుతుంది. పోలీసుశాఖలో వివిధ బాధ్యతలను వివిధ ఉపశాఖలు నిర్వహించాలి. వాటి అధికారులు, అధిపతులు వ్యక్తిగతంగా జవాబుదారులవ్వాలి. అ విధంగా జరిగినచోట ప్రతి బాధ్యత దాని నిర్వహణ వికేంద్రీకృత మవడమేగాక ఒక ప్రత్యేక విద్యగా పరిణమించింది. ఆ విజ్ఞానం, ఆ శాఖాధిపతుల క్రింది స్థాయి నిర్వాహకుల చైతన్య స్థాయిని, నేర్పరితనాన్ని, ఇనుమడింప చేసింది. సత్ఫలితాలనిచ్చింది.

వికేంద్రీకరణ ప్రక్రియ దాని వైశిష్ట్యం ఎంత గొప్పగా కొనియాడదగినదో, పోలీసు వ్యవ హారాలల్లో రాజకీయ నాయకుల అనుచిత జోక్యం అంతకుమించి ఖండిచదగినది. ఈనాటి పోలీసు వ్యవస్థ పతనానికి ప్రధాన బాధ్యతలు రాజకీయనాయకులేననడంలో అతిశయోక్తిలేదు. అనేక సందర్భాలలో వివరించబడిన విధంగా చరిత్రలోనే ఈ వ్యవస్థ ఒక అవ్యవస్థగా, అప్రతిష్ఠను పొందింది. మోయరాని పనిభారంతో కృంగిపోతున్న క్రింది స్థాయి పోలీసులపై ప్రజాస్వామ్యం పేరుతో ప్రజాప్రతినిధుల జోక్యం శృతిమించి రాగానబడ్డది. ప్రభుత్వం యొక్క అంశాలన్నిటితో పోలీసు వ్యవస్థకున్న సాధికార సంబంధాన్ని ఈ ప్రజా ప్రతినిధులు దుర్వినియోగం జేసుకోవడం నిత్యకృత్యమై పోయింది. " నాయకులు " అన్నిరంగాలలోని అధికారుల నియామకం వారి బదిలీలల్లో "లంచగొండి తనం", "ఆశ్రితపక్షపాతం" లాంటివి ప్రవేశపెడుతూ తిరిగి వారి చేత అనేక తప్పులు చేయించడం, డబ్బులు దండుకోవడం,పంచుకోవడం పరిపాటిగా పరిణమించింది. పరాకాష్టకు చేరిపోయింది. అధికార వ్యవస్థ అధికార పార్టీల కనుసన్నలలో బ్రతకాలని, ఈ విధి తప్పదనే దాస్యభావంతో సతమత మవుతున్న ఈశాఖలో స్వతంత్రత అనే జీవ శక్తిని సృష్టించాలి. ప్రభుత్వమనే విశాల దృక్పథంలో ఎవరూ సర్వస్వతంత్రులుకాలేరు. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పరస్పరాదీనులే. ఒకరి స్వతంత్ర

పని విధానాన్ని మరొకరు గౌరవించకతప్పదు. శాసనకర్తలు, మంత్రులకు తమ తమ విధి నిర్వహణ హద్దులు సరిహద్దులు – లక్ష్మణరేఖలున్నాయి. వాటనధిగమించ వీలులేదు కాబట్టి నేర పరిశోధన, నేర నివారణ, నేర విచారణలు, నేర నిర్మూలనకు ఉపాంగాలు అలాగే శాంతిభద్రతల రక్షణ, రవాణా విధి నిర్వహణ, గూఢచార వ్యవస్థ నిర్వహణ, పౌర ప్రముఖులైన అధికార, అనధికారుల ప్రాణరక్షణ స్వతంత్ర కర్తవ్యాలు. వీటిని కలగలిపితే కాటగలిచిన ఈనాటి పరిస్థితి తప్పదు. శాశ్వత సంస్కరణల సంగతి దేవుడెరుగుగాని మామూలు క్రమశిక్షణగూడా కరవవుతుంది.

నేర విచారణ కొరకు రాజ్యాంగబద్ధమైన నిష్ణాతులతో కూడిన స్వతంత్ర ప్రతిపత్తిగలిగిన ప్రత్యేక శాఖ నిర్మాణంతో ఈ సంస్కరణలు ఆరంభమవుతాయి. ఇది తమ ఉన్నతాధికారికి జవాబుదారిగా ఉంటుంది. అనేక నివేదికలు తెలియచేసినట్లుగా ప్రతి రాష్ట్రానికి ఒక ఉన్నత పర్యవేక్షణ సంస్థ నిపుణులతో కూడినది నిర్మాణం కావాలి. దానికి హైకోర్టు న్యాయమూర్తి స్థాయిగలవారు అధ్యక్షులుగా ఉండాలి. అతడు లేక ఆమె జీవితాంతం ప్రభుత్వోద్యోగం చేయరాదు. వారి సారధ్యంలోనే నేర పరిశోధన లేక విచారణ జరిగితీరాలి. పై పర్యవేక్షణా సంఘు నిర్మాణం నిపుణులు, సామాజిక పెద్దలతో పాటు సమర్ధులైన హైకోర్టు న్యాయమూర్తులు, ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకులచే జరగాలి. నేర విచారణ సంఘు అధికారబృందం నియామకం, బదిలీలు, క్రమశిక్షణ చర్యలన్నిటిపై ఈ పర్యవేక్షణ సంఘం తన ముద్ర వేయాలి. సమకాలిక ప్రభుత్వ అధికారులు, మంత్రుల ప్రమేయం ఉండరాదు. దీని స్వతంత్రతను నిష్పక్షపాతాన్ని ప్రోత్సహిస్తూ రక్షించవలసిన బాధ్యత ఇతర శాఖలన్నిటిపై ఉండాలి. నేర విచారణ సంఘు అధికారులు తిరిగి వారి మాతృసంస్థ పోలీసుశాఖలోకి వెళ్ళే వీలు లేకుండా క్రమశిక్షణ అమలు జరగాలి.

(6) స్థానిక స్వపరిపాలనా సంస్థల పరిధిలోని పనులన్ని చూడడానికి స్థానిక పోలీసు యంత్రాంగం వేరే ఉండాలి. వారి సేవలు స్థానిక సంస్థలకే పరిమితంకావాలి గాని ఇతర పోలీసు రంగాలకు హస్తగతం చేయవీలులేకుండా చూడాలి. పరిధుల విస్తరణతో అనుభవం రాదు సరికదా కాలహరణానికి దోహదం చేస్తుంది. అందుకు భిన్నంగా ఆయా బాధ్యతల లోతులు తెలిస్తే తలపెట్టిన పని విజయవంత మవుతుంది. విషయజ్ఞానం పెరుగుతుంది. స్థానిక పోలీసు అధికారుల పని ఇతర పోలీసుల పనితో సమర్ధవంతంగా సమన్వయం కావాలి. వీరికి స్థానిక కోర్టు న్యాయ నిర్ణేతగా ఉపయోగపడాలి.

రాజకీయ నాయకుల రక్షణ, గూఢచార వ్యవస్థ నిర్వహణ లాంటి ప్రత్యేక బాధ్యతలను కలగాపులగం చేయకుండా విడివిడిగా శాఖోపశాఖలకు అవి జవాబుదారిగానుండే విధంగా సంస్కరించ బడాలి. పాపభీతి, దైవభక్తి చరిత్రలో నీతి నియమాల పరిరక్షణకి ప్రబలంగా తోడ్పడినవి.

“ అధికారం – ధనం” జీవన పరమావధిగా పరిణమించి సంఘ జీవితాన్ని శాసిస్తున్న ఈ తరుణంలో “ రాజ్యాంగం ” “చట్టబద్ధత”లే మానవ సమాజ మనుగడ పురోభివృద్ధికి ఆధారం. చైతన్యవంతమైన పౌర సమాజానికి ప్రాణప్రదం.

అధికార కేంద్రీకరణ కొన్ని సందర్భాలాలలో సుపరిపాలన కవసరమైనా అనేక సందర్భాలలో పూర్తిగా అనవసరం. కాల క్రమేణా అధికార లాలస గల వారు చేసిన పని ఇది. ఒక పౌరుని

స్వతంత్రం, శాంతియుత జీవితానికి స్థానిక పోలీసులతో అత్యంత సన్నిహిత సంబంధముంటుంది. పోలీస్ ఆయా పౌరుని స్వేచ్ఛను హరించి ప్రాణానికి హాని కల్గించే అవకాశముంటుంది. ఇతర అధికారులు తమ అధికార దుర్వినియోగంతో చేసే హానికంటే అనేక రెట్లు అధికంగా అధికార దుర్వినియోగం చేసే పోలీసు జవాను లేక అధికారిచేయగల్గుతాడు. సామాజిక శాంతి, పౌరుల సుఖ సౌఖ్యాలన్నిటికి నీతిమంతులైన పోలీసులే బాసట. పోలీసుల కర్తవ్యాన్ని ఒక్కపదంతో బంధించాలంటే అది " సేవ" మన దేశ దౌర్భాగ్యాన "సేవ ప్రధాన"మైన సంస్థ "దండన" ప్రధానమైన సైన్యంతో నిర్మించబడింది. "హింస" "దండన" "అణచివేత"లే అయుధాలుగా పాలక వర్గాలు ఇలాంటి ప్రజావ్యతిరేక " కొయ్య మెదడు"గల సైన్యాన్ని ఏర్పరుచుకున్నారు. దీని తక్షణ ప్రక్షాళన సభ్య సమాజ ప్రధమ కర్తవ్యం.

(7) రక్షక భటుడుగా పోలీసు తమ విధి నిర్వహణ చేస్తూ ప్రజలచే గౌరవాన్ని పొందాలి. వారికివ్వబడే బాధ్యతలను తీవ్రంగా కుదిస్తూ, వికేంద్రీకరిస్తూ ఆయుధబలంతోపాటు సేవల శిక్షణ గూడా పొందాలి. అధికారులుగాని, వి.ఐ.పి.లకు బాసినగాగాని పొందే అగౌరవాన్ని అరికడుతూ ఉన్నత ఉత్తమ ప్రజాసేవకుడుగా గౌరవంపొందాలి. ఎట్టి పరిస్థితిలోనైనా నేరస్థులపై హింసను అనుమతించరాదు. కస్టడీలో మరణం పొందడం తాతలనాటి కథగా మిగిలి పోవాలి. సంఘానికి జవాబు దారుడిగా ప్రజాదరణకు పాత్రుడుగా మారాలి.

నేరాభియోగం, నేర విచారణ పూర్తిగా విడదీయబడాలి. నేర నిరూపణ ప్రక్రియతో నేరాభియోగం చేసిన వారికేలాంటి సంబంధముండరాదు. ప్రభుత్వ న్యాయవాదులు గూడా తమ ఉన్నతాధికారులకు జవాబుదారీగానుండాలి. వారి శాస్త్రీయ విజ్ఞానంతోపాటు వాస్తవాల వివరణ చాతుర్యంగలిగి తాము వాదించే నిందితులలో కనీసం 50 శాతానికైనా తగు శిక్షలు బడే విధంగా తమ వృత్తి సామర్థ్యాన్ని ప్రదర్శించాలి. ఈనాడున్న 3-6 శాతం శిక్షలు మన న్యాయ శాస్త్రంలోని లోపాలతోపాటు న్యాయ విచారణ తంతు, న్యాయ నిర్ణేతల నీతి నిజాయితీల వరకు ప్రశ్నార్ధకం కావడం అవమానకరం. అనవసర జాప్యాల నన్నింటిని తీవ్రంగా అరికడుతూ " సత్వర న్యాయమే సార్ధకం " అను సాత్విక భావాన్ని సిద్దాంతస్థాయికి లేవనెత్తాలి. 19వ శాతాబ్దంనాటి న్యాయవ్యవస్థ, ఎన్నికల వ్యవస్థ, పోలీస్ వ్యవస్థలకు సంబంధించిన చట్టాలకాలం చెల్లింది. 21వ శతాబ్దంలో వీటిని ఆమూలాగ్రంగా సంస్కరిస్తేనే ప్రజాస్వామ్యం పరఢవిల్లుతుంది. కేంద్ర ప్రభుత్వం నియమించిన యన్.యన్.వోహ్రా కమిటి దశాద్దాల క్రితమే ఈ సంస్కరణల ప్రాధాన్యత గురించి నొక్కి వక్కాణించింది. రాజకీయాలతో ఏలాంటి ప్రమేయం లేని స్వతంత్ర వ్యవస్థలుగా దీనిని నిర్వహించాలని ఉద్ఘాటించింది. 18 సంవత్సరాల తర్వాత ఈ నివేదిక వెలుగుజూచింది. తిరిగి కొన్ని సంవత్సరాలు గడిచినా ఈ విషయంపై ఆలోచించడానికి కేంద్రంవద్ద సమయం లేకకాదు. అసలు పాలకవర్గాలకు ఈ సంస్కరణ ఇష్టంలేదు. ప్రజాజీవితాన్ని భయ భక్తులతో శాసించే నిరంకుశ స్వార్ధపర వర్గాలకు ప్రజాతంత్ర సంస్కరణలపై అభిమానముండదు. ఆసక్తి అసలే ఉండదు. ఆనాటి నివేదికలో ఏయే రాజకీయ నాయకుడు ఎంతెంత ముడుపులు పుచ్చుకుని ఎవరెవరికి ఉద్యోగాలిచ్చినారు, రికమెండ్‌చేసి పదోన్నతి చేసినారు, స్థానచలనం చేసినారు. ఆ దళారీలెవరనే వివరాలతో సహ బహిర్గతం చేయడం జరిగింది. ఐనా ఒక్కరిలో గూడా చలనం లేదు.

ఒకే ఒక ఉదాహరణచాలు. మహారాష్ట్రలోని పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ సమర్పించిన నివేదిక ప్రకారం జనవరి 2009 – 2011 మధ్య రెండు సంవత్సరాల కాలంలో అక్కడి హోంమంత్రిగారైన ఆర్.ఆర్. పాటిల్‌గారి నాయకత్వంలో సీనియర్ రాజకీయ వేత్తలు వివిధ ఉద్యోగాలకై ఉన్నతాధికారులకు 231 రెకమండేషన్లు అందచేసినారు. ఇందులో నుండి 54 రెకమెండెషన్లు అమలు జరిగాయి.

భారతదేశంలో 774 మంది పౌరుల కొకరు చొప్పున 15 లక్షల 60 వేల మంది పోలీసులు పనిచేయగా అమెరికాతో సహా యూరప్‌లో సగటు 300 పౌరులకొకరున్నారు. తక్కువ జీత భత్యాలు, పాత ఆయుధాలు, దుర్భర జీవన పరిస్థితుల్లో వీరు తమ బాధ్యతల్ని నిర్వహిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వారి జీతభత్యాలను పెంచడం, పని భారాన్ని తగ్గించడం, వికేంద్రీకృతం చేయడమెంత అవసరమో వేరే చెప్పనక్కరలేదు. అవినీతి పెచ్చు పెరగడంలో పరాకాష్టకు చేరడానికి కావలసిన నేపథ్యం ఉన్నది. యుద్ధ ప్రాతిపదికన బహుముఖ సంస్కరణలను నిర్వహించడం చట్టబద్ధ పాలనకు శాంతిభద్రతల పరిరక్షణకు అవసరం. చాలాకాలం క్రితమే దేశ మహోన్నత న్యాయస్థానం పోలీసు వ్యవస్థ రాజకీయ వ్యవస్థల మధ్య నెలకొన్న ఏడు అవాంఛనీయ సంబంధాలగురించి తీవ్రంగా హెచ్చరించింది. 2006 సెప్టెంబరు 22వ తేదీన ఈ రెండింటి మధ్య ఏర్పడిన అనైతిక సంబంధాన్ని చీల్చి చెందాడవలసిందిగా రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలనాదేశించింది. ఆ తర్వాత తమ తమ ఆదేశాలను ఎందుకు గౌరవించి పాటించడం లేదో సమాధానాలివ్వవలసిందిగా మందలించింది. ఐనా వినే నాథుడు లేడు. తిరిగి నిన్న కోల్‌గేట్ కేసులో సిబిఐ స్వతంత్రంగా సమర్పించవలసిన నివేదికలో కేంద్ర న్యాయశాఖామాత్యులైన గౌ॥ అశ్వనికుమార్ గారు చేసుకున్న అక్రమ జోక్యాన్ని తీవ్రంగా ఖండించింది. మరో గౌ॥ రైల్వే శాఖ మంత్రి శ్రీ బన్సాల్‌గారి బంధువు వెలగబెట్టిన లంచగొండితనం కారణంగా పై ఇద్దరితో కేంద్రం రాజీనామాలు మాత్రమే పెట్టించింది. సిబిఐ కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలు గుర్రంగా మారింది. తమ పరిపాలన కొనసాగించడానికి ఎవరికి వ్యతికేకంగా దూకాలో ఎవరికి అనుకూలంగా వెనకడుగు వేయాలో వేస్తున్నది. ఈ అక్రమ సంబంధాన్ని రద్దు చేయాలని కమిటి నాడే చెప్పింది. మహోన్నత న్యాయస్థానం తిరిగి ఈనాడు శాశించింది. సుప్రీంకోర్టు వారు ఆదేశించిన ఏడు సూత్రాలను తూచ తప్పకుండా పాటిస్తే పోలీస్ వ్యవస్థ ప్రక్షాళన జరుగుతుంది. పోలీసుల జీత భత్యాలు మొదలుకుంటే సక్రమ విధి నిర్వహణ వరకు ఆదర్శవంతమవుతుంది.

(8) “ తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో అబివృద్ధి సవాళ్ళు” అనే పేరుతో 15 మంది నిపుణులతో గూడిన సంఘం కేంద్ర ప్రణాళికా సంఘానికి మార్చి 2008లోనే వివరమైన నివేదికను సమర్పించింది. ఇది దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద అంతర్జాతీయ ముప్పుగా వర్ణించి ప్రధాని మన్మోహన్ సింగుగారు ఈ సమస్య పరిష్కార మార్గాలను కనుక్కోమని కేంద్ర ప్రణాళికా సంఘానికి బాధ్యతనిచ్చారు.

ప్రణాళికాసంఘం దేశ వ్యాపితంగా ఆర్థిక, రాజకీయ పరిజ్ఞానంగల నిష్ణాతులను ఎంపిక చేసి పై నివేదికను తయారు చేయించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన కీ॥శే॥శ్రీ బాలగోపాల్ మరియు కీ॥శే॥ శ్రీ శంకరన్ గార్లు తమ అమూల్యమైన అభిప్రాయాలను ఈ నివేదికలో సమకూర్చడం తెలుగువారందరికి గర్వకారణం. సుమారు అయిదు సంవత్సరాల కాంల గడిచిపోతున్నా ఈ విషయంపై కేంద్రప్రభుత్వం తమ ప్రతిస్పందన ప్రకటించలేదు. శాంతి భద్రతలు, నేర నిరోధక సంఘాలు,

న్యాయ స్థానాలు ఈ విలువైన నివేదికను వినియోగించవలసిన అవసరమున్నది. ఈ నిష్ణాతుల కమిటీ సూచనల్ని ఆచరించవలసియున్నది వారి నివేదికలోని ముఖ్యాంశాల్ని సంక్షిప్తంగానైనా ఉటంకించడం సందర్భోచితం.

1. " ప్రజల్లో బలంగానున్న అసంతృప్తి భారత రాజకీయ వ్యవస్థకు పెనుసవాల్‌గా మారింది. ఇది తరచూ ఆశాంతికి గురి అవుతున్న వర్గాలకోసం ప్రభుత్వం కొన్ని సంవత్సరాలుగా చట్టాలు చేయడంతో పాటు సంస్థాగత ఏర్పాట్లు చేస్తుంది. ఇలాంటివి ఎన్ని జేసినా అశాంతి కొనసాగుతుంది. జనాభాలో చాలా మందికి తమ మనుగడను రక్షించుకోవడమే, సాధించడమే పెద్ద సమస్యగా మారిపోయింది."

2. "నక్సలైట్ల ప్రధాన నినాదం "దున్నే వారికే భూమి." దేశంలో వ్యవసాయ కార్మికుల్లో 58 శాతం మంది వ్యవసాయం దాని అనుబంధ వృత్తులపై ఆధారపడ్డారు. భూమిలేకపోవడమే పేదరికానికి ప్రధాన కారణమైంది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం జమీందారి వ్యవస్థ రద్దు, వ్యవసాయ భూములపై సీలింగు విధించడం, మిగులు భూముల పంపిణీవంటి చర్యలు చేపట్టింది. తర్వాత భూసంస్కరణలపై ప్రభుత్వానికి నిబద్ధత బలహీనపడింది. ఇది అసంపూర్ణ ఎజెండాగా మిగిలిపోయింది. దీంతో పేదలు తమ జీవనోపాధికోసం అడవులు, నీటివనరుల వంటి ఉమ్మడి ఆస్తులపై ఆధారపడడం ప్రారంభించారు. అవి కూడా వారికి అందకుండా పోతున్నాయి."

3. "9 శాతం అభివృద్ధి సాధిస్తున్నామని, రెండంకెలవృద్ధి రేటుకోసం చమటోడుస్తున్నామని భారత్ గర్వంగా చెబుతోంది. అయితే విభిన్న తరగతుల మధ్య, పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య, ఎగువ కులాలు, అణగారిన వర్గాలకు మధ్య అసమానతలు పెరిగిపోతున్నాయి. దీనివల్ల ఆశాంతి విజృంభిస్తున్నది. సమానహక్కుల కల్పనలో ప్రభుత్వ బాధ్యత తరిగి పోతుండడంతో విద్య, ఆరోగ్యం, రవాణా, గృహ నిర్మాణం వంటి రంగాల్లో రెండు ప్రపంచాలు మనకు అగుపడుచున్నాయి. సంపద కొద్దిమంది చేతుల్లోనే ఉండరాదన్న రాజ్యాంగ నిబంధనను ప్రభుత్వ విధాన నిర్ణేతలు విస్మరిస్తున్నారు. అధునికీకరణ, యాంత్రీకరణ, ఎగుమతులకు మాత్రమే ప్రాధాన్యత నివ్వడం, వివిధ రకాల సబ్సిడీలను తగ్గించడం, ఉపసంహరించడం పేదల పాలిట సమ్మెట పోటు అవుతుంది."

4. "నక్సలైట్లకు ప్రధాన మద్దతు దళితులు, ఆదివాసులనుండే అందుతుంది. దేశ జనాభాలో నాల్గవవంతుగా ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్నారు. దారుణ పేదరికం వీరిలో నిరాశ నిస్పృహలకు కారణం అవుతున్నది."

5. "యస్టీల్లో 10 శాతం కుటుంబాలకు భూమిలేదు. మరో 77 శాతం మందికి స్వల్పంగా ఉంది."

6. "యస్టీలలో ఎక్కువ మంది వ్యవసాయ కార్మికులే. పట్టణ ప్రాంతాలకు వలసపోవడం, వ్యవసాయేతర కార్యక్రమాలకు మళ్ళడం తక్కువ. ఉపాధి అవకాశాలు చాలా పరిమితమే."

7. "దళితులు ఇంకా అంటరానితనాన్ని ఎదుర్కొంటున్నారు. 11 రాష్ట్రాలలో అధ్యయనం చేయగా 63 రకాల అంటరానితనం ఉందని తేలింది."

8. " గ్రామాల్లో ఓటు హక్కును వినియోగించుకోనివ్వకపోవడం, బహిరంగ ప్రదేశాలకు రానివ్వక పోవడం, సామాజిక, ఆర్థిక హక్కులను హరించడం వంటివి ఇంకా జరుగుచున్నాయి. ఈలాంటి చోట్లే నక్సల్స్ హింస ఎక్కువగాఉంది."

9. "అటవీ భూములు, వాటిఉత్పత్తులకోసం ఆదివాసీలు చేస్తున్న పోరాటమే దేశంలో అనేక ప్రాంతాల్లో అశాంతికి కారణమవుతుంది. ఆదివాసీలు ఎక్కువగా నివసిస్తున్న అడవులను రిజర్వు అడవులుగా ప్రకటించేస్తున్నారు. అడవుల పరిరక్షణ చట్టం (1980) ప్రకారం కేంద్రం అనుమతి లేకుండా ఏ అటవీ భూమిని ఇతర ప్రయోజనాలకోసం మళ్ళించకూడదు. అడవి పరిరక్షణ పేరిట అడవుల్లో ఉండే వారి హక్కులను ప్రభుత్వం హరిస్తోంది."

10. "సెజ్‌ల కోసం భారీగా భూములను సేకరించడం వల్ల దేశంలో తీవ్ర స్థాయిలో నిరసనలు మొదలయ్యాయి. గ్రామీణ ప్రాంతాలల్లో ప్రధానంగా భూములపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈ సెజ్‌ల కోసం భారీ స్థాయిలో భూములు కావాలి. సారవంతమైన భూములు సేకరించకుండా ఉండడం దాదాపు అసాధ్యం. ఇది ఘర్షణలకు కారణమౌతున్నది."

11. "నక్సలైటు అనగానే ఠక్కున ప్రజాకోర్టులు గుర్తుకు వస్తాయి. ఇక్కడ లభించే తక్షణ పరిష్కారాలకు ఆదరణ లభిస్తోంది. మన న్యాయ వ్యవస్థ ద్వారా కేసులు పరిష్కారంగావడానికి దీర్ఘకాలం పడుతోంది. నిర్దిష్ట సమయంలోగా వివాదాలు పరిష్కారం కాకుంటే సమాజంలో అసహనం మొదలవుతుంది. దీనికితోడు ఖర్చులు కూడా పెరిగిపోవడంతో కొందరు పేదల మనస్సుల్లో ప్రజాకోర్టులకు ధర్మబద్దత ఏర్పడుతుంది."

12. వివిధ రాష్ట్రాలలో తరచుగా జరుగుచున్న బూటకపు ఎన్‌కౌంటర్ మరణాలు పాలక వర్గాల జవాబుదారితనరాహిత్యాన్ని బట్టబయలు చేయడమేగాక రాజ్యాంగ మౌలిక సూత్రమైన చట్టబద్ధ పరిపాలనను భంగపర్చడం ప్రజాస్వామ్యానికి గొప్ప ప్రమాద సంకేతం. ఈ బూటకపు ఎన్‌కౌంటర్లను సమర్థించే చట్టాలను, నియమాలను తీవ్రంగా సంస్కరించవలసిన అగత్యం ఏర్పడ్డది. న్యాయం, న్యాయశాస్త్రం పేరుతో ఇటువంటి మానవహక్కుల ఉల్లంఘనలకు ఏమాత్రం ఆస్కారం ఇవ్వకుండా న్యాయశాస్త్రాన్ని సంస్కరించడం అత్యవసరం.

క్రిమినల్ ప్రొసిజర్ కోడ్‌లోని 197వ సెక్షన్ ప్రకారం ప్రాథమిక స్థాయినుండి అత్యున్నత స్థాయివరకు ప్రతి ప్రభుత్వోద్యోగి తన ఉద్యోగ ధర్మ నిర్వహణ హద్దుకులోబడి ఏ చర్యలు తీసుకున్నా అవి నేరారోపణ చట్టం పరిధిలోకి రావని అందులోనున్నది. దీన్ని అడ్డుపెట్టుకొని అధికారులు తమ లంచగొండితనం, బూటకపు ఎన్‌కౌంటర్‌తో సహా అనేక నేరాలనుండి సులభంగా తప్పించుకో గల్గుతున్నారు. విధి నిర్వహణ రేఖను ఉల్లంఘిస్తున్నారు. అటువంటి లక్ష్మణరేఖను నిర్ధారించే సంస్కరణ అత్యవసరం. ప్రత్యేక కోర్టుల ద్వారా ఈ రేఖను ఉల్లంఘించిన వారిని కఠినంగా శిక్షించే చట్టబద్ధ సవరణ శాంతి భద్రతల రక్షణకత్యవసరం. మరోముఖ్య ఉదాహరణ "ఎ.ఎఫ్.ఎస్.సి.ఎ. చట్టం"

సైనికులకివ్వబడే ప్రత్యేకాధికారాలకు సంబంధించిన చట్టమిది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ వలస పాలన పరిరక్షణ కొరకూ సైన్యానికిచ్చిన ప్రత్యేకాధికారాలు ఇందులోని అంశాలు. స్వతంత్రానంతరం రద్దు పరచబడవలసిన నల్లచట్టాలలో మిగిలిపోయిన చట్టమిది. ఈనాడు ప్రజాస్వామ్యవ్యవస్థకే సవాలుగా పరిణమించింది. ఒక కాశ్మీర్ రాష్ట్రంలోనే కాదు దేశ వ్యాపితంగా సైనిక వినియోగం జరిగిన ప్రతిచోటా ఈ చట్టం చాటున జరిగే అకృత్యాలకంతులేదు. దీనికి తోడుగా పోలీస్ స్వైర విహారం అసలు ప్రజాస్వామ్య వ్యవస్థకే తీరని హానిని కల్పించే ప్రమాదమున్నది. కఠోర సత్యాలతోకూడిన వివరాలల్లో వెళ్ళేదానికంటే ఈ చట్టాన్ని నాగరిక ప్రపంచమంతా వ్యతిరేకిస్తున్నదని చెప్పడం సబబు కాబట్టి ఇటువంటి అనాగరిక చట్టాన్ని రద్దు పరుస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం అవసరం. ఇటువంటి అర్ధబానిస అర్ధ ఫ్యూడల్ కాలాలల్లో రూపొంది, ఆధునిక పౌర సమాజాభివృద్ధికి ఆటంకాలుగా మిగిలియున్న చట్టాలనూ నియమ, నిబంధనలను, సాంప్రదాయాలన్నిటిని ఏరి పారేసే ఒక ఉన్నత స్థాయి కమిషన్ నియామకం అవసరం. ఒక కాలపరిమితిలో ఈ కర్తవ్య నిర్వహణ జాతి ఐక్యతకవసరం.

ఇలా మరెన్నో ఉదాహరణలు, అభిప్రాయాలతో కూడిన సుదీర్ఘమైన నివేదికను ఈ కమిటి సాధికారికంగా సమర్పించింది. అదే సందర్భంగా ఈ చివరి వాక్యాలను అక్షర సత్యాలుగా ఉటంకించింది.

" సమర్ధవంతమైన నిష్పాక్షిక పోలీసు విధానం సుపరిపాలనలో చాలా ముఖ్యం. సమాజంలో బలహీన వర్గాలకు పోలీసులపై పెద్దగా విశ్వాసం లేదు. సమాజంలోని బలవంతులను కాదని తమకు న్యాయం చేస్తారన్న నమ్మకం వారిలో లేదు. ఫిర్యాదు దాఖలు చేయాడానికి పోలీసు స్టేషన్‌కి వెళ్ళినా నిందితుడుగా వెళ్ళినట్లుంటున్నది. ప్రజలు నక్సల్స్ ఉద్యమం పట్ల ఆకర్షితులు కావడానికి ఇవే కారణాలు, పోలీసు అణచివేత బాగా పెరుగుతోంది. డిమాండ్లు న్యాయమైనవా కాదా అన్న అంశాన్ని పరిశీలించకుండానే నక్సల్స్‌కు మద్దతిచ్చిన ఉద్యమాలను కర్కశంగా అణచివేస్తున్నారు. గట్టిగా మాట్లాడే వారిని నక్సలైటుగా ముద్రవేస్తూ జైల్లో పెడుతున్నారు."

దేశంలో సామాజిక ఆర్ధికాభివృద్ధి మాత్రమే పేదరిక నిర్మూలనకు తారకమంత్రం. సామాజిక స్పృహతోపాటు చిత్తశుద్ధి, లక్ష్యశుద్ధిగల రాజకీయ నాయకులు వారి పార్టీలు, గ్రూపులు ఉమ్మిడి కార్యక్రమాల ఆధారంగా ఏకత్రాటిపైకొస్తూ ముక్త కంఠంతో ఉద్యమించి రాజకీయాధికారాలను చేజిక్కించుకున్న తర్వాతనే దేశానికి దిశా మార్పు సంభవిస్తుంది. సామాజిక ఆర్థిక న్యాయం నాల్గు పాదాలపై నడచివస్తుంది. సత్యయుగారంభం జరుగుతుంది. నిలుస్తుంది సుస్థిరమవుతుంది.

# 10. స్థానిక స్వపరిపాలన

రాచరికం సామ్రాజ్యంవాదం కాలాలలో వందలాది సంవత్సరాల సుదీర్ఘకాలం " పాలకులు - పాలితులను" భావంతో కేంద్రీకృత పరిపాలన నిర్వహించబడింది. స్వతంత్రానంతరం ప్రజాతంత్ర రాజ్యాంగబద్ధ పరిపాలనా వ్యవస్థకు ప్రజాస్వామ్యమని, ఇది ఎంతగా వికేంద్రీకృతమైతే అంతగా ప్రజలకు సన్నిహితంగానుంటూ ప్రయోజనాత్మకమవుతుందని గుర్తించినాం. గ్రామాలు, పట్టణాలలో నివసించే ప్రజలు తమ తమ నివాసాలల్లో ఆరోగ్యవంతమైన జీవితాలను గడపాలంటే ఆయా ప్రాంతాలలో నివసించే పౌరులచే ఎన్నుకోబడిన వారి నాయకత్వంలోనే పరిపాలన జరగాలనే భావన " ప్రజాస్వామ్య వికేంద్రీకరణ"గా అందరి గుర్తింపు పొందింది.

అటవిక జీవితం నుండి క్రమ క్రమంగా నాగరికతా వెలుగులోకి వస్తూ గ్రామసీమలుగా వెలసిన సామాజిక జన సమూహాలు సహస్రాబ్దాలుగా తమ జీవితాన్ని ఇలాగే గడిపినవి. పండ్లూ ఫలాలపై ఆధారపడిన వారు వ్యవసాయాన్ని తమ ఆహార అవసరాలు తీర్చే వృత్తిగా మలుచుకున్నారు. అలాగే మానవ జీవితావసరాలన్నిటి సాధనలో పని విభజన చోటుచేసుకున్నది. అనేక వృత్తులకు సంబంధించి వారు ఒకరికొకరు చేదోడువాడోదుగా ఒకే తల్లి బిడ్డలుగా గ్రామాభివృద్ధిలో పోటీ పడుతూ బ్రతికినారు. ఇలానే అనేక సహ స్రాబ్దాలకాలం గడచిన తర్వాత పని విభజన కులవిభజనగా ఆ తర్వాత వర్గాలుగా హెచ్చు తగ్గులుగల నిచ్చెన మెట్ల కులాలుగా మారినారు. దళితులుగా, పంచములుగా అంటరాన్ని వాళ్ళుగా అడ్డుగోడల మధ్య వైవిధ్యాలు, వైరుధ్యాలతో కాలం గడపడం గూడా జరిగినట్లు పరిణామక్రమం సూచిస్తున్నది. స్మృతులు, శ్రుతులు దీనికి మరిన్ని సాక్షా ధారాలను సమకూర్చినవి. మరిన్ని వేలసంవత్సరాల తర్వాత వెలువడిన ఇంకా వెలువడుతున్న పురాతన గ్రంథాలు పై హేతుబద్ధ ఆలోచనల్ని సమర్ధించినవి. ఈ నాడు అంతరిక్షానికి ఎగిసే మానవ జాతి సంతతి ఒక నాటి భూమి పుత్రులనే మధురస్మృతిని తెరపైకి తేవడమే ఉద్దేశం. అడవులంటే అభిమానం అడవి జంతువులంటే ఆహ్లాదం, కొండలు, కోనలంటే ఆసక్తి, సముద్ర తీరాలు, నదీ నదాలనగానే పుణ్యక్షేత్రాలనే పూజా భావనలు కలగడం సహజం. తాము లేక తమ తండ్రి, తాతలు పుట్టిపెరిగిన ఊరూవాడ పేరు వినగానే పులకించడం, తాము ఆడుతూ పాడుతూ సేద తీర్చుకున్న చెట్ల నీడలు, చదువుకున్న పాత బడిగోడలు, దేవాలయాలలోని ప్రతి రాయి మనలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నవి. అందుకే జన్మభూమి, దాని అభివృద్ధి అనగానే ఆకలి దప్పులు తీరినంత సంతోషాన్ని, సంతృప్తిని కల్గిస్తాయి. అన్ని విధాలా శిధిలమైపోతున్న తమ మాతృభూమికి పునరుజ్జీవనం సాధించి అత్యాధునిక సౌకర్యాలతో అలరించాలని కోరని వారెవరు? పట్టణాలలో విదేశాలలో నివసించే మన వారిలోని తపన దీనికి ప్రబల తార్కాణం. మహాత్ముడు స్వాతంత్ర్యానికి దాదాపు అర్ధశాతాబ్దికాలం నుండి "జన్మభూమి" "స్వావలంబన" "స్వపరి పాలన, "స్వరాజ్" "పంచాయితీరాజ్" భావాలను ప్రవేశ పెట్టినారు. "పరాయిపాలన" "స్వదేశీ పాలన" మధ్య తారతమ్యాన్ని తెలియచేసినారు. మాతృభూమిని "భరతమాత"గా చిత్రీకరించి, కన్నతల్లిని సామ్రాజ్యవాద కబంధ హస్తాలనుండి విముక్తి చేయాలని విశృంఖలం చేయాలని పిలుపునిచ్చారు. వందలు, వేల, లక్షల మంది స్త్రీ, పురుషులను స్వాతంత్ర్య సమరయోధులుగా

తీర్చిదిద్దినారు. జాగృతమైన జాతి బానిస బంధనాలనుండి విముక్తి సాధించింది. ఆరుదశాబ్దాలుగా మాతృభూమి తన బహుముఖాభివృద్ధికై పాటు పడుతున్నది. గంపెడు ఆశలు ఆశాభంగాల గందరగోళ పరిస్థితుల్లో గ్రామీణులుగా కాలం గడుపు చున్నారు. అత్యాధునిక యుగంతో పూర్తిగా వెనకబడిపోతున్న గ్రామీణాభివృద్ధి చూస్తూ ఆందోళన జెందుతున్నారు. సాధ్యమైనంత త్వరగా రోడ్లు వంతెనల రవాణా సౌకర్యాలు, విద్యుద్దీపాలకాంతులు, సమాచార విప్లవ సాధనాలతో కలకలలాడాలని ఆకాంక్షిస్తున్నాం. పూలు పండ్ల తోటలు రక రకాల పంట పొలాలతో నందనవనంగా మారాలని ఆశిస్తున్నారు. పారిశ్రామిక, హరిత విప్లవాల మేలుకలయికతో కోకొల్లలుగాలభించే ప్రాణవాయువులో మునిగి తేలుతూ ఆనందపరవశులవ్వాలని తపిస్తున్నారు. భారతావని నైసర్గికంగా, భౌగోళికంగా ఈ ఆరోగ్యవంతమైన పర్యావరణాన్ని తమ బిడ్డలకు కావలసినంతగా సమకూర్చే వనరులుగల శక్తిమంతమైన మాతృమూర్తి.

ఈ కల నిజమై, గ్రామాభివృద్ధి సామాజికాభి వృద్ధి మూడు పూలు ఆరు కాయలతో ప్రవర్ధమానం చెందాలంటే గ్రామ రాజ్యాలను స్థాపించి నిర్వహించడమొక్కటే మార్గం. ఆరు, ఏడు దశాబ్దాలుగా వాగ్దానాలుగానే మిగిలిన స్థానిక స్వపరిపాలన కర్తవ్య సాధన జాతి పున: నిర్మాణ కార్య క్రమంలో అగ్రస్థానాన్ని అలంకరించాలి. దేశ వ్యాపితంగానున్న రెండున్నర లక్షల గ్రామ పంచాయితీలలో 12 లక్షల మంది మహిళలతో కలిసి 32 లక్షల మంది ప్రజా ప్రతినిధులుంటే గ్రామాభివృద్ధి కార్యభారాన్ని మోసే మానవ వనరుల శక్తి సామర్థ్యాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలందించే వేలాది కోట్ల ప్రజాధనం పూర్తిగా సద్వినియోగమయితే గ్రామాల రూపు రేఖలు పూర్తిగా మారిపోయేవి. కీ॥శే॥ రాజీవ్‌గాంధి గారు ప్రధానిగా ఉన్నపుడు రెండు దశాబ్దాల క్రితమే రాజ్యాంగంలో 73 (గ్రామం పంచాయితీలకు సంబంధించి) 74 ( పురపాలక సంఘాలకు సంబంధించినవి) సవరణలను ప్రతిపాదించడం జరిగింది. ఆ తర్వాత కీ॥శే॥ పి.వి. నరసింహారావుగారు ప్రధానిగా ఉన్న కాలంలో పై సవరణలు క్షుణ్ణంగా చర్చించబడి రాజ్యాంగబద్ధం చేయడం జరిగింది. కేంద్రంపై సవరణల ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు తమ బాధ్యతల్ని మాత్రమే తెలియచేసింది. జవాబుదారిగానుండాలని ఆదేశించలేదు. అసలు ఈ సవరణ ఆమలును పర్యవేక్షించే బాధ్యత రాష్ట్రాల నుండి కేంద్రానికి బదిలి చేయడం ప్రయోజనాత్మకమని దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధికి పాటుపడే నిపుణులైన కీ॥శే॥ ముధూలిమాయె, శ్రీ కృష్ణ అయ్యర్ గారలు వాదించినారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించబడే సుమారు 15 పథకాలలో కేవలం రెండంటే రెండే పథకాలు ఉపాధి హామీ, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి పథకాలు రాష్ట్రాలకు ఇవ్వడం జరిగింది. వాటిలోగూడా గ్రామ పంచాయితీలు పురపాలక సంఘాలకు చెప్పుకోదగిన పాత్ర లేదు. ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రత్యక్ష ప్రమేయం లేకుండా ఏ పథకంకూడా విజయవంతం కానేరదనే నగ్న సత్యాన్ని అర్థం చేసుకొనిరాకరించే పాలకులు ఎంతోకాలం ప్రజల్ని మోసం చేయలేరు.

రాజ్యాంగ సవరణల (73-74) వెలుతురులో రాష్ట్ర ప్రభుత్వాలు విధులు, నిధులు, అధికారాలను పంచాయితీలకివ్వ నిరాకరించడమేకాదు అసలు వాటి ఉనికినే లేకుండా చూడాలనే దురుద్దేశం అత్యధిక రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయా శాసనసభ్యులకున్నట్లు వాటికి సకాలంలో ఎన్నికలు నిర్వహించక పోవడంతోనే తెలిసిపోతున్నది. రాజ్యాంగ నిర్దేశం ప్రకారం గడువు ముగించే లోగానే ఎన్నికల్ని నిర్వహించి కొత్త నాయకత్వానికి బాధ్యతలు ఇవ్వాలి. లక్షల ప్రజా ప్రతినిధుల్ని లేకుండా

చేసి అధికారుల ద్వారా విధులు నిర్వహించడం సభ్యసమాజానికి తలవంపు గానున్నది. అధికారులపైనే ఈ నెపాన్ని నెట్టి వేయడానికి వీలులేదు. ఎన్నికైన శాసనసభ్యులు, మంత్రులు ఉద్దేశపూర్వకంగా ఈ జాప్యానికి కారణమవుతున్నారు. ప్రతి చిన్న పెద్ద సమస్య పరిష్కారానికి గ్రామీణులు తమ చుట్టూ తిరగాలని, వారిని అలా తిప్పుతూ తమ పెత్తనాన్ని సుస్థిరం చేసుకోవాలనే కాలం చెల్లిన కోరిక మన శాసనసభ్యుల్లో చాలామందిలో చోటుచేసుకున్నది. అధికార పార్టీ ప్రధానంగా ఇందుకు బాధ్యత వహించాలి. లక్షలాదిగా ఎన్నుకోబడి ప్రజా సేవలందించవలసిన ప్రజా ప్రతినిధులను అసలు రాజ్యాంగబద్ధ ఎన్నికల నుండి దూరంగా ఉంచడం క్షంతవ్యంగాని నేరం గాదా? న్యాయస్థానాలు ఆదేశించినా కుంటిసాకులు చూపుతూ స్వార్థ రాజకీయాల కొరకు దేశ రాజ్యాంగ నిర్దేశాన్ని కాలరాయడం గాదా? ఈ బాధ్యతల్ని నిర్వహించవలసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని బాధ్యతల నుండి తొలగించడమో లేక ఇటువంటి వైఫల్యాలకు కేంద్ర ప్రభుత్వానికి జవాబుదారిగా నుండే నిబంధనను పాటింప చేయాలా అను అంశం త్వరగా తేలాలి. లేనిచో దేశ వ్యాపితంగా లక్షలాది గ్రామీణ ప్రజల ప్రజాస్వామ్య హక్కును కాలరాస్తున్న ఈ వ్యవస్థ శాశ్వతమైపోతుంది. రాజ్యాంగ సవరణలలోని ముఖ్యాంశం గడువు ముగించకముందే కొత్త నాయకత్వాన్ని ఎన్నుకునే బాధ్యత. ఈ బాధ్యతని సమర్థవంతంగా నిర్వహించే స్వతంత్ర ప్రతిపత్తిగల ఎన్నికల కమిషన్ నియామకం జరగాలని రాజ్యాంగ నిర్దేశం. దానికి పూర్తిగా విరుద్ధంగా రాష్ట్రాలు నియమించే ఎన్నికల కమిషన్‌కి " స్వయం ప్రతిపత్తి" ఉండదు. రాష్ట్ర ప్రభుత్వాలు నియోజకవర్గాల్ని, రిజర్వేషన్ ప్రతిపాదనల్ని తయారు చేసిన తర్వాత వారి ఆజ్ఞానుసారం, ఎన్నికల కమిషన్ రంగ ప్రవేశం జేస్తుంది. గడువు ముగిసేలోగానే స్వయం ప్రతిపత్తిగల స్వతంత్ర ఎన్నికల సంఘం ఈ బాధ్యత నిర్వహించాలనే రాజ్యాంగ ఆదేశం ఎవరికి? ఎవరు దీన్ని ఉల్లంఘిస్తున్నారు? కేంద్ర పార్లమెంటులో ఈ ప్రశ్నల్ని అడిగే వారెందుకు లేరు? ఐనా కేంద్ర పంచాయితీరాజ్ శాఖ ఏంచేస్తున్నట్లు? రాజ్యాంగానికే తూట్లు పొడిచి, స్థానిక స్వయం పరిపాలనను నిర్వీర్యం చేసే వెనకటి గుణం మానలేని రాజకీయ నాయకులభరతం బట్టడం తప్ప మరో మార్గం లేదు. ప్రజాస్వామ్యవాదులు ముఖ్యంగా గ్రామ స్వరాజ్య అభిమానులు ప్రజాస్వామ్యాన్ని నమ్మే రాజకీయ పార్టీలు ప్రశ్నించుకుని తామే సమాధానం జెప్పవలసిన అవసరమెంతయినా ఉన్నది. ఉర్దూలో ఒక సామెత ఉన్నది. "ఒంటెని అవయవాలన్నిట్లో ఏ అవయవం చక్కగాఉన్నదో చెప్పగలవా? " అలాగే తయారైంది. మన పంచాయితి రాజ్ వ్యవస్థ. ఒక ఆంధ్రప్రదేశ్‌కే ప్రతి సంవత్సరం సుమారు మూడు వేల కోట్ల రూపాయలు కేంద్ర నిధులు, ఎన్నికలు జరపని కారణంగా నిలిచిపోయినవి. నిధులకు ఎన్నికలతో ముడిపెడితే నయినా ఎన్నికలు సకాలంలో నిర్వహిస్తారనే పట్టుదల కేంద్రానిదైతే నిధులు లేకున్నా పరవాలేదుగాని పంచాయితి ఎన్నికల్ని మాత్రం రాజకీయంగా అనుకూలమైన సమయంలోనే జరుపుతామని రాష్ట్రాలంటున్నాయి. ఇది లాలూచి తగవు. చిత్తశుద్ధి లేని శివపూజగా తయారైంది. అధికార కేంద్రీకరణ ఉభయుల ఉమ్మడి లక్ష్యం. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన గ్రామ పంచాయితీల ఎన్నికల తర్వాతగూడా వారికి రాజ్యాంగ బద్ధంగా దఖలు పర్చవలసిన విధులు నిధుల అంశం తేలలేదు. ఎన్నికల ఫలితంగా గెలిచిన సర్పంచ్‌లు ఇతరులు అచేతనంగా, అలంకారప్రాయంగా మిగిలిపోవడం పంచాయితి రాజ్ ఉద్దేశాలకే వ్యతిరేకం. మండలి, జిల్లా పరిషత్‌ల ఎన్నికలు జరిగినాయి. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి నామమాత్ర వశిష్టంగా మిగిలిపోయింది.

మరో మాయాజాలం ఏలినవారి చిత్తశుద్ధిలేమిని కండ్లకుగడుతున్నది. 73వ రాజ్యాంగ సవరణ ప్రతిపాదించిన నాడే ప్రధాని కీ॥శే॥ రాజీవ్‌గాంధీ గారి సమక్షంలో ఘనత వహించిన కొందరు నాయకులు పై సవరణను వ్యతిరేకిస్తూ గంభీరోపన్యాసాలు చేసినారు. అలా జరిగితే నిధులన్నీ క్రిందకే పోతాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వట్టిచేతులతో రాజ్యమేలవలసి వస్తుందని వాపోయినారు. అదే సిద్ధాంతం ఇంకా కేంద్ర, రాష్ట్ర నాయకుల్ని ప్రభావితం చేస్తున్నది. రాజ్యాంగంలోని 11వ షెడ్యూలులో పంచాయితీరాజ్ వ్యవస్థకి 29 అంశాలతోకూడిన విధులను, అందుకవసరమైన నిధులను కేటాయించాలని స్పష్టంగా చెప్పడం జరిగింది. ఈ విధుల నిర్వహణకవసరమైన అధికారాలను హస్తగతం చేయాలని చెప్పడం జరిగింది. ఇటువంటి గ్రామ రాజ్య సిద్ధాంతాన్ని పర్యవేక్షించే నూతన చట్టాలను గూడా తయారు చేయాలని ఆదేశించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో నూతన చట్టం మాట దేవుడెరుగుగాని పాత చట్టమైనా అమలుకు నోచుకోవడంలేదు. అరకొర సవరణలు కాగితాలకే పరిమితమైపోయినవి. ఏది ఏమైనా రాజ్యాంగ ఆదేశానుసారం 29 విధులు, వాటికవసరమైన నిధులు రావలసి ఉన్నా కేవలం 10 అంశాలకు సంబంధించిన ప్రాధాన్యతలులేని విభాగాలను జీ.ఓ.ల ద్వారా ఇచ్చి, చేతులు దులుపుకోవడం జరిగింది. అవి వ్యవసాయం, పశుసంవర్ధకం, గ్రామీణ నీటి సరఫరా, విద్య, వైద్యం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ, గ్రామీణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరుగతుల సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ, మత్స్యకారుల సంక్షేమం గురించి ఉత్తర్వుల్లో పేర్కొన్నా అవి కేవలం కాగితాలకే పరిమితమైనవి. కేటాయించబడిన అరకొర నిధుల సద్వినియోగంలో పంచాయితీల బాధ్యత శూన్యం. అధికారులదే రాజ్యం. ఆపైన అధికారుల ఆటకట్టించగలిగే ప్రజా నాయకుల భోజ్యం. ఎవరికి ఎవరు జవాబుదారులుగాని, పసలేని పది ఉత్తర్వులకే పరిమితమైంది ఈ పంచాయితీ రాజ్ వ్యవస్థ. రాజ్యాంగంలోని 243ఐ అధికరణ ప్రకారం ప్రతి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అయిదు సంవత్సరాల కొకసారి పంచాయితి రాజ్ ఆర్థిక కమిషన్ నియమాకం చేసి తీరాలి. ఆ కమిషన్ రాష్ట్రాల పంచాయితీ రాజ్ స్థితి గతులను సమీక్షిస్తూ అవసరమైన ప్రతిపాదనలను రూపొందించే అధికారం కలిగి యుంటుంది. సహజంగా రాష్ట్ర ప్రభుత్వాలు ఆ నివేదికలను గౌరవిస్తూ తమ విధి విధానాలను సంస్కరించుకోవడం దీని ముఖ్యోద్దేశం. నాల్గవ ఆర్థిక సంఘ నియామక పుణ్యకాలం 2009లోనే దాటిపోయింది. రాష్ట్ర ప్రభుత్వంలో ఇంకా ఉలుకూ పలుకూలేదు. పంచాయితీల ఆర్థిక స్థితి గతులటుంచి కార్యాలయాలు గూడా ఉన్నాయా లేక మూతబడిపోతున్నాయా అని అగిడే నాధుడేలేదు. దీన్నే "చిత్తశుద్ధి లేని శివ పూజ"అంటారు.

అంతరంగిక తీవ్రవాదమే దేశ భద్రతకు ప్రమాదమంటూ పదే పదే ఉద్ఘాటించిన ప్రధాని వామపక్ష అతివాదంతో సహా విశాల ప్రాంతాలలో ఏర్పడిన ఆందోళనకర సమస్యల పరిష్కారానికి చేసిందేమిలేదు. అతివాదం తీవ్రవాదాలకు మాతృక ఇది. సామాజిక ఆర్థిక సమస్య మాత్రమేగాని మత మౌఢ్యం కానే కాదని విజ్ఞులు తమ నివేదికల్లో పదే పదే నివేదించియున్నారు. సామాజిక, ఆర్థిక సంస్కరణల ద్వారా మాత్రమే ఈ అశాంతిని తొలగించగల్గుతామని వారంతా సోదాహరణంగా వివరించియున్నారు. మన రాజ్యాంగ నిర్ణేతలు రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలులో గిరిజన జనాభా అధికంగాఉన్న రాష్ట్రాలలో అమలు పరచడానికి కేంద్ర పార్లమెంటు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని ఆదేశించినారు.గిరిజన పంచాయితీ వ్యవస్థ రూపకల్పన చేస్తూ వారిని సాధికారులను చేయడం వారి

బహుముఖాభివృద్ధికై ప్రత్యేకంగా నిధులను కేటాయించి వాటిని ఉపయుక్తంగా వెచ్చించాలని ఈ ఆదేశం. అలాగే పంచాయితిరాజ్ చట్టాన్ని ఈ గిరిజన ప్రధానమైన ప్రాంతాలకు విస్తరించే చట్టాన్ని డిసెంబరు 1996లోనే చేయడం జరిగింది. 13 సంవత్సరాల కాలం గడిచింది. చట్టాన్ని అమలు పరచి సత్ఫలితాలను సాధించిన దాఖలాలు లేవు. రాజ్యాంగం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు గిరిజనాభివృద్ధిపై కేంద్రీకరించే సూచనలు సలహాలనందించాలనిగూడా ప్రత్యేకంగా ఒక నిబంధన ద్వారా హెచ్చరించడంగూడా జరిగింది. పై రాజ్యాంగచట్టబద్ధ ఆదేశం ఈనాడు ఇంతకు ముందెన్నడు లేనంతగా అవసరం. ఐనా అధికార ప్రతిపక్ష పార్టీలన్ని అయిదవ షెడ్యూలులోని రాష్ట్రాలతో సహ ఈ విషయంలో పూర్తిగా అశ్రద్ధ, నిర్లిప్తతలను ప్రదర్శించడంలో ఏకాభిప్రాయమే కలిగియున్నవి. ఇది చాలా దురదృష్టకరం. అన్ని రాజకీయ పార్టీలు తమను నమ్ముకున్న గిరిజనులకు ద్రోహం చేయడం తప్ప వేరే కాదు. పైనుదహరించిన " పెసా" చట్టం గిరిజన గ్రామాలలో (5వ షెడ్యూలు రాష్ట్రాలలో) ప్రత్యేక కార్యక్రమాలను, వాటి ప్రయోజనాన్ని తెలియచేస్తుంది. విధులు, నిధుల గురించి స్పష్టతనిస్తుంది. జాతీయాభివృద్ధి మండలి, ప్రణాళికా సంఘం రాజ్యాంగ నిర్దేశాన్ని నిర్లక్ష్యం చేయడం క్షంతవ్యం గాదు.

రాజ్యాంగ నిర్దేశం, ఆ తర్వాత వచ్చిన " పెసా " చట్టం గిరిజన సమస్యల పరిష్కారంలో కీలకమైన పాత్రను పోషిస్తున్నది. సామ్రాజ్యవాద పరిపాలనలో రూపొందించిన " భూ స్వాధీనచట్టం (19వ శతాబ్దం) అడవుల సంరక్షణ చట్టాలతో గిరిజనులకు తీరని అన్యాయాన్ని తలపెట్టారు. "పెసా" చట్టం ప్రకారం 5వ షెడ్యూలులోని రాష్ట్రాల్లో ప్రత్యేకంగా గిరిజన నివాసాలన్నిటిలో వారి సాముదాయక భూములను వారి గ్రామ సభ అనుమతిలేనిదే వేరే ప్రయోజనాలకై వినియోగించే వీలులేదు. అటవిసంపద, ఆప్రాంతాలల్లోనున్న గనులపై గ్రామ సభలకు విస్తృతాధి కారాలివ్వడం జరిగింది. తాత్కాలికంగా వచ్చే సంపాదనతోపాటు చట్టబద్దంగారాగలిగే దీర్ఘకాల వాయిదాల ద్వారా ఈ 5వ షెడ్యూలులోని గిరిజనాభివృద్ధికై ప్రతి సంవత్సరం 50000 కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలందించే మొత్తానికంటే గూడా ఈ పద్దు పెద్దది. ఇంతటి ఆర్థిక వనరులతో కొలది సంవత్సరాల్లోనే గిరిజన గ్రామాల సర్వతోముఖాభివృద్ధి సుసాధ్యం. మనస్సుంటే మార్గ ముంటుంది. అన్ని ఉండి గూడా సమస్యలు పేరుకుపోయే వరకు అచేతనంగా నిర్లక్షమే కాదు, గిరిజన సమాజం పట్ల దేశం పట్ల క్షంతవ్యంగాని అపచారం. ప్రపంచవ్యాపితంగా మైనింగ్ అండ్ మినరల్ సంపదకు సంబంధించిన చట్టాలు వివిధ స్థాయిల్లో నున్నవి. ఐక్యరాజ్య సమితి గిరిజన ప్రాంతాలైన అడవుల్లో లభ్యమయ్యే వివిధ ఖనిజాలను వెలికితీయడానికి ఆచరణలోనున్న వివిధ సాంప్రదాయాల క్రమబద్దీకరణపై సమాలోచనలను చేసింది. అందుకు మార్గదర్శకాలను రూపొందించింది. ప్రపంచ వ్యాపితంగా గిరిజనులు తమ స్వాధీనంలోనున్న అడవి భూముల్లో లభ్యమయ్యే ఖనిజ సంపదపై తమకే యాజమాన్య హక్కు ఉండాలని కోరుతున్నారు. భారతదేశంలో ఇంతవరకున్న మైనింగ్ అండ్ మినరల్ చట్టంలో ఈ భూముల్లోనున్న ఖనిజ సంపదపై సంపూర్ణ యాజమాన్య హక్కు ప్రభుత్వాలదేనంటూ స్పష్టంగానే చెప్పింది. 5వ షెడ్యూలు రాష్ట్రాలు, ఆరవ షెడ్యూలు రాష్ట్రాలలో లభ్యమయ్యే ఖనిజ సంపదపై మన రాజ్యాగం గూడా స్పష్టతనిచ్చింది. ఆయా ఆడవీ భూములను కోల్పోయే గిరిజన జనాభా పునరావాస ఉపాధి కల్పనా బాధ్యతల్ని

ప్రభుత్వాలకిచ్చింది. ఇసుక, సున్నపురాయి, కట్టడాలకు ఉపయోగపడే గ్రానైట్ లాంటి మైనర్ ఖనిజాలపై రాష్ట్ర ప్రభుత్వాలకు, ముడి ఇనుము, అభ్రకంలాంటి మేజర్ ఖనిజ సంపదపై కేంద్రప్రభుత్వానికి అధికారమివ్వడం జరిగింది.

ఇంకా పార్లమెంటులో నానుతున్న యమ్.యమ్.డి.ఆర్.ఎ చట్టాన్నితీవ్రంగా సవరించి నిర్వాసితులయ్యే ప్రజలందరికి, ముఖ్యంగా గిరిజన ప్రాంతాలు (షెడ్యూలు 5 లోని రాష్ట్రాలు) గిరిజనులకు సముచిత భాగస్వామ్యాన్ని సమకూర్చాలి. ప్రజా ప్రతినిధులంతా మేల్కొని రాజ్యాంగ నిర్దేశాన్ని, 'పెసా' చట్టాన్ని తూచా తప్పకుండా అమలు జరిపించుకోవడం అవశ్యం. ఇదే స్ఫూహతో ఇతర ప్రాంతాలలో గూడా అవసరమైన విధాన సంస్కరణలు, చట్ట సవరణలు జరిగితే "అంతరంగిక అతివాద తీవ్రవాదం" నేల విడిచి సాము చేసినట్లు నీరసిస్తుంది. ఇది దేశంలో శాంతిభద్రతలు ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లడానికి బాసటగానుంటుంది.

పంచాయితి రాజ్ చట్టం ప్రకారం గ్రామ పంచాయితి, మండల ప్రజా పరిషత్తు, జిల్లా ప్రజాపరిషత్తు, వాటి మధ్య పని విభజన ఉండగా, దీనికి సమాంతరంగా జిల్లా ప్లానింగ్ బోర్డు లనబడే చట్టబద్ద సంస్థ ఒకటుంది. దీనికి జిల్లా పరిషత్తు అధ్యక్షులు అధ్యక్షత వహించగా పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు మరి కొందరు ప్రముఖులు సభ్యులుగా ఉంటారు. జిల్లా అభివృద్ధి ప్రణాళికను రూపొందించి కలెక్టరుగారికి సమర్పించడం దీని విధి. ఈ ప్రణాళిక వెలుతురులో జిల్లా పరిషత్తు దాని ఆధీన సంస్థలు అటు జిల్లా కలెక్టరుగారు వారి వివిధ శాఖలు పనిచేయాలని ఉద్దేశం. ప్రత్యక్షంగా ప్రజలచే ఎన్నుకోబడిన మూడంచెల వ్యవస్థ ఉండగా, గ్రామస్థాయి నుండి జిల్లా, రాష్ట్ర స్థాయిల వరకు ప్రణాళిక చిత్రపటాన్ని రూపొందించి ఆచరించే అవకాశంఉండగా ఈ జిల్లా ప్రణాళికాబోర్డు కేవలం 6వ వేలు లాంటిది మాత్రమే. అనవసర వైరుధ్యాలను సృష్టిస్తూ శాసనసభ్యుల సూచనలు సలహాలకు పెద్ద పీట వేయడం ఎన్నుకోబడిన ప్రజా పరిషత్తులు, మండలాలను వాటి నిర్ణయాలను నిర్లక్ష్యం చేయడం జరుగుతుంది. ఇప్పటికే అలా జరిగింది. " జిల్లా ప్రణాళికాబోర్డు చట్టాన్ని దాని వ్యవస్థలను రద్దు చేయడమే సముచితం. అసలు పంచాయితీ రాజ్ వ్యవస్థకే నిధులు, అధికారాల కొరత ఉండగా ' ప్రణాళికాబోర్డు ' చేయగల్గిందేమి ఉండదు. శాసనకర్తలు. అధికారులు కలిసి పనిచేయడం పేరుతో పంచాయితీ రాజ్ స్వపరిపాలనను నిర్వీర్యంచేయడం జరుగుతుంది. ఇది వికేంద్రీకరణ, స్థానిక స్వపరిపాలనా సిద్దాంతాలకు పూర్తిగా విరుద్ధం.

స్థానిక స్వపరిపాలనా వ్యవస్థ వికేంద్రీకరణ లక్ష్య సాధనలో అట్టడుగు ప్రాథమిక వ్యవస్థగా నుండే ' గ్రామ సభ' కీలకమైనది. పంచాయితీరాజ్ వ్యవస్థకే ప్రాణ ప్రదమైనది. చైతన్యవంతమైన ప్రజా బాహుళ్యం యొక్క అభిమతాన్ని ప్రోది చేయడం,. వారి ప్రత్యక్ష భాగస్వామ్యంతో వారి నిర్ణయాన్ని అమలు చేయడం "ప్రజాస్వామ్యం"లోని పరమార్థం ఈనాటి శాస్త్ర సాంకేతిక విజ్ఞాన యుగం, నిత్య నూతన ఆవిష్కరణల నేపథ్యంలో సమాచార విప్లవం ఫలితంగా విభిన్న భావాలు వివిధ వర్గాల ప్రజల మనోభావాలను ప్రభావితం చేస్తున్నవి. గ్రామ స్థాయిలో అసత్యాలు, అర్ధ సత్యాలు అతి వేగంగా తమ పనిచేయడం జరుగుతున్నది. వాస్తవాలను తెలియచేస్తూ అవాస్తవాలను పటా పంచలు చేయడం సామాజిక కార్యకర్తలకు భారంగా మారింది. సాత్వికంగానుంటేనే సాత్వికులు ప్రజా ప్రాతినిధ్యాన్ని

పొందగల్గుతారు. ప్రజాస్వామ్యాన్ని నాలుగుపాదాలపై నడిపించగల్గుతారు. ఈ ప్రక్రియ విజయవంతం గావాలంటే గ్రామసభలు తరచుగా జరగడం అవసరం. చట్టబద్ధతకై లాంఛన ప్రాయంగా, మొక్కుబడిగా జరిగే గ్రామ సభలు లక్ష్యాన్ని సాధించలేవు. తమ గ్రామీణాభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో ప్రాధాన్యతలను నిర్ణయించడం, సబ్సిడీకి అర్హులైన పేదలను ఎంపిక చేయడం, విద్యా, వైద్య తదితర సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించడం వాటిని సక్రమంగా నిర్వహించడం గ్రామ సభల బాధ్యత. వాటి స్థాయిని నిరంతరం పెంచే బాధ్యత రాజకీయ సామాజిక కార్యకర్తలది. లక్ష్యశుద్ధితో నిరంతరం ఈ ప్రక్రియ కొనసాగిన తర్వాతనే మన ప్రజాస్వామ్యానికి పరిణతికల్గుతుంది.

గ్రామ సభలు నాగరిక పరిసరాల్లో జరగడం ఎంతో అవసరం. ఈనాడు ఇంకా 50 శాతానికి మించిన గ్రామపంచాయితీలలో గ్రామసభల నిర్వహణ కవసరమైన ప్రాంగణాలు వాటికి అనుబంధమైన వసతులు లేకపోవడం, అటువంటి ఆలోచనలు గూడా లేకపోవడం దురదృష్టకరం. ఏ నిధులనైనా మళ్ళించి కనీసం వేయిమంది గ్రామస్థులు కూర్చోగలిగే వసతుల నిర్మాణానికి ప్రాధాన్యతనివ్వాలి. తరచుగా జరిగే గ్రామ సభలకు ఉపయోగపడడమేగాక గ్రామ సాము దాయ కావసరాలకు గూడా చక్కగా అవి ఉపయోగపడుతాయి. ఇలాంటి సంస్కారయుత ఏర్పాట్ల కారణంగా గ్రామస్థులందరిలో కలిసి కూర్చోవడం, కలిసి భోజనాలు చేయడంతోపాటు వైజ్ఞానిక కార్యక్రమాల నిర్వహణకు మంచి సౌకర్యం కల్గుతుంది. మహిళా సంఘాలు, కుల సంఘాలు తమ తమ కార్య క్రమాలను సులభంగా రూపొందించుకోగల్గుతాయి. గ్రామ జీవితంలో సహజీవనం, సంఘీభావం, భావ సారుప్యతల నిర్మాణం ఎంత ఎక్కువగా ఎంత విరివిగా జరిగితే చైతన్యంగూడా అంతే ఉన్నత స్థాయి నందు కుంటుంది. సమైక్యత, సద్భావనలు సముచితంగా చోటు చేసుకుంటాయి. ప్రజా ప్రతినిధుల పని ఎన్నికలలో గెలవడమే కాదు. ప్రజాచైతన్యాన్ని ఇతోధికం చేయడం గూడా వారి కర్తవ్యం. వారి విద్యుక్త ధర్మం.

గ్రామ, మండల, జిల్లా, స్థాయి స్వపరిపాలనల్లో తమ బాధ్యతల్ని నిర్వహించే అధికారుల మనస్తత్వంలో ఇంకా తాము తమపై అధికారులకు మాత్రమే జవాబుదారులమని, ఎన్నికైవచ్చే ప్రజా ప్రతినిధుల అధికారం తాత్కాలికమనే ధోరణి బాగా పనిచేస్తున్నది. అలాగే ప్రజా ప్రతినిధులుగా సాధికారులమనే ప్రజాస్వామ్య ప్రాతినిధ్యభావం ఎన్నికైన వారిలోగూడా ఉండటం లేదు. ఉన్నత, న్యూనతభావాల మధ్య సంఘర్షణలు పెరిగి సామరస్య సేవా తత్పర భావాలు సమకూరకపోవడం ఆందోళనకరం. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ దెబ్బతింటే సామాన్య ప్రజలు నిస్సహాయులై నిరుత్సాహ పడే పరిస్థితి ఏర్పడుతుంది. సంబంధిత బాధ్యులు ఉమ్మడి కర్తవ్యమైన గ్రామ స్వరాజ్య స్ఫూర్తిని పోషించాలి, పెంచాలి.

"స్థానిక స్వపరిపాలన"లో ముచ్చటగానున్న మూడు పదాలు సామాజికంగా మూడులోకాలను జయించగల్గేంత మహిమాన్వితమైనవి. బానిస, భూస్వామ్య పెట్టుబడిదారి వ్యవస్థల ఏకఛత్రాధి పత్యాలను మట్టికరిపించి బహుజన సాధికారతను సుస్థిర పునాదులపై నిలబెట్టే శక్తిమంతమైన శాశ్వతమైన ప్రత్యామ్నాయమిది. 60 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం ఇరవై సంవత్సరాల సంస్క రణల తర్వాత గూడా మనదేశ గ్రామసీమలు అత్యధికంగా రాజకీయ పార్టీ విభేదాలు, కులమతాలు, ముఠా కక్షలు,

కార్పణ్యాలతో చీలిపోయివుండడం అవమానకరం. ప్రజాస్వామ్యంలో ప్రజల మధ్యసౌహార్ధత, సమన్వయం, సహకారం, సద్భావం అత్యవసరం. వీటిని సమకూర్చనిదే ప్రజాహితం ముందుకు సాగదు. దురదృష్టవశాత్తు ఈనాటి రాజకీయ పార్టీలు తదితర గ్రూపులు, ముఠాలు అగ్నికి అజ్యం పోయడమే కాని దావానలంలా వ్యాపిస్తున్న ఈ అగ్ని కీలల్ని చల్చార్చడంలేదు. పవిత్రమై, ప్రజల మధ్య ప్రేమాభిమానాలను పెంచి పోషించవలసిన ప్రజాస్వామ్యం ఏనాడో కాలగర్భంలో కలిసి నశించి పోవలసిన దుర్మార్గులచేతిలో అధికార సాధనాయంత్రంగా మిగిలింది. సహృదయులు, విద్యా వేత్తలు, నీతి నిజాయితీగల రాజకీయ సామాజిక కార్యకర్తలు నిస్సహాయులుగా, చైతన్యరహితులై నిలిచిపోతున్నారు. డబ్బు, అధికార విషవలయంలో చిక్కిన శాసనకర్తలు, వారి సన్నిహిత అధికారగణం స్థానిక స్వపరిపాలనను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నది. లాంఛన ప్రాయం చేస్తున్నది. ప్రజాబాహుళ్యం, చైతన్యవంతంగాకుండా కాపలా కాస్తున్నది. ధనబలం, కండబలం, అధికార వ్యామోహం పైచేయి చేసుకుంటున్నాయి. రాజకీయ సంస్కరణల ఆవశ్యకతను ఈ అనుభవం మరింత ధృవపరుస్తున్నది.

నిధులు లేని విధులు, అధికారాలు లేని బాధ్యతలు పూర్తిగా అర్ధరహితం. విధులు, నిధులు, అధికారాల్ని రాజ్యాంగబద్ధంగా పంచాయితీ రాజ్ వ్యవస్థలకి బదలాయించి తీరాలి. ప్రజా సంబంధ బాంధవ్యాలతో కూడిన ప్రతి పని, అనగా ప్రభుత్వాలు నిత్యం చేసే పనుల్లో అత్యధికశాతం స్థానిక స్వపరిపాలనకు హస్తగతం కావడం సుపరిపాలనకు, సురాజ్యానికి అవసపరం. దేశ రక్షణ, విదేశీ వ్యవహారాలు, శాంతిభద్రతల పరిరక్షణతోపాటు భారీ పరిశ్రమలు ప్రాజెక్టుల నిర్వహణ, కార్పొరేటు సంస్థలతో కలిసి పనిచేయడం లాంటి పెద్ద పనులు, వాటి విధాన రూపకల్పనల నిర్వహణ స్థూలంగా కేంద్రం, రాష్ట్రం నిర్వహిస్తాయి. అనుభవాల వెలుతురులో ఈ పని పంపకాలు సవరించుకోవచ్చును. ప్రజల రాజ్యం, ప్రజల చేత, ప్రజల కొరకు అను నానుడిని మరింత అర్ధవంతం చేయడం అందరి బాధ్యత.

యుగయుగాల నుండి మానవున్ని మానవుడుగా తీర్చిదిద్ది అనాగరికతనుండి నాగరిక ప్రపంచంలో ఉన్నత స్థాయికి లేవనెత్తుతూ సమాజాన్ని స్వర్గతుల్యం చేయనుద్దేశించిన మతాలు, ఆచారాలు, పెద్దల బోధనలు కొందరు స్వార్ధ పరుల కారణంగా సమాజానికి ఆశించినంత మేలు చేయడంలేదు. అనేక సందర్భాలలో మూఢనమ్మకాలను మూర్ఖపు ఆచారాలను కొనసాగించడానికి ఉపయోగపడడం అత్యంత బాధాకరం. ఈ రంగం గూడా తీవ్రమైన సంస్కరణలకు లోబడదం దేశాభ్యుదాయానికి గొప్ప ఉపయోగం.‘ ప్రేమ ’ అనుమానవీయ విలువలకు ప్రతీకగానున్న క్రిష్టియన్ మతం, శాంతి (సలామత్)కి మారుపేరైన ఇస్లాం మతం విశ్వ మానవ కళ్యాణానికి మార్గదర్శిగానున్న హిందుమతం, ఇతర మతాలన్నిగూడా “ పరమాత్మ”ను దర్శించడానికి వేరు వేరు మార్గాలు మాత్రమేనని పరమాత్ముడొక్కడే ఒక్కడని ఈ మతాలన్ని ఘోషించడం ఆనందదాయకం. ఆలాగే వివిధ వృత్తుల ఆధారంగా ప్రారంభమై కులాలుగా శాశ్విత విభజనకు లోబడిన దాని వెనకగూడా శ్రమవిభజన ఉన్నది. పరిశ్రమే సృష్టికి మూలం. పరిణామానికి హేతువు. వివేకానందుడు సెలవిచ్చినట్లు తాత్విక చింతనలన్ని ఆచరణాత్మకం ఆధునీకరణం చేయబడాలి.

## అనుష్టాన వేదాంతం

ప్రపంచీకరణయుగంలో ప్రపంచ మానవులంతా ఒకే ఒక పరామత్మ స్వరూపులనే సమున్నత భావాన్ని బుద్ధి జీవులంతా ఈ భిన్నత్వంలోని ఏకత్వాన్ని దర్శింపచేయాలి. ఈ జాగృతి, ఈ గ్రామోదయ స్ఫూర్తి కల్పన అందరి కర్తవ్యంగావాలి. స్థానిక స్వపరిపాలనకవసరమైన మానవ సంబంధాల ప్రాధాన్యతను తెలియచేయడానికే కులమతాల ప్రసక్తిరావడం జరిగింది. వీటి పరిణత పాత్ర సామాజిక చైతన్య ప్రాభవానికి అత్యవసరం.అలాగే స్వచ్ఛంద సంస్థలు సహకార సంఘాలు గ్రూపులు ప్రజల మధ్యనున్న కృత్రిమ అడ్డుగోడల్ని కూల్చుతూ అపార్ధాలను తొలగించడానికి, స్వపరిపాలన స్పృహను కల్పించి పోషించడానికి ప్రబల సాధనాలుగా ఉపకరిస్తాయి. సుపరిపాలనకు కావలసింది భయ భీతి కాదు, స్నేహం, సహృదయం, సహకారం ప్రధాన చోదకశక్తిగా పరిణమించాలి. రాజకీయపార్టీలు ప్రజా సంఘాలు వాటి సిద్దాంతాలు వాటి ప్రవర్తనా నియమావళ్లు పరివర్తన చెందాలి. అందుకు చైత్యవంతమైన నాయకగణం నిరంతరం చొరవ చేయాలి.

గత మెంతో ఘనకీర్తిగల భారతీయులమైనా చారిత్రక దుర్ఘటనల కారణంగా మానవాభివృద్ధి మహ ప్రస్తానంలో భౌతికంగా, ఆధ్యాత్మికంగా చాలా వెనకబడిపోయినా తమ తమ ఉనికికి గుర్తింపు సాధించే దశలో ఆరాటపడుచున్నాం. మత, భాష, ప్రాంత అడ్డుగోడల్ని అధిరోహించి మానవులంతా ఒకటేనను విశ్వాసంతో ముందడుగు వేస్తున్నాం. మానసికంగా స్థిరపడిన అడ్డుగోడలు కూల్చితే పోయేవికావు. మార్చితేనే పోతాయి. మానవీయ పౌర సమాజసృష్టి మనందరి లక్ష్యం. స్థానిక స్వపరిపాలపై చర్చను చిన్న రాష్ట్రాల ఆవశ్యకతని ప్రస్తావించకుండా ముగించలేము. సమైక్య భౌగోళిక పరిస్థితులు, ఒకే భాష, ఒకే రకమైన సాంస్కృతిక సాంప్రదాయాలు ఒకే చరిత్ర అసమానతలతో ఒకేవెనకబాటుతనం. ఈ ఐదు అంశాలు, విడిగాగాని ఒక దానితో ఒకటి జత పడిగాని అక్కడి ప్రజల ఉనికిని, స్వతంత్రతను నిలబెట్టుకోవడానికి ప్రత్యేక రాజకీయ విభాగంగా ఏర్పడడానికి ఉద్య మించడం సహజం. సమర్దవంతమైన రాజకీయ నాయకత్వం ఉత్పన్నమయే వైరుధ్యాల్ని సామరస్యంగా పరిష్కరించగల్గితే ప్రజల మధ్య సదవగాహన పెరిగి జాతీయ సమైక్యతకి తోడ్పడుతుంది. తద్విరుద్దంగా ఆసమానతల్ని అదునుగా చేసుకుని బలవంతులు బలహీనుల్ని అణచి వేస్తూ మిత్రవైరుధ్యాల్ని శత్రు వైరుధ్యాలుగా మార్చితే దానికి వేర్పాటు ఒకటే పరిష్కారమార్గం. వికేంద్రీకృత స్థానిక స్వపరిపాలనకు ఇది అవసరం. సమగ్ర సమ్మిళిత అభివృద్ధికి జాతీయత పురోభివృద్ధికి అది అత్యవసరం.

ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర వాదన అత్యంత హేతుబద్దం, సహజం. ఆంధ్ర రాష్ట్ర పాలకవర్గం విడిగానుండిన 'తెలంగాణా'తో చేసుకున్న అన్ని ఒడంబడికల్ని ఉల్లంఘించిన సాక్ష్యాదారాలు ఈ వేర్పాటువాదం ఎంత సహేతకమైనదో నిరూపిస్తున్నాయి. 1956 నాటి పెద్ద మనుషుల ఒప్పందం ఉల్లంఘన, 1972 నాటి జై ఆంధ్ర ఉద్యమాల ఫలితంగా ప్రాంతీయ కమిటీని రద్దు పరుస్తూ ముల్కి నిబంధనను రద్దు పరచడం, ఆరు సూత్రాల ప్రాంతీయ బోర్డు తతంగాన్ని తూతూమంత్రంగా నిర్వహించడం, యన్.టి.ఆర్.గారు ప్రకటించిన 610 జి.ఓ.ను అమలుపర్చ నిరాకరించడం ముఖ్య ఘట్టాలు. ఈనాటి ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఉద్యమం ఒక స్వతంత్రం. స్వావలంబన ఉద్యమ స్థాయికి చేరుకున్నది. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణా వాదాన్ని గుర్తించడం, పార్లమెంటు

ఉభయ సభలల్లో బిల్లు అమోదం పొంది అధ్యక్షుని సంతకంతో చట్టంగా మారడం గొప్ప విజయం. దేశంలో 29వ రాష్ట్రంగా 'తెలంగాణా' రాష్ట్రం అవతరించడం ప్రజాస్వామ్య ప్రజా ఉద్యమ విజయానికి తిరుగులేని నిదర్శనం "తెలంగాణా" రాష్ట్ర నాయకులు ఈ విజయాన్ని సార్ధకం చేయవలసి ఉన్నది. అధికార వికేంద్రీకరణ ద్వారా "నవ తెలంగాణా"గా "సామాజిక తెలంగాణా"గా తీర్చి దిద్దవలసి యున్నది. 1947-48లో కొనసాగిన చరిత్రాత్మక "తెలంగాణా పోరాట" అమర వీరులు కన్నకలలు, జరిగిన ఒప్పందాలన్నిటిని ఉల్లంఘించిన తర్వాత 1969 నాటి ప్రభుత్వ వ్యతిరేక ఉ ద్యమంలో నెలకొరిగిన వందలాది త్యాగధనుల కోరికలు, ఆ తర్వాత నిరాశ నిస్పృహలతో ఆత్మహత్యలకు తెగించిన 1200 మంది తెలంగాణావాదుల కలలన్నిటిని సాకారం చేసే గురుతుర బాధ్యత అన్ని రాజకీయ పార్టీలు, పౌర సమాజ నాయకుల భుజస్కంధాలపైనున్న చారిత్రిక సత్యం విస్మరించరానిది. సమైక్యాంధ్రను విడదీసి "తెలంగాణా" "ఆంధ్రప్రదేశ్" రెండు రాష్ట్రాలుగా విభజించిన తీరు "లోపభూయిష్టంగా" నున్నదని "దీన్ని చూస్తూ భరతమాత కన్నీళ్ళు పెట్టింద"ని ఈ ప్రక్రియ ఫలితంగా "శిశువుకు జన్మనిచ్చినప్పటికి తల్లి మాత్రం చనిపోయిందని వారి భావం. ఇది ఆధిపత్యభావం, అధికార వారి మనస్తత్వంగా ఖండించదగింది. తెలంగాణా రాష్ట్రావతరణ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ పోరాట ఫలం. వేలాది దేశభక్తుల త్యాగఫలం.

# 11. రాజకీయార్ధిక విశేషాలు

రాజకీయం, ఆర్ధికం రెండు వేరు వేరు పరిధులు గల స్వతంత్ర రంగాల శాస్త్రాలు ఐనా సామాజిక శాస్త్రాలు సామాజిక పరిణామ దిశ, దశలను గమనించాలంటే వీటి మధ్యనున్న అవినాభావ, సామాజిక సంబంధ బాంధవ్యాల స్థితిగతుల విశ్లేషణ అవసరం. న్యాయంగా రాజకీయ – ఆర్ధికాంశం ఒకే నాణానికుండే రెండు ముఖాలు. ఒక దాన్ని విస్మరించి రెండవ వాస్తవాన్ని గ్రహించలేము. విడదీయ రాకుండా ముడిబడియున్న వేరు వేరు ప్రక్రియలు. నిత్య నూతన ఆవిష్కరణలతో ప్రభావితమయ్యే సంక్లిష్ట సామాజిక సమస్యలపై సదవగాహన కలగాలంటే సమకాలీన రాజకీయార్ధిక పరిస్థితులను కొన్నిటిని స్థూలంగా మరికొన్నిటిని సూక్ష్మంగా పరిశీలించడం అవసరం. వాటిలో అనుదినం జరిగే పరివర్తనలను గమనించడం అవశ్యం.

1. దేశ మహోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) ఇటీవల కేంద్ర నేర పరిశోధనశాఖ (సిబిఐ) వారి భావదాస్యాన్ని నిశితంగా విమర్శిస్తూ ఆసంస్థ కేంద్ర ప్రభుత్వ పంజరంలోని రామచిలకై పోయిందని, అటువంటి చిలక పలుకులకు విలువే లేదని చమత్కరించి ఖండించింది. అలాగే రెండు దశాబ్దాలుగా కుంటుతున్న సరళీకృత, ఆర్ధికాభివృద్ధికి మూలకారణం మన ఆర్ధిక వ్యవస్థ శతాబ్దాల కాలం నుండి సామ్రాజ్యవాద ఉక్కుపంజరంలో బంధించియుండడమే నంటారు కొందరు. రాజకీయార్ధిక శాస్త్రవేత్తలు అది ఎంతవరకు హేతుబద్ధమో విశ్లేషించదగినది. సంస్కరణలు బహు ముఖంగా గాక కేవలం ఆర్ధిక ఉదారవాద రూపంలో జరిగినవి. ప్రజా వ్యతిరేక శక్తుల ప్రతిఘాత విధానాలతో పోరాడి ప్రజలు సాధించిన విజయాల ఫలితంగా ఈ సంస్కరణలు జరగలేదు. ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం ఇందులో లేదు. ఐనా నిరంతర ప్రజా ఉద్యమాల ప్రభావం ఈ ఆర్ధిక సంస్కరణల వెనక ఉన్నది పెట్టుబడులపై లాభాలను పెంచుతూ ధనాఢ్య వర్గాల సంపదను పెంచడం. ఉద్యమించిన ప్రజల కోపాలను చల్చార్చడానికి సంక్షేమ కార్య క్రమాలను చేపట్టడం ఈ సంస్కరణల లక్ష్యం. ప్రజాస్వామ్య ఉద్యమ ఫలం అసమగ్రంగా, పాక్షికంగానైనా ప్రజా చైతన్యాన్ని పురోగమింప జేసింది.

అంతవరకు అనేకానేక అవసరాలకు విలువైన విదేశీ మారకాన్ని ప్రపంచబ్యాంకుద్వారా వివిధ దేశాల ఔదార్యంపై ఆధారపడి పొందేవారం. ఆర్ధిక సంస్కరణల ఫలితంగా దేశ విదేశీ పెట్టు బడులు గణనీయంగానే చేరుకుంటున్నవి. టన్నుల కొలది బంగారపు తాకట్టును విడిపించుకుని విముక్తి పొందడంతోపాటు ఈనాటికి అంతకు సుమారు రెండు రెట్లు విదేశీ మారక నిలువలతో నున్నాం. సమాచార, సంచార విప్లవాల మేలు కలయిక ఫలితంగా విద్య, విజ్ఞాన రంగాల పురోభివృద్ధి గణనీయంగా జరిగింది. సోవియట్ యూనియన్ అస్తమయం దురదృష్టకరమే ఐనా మేడి పండులాంటి 'సోషలిజం' నుండి శాశ్వత విముక్తి జరిగింది. ఐతే అభివృద్ధిదాయకమైన పెట్టుబడిదారి వ్యవస్థతో పాటు దళారి (క్రోని) పెట్టుబడి దారి విధాన ప్రాబల్యం పెరిగింది. తాజా సమాచారం ప్రకారం షుమారు 120 లక్షల కోట్ల దేశ సంపద అనుత్పాదకంగా, నల్లధనంగా శిశువుకు దక్కని స్తన్యంగా వృధా అవుతున్నది. సంపద పెరిగినా అసమానతులు, పేదరికం, అసమాన వాణిజ్య వ్యాపారంలాంటి దోషాల, నుండి బయట పడుతూ స్వతంత్ర, లాభపాటి వాణిజ్యరంగాల్లో అపూర్వ అనుభవ సంపదను

సాధించడం జరుగు చున్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సముచిత స్థానాన్ని పొందగల్గుతున్నాం. దేశంలో జనాభా పెరుగుదల అందులో యువతరం ఎదుగుదల కారణంగా ఉత్పాదకత పెరగకపోయినా సగటు ఆంతరంగిక ఉత్పత్తి పెరిగింది. కుటుంబ పోషణ పోగా మిగులును భద్రపరచుకునే స్థితి ఏర్పడుచున్నది. మధ్యతరగతి అనూహ్యంగా పెరుగుచున్నది. ధనికులు, పేదల మధ్య అంతరంగూడా అదేపనిగా పెరిగి పోతున్నది. ఈ ఆర్థిక అనర్థాలకు అడ్డుకట్టలు వేస్తూ లాంఛనప్రాయమైన రాజకీయ ప్రజా స్వామ్యాన్ని ఆర్థికంగా సమహిత ప్రజాస్వామ్యంగా మార్చే రాజకీయ సంస్కరణోద్యమం దేశ భక్తులందరిని తమ విధ్యుక్త ధర్మ నిర్వహణకై పిలుపునిస్తున్నది. సమరశీల ప్రజల ఆర్థిక, సామాజిక రాజకీయ పోరాటాల ఫలితంగా వచ్చిన స్వతంత్ర సార్వభౌమాధికారం, అధికార మార్పిడి ద్వారా రావడం ఫలితంగా ప్రజాబాహుళ్యం రాజకీయ పాత్ర అవసరమున్నంత వేళ్ళూనుకోలేక పోయింది. ఎన్నికల రూపంలోని ప్రజాస్వామ్యం నిజ జీవితంలో ధనాఢ్య వర్గాలభోజ్యంగా మారింది. శుష్క ప్రియాలు శూన్య హస్తాలు ప్రజా బాహుళ్యానికి మిగలగా విలాసాలు వికృత రాజకీయాలు శ్రీమంతులకు దక్కుచున్నాయి. రాజకీయాల్లో ధనం ఒక బలమైన ఇంధనంగా మారింది. ప్రజాస్వామ్య ఎన్నికల పుణ్యమానంటూ కనీ వినీ ఎరుగని రీతిలో రాజకీయాల్లో ధన ప్రభావం పెరుగుచున్నది. రాజకీయ పార్టీల అధినేతలు డబ్బున్న వారికే టికెట్లు ఇస్తామని నిస్సిగ్గుగా ప్రకటనలిస్తున్నారు. ఆర్థిక నేరస్థులు అత్యధికంగా శాసన కర్తలుగా, మంత్రులుగాగూడా మారుతున్నారు. వీరి నీడలో అధికారగణం తమ ప్రమాణాలన్నిటిని ప్రక్కనపెట్టి నేరమయ రాజ కీయాలకు ఉపయోగపడుచున్నారు.

వరస జ్వరపీడితుడైన రోగికి అనుభవజ్ఞుడైన వైద్యుడు తాత్కాలిక చికిత్సతోపాటు వరస జ్వరానికిగల కారణాన్ని తెలుసుకుని దానికి తగు శాశ్వత చికిత్స చేస్తాడు. అలాగే సమర్థవంతమైన రాజకీయనాయకత్వం సుదీర్ఘకాలంలో లక్షల కోట్ల రూపాయల విలువగల ప్రజాధనం లూటీ అయిన తీరుతెన్నులను విశ్లేషిస్తుంది. దానికి గల మూలకారణం దేశం స్వతంత్రానంతర కాలంలో ఏనాడో సంస్కరించవలసిన రాజకీయార్థిక వ్యవస్థలో గూడుగట్టుకొనిపోయిన దోషాలు, స్వార్థాలనే వాస్తవాలను గమనిస్తుంది. దేశ ప్రగతివేగం 8-9 శాతం పెరిగి దేశం వెలిగిపోతుందని, మెరిసిపోతుందన్న ఎన్.డి.ఎ పాలనగాని పేదరికం చాలా తగ్గిందని గ్రామీణ కార్మికవర్గ జీతభత్యాలు గణనీయంగా పెరిగినవని అయిదు సంవత్సరాల అనతికాలంలోనే విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉన్న మొత్తంలో నాల్గోవ వంతుకి పెరిగిందని, నాలుగున్నర లక్షల గ్రామాలకు కొత్తగా విద్యుత్తు సరఫరా చేయగలిగామని, రెండున్నర లక్షల గ్రామ పంచాయితీలను సమాచార పరిధిలోకి తేగలిగినామని, అయిదు సంవత్సరాల క్రితం ఒకటంటే ఒక కోటి సెల్‌పోన్ల వాడకం జరగగా అది ఈనాడు అద్భుతంగా వ్యాపించి 90 కోట్లకు చేరడం ఇవన్నియు యు.పి.ఎ. ప్రభుత్వం సాధించిన సమ్మిళితాభివృద్ధి ఫలితం కాదా అని ఈనాటి పాలకులు తమ గొంతుచించు కుంటున్నారు. ఇవన్ని సామాన్య పాక్షిక సత్యాలు మాత్రమే. ఈనాటి నవ నాగరిక ప్రపంచంలో అత్యవసరాలుగా పెరిగిపోతున్న వస్తువాహనాల కొనుగోలు శక్తిలో ప్రపంచ సరాసరితో పోల్చినప్పుడు మనదేశ వాసులెక్కడున్నారన్నది కీలకమైన కొలమానం. సామాన్యుడి (ఆమ్ ఆద్మి) కొనుగోలు శక్తి పెరగడంలో మనదేశం ఈ ప్రపంచంలోని అయిదవ పెద్ద ఆర్థిక వ్యవస్థలో ఒకటిగా తన స్థానాన్ని సాధించి, గొప్ప ప్రపంచ దేశాల విదేశీ వ్యాపార సరళిలో మన దేశం తన వార్షిక అంతరంగిక ఆదాయంలో 50 శాతానికి చేరిందనేది నమ్మశక్యంగాని యదార్థం.

తలసరి ఆదాయంలో 180 ప్రపంచ దేశాలల్లో మనం 150 తర్వాత స్థానంలోనే ఇంకా మిగిలి యుండడానికి సమాధానం చెప్పవలసిన బాధ్యత రాజకీయ ఆర్థిక శాస్త్రవేత్తలదే.

అవినీతి జాడ్యం నిత్య నూతన అవతారాలతో విస్తరిస్తూ జాతీయాభివృద్ధిని అరికట్టడంతోపాటు పౌర జీవితాన్ని కలుషితం చేస్తున్నది. అధికార దాహంతో కకావికలమవుతున్న రాజకీయ పార్టీలు వాటి నాయకులు, అక్రమార్జనకు బరితెగిస్తున్నారు. అధికారాన్ని కైవసం చేసుకోవడానికి పడరానిపాట్లు పడుతున్నారు. ద్రవ్యలోటు, కరంట్ ఎకౌంటులోటు, ద్రవ్యోల్బణం అదేపనిగా పెరిగిపోతూ రుణభారాన్ని సబ్సిడీల భారాన్ని తీవ్రం చేస్తున్నవి. రూపాయి విలువ పడిపోవడం వలన దేశ పరువు ప్రతిష్టలకు ఇదివరకెన్నడులేని భంగపాటు కల్గుచున్నది. చివరకు న్యాయస్థానాల జోక్యంగూడా ఆశించిన ఫలితాలనివ్వడంలేదు. మౌలిక సంస్కరణలపై రాజకీయ నాయకత్వం తమ దృష్టిని సారించని ఎడల దేశంలో అరాచకం పెచ్చరిల్లే పరిణామము ఆలోచనా పరులందరిని ఆందోళనకు గురిచేస్తున్నది. సామాజిక స్పృహతో దేశభక్తిగల వ్యక్తులు, పార్టీలు, పౌర సంఘాలు అధికార దాహంగల వారందరిని రాజకీయాలనుండి వెలివేస్తూ మరో స్వతంత్ర పోరాట స్ఫూర్తితో ఒక స్రవంతిగా ముందడుగు వేయడమొక్కటే పరిష్కారమార్గం.

రాజకీయ సంస్కరణల గురించి ఆ విభాగంలో స్థూలంగా చర్చించడం జరిగింది. వాటితో ముడిబడిన ఈ రాజకీయార్థిక విశ్లేషణలనిక్కడ చర్చిస్తున్నాం. దేశ ఆర్థికాభివృద్ధి రేటు పెరుగుదలలో ఏర్పడిన స్థంభన, లోటు బడ్జెటు, పనిలోజాప్యం, మితిపోరుతున్న ఆర్థిక నేరాలు, విదేశీ పెట్టుబడి దార్ల వికృతపాత్ర, ఎగుమతి, దిగుమతుల మధ్య పెరిగిపోతున్న అగాధం. (కరెంటు అకౌంటులోటు) దాని భారం రూపాయి విలువ పతనం, పేదరిక నిరోధానికై ఆచరించే సంక్షుభిత ఆర్థిక విధానాలు వాటి వివిధ అంశాలపై చర్చ సందర్భోచితం.

పెట్టుబడిదారి అర్ధశాస్త్రంలో చోటుచేసుకున్న సైద్ధాంతిక సంక్షోభానికి నాల్గు సంవత్సరాలుగా ప్రపంచాన్ని అలుముకున్న ఆర్థిక సంక్షోభమే ముఖ్య తార్కాణం. 1930 తర్వాత కని విని ఎరగని రీతిలో ప్రపంచ మానవాళిని ఎదుర్కుంటున్న దారుణమైన సంక్షోభమిది. సైద్ధాంతికంగా "స్వేచ్ఛా మార్కెటు" (పెట్టుబడిదారి విధానం) "నియంత్రిత ఆర్థిక విధానం" (సోవియట్ తరహా సోషలిజం)ల పరాజయాన్ని కళ్లారా చూస్తున్నాం. "పెట్టుబడిదారి" ఆర్థిక సిద్దాంత వేత్తలు అటు "సోషలిస్టు" సిద్ధాంత కర్తలు ఈ పరిణామం అగమ్యగోచరమంటూ తాము నమ్మిన సిద్దాంతాలకు పదును బెడుతూ వాటినే పటిష్టవంతంగా అమలు పరిస్తే సంక్షోభాలు తొలగిపోతాయని నమ్మబలుకుచున్నారు. కాని వాస్తవాలు వీరి వాదనలను ధృవ పర్చడంలేదు. పరిస్థితి క్షీణిస్తున్నది తప్ప మెరుగు పడడంలేదు.

ఏ దేశానికైనా ముఖ్యంగా వెనకబడిన దేశాల అభివృద్ధికి ఆర్థిక వనరులు అత్యవసరం. వెనకటికి దేశాలు తమ సొంత సంపదలపై ఆధారపడి వివిధ రంగాల అభివృద్ధికి వనరులను సమకూర్చుకునేవి. వందల సంవత్సరాల పారిశ్రామిక విప్లవం తదనంతరం వివిధ దేశాల మధ్య వాణిజ్య వ్యాపారాలు పెంపొందడం ఫలితంగా ద్రవ్యం(పెట్టుబడి)ఒక సరుకుగా మారి వెనకబడిన దేశాలకు ఎగుమతి కావడం, దానిపై వడ్డీలు సంపాదించుకోవడం చూస్తున్నాం. 19వ శతాబ్దంలో బాగా సంపాదించిన పాశ్చాత్య పెట్టుబడిదారి వర్గాలు తాము తయారు చేసిన భారీ మధ్యరకం

యంత్రాలను ఎగుమతి చేస్తూ చౌకగా ముడి సరుకులను కొనుగోలు చేయడం జరిగింది. ఆ కారణంగా వెనకబడిన దేశాలు స్వావలంబన సిద్ధాంతం ఆధారంగా గాక పరాధీన అభివృద్ధి మార్గాలలో గత్యంతరం లేక నడవవలసి వచ్చింది. మార్కెటు యంత్రాంగాన్ని పూర్తిగా తమ స్వార్థాలకు వినియోగించడం, అందుకొరకే బలవంతమైన పాశ్చాత్య దేశాలు రెండు పర్యాయాలు ప్రపంచ యుద్ధాలకు తెగించడం, కోట్లాది మానవులు తమ ప్రాణాలు కోల్పోవడం 20వ శతాబ్ది మొదటి అర్ధభాగంలో చూచిన మారణ హోమాలే సాక్ష్యం. ఇటువంటి స్వేఛ్ఛా మార్కెటుసిద్దాంతం కారణంగానే 1930 నాటి తీవ్ర ఆర్థిక మాంద్యం ప్రపంచ వ్యాపితంగా దేశాల ఆంతరంగిక (జి.డి.పి) ఉత్పత్తిని తీవ్రంగా కుదిపివేసింది. ఆర్థికంగా వెనకబడిన దేశాలు సామ్రాజ్యవాద దేశాల ఆర్థిక దోపిడి, నిర్బంధ పరిపాలనల కారణంగా పూర్తిగా బానిసలైపోయినవి. అంతవరకు సాధించిన కొద్దిపాటి అభివృద్ధిని కొనసాగించలేక చతికిలబడిపోయినవి. పాశ్చాత్య దేశాలలో పారిశ్రామికోత్పత్తిని తిరిగి కొనసాగించడానికై పెట్టుబడిదారి వర్గాలు పడుతున్న బాధలనుండి పునరుజ్జీవనం పొందే విధంగా అక్కడి అర్ధశాస్త్రకోవిదులు తీవ్రంగా ఆలోచించారు. ఇంగ్లాండుకు చెందిన అర్ధశాస్త్రవేత్త కేన్స్ గారు తమ పునర్నిర్మాణ సిద్దాంతాన్ని ఆవిష్కరించినారు. పారిశ్రామికవేత్తలైన పెట్టుబడిదారి వర్గాలు తాము సంపాదించిన సంపదలో కొంత భాగాన్ని కార్మిక వర్గ వేతనాలతోపాటు వారి సంక్షేమ కార్యక్రమాలపై విధిగా వెచ్చించాలని కార్మికుల ఆదాయాలను పెంచి వారి కొనుగోలు శక్తిని గూడా పెంచాలని ఈ సిద్దాంత కారులవాదన. అప్పుడే కార్మికవర్గం అధికోత్పత్తికి, అధిక లాభాలకై శ్రమించి పనిచేస్తుందని ఈ సిద్దాంతం సారాంశం. కేన్స్ గారి ఈ సిద్దాంతం కొంత ఉపయోగపడి పెట్టుబడిదారి వర్గాలు ఊపిరి పీల్చుకున్నారోలేదో తిరిగి మార్కెటులో అధిక, అత్యధిక లాభాల వేటలో అగ్ర రాజ్యాల మధ్య సంఘర్షణలు తలెత్తినవి. 1939-1944 నాటి రెండవ ప్రపంచయుద్దానికి దారితీసినవి. చివరకు ప్రపంచాన్ని ఆక్రమించాలనుకున్న జర్మని, జపాన్, ఇటలి యుద్దోన్మాదులు ఓడి మట్టికరచిపోవడం మిత్ర పక్షాలైన రష్యా, అమెరికా, ఇంగ్లాండ్ తదితర దేశాలు గెలవడం చూచినాం. తిరిగి ప్రపంచ యుద్ధాలు రాకుండా ఉండాలనే సదుద్దేశంతో 1944లో ఇంగ్లాండులోనున్న బ్రెటన్ వుడ్స్‌లో అగ్ర రాజ్యాలు సమావేశమై "ఐక్యరాజ్య సమితి" "ప్రపంచ బ్యాంకు" ప్రపంచ వ్యాపార సంస్థ "గ్యాట్" లాంటి సంస్థలను నెలకొల్పడం జరిగింది. "స్వేచ్ఛా మార్కెటు" వ్యవస్థ దేశాల మధ్య సమతుల వ్యాపారానికి తోడ్పడుతుందని అభివృద్ధి చెందవలసిన దేశాలు దీని ద్వారా త్వరితంగా అభివృద్ధి చెందగల్గుతాయని, సామ్రాజ్యవాద దేశాల అధిక లాభాల వేట అరికట్టబడుతుందనే భ్రమలు ఎన్నడో పటాపంచలైపోయినవి. రెండు ప్రపంచయుద్దాల మారణ హోమాలే దీనికి ప్రబల సాక్షమని పెట్టుబడిదారి సిద్దాంతం (మార్కెటు స్వేచ్ఛా సిద్దాంతం) ప్రపంచదేశాల ఆర్థిక సామాజిక పునరు జ్జీవనానికి తోడ్పడ లేదని స్పష్టమైపోయింది. రెండవ ప్రపంచయుద్దానంతరం అర్ధశతాబ్ది కాలంగా కొనసాగిన ప్రచ్ఛన్న యుద్ధ అనుభవాలు దీనికి ప్రబల సాక్ష్యం. ధన దాహంతో అత్యధిక లాభాల వేటలో మార్కెటు వ్యవస్థను తమ ప్రబలసాధనంగా వినియోగించే సామ్రాజ్యవాద తృష్ణగల బహుళజాతి బడా పెట్టుబడి దారి వ్యవస్థ స్వైర విహారం చేసినంతకాలం దాని అంతర్గత వైరుధ్యాలు ప్రపంచానికి కనబడలేదు. కాలం విచిత్రమైంది. దివాళా ఎత్తించిన దీర్ఘకాల ఆర్థిక సంక్షోభం ప్రపంచాన్ని ముఖ్యంగా పాశ్చాత్య పెట్టుబడిదారి దేశాల ఆర్థిక పునాదులను కదిలించివేసింది. 2008లో అమెరికాలో బయటపడిన ద్రవ్యలోటు, ఆర్థిక మాంద్యం,

యూరపియన్ యూనియన్ దేశాలకు పాకింది. సామ్రాజ్యవాద దేశాలుగా రెండు శతాబ్దాల కాలం ప్రపంచాన్ని హడలగొట్టిన దేశాలు ఈనాడు అప్పులు తీర్చలేక వడ్డీలు గూడా చెల్లించలేక పొదుపరితనంతో బ్రతకాలని తమ పౌరులను ప్రార్థిస్తున్నవి. నలభైశాతం జనాభా సంపాదించే ఆదాయానికి సరిపడేటంత ఆదాయాన్ని ఒకే ఒక శాతంగా నున్న కుబేరవర్గం తమ విలాసవంత జీవనశైలిపై వెచ్చించడం, అటువంటి అలవాట్లను ఏమాత్రం మార్చుకోలేక పోవడం ఈ పరిస్థితికి మూలం. పెట్టుబడిదారి సిద్ధాంతం ( స్వేచ్ఛా మార్కెట్) సృష్టించిన దుర్వ్యవస్థ ఇది. సుప్రసిద్ధ అర్ధశాస్త్రవేత్త "యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాదు" ఛాన్సలర్ గారైన డా॥ సి. హెచ్. హనుమంతరావుగారు " ఆర్థిక సిద్ధాంత సంక్షోభం – భారతదేశంపై దాని ప్రభావం " అను అంశంపై వ్రాసిన లఘు వ్యాసం ఆసక్తి దాయకమైంది. " స్వేచ్ఛా మార్కెటు వ్యవస్థ " మరియు నియంత్రిత " సోవియట్ రష్యా సోషలిజం " సిద్ధాంతాల వైఫల్యాల కారణాలను తెలియచేస్తూ వాటికి ప్రత్యామ్నాయం " సమ్మిళితాభివృద్ధి కాగల్గుతుందా? అసలు " సమ్మిళితాభివృద్ధి" స్వభావమేమిటి? క్షుణ్ణంగా విశ్లేషించాలని సూచించినారు. ఇది మేధావులంతా ఆహ్వానించదగ్గ ప్రతిపాదన.

స్వేచ్ఛా మార్కెటు వ్యవస్థ సృష్టించిన అసమానతలు, అనర్థాలు వర్ణనాతీతం. శాస్త్రీయంగా సగటు దేశీయ ఉత్పత్తికి ఒక నిర్ణీతదామాషాలో కరెన్సీ (నోట్లు) అచ్చు వేసి చలామణిలో ఉంచాలనేది మూలసూత్రం. కాని కేంద్ర బ్యాంకు అధికారులునేటి ఆయా దేశాల ప్రభుత్వాధికారులతో కుమ్మక్కై ఆ దామాషా పరిమితిని కొన్ని రెట్లకు పెంచి నోట్లను అచ్చు వేయించి చలామణి చేశారు. దీనితో నోట్ల ముమ్మరం కట్టలు త్రెంచుకున్నది దేశాలలో ఉత్పత్తి అయిన సరుకుల మార్కెటువిలువ కంటే అధికంగా ద్రవ్య మార్కెటు విస్తరించింది. ఇది రాజకీయార్థిక పరిస్థితిని తీవ్రంగా ప్రభావితం చేసింది. డాలరు విలువ పతనమైంది. ఆర్థిక వ్యవస్థ సాంతం ఛిన్నాభిన్న మైపోయింది. ఈ వ్యాధి అదే ఆర్థిక విధానంతో అనుసంధానంలోనున్న దేశాలకు వ్యాపించింది. ఇలా ఎందుకు జరిగింది? సమాధానం స్పష్టం. బ్యాంకు అధికారులకు ప్రభుత్వాధికారులతో సంబంధం ధృవ పడ్డది. ప్రభుత్వాధి కారులకు రాజకీయ నాయకులతో గల బాంధవ్యం సుదృఢమైపోయింది. వీరందరిని కలిపి చీకటి పనులన్నిటిని " విజయవంతం"గా నిర్వహించే దళారివర్గం పాత్ర విస్తరించింది. ఆయా ప్రభుత్వాల నిఘా విభాగాల కళ్లుగప్పి ఈ మోసానికి తోడ్పడే వర్గం వేరు. ఇలాంటి వారందరి చేతులు తడపడానికి కేంద్రబ్యాంకులు నోట్లనచ్చువేసి దేశద్రోహ చర్యలకు సాహించినవి. కొంతకాలం లోలోపట కమ్మబడినా చివరకు పాపం పండక తప్పలేదు. దీన్ని భారత రిజర్వుబ్యాంకు మాజీ గవర్నరు గారైన డా॥ వై.వి. రెడ్డి గారు " రెగ్యులేటరీ క్యాప్టర్ " అనగా " పట్టుకోబోయి పట్టుబడి "నట్లు చమత్కరించినారు. నిఘా విభాగమే నిందితులుగావడం అవినీతికి పరాకాష్ట. దీని ప్రక్షాళనం తప్ప సంస్కరించడం అసాధ్యం. ఈ సంక్షోభాన్ని లోతుగా పరిశీలించిన మరో అర్ధశాస్త్ర కోవిదులైన డా॥ రాబర్ట్, వి. జాన్సన్ గారిలా అన్నారు. " మార్కెట్ వ్యవస్థ వ్యవహారాలను సమర్థవంతంగా నియంత్రించి సరిచేయగల్గుతామని విచిత్రంగా నమ్మే వారి ఆలోచనల ప్రకారం మార్కెటు వ్యవస్థ నిర్వహణలో ప్రధానపాత్ర ధారులకి ద్రవ్యంతో గొప్ప ప్రమేయముంటుంది. ప్రభుత్వ అధికారులు, మార్కెటు నియంత్రణాధికారులు, ఎన్నుకోబడిన అధికార , అనధికార నాయకగణమంతా ధనానికి ద్రవ్యానికి లోబడే వారే. వీరి శక్తి సామర్థ్యాలను ఇతోధికం చేయడంలో ద్రవ్యం పాత్ర గమనార్హం. దీనికితోడు ఇటువంటి వ్యవహారాలను

సమర్థవంతంగా నిర్వహించే వారికి తగిన పారితోషకాలు, పరిహారాలు, ప్రోత్సాహకాలను అవార్డులు, రివార్డులనివ్వడం అధికార అనధికార పదవులనిచ్చి సత్కరించడం లాంటివిగూడా ప్రత్యేకంగా గమనార్హం. వీటి ప్రభావాన్ని ఏమాత్రం తగ్గించకుండా సమగ్రంగా ఆలోచించాలి." డా॥ జాన్సన్ గారు మన దేశాన్ని గూడా దృష్టిలో పెట్టుకొని చెప్పినట్లున్నది. ప్రపంచవ్యాపితంగా ప్రజల ఆదాయాల మధ్య పెరిగిపోయే వ్యత్యాసాల కారణంగా గూడా సరుకుల డిమాండు తగ్గుచున్నది. ద్రవ్య కొరత కారణంగా పారిశ్రామికవేత్తలు తమ పరిశ్రమల్ని పూర్తికాలం నడపలేక, అప్పులు తీర్చలేక కొత్తగా రుణాలు పుట్టక చతికిలబడి పోతున్నారు. పెట్టుబడిదారి వ్యవస్థ తాత్కాలికంగా సర్దుకుపోయినా, దీర్ఘకాలంలో బ్రతికి బట్టగట్ట గల్గుతుందా అను ప్రశ్న ఇదువరకంటే అనెక రెట్లుగా మేధావులను ఆలోచింపచేస్తున్నది. ఒక గొప్ప అర్థశాస్త్రవేత్త జోసెఫ్ ఐ ష్యుమర్ గారు 70 సంవత్సరాలకు పూర్వమే తమ గ్రంథం "క్యాపిటిలిజం – సోషలిజం ప్రజాస్వామ్యం"లో పెట్టుబడిదారి విధానం అంతరించి సోషలిస్తు వ్యవస్థ అవతరిస్తుందని జోశ్యం చెప్పియున్నారు. ఆనాడు శ్రీ ష్యుమర్ గారికి సోషలిజమే ఒక సుస్థిర ప్రత్యామ్యాయంగా తోచింది. ఈనాటి పరిస్థితి విభిన్నం, విచిత్రం. పెట్టుబడిదారి సిద్ధాంతం వెళ్లొస్తానంటుంటే సోషలిజం జాడలేదు. క్యూబా, వియత్నాం, చైనాలలో సమ సమాజ దిశలో ప్రయోగాలు జరుగుచుండగా పెట్టుబడిదారి దేశాలలో కేన్సగారి ఆలోచనల వెలుతురుల్లో నడుస్తూ పెట్టుబడిదారి సిద్ధాంతం మరి కొంతకాలం తన ఉనికిని కాపాడుకుందామనే ప్రయత్నం చేస్తున్నది. ఏది ఏమైనా పెట్టుబడిదారి స్వేచ్ఛా మార్కెటు సిద్ధాంతం చేతులెత్తేస్తున్నది. అలాగే సోవియట్ తరహా ప్రభుత్వ నియంత్రణ, ప్రజాస్వామ్య రహిత " కేంద్రీకృత ప్రజాస్వామ్య " " కేంద్రీకృత ప్రణాళికాబద్ధ" "సోషలిజం" పునరుజ్జీవనం పొందలేని విధంగా కుప్పకూలిపోయినవి. ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం, ఉత్పత్తి దారుల భాగస్వామ్యంగల ప్రజాస్వామ్యమే శరణ్యంగా అగుపడుచున్నది. ఇదే సమ్మిళిత ప్రజాస్వామ్యమని మన 12వ పంచవర్ష ప్రణాళిక తమ లక్ష్యంగా చెప్పినా అందుకు అనుగుణమైన సంకల్పబలంగల రాజకీయ పొందికలు లేకపోవడం, కనుచూపు మేరలో అగుపించకపోవడం ఆందోళనకరం. ఈ సందర్భంగా 2009 సంవత్సరం అర్థశాస్త్రంలో నోబెల్ బహుమాన గ్రహిత అమెరికా దేశానికి చెందిన శ్రీమతి ఎలినర్ ఓస్ట్రంగారి అభిప్రాయం ఆసక్తిదాయకం. నయా ఉదారవాద పెట్టుబడిదారి మార్కెటు వ్యవస్థ ప్రభుత్వ నియంత్రిత సోషలిస్టు వ్యవస్థలు ఈనాటి ఆర్థిక సంక్షోభాన్ని దాని సైద్ధాంతిక సంక్షోబాన్నిపరిష్కరించలేని పరిస్థితుల్లో ఇది మరీ అవసరం. కార్పొరేషన్లు, కార్టెల్యు, కంపెనీలలాంటి పేర్లతో అవతరించి బహుళజాతి సంస్థలుగా వ్యాపించిన వివిధ బహుళజాతి ఆర్థిక సంస్థలు లాభాలు, అధిక లాభాల దురాశతో శ్రమజీవుల శ్రమ శక్తి ఫలితంగా సృష్టించబడిన సంపదను హరించివేస్తూ తాము మాత్రం విలాసవంత జీవితాలు గడపగా వందలాది కోట్ల కష్టజీవులు కటిక దారిద్ర్యంతో కోట్టుమిట్లాడుచున్నారు. అమానుషమైన ఈ సంస్కృతి సామాజిక సమస్యలను పరిష్కరిం చడంలో పూర్తిగా విఫలమైపోయింది. మానవ శ్రమ ఫలితం దొపిడికి గురిగాకుండా మానవున్ని మానవుడు దోపిడి చేయవీలులేని ప్రభుత్వ నియంత్రిత సమ సమాజ వ్యవస్థను నొలకొల్పుతామనే రష్యా మార్గం దారుణంగా విఫలమైంది. స్వతంత్ర మానవుని ఐచ్ఛిక సహకార నిర్మాణాత్మక ప్రకృతి కంటే నిరంకుశ పరిపాలనకు అధిక సామార్థ్యముంటుందనే ఆసహజ అసాధ్య, భ్రమనుండి ఉత్పన్నమైన వెనకటి గుణదోషమిది.

శ్రీమతి ఎలినర్ ఓస్ట్రంగారి వినూత్న, సునిశిత, ఆలోచన ప్రకారం మొదటిది దు:ఖానికి హేతువైన దురాశ అయితే, రెండవది అమానుషమైన దుస్సాహసం. మొదటిది మానవీయ మార్కెటు వ్యవస్థ పేర నిలువుదోపిడైతే రెండవది సమతాభావం పేరుతో నిరంకుశవాదం, వివిధ రంగాలలో ఉత్పత్తి, రవాణా, పంపకాలల్లో పరస్పర సహయ, సహకార వ్యవస్థల నిర్మాణం పవిత్ర ప్రజాతంత్ర ప్రక్రియలు వాటి నిర్వహణ, సమన్వయం ఈనాటి సైద్ధాంతిక సంక్షోభానికి ఏకైక పరిష్కారమార్గం. ఇదే సమ్మిళితాభివృద్ధికి సోపానం. త్వరితగతిన ఉత్పత్తి నిరంతర పెరుగుదల సాధించడానికి, సమ న్యాయాన్ని శాశ్వితం చేయడానికి బాసట. మేధావివర్గం దీర్ఘంగా ఆలోచించి ప్రయోగించదగిన శాశ్వత ప్రత్యామ్నాయం.

పెరిగిపోతున్న జనాభా యొక్క పెరిగే అవసరాలు తీర్చబడుతూ వాటి ప్రమాణాల్ని కాలాను గుణ్యంగా పెంచాలంటే దేశీయ ఉత్పత్తి పెరగాలి. నాణ్యతగల వస్తూత్పత్తి ఇనుమడించాలి. ఇది సాధ్యపడాలంటే సాంకేతిక విద్యనభ్యసించిన పారిశ్రామికుల సంఖ్య బాగా పెరగాలి. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఈ రంగానికి తగు ప్రాధాన్యతనిస్తూ నిధులను కేటాయించాలి. అసలు విద్యా విధానంలోనే నూతన ధృక్పథాన్ని ప్రవేశపెట్టాలి. ఇదొకటే సరిపోదు, బహుముఖ సంస్కరణలకుపక్రమిస్తూ చరిత్రలో సామాజికాభివృద్ధికి తోడ్పడిన విధానాలన్నిటిని లక్ష్యశుద్ధితో అమలు పర్చాలి. ఉదా॥ పెట్టుబడిదారి విధానం ఒక విధానంగా సంఘ వ్యతిరేకం కానే కాదు. దాని నిర్వాహకులు ప్రదర్శించే శ్రద్ధా సక్తులు పట్టుదలలు ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో పనిచేసే వారిలో అరుదుగా కనిపిస్తాయి. ప్రైవేటు రంగం, వ్యవసాయం, వాణిజ్య వ్యాపారం, సహకారరంగం, పరి శ్రమల నిర్వహణతోపాటు అనేకానేక ఉత్పత్తులలో అత్యంత ఉపయుక్తమైందని ప్రపంచ వ్యాపితంగా రుజువైంది. రక్షణరంగ పరిశ్రమలు తదితర కీలక పరిశ్రమలు ప్రభుత్వరంగంలోనే ఉండకతప్పదు. ఉత్పత్తిదాయక పెట్టు బడిదారి వర్గం, జాతీయాభివృద్ధికి ప్రబలంగా తోడ్పడుతూ జాతీయ సంపదను వేగంగా పెంచగలిగే ప్రధానవర్గం. సరుకులు, సేవల రంగాలలో తోటి ఉత్పత్తిదారులతో పోటీ పడుతూ సరుకుల నాణ్య తలను పెంచగలిగే మనస్తత్వంగల వర్గం. ప్రభుత్వం, కార్మికవర్గం, వినిమయదారులతో ఏర్పడే వైరుధ్యాల్ని శాంతియుతంగా ఉభయ తారకంగా పరిష్కరించుకుంటూ న్యాయంగా తమకు చెందవలసిన లాభాలతో తృప్తి పడే వర్గం దేశ ప్రజల హితాన్ని తమ లక్ష్యంగా ఎంచుకోగలిగిన దేశభక్తియుత పెట్టుబడిదారివర్గం. ఇది దేశాభివృద్ధికి నమ్మదగిన శక్తి. గత శతాబ్దాలకాలంలో పాశ్చాత్య బహుళ జాతి, బడా పెట్టుబడిదారి వర్గం కొనసాగించిన దోపిడి, రాజకీయ జోక్యం, చివరకు అది సృష్టించిన మారణ యుద్ధకాండలు ఈ వర్గానికి తీరని కళంకాన్ని అప్రతిష్టను సంతరింపచేసినవి. జాతి సంపదను పెంచుతూ దేశయువతకి ఉపాధి, ఉద్యోగ అవకాశాలనెన్నిటినో కల్పించే దేశీయ, జాతీయ పెట్టుబడిదారి వర్గం దేశానికే ఒక బలం. అభివృద్ధిలో అంగలు వేస్తున్న చైనా తదితర దేశాలు ఈ వాస్తవాన్ని గమనించి, గుర్తించి ఈ సామాజిక వ్యవస్థను సంపూర్ణంగా ప్రోత్సహించడం గమనార్హం.

అలాగే మార్కెటు వ్యవస్థ మానవ సమాజ మనుగడలో గొప్ప పాత్రను పోషించింది. వస్తు మార్పిడి, ఉత్పత్తుల నాణ్యత, అందుబాటులోనుండే ధరవరల క్రమబద్ధీకరణలో గొప్ప పాత్రను పోషించింది. గుత్తపెట్టుబడిదారీ వర్గాలు బహుళజాతి సంస్థలు సామ్రాజ్యవాదుల ప్రోత్సాహంతో మార్కెటు

వ్యవస్థను అప్రతిష్టపాలు చేసినారు. అలాగే బ్యాంకింగ్ వ్యవస్థ, సహకార వ్యవస్థ, స్వచ్ఛంద సంస్థలు ఎవరి స్థానంలో అవి పౌర జీవితానికి సుఖం శాంతిని సమకూర్చుచున్న సహజ సిద్ధ వ్యవస్థలు. ప్రతి వ్యవస్థ ఈనాటి సంక్లిష్ట సంక్షుభిత సమాజంలో అవసరమైన నియమ నిబంధనలకు లోబడి వాటిని పాటించక తప్పదు. ఈ బాధ్యతల నియంత్రణాధికారాలు చట్టబద్దంగా వివిధ స్థానిక స్వపరిపాలనా అధికారులకివ్వడం ఉచితం.

రాచరిక వ్యవస్థ, భూస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారి వ్యవస్థ, చివరకు “ సోషలిస్టు” వ్యవస్థ గూడా సమతుల సుస్థిర సామాజిక వ్యవస్థ సాధన, ప్రపంచ శాంతి స్థాపనలో విఫలమైపోయినవి. కాబట్టి ప్రపంచానికి మరో ప్రత్యామ్నాయ ఆర్థిక సామాజిక రాజకీయ వ్యవస్థ రూపకల్పన జరగాలని కొందరు ఆర్థిక, సామాజిక, రాజకీయ సిద్దాంత కర్తలు తీవ్రంగా ఆలోచిస్తున్నట్లగుపడుచున్నది. పిడివాదులుగానున్న వారంతా పెట్టుబడిదారి విధాన పక్షపాతులుగా అదే స్వేచ్ఛాయుత మార్కెటు వ్యవస్థ కొన్ని సవరణలతో మానవ మనుగడకి ఎల్లకాలం అని వార్యమని వాదిస్తున్నారు. మార్క్సిజం పేరుతో సోవియట్ సోషలిజాన్ని నమ్మే వారైతే “ కార్మిక వర్గ నియంతృత్వం”, “కేంద్రీకృత ప్రజాస్వామ్యం”, “ కేంద్రీకృత ప్రణాళికాబద్ధ అభివృద్ధి” ప్రధానాంశాలుగాగల ప్రభుత్వ నియంత్రిత సోషలిస్టు సిద్దాంతమే నంటూ మానవున్ని మానవుడు దోపిడి చేయలేని ఈ సమాజాభివృద్ధికి శాశ్వత పరిష్కారమని వాదిస్తారు.

శాశ్వత ప్రత్యామ్నాయాలగురించి మాట్లాడే సాహసం చేయకపోవడమే నడుస్తున్న చరిత్ర నేర్పుచున్న గుణపాఠం. జ్ఞాన విజ్ఞానంలో నిత్య నూతన ఆవిష్కరణల వెలుతురుతో శరవేగంగా సాగిపోయే సమాజ భవిష్యత్తు గురించి మాట్లాడే అర్హత ప్రస్తుతం మనకు లేదు. ఆది ఆసాధ్యంగూడా. ప్రస్తుత గందరగోళ పరిస్థితులనుండి బయటబడుతూ సన్నిహిత భవిష్యత్తులో ఉపాధి ఉద్యోగ కల్పన ద్వారా పేదరిక నిర్మూలన, పౌష్టికాహార సరఫరా, విద్యా, వైద్య సదుపాయాలన్ని బలహీన వర్గాల వారికి అందుబాటులోకి తేవడం, రాయితీలు సబ్సిడీలుగాక ఆత్మగౌరవంతో స్వావలంబన సిద్దాంతమే ఆలంబనగా దేశ ప్రజలంతా శ్రమించి సుఖ శాంతులతో బ్రతికే మార్గాన్ని అవలంబించడం, అందు కవసరమైన సూత్రాల రూపకల్పన చేయడం తక్షణావసరం.

ప్రపంచ వ్యాపితంగా అన్ని కాలాల్లో మానవీయ సిద్ధాంతాలను రూపొందించిన మహాత్ములు న్నారు. వారి దివ్యస్మృతికి జోహర్లు. ఆయా సిద్ధాంతాలను పామర జనానికి అర్థమయ్యే విధంగా బోధించిన భాష్యకారులున్నారు. వారందరికి నమస్సుమాంజలులు. ఈ తాత్వికులంతా మానవ సమాజ మనుగడ, దాని పరి రక్షణ గురించి పలు విధాలుగా ఉపదేశించినారు. కాని జడత్వంతో చలనరహితంగానున్న సమాజాన్ని మార్చుతూ మధ్యయుగాలనాటి చీకట్లను ఛేదించి ఆధునికయుగ ధర్మాన్ని ప్రసరించే వెలుతురులోకి ఆకర్షించడం తక్షణ కర్తవ్యమని తూర్పున వివేకానందుడు పిలుపునిస్తే పశ్చిమాన కారల్‌మార్క్సుగారు తత్వ శాస్త్రం సమాజానికి మార్గదర్శకం కావాలన్నారు. అనుష్టాన వేదాంతం కావాలని వివేకానందుడంటే ఆచరణ సాధ్యంగాని సిద్దాంతం గ్రుడ్డిదని కారల్ మార్క్సు ఉద్బోధించినారు. అంతేకాదు సమాజాలన్నిటిని అన్ని కోణాల నుండి విశ్లేషిస్తూ ప్రజాబాహుళ్య ప్రత్యక్షపాత్ర ద్వారా రాబోయే సామాజిక రాజకీయ విప్లవమే శరణ్యమని సోదాహరణంగా తెలియచేసినారు. కేవలం అనుకరణ, అనుసరణల కలవాటుపడిన సమాజాలు వాటి సిద్దాంతకర్తలు

ఇటు వివేకానందుడిని, అటు మార్క్సుని దేవతలుగా మార్చివేసినారు. వారు చెప్పిన వాస్తవ పరిస్థితుల విశ్లేషణ, సిద్దాంతాల ఆచరణ, వాటి సృజనాత్మక వర్తింపు సామాజిక పరిణామ క్రమాన్ని నిత్య నూతన వేగంతో ముందడుగు వేయించడంలాంటి క్రియాశీల నిర్మాణాత్మక కర్తవ్యాలని విస్మరించి కేవలం సిద్ధాంతాలను వల్లె వేస్తూ యాంత్రికాలోచనలతో కాలక్షేపం చేసినారు. సమాజాలు చలన రహితమై పరస్పర శత్రు వైరుధ్యాలతో దారి తప్పి నిర్వీర్యమై పోయినవి. ఎంతటి లక్ష్యశుద్ధి, చిత్తశుద్ధి ఉన్నా వెనకటి గుణబంధం నుంచి విముక్తి పొందనిదే ఆశించిన మార్పు అందని మావిగా మిగులుతుంది. వైఫల్యాలు తప్పవు. ఓటములనేవి, విజయ సౌధాలను అధిరోహించడానికి నిచ్చెన మెట్లని నమ్మేవారికి నిరాశా, నిస్పృహల ప్రసక్తి ఉండదు. యజుర్వేదం అరంభంలోనే చెప్పినట్లు గుణాత్మకమైన మార్పే కాలం విశేషం. ఈ వైశిష్ట్యాన్ని కనిపెట్టి నడుచుకోవడం మానవధర్మం. తిరిగి అనుభవజ్ఞుడు విజ్ఞాన వంతుడైన మానవుడే సరికొత్త మార్పుకు కారకుడవుతాడు. ఈ విధంగా అనుదినం పై పైకి పరిణమించే మానవ సమాజం ప్రకృతినే జయించవచ్చును. ఈ అలోచనా విధానమే “మానవుడే మాధవుడు” అను మానవత్వ సిద్ధాంతానికి మాతృక. ఇది భావ భౌతికవాదులందరికి శిరోధార్యం.

## పేదరికం

ప్రకృతి రహస్యాలను వెలికి తీస్తూ సామాజిక ప్రయోజనాల సాధనకై వాటిని వినియోగించడంలో వెనకబడిపోవడంతో పాటు సమాజం సృష్టించిన సంపదను దాన్ని సృష్టించిన శ్రమ జీవులందరికి వారి వారి పరిశ్రమ కనుగుణంగా పంపకం జరగని కారణంగా ఇది ఏర్పడు చున్నది. బుద్ధిమాంద్యంగల కొందరు ఇంకా నమ్మబలుకుచున్నట్లుగా ఈనాటి పేదరికం పూర్వజన్మలో చేసిన పాప ఫలితంగాదు.

మన దేశ పేదరికం తీవ్రతను గుర్తించిన తర్వాత దానిని తగ్గిస్తూ నిర్మూలించే కార్యభారం కార్యక్రమం గురించి చర్చించడం ఉపయోగకరం. ఇటీవలనే ప్రపంచ బ్యాంకు వారు నిర్వహించిన సర్వే ప్రకారం (2011-12)లో భారతదేశం సగటు దేశీయాభివృద్ధి క్రమంలో ఆశ్చర్యకర స్థానంలోనున్నట్లు బోధపడుతున్నది. కొన్ని ముఖ్యమైన దేశాలతో రెండే రెండు అంశాలల్లో పోలికకు పరిమితం కావడం చాలు. మన మెక్కడున్నామో ఎంత వేగంగా అభివృద్ధిని సాధిస్తే పెరిగే జనాభా కనీస అవసరాలను తీర్చగల్గుతామో తెలుస్తుంది.

ఒక వందకోట్ల ఇరవై లక్షల జనాభాగల భారతదేశం (2011-12లో) 182700 కోట్ల డాలర్ల విలువ గల సంపద ఉత్పత్తి చేయగా భారత జనాభాకి 16 శాతం జనాభా మాత్రమే గల బ్రెజిల్ దేశం 249200 కోట్ల డాలర్ల విలువైన సంపదను సృష్టిస్తున్నది. 12 శాతం జనాభాగల రష్యాదేశం 219700 కోట్ల డాలర్లు, 110 శాతం జనాభాగల చైనా దేశం 729800 కోట్ల డాలర్లు, 26 శాతం జనాభాగల అమెరికా దేశం 1507500 కోట్ల డాలర్లు కేవలం 10 శాతం జనాభాగల జపాన్ దేశం 586600 కోట్ల డాలర్లు,మరీ తక్కువగానున్న 7 శాతం జనాభాగల జర్మని దేశం 360700 కోట్ల డాలర్లు, ఇంకా తక్కువ 5 శాతం జనాభాగల యుకే దేశం 243100 కోట్ల డాలర్ల విలువగల సంపద సృష్టిస్తున్నవి. మన తర్వాత స్వతంత్రం పొందిన చైనా దేశం జనాభాలో 10 శాతం మాత్రమే అధికంగానున్నా సంపద సృష్టిలో దాదాపు 400 శాతం పెరిగిపోయిన అంశం అత్యంత తీవ్రంగా పరిశీలించదగినది. అమెరికా విషయం చెప్పనక్కరలేదు. అది శతాబ్దాల కాలం

నుండి అభివృద్ధి చెందింది. ఐనా కేవలం 26 శాతం జనాభాగలిగి సుమారు 800 శాతం దేశీయ ఉత్పత్తితో మనకంటే ముందుండడం అర్థం చేసుకోదగినది. మరో ఆశ్చర్యకరమైన అంశం ఆర్థిక సామ్రాజ్యంగా రెండు శతాబ్దాలుగా వెలిగిన యు.కె (ఇంగ్లాండు) జనాభాలో మనలో కేవలం 5 శాతమే ఉండి ఇటీవల ఆర్థిక సంక్షోభంలో మునిగి తేలుతూగూడా దాదాపు మనకు రెట్టింపు (200 శాతం) సంపదను సృష్టించగల్గడం గమనార్హం.అర్థశాస్త్రవేత్తలు మన దేశాభివృద్ధి, ఆర్థిక సంస్కరణల ప్రభావం గురించి గొప్పలు చెప్పక ముందు మన మెక్కడున్నామో చెప్పడం మంచిది.

నిజమే, మూడు వందల సంవత్సరాల క్రితం భారతదేశం చైనా దేశం ప్రపంచంలో ఆర్థిక సంపద సృష్టిలో ప్రథమ, ద్వితీయ స్థానాలనలంకరించియుండినవి. కాలగమనంలో అంతర్యుద్ధాలు, విదేశీ దురాక్రమణల కారణంగా పూర్తిగా అణగారిపోయినాం. స్వతంత్రం సాధించిననాడున్న 30 కోట్ల జనాభా 65 సంవత్సరాలల్లోనే నాల్గురెట్లు (120 కోట్లు)కు పెరిగిపోయింది. పెరిగిన జనాభాను పోషించుకోగల్గుతున్నాం. ఆహార సమస్య ఇంకా సంతృప్తికరంగా పరిష్కారం కాలేదు. పౌష్టికాహార లోపం మూడవ వంతు జనాభాని ఇబ్బంది పెడుచున్నది. అత్యాధునిక నాగరికతా ప్రపంచంలో శుభ్రమైన త్రాగునీరు కొరత, రోడ్డు రవాణా సౌకర్యాలలోటు విద్యా, వైద్య సౌకర్యాల ప్రమాణాలలేమి తీవ్రంగాఉన్నది. ప్రపంచ పేదలలో సగానికి సగం సంఖ్య మన దేశంలోనేనుండడం బాధాకరం. సమస్య యొక్క తీవ్రత, దాని సత్వర పరిష్కార మార్గం గురించి శాస్త్రీయ అవగాహన, అవసరమైన ఆర్థిక మానవ వనరుల సమీకరణల ఆవశ్యకతగురించి సంకల్పబలాల సమీకరణలు మన తక్షణా వసరాలు. మరింతలోతుగా వాటిపై అవగాహన, చర్చ అవసరం. తిరిగి ప్రపంచంలో ప్రథమ, ద్వితీయ స్థానాలనలంకరించగల్గే దిశలో మేధావి వర్గం ఆలోచించడం ఆనందదాయకం. ఆది సాధ్యం సాకారంగావాలంటే బహుముఖ ప్రయత్నం జాతి తక్షణ కర్తవ్యం.

ఈ దిశలో ఆలోచించకుండా గత 65 సంవత్సరాలుగా పేదరికాన్ని గూడా రాజకీయం చేస్తున్న దిగజారుడు ఆలోచనల్ని చూస్తున్నాం. అది దురదృష్టకరం. గత రెండు దశాబ్దాలకు మించిన సంస్కరణల కాలంలో సాధారణ అభివృద్ధి జరిగింది. అభివృద్ధి రేటు 8–9 శాతానికి చేరింది. తిరిగి ఈనాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో 5 శాతానికి పడిపోయింది. ప్రపంచ వ్యాపితంగా ఆర్థిక మాంద్యం నేపథ్యంలో చైనా, ఫిలిపిన్స్ దేశాలను మినహాయిస్తే అన్ని దేశాల ఆర్థికాభివృద్ధిరేటు తీవ్రంగా పడిపోయింది. 2012 సంవత్సరంలో అసలు ప్రపంచవ్యాపిత ఆర్థికాభివృద్ధిరేటు 2.37 శాతమే ఉండింది. అటువంటి పరిస్థితిలో మనదేశ అభివృద్ధి గమనం 5 శాతముందంటే ప్రపంచరేటుకి రెండింతలుగా భావించక తప్పదు. ఇది ఆత్మ సంతృప్తికి కారణం కారాదు. ఆత్మ విశ్వాసానికి దోహదకారి కావాలి. కోలుకుని అభివృద్ధి గమనాన్ని తీవ్రతరం చేయగల్గుతామని అర్థశాస్త్ర పండితుల అవగాహన సంతోషమే. రాజకీయ నాయకులు ఎన్ని అసత్యాలు, అర్ధసత్యాలతో వాదించినా పేదరికం కొంతైనా తగ్గింది. పెరిగే జనాభా, వారి ఆధునిక అలవాట్లు, అవసరాల వెలుతురులో ముఖ్యంగా ధరల పెరుగుదల కాలంలో పట్టణ వాసులు రోజుకు తలసరి 32, గ్రామస్థులు తలసరి రోజుకు 26 ఆదాయంతో బ్రతకడం కష్టసాధ్యమే. ఐనా జనతాదళ్ కాలంలోని తలసరి రూ॥ 2 కంటే చాలా నయం. పేదరికాన్ని అంచనాకట్టడంలో గూడా విభిన్న పద్ధతులననుసరించడం వాటి మధ్య తీవ్రమైన

ఆగాధాలుండడం, ఆ అగాధాల్ని రాజకీయులు తమ సంకుచిత వాదోపవాదాలకుపయోగించడం చివరకు ఈ చర్య దేశ మహోన్నత న్యాయస్థానానికి గూడా చేరడం మన రాజకీయ పతానావస్థను తెలియజేస్తున్నది కాని పరిపక్వతని కాదు. ప్రతి 10 సంవత్సరాలకి ఒక పర్యాయం సగటు దేశాభివృద్ధితోపాటు వివిధ వర్గాల ప్రజల ఆర్థిక స్థితిగతులను బేరీజు వేసుకోవడం ప్రతి అభివృద్ధి చెందే దేశానికి అవసరం. దీన్ని అమలు పరిచే సందర్భంలో పౌరుల నిజమైన అదాయాన్ని ఆనాటి ధర వరల వెలుతురులో లెక్కించి తీరాలి. అలాగే ఆయా వర్గాలకు ప్రభుత్వం అందజేసే వివిధ సబ్సిడీలను లెక్కలోకి చేర్చుకోరాదు. సబ్సిడీలు, రాయితీలు, స్కాలర్ షిప్‌లాంటివి ఆదాయాలుగా చూపెట్టడం అశాస్త్రీయం. పట్టణ గ్రామీణ పేదల నిత్య జీవితావసరాలల్లో కేవలం శారీరక శక్తి నిచ్చే ఆహార ధాన్యాలు వాటి వలన సమకూరే బలాన్ని ( కేలరీలు) లెక్కించి తృప్తి చెందడం భావ్యంకాదు.

వారి కనీస అవసరాలైన గుడ్డలు, విద్యా, వైద్య, సాంస్కృతిక అవసరాలను గూడా లెక్కలోకి తీసుకోవడం అనివార్యం. ఏది ఏమైనా దేశంలో దారిద్ర్య రేఖకు దిగువగానున్న వారి సంఖ్య తాజాగా వేయబడిన టెండూల్కర్ కమిటీ అంచనా ప్రకారమైనా 25-40 కోట్ల జనం ఉన్నారు. ఇది ప్రపంచ పేదల్లో సగమయినప్పుడు మన దుస్థితి బాగా అగుపడుతుంది. అంతేకాదు. ఇంతకు రెండు రెట్ల జనాభా పేదరికం అంచులోనుండడం గమనార్హం. దేశీయ ఉత్పత్తి రేటు ఒక శాతం పెరిగితే పేదరికం కనీసం ఒక శాతం తగ్గాలి కాని అది అరశాతం గూడా తగ్గటంలేదు. మన సంపద పెరుగుదల ఫలితం పట్టణాలు సంపన్న వర్గాలకే దక్కడం, పేదరికాన్ని త్వరత్వరగా తగ్గించి తొలగించడానికి కాదని స్పష్టపడుచున్నది. ఉత్పత్తి పెరుగుదల వ్యూహాల్లోనే పేదరికాన్ని తగ్గించే వ్యూహంతో ముడివేసి సమ్మిళాతాభివృద్ధి వ్యూహన్ని అన్ని రంగాలలో రూపకల్పన చేస్తూ దాన్ని ఆచరించాలి. ఆలోచనల్లో లక్ష్యశుద్ధి, చిత్తశుద్ధితోనున్న ఎడల పేదరికాన్ని మొదట తరిమికొట్టాలి. ఆ తర్వాతనే సమ్మిళితాభివృద్ధికి అవసరమైన భావ భౌతికవనరుల సమీకరణకుపక్రమించాలి.

పేదరికం గురించి చర్చ, రాజకీయ రంగులు మార్చటం కాకూడదు. లెక్కలు వేసి వాదనల బలా బలాల్ని తేల్చుకోవడం కాదు. పేద మనిషి ఈనాటి జీవన ప్రమాణాల చక్రబంధంలో చిక్కి ఎంత తొందరగా ఈ శాపవిముక్తి జరుగుతుందా అనే ఆందోళనలోనున్నాడు. ఈ ఆందోళన కలిగే మనిషి తనకున్న స్వతంత్ర వాతావరణాన్ని నిర్మాణాత్మకంగా ఉపయోగించి పరిశ్రమ చేయ వచ్చును. తమ పేదరికానికి కారణమని తామనుకున్న వ్యక్తులు, వ్యవస్థలపై తిరుగుబాటుగూడా చేయవచ్చును. ఈ నాటి పరిస్థితుల్లో అతనికి మొదటి ప్రత్యామ్నాయం కష్టసాధ్యం. రెండవ ప్రత్యామ్నాయం సులభసాధ్యంగా ఆగుపిస్తున్నది. సరైన ప్రత్యామ్నాయం గురించి ఆలోచనా పరులే తమ బుద్ధిబలాన్ని ప్రదర్శించాలి. సమయం సందర్భాన్ని దృష్టిలో పెట్టుకుని, రాజకీయ సాధ్యాసాధ్యాలను బేరీజు వేసుకుని ముఖ్యంగా సంబంధిత ప్రజల సంఘటిత శక్తి సామర్ధ్యాల ఆధారంగా తగు ఉద్యమ వ్యూహన్ని రచించి అమలు జరపాలి. పేదల ఉద్యమాలు విజయ పతాకాలను ఎగరవేసే పరిస్థితి పరిపక్వమైంది. ప్రపంచీకరణ ప్రక్రియ ప్రతీఘాత శక్తుల దుష్ట ప్రయోజనాల సాధనకంటే అభివృద్ధి కాముకుల అభ్యుదయోద్యమాలకే అధిక బలాన్ని సమకూర్చుతుంది. పెరిగే చైతన్యం అజ్ఞానం అంధకారాన్ని పారదోల్తుంది. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయిస్తుంది.

చైనా దేశం విప్లవ విజయం తర్వాత తీవ్రవాద, ఉగ్రవాద ప్రయోగాలలో 30 సంవత్సరాల పుణ్య కాలాన్ని వృధా చేసింది. 1978లో డెంగ్‌సియావోపెంగ్ నాయకత్వంలో శాంతియుత సంస్కరణల పర్వాన్ని ప్రారంభించింది. గత 30 సంవత్సరాల కాలంలో షుమారు 40 కోట్ల జనాభాని దారిద్ర్యరేఖ నుండి పైకి తేగల్గింది. ఇది దాదాపు ఈనాటికి జనాభాకి 30 శాతం. చైనా భారతదేశ ప్రభుత్వ వ్యూహాల ఎత్తుగడల్లో పెద్ద తేడా ఉన్నది. బహు పార్టీ వ్యవస్థ,బహుళత్వంగల భారతదేశానికి సమయం ఎక్కువ అవసరంగావచ్చు గాని దిశలో పెద్ద మార్పు అవసరం లేదు. పాలనా వ్యవస్థలో తీవ్రమైన మార్పులు అనివార్యం. పాలకవర్గ పార్టీలనుండి దళారి పెట్టుబడిదారి వర్గ ఛాయలు గూడా లేని రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థ చాలా ఉపయోగకరం. దేశాభివృద్ధి అనగా దేశంలో మానవాభివృద్ధి, దారిద్ర్య నిర్మూలన, భావస్వాతంత్రం, సహకారం, లౌకిక భావం, సమ్మిళితాభావృద్ధి భావాలు స్ఫురణకు రావాలి. శాస్త్ర సాంకేతికయుగంలో అన్ని రంగాల్లోనున్న వెనకబాటు తనాన్ని తొలగిస్తూ అభివృద్ధి సూచికలను ఆకర్షించాలి.

ప్రపంచీకరణ కేవలం వస్తు వాహనాల క్రయ విక్రయాలు, పెట్టుబడులు, సేవలు సాంకేతిక పరిజ్ఞానంగల శ్రామికుల మార్పిడి, విద్యా విజ్ఞాన సంపదల ఆదాన ప్రదానాలకే పరిమితం కావడం లేదు. దేశాల అభివృద్ధి వేగాన్ని పెంచుతూ అందులో భాగస్వాములు కావాలనే ఆకాంక్షనుగూడా విస్తరింప జేస్తున్నది. లాభాలు, అత్యధిక లాభాల వేటకై కొన్ని దేశాల బహుళజాతి కార్పోరేటుసంస్థలు ప్రయత్నించగా దేశ, విదేశీ పెట్టుబడులను వాణిజ్య, వ్యాపార సౌకర్యాలనుపయోగించి స్వదేశీ సంపదను పెంచుతూ దేశ ప్రజల ఉపాధి ఉద్యోగావకాశాలకై దీన్ని పూర్తిగా వినియోగించు కోవాలని వర్ధమాన, అభివృద్ధి చెందుతున్న అనేక దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ప్రపంచీకరణను సామ్రాజ్యవాద దేశాల బహుళజాతి సంస్థలు పన్నిన దుర్మార్గ దుష్ట పన్నాగంగా కొట్టిపారేయడం కేవలం సంకుచిత భావం. అలాగే ఇదిసర్వరోగ నివారిణి అంటూ అందులోని గూఢంగా ఉన్న ప్రజా వ్యతిరేక కుట్రలు, కుతంత్రాలను చూడలేని దృక్పథం ఆత్మహత్యా సదృశ్యమవుతుంది. బలహీనులు బలవంతుడి ఉచ్చులోపడి తిరిగి కోలుకోలేని స్థితికి నెట్టబడే ప్రమాదం గూడా ఉన్నది. ప్రపంచీకరణ వందల సంవత్సరాలుగా కొనసాగిన ప్రకియనేనైనా గత రెండు దశాబ్దాల కాలం నుండి బాగా విస్తరించింది. జీవిత రంగాలన్నిటిలో ప్రవేశించింది. జీవన శైలిని ప్రమాణాన్ని గుణాత్మకంగా మార్చి వేస్తున్నది. ప్రపంచీకరణ కారణంగా పెరిగిపోయే అనర్ధాలను, అన్యాయాలను ప్రపంచీకరణ దృక్పదం ద్వారానే ఎదిరించి ఓడించగల్గుతాం. దేశాల ఆర్థిక, రాజకీయ స్వాతంత్రాలకు అంకితమైన ప్రజా బహుళ్య జీవన ప్రమాణాల్ని సాధ్యమైనంత త్వరగా పెంచాలని కోరే దేశభక్తులు తమ ప్రజాబలం, బుద్ధి కుశలతతో ఈ మారిన అవకాశాల్ని తమకనుకూలంగా మలుచుకోగల్గుతారు. సక్రమ రాజకీయ వ్యూహాల రూపకల్పన చేయగల్గే రాజకీయ నాయకత్వం ప్రపంచీకరణలోని సానుకూల అంశాల ద్వారా సత్వరం దేశాభివృద్ధిని సాధిస్తూ పేదరికాన్ని పారద్రోలగలుగుతుంది. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం మానవ సామాజిక చరిత్రలో సమాజాల ముందడుగు వేయించింది గాని వెనక్కి నెట్టివేయలేదు. సమర్ధవంతమైన రాజకీయ నాయకత్వం రాజనీతిజ్ఞత ఈనాటి అవసరం.

ఈనాటి దేశ రాజకీయార్థిక పరిస్థితిని ఎలా అర్థం చేసుకోవాలి? ఇది పురోగమనమా? తిరోగమనమా? లేక మందగమనమా? బహుళజాతి ద్రవ్య వ్యాపార కార్పోరేట్ సంస్థల రాజకీయ ప్రతినిధులు వారి సలహాదారులైన దళారి పెట్టుబడిదారులు (క్రోనీ) దేశం పురోగమిస్తున్నదని అంకెలతో సహా వాదించగా ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐ.యమ్.ఎఫ్)ల సలహాలపై ఆధారపడుతూ ఆర్థిక సంస్కరణల పేరుతో బడా పెట్టుబడిదారి వర్గ ప్రయోజనాలకు పాటు బడుతున్న కేంద్ర యు.పి.ఎ. ప్రభుత్వం పూర్తిగా తిరోగమనం చేస్తూ దేశాన్ని రుణగ్రస్తం చేయడంతో పాటు పేదరికాన్ని పెంచుచున్నదని ప్రజాస్వామ్య ప్రతిపక్షాలు ముఖ్యంగా అతివాదులు, తీవ్ర వాదులు విమర్శిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాతం, నిజాయితీగల సాత్వికులంతా జరుగుచున్న అభివృద్ధిని మందగమనమంటున్నారు. సమస్యలను అధ్యయనం చేయడంలో స్వీయ మానసిక తత్వం తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. సాత్విక దృష్టితో సాకల్యంగా విశ్లేషించగలిగే నేర్పరులు మాత్రమే సత్యాన్వేషణ చేయగల్గుతారు. అనుకూల ప్రతికూల పార్శ్వాలను విడదీస్తూ, సమస్య పరిష్కారానికి సరైన మార్గాన్ని సూచించగల్గుతారు. పైనుదహరించిన మొదటి రెండు వాదనలు కేవలం స్వీయ మానసిక తత్వ ప్రభావ ఫలితాలనుటలో ఏలాంటి సందేహం లేదు. “ మందగమనం ’ వాస్తవం,. రెండు దశాబ్దాల సుదీర్ఘకాల సంస్కరణల ఫలితంగా దేశం పురోగమనం చెంది పేదరికాన్ని దాదాపు లేకుండా చేస్తూ పౌరసమాజం సంతృప్తికరంగా ఉండవలసింది. కాని అలా జరగలేదు. స్వార్థం, అధికార దాహం, ధనదాహం కట్టలు త్రెంచుకొని పొంగి పొరలే ప్రమాద ఘంటికలు మార్మోగుచునే ఉన్నవి. కొన్ని ముఖ్యమైన సానుకూల ప్రతికూల అంశాలను ఉటంకించడం సందర్భోచితం.

1991 జూన్ 21వ తేదీన కీ॥శే॥ పి.వి.నరసింహరావు గారు ప్రధానిగా అల్పసంఖ్యాక ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసింది. ఈనాటి ప్రధాని గౌ॥ మన్ మోహన్ సింగ్‌గారే ఆనాటి ఆర్థిక శాఖా మాత్యులుగానున్నారు. అంతకుముందు చర్చించిన ప్రకారం తాత్కాలిక ప్రధానిగా పనిచేసిన శ్రీ చంద్రశేఖర్ గారి ప్రభుత్వం దేశాన్ని ఆర్థిక దివాళానుండి గట్టెక్కించడానికై రిజర్వుబ్యాంకులో నిలువగానున్న మన సుమారు 47 టన్నుల బంగారాన్ని ప్రత్యేక విమానాల ద్వారా ఇంగ్లాండుకు తరలించి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ మరియు స్విస్ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి అంతర్జాతీయ ద్రవ్య నిధి నుండి 200 కోట్ల అమెరికన్ డాలర్ల రుణం పొందడం జరిగింది. పాలనావసరాల సుడిగుండంనుండి తాత్కాలికంగా విమోచన పొందడం జరిగింది. ఆ తర్వాత నూతనంగా ఎన్నుకోబడిన శ్రీ పి.వి. గారి ప్రభుత్వం క్రమ క్రమంగా ఆ బంగారాన్ని తాకట్టునుండి విడిపించుకోగల్గడం గొప్ప విషయం. అటువంటి దయనీయ పరిస్థితుల్లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టబడినవి. అంతకుముందు సోవియట్ సోషలిజంతో ప్రభా వితమై దేశ, విదేశీ పెట్టుబడికి అవకాశాలు లేకుండా దేశ ఆర్థిక ద్వారాలన్నిటిని దాదాపు మూసివేయడం జరిగింది. వాటన్నిటిని క్రమంగా తెరవడం, దేశంలోనున్న ప్రభుత్వ పరిశ్రమల్లో ప్రైవేటు పెట్టు బడిదారులకు భాగస్వామ్యాన్ని కల్పించడం ఈ సంస్కరణల ముఖ్యోద్దేశం. ఈ సంస్కరణలను అమలు పర్చిన తీరు తెన్నులపైననే వాటి మంచి చెడులు ఆధారపడినవి.

1980వ దశకంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సంస్కరణలదిశ గురించి ప్రపంచబ్యాంకు వారు అంతర్జాతీయ ద్రవ్యనిధి వారూ ఒక విధాన రూపకల్పన జేసినారు. దానిపేరు “ వాషింగ్టన్

కాన్సెన్సస్" ఇది దక్షిణ అమెరికా ఆసియా ఖండాల అభివృద్ధి చెందే దేశాల సత్వర అభివృద్ధికి ఉద్దేశించినదైనా అభివృద్ధి చెందుచున్న దేశాలన్నిటికి వర్తించే విధంగా పై రెండు ప్రపంచసంస్థలు అమలు పరచినవి. వీటిని అమలు పరచిన ఆసియా దేశాలు 1980దశకం రెండవ అర్ధభాగంతో అత్యధిక నష్ట, కష్టాలపాలుగావలసి వచ్చింది. ఈ విధానాలు ఏ పేరుతో అమలు పరచబడినా ఆచరణలో ప్రపంచ బహుళజాతి ఆర్థిక ద్రవ్యసంస్థల అభివృద్ధి కొరకే లక్షించినవి. ఈ దేశాలను ఆచరణలో ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడే బహుళజాతి సంస్థల ఉత్పత్తులకు మార్కెటుగా మార్చివేయడం జరిగింది. భారత తదితర ఆసియా మధ్య ప్రాచ్య దేశాలుగూడా ఇదే దారిలో నడిచే విధంగా ఒత్తిడి తేవడం జరిగింది. ఈ దురుద్దేశాన్ని అభివృద్ధి చెందే దేశాల ప్రభుత్వాల పెట్టుబడిదారి వర్గాలు త్వరగానే గమనించినవి. ఐనా తమ దేశాల ద్రవ్య కొరతతో స్వతంత్ర ఆర్థికాభివృద్ధి బాటన నడవలేని స్థితితో ఒక స్పష్టమైన నిర్ణయానికి రాజాలలేదు. ఇక్కడి బడా పెట్టుబడిదారులు వారి బహుళ జాతి సంస్థలు ఈ ఆర్థిక బానిసత్వానికి తలలూపినా ఇతరులు, అభ్యుదయ రాజకీయ శక్తులు " వాషింగ్టన్ కాన్సెన్సస్ " అమలు పరచిన దేశాలు చవి చూసిన చేదు అనుభవాలను పేర్కొని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమ స్వతంత్ర ఆర్ధికాభివృద్ధి కొరకే ఆలోచిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం సుస్పష్ట విధాన ప్రకటన చేయడానికి దాన్ని ఆచరించడానికి సాహసించడంలేదు. ఆర్థిక స్వాతంత్ర్యాన్ని రక్షించగోరే ప్రజాస్వామ్య శక్తుల ఐక్య ఉద్యమం ఈ దిశలో అత్యవసరం.

భారతదేశం దేశ విదేశీ పెట్టుబడిదారి వర్గాల ఒత్తిళ్ళకు లొంగి తప్పటడుగులు వేస్తున్నా రెండు దశాబ్దాల సంస్కరణల ఫలితంగా ఈ కాలంలో దాదాపు 8 శాతం సగటు దేశాభివృద్ధిని సాధించగల్గింది. తిరిగి తగ్గుముఖంబడుతూ గత సంవత్సరం 5.5 శాతానికి పడిపోయినా తగిన చర్యల్ని చేపడుతూ దేశీయ ఉత్పత్తి శాతాన్ని పెంచుకోగల్గుతుందని ఆశించవచ్చును. ఇదే రెండు దశాబ్దాల సంస్కరణలకాలం దేశంలో సంపదను కూడబెట్టినరేటు 22 శాతం నుండి 34.36 శాతానికి పెరగడం ఆశాజనకం. కాబట్టి విదేశీ నిధులు సాధారణ నిష్పత్తితో వెచ్చించబడినా దేశం స్వతంత్రంగా తమ సంపదను జి.డి.పి.కి 36-38 శాతం వెచ్చించి 7-8 శాతం అభివృద్ధి రేటును సాధించుకో గల్గుతుందని సకారాత్మకంగా ( నిర్మాణాత్మకంగా) ఆలోచించే అర్ధశాస్త్రవేత్తల విశ్వాసం. ఇదే సంస్కరణల కాలంలో దేశ సంపద పెరగడం ఫలితంగా పౌరుల తలసరి వార్షికాదాయం కేవలం 300 డాలర్ల నుండి 1700 డార్లకు పెరగడం యాదృచ్ఛికం కాదు. కేంద్ర ఆదాయం ప్రతి సంవత్సరం ఒక లక్ష కోట్ల రూపాయలకు పెరిగింది. మౌలికాంశాలపై బడ్జెటును పెంచే సౌకర్యం కలిగింది. నైపుణ్యతగల కార్మికుల కొరతతోపాటు సాధారణ కార్మికుల కొరత ఏర్పడడం గూడా యాదృచ్ఛికంగాదు. దేశ, విదేశాలలో ఉపాధి, ఉద్యోగావకాశలను వినియోగించడం వలననే ఈ కొరత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలలో సకారాత్మక మార్పులు వస్తే మన దేశంలోనే అవసరమున్న ఉద్యోగావకాశాలు లభిస్తాయి. నిరుద్యోగం అతి త్వరగా అంతరించిపోతుంది. కార్మికుల జీత భత్యాలు గూడా పెరిగినవి. ఐనా పెరిగే ద్రవ్యోల్బణం దీన్ని హరించివేస్తున్నది. సంస్కరణలు బహుముఖంగా సమగ్రమైతే దేశాభివృద్ధి సమస్యల సత్వర పరిష్కారం సుసాధ్యమవుతుంది. ఆర్థిక స్వతంత్రత గురించి సైద్దాంతిక ఏకాభిప్రాయ కొరత ఈ ఆర్థిక మాంద్యానికి కారణం.

చైనాతో సహా వేగంగా ఆర్థికాభివృద్ధిని సాధించిన దేశాల ఉత్పత్తులు శారీరక శ్రమ ప్రధాన మైనవిగావడం గమనార్హం. మన దేశం గూడా అదే దారిలో నడుస్తూ కోకొల్లలుగానున్న శ్రమజీవుల కష్టాల ద్వారా ఇంకా వేగమైన అభివృద్ధిని సాధించేవారం. ఆర్థిక సంస్కరణల అసమగ్రత వ్యతిరేకతల కారణంగా ఆ వేగం పుంజుకోలేకపోతున్నది. ఐనా సంపాదించిన సంపదకు ముఖ్యకారణం మన మనుసరించిన సరికొత్త పారిశ్రామాభివృద్ధి అని గుర్తించగల్గుతాం. కంప్యూటర్లలోనుండే సాఫ్ట్‌వేర్లు, బిజినెస్ పరిజ్ఞానం కలిగిన నైపుణ్యత, ఆటోలు, మందుల ఎగుమతి ద్వారా మన దేశం గణనీయంగా విదేశీ మారకాన్ని సంపాదించగల్గింది. ఈ సరికొత్త అనుభవం మనదేశీయ మేధావి వర్గ ఆలోచనల ఫలితం. దీనిలో " ప్రపంచ బ్యాంకు " అంతర్జాతీయ ద్రవ్య నిధుల పాత్ర లేదని చెప్పగల్గుతాం. మన విద్యా విధానంలో మౌలిక మార్పులు తెస్తూ ఈ రంగంలో పనిచేసే నిపుణుల సంఖ్యను పెంచగల్గితే ప్రపంచ వ్యాపిత అవసరాలను విజయవంతంగా వినియోగించుకోగల్గుతాం. మన దేశానికి మంచి పేరున్న " నానో " కార్ల పరిశ్రమ అతి చౌకగా కార్లను తయారు చేస్తున్నది. అలాగే టెలిఫోన్ సౌకర్యం అత్యంత చౌకగా పేదలకందుబాటులోకి వచ్చింది. వైద్య సదుపాయాల్లో గూడా ప్రపంచంలోనే తక్కువ ఖర్చుతో చికిత్సలు చేయగలిగే పరిస్థితి రావడం ముదావహం.

పైనుదహరించిన అభివృద్ధి వేగానికి సుస్థిరతలేదు. సంపద పెరుగుదలపై ప్రభుత్వాలు చూపించే పరిమితమైన శ్రద్ధనుగూడా సంపద పంపకంపై చూపడంలేదు. ప్రభుత్వం దాన్ని బలపర్చే వారి వాదన ప్రకారం 1993-94లోనున్న 45.3 శాతం పేదరికం ఈ నాటికి (2009-13) 32 శాతానికి తగ్గింది. రెండు దశాబ్దాల సుదీర్ఘ ఆర్థిక సంస్కరణల ఫలితంగా ఏలాంటి లోటులేని ప్రకృతి సంపద కల్గిన నేపథ్యంలో ఇంకా జనాభాలో 32 శాతం పేదలుండడం లేక ఆకలి చావులు 17.5 శాతంనుండి తగ్గి 2.5 శాతానికి చేరినవని భుజాలు చరుచుకోవడం కేవలం స్వోత్కర్ష మాత్రమే. అక్షరాస్యత పెరగడం తదితర సూచికల్లో అభివృద్ధిని దర్శించడం, సహజంగా వెనకబడిన రాష్ట్రాలైన బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో అభివృద్ధి రేటు పెరగడం ఏ మాత్రం సంతృప్తిగా లేదు. దేశం తన రాజకీయ స్వాతంత్రాన్ని ఆర్థిక స్వతంత్రంగా మలుచుకోలేక దళారి పెట్టుబడిదార్లు ఆర్దిక నేరస్థులవాత బడిపోతున్నదనేది దేశభక్తులందరి ఆందోళన. కొంతవరకైనా రాజ్యాంగ స్ఫూర్తి ఆచరించబడితే ఆర్థిక సామాజిక సమస్యలను లేకుండా చేయడం రత్నగర్భ భారతావనికి ఒక సమస్య కాదు. లక్ష్యశుద్ధి లోపం దేశ సమస్యలకు మూలం. పార్లమెంటరీ ప్రజాస్వామ్య ముసుగులో దళారి పెట్టుబడి దారి వర్గంపై నుండి క్రింది వరకు పాలన వ్యవస్థను దాదాపు సంపూర్ణంగా ప్రజలనుండి దూరం చేసింది. ఒక్క న్యాయ స్థానాలు తప్ప అన్ని ప్రభుత్వ రంగాలు తమ విశ్వసనీయత పరపతిని కోల్పోయినవి. ప్రభుత్వ భూముల క్రయ విక్రయాలు, గనుల లావాదేవీలు, ప్రాజెక్టుల కాంట్రాక్టు విషయాలలో దళారి పెట్టుబడిదార్లు రాజకీయ నాయకులతో కలిసి వేల లక్షల కోట్ల ప్రభుత్వ ఆదాయాన్ని నీచంగా నిస్సిగ్గుగా దొంగిలిస్తున్నారు. ప్రతిరోజు ఏదో ఒక చోట వేల కోట్ల కుంభకోణం జరిగిందనే వార్త సామాన్య ప్రజలను కలవరపెట్టడం భరించరాని స్థాయికి చేరుతున్నది. అన్నిటికంటే మించిన ఆందోళనకరమైనది పోలీసు వ్యవస్థ అసమర్థత. ఆర్థిక సంస్కరణల ప్రయోజనం ప్రజలకు అందుబాటులోకి రావాలంటే సుపరిపాలన అవసరం. పరిపాలనా సంస్కరణలు తక్షణావసరం.

వ్యవస్థాపూర్వక సంస్కరణలే నిరంతర అభివృద్ధికి నమ్మకమైన మార్గం. పైపైన చేయబడే చేర్పులు, మార్పులు కంటి తుడుపు చర్యలుగా మిగిలిపోతాయి. దేశ పరిస్థితి సంస్కరించదగినదిగా మిగిలియున్నది కాబట్టి వ్యవస్థాపూర్వక సంస్కరణల ద్వారా ప్రభుత్వ అనారోగ్యాన్ని తొలగించగల్గు తామనే విశ్వాసం అర్థశాస్త్రవేత్తలు అభ్యుదయ రాజకీయ వేత్తల్లో మిగిలియున్నది. ద్రవ్యోల్బణం రెండంకెలకు చేరింది. అది కొంతవరకైనా తగ్గి 7 శాతం దరి చేరింది. ప్రపంచ వ్యాపితంగా దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థలో ఏ మాత్రమైనా సానుకూల మార్పు చోటుచేసుకుంటే ప్రపంచ ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. సరుకులు సేవల డిమాండు పెరుగుతుంది. మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల ఉత్పత్తులకు మార్కెటు విస్తృతమవుతుంది. ప్రపంచపోటీలో తట్టుకోగలిగే మన దేశ వాణిజ్య వ్యాపారం గిట్టుబాటు లాభసాటి కావడం జరుగుతుంది. ఉత్పత్తిని పెంచేది ఉత్పాదకత, ఉత్పాదకతను ఇనుమడించేది సరుకుల నాణ్యత. నాణ్యత అంటేనే ఉత్పత్తి సాధనాల అధునికీకరణ కాబట్టే సంస్కరణలు, సేవలు, పాలన వ్యవస్థలలాంటి మౌలిక సదుపాయాలు గుణాత్మకంగా మారడం అవసరం ఒక ముఖ్య ఉదాహరణ గమనార్హం.

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార ధాన్యాల పంపకంపై " ఆహార బిల్లు " పార్లమెంటు ఆమోదం పొందియున్నది. దీనిపై దేశీయ ఉత్పత్తిలో సుమారు 1.5 శాతం సంపద వెచ్చించ బడుతుంది. దేశంలోని 14 రాష్ట్రాలలో ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఆహార పంపిణి జరుగుచున్నది. కేంద్ర సబ్సిడి రాష్ట్రాలకు తోడ్పడి వారు పప్పులు, నూనెలు గూడా ప్రజా పంపిణి పరిధిలో చేర్చడానికుపయోగపడవచ్చు. ఈ విధంగా పేదలకు ప్రత్యక్షంగా ఆహార సరఫరా జరుగుతుంది. దాని ద్వారా అందులో ఆనాటికి జరుగుచున్న దుబారా, వృధా, లంచగొండి తనం గూడా పెరుగుతాయి. ధాన్యాన్ని, తినుబండారాల్ని కొనుగోలు చేయడం, గోడౌన్లలో నిలువ చేయడం, రైళ్లు, రోడ్ల ద్వారా రవాణా చేయడం అత్యధిక వ్యయంతో కూడినది. ఇందులో సగానికి మించి వృధా అవుచున్నదని ప్రజలే దీన్ని ఏవగించుకుంటున్నారు. పైగా నిజంగా అవసరమున్న కార్డులకు రెట్టింపు కార్డులు రంగంలోఉన్నాయనే విషయం అందరు అంగీకరించే వాస్తవం. ఈ బాధ్యతని రాష్ట్రాలకే వదిలిపెడుతూ వారుగూడా స్థానిక స్వపరిపాలనా వ్యవస్థలైన గ్రామ పంచాయితి, మండల పరిషత్తుల ద్వారా నిర్వహిస్తే కనీసం సగం నిధులను ఆదా చేయగల్గుతాం. ఆ డబ్బు, విద్య, వైద్య రంగాలపై వెచ్చించగల్గితే కార్మికుల శ్రమ నాణ్యత పెరిగి ఉత్పాదకత పెరుగుతుంది. ఇటువంటి వ్యవస్థా పూర్వక సంస్కరణల ద్వారా దేశ సంపద పెరిగి వృధాఖర్చులు తగ్గగల్గుతాయి. " చేపలను పట్ట నేర్పాలిగాని వండి తినబెట్టడం మంచిదిగాదనే "చైనా సామెత అక్షరాల మనకు వర్తిస్తుంది. ఇదే మౌలికమైన సంస్కరణ అన్ని రంగాలలో ఇలాంటి సంస్కరణల అవసరమున్నది.

రాజకీయార్థిక వ్యవస్థలో గుణాత్మకమైన మార్పురానిదే అది సామాజిక న్యాయాన్ని సుపరిపాలనని సాధించలేదు. ఈనాటి ప్రజాస్వామ్యం ఎన్నికల వరకే పరిమితమై పోతున్నది. దీని గురించి మరింత లోతుగా ఆలోచించడం అవసరం. ప్రపంచాన్ని అలుముకున్న ఆర్థిక మాంద్యం సడలి ప్రజలందరి కొనుగోలు శక్తి పెరగనిదే సరుకుల ఉత్పత్తి, వాటి వాణిజ్య వ్యాపారాలు పెరగవు. ప్రపంచీకరణతో అవి భాజ్యంగానున్న ఏ దేశంగూడా ఒంటరిగా సుస్థిరాభివృద్ది సాధించలేదు. ఐతే

పాశ్చాత్య దేశాలనుభవిస్తున్న ఆర్థిక సంక్షోభం కారణంగా ఇతర దేశాల స్వతంత్రాభివృద్ధి సాధ్యపడదనే ఆందోళనకి అస్కారంలేదు. కొన్ని పరిమితులకు లోబడి స్వయం ప్రతిపత్తితో దేశ ప్రజల బహు ముఖాభివృద్ధిని తప్పక సాధించగల్గుతాయి. నిరంతర, నిలకడతో కూడిన అభివృద్ధి సాధ్య పడాలంటే ముఖ్యమైన సంస్కరణలు తక్షణావసరం. వాటి పునశ్చరణ చేయాంటే దేశీయ వార్షికాభివృద్ధి మందగించడం ద్రవ్యలోటు, ద్రవ్యోల్బణం, రుణభారం, దిగుమతి – ఎగుమతుల మధ్య అంతరం సబ్సిడీల భారంలాంటి సూచికలు అభివృద్ధికి ప్రోత్సాహకరంగానుండే విధంగా జాగ్రత్త పడాలి. ఈ నాడు పై సూచికలన్నిటి ప్రకారం మన ఆర్థిక స్థితిగతులు దేశంపై పెనుభారాన్ని మోపుతూ అభివృద్ధికి గుదిబండగా పరిణమించినవి. దీనితోపాటు రైతులు, కార్మికులు తదితర శ్రమ జీవులంతా దేశభక్తితో కృషి చేయాలంటే వారి జీవితాలకు విద్య ఆహారం, ఆరోగ్యంలాంటి భద్రతలు సమకూరాలి. పరిపాలనలోని సంస్కరణలు, ప్రజాధనాన్ని వెచ్చించడంలో ప్రాధాన్యతల్లో సంస్కరణల గురించి వేరే చెప్పనక్కరలేదు.

ఆర్థిక సంక్షోభానికి మూల కారణం దేశీయ సగటు వార్షికోత్పత్తి రేటు పడిపోవడమే. ప్రజలు తాము సంపాదించే సంపదను తమ కుటుంబ ఖర్చులు పోను మిగులు సంపదను బ్యాంకుల్లో దాచుకోగల్గాలి. అప్పుడే మిగులు ధనం దేశాభివృద్ధి కార్యక్రమాలపై వెచ్చించే సావకాశం ఇటు బ్యాంకులకు అటు ప్రభుత్వాలకు కల్గుతుంది. గత నాల్గు సంవత్సరాల అనతికాలంలోనే మనదేశ ఆర్థిక సూచికలు నిరుత్సాహాన్ని కల్గిస్తున్నవి. 8–9 శాతం ఉండిన అభివృద్ధి గమనం కేవలం 5 శాతానికి పడిపోవడం ఆందోళనకరం. ఆర్థికాభివృద్ధికి కీలకాంశాలుగా పనిచేసేవి రెండు. ప్రపంచ వ్యాపితంగా సరుకుల డిమాండు పెరగడం, ప్రథమం దేశంలోని ద్రవ్యోల్బణరేటు తగ్గడం రెండవది. తాజా పరిణామాల ప్రకారం ప్రపంచ వ్యాపిత డిమాండు కొద్దిగా పెరుగుతున్నట్లు దేశ ద్రవ్యోల్బణ రేటు చాలా వరకు తగ్గినట్లు ఆశాజనకమైన సూచనలు అగుపడుచున్నవి. సంక్లిష్ట ప్రపంచీకరణ నేపథ్యంలో ఉత్సాహంతో సానుకూల నిర్ణయానికి రావడం మంచిదేమికాదు. దేశీయ ఆర్థిక సామాజిక వ్యవస్థలను సంస్కరించుకుంటూ దేశీయ మార్కెటును విస్తరిస్తూ గణనీయంగా పెరిగిపోతున్న మధ్యతరగతి సృష్టిస్తున్న డిమాండుపై ఆధారపడడం, ఆ తర్వాతనే ప్రపంచ డిమాండు గురించి ఆలోచించడం, స్వదేశీ విధానమనిపించుకుంటుంది. అయిల్ దిగుమతిపై సబ్సిడీలు, బంగారం కొనుగోలు, ఈ రెండిటిపై చేసే అనవసర ఖర్చులు మన పేదరికానికి మూలం. వాటిని తగ్గించడానికి చేస్తున్న ప్రయత్నాలు చాలవు. అప్పుడే ప్రజలవద్ద ద్రవ్యం మిగులుతుంది. పారిశ్రామికోత్పత్తిపై తగినంత పెట్టుబడి వెచ్చించగల్గుతాం.

నాల్గు సంవత్సరాల క్రితం 8–9 శాతం పెరుగుదలరేటుతో నుండిన మన ఆర్థికాభివృద్ధి ఈ నాడు 5–5.5 శాతానికి పడిపోవడంపై విశ్లేషకుల నిశ్చితాభిప్రాయం కనువిప్పుగానున్నది. అభివృద్ధిరేటు పడిపోవడానికి 45% కారణం పరిశ్రమలతోపాటు ఇతర ఉత్పత్తి కేంద్రాలపై తగిన మోతాదులో పెట్టుబడులను వెచ్చించలేకపోవడమే. ఆ తర్వాత ఉపాధి కల్పనలోటు 15 శాతం కాగా ఉత్పాదకతలోటు 40 % ఉన్నది ఈ మూడు సూచికలు ముఖ్యమైనవే అయినా పెట్టుబడులు వెచ్చించడంలోటు ప్రత్యేకంగా గమనించతగింది. దేశాభివృద్ధి రేటు పెరుగుదల ప్రధానంగా పెట్టుబడి

వెచ్చింపుపై ఆధారపడుచున్నప్పుడు అభివృద్ధి అవకాశాల్ని సంపూర్ణంగా వినియోగించాలంటే పెట్టుబడులు ఇతోధికంగా వెచ్చించబడవలసిందే. శాస్త్ర సాంకేతికంగా అత్యాధునిక ఉత్పత్తి సాధనాలను అమర్చవలసిందే. అప్పుడే ఉత్పాదకత పెరుగుతుంది. అభివృద్ధి సాధ్యపడుతుంది. వివరాలల్లోకి వెళ్ళితే 2004-2007 మధ్యకాలంలో వెచ్చించబడిన పెట్టుబడుల పెరుగుదల రేటు ప్రతిసంవత్సరం సగటు 16 శాతమున్నది. ఇది ఇలానే కొనసాగితే దేశ ఆర్థికాభివృద్ధి రేటు 7.5 శాతానికి మించదని 2007లోనే భయపడినాము. భయం నిజమైంది. ఈనాడు 2011-12 నాటికి అభివృద్ధి రేటు ఇంకా పడిపోయి 5-5.5 శాతానికి చేరింది. వచ్చే సంవత్సరం ఇది పెరుగుతుందని ప్రణాళికాసంఘ ఉపాధ్యక్షులు, ప్రధానమంత్రి, ఆర్థిక సలహాసంఘ అధ్యక్షులు నమ్మబలుకుచున్నారు కాని నమ్మడానికి పెట్టుబడుల వెచ్చింపులో పెరుగుదల కనబడడంలేదు. దేశంలో మిగులు ధనం పెరుగుతుందని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఇతోధికమౌతాయని వారి ఆశ. వారి ఆశ ఫలించి ఉత్పత్తి రేటు పెరుగుదల తిరిగి 7-8 శాతాన్ని అందుకోవాలనే అందరి ప్రయత్నం. పెట్టుబడులపై వెచ్చింపురేటు ఈనాడున్న ప్రతి సంవత్సరం సగటు 15-16 శాతం నుండి పెరిగి 20 శాతానికి చేరాలి, స్థిరపడాలి. మొత్తం ఆర్థిక వ్యవస్థలో అగుపడిన పెరుగుదల ఫలితంగా గ్రామీణ,పట్టణ ప్రజల అవసరాలు బాగా పెరిగినవి. 120 కోట్ల జనాభాలో సుమారు 30 కోట్లమంది పేదలు, 20 కోట్లమంది ధనికులు లేక ఆర్థిక స్తోమత పెరిగినవారుపోగా మిగతా 70 కోట్ల మంది జనం చిన్న పెద్ద మధ్యతరగతివారే. వారిలో ఆహార అవసరాలు పోగా ఇతర వినియోగసరుకుల డిమాండు పెరిగింది. అందుకే తగిన సప్లై కొరవడింది. అందుకే ద్రవ్యోల్బణం అనగా ధరల పెరుగుదల రెండంకెల వరకు పెరిగింది. ఇది తగ్గుముఖం పడుతున్నట్లు మంచి వార్తలు వింటున్నాం. ఐనా ఈ తగ్గుదల ఆహార సరుకుల ధరల్లో కనిపించక పోవడం ఆందోళనకరం.

కేంద్ర ప్రభుత్వం ధైర్యంగా చేపట్టే ఆర్థిక సంస్కరణలే దీనికి నిష్కృతి ఇంతవరకే ప్రతి సందర్భంలో చర్చించినట్లు సంస్కరణలు క్రింది నుండి పైకి జరగాలి. విదేశీ పెట్టుబడులనాకర్షించాలి. రాష్ట్ర, కేంద్ర బడ్జెట్ లోటు (ఆర్థిక)ను తీవ్రంగా కుదించి లక్ష్మణరేఖ దాటకుండా చూడాలి. అది సాధ్యపడాలంటే రాజకీయ స్వార్థంతో కూడుకున్న వివిధ సబ్సిడీలను తీవ్రంగా కుదించాలి. అర్హతగల పేదలకు మాత్రమే అవసరమున్న మేరకు నేరుగా సహాయాన్ని అందించాలి. పన్నుల రాయితీ మాఫీలకు స్వస్తి వాచకం పలకాలి. లక్షల కోట్ల ప్రజాధనం కైంకర్యంగాకుండా చట్టపర చర్యలను సకాలంలో తీసుకుంటూ నేరస్థులకు సత్వరం శిక్షలు అమలుకావాలి. సంక్షేమ కార్యక్రమాలు, విద్యా, వైద్య రంగాల సంస్కరణలు ప్రజాబాహుళ్యంలో ఉత్సాహాన్నినింపాలి. దిగుమతులు ఎగుమతల మధ్య పెరిగిపోతున్న అగాధం ( కరెంటు అకౌంటులోటు) మీద నియంత్రణ ఉండాలి. సంఘటిత కార్మికులతోపాటు కోట్లాదిగానున్న ఆసంఘటిత కార్మికుల ఆదాయాలు పెరిగే విధానాలు అమలు పర్చాలి. గ్రామీణ జనాభాలో అత్యధికంగా ఆధారపడే వ్యవసాయం యాంత్రికం,అత్యాధునికం చేయబడాలి. భూ సేకరణ చట్టం, గనులు ముఖ్యంగా బొగ్గు, ఇనుపరాయి. ఆభ్రకంలాంటి గనులపై గిరిజనుల హక్కు భుక్తాల సంస్కరణలతో పాటు ఎగుమతి,దిగుమతి సుంకాలు, పన్నుల వసూళ్లు విదేశీ పెట్టుబడుల లాంటి అంశాలు గూడా చేపడితే దేశంలో సమ్మిళితాభివృద్ధి సాధ్యపడుతుంది. దేశీయ సంపద పెరుగుదల నేపథ్యంలో బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గించగల్గుతాయి. ఫలితంగా

దేశీయ పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారి వర్గాలకు చౌకగా రుణాలు దొరుకుతాయి. పారిశ్రామికాభివృద్ధి సాధ్యపడుతుంది, దేశ ఆర్థికాభివృద్ధి స్థిరపడి కనీసం 8–9 శాతానికి చేరుతుంది. ఈలాంటి కార్యక్రమాల ప్రాతిపదికపై ఏర్పడే రాజకీయ పొందికలే నమ్మకమైన ప్రత్యామ్నాయ రాజకీయ పొందికలుగా ప్రజాబాహుళ్యం విశ్వాసాన్ని పొంద గల్గుతాయి. సురాజ్యంలో సుపరిపాలన స్థిరపడుతుంది. గాంధీగారు ఆశించిన స్వావలంబన సాకారమవుతుంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల సమస్య అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ దుమారాన్ని లేపడానికి ఉపయోగపడింది గాని దేశాభివృద్ధికికాదు. స్వతంత్ర సర్వసత్తాక రిపబ్లికుగా అవతరించిన భారతదేశానికి తమ అంతరంగిక ఆర్థిక సమస్యల పరిష్కారంగురించి ఏ మాత్రం భయపడే పరిస్థితిలేదు. ఇప్పటికే ఆచరణలోనున్న కేవలం 3శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 49 శాతం వరకు పెంచుకోవడం వెనక విదేశీ పెట్టుబడిదారుల సామ్రాజ్యవాద ఆకాంక్ష దాగిఉన్నట్లు కొన్ని రాజకీయ పక్షాలు కొందరు ప్రముఖ సంఘ సేవకులు వాదిస్తున్నారు. అలనాటి ఈస్ట్ ఇండియా కంపినీని గుర్తు చేస్తూ విదేశీ పెట్టుబడుల పరిమితిని పెంచడం మూలాన ప్రపంచ సామ్రాజ్యవాదుల ఉచ్చులో మనదేశం బిగించబడుతుందని భయపెడుతున్నారుగూడా! పాశ్చాత్య దేశాలన్ని ఈనాడు ఎదుర్కుంటున్న ఆర్థిక ద్రవ్యసమస్యల కారణంగా, తమ దేశాలలో ద్రవ్య మార్కెట్లు కుదింపుకు గురి అవుతున్నాయి కాబట్టి తమ ద్రవ్యాన్ని ఎగుమతి చేసుకుంటూ తమ వ్యాపారాల్ని కొనసాగించజూస్తున్నవి. ఈ అవకాశాన్ని అభివృద్ధి చెందుతున్న చైనా లాంటి దేశాలు గూడా విదేశీ పెట్టుబడులను తమ దేశ చట్టాలకు లోబడి, నియంత్రణలను పాటిస్తూ రావడాన్ని ఆహ్వానిస్తున్నవి. లబ్ధినిగూడా పొందుచున్నవి మూఢ విశ్వాసాలు, సంకుచిత రాజకీయ ప్రయోజనాలు ఈ పరిణామాన్ని అరికట్టలేవు. చైతన్య వంతమైన భారతీయులు తిరిగి ఎవరికి బానిసలుకారు. వెనకబడిన ప్రాంతాలు, పేదరికంతో బాధపడే ప్రజలు సంపన్న దేశాలనుండి పెట్టుబడులను ఆకర్షించడం చారిత్రిక అవసరం. అసమానతల ప్రపంచంలో అత్మాభిమానంతో సత్వరాభివృద్ధిని సాధించడానికి ప్రపంచీకరణ నేపధ్యంలో అభివృద్దిని సాధించడానికి ఈ మార్గం నిషిద్ధం కారాదు. స్వదేశీ మిగులు ధనమొక్కటే సరిపోదు.

ఇదే సిద్ధాంతకర్తలు రిటేలు (చిల్లర) వ్యాపారంలోకి గూడా విదేశీ పెట్టుబడులు రావడం అత్యంత ప్రమాదకరమని వాదిస్తున్నారు. లక్షలాది చిల్లరకొట్లు మూతబడుతాయిని, తోపుడుబండ్లతో కూరగాయలు పండ్లు, ఫలాలనమ్ముకునే లక్షలాది నిరుపేదలు నిరుద్యోగులుగా మారి రోడ్లపై బడతారిని తర్కిస్తున్నారు. బహుళజాతి సంస్థలైన స్వదేశీ, విదేశీ కార్పొరేటు సంస్థలు మాత్రమే లాభపడుతాయని నమ్మబలుకుతున్నారు. రాజకీయ విభేధాలను ఈ విధంగా వెళ్ళగక్కుతున్నారు. ఒక సారి చైనా, ఇండోనేషియాలాంటి దేశాల అనుభవాలు గుణపాఠాలుగా స్వీకరించడం సముచితమని విమర్శకులందరిని సవినయంగా కోరడమే తగు సమాధానం. చిల్లర వ్యాపారాలల్లో బడా పెట్టుబడి దారులకు ప్రమేయం కల్పించడం కారణంగా అమాంతంగా ఏ మార్పురాదు. ఇండోనేషియాలోని అనుభవం విచిత్రం.ఇప్పటికి చిల్లర వ్యాపారంలో 70 శాతం వ్యాపారం చిన్న చిన్న వర్తకులే చేస్తున్నారు.

దశాబ్దం గడిచినా విదేశీ పెట్టుబడులుగాని వారి కార్పొరేటు సంస్థలుగాని తాము పై చేయి చేసుకోలేక పోతున్నాయి. చిల్లర వర్తకులు ఏదో ఒక వ్యాపారంలో స్థిరపడిపోతున్నారు గాని మన

వారు భయపెడుతున్నట్లు నిరుద్యోగులై రోడ్లపై బడిపోవడం లేదు. చైనాలో ప్రభుత్వం కట్టుదిట్టమైన చట్టాల ద్వారా విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడంతోపాటు నియంత్రిస్తున్నట్లున్నది. ఈ అనుభవం మనకు గూడా గుణపాఠంకావాలి. ఈనాడు మనదేశంలో ఒక కోటి 30 లక్షల మంది ఈ బహురకాల చిల్లర వ్యాపారాలను నిర్వహిస్తూ అయిదు కోట్లమందికి ఉపాధిని కల్పిస్తున్నారు. ఈ చిల్లర వ్యాపారంలో పెద్ద చేపలైన కార్పోరేటు వ్యవస్థలకు అనుమతులిస్తే ఉన్న ఉద్యోగాలు కాస్తా ఊడిపోతాయని విదేశీ పెట్టుబడుల ప్రవేశాన్ని వ్యతిరేకించే వారి భయం. ఈ భయం నిరాధారమని ఆసియా దేశాల అనుభవాల వెలుతురులో వాదించడం జరిగింది. ఐనా చిన్న చేపలు పెద్ద చేపలతో అసమాన స్థితిగతుల మధ్య తలబడవలసి రావడాన్ని కాదనలేము. వస్తూత్పత్తి పరిశ్రమల నిర్మాణం,వ్యాపారం మౌలిక సదుపాయాల నిర్మాణ కార్యక్రమాలను చెపట్టి సకాలంలో పూరించె గొప్ప బాధ్యతలను అందుకవసరమయ్యే వనరుల తీవ్రమైన కొరతను గూడా అంతే బాధ్యతగా కాదనలేము. అభివృద్ధి జెందిన దేశాలన్ని ఎదుర్కున్న సమస్యనే ఇది. దీన్ని సామరస్యంగా పరిష్కరించిన తర్వాతనే ఆయా దేశాల బహుముఖాభివృద్ధి సాధ్యమైంది. అవసరమున్న మెరకు కిటికీల ద్వారాలను తెరచి ప్రాణవాయువును ఆస్వాదించకతప్పదు. కాని ప్రాణవాయువు కొరకని తుఫాను గాలిలోగూడా కిటికీల తలుపులన్ని తెరచి ఉంచడం ఏమాత్రం హెతుబద్ధంగాదు.

ఏది ఏమైనా “ పెట్టుబడి ”, అది స్వదేశానిదైనా విదేశానిదైనా ఉత్పత్తి, పెరుగుదల, ఉపాధి కల్పనకి కీలకం. అనేక చారిత్రిక కారణాల ఫలితంగా భారతదేశ పరపతి తీవ్రంగా దెబ్బతిన్నది. దీని పునరుద్ధరుణ సమకాలీన ప్రభుత్వాల తక్షణ రాజకీయార్థిక బాధ్యత. 2009వ సంవత్సరంలో 31 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు మన దేశంలోకి రాగా అవి 2011 నాటికి తగ్గి 19 బిలియన్ డాలర్లకు చేరినవి. తిరిగి ఈనాటికి పెరిగి 28 బిలియన డాలర్ల స్థాయినందుకున్నవి. 125 బిలియన్ డాలర్లను ప్రతి సంవత్సరం ఆకర్షిస్తున్న చైనాదేశ ఆకర్షణలో మనమెక్కడ? ప్రాజ్ఞులు పండితులంతా ఆలోచించి సమాధానం చెప్పవలసిన ప్రశ్ని ఇది.

చిల్లర వ్యాపారంలో అమ్మే సరుకుల్లో 75 శాతం సరుకులు వ్యవసాయ ఉత్పత్తులే. మధ్య దళారివర్గం ఒకటికి మించనివిగానైతే చిల్లర వర్తకులకు, రైతులకు ఉద్యోగం, ఉపాధికి ఆస్కార మంటుంది. అంతకు మించితే వీరందరు పొందే లాభం అసలు ఉత్పత్తిదారుడైన రైతు పొందే ధరకు కనీసం నాల్గు రెట్లు అధికమని అనుభవజ్ఞులందరి ఏకాభిప్రాయం అనేక సందర్భాలలో రైతులు తమ ఉత్పత్తులను దహనం చేయడం ధరలు లేక రుణబాధ భరించలేక వేలాది రైతులు ఆత్మహత్యలకు తెగించే వాస్తవాలు తెలియని వారుండరు. దేశమహోన్నత న్యాయస్థానం ఒక ప్రైవేటు వ్యాజ్యంలో తమ స్పష్టమైన తీర్పు ద్వారా గిట్టుబాటు ధరల జాడలేని రైతుల కడగండ్లను గుర్తుజేసింది. చిల్లర వర్తకులకు ఏలాంటి అన్యాయం జరగకుండానే ఈ వ్యాపారంలోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానించే ప్రభుత్వ విధానం చట్టబద్ధం రాజ్యాంగబద్ధమని తేల్చి చెప్పింది.

1991లో సంస్కరణల పర్వం ప్రారంభమైన నాటినుండి 2001 నాటికిగల ఒక దశాబ్దకాంలో దేశంలో వెచ్చించిన పెట్టుబడుల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కేవలం 1.8 శాతమైతే స్వదేశీ పెట్టుబడుల శాతం 98.2గా నున్నది. విదేశీ పెట్టుబడుల అవసరంలేకుండానే మన దేశం స్వావలంబన

సూత్రాధారంగా అభివృద్ధి చెందగల్గుతుంది. స్వదేశీ సంపద వృధాగాకుండా కాపాడుకోగల్గితే అభివృద్ధి రేటును గణనీయంగా పెంచుకోగల్గుతాం. ప్రపంచ వ్యాపార నియమ నిబంధనల ప్రకారం విదేశీ పెట్టుబడులు మన అనుమతి, నియంత్రణలకు లోబడి వస్తే భయపడే అవసరం అంతకన్నా లేదు. ఆరుదశాబ్దాల సుదీర్ఘకాలం తర్వాత గూడా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతుని రక్షించలేకపోవడం దారుణం. నిధుల కొరతతో గ్రామీణాభివృద్ధికి మూలమైన రోడ్లు, వంతెనలు, శీతల కేంద్రాలు, పరిశుభ్రమైన త్రాగునీరు, సాగునీరు, గిడ్డంగుల నిర్మాణం జరగడంలేదు. రైతుల దయనీయ పరిస్థితిపై దయచూపక తమ నిలువు దోపిడిని కొనసాగించే దళారీలు సహజంగా అధికార పార్టీలకు చెందినవారే కాబట్టి రైతుల దుస్థితిపై ఒక కన్నీటి చుక్క గూడా కార్చలేకపోతున్నారు. ధనబలంతో అధికారాన్ని పొందడం, దాన్ని పదిల పరుచుకోవడంతో సరిపుచ్చుకుంటున్నారు. దేశ సంపద త్వరత్వరగా పెరిగి, మిగులు ధనం సాధించబడిన తర్వాత దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందగల్గుతుంది. దేశాభివృద్ధి కార్య క్రమానికి అంకితమయ్యే ప్రభుత్వాలు మాత్రమే క్రమశిక్షణ, నియంత్రణ ద్వారా దేశ విదేశీ పెట్టు బడులను సద్వినియోగం చేయగల్గుతాయి. ఈనాటి అయిదు (5) శాతం అభివృద్ధి రేటు అసలు అభివృద్ధి అనిపించుకోదు. అది 2004 నాటి 7-8 శాతానికి పెరిగి స్థిరపడగల్గితేనే అన్ని రంగాలల్లో పెట్టుబడులను వెచ్చించి అత్యాధునిక సాంకేతిక సౌకర్యాలన్ని నెలకొల్పి అధికోత్పత్తిని సాధించగల్గుతాం. విదేశీ బహుళజాతి ద్రవ్య సంస్థల పెట్టుబడి వినియోగానికి జంకవలసిన అవసరం లేనేలేదు. ఆర్థిక ప్రజాస్వామ్యం, సుపరిపాలన దీనికి బాసట.

దార్శినికత:- మన దేశ రాజకీయార్థికాభివృద్ధి వేగం గురించి బాధ్యత నైపుణ్యతగల కొన్ని పాశ్చాత్య సంస్థలు ప్రకటించే “ దార్శనికత ” మన దేశ ఆర్థిక నిపుణులను సైతం ఆశ్చర్య చకితుల్ని చేస్తున్నది. 2050 నాటికి భారతదేశం ప్రపంచ ఉత్పత్తిలో, సంపదలో ప్రధమ స్థానాన్న లంకరించగల్గుతుందని ఆ తర్వాత వరుసగా చైనా, అమెరికా, ఇండోనేషియా, బ్రెజిల్ దేశాలుంటాయని వారి అవగాహన. వెనకబడి, పేదరికంతో బాధపడుచున్న మన ఆలోచనాపరులకు నమ్మశక్యంగాని ఈ అవగాహన ఎంత వరకు “ దార్శనికత ”అనిపించుకుంటుందో దాని సాధ్యాసాధ్యాల గురించి పరిశోధనలు చేయడం ప్రయోజనాత్మకం. ఒక మంచి కలను సాకారం చేసేదిశలో ఆలోచించడం అందుకై కృషి చేయడం మంచి భవిష్యత్తుకై ఆశించే విజ్ఞుల కర్తవ్యం. అమెరికాకు చెందిన ప్రముఖ బ్యాంకింగ్ గ్రూపు సి.ఐ.టి.ఐ వారి పరిశోధన గమనార్హం.

“ సి.టి. ” గ్రూపు తమ పరిశోధనకై ఆయా దేశాల ప్రజల తలసరి కొనుగోలు శక్తి (పిపిపి) ఆధారంగా పెరిగే దేశీయ ఉత్పాదక శక్తి (జిడిపి)ని ప్రాతిపదికగా చేసుకున్నది. జనాభా పెరుగుదలతో పాటు 18-61 సంవత్సరాల మధ్య వయస్సుగల శ్రామిక స్త్రీ, పురుషులు వారి నైపుణ్యతగల పని తనాన్ని అంచనా వేసింది. ఈ లెక్కన భారత జనాభా ఈనాడు (2011)న్న 121 కోట్ల నుండి 2050 నాటికి 163 కోట్లకు చేరుకుంటుందని అంచనా. దేశీయ ఆర్థిక ఉత్పత్తి పెరిగి 85.97 ట్రిలియన్ డాలర్లకు చేరి ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని వారి అవగాహన రెండవ స్థానంలోఉన్న చైనా దేశీయార్థిక ఉత్పత్తి 80.02 ట్రిలియన్ డాలర్లుంటుందని,అమెరికా దేశ అంతరంగికోత్పత్తి 39.07 ట్రిలియన్ డాలర్లుంటుందని అంచనా. 2050 నాటికి సగటు భారతీయుని తలసరి వార్షికాదాయం 53000 డాలర్లుంటుందని, ఇది ఈనాటి సంపద్వంతమైన స్విట్జర్లాండ్,

నార్వేలతో పోల్చదగిందని ఈ దార్శనికుల అభిప్రాయం. వర్గ విభజన ప్రాంతీయ అసమానతల తొలగింపు జరగని ఎడల పెరిగే సంపద సంపన్న వర్గాలని కుబేరులుగా మార్చే అవ కాశమున్నది గాని పేదరికాన్ని రూపుమాపజాలదు. ఈ వాస్తవం గూడా వారి దృష్టికి రావడం ముదావహం. రాజకీయార్థిక సంస్కరణల్ని చిత్తశుద్ధితో అమలు పరుస్తూ క్రింది వర్గాల ప్రజలు ఆర్దికంగా రాజకీయంగా సాధికారులై సమ్మిళితాభివృద్ధిలో భాగస్వాములైతేనే పెరిగిన సంపద దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి తెలియచేయడంతోపాటు దేశీయ ప్రజల జీవితాల్లో సుఖ సౌఖ్యాల పరిమళాల్ని ప్రసరింపచేస్తుంది. పై అత్యవసర సంస్కరణలు అమలు జరిగితే ఈనాడు (2011 లెక్కల్లో) పెద్ద ఆదాయాన్ని అనుభవించే సంపన్నుల సంఖ్య 7 కోట్ల నుండి 2050 నాటికి 30 కోట్లకి పెరుగగల్గుతుంది. వారి తలసరి ఆదాయం నెలకి 40000 రూపాయలుండవచ్చును. అలాగే ఈనాటి 28 కోట్ల మధ్యతరగతి ప్రజల సంఖ్యపెరిగి వేయి కోట్లకు చేరుకోవచ్చును. వారి నెలవారి తలసరి ఆదాయం 10000 రూపాయలనుండి 40000 రూపాయలకు చేరవచ్చును. చివరికి 33 కోట్ల జనాభా నెలవారి తలసరి ఆదాయం 10000 రూపాయలకులోపు ఉండవచ్చును. ఈ విధంగా 166 కోట్ల జనాభా కలిగిన భారతావని సుఖశాంతులతో ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే చిత్ర ప్రటాన్ని అమెరికాలోని “ ఒక ప్రాజెక్టు ” సంస్థ వారు “ సిటి ” సంస్థ ద్వారా మనముందుంచినారు. దీనికి ఈనాటి రాజకీయార్థిక స్థితిగతుల నేపథ్యంలో “ మెదడుకు మేత ” కంటే మించిన విలువలేదు. ఆశాజీవులుగా, ఉద్యమకారులుగా ఈ చిత్రాన్ని పరిశీలించడం ఆత్మ విశ్వాసాన్ని ఇనుమడించుకోవడానికి ప్రోత్సాహకంగానైనా ఉపయోగపడుతుంది. పెట్టుబడులను ఆకర్షిస్తూ పెట్టుబడిదారి వర్గాన్ని ప్రోత్సహించడం మాత్రమే ఆర్థిక సంస్కరణకానేరదు. లక్షల కోట్ల రూపాయల వరకు రాజకీయ నాయకుల ప్రత్యక్ష తోడ్పాడుతో కైంకర్యం చేస్తున్న దళారి పెట్టుబడిదారి వర్గ ఆటలు కట్టించడం, లంచగొండితనం, సబ్సిడీల సంస్కృతి స్థానే ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచే మంచి సంస్కృతి నెలకొనాలి. శ్రమజీవులంతా ఈ ఉత్పత్తి, సంపద తమ శ్రమ ఫలితమని, దేశాభివృద్ధికై తాము చేసే కృషి ఫలితమనే ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం సంపాదించాలి. దేశభక్తి, దేశ సేవలాంటి ఉన్నత విలువలు కరువైన అధికారపార్టీ దాని మిత్ర పక్షాల నాయకులు గత 5-10 సంవత్సరాలల్లో మూటగట్టిన దుష్పరిపాలన దుర్నీతి కడిగి వేయబడాలి. సుపరిపాలనశకం అరంభంకావాలి. నియంత్రణల నీడలో అధునిక శాస్త్రసాంకేతిక శాఖ వృద్ధికి దోహదం చేసే దేశ విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడం, అధికోత్పత్తినిచ్చే హైబ్రిడ్ విత్తనాల వ్యవసాయాభివృద్ధిని సాధించడం,మౌలిక సదుపాయాల కల్పన ద్వారా గ్రామీణాభివృద్ధిని సాధించడం, భూ సంస్కరణ భూ సేకరణ చట్టాలను రైతాంగానికి అనుకూలంగా ఆచరించడం విద్య, వైద్య విధానాలు ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు సంస్కరించడంలాంటి మార్పులు ఏమాత్రం తాత్సారానికి గురి కాకుండా చేపట్టడం అత్యవసరం. వీటి ద్వారా మాత్రమే దేశాభివృద్ధికి కీలకమైన ఔత్సాహిక వర్గం బలపడుతుంది. “ స్వదేశీ”, “స్వావలంబన” స్పృహలతో పారిశ్రామిక సరుకులన్ని తయారవుతాయి. విరివిగా విస్తరిస్తున్న మన మధ్యతరగతి ఒక పెద్ద మార్కెటుగా పుంజు కుంటుంది. అభివృద్ధి వేగాన్ని పెంచడాని కి “ సమ్మిళితాభివృద్ది”, “మానవాభివృద్ధి” మాత్రమే సోపానాలు.

" గోల్డ్‌మన్ సాచె" అను పరిశోధక సంస్థ వారు గూడా భారత భవిష్యత్తు గురించి ఆసక్తికర అవగాహనను కల్పించినారు. 2050 నాటికి భారత ఆర్ధిక వ్యవస్థ ఈనాటితో పోల్చగా 40 రెట్లు అధికం కాగల్గుతుందని 2007తో పోల్చగా 2020 నాటికే ఇది నాల్గురెట్లు పెరగగల్గుతుందని డాలర్ పరిభాషలో 2043 నాటికి అమెరికన్ ఆర్ధిక వ్యవస్థకు మించి ముందుకు పోగల్గుతుందని అందుకు సంస్కరణలు, నైపుణ్యతగలిన యువతరం సంఖ్యాబలం, ప్రజాతంత్ర వ్యవస్థ పటు తరంగావడం మూడు షరతులని విశ్లేషించినారు. అలవాటుపడిన కొందరు ప్రజలు కొన్ని సంస్క రణలను వెంటనే ఆమోదించకపోయినా ధైర్యంగా వాటిని అమలు పరచడం దీర్ఘకాల ప్రయోజనాల కొరకు అనివార్యం అన్నారు. బడ్జెట్ లోటు కారణంగా విద్యుత్తు ఉత్పాదన లాంటి కీలక పరిశ్రమలు వెనకబడి పోగూడదు. వెనకబడితే అభివృద్ధికి తీరని హాని జరగుతుంది. బడ్జెట్‌లోటు మహా అయితే దేశీయ ఉత్పత్తిలో 4.8 శాతానికి దాటకూడదు. స్వదేశీ బొగ్గును సక్రమంగా వినియోగిస్తూ విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయగల్గి సౌరశక్తి ద్వారా విద్యుత్ ఉత్పత్తిని తగినంత సాధించగల్గితే అనవ సరంగా బొగ్గు దిగుమతి, పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతులపై జరుగుతున్న దుబారా ఖర్చులను చాలావరకు తగ్గించగల్గుతాం. ఈనాడు విపరీతంగా పెరిగే కరెంటు అకౌంటు లోటును తీవ్రంగా తగ్గించగల్గుతాం. రాజకీయ నాయకత్వం, అధికారబృందం ఈ వాస్తవాలను ఎంత త్వరగా గమనించి ఆచరిస్తే అంత వేగంగా అభివృద్ధి సాధ్యపడతుందని వారి దృడ విశ్వాసం." స్టాండర్డ్ అండ్‌పూర్" అను మరో పరిశోధక సంస్థ భారత అభివృద్ధికి లోటు బడ్జెట్లు గుదిబండలుగా తయారైనవని, వీటిని తీవ్రంగా తగ్గించే చర్యలను వెంటనే చేపట్టాలని హెచ్చరించింది. ఆహారం, ఎరువులు, డీజిల్‌లాంటి అత్యవసర సరకుల ధరల పెరుగుదల భారం నుండి నిరుపేదల్ని రక్షించవలసిన బాధ్యత ఈనాటి పరిస్థితుల్లో ప్రభుత్వాలపైఉన్నప్పటికి ఈ సబ్సిడీల పంపకంలో జరుగుతున్న అవినీతి అక్రమాల కారణంగా అవసరానికంటే 3–4 రెట్ల ధనం దళారీలు, లంచగొండి అధికారుల ద్వారా అనర్హులైన వారు పొందడం దారుణమని వ్యాఖ్యానించింది. పరిపాలనా సంస్కరణలు, పారదర్శకత జవాబుదారితనం మాత్రమే ఈ వృధా ఖర్చులకు సరైన సమాధానాలని గుర్తుచేసినారు. సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న "ఆర్.బి.యస్, ఆసియా సెక్యూరిటీస్" అనుసంస్థ మన అవగాహనలో స్పష్టతను కల్పించే మరో సత్యాన్ని వెలుగులోకి తెచ్చింది. దాని ప్రకారం క్రూడ్ ఆయిల్ ధరలో పెరిగే ప్రతి 10 డాలర్ల ఫలితంగా భారతదేశ కరెంటు ఆకౌంటులోటు 50 బేసిక్ పాయంట్లకు పెరుగుతున్నది. ద్రవ్యలోటు 20 నుండి 30 బేసిన్ పాయింట్లు పెరగుతున్నది. బి.యం.ఐ వారి తాజా పరిశోధన ప్రకారం దేశీయ అభివృద్ధి రేటును 2031–32 నాటికి 8 శాతనికి చేర్చాలంటే ఈనాడు వినియోగంలో నున్న ఇంధనాన్ని కనీసం నాల్గురెట్లకు పెంచాలి. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్ని 6–7 రెట్లకు పెంచాలి. బొగ్గు వినియోగం గూడా 3 రెట్లకు పెరగాలి.

ప్రియమే ఐనా సౌరశక్తిని ప్రపంచంలోనే అత్యధికంగా వాడుకలోకి తేవాలనే లక్ష్యంతో మన కేంద్రప్రభుత్వం 2050 నాటికి రెండు లక్షల మెగావాట్ల సౌరశక్తి ఉత్పత్తికి ప్రణాళిక వేసింది. ఇందుకు రానున్న 30 సంవత్సరాలల్లో సుమారు 85 వేల కోట్ల రూపాయలనుండి లక్ష కోట్ల రూపాయలకుపైగా అవసరముంటుంది. 11వ ప్రణాళికలో 6వేల కోట్లతోపాటు 12వ ప్రణాళికలో 15 వేల కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. విశ్లేషకులు విధించే 10 శాతం జిడిపి రేటు పెరుగుదల 5 శాతానికి మించని ద్రవ్యోల్బణం సాధ్యపడితేనే 2050 నాటికి భారతదేశం 45 ట్రిలియన్

డాలర్ల వార్షికాదాయంతో ప్రపంచంలోనే అతిపెద్ద సంపద్వంతమైన దేశంగా వెలుగొందుతుంది. అందుకు అంకితమైన రాజకీయ శక్తుల పొందిక తక్షణావసరం. ఈనాటి దేశ రాజకీయ పరిస్థితి అత్యంత దారుణమైన భావ దారిద్ర్యం, సైద్ధాంతిక సంక్షోభంలో కొట్టుమిట్టాడు చున్నది. 8–9 శాతం దేశీయాభివృద్ధి రేటు 5 శాతానికి పడిపోయింది. అత్యధిక లాభాలకై పరుగెత్తె పెట్టుబడిదార్లు దళారి పెట్టుబడిదార్ల స్వైరవిహారానికి అధికంగా ఉపయోగపడే మొదటి విడత సంస్కరణలకై చూపే ఉత్సాహాన్ని రెండవ విడత సంస్కరణల గురించి చూపడంలేదు. రాజకీయ పార్టీలు గ్రూపుల ఉమ్మడి కృషి లేనిదే సంస్కరణలు జయప్రదంకానేరవు. వాటి ఫలితాలు 44.5 శాతంగాఉన్న పేదలకు దక్కవు. బాధ్యతగల రాజకీయ వేత్తలంతా తమ విధ్యుక్తధర్మ నిర్వహణకై ఉద్యమించి పరిపాలనను దారికి తెస్తేతప్ప పరిశోధకులు, విశ్లేషకుల అంచనాలన్ని పగటికలలుగానే మిగిలే దుస్థితి కొనసాగక తప్పదు. అభ్యుదయ దిశలో దేశ రాజకీయాలను మళ్ళించడం వినా దేశాభ్యుదయం సాధించడం దుర్లభం. పరిస్థితి చేజారి పోకముందే రాజకీయ నాయకత్వం ఆత్మ విమర్శల వెలుతురులో ఆర్థిక ప్రజాస్వామ్యానికవసరమైన కనీస కార్యక్రమ ప్రాతిపదికపై సువిశాల ఐక్య సంఘటన నిర్మాణం చేయాలి. 2014 సాధారణ ఎన్నికల్లో తిరిగి అధికారాన్ని హస్తగతం చేసుకున్న ఎన్.డి.ఏ. ప్రభుత్వ ఆర్థిక రాజకీయ విధానాల గురించి అప్పుడే బాధ్యతగల వారెవరు నిర్ధారణకు రాలేరు. యు.పి.ఏ. ప్రభుత్వ విధానాలే మరో రూపంలో కొనసాగవచ్చుననే సందేహం ఆలోచనపరులందరిలో ఉన్నది. ఆర్థికమంత్రి శ్రీ అరుణ్ జైట్లీ గారి 2014–15 బడ్జెట్ ప్రసంగంలోని 102వ పేరా కొంత కొత్తదనాన్ని స్ఫురణకు తెస్తున్నది. అదికూడా వారి దృఢమైన రాజకీయ సంకల్పబలాన్ని స్పష్టపరచడం లేదు.

మనదేశ ఆంతరంగిక వార్షికోత్పత్తిలో సగభాగానికి తోడ్పడుతూ వ్యవసాయేతర ఉపాధిలో 90శాతానికి భాధ్యత వహిస్తున్న సుమారు 6 కోట్ల సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు పూర్తిగా నిర్లక్ష్యం చేయబడుతున్నాయని వాటికి ఆర్థిక సహాయాన్ని అందిస్తూ స్వయం ఉపాధి రంగాన్ని విస్తరించటం దేశ సమస్యల పరిష్కారంలో ప్రముఖ పాత్ర పోషించవచ్చుననేది వారి ఉద్దేశంగా గోచరిస్తున్నది. దేశ ఆంతరంగిక వార్షికోత్పత్తిలో కేవలం 15 శాతం భాగస్వామిగా నున్న కార్పోరేటు సంస్థలే బ్యాంకుల ద్వారా అత్యధిక ఋణ సౌకర్యాన్ని పొందడం ఈనాటి వాస్తవం. ఉత్పత్తి, ఉపాధి రంగాలలో కీలక పాత్రను పోషించే చిన్న, కుటీర పరిశ్రమలు 97శాతం పెట్టుబడికి వడ్డీ వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడక తప్పడం లేదు. ఈ పరిస్థితి త్వరగా తీవ్రంగా సంస్కరించబడితే మన ఆర్థిక వ్యవస్థ పట్టాలపైకి ఎక్కగలుగుతుంది. మరో విశేషం, పాలక వర్గాల దృష్టిని ఆకర్షించదగింది. పై సూక్ష్మస్థాయి, చిన్న పరిశ్రమలలో 75 శాతం హరిజన, గిరిజన, బడుగు బలహీన వర్గాల యాజమాన్యంలోనున్నవి. వాటిని ఆధునికీకరించటానికి వాటి ఉత్పత్తులు, వ్యాపారానికి అవసరమైన ఋణసౌకర్యాన్ని కల్పించడం అభివృద్ధి చెందుచున్న దేశం ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం. దీని ఫలితంగానే ఆర్థికాభివృద్ధిరేటు పెరిగి సుస్థిరత సమకూరడంతోపాటు సాంఘిక న్యాయం కూడా సుసాధ్యమవుతుంది. కొత్త ప్రభుత్వం దీన్ని తమ విధానంగా ప్రకటించడం ఉచితం.

# 12. సుపరిపాలన

దేశ ప్రభుత్వ శాఖలన్నిటిలో అవినీతి, చట్టధిక్కారం కట్టలు త్రెంచుకుంటున్నది. లంచ గొండితనం జీవన విధానమైపోతున్నది. ఇవి బాహుటంగా కొనసాగుతూ వ్యవస్థీకృతమై పోయినవి. దీనికితోడు మహిళలపై అనుదినం జరుగుచున్న అత్యాచారాలు ఇదువరకెన్నడూ లేనంతగా దేశ నాగరికతను మంటగలుపుచున్నది. సుసంస్కృతి సత్సాంప్రదాయాల మన జన్మభూమి నాగరిక ప్రపంచం ముందు తలదించుకునే దౌర్భాగ్య పరిస్థితి దాపురించింది.

2010 వరకు పుట్టలో దాగియున్న నిలువు దోపిడి కథనాలు ఒకటి తర్వాత మరొకటి సాక్షా ధారాలతో బయటబడుచున్నవి. రెండవ యు.పి.ఎ. సంకీర్ణ ప్రభుత్వ పరపతిని పటాపంచలు చేస్తున్నది. ఈ "స్కాం"ల వరుస కొనసాగుతూనే ఉన్నది. ఇంతవరకు వెలుగులోకి వచ్చిన స్కాంల విలువ మన వార్షిక జాతీయ సంపదకి సగానికి సగం అనగా 33 లక్షల కోట్ల రూపాయలకుచేరింది.

ఇదంతా దేశ సంపద లెక్కలోకి రాని నల్లధనం. 1980లో 8 పెద్ద స్కాంలు బయటపడగా, 1991–1996 మధ్య కాలంలో 26 స్కాంలు, 2005–2008 మధ్యకాలంలో 150 స్కాంలు వెలుగు జూసినవి. ఇంకెన్ని రానున్నవో? 1980 దశకంలో " బోఫార్స్" ఒకటే ఆగుపించింది. దీనితో రూ॥64 కోట్ల ప్రజాధనం వృధా అయిన వైనం బయటపడ్డది. 1992లో బయటబడిన హర్షద్ మెహతా కుంభకోణం జానకీరాం కమిటీ రిపోర్టు ప్రకారం 3000 కోట్ల రూపాయలకు చేరింది. 1991–1999 మధ్యకాలంలో 2500 దేశ విదేశీ కొత్త కంపెనీలు స్టాక్ మార్కెట్‌లో ప్రవేశించి వేలాది కోట్ల ప్రజాధనాన్ని మ్రింగి మాయమైపోయిన ఉదంతం అందరిని ఆశ్చర్యపరిచింది. ఒక్కటంటే ఒక్కరిమీద గూడ సమకాలీన ప్రభుత్వాలు చర్యలు చేపట్టలేదు. ఫలితంగా గడిచిన దశాబ్దికాలంలో కార్పొరేట్ సంస్థలు ప్రజాధనాన్ని ఎంత వీలుంటే అంతగా నొక్కి వేయడానికి సాహసించినవి. చిన్న, పెద్ద కుంభకోణాలు వెలుగులోకి రావడం జరుగుతూనే ఉండగా 7500 కోట్ల " సత్యం " స్కాం బయటకి వచ్చింది. ఆ తర్వాత బళ్ళారి – ఆంధ్ర గనుల కుంభకోణం తెరలేచింది. ఇందులో వేలాది కోట్ల ప్రజాధనం పట్టపగలు కైంకర్యమై నట్లు సాక్షాధారాలు కళ్లకు కట్టినట్లుగా కనబడుచున్నవి. 2008లో రంగ ప్రవేశం చేసిన 2 జి స్పెక్ట్రం కుంభకోణం అన్నిటిని తలదన్నింది. దేశ సమున్నత జమా ఖర్చుల విచారణ సంఘం " కాగ్ " అంచనా ప్రకారం ఈ దుర్మార్గం ద్వారా దేశం కనీసం 176000 కోట్లప్రజాధనాన్ని కోల్పోయింది. ఇవేగాక " భూముల అమ్మకం " " గనుల త్రవ్వకం" అహార ధాన్యాల తరలింపు " పేర్లతో అనేక వేల కోట్ల రూపాయల ప్రజాధనం దొంగతనమైంది. ప్రజలఆస్తి హరించుకుపోవడంతో పాటు అనేక లక్షల కోట్ల ప్రజాధనం నల్లబజారులోకి వెళ్ళుచున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలలో జరిగే చిన్న, పెద్ద, చట్ట వ్యతిరేక నీతి బాహ్యమైన చర్యలు అత్యంత సామాన్యమైనవి, సహజమైనవి. చివరకు వీటిని పట్టించుకోవడం దండగ అనే పౌర సమాజం తయారైంది. ఈ విధంగా అవినీతి వ్యవస్థీకృతం అయిపోయింది. పైనుదహరించిన కార్పొరేటు సంబంధిత పాలకులకు ఏమాత్రం తగ్గకుండా ప్రభుత్వ ప్రత్యక్ష జోక్యంతో జరిగే కొన్ని అవినీతి చర్యలు పేర్కొనదగినవి. ఆదర్శ్ సొసైటి అవకతవకలు, కామన్ వెల్త్ ఆటల సంబంధితఖర్చులు,

మధుకొండా లీలలు, హైకోర్టు జడ్జీల అవినీతిపై విచారణలు దేశ సమున్నత న్యాయాదీశులపై జరిగే విచారణలు, సైన్యాధిపతులకు సంబంధించిన వ్యవహారాలపై విచారణ, ఇంకా అనేక సంఘటనలు జాతి జవసత్వాలను పూర్తిగా దిగజార్చుచున్నవి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటి నివారణ, నిర్మూలనకై చేపట్టిన చర్యలు పుండుమీద కారంలా బాధాకరంగా నున్నవి. భోపోర్స్ కుంభకోణంలో కత్రోచి అనే నిందితుడు ఇటలీ పౌరుడు కావడం పుణ్యాన ఆతని కేసు నిస్సారమై అతడిని నిర్దోషిగా ప్రకటించే స్థితికి చేరింది. కేంద్ర ప్రభుత్వ చేతుల్లోనుండే సిబిఐ సంస్థ చేపట్టిన లాలూవ్యతిరేక, ములాయం వ్యతిరేక, మాయవతి వ్యతిరేక విచారణలు రాజకీయ రంగులతో నిష్ప్రయోజనంగా నిలిచిపోతున్నవి. రాజకీయాలు నేరమయం కావడం, నేరస్థులే రాజ్యాధికారులుగావడం దేశం దురదృష్టం. మౌలికమైన రాజకీయ సంస్కరణలు, ఎన్నికల సంస్కరణలు మాత్రమే ఈ పతనానికి అడ్డుకట్ట వేయగల్గుతాయి. లేనిచో బహుముఖ రాక్షసత్వం దేశ భవిష్యత్తును దీర్ఘకాలం భంగపరిచే ప్రమాదం పొంచి కూర్చొని సమయం కొరకు వేచియున్న సంకేతాలు స్పష్టంగా అగుపడుచున్నవి.

వాస్తవంగా దేశంలో ఇంచుమించు అన్ని రాష్ట్రాలలో పరిపాలన అంటూఉన్నదా అనిపిస్తున్నది. 1955-56లో దేశీయ ఉత్పత్తికి కేవలం 4 శాతం నల్లధనమున్నదని అంచనా వేయగా ఈ నాటికి అది 50 శాతానికి చేరిందంటే ఆశ్చర్యం. ప్రతి ఆర్థికశాఖలో అవినీతి తిష్టవేసుకున్నది. లంచగొండితనం అందరికి తెలిసిన రహస్యంగాకపోతే ప్రభుత్వానికి ఈ గతి పట్టదు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల తేడా గూడా లేదు. ప్రధానమంత్రి కార్యాలయం మొదలు మంత్రులు, ముఖ్యమంత్రులు ఉన్నత పోలీస్ కార్యాలయాలు, న్యాయమూర్తుల కార్యాలయాలన్ని ఈ దుర్గంధంతో నిండిపోయినవి. అలాగాక పోతే ఇంతటి సాహసంతో చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన వ్యవస్థ ఇంత దారుణంగా దిగజారి పోయిఉండేదేకాదు. సమాజ అభ్యుదయాన్ని క్రమంగా కనిపెడుతూ దాన్ని ప్రోత్సహించ వలసిన బాధ్యులు తమ కళ్లు మూసుకొనని ఎడల సంఘ వ్యతిరేక శక్తులు చట్టాలను నిర్భీతితో ఉల్లంఘించడం జరిగేదిగాదు. ఒక ఉన్నతాధికారి బదిలీకై కోట్ల రూపాయలు చేతులు మారగా సామాన్య ఉద్యోగుల నియామకం, వారి బదిలీలలో జరిగే వేల రూపాయల లంచగొండితనాన్ని ప్రశ్నించే వారెవరు? పన్నుల ఎగవేతకై అసలు ఉత్పత్తి మొత్తాల్ని తగ్గించిచూపడం, అది ఒక క్రమంలో జరగడం సహజమై పోయింది. వాణిజ్య పన్నును సగానికి సగం తగ్గించి చెల్లించడం ఈనాడొక రహస్యమా?

వాణిజ్య, వ్యాపారస్థులతో అధికారులు రాజకీయ నాయకులు కుమ్మక్కుగావడం 1980 దశకం నుండి ప్రారంభమై దిన దిన ప్రవర్ధమానమైపోయింది. రాజకీయాలు నేరమయం గావడం, అసలు నేరస్థులే రాజకీయాలలోకి రావడం గత రెండు దశాబ్దాలకాలంలో చూస్తున్న పరిణామం. ప్రచార ప్రసార మాధ్యమాలు మొదలు తమ ధర్మాన్ని, నీతుల్ని వల్లె వేసినా క్రమ క్రమంగా జరుగుతున్న పరిణామాలన్నిటిని పరిరక్షించడం వారికి పరిపాటయిపోయింది. కొందరు మాత్రం నీతి నియమాలతో కొనసాగడానికి బహుబాధలననుభవించవలసి వస్తున్నది.

నేర నిరోధక శాఖలు ఉన్నత స్థాయి కోర్టులల్లో ఆర్థిక నేరస్థులపై జరిగే " విచారణ"లపై అనూహ్యంగా కాలహరణం చేయడం యాదృచ్ఛికంగాదు. అదొక కళగా మారింది. రాజకీయ నాయకుల

పుణ్యమాఅంటూ ఈ " విచారణలు" ప్రజలు మరిచిపోయే వరకు కొనసాగడం చివరకు వాటిని పసలేని తతంగంగా మార్చి దిగజార్చడం ఒక కొత్త కోణం. 1987లో ప్రారంభమైన భోఫోర్సు కుంభకోణంపై విచారణ ఇంకా కొనసాగుతూనే ఉన్నది. ఆర్థిక నేరస్థుల నేరాలు రుజువై శిక్షకు గురిఅయిన వారి సంఖ్య 2శాతం గూడా లేకపోవడం మన పరిపాలనలో గూడుగట్టుకొనియున్న అవినీతికి అద్దం పడుతున్నది. వెనకటికి దేశ స్వాతంత్రం కొరకు పోరాడిన సమరయోధులు జైళ్ళలో అష్టకష్టాలనను భవిస్తే ఈనాటి ఆర్థిక నేరస్థులు దేశద్రోహనికి తలపిడిన వారు జైళ్ళనుండే తమ కార్య క్రమాలన్నిటిని కొనసాగించగల్గడం మన రాజకీయ వ్యవస్థ ఎంత నేరమయమైపోయిందో వేనోళ్ళ చాటి చెప్పుచున్నది.

సామాజిక నేరాలు శాంతి భద్రతలను భంగపరచగా ఆర్థిక నేరాలు జాతి మూలాలను పీల్చివేస్తూ దేశాన్ని నిర్వీర్యం చేయడం మహాపరాధం. ప్రధానమంత్రితో సహా రాజకీయ నాయకులు, పాలనాధి కారులు ఇవేమి తమకు తెలియనట్లు తామైతే ఒక పైసా ముట్టలేదని నమ్మబలకడం ప్రజాస్వామ్య వ్యవస్థకే మాయని మచ్చ. ప్రజాస్వామ్యం ప్రజలచేత ప్రజల కొరకు పాటుబడే రాజకీయ వ్యవస్థగా పరిఢవిల్లాలంటే దానిని మౌలికాంశంగా సంస్కరించాలి. స్వాత్రంత్ర సమరం ఎంతటి ప్రాధాన్యతను పొందిందో అంతకు మించిన ప్రాముఖ్యత, ప్రాధాన్యతను స్వతంత్రతా ఫలితాల్ని సుపరిపాలన ద్వారా ప్రజాబాహుళ్యానికి అందచేయడంలోఉన్నది.

మర్చంట్ మీడియా ఛైర్మన్ గారైన శ్రీ ఖన్నాజ్ మర్చంట్గారు మన దేశ సుపరిపాలన గురించి తమ కోణంనుండి ఆలోచిస్తూ ప్రయోజనాత్మక సూచనలు చేసినారు. వారి అభిప్రాయంలో అవినీతి కారణంగా మన దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, వ్యవస్థాపర పెట్టుబడులు రావడం తీవ్రంగా మందగిస్తున్నది. రెండంకెల లాభంతోనున్న స్టాక్ మార్కెట్, పెరుగుచున్న దేశీయాభివృద్ధి రేటు గూడా విదేశీ పెట్టుబడులను ఆకర్షించలేకపోవుచున్నవి. దేశంలో గూడా ప్రతి సంవత్సరం (2010-11) ఎదుర్కోవలసివస్తున్న (412000) కోట్లరూపాయల ద్రవ్యలోటులో సగం లోటును తగ్గించగల్గే మంచి మార్గం అవినీతి పాలన ప్రక్షాళనమే అవుతుంది. అవినీతి ప్రక్షాళన జరగాలంటే రాజకీయ సంస్కరణలు మొదలు జరగాలి. కేంద్రంలో లోక్పాల్, రాష్ట్రాలలో లోకాయుక్తా, న్యాయ వ్యవస్థలు చక్కగా పనిచేయాలి. ప్రధానమంత్రి, శాసనకర్తలు, ఉన్నతాధికారులకు సంబంధించిన ఆరోపణల్ని తాము స్వయంగా గూడా విచారించే అధికారం కల్గియుండాలి. ఒక నిర్ణీత కాల వ్యవధికి లోబడి తమ విచారణ పూర్తి చేసే బాధ్యతగల్గియుండాలి. వారు విధించే తీర్పులకు ఒకే ఒక అప్పీ లుండాలి. అదిగూడా కాల పరిమితికి లోబడాలి. వారు విధించే తీర్పును ఖచ్చితంగా అమలు పరచే బాధ్యత కార్యనిర్వాహకవర్గం(ఎగ్జిక్యూటివ్)పై నుండాలి. ఈ నాటి లోక్పాల్, లోకాయుక్త చట్టాలల్లో బలం లేదు. వెంటనే పార్లమెంటు ఆ బలాన్ని సమకూర్చాలి. ఈనాటి సిబిఐ వ్యవస్థ పాలక పార్టీ చేతిలో ఒకకీలుబొమ్మగా మారి పతనమైంది. ఇది ఎన్నికల సంస్థలాగా పరిపూర్ణ స్వతంత్ర అధి కారాలుగల నేర విచారణ సంస్థగా మారాలి. దీని నియామకం నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ జోక్యం ఉండరాదు. స్వతంత్ర ప్రతిపత్తితో, నిష్పక్షపాతంతో, నిర్భీతితో నిర్ణయాలు చేయగలిగే విధంగా సంస్కరణ జరగాలి. గవర్నర్ వ్యవస్థ పూర్తిగా రాజకీయ ఉద్యోగంగా మారింది గాబట్టి దాన్ని రద్దు చేయాలి.

స్పీకరు పదవి అత్యున్నతమైనది కాబట్టి పదవీ విరమణ తర్వాత వీరు ఏలాంటి ప్రభుత్వ సంబంధిత బాధ్యతలను అనుభవించగూడదు. బీహర్ ప్రభుత్వం లాగా ప్రత్యేక కోర్టుల నియామకంతో సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు కళ్లెం వేస్తూ వాటిని తీవ్రంగా తగ్గించే పనికి దేశమంతా పూనుకోవాలి. దీని ద్వారా చట్టధిక్కారాన్ని అరికడుతూ శాంతి భద్రతలను పున రుద్దరించ గల్గుతాం. ఎన్నికల కమిషన్‌కి అదనంగా కొన్ని అధికారాలను రాజ్యాంగబద్ధంగా సక్రమింప చేయడం చాలా అవసరం. నేర చరిత్ర గల వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవడం అసాధ్యంగావాలి. ఈనాడు పార్లమెంటులో తీవ్రమైన నేరారోపణల నెదుర్కుంటున్న పెద్దలు 75మంది ఉన్నారు. రాష్ట్ర, శాసనసభలో ఈ సంఖ్య తగ్గలేదు సరికదా ప్రతి ఎన్నికల తర్వాత పెరిగి పోతున్నది కండబలం, ప్రజాభిప్రాయాన్ని ఓడించగల్గడం దురదృష్టకరం. సాధారణ మెజారిటి ఓట్లు సంపాదించి గెలిచే అవకాశం లేకుండా దామాషా ప్రాతినిధ్య విధానాన్ని ప్రవేశపెట్టడం మన 60 సంవత్సరాల చేదు అనుభవం సూచిస్తున్న సత్యం. పార్టీలు ఎన్నికల కమిషన్‌కి సమర్పించే లిస్టు ఆధారంగా వారు సాధించే ఓట్ల దామాషా ప్రకారం సీట్లు కేటాయించబడాలి. రాజకీయపార్టీల సంస్కరణ కూడా జరిగితే ప్రతిభాశాలురైన గుణవంతులు శాసనకర్తలుగా, మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా రాణించగల్గుతారు. అవినీతితో పాటు అసమర్ధత గూడా నిర్మూలించబడి సుపరిపాలనతో ప్రజాస్వామ్యం, ప్రజాహితం, సమహితం అవుతుంది.

" కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జెనరల్ ఆఫ్ ఇండియా " (కాగ్) గారి సలహాలు సుపరిపాలన చర్చలో అత్యంత ఉపయుక్తమైన స్పష్టతనందిస్తాయి. సమర్ధవంతమైన పోలీసు వ్యవస్థ, ఆడిట్‌వ్యవస్థలు సుపరిపాలనకు సోపానాలు. ఈనాటి పాలనా వ్యవస్థను తీవ్రంగా సంస్కరించాలిగాని సంహరించ గూడదు. ప్రత్యామ్నాయమేదైనా అందులో అంతస్థులు, అధికారాలు, హోదాలలో తేడాలుండక తప్పదు. విడి విడి బాధ్యతలతో సమిష్టిగా కలిసికట్టుగా పారదర్శకత్వం జవాబుదారి తనంతో పని జరిగితేనే ఈనాటి అరాచకత్వం తొలగి సుపరిపాలన సాధ్యపడుతుంది. ప్రైవేటు – పబ్లిక్ రంగాల సమిష్టి కృషితో ఎంతటి ప్రాజెక్టుల నిర్మాణం జరిగినా ప్రజాస్వామ్యంలో ప్రజల సంక్షేమానికే అవి జరుగుతాయి. ఐతే ప్రైవేటు పెట్టుబడిదారి వర్గం విశృంఖలంగా పన్నుల నెగవేస్తూ వాణిజ్య వ్యాపారంలో ప్రజా ప్రభుత్వానికి గూడా జవాబు చెప్పకుండా చివరకు రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే దశ రాకుండా జాగ్రత్తపడడం అభ్యుదయ రాజకీయ పక్షాల విద్యుక్తధర్మం. రాజకీయ సంస్కరణలు ఇందుకే అత్యవసరం. నీతి నియమాల సమాజానికి దాని చట్టబద్దతే ప్రమాణం.

పారిశ్రామికవేత్త హర్ష గోయంకా అభిప్రాయం ప్రకారం సంస్కరణల ప్రారంభంతో లైసెన్స్ పర్మిట్ రాజ్ తొలగిపోయిన పరిస్థితుల్లో అవినీతి తగ్గుతుందనుకుంటే అది క్రమంగా పెరిగిపోయింది. 2010 లోనే ప్రపంచదేశాలన్నిటి మొత్తం నల్లధనాన్ని మన దేశ నల్లధనం తలదన్ని పోయిందని ట్రాన్స్‌పెరెన్సి ఇంటర్ నేషనల్" ప్రకటించింది. 2.జి. మరియు కామన్వెల్త్ గేమ్స్‌లోనే అనూహ్యమైన నల్లధనం పోగుబడ్డది. అధికారులు రాజకీయ నాయకుల ధనదాహనికి అంతులేదు. 2009 నాటి లోక్‌సభ ఎన్నికలలో మొత్తం ఖర్చు 10000 కోట్లని అంచనా వేయడం జరిగింది. ఇందులో ఎన్నికల కమిషన్ చేసిన ఖర్చు 1300 కోట్లుమాత్రమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన ఖర్చు 700 కోట్లని అంచనా వేయగా మిగతా 8000 కోట్ల ఖర్చు రాజకీయ పార్టీలు చేసిందే ఈ 8000 కోట్లు ఎక్కడ

నుండి వచ్చినవో అందరికి తెలుసు. హార్వర్డ్ బిజినెస్ స్కూల్ కార్యక్రమంలో ప్రసంగించిన రతన్ టాటా సైతం రాజకీయ అవినీతి మితిమీరిపోయిందని వీరితో సంబంధభాంధవ్యాలు తెగదెంపులు చేసుకొవడమే మేలనిపించే పరిస్థితి ఏర్పడిందని వాపోయినారు. అయితే వ్యాపారంలో ఇది అనివార్యమై పోయిందనిగూడా సెలవిచ్చారు. నీతివంతుడైనప్పటికి అసమర్ధతగల నాయకుడికంటే సమర్ధత గలిగిన అవినీతి పరుడైన రాజకీయ నాయకుడితో పనిచేయించుకోవడం మేలు అనే అభిప్రాయం ప్రబలి పోతున్నదని వారు ఆశ్చర్యపడ్డారు.

భారతదేశంలో రాజకీయ పార్టీలు తమ నిధుల కొరకు వ్యాపారస్థులపై ఆధారపడడం మాత్రమే కాదు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కాంట్రాక్టుల్లోని సంపాదనగూడా బాగా కలిసివస్తున్నది. అవినీతి వ్యవస్థలో పెద్ద భాగమైపోయినది. అధికారగణం, రాజకీయ నాయకత్వానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాది నేతలతోగల సన్నిహిత స్వార్ధపర సంబంధాల ఫలితంగా ఇది వ్యవస్థీకృతమైనా దాదాపు బహిరంగం గానే కొనసాగుచున్నది. కొందరు అధికారుల ఒత్తిడి ఫలితంగా నేరస్థులైన వారిపై విచారణ జరపాలని కోరిన సందర్భాలలో ప్రభుత్వం కేవలం రెండంటే రెండు శాతం సందర్భాలలోనే సకారాత్మక నిర్ణ యాలు చేస్తున్నది. అందులో సుదీర్ఘ విచారణ తర్వాత కేవలం మూడంటే మూడే శాతం సందర్భాలలో దోషులకు శిక్ష పడడం జరగగా 97 శాతం నిందితులు “ నిర్దోషులుగా” సగర్వంగా బయటబడుతున్నారు. తక్షణం జీతభత్యాలననుభవిస్తున్నారు. నైతిక పతనం అథ: పాతాళానికి పడి పోయిందనడానికి ఇదొక్క అంకె చాలదా! ఎన్నికల సంస్కరణలు జరిగితీరాలి. అభ్యర్ధుల ఎంపికల సంస్కరణలు జరిగితీరాలి. అభ్యర్ధుల ఎన్నికల ఖర్చులకు పరిమితులు విధించాలి. జమాఖర్చులన్ని బ్యాంకుల ద్వారా జరగాలని నిర్బంధించాలి. అన్ని రంగాలల్లో అధికారులు నిబంధనలు పాటించే విధంగా కనిపెట్టాలి. వారి సొంత నిర్ణయానికి ఆస్కారముండగూడదు. నీటి ప్రాజెక్టుల నిర్మాణం, రోడ్ల విస్తరణలాంటి పెద్ద కాంట్రాక్టుల సమర్ధవంత నిర్వహణకై ప్రత్యేకాధికారులు ఉండాలి. వారు వాటి నైపుణ్యతను మాత్రమే కనిపెట్టాలిగాని నిర్ణయాలు మార్చే అధికారం కలిగి ఉండరాదు. పై అధికారి నీతిమంతుడైన సందర్భాలలో అత్యధికంగా అవినీతిని తగ్గించగలిగిన అనుభవం మనకున్నది. దీనికితోడు కాగితాలు తిరగడం, అధికారులకు ప్రజలతో ప్రమేయం తీవ్రంగా తగ్గించాలంటే “ఈ” పరిపాలనా విధానాన్ని విస్తృతంగా ప్రవేశపెట్టి తీరాలి. వీటన్నిటికంటే ముఖ్యమైనది నీతివంతమైన దీక్షా దక్షతలుగల నాయకులు, అధికారుల సంకల్పబలం మనసుంటే మార్గముంటుంది. భయం కలగాలంటే చట్టాలు లొసుగులు లేకుండా కట్టుదిట్టంగా ఉండాలి. తప్పు జరిగితే కఠినంగా శిక్షించాలి. నీతిమంతులను ప్రోత్సాహం, గౌరవం ఉండాలి. దేశభక్తి, నీతి నియమాలపట్ల భక్తిభావం పెంపొందే విద్యా విధానం, మనుష్యుల భావజాలం వ్యవహరశైలి వారి నడకని ప్రభావితం చేయాలి. అర్ధ శాస్త్రవేత్తలు దేశ ఆర్ధిక ప్రగతి వేగం స్ధంబనకి మరో కోణాన్ని కనిపెట్టినారు. ఇది రాజకీయ అవినీతి దుష్పరిణామమని వారి నిశ్చితాభి ప్రాయం. రాజకీయ వ్యవస్థ, పారదర్శకత్వం జవాబుదారి తనంతో పరిశుభ్రమైతేనే ఆర్ధిక వ్యవస్థలో నూతన జవసత్వాలు చోటు చేసుకుని ప్రగతి వేగం పుంజు కుంటుందని వారి హేతుబద్ధమైన వాదన.

పారిశ్రామిక వాణిజ్య వ్యాపారాల స్థాపన, వాటిఅభివృద్దిలో ఒకటి రెండుగాదు షుమారు (40) అను మతులు పొందవలసివస్తున్నది. వాటన్నిటిని తగ్గించే సంస్కరణల గురించి అనేకానేక

నివేదికలు ప్రభుత్వాల పరిశీలనలోఉన్నవి. అటవీశాఖ, పర్యావరణ శాఖల నుండి అనుమతులు పొందడం అసాధ్యమై పోయింది. వేల కోట్ల వ్యయంతో గూడిన విద్యుఛ్ఛక్తి, నీటి పారుదల ప్రాజెక్టుల ఫైళ్లు అనేక సంవత్సరాలు నానడం కారణంగా వాటిపై ఖర్చుల అంచనాలు విపరీతంగా పెరిగి పోతున్నవి. వాటి నిర్మాణంలో అనూహ్య జాప్యం సహజమైపోయింది. అవి ఫలితంలోకి రావడానికి వేసిన కార్యక్రమంలో విపరీతమైన కాలహరణం జరగడం గూడా సహజం. పై కారణాల ఫలితంగా ప్రాజెక్టుపై వెచ్చించే పెట్టుబడిపై రావలసిన లాభం యొక్క నిష్పత్తి తగ్గిపోతున్నది. అదనంగా వెచ్చించిన పెట్టుబడులపై రావలసిన అదనపు లాభం మధ్య నిష్పత్తి తగ్గుచున్నది. ఈ విధంగా విలువైన ప్రాజెక్టులు లాభసాటికాకుండా పోవడం వలన దేశసంపద పెరగడం స్థంబించిపోతున్నది. రాజకీయ నాయకులకిచ్చే లంచం, పై నుండి క్రింది వరకున్న అధికార బృందానికి చెల్లించవలసిన ముడుపులు వాటిని పన్నుభారం నుండి తప్పించుకోవడానికి ఆదాయ పన్నుశాఖ వారికివ్వవలసిన పారితోషికాలు, ఇవి చాలవన్నట్లు ప్రాజెక్టు నిర్వాహకుల దురాశ, అన్ని తడిసి మోపెడై అసలు ప్రాజెక్టులు ఆరంభంలోనే దివాళా తీయడానికి దారితీస్తున్నది. “ ఈ సందర్భంలో సింగపూర్ దేశ ప్రభుత్వం అవలంభించే విధానం అనుసరణీయం. ఒక పారిశ్రామికవేత్త తన పరిశ్రమకు సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టును ప్రభుత్వమే పరిశీలించి అందుకు సంబంధించిన వివిధ అనుమతులను పొంది ఒక నిర్ణీత కాలంలో పరిశ్రమ నిర్మించి ఉత్పత్తి ప్రారంభించాలని ఆదేశిస్తారు. దానికి జవాబుదారి బాధ్యత ప్రభుత్వానిదే. దీనివలన లంచగొండితనం తొలగడంతోపాటు అనవసర జాప్యాలు అంతమవుతాయి. ఉత్పత్తి పెరుగుతుంది. వీటన్నిటిని నియంత్రించవలసిన రాజ్యాధికారంగల రాజకీయ వ్యవస్థ ప్రప్రధమం ప్రక్షాళనకు గురికావాలి. రాజకీయ పార్టీ వ్యవస్థ, మొదలుకొని ఎన్నికల వ్యవస్థలను పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలను ఆమూలాగ్రం సంస్కరించాలి. (65) సంవత్సరాల సుదీర్ఘ అనుభవాల సాక్షిగా మన రాజ్యాంగంతో సహా వివిధ చట్టాల రూపురేఖలు మారాలి. రాజకీయ అవినీతికి మూలం ఎన్నికలని, కాబట్టి ప్రజాస్వామ్యం మన దేశానికి గిట్టుబాటుగావడంలేదని అపసవ్యంగా ఆలోచించే మేధావులు కొందరి ఉచిత సలహా ఆత్మహత్యా సదృషం మాత్రమే. ప్రజాస్వామ్యానికి మించిన మరో రాజకీయ వ్యవస్థలేనే లేదని నమ్మే ప్రజలు, ప్రజా నాయకులు దీన్ని ఒక సవాలుగా స్వీకరించే సమయమాసన్నమైంది. సుపారిపాలన అవశ్యకత గురించి ప్రముఖుల అభిప్రాయాలు తీవ్రంగా ఆలోచించదగినవి. శ్రీ అరుణ్ మైరా (ప్రణాళికా సంఘ సభ్యులు) ఇలా అభిప్రాయ పడుచున్నారు. “ఈనాటి అసమర్థ పరిపాలన పరాకాష్ఠకు చేరడం వలన ప్రజల నైరాశ్యం కట్టలు త్రెంచుకుంటున్నది. అవినీతికి తోడు అనుదినం జరుగుతున్న మహిళలపై అత్యాచారాల వార్తలు అగ్నికి ఆజ్యం పోసినట్లుగా ప్రజా స్వామ్యవాదుల హృదయాలను దహించివేస్తున్నవి ప్రజలకు సేవలందించవలసిన ప్రభుత్వ శాఖల వైఫల్యంతో విసుగెత్తిన నిర్భాగ్యులు పోలీసు, న్యాయవ్యవస్థల వైపు తమ దృష్టిని మళ్ళిస్తారంటే అవిగూడా తమ ఇల్లు చక్కబెట్టుకోలేక సతమతమవుతున్న దృశ్యం భయంకరమైపోతున్నది. న్యాయస్థానాలు ఆశాజనకంగా అగుపించినా అనూహ్యమైన ఆలస్యాలు, జడ్జీలకొరత, వాయిదాల కారణంగా అపారంగా కాలహరణానికి కారణ భూతమయిపోయినవి. నేరనిరోధన తమప్రధమ కర్తవ్యంగా భావించి తక్షణం రంగప్రవేశం జేస్తూ బాధితులకు రక్షణ కవచంగా, ఆప్తులుగా అందుబాటులోనుండవలసిన పోలీసు వ్యవస్థ తమ శాఖా పర సమస్యలతో పాటు లంచగొండితన నేర భారాన్ని అందరికంటే అధికంగా మోస్తున్నది.

సుపరిపాలన కత్యవసరమైన పారదర్శకత, జవాబు దారితనం, సమయపాలన లాంటి విలువలు లుప్తమై ప్రజా వ్యతిరేక వ్యవస్థ అను నిందని మూటగట్టుకుంటున్నది.

పౌర సమాజానికి కావలసింది ప్రజాబంధువుగా ప్రజల తలలో నాలుకగా పేరున్న రాజకీయ నాయకత్వం. ఇది అంగబలం అస్త్ర బలంతో రాదు. త్రికరణశుద్ధితో స్వచ్ఛందసేవా తత్పరత గలిగి చట్ట సంబంధ పరిజ్ఞానంతో పాటు చక్కని వ్యవహారశైలి రాజకీయ నాయకత్వానికి ఇవి అమూల్యమైన ఆభరణాలు. సిద్ధాంత భేదాభిప్రాయాలతో నిమిత్తం లేకుండా చూస్తే బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడి లాంటి వారి గతం దీనినే ధృవ పరుస్తున్నది. మన రాజ్యాంగం ప్రకారం మన రాజకీయ వ్యవస్థ, రాష్ట్రాలకు అత్యధిక అధికారాలుండే ఫెడరల్ వ్యవస్థనేనైనా ఆచరణతో కేంద్రప్రభుత్వం అత్యధిక పరిపాలనాధికారాలు కలిగియున్నది. "ఆంఆద్మీ" పేరుతో నిర్వహిస్తున్న కేంద్రీకృత (యూనిటరీ) పరిపాలన ఆంఆద్మీకి అత్యవసరమైన ఆర్థిక, పాలనా పరమైన సంస్కరణ లకివ్వవలసిన ప్రాధాన్యతనివ్వడం లేదు. పైగా నిత్యావసర సరుకుల ధరలను పెంచుతూ విదేశీ బహుళజాతి సంస్థల ధన దాహన్ని తీర్చే సంస్కరణలకై తీర్మానిస్తున్నది. స్వావలంబన సమహిత సూత్రాలకు తిలోదకాలనిస్తున్నది. దేశ సంపదను పెంచుతూ అందులో మిగులును దేశాభివృద్ధికై వెచ్చించే సహజమైన రాచమార్గాన్ని వదిలివేస్తూ దేశ సంపదకై విదేశీ ద్రవ్య సంస్థలకు దేశ ద్వారాలు తెంచే అవ్యవస్థకై అనవసరంగా ఆరాట పడుచున్నది. స్వాతంత్ర్యానంతర కాలమంతా ఇంచుమించు ఇదే ఆలోచనతో సరిపోయింది. మన తర్వాత (1948) స్వతంత్రం పొంది (1978) 30-35 సంవత్సరాలుగా సుస్థిర పాలననడుపుచున్న, మన కంటే జనాభాలో, పేదరికంలో గూడా పెద్దదైన చైనా దేశ ప్రజల తలసరి వార్షికాదాయం షుమారుగా వంద శాతం పెరిగింది. ఇటువంటి అనుభవాలు మన కళ్ల ముందుండగా మన పాలకులు వారి ఆర్థిక సలహాదారులు వాషింగ్టన్ సలహాల వైపు చూడడం రాజకీయ భావ దారిద్ర్యం లేక భావ దాస్యం అనిపించుకుంటుంది. కేంద్ర విధానాలు మారాలంటే కేంద్రంలోని అధికార పీఠాన్ని అలంకరించిన రాజకీయ పొందికలు మారి తీరాలి. కేంద్రం దేశ ఆర్థిక విధానాలకు మార్గదర్శకత్వం వహించాలి. స్పష్టమైన దార్శనికత కలిగిన లక్ష్యశు ద్ధి, చిత్తశుద్ధి కలిగిన నాయకత్వం ఒంటరిగానైనా, సమిష్టిగానైనా పరిపాలించాలి. ప్రప్రధమమైన చర్య రాష్ట్రాల కిచ్చిన అధికారాలను ఇతోధికంగాపెంచాలి. అదే మేరకు నిధులను మళ్ళించాలి. సర్కారియా కమీషన్ కొన్ని దశాబ్దాల క్రితమే అందించిన నివేదికపై పేరుకున్న దుమ్మును దులపాలి. ఇంకా కొంత కొత్తతనాన్ని జతపర్చాలి. అమలు పర్చాలి. అదే విధంగా రాజ్యాంగ సవరణలు 73-74ల వెలుతురులో చేయబడిన పంచాయితీరాజ్ వ్యవస్థకి విధులు, నిధులన్నిటిని సమకూర్చాలి. ఆ విధంగా వికేంద్రీకృత పరిపాలన ద్వారా పాలనలో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం పారదర్శకత, జవాబుదారితనం లాంటి విలువలు సాధ్యమవుతాయి. ప్రజల అత్యవసర సమస్యల ఎంపికతోపాటు వాటి పరిష్కారంలో గూడా ప్రజలు తమ ప్రత్యక్షపాత్రను పోషించడం సమ్మిళితాభివృద్ధిలో కీలకాంశం. విద్య, వైద్య సదుపాయాలైన మౌలిక సదుపాయాల నిర్మాణం ద్వారా మానవాభివృద్ధి జరిగి చైతన్య వంతమైన యువత దేశాభివృద్ధి కార్యక్రమాలలో ప్రధాన పాత్రను పోషించగలిగితే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే తాము ఎన్నుకున్న సమర్ధవంతమైన నాయకత్వం ద్వారా సుపరిపాలనను సాధించుకుంటారు. అసత్యాలు చెబుతూ అడ్డదారులు తొక్కి ప్రజాధనాన్ని కైంకర్యం చేసే స్వార్ధపర ఉద్యోగుల అవినీతి అరికట్ట బడుతుంది.

అన్ని సంస్కరణలకి మూలం మానవ చైతన్యం. అది ఆధునికం, క్రియాశీలం అవుతూ సామాజిక స్పృహతో సొంతపనితో పాటు సామాజిక బాధ్యతలనునిర్వహించిన నాడు సమస్య లుండవు. విజ్ఞానవంతులు శాస్త్ర సాంకేతిక నిపుణుల నేతృత్వంలో బహుముఖాభివృద్ధి సుసాధ్యమవుతుంది. నిర్ణయాలు చేయడంలో వాటి ఆచరణలో ఈనాడు అడుగడుగునా జరుగుతున్న జాప్యం, కాలహరణం, తమ బాధ్యతను ఇతరులపైకి నెట్టడం లాంటి దోషాలు అపచారాలనిపించుకుంటాయి. అనుకున్న కాల వ్యవధిలో అంచనాలకు మించని వనరులతో ప్రాజెక్టులు విలక్షణంగా పూర్తి అవుతాయి. ఉపయోగంలోకి వస్తాయి. మలేసియా, జపాన్ దేశాలలో ప్రజల ప్రత్యక్ష పాత్రను మరింత సార్ధకం చేయగల్గుతున్నారు. ఆయా ప్రాజెక్టుల లబ్దిదారుల సమావేశాలల్లో గూడా, ఏర్పడిన ఆటంకాల గురించి చర్చించే బాధ్యత అధికారులకు, అనధికారులకు ఇవ్వడం జరిగింది. సంబంధించిన శాఖాధిపతుల సమిష్టి చర్చలు, సమిష్టి నిర్ణయాలకు అవసరమైన నిబంధనలను రూపొందించడం జరిగింది. మానవ ప్రయత్న లోపాల్ని గుర్తించి వాటి నివారణోపాయాలు చేయడం జరిగింది. ప్రణాళికాబద్ద వికేంద్రీకృత వ్యవస్థలో వనరుల కొరత, నిధులలేమి అను సమస్యలే ఉత్పన్నంకావు. ఇవన్నీ సుపరిపాలన సాధనలో కల్గిన విలువైన అనుభవాలు అనుకరించదగిన కర్తవ్యాలు. సుపరిపాలన అవశ్యకతను ఎత్తిచూపిన మరో విశ్లేషణ గమనార్హం. “ అభివృద్ధి చెందుచున్న సమాజాల అధ్యయన కేంద్రం” అనుభాధ్యతగల సంస్థ వారు మన దేశ ప్రజల మనోభావాలను క్రోడీకరించి రూపొందించిన విశ్లేషణను “ హిందూ ” పత్రిక ప్రకటించింది. అందులో కొన్ని ఆసక్తికర అంశాలు సంక్షిప్తంగా పేర్కొనదగినవి. ఈ సర్వే దేశంలోని 19 రాష్ట్రాలలోని 1300 నివేశన స్థలాలలో నిర్వహించడం జరిగింది. అవినీతి వ్యతిరేక ఉద్యమకారులు ఎత్తిచూపిన అవినీతి నివారణోపాయాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని 44 శాతం అంగీకరించగా వారిలో గ్రాడ్యుయేట్లు ఆపై విద్యావేత్తలు 59 శాతమున్నారు. దీనికి వ్యతిరేకంగా భావించేవారు 22 శాతం అందులో విద్యావేత్తలు 27 శాతం నల్లధనాన్ని విదేశీ బ్యాంకుల్లో దాచుకున్న వారిని కేంద్రం రక్షిస్తున్నదనే దానికి అనుకూలంగా భావించే ప్రజలు 44 శాతంకాగా అందులో విద్యావంతులు 60 శాతం అలా కాదనే ప్రజలు 17శాతమైతే అందులో విద్యావేత్తలు 22 శాతం. రాష్ట్ర ప్రభుత్వాలకంటే మించిన అవినీతికి పాల్పడేది కేంద్ర ప్రభుత్వమేననే పశ్నకు సమాధానంగా దేశంలో 35 శాతం అనుకూలమైతే రాష్ట్ర ప్రభుత్వాలేననే వారు 24 శాతం కాగా స్థానిక సంస్థలేననేవారు 23 శాతం అందులో ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని చూడగా కేంద్రానికి 32 శాతం రాష్ట్రానికి 39 శాతం, స్థానిక పరిపాలనకి 14 శాతం ఓట్లు వచ్చినవి. దేశ ప్రభుత్వ శాఖలల్లో ఏ శాఖలో అవినీతి అధికమనే ప్రశ్నకు సమాధానంగా దేశ వ్యాపితంగా వచ్చిన సమాధానాలన్నిటిలో పోలీస్‌శాఖ ప్రధమస్థానాన్ని పొందింది. సాధారణ జనవాక్యం 25 శాతంకాగా అందులో గ్రామీణ పేదలు 19 శాతమంటున్నారు. గ్రామీణ ధనిక వర్గం 29 శాతమనుకుంటున్నది. పట్టణ పేదలు దీన్ని 25 శాతం కాగా అందులో గ్రామీణ పేదలు 19 శాతమంటున్నారు. గ్రామీణ ధనికవర్గం 29 శాతమనుకుంటున్నది. పట్టణ పేదలు దీన్ని 25 శాతమనుకోగా పట్టణ ధనికవర్గం మాత్రం 42 శాతమనుకుంటున్నది. ఆ తర్వాత వరుసగా రెవెన్యూ, పంచాయితీరాజ్ వ్యవస్థలు ఉన్నాయి.

ప్రభుత్వ ప్రతినిధుల్లో ఎవరు అత్యధికంగా అవినీతికి పాల్పడుచున్నారనే ప్రశ్నకు విచిత్రమైన సమాధానం వచ్చింది. ఎన్నికైన ప్రజా ప్రతినిధులేనని 42 మార్కులతో వేలెత్తి చూపగా, ఆ తర్వాత

32 మార్కులు పొందిన ప్రభుత్యోద్యోగులని ప్రకటించినారు. ఆ తర్వాత వరుసగా న్యాయస్థానానికి 4 మార్కులు, వాణిజ్య వ్యాపారరంగానికి 3 మార్కులు ప్రభుత్వేతర సంస్థలు ప్రసార సాధనాలకు 2 మార్కులనిస్తూ తమ తీర్పులిచ్చినారు.

యు.పి.ఎ ప్రభుత్వం అవినీతి గురించి అడగగా ఇది బాగా అవినీతికి పాల్పడుచున్నదని 28 శాతం మంది భావించగా కొంతవరకైనా అవినీతికి పాల్పడుతున్నదని 32 శాతం ప్రజలు భావిస్తున్నారు. పెద్దగా కాదనేవారు 10 శాతం ఏమాత్రం అవినీతిలేదనేవారు గూడా 5 శాతమున్నారు.

లోక్‌పాల్ – జనలోక్‌పాల్ చిత్తుచట్టాలకు అనుకూలమెందరో తెలుసుకునే ప్రశ్నకి సమాధానంగా సాధారణ అభిప్రాయంతో అన్నాహజారే గారి జన లోక్‌పాల్ బిల్లుకు అనుకూలంగా 25 శాతం స్పందించగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోక్‌పాల్ బిల్లుకు అనుకూలంగా 7 శాతం స్పందించడం జరిగింది. ప్రతిస్పందించడానికి ఈ రెండింటిలో దేనిలో ఏమున్నదో తెలియదనే వారే 63 శాతం జనం.

ప్రతి ప్రభుత్వానికి దాని కార్యక్రమాల్ని సక్రమంగా నిర్వహించడానికి వివిధ శాఖలు, శాఖాధిపతులు అనివార్యంగా అవసరం. నీతివంతమైన పరిపాలన వివిధ శాఖాధిపతులు వారి సిబ్బంది నకడపై ఆధారపడుతుంది. సుప్రసిద్ధ టైమ్స్ గ్రూప్‌కి సంబంధించిన పరిశోధకులు విశ్లేషకులైన అమన్‌శర్మగారి అభిప్రాయం ప్రకారం భారత ప్రభుత్వ యంత్రాంగం ఆసియా ఖండంలోని 12 దేశాలన్నిటిలో అత్యధిక అవినీతి పరిపాలనకు దిగజారింది మన భారతదేశం గావడం అవమానకరం. విశ్లేషకుల నిర్ణయానుసారం మొత్తం 10 మార్కులలో ఏ దేశానికి ఎంత అధిక మార్కులు లభిస్తే ఆ దేశం అధికంగా అవినీతికి పాల్పడుచున్నట్లు అర్థం చేసుకోవాలి. మన దేశం 9.21 మార్కులు పొంది అవినీతిలో కూరుకొన్నదిగా పేరు పోగా మన తర్వాత 8.54 మార్కులతో వియత్నాం, 8.31 మార్కులతో ఇండోనేషియా దేశాలున్నవి. మిగతా 9 దేశాలు 5 మార్కుల చుట్టు తిరుగుతుండడం జరుగుచున్నది. 7.11 మార్కులతో చైనా ఉంది. 2.25 మార్కులు పొందిన సింగపూర్ దేశం అభినందనార్హం.

పాలనాధికారగణం అనుసరించవలసిన నియమ నిబంధనలు వారికివ్వవలసిన శిక్షణ గురించి మాట్లాడుకోవడం సందర్భోచితం. సుపరిపాలన సాదనకవసరం. శ్రీ అమన్ శర్మ గారి పరిశోధనల సారాంశం మన (బ్యూరోక్రసి) అధికార బృందం యొక్క పనితనాన్ని తీవ్రంగా సంస్కరించడానికి ఎంతగానో తోడ్పడుతుంది. ప్రభుత్వోద్యోగులు తమ ఉద్యోగాలకి ఎంపికగాకముందే తమ అర్హతలను సాధించే నిబంధనలు చాలా ఉన్నవి. చాలా మంది ఉద్యోగానికి ఎంపికచేసే పరీక్షలో ఉత్తీర్ణులుగావలసి వస్తుంది. వారికిచ్చే శిక్షణతో పరీక్షలో ఉత్తీర్ణులుగావలసి వస్తుంది. ఆ శిక్షణ పరిధిలోకి సంస్కరణలుగూడా రావడం అవసరం. ఇతర ఉపాధి, ఉద్యోగాలతో సహా సహజంగానే సామాజిక సమస్యలు వాటి పరిష్కార మార్గాల గురించి ప్రధానంగా స్వీయ ఆలోచనా విధానం ఆయా అధికారుల మనస్సులో ఉంటుంది. అధికార పార్టీలు వారి రాజకీయాలెలాఉన్నా సామాజిక స్పృహ కలిగి ఉండడం ప్రధానాంశం. తాము చేయబోయే ప్రతి పని వెనక వందల వేల పౌరుల జీవితాల మంచి చెడులుంటాయి కాబట్టి వాటిని నెమరువేసుకున్న తర్వాతనే తానొక నిశ్చయానికి రావలసియుంటుందనే బాధ్యతను

విస్మరించరాదు. అనేక సందర్భాలలో తాను తమ ఆలోచనను మార్చుకొని సవరించుకోవలసి రావచ్చు. అందుకు జంకకుండా ధైర్యంగా మార్చు కోవడం మంచి నిర్ణయానికి అత్యవసరం.

అలాగే పై అధికారులు తమ క్రింది అధికారుల పనితనాన్ని బేరీజు వేయడంలో మౌలిక మార్పురావాలి. ఈనాటి నిబంధనల ప్రకారం అజమాయిషి చేయబడే ఉద్యోగియొక్క సత్ప్రవర్తనకు 60 శాతం మార్కులనిస్తూ పనితనానికి 40 శాతం మార్కులనే ఇస్తున్నారు. బదిలీలు, ప్రమోషన్లకు ముందు ప్రతి అధికారి గుణ గుణాలు, ప్రవర్తనలు, పనితనాలని అంచనాకట్టడం అవసరమే. కాని అసలు ప్రయోజనం పనితనం. ఫలితాన్ని సాధించుకోవాలి కాబట్టి ప్రతి ఉద్యోగి తనకిచ్చిన బాధ్యతలను సక్రమంగా సత్వరంగా న్యాయసమ్మతంగా నిర్వహించగలగాలంటే వాస్తవాన్ని, సత్యాన్ని, రాగద్వేషాల కతీతంగా అవగాహన చేసుకొని ఒక నిర్ణయానికి రావలసి ఉంటుంది. ఉద్యోగంలో సీనియారిటి పెరగడంతోపాటు విషయజ్ఞానం, సామర్థ్యంగూడ పెరగాలి. నిత్య విద్యార్థిగా మారాలి. పై అధికార్లు తమ జానియర్ల ప్రమోషన్ లేక బదిలీలకు ముందు చేసే పరీక్షలో అతని పనితనానికి, సామర్థ్యానికి, సాధించిన ఫలితాలకి 80శాతం మార్కులిస్తూ ప్రవర్తనలు, మర్యాదలకు 20 శాతం మార్కులు కేటాయించడం అవసరం. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో "అధికారుల సంఘం" "మంత్రుల ఉపసంఘం" అను నెపంతో అసలు సమస్య పరిష్కారంలో తాత్సారాన్ని ప్రదర్శిస్తున్నది. కాలదోషంపట్టి, అభివృద్ధిని అడ్డుకునే భావాలకి దాసులైన రాజకీయ నాయకులే ఇలాంటి తాత్సారాల మంత్రం జపిస్తారు. చైతన్య వంతమైన పౌర సమాజం, ఐక్య ప్రజా ఉద్యమాలు మాత్రమే పాలకులలోని జడత్వం, అనిశ్చితి, నిష్క్రియాత్వాలను పారద్రోలగల్గుతాయి. ప్రజాస్వామ్యంలో చలనాన్ని పరిణతిని సమకూర్చగల్గుతాయి.

బ్రెజిల్ దేశంలో ప్రభుత్వోద్యోగుల నియామకంలోనే ఒక ముఖ్య నిబంధన ఉన్నది. ప్రతి ఉద్యోగికి ఇచ్చే జీతభత్యాలలో 40శాతం మాత్రమే నికరంగా ప్రతి నెలా అందించబడుతుంది. మిగతా 60 శాతం జీతం అతని లేక ఆమె పనితనం పైన సామర్థ్యంపైన ఇచ్చే నివేదికపై ఆధారపడి చెల్లించడం జరుగుతుంది. ఇది ఒక నిర్బంధమే ఐనా నిర్బంధం సత్ఫలితాలనిస్తుందని ఏలాంటి నిర్బధాలకు లోనుగాకుండా నిర్భయంగా విచ్చలవిడిగా లంచాలు పుచ్చుకుని పక్షపాత నిర్ణయాలు జేసే అధికారులకు మన దేశంలో కొదవ లేదు. రాజ్యాంగం, వివిధ చట్టాల తెరచాటున పెరిగిపోతున్న అవినీతి మొత్తం పరిపాలనకే అప్రతిష్టను మూటగట్టడం జాతి గౌరవానికి మాయని మచ్చగా తయారైంది. ఏదిఏమైనా బలవంతం ఐచ్ఛిక పరివర్తన స్థానాన్ని భర్తీ చేయజాలదు.

పై నుదహరించిన విధంగా ఉద్యోగస్థులలో తమ విద్యుక్త ధర్మాన్ని పాటిస్తూ దేశంలో సుపరిపాలనను సాధించే కృతనిశ్చయం కలగాలి. సేవాభావం అంకిత భావం జవాబు దారి తనం వీటికి సరైన సమాధానాలు, ఆరవ పే కమిషన్‌వారు పనితనం బాగున్నవారికి సాధారణ జీతానికి అదనంగా ప్రోత్సాహకాలను ఇవ్వాలని, అలాఐతేనే వారి శాఖ 70 శాతం పనితనాన్ని చూపకలిగి యుంటుందని ప్రతిపాదించగా ఏ రాష్ట్రం గూడా దీనికి తమ ఆమోదాన్ని తెలియజేయలేదు. భారతదేశ ఉద్యోగ బృందాలన్నిటి దేశ భక్తి, ఆత్మాభిమానంతో సమ్మిళితమైన బుద్ధిబలం అవసరం, చౌకబారు ప్రయో గాలిక్కడ పని చేయవు. ప్రధాన మంత్రిగారి సలహా ప్రకారం ప్రభుత్వాధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తోడ్పాటుతో పరిపాలనను మరింత ప్రజారంజకంగా మార్చడానికి వినూత్న

ఆలోచనల్ని అమలు పరచాలి. ఇందులో క్రింది ఉద్యోగులు మధ్య తరగతి ఉద్యోగులు చొరవ చేయడానికే జంకుచున్నారు. పై అధికారులు రాజకీయ నాయకుల ప్రతీకార చర్యలకు భయపడు చున్నారు. కాబట్టి సీనియర్ అధికారులు ఈ వినూత్న ప్రయోగాలు చేయాలని అభిప్రాయ పడుచున్నారు. ఇందులో భాగంగానే ఒక ఉద్యోగి కనీసం రెండు సంవత్సరాల వరకైనా స్థాన చలనం లేకుండా నిబంధనుండాలని కోరుచున్నారు. ఈ విషయంలో మహోన్నతన్యాయస్థానం సైనిక, గూఢచారి రంగానికి ఆదేశాలను గూడా ఇచ్చింది గాని కేంద్ర ప్రభుత్వం ఇంకా ఆలోచన స్థాయిలో నుండి కదలడం లేదు. పరిపాలనా సంస్కరణలపై ఉన్న నివేదికలన్ని నిరుపయోగంగా ఉంటూ పరిపాలన అవినీతి ఊబిలో దిగబడి పోవడం దేశాభివృద్ధికి తీరని హానికి కారణమవుచున్నది.

మన అధికారగణం అసమర్థతను తెలియజేసే మరోవాస్తవం వెలుగులోకి వచ్చింది. అమెరికా దేశంలో సగటున ఒక అధికారిజేసే పనిని మన దేశంలో అయిదుగురు అధికార్లు చేస్తున్నారు. ఫైళ్లు, కాగితాలు అనసరంగా తిరగడంమన నిబంధనల్లోఉన్న నిరర్థకమైన కారణాల ఫలితంగా జరుగుచున్నది. ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమున్న అధికారులు సమష్టిగా చర్చిస్తూ ఒక నిర్ణయానికి చేరే ఏర్పాట్లు అసలులేనే లేవు. ప్రతి నెలా రెండు నెలలకొకసారి సంబంధిత అధికార్లు క్రమంగా సమావేశమై నిర్ణయాలు జేయడం ఫలితంగా సగానికిసగం కాలం కలిసి వస్తుంది. సృష్టీ కరణతో పాటు సమయపాలన జరిగి విషయానికి న్యాయం జరుగుతుంది. లబ్ధిదారులు సంతృప్తి జెందుతారు. పాలనా సంస్కరణలు, వాటి ఆచరణ ఈనాటి సాంకేతిక యుగ నేపథ్యంలో ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు పేరు ప్రతిష్టలను సమకూర్చుతాయి.

# 13. పర్యావరణ పరిరక్షణ

ఇంధనాల వాడకం, అడవుల నాశనం వల్ల పర్యావరణం, దెబ్బతింటున్నది. పెరిగిన గ్రీన్ హౌస్ వాయవుల ఫలితంగా ఉత్పన్నమైన ' గ్లోబల్ వార్మింగ్ ' ఉష్ణోగ్రతల పెరుగుదల, కార్బన్ డై ఆక్సైడ్ పెరుగుదల, హిమనీ నదాల కదలిక మొదలగు వాటికి చెట్లు పెంపకం ఒక బలమైన పరిష్కారం. చెట్లు కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహిస్తాయి. చెట్ల కొమ్మల్లో, కాండంలో కర్బణాన్ని నిల్వ చేసుకుని మనకు వాతావరణ సమస్యల ఇబ్బందులను తొలగిస్తాయి. ప్రాణవాయువును వెలువరిస్తాయి. 50 వేల కిలోమీటర్లు ప్రయాణించిన కారు ఉత్పత్తి చేసే కార్బన్ డై ఆక్సైడ్‌ను ఒక ఎకరం చెట్లు ఉత్పత్తి చేస్తాయి.

వాతావరణంలో విషవాయువులైన నైట్రోజన్ ఆక్సైడ్, అమ్మోనియా, సల్ఫర్ డై ఆక్సైడ్, ఓజోన్‌లను చెట్లు గ్రహించి వాతావరణాన్ని శుద్ధి చేస్తాయి. చెట్ల ఆకులు, కొమ్మలు వాతావరణంలోని దుమ్ముని తమపై పేరుకుపోయేటట్లు ఒక ఫిల్టర్‌గా పనిచేస్తాయి. ఒక సంవత్సరంలో ఒక ఎకరం చెట్లు 18 మందికి కావలసిన ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తాయి. అంటే కోట్ల మందికి మనం ఎన్ని చెట్లు పెంచి రక్షించాలో అర్థం చేసుకోవాలి. చెట్ల ద్వారా సగానికి సగం ఉష్ణోగ్రతను తగ్గించవచ్చు. చెట్లు తన పరిసరాల్లో 10 సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగ్రతను తగ్గిస్తాయి.అప్పుడు ఎయిర్ కూలర్స్ అవసరమే ఉండదు. దీంతో ఎంతో కరెంటు ఆదా చేయవచ్చు. తద్వారా కరెంటు ఉత్పత్తి చేసే ప్లాంట్లు వెదజల్లు కార్బన్ వాయువును కూడా సగానికి సగం తగ్గించుకోవచ్చు. బొగ్గు వినియోగం తగ్గుతుంది. కరెంటు అవ సరం కూడా బాగా తగ్గిపోతుంది.

చెట్ల నీడవల్ల భూమి నుండి నీటి ఆవిరవటం తగ్గుతుంది. చెట్ల శ్వాసక్రియ వల్ల వాతావరణంలో నీటిశాతం పెరిగి చల్లదనం కూడా పెరుగుతుంది.చెట్ల పెంపకం వల్ల నీటి కాలుష్యం బాగా తగ్గుతుంది. చెట్ల వల్ల మట్టి ఇతర పదార్థాలు జల వనరుల్లో కలవవు. అవి కాలుష్యానికి గురికావు. కొండకోనల్లో చెట్లు భూమిని ఆదిమి పట్టుకొని భూసారాన్ని నిలుపుతాయి. చెట్లు సూర్యుని అతినీల లోహిత కిరణాలను గ్రహించి చర్మ కాన్సర్ రాకుండా కాపాడుతాయి. అందుకు స్కూళ్ళల్లో, కాలనీల్లో, ఆట స్థలాల్లో పార్కుల్లో చెట్లు పెంచటం ద్వారా పిల్లల ఆరోగ్యం కాపాడబడుతుంది. చెట్లు జీవకోటికి ఆహారాన్ని సమకూర్చుతాయి. రోజు రోజుకు చెట్లు తగ్గిపోతున్నాయి. నీరంతా సముద్రాలకు చేరుతుంది. సముద్రమట్టం పెరుగుతుంది. సముద్రాలు గ్రామాలను ముంచెత్తుతాయి. అందువల్ల సముద్ర తీర గ్రామాల్లోని ప్రజలు అక్కడినుండి ఖాళీ చేయాల్సి వస్తుంది. భూమి ఉప్పునీటిమయం అవుతుంది. పంటలు పండవు. ఇలా మానవాళికి ముప్పు పొంచి ఉన్నది.

**అవగాహనతోనే పర్యావరణ సమతుల్యతపై శ్రీ కూచిమంచి విధ్యాదరరావుగారిలా అంటున్నారు ...**

"పర్యావరణ సమతౌల్యం రక్షించబడాలంటే ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉండాలి. విచక్షణారహిత పారిశ్రామికీకరణ, అనాలోచితమైన వ్యవసాయ ఆధునికీకరణ వలన పెరుగుతున్న జనాభాకు, పర్యా వరణానికి, అభివృద్ధి పథకాలకు సంబంధం లేకుండా పోవడంతోపాటు పర్యావరణ దృక్పథం అలవరిచే

విద్యావిధానం లోపించింది. ఒకపక్క ప్రభుత్వ విధానాలు పర్యావరణంపట్ల దృష్టి సారించినట్లు కన్పడ్తున్నా మరోవైపు ప్రపంచదేశాల సమావేశాల్లో నోరువిప్పిన సందర్భాలులేవు. ఒక కర్మాగారాన్ని నెలకొల్పినా, వ్యవసాయకాలువ తవ్వించినా, నీటిపారుదల ప్రాజెక్టు సంకల్పించినా పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకోకతప్పదు.వ్యక్తి తన చుట్టూ ఉన్న పరిసరాలను తెలుసుకోవడం, వ్యక్తి తన అవసరాలకు మనుగడకు పరిసరాలను ఉపయోగించడం, పరిసరంలోని వనరులను వ్యక్తి ఉపయోగించు కోవడంలో తగు విచక్షణ చూపడం కోసం ప్రకృతి వనరులను హేతుబద్ధంగా ఉపయోగించుకోవడం వల్ల భవిష్యత్తులో చెడు పరిణామాలు ఎదురుకాకుండా జాగ్రత్తపడితే పర్యావరణ అవశ్యకతను గుర్తించి నట్లవుతుంది. భారీ ప్రాజెక్టులు, ప్యాక్టరీలు, ఖనిజాల త్రవ్వకం, అడవుల నరికివేత, అధిక వాహనాల వినియోగం పట్టణాల విస్తరణ మొదలైన అనేక అంశాల కారణంగా పర్యావరణ వైపరీత్యం ఏర్పడింది. ప్రకృతి సిద్ధంగా లభ్యమవుతున్న వనరుల్ని సరైనరీతిలో ఉపయోగించకపోవడంవల్లనే పర్యావరణ కాలుష్య సమస్య ఏర్పడుతోంది. నింగి, నేల,నిప్పు, నీరు, గాలి అనే పంచ భూతాల కలయిక ఈ ప్రకృతి. వీటిలో ఏది సరగాలేకున్నా జీవరాశి మనుగడ కష్టమవుతుంది."

"కాలుష్యం నివారణ కంటే నిరోధం ముఖ్యం. అందుకు పర్యావరణ విద్యను ఉద్యమరీతిలో చేపట్టాలి. విద్యాప్రణాళికలో పర్యావరణ విద్యను ప్రధాన పాఠ్యాంశంగా చేర్చాలి. పర్యావరణ విద్య ద్వారా ప్రజలలో చైతన్యం తెచ్చి పర్యావరణ పరిరక్షణ ప్రధాన కర్తవ్యమనే భావనను ఏర్పరచాలి. పచ్చదనం అంతరించడం వల్ల అనేక ప్రాంతాలలో ఉపరితల నేల కొట్టుకుపోయి రాతిపొరలు కనిపిస్తున్నాయి. పశుసంపద క్షీణించి భూసారం తగ్గి, సరైన భూపరిరక్షణ విధానం లేకపోవడంతో వ్యవసాయం నిష్ఫలమైపోతుంది.జీవన ప్రమాణాలు హెచ్చినా కొలది మానవ నిర్మితాల కలుషితాలు ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తున్నాయి. అడవులు నరకడం వల్ల మృతికాక్షయం, నిస్సార భూమి, ఎడారులు ఏర్పడ తాయి. పారిశ్రామిక రంగాల నుండి వెలువడుచున్న క్లోరోఫ్లోర్, కార్బన్ ఓజోన్ పొరను నాశనం చేస్తున్నాయి. సముద్రపు నీటిలో నూనెలు, ఇతర విషపూరిత రసాయనాలు కలియడంవల్ల జలచరాలు చనిపోతాయి. క్రిమి సంహారక మందుల విపరీతవాడకం వల్ల ఉత్పత్తి దారులు, వినియోగదారుల మీద ప్రభావం చూపుతుంది. గ్రామాల నుండి వెలువడే వ్యర్థ పదార్థాలు, పరిశ్రమలనుంచి వచ్చే విషపూరిత రసాయన పదార్థాలు నీటిలో కలిసి కాల్వలు, నదులు, తర్వాత సముద్రంలో కలిసి నీటిని కలుషితం చేస్తాయి. విపరీత ధ్వనికాలుష్యం వల్ల బుద్ధి చాంచల్యం, మనోవైకల్యం, మతిభ్రమనం, అధిక రక్తపోటు వంటి వ్యాధులకు దారితీస్తున్నది. పర్యావరణ వినాశనాన్ని తక్షణమే అరికట్టి పర్యా వరణాన్ని పరిరక్షాంచాలంటూ ప్రభుత్వ విధానాలలో మార్పులతోపాటు ప్రజా జీవన సరళిలో కూడా అమూలాగ్రమైన మార్పులు రావాలి."

"సహేతుకమైన భూవినియోగం జరగాలి. జీవావరణ సమతౌల్యాన్ని కాపాడాలి. అభివృద్ధి పథకాలు భూమి జీవనాధార శక్తిని పరిగణనలోకి తీసుకోవాలి. సక్రమ జల వినియోగానికి, భూగర్భజల వినియోగానికి సత్వరమే చట్టరూపంలో రక్షణ ఏర్పరచాలి. మన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దేశానికి సహజ వనరులవల్ల లాభం చేకూరేటట్లు చూడాలి. పాఠశాలల్లో బాల్యం నుంచే పర్యావరణ పట్ల సదవగాహన కల్పించాలి. బాలబాలికల్లో పర్యావరణ పరిరక్షణ, కాలుష్యంవల్ల జరిగే అనర్థాలపై

శాస్త్రీయ అవగాహన కల్పించాలి. పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు ఏటా జూన్ 5న ప్రపంచ వ్యాప్తంగా ఐక్య రాజ్యసమితి ప్రపంచపర్యావరణ దినోత్సవాన్ని పాటిస్తోంది. గాలి వేగాన్ని తగ్గించటానికి సర్వి, యూక్లిప్టస్ వంటి చెట్లను గట్లపై నాటాలి. వన్యప్రాణులను సంరక్షించాలి. తేనెటీగల పెంపకాన్ని తీవ్రతరం చేయాలి. నీటిలో సూక్ష్మజీవులను చంపే జలజీవులను పెంచాలి. మురుగునీటి పారిశు ధ్యానికి ఆక్సీకరణ మడుగులను ఉపయోగించాలి. నీటి పొదుపు కోసం, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లింగ్ పద్ధతి వంటి ఆధునాతన నీటిపారుదల పద్ధతులను ఉపయోగించాలి. దీనివల్ల భూగర్భజలాల మట్టం తగ్గకుండా ఉండి సముద్రపు నీటి ప్రవేశాన్ని నిరోధించి ఉప్పునీళ్ళుగా మారకుండా చేస్తుంది. శాస్త్రీయపద్ధతిలో వ్యవసాయ భూమిని సాగుచేసి, స్వాభావిక ఎరువులను విరివిగా వాడుతూ పంటల దిగుబడి అధికంగా ఉండేటట్లు కృషి చేయాలి.”

“పొగరాని పొయ్యి, బయోగ్యాస్ లాంటి ప్రత్యామ్నాయ విధానాల సౌకర్యం కల్పించుకోవాలి. ప్లాస్టిక్ కవర్లు పాలిథిన్ సంచులు ఉపయోగించిన తరువాత బయట పారవేయుట వలన ఆ పాలిథిన్ కవర్, సంచులలో గల రసాయనాలు నేలలోకి ప్రవేశించి నేలలోని సారమును హరిస్తుంది.”

‘ఉపాధ్యాయలు, విద్యార్థుల్లో పర్యావరణ మేల్కొలుపును, చైతన్యాన్ని అవగాహనను పెంపొందించ టంలో చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహించాలి. పర్యావరణ సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ పరిష్కారాలను వాటి అంతర్భాగాలను విద్యార్థులు తెలుసుకోవటానికి ఉపయోగపడే పాఠ్యప్రణాళిక సామాగ్రిని ఎన్నుకోగలగాలి. పర్యావరణ క్లబ్‌ల ద్వారా విద్యార్థులు స్వేచ్ఛగా తమ అభిరుచుల కనుగుణంగా కొన్ని పథకాలను చేపట్టి ఆచరణ ద్వారా అభ్యసనం అనే సూత్రాన్ని సాకారం చేసినట్లవుతుంది.”

## “వస్తుమయ విధానాలే పర్యావరణానికి చేటు” అంటూ శ్రీ యస్. మల్లారెడ్డిగారిలా విశ్లేషిస్తున్నారు...

“1973లో ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా జరుపుకుంటున్న పర్యావరణ దినోత్స వానికి 40 ఏళ్లు నిండాయి. అయినా.. పర్యావరణం పచ్చదనాన్ని సంతరించుకోవడంలేదు. పచ్చని చెట్టు కనుమరుగవుతున్నవి. ‘ పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు ’ అని పాలక ప్రభుత్వాలు అందమైన నినాదాలతో కార్యక్రమాలు చేపడుతున్నా..అంగుళం భూమి పచ్చదనంతో ప్రాణం పోసుకోవడం లేదు. పర్యావరణ సమతుల్యం దెబ్బతిని భూగోళం ప్రమాదం అంచున నిలుచున్నది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో సముద్ర మట్టాలు పెరిగి భూమిని మింగేస్తున్నవి. జీవ వైవిధ్యం నశించి పోతున్నది. దీంతో.. అందమైన ప్రకృతి విధ్వంసానికి చిహ్నంగా మోడుబారిపోతున్నది. ప్రాణి కోటికి ప్రాణాధారమైన పచ్చదనం కనిపించకుండా పోతున్నది. మట్టిదిబ్బలుగా, ఎడారిగామిగులుతున్నది.”

“ఈ నేపథ్యంలోనే..పర్యావరణానికి పెనుముప్పుగా మారిన పరిస్థితులేమిటి? ప్రకృతి పాలిట శాపంగా మారిన స్వార్థపూరిత శక్తులేమిటి? పర్యావరణానికి నారుపోసి నీరు పోస్తున్నదెవరు? దాన్ని నాశనం చేస్తున్నదేవరనేది చర్చించకుండా పర్యావరణ సదస్సులతో, అందమైన ఉపన్యాసాలతో ఒనగూడేది ఏమి ఉండదన్నది ఈ 40 ఏళ్ల అనుభవం చెబుతున్నది. ఐక్యరాజ్యసమితి మొదలు

అమెరికా దాకా,ఇండోనేషియా మొదలు ఇండియా దాకా ఎన్ని సభలు సమావేశాలు పెట్టినా పర్యావరణ శత్రువులను గుర్తించి నిరోధించకుండా పర్యావరణానికి అవగింజంత కూడా మేలు జరగదు."

"ప్రకృతి ఒడిలో జీవిస్తూ..ప్రకృతిలో భాగంగా ప్రకృతితో మమేకమై జీవించిన మనిషి ప్రకృతిని ఓడించాలని, జయించాలని చూడడంలోనే ప్రకృతికి విరుద్ధమైన, వినాశకరమైన పోకడ ఉన్నది. దీనికి పరాకాష్ఠగా లాభాపేక్షకోసం సాగిన మనిషి స్వార్థపూరిత విన్యాసాలన్నీ ప్రకృతిని చెరబట్టాయి. ప్రకృతి పాలిట చెదగా మారాయి. ప్రధానంగా పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడిదారి విధానం పర్యావరణాన్ని మింగేసింది. అభివృద్ధిపేరిట అవధులులేని ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతూ..హద్దులు లేని లాభాపేక్షతో సాగినదంతా విధ్వంసమే. ఈ విధ్వంసానికి పాల్పడినవారిలో మొదటి ముద్దాయి అభివృద్ధి చెందిన అమెరికా, యూరప్ సమాజాలైతే..నేటికీ ప్రకృతికి ప్రాణం పోస్తున్నది. ఆసియా, లాటిన్ అమెరికాలోని దేశాలే. ముఖ్యంగా ప్రపంచ జనాభాలో పదిశాతం కూడా లేని అమెరికా జనాభా ప్రపంచ సహజ వనరులలో 60 శాతానికిపైగా వాడుకుంటున్నది. మనదేశంలో వందమంది ఉపయోగిస్తున్న పేపర్(కాగితం)ను అమెరికాలో ఒక వ్యక్తే వాడుకుంటున్నాడు. అమెరికాలో సగటున రోజుకు ఉపయోగిస్తున్న పేపర్ కోసం భూగోళంపై ఉన్న వంద చదరపు కిలోమీటర్ల వైశాల్యంగల అడవి నాశనం అవుతున్నది. అమెరికాలో సగటున పదిమంది ఉపయోగిస్తున్న సహజ ఇంధనం (పెట్రోలు, డీజిల్ తదితరాలు) వెనుకబడ్డ దేశాల్లో వేయి మందికి సమానంగా ఉంటున్నది. చివరికి ప్రపంచవ్యాప్తంగా సగటున పదిమందికి సరిపోయే ఆహారాన్ని ఒక అమెరికాపౌరుడే తింటున్నాడు. ఇలా ప్రకృతి సహజ సంపదనంతా దోచుకుతింటూ, ప్రకృతిని నాశనం చేస్తున్న అభివృద్ధి చెందిన అమెరికా, యూరప్ సమాజాలు పర్యావరణం గురించి ఆసియా, ఇండియాలాంటి అభివృద్ధి చెందుతున్న సమాజాలు త్యాగం చేయాలని చెబుతున్నాయి. తమకు కావలసిన కనీస అవసరాలను తగ్గించుకుని ప్రకృతిని రక్షించాలని హితబోధ చేస్తున్నాయి."

మరోవైపు తమ గుత్తాధిపత్య ఆర్థిక విధానాలతో దేశ దేశాల్లోని సహజ వనరులను కొల్లగొట్టే చర్యలను ముమ్మరం చేస్తున్నాయి. దీనిలో భాగంగానే 1950 దశకంలోనే ఆఫ్రికాఖండాన్ని పీల్చి పిప్పి చేసిన బహుళజాతి కంపెనీలు ఆ ఖండంలోని దేశాలన్నింటిని ఎడారిగా మార్చాయి. ఆకలి చావులకు బలిచేశాయి. ఒకప్పుడు పైరు పచ్చలతో సస్యశ్యామలంగా ఉన్న వ్యవసాయక ఆఫ్రికా సమాజాలు నిలువ నీడలేకుండా అయి ఎడారిగా మారిపోయాయి. ఇలాంటి అంతులేని వనరుల దోపిడీ మూలంగానే ఇథియోపియా, సోమాలియా లాంటి దేశాలు ఆకలి చావులకు నెలవులుగా మారి స్మశానాలుగా మారాయి. నేటికీ ఆఫ్రికా దేశాలన్నింటిలోనూ అంతర్యుద్ధాలను, జాతి వైరాలను పెంచి పోషిస్తూ వనరుల దోపిడీకి పాల్పడున్న అమెరికా, యూరప్ దేశాలు పర్యావరణాన్ని గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉంటున్నది. ప్రకృతి అందాలకు, సహజ వనరులకు నెలవైన భారత దేశంపై కన్నేసిన బహుళజాతి కంపెనీలు 1990 దశకం నుంచి మిడతల దండులా దండెత్తి వచ్చాయి. నదీ నదాలనూ, అడవులను చెరబట్టాయి. ముఖ్యంగా మధ్య భారతంలోని అడవి తల్లి భూగర్భంలో దాగిఉన్న ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకు పోస్కో, జిందాల్, హిందూస్థాన్ లివర్ లాంటి 30కి పైగా బహుళజాతి కంపెనీలు తిష్టవేశాయి. బాక్సైట్ అల్యూమినియం, ఇనుము లాంటి విలువైన

ఖనిజసంపదను కొల్లగొడుతున్నాయి. లక్షలాది ఎకరాల అభయారణ్యాలను నాశనం చేస్తూ, మధ్య భారతంలోని కోట్లాది అదివాసులను నిర్వాసితులను చేస్తూ ఖనిజదోపిడీకి పాల్పడు తున్నాయి. తరతరాల చరిత్రలో.. ప్రకృతి ఒడిలో సేదదీరుతూ ప్రకృతిలో భాగంగా జీవిస్తున్న భారతీయ సమాజాన్ని వస్తుమయ సంస్కృతి విషకూపంలోకి దించి తమ దోపిడీ విధానాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నాయి. ప్రశ్నించిన మనిషిని నిర్మూళిస్తున్నాయి. పర్యావరణాన్నే కాదు, ప్రపంచ మానవాళిని నాశనం చేస్తున్నాయి.

"ధరిత్రి ప్రమాదపుటంచున నిలబడటానికి, గ్లోబల్ వార్మింగ్‌కు, ఎలోనినోలకు, సునామీలకు, ప్రకృతి విధ్వంసక వైపరీత్యాలకు అమెరికా, అభివృద్ధి చెందిన యూరప్ సమాజాలు, పెట్టుబడిదారుల విధ్వంసక విధానాలే ప్రధాన కారణం. ప్రపంచ మానవాళిని సమిధులను చేసి విలాసాల్లో మునిగి తేలుతున్న అమెరికా, యూరప్ సమాజాలే పర్యావరణానికి ప్రధాన శత్రువులు. కాబట్టి పర్యావరణ పరిరక్షణ అనేది అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక విధానాలను ఎదిరించడంతోనూ, వాటి దోపిడీ విధానాలను నిలువరించడంతోనూ ముడిపడి ఉన్నది. అలాగే ప్రకృతిలో భాగంగా ప్రకృతితో సహజీవనం చేసే తరతరాల ఆసియాటిక్ సమాజాల జీవన సంస్కృతులను కాపాడు కోవడంలోనూ, నిలబెట్టుకోవడంలోనూ ఉన్నది. అదే పర్యావరణ సమస్యకు పరిష్కారం. పర్యా వరణాన్ని సమస్యగా చేసే పరిస్థితులను విడనాడి, పర్యావరణంలో భాగంగా ఉండే జీవన విధానమే ధరిత్రికి జీవం..జవం."

పర్యావరణ పరిరక్షణ, అందుకవసరమైన శాస్త్రసాంకేతిక చర్యలు, వాటి నిర్వహణకవసరమైన ఆర్థిక వనరుల సమీకరణ ఇతర దేశాలలాగే మనదేశానికి గూడా గొప్ప భారంతో గూడిన అనివార్య బాధ్యతగాబోతున్నది. నిపుణుల అభిప్రాయాల ప్రకారం 2020 సంవత్సరానికి మన దేశం ఇంధన వినిమయంలో చైనా, అమెరికాల తర్వాత మూడవ పెద్ద దేశంగా ఎదగబోతుంది. జనాభా పెరుగుదల, పారిశ్రామికీకరణ ఈ పరిణామానికి మూల కారణం. దేశీయ ముడి సరుకుల ద్వారా ఉత్పత్తిఅయ్యే ఇంధనం పెరిగే అవసరానికి సరిపడే పరిస్థితి లేదు. ఇప్పటికి 10 శాతం క్రూడ్ అయిల్ దిగుమతి, 20 శాతం బొగ్గు దిగుమతి ప్రతి సంవత్సరం అదనంగా చేసుకోవలసి వస్తున్నది. దీని ఫలితంగా సహజంగానే వాతావరణ కాలుష్యం పర్యావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. విశ్వసించదగిన కొన్ని విశ్వవిద్యాలయాల పరిశోధనల ఫలితంగా ఇప్పటికే కలుషిత వాతావరణం బారినపడ్డ పట్టణాలుగల 132 దేశాలల్లో భారతదేశం 126వ స్థానంలోనున్నది. ఈ స్థానాన్ని త్వరత్వరగా తగ్గించాలంటే వాయు, తదితర కాలుష్యాల ఉత్పత్తులను తీవ్రంగా నిరోధించడమొక్కటే మార్గం. కాలుష్యరహిత ఇంధనాన్ని నిరంతరాయంగా అందచేస్తూ సూర్యరశ్మి ద్వారా పరిశుభ్రమైన ఇంధనాన్ని సాధించడం తదితర సాధనాల ద్వారా సాధించే ఇంధనాన్ని మిశ్రమ ప్రక్రియలద్వారా శుభ్రపరచడం గొప్ప సాంకేతిక కర్తవ్యం. పర్యావరణ పరిరక్షణ గురుతర ప్రాధాన్యతను పై వాస్తవం నొక్కి చెబుతున్నది. 2004లో సాటిలైట్ల ద్వారా తీసిన ఛాయచిత్రం ప్రకారం ఉత్తర భారతంలో గంగానది పరీవాహక ప్రాంత ఆకాశంలో ఒక దట్టమైన పొగలాంటి మేఘమాల అగుపించింది. ఈ దట్టమైన చిక్కటి గాలి నిక్షేపాలకు కారణం పశ్చిమ భారతంలో తగలబడే అడవుల నుండి లేచిన పొగ లేక పెద్ద పట్టణాల నుండి వెలువడిన కలుషితమైన గాలి, తెప్పలతో కొట్టుకొచ్చిన ఇసుక ధూళీ గూడా కావచ్చును.

ఇవన్నీ అంతకు పై బాగం నుండి పయనించే రుతు పవనాలను ఆకర్షించి అతివృష్టికి కారణంగావచ్చును. సహజ పర్యావరణ సమతుల్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేయవచ్చును గూడా. సూర్యరశ్మి, గాలి, నీరు, నిప్పు, నేల, ఖనిజం, భూగర్భజలం ఇవన్ని ప్రకృతి అందించిన పవిత్రమైన అమూల్యమైన ప్రసాదం. ప్రకృతి సమతుల్యం, పరస్పరాధారాలను గుర్తెరిగిన మానవుడు తన మనుగడను కొనసాగించుకునే విధంగా తెలివిగా వ్యవహరిస్తే మరింత ఉన్నత స్తాయి జీవితాన్ని గడపగల్గుతాడు. ఆ తెలివితెటలు లోపిస్తే తమ జీవిత మనుగడకే తీరని ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటాడు. జగత్తుకు పర్యావరణం ప్రాణప్రదం.

మన దేశంలోని పర్యావరణ సమస్యలు నిరంతరం పరిశీలిస్తూ ప్రామాణికం చేయడం దేశ జనాభా ఆయురారోగ్యానికి, సుఖసంపదలకి అత్యవసరం. పాలక ప్రభుత్వం, పౌర సమాజం, ప్రతి కుటుంబం చివరికి వ్యక్తిగతంగా ప్రతి స్త్రీ, పురుషుడు పాటించవలసిన నియమనిబంధనలు పర్యావరణ పరిరక్షణకి ఎంతగానో తోడ్పడుతాయి. గాలి, నీరు, మురికితో కూడిన పరిసరాల నుండి వెలువడే కాలుష్యం అసాధారణ రీతిలో మానవ జీవితాలకు ప్రమాదంగా పరిణమించిన పరిస్థితి 1995 నుండి 2011 వరకు చెప్పకోదగినట్లుగా మెరుగుపడడాన్ని ఐక్యరాజ్యసమితి పర్యావరణ పరిశోధకులు కొనియాడడం మన దేశ ప్రజలకు ఊరట కల్గించే శుభవార్త. ఐనా అభివృద్ధి చెందిన దేశాల స్థాయికి చేరాలంటే ఇంకా చాలా చేయవలసియేయున్నది. అభివృద్ధి కార్యక్రమాలే పర్యావరణ క్షీణతకు కారణమని కొందరు విద్యావేత్తలే అభిప్రాయపడగా అలా కానేకాదని శాస్త్రవేత్తలు పై అభిప్రాయాన్ని నిశితంగా విమర్శిస్తున్నారు. అలాగే జనాభా పెరుగుదలనే పర్యావరణ క్షీణతకు కారణమంటే అది కానే కాదనే వాదనలున్నవి. ప్రపంచంలో అనేక దేశాలు జనాభా సాంద్రతలో మనకు తీసిపోని విధంగానో ఇంకా అధికంగానోనున్నవి. అవి పర్యావరణ ప్రమాణాలల్లో మన కంటే అనేక రెట్లు బాగున్నాయనే వాదననుకాదనలేం. అందుకవసరమైన ప్రధాన పెట్టుబడి మన అలోచన. పర్యావరణ పరిరక్షణ గురించి పౌర సమాజంలో ఉండే చైతన్యం, అంకితభావం మాత్రమే. క్షీణించే పర్యావరణ కారణంగా ఉదయించే సమస్యలనేకం. అడవి, వ్యవసాయ భూములు నిస్సారంగా వుండటం, నీరు, ధాతువులు అడవి సంపద, ఇసుక, కొండలు లాంటి వనరుల కొరత ఏర్పడడం ప్రధానమైనవి. ప్రజారోగ్యం, జీవవైవిధ్యం వాతావరణంలో పునరుద్ధరణ శక్తి లాంటి మౌలికాంశాలు కొరవడడం కారణంగా ఉపాధి ఆహార భద్రతల సమస్యల కారణంగా పేదరికం పెరగడం గొప్ప సామాజిక సమస్య అవుతుంది. మనదేశంలో ఇంకా కర్ర, పొరక, పేడలాంటి వస్తువులే ఇంధనంగా అధికంగా వినియోగించడం, వాయు కాలుష్యానికి మూలకారణం. చెత్తా చెదారాన్ని తొలగించడం, మురికి కాలువలనను శుభ్రపరచడం, వర్షపు నీరు, వరద నీరును వెనువెంటనే తొలగించే డ్రైనేజి ఏర్పాట్లు చాలా వరకు లేకపోవడం, వ్యర్థ పదార్థాలను తొలగించే అలవాట్లు కాని వాటి ఏర్పాట్లు గాని లేకపోవడం నీటి కాలుష్యానికి పెద్ద కారణం. వీటికి తోడు చిన్న పరిశ్రమలు, భారీ పరిశ్రమల నుండి వెలువడే ధూళి, పొగలు, ద్రవాలు అన్ని రకాల కాలుష్యాన్ని పెంచడం గత రెండు దశాబ్దాలుగా వ్యాపిస్తున్న విష సంస్కృతి. వీటిని నియంత్రించే యంత్రాంగం అచేతనమయిపోవడం దౌర్భాగ్యం. ప్రజారోగ్యం, పశుపక్షాదుల ఆరోగ్య రక్షణకై వేదకాలం నుండే ఋషులు, మునులు చేసిన తీవ్రమైన హెచ్చరికలు ఈనాటికి మన దేశస్థులకి మార్గదర్శకాలు. క్రీస్తుకు పూర్వం అయిదు వందల సంవత్సరాల నాటి

యాజ్ఞ్య వల్క్యస్మృతిలో చెట్లను నరకడం పెద్దనేరంగా భావించి ఆపని చేసినవారిని శిక్షించాలని ప్రకటించింది. మౌర్యులకాలంలో రచించిన కౌటిల్యుని అర్ధశాస్త్రంలో అడవులను నరకడం మహా నేరంగా ప్రవచించారు. అశోకుని కాలంలో ఇంకా ముందడుగు వేస్తూ అశోకుని ప్రవచనాలుగా వెలసిన స్థంభాలపై అడవులు జీవరాసుల రక్షణ జీవవైవిద్య పరిరక్షణకు గల ప్రాముఖ్యతను సవివరంగా ప్రకటించడం జరిగింది. వాటిలో ఆయా జంతుజాలం, జీవజాలం, వృక్షజాలం పేర్లు ఉటంకించడం గూడా జరిగింది. ఇంతటి సాంస్కృతిక సంపదకు వారసులమైన మన దేశంలో ఇంకా జీవరాశి ప్రాణాంతకమైన కాలుష్యాల వలయంలో చిక్కి విలవిలలాడడం మహా ఘోరం. సంబంధిత అధికార, అనధికారగణం తమ తమ బాధ్యతల నిర్వహణలో దేశభక్తి, మానవసేవా దృక్పథాన్ని అవలంభించడం అత్యవసరం.

బ్రిటిష్ పాలనలో పర్యావరణ పరిరక్షణకై చాలా చట్టాలు చేశారు. స్వాతంత్ర్యానంతరం గూడా రాజ్యాంగంతో పాటు కొన్ని చట్టాలు నిర్ధిష్టంగా చేయబడినవి. కాని వాటి ఆచరణ ఆశించిన దానిలో పదోశాతం గూడా లేకపోవడం దురదృష్టకరం. ప్రజాబాహుళ్యంలో పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతపై తగు చైతన్యం లేకపోవడం ఆందోళనకరం. పౌర సమాజం ఈ దిశలో బాధ్యతగా ఆలోచించడమే మార్గం. 1985లో భారత ప్రభుత్వం పర్యావరణ మంత్రిత్వశాఖను నెలకొల్పింది. అందుకు తగు యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. 1991 నాటి సంస్కరణల ఆచరణ తర్వాత ప్రతి అయిదు సంవత్సరాల అంచనాల్లో వాయుకాలుష్యం తగ్గినట్లు తెలియడం ఆత్మ విశ్వాసాన్ని కలిగిస్తున్నది. 2010 నాటి అంచనా ప్రకారంగా వాయుకాలుష్యం తగ్గడంతో పాటు అడవుల పెంపకం గూడా గణనీయంగా పెరిగినట్లుతెలుస్తున్నది. పది సంవత్సరాల అనతికాలంలో 40 లక్షల హెక్టార్లపైగా కొత్త అడవులను పెంచుచున్నట్లు, అంతకుముందున్న లెక్కలో 7 శాతం పెరిగినట్లు తెలుస్తున్నది.

లక్ష్యశుద్ధి, చిత్తశుద్ధి ఉంటే పర్యావరణ పరిరక్షణ సుసాధ్యమని రుజువైపోతున్నది. జనాభా పెరుగుట విరుగుట కొరకేనని ఒక వెనకటి అర్థ శాస్త్రవేత్తగారి ఉవాచ. అధిక జనాభా కారణంగానే ప్రకృతి వనరులు తరిగిపోతున్నాయని అన్ని రకాల కాలుష్యాలు వ్యాపిస్తున్నాయని, నిరుద్యోగానికి, ఆకలికి, చివరకి యుద్ధాలకి ప్రధానకారణం అధిక జానాభాయేనని మాల్థూష్ గారి సిద్ధాంతం. గత శతాబ్ద ఆరంభం నాటికే వారి సిద్ధాంతంలో పసలేదని అర్థశాస్త్రవేత్తలు, మానవ శాస్త్రవేత్తలు రుజువు జేసియున్నాడు. ఐనా ఇంకా కొందరిలో ఈ మూఢనమ్మకం తొలగడం లేదు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన వ్యాప్తితో ఈ మూర్ఖత్వం తొలగిపోకపోదు. ప్రకృతిని రక్షిస్తూ మానవ మనుగడను రక్షించుకునే మార్గాలెన్నో వెలుగులోకి వస్తున్నవి. అవన్ని ప్రకృతిలో దాగియున్న రహస్యాలే. శాస్త్రజ్ఞుల ప్రతిభా పాటవాల పుణ్యమానంటూ మానవులకి అవన్ని అందుబాటులోకి వస్తున్నవి. జన సాంద్రతను సామాజిక దృక్పథంతో తగ్గించడం జరిగినా, దేశ సమస్యలన్నిటికి అదే కారణమని వాదించడం అర్థరహితం ముఖ్యంగా భారతదేశంలో రేపటి దశాబ్ధం నాటికి 52 కోట్ల జనాభాగా సగటు 25 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులుండబోతున్నారనే అంచనా ఆనందదాయకం.వీరంతా శాస్త్ర, సాంకేతిక విద్యావంతులైతే దేశంలోని దారిద్ర్యాన్ని పారద్రోలగల్గుతారు. శాశ్వతాభివృద్ధి పథంలో సగర్వంగా ముమ్ముందుకు నడవగల్గుతారు. కాబట్టి 'మాల్థూష్' గారి సిద్ధాంతం కాలగర్భంలో కలిసిపోవడం

ఖాయం. అదే విధంగా అభివృద్ధి ముసుగులో విపరీతమైన స్వార్ధలాలసతో పెచ్చరిల్లుచున్న ప్రకృతి వ్యతిరేక కిరాతక పనులను కొనసాగించడం క్షంతవ్యంగాని నేరం. పుడమితల్లి హరితశోభగల జీవరాశిని తన ఒడిలో శాశ్వతంగా రక్షించుకోవడం ప్రకృతి ధర్మం. దాన్ని గౌరవించి సహకరించడం మానవ ధర్మం.

ఇటీవల న్యాయస్థానాలు, భారత మహోన్నత న్యాయస్థానంతో సహ పర్యావరణ పరిరక్షణపై తమ దృష్టిని సారించుచున్న అనుభవాలు మంచి ప్రోత్సాహకాలు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ఈ రంగం సమస్యలపై హెచ్చరించడం ఆశాజనకం. ప్రతి దేశం తన భూభాగంలో కనీసం 33శాతం అడవిని పెంచి తీరాలని అంతర్జాతీయ తీర్మానాలు ఘోషించగా భారతదేశం కేవలం 20శాతం అడివి కలిగియుండడం ఇక్కడి పరిపాలన దోషం. భారత ప్రభుత్వం 2020 నాటికి 26.7 బిలియన్ అమెరికాడాలర్ల వ్యయంతో అడవులను కాపాడుతూ కొత్తగా పెంచుతూ 33 శాతానికి చేరుకునే ప్రణాళికను ప్రకటించడం సంతోషకరం. అదే నిజమైతే దేశాభివృద్ధికి రాచబాట వేసినట్లవుతుంది.

మేరుపర్వత పంక్తులు గల ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యం నేర్పుచున్న గుణపాఠాల గురించి చర్చించడం సందర్భోచితం. టూరిస్టు పరిశ్రమతో పాటు ఆహార పదార్థాల తయారీ పరిశ్రమలు రాష్ట్రానికి మంచి ఆదాయాన్ని సంపాదించిపెట్టగా జలవిద్యుత్ పరిశ్రమలు మాత్రం ప్రకృతి ఆగ్రహనికి కారణభూతమైనట్లు శాస్త్రజ్ఞుల విశ్లేషణలు తెలియజేస్తున్నవి. పర్యావరణ శాస్త్రవేత్తల్లో అత్యధికులు ఈ ఘోర కలికి కారణం ప్రకృతితో సమానంగా మానవ దోషమనేది నిర్ధారిస్తున్నారు. అందుకు గల కారణాలను ఎవరి వాదనకనుకూలంగా వారు చూపెడుచున్నారు. ఉత్తరాఖండ్ యు.పి. రాష్ట్రం నుండి విడిపోయిన తర్వాత ఒక దశాబ్దంలోనే పారిశ్రామిక సేవా రంగాలలో సాధించిన విజయాలన్నిటిని అంకెలతో సహా రుజువుజేస్తున్నారు.

మధ్యతరహా, చిన్న పరిశ్రమలు 2000 సంవత్సరంలో ఉత్తరాఖండ్‌లో 4163 మాత్రమే నుంటే ఈనాడు వాటి సంఖ్య గణనీయంగా పెరిగి 39160కి చేరింది. వీటిపై పెట్టుబడి వెచ్చింపు 700 కోట్ల రూపాయలనుండి 6776కి పెరిగింది. పెద్ద పరిశ్రమల సంఖ్య కేవలం 41 ఉండగా అవి ఈనాటికి 215కి చేరినవి. వాటిపై వెచ్చించిన పెట్టుబడి 5753 కోట్ల రూపాయల నుండి 26955 కోట్ల రూపాయలకి చేరింది. ఉపాధి, ఉద్యోగావకాశాలు 67600 నుండి పెరిగి 254000కు చేరడం మంచి అభివృద్ధికి తార్కాణం. రాష్ట్ర సగటు వార్షికోత్పత్తిలో పరిశ్రమలవాటా 2005లో 28 శాతముండగా 2012 నాటికి అది 37 శాతానికి పెరిగింది. అన్ని రంగాలు తరువాత వచ్చిన వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయినవి. టూరిస్టు పరిశ్రమనే 12000 కోట్ల రూపాయల ఆస్తిని కోల్పో యిందని అంచనా. షుమారు 10 వేలమంది యాత్రికులు, స్థానికులు తమ ప్రాణాలనుకోల్పోగా అనేకుల జాడలేదు. తీవ్రమైన గాయాలపాలైన వారువివిధ ఆరోగ్య కేంద్రాలల్లో చికిత్స పొందుచున్నారు.

ఇంతటి నష్టానికి గల కారణంపై తీవ్రమైన తర్జనభర్జనలు జరుగుచున్నవి. ఇది పూర్తిగా దైవి కమని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ బహుగుణగారు అభిప్రాయపడగా మానవ దోషం గూడా పెద్దగానున్నదని అసలు ఈ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని చేయాలనుకోవడమే పొరపాటని కొందరు శాస్త్రజ్ఞుల నిశ్చితాభిప్రాయం. టూరిజం, ఆహార పదార్ధాల తయారీ పరిశ్రమల వలన నష్టమేమిలేదని

వాటిని ఇంకా అధికంగా ప్రోత్సహించవలసిందేకాని జలవిద్యుత్ పరిశ్రమల నిర్మాణమే ఇక్కడి నైసర్గిక పరిస్థితికి ఏమ్రాతం గిట్టదని వారి వాదన. జల విద్యుత్తుకవసరమైన పెద్ద పెద్ద రిజర్వాయర్లను తటాకాలను నిర్మించడం అదుకు కొండరాళ్లను పెకిలించడం, సహజ నీటి ప్రవాహాలను దారి మళ్ళించడం, అడవులను నరకడం, ఆకాశ హర్మ్యాలను పోలిన కట్టడాలను నిర్మించడం మూలంగా వరదల ఉధృతి పెరగడంతోపాటు నేలను అసహజంగా కదిలించడం బండరాళ్ళ స్థాన చలనం జరిగి ప్రకృతి సిద్ధమైన నిర్మాణాలను కదలించిన పని విపరీతంగా జరిగింది. ఇది ప్రకృతితో ఢీకొన్నతంగా జరిగి పోతున్నది. కాబట్టి పాకరిశ్రామికాభివృద్ధికి ఇది అనువైన రాష్ట్రం కాదని జల విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం అంతకంటే హానికరమని వారి హెచ్చరిక. కేంద్ర ప్రభుత్వం, అత్యున్నత శాస్త్ర సాంకేతిక నిపుణల సలహాలను పాటిస్తూ అక్కడ పరిశ్రమల నిర్మాణానికి ఆలోచించి అనుమతులనివ్వడం ఉచితం. అటవీ సంపద, ఆహార పదార్ధాల తయారి పరిశ్రమ తదితర చిన్న కుటీర పరిశ్రమల ద్వారా ఉపాధి ఉద్యోగ అవకాశాలను పెంచుకోవడంతోపాటు రాష్ట్ర ఆదాయాన్ని గూడా ఇతోధికం చేయగల్గుతారు. పుణ్యక్షేత్రాలైన బద్రినాద్, కేదారనాథ్, తదితర దేవాలయాలకు వచ్చే యాత్రికులకు తగు సౌకర్యాలను కల్పిస్తూనే యాత్రికులుగూడా అసహజమైన అనవసర చర్యలకు పాల్పడకుండా జాగ్రత్తపడడం అవసరం. మనం ప్రకృతిని రక్షిస్తే ప్రకృతి మనల్ని రక్షిస్తుంది.

ఉత్తరాఖండ్‌లో జరిగిన ఘోరకలి మానవ కల్పితమని వాదిస్తూ లోతుగా చర్చించిన “ఈనాడు” పత్రిక తమ సంపాదకీయంలో ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని గూడా విశ్లేషిస్తూ ఈ క్రింది విధంగా హెచ్చరిక చేసింది. “ విశ్వ వ్యాప్త గణాంకాల ప్రాతిపదికన వన పరిరక్షణలో భారత్ తీసికట్టు. ప్రపంచ భాగంలో అటవీ విస్తీర్ణం 30.3 శాతమని లెక్కలు తేలుతుండగా ఇండియాలో అది 23 శాతంలోపు. దేశీయంగా పర్యావరణ సమతూకానికి మూడోవంతు అరణ్యం పెంపకం అవసరమని 1952,1988 జాతీయ అటవీ విధాన తీర్మానాలు నిర్దేశిస్తున్నాయి. వాస్తవంలో అటవీ వృక్ష ఛాయ అంతకు 10 శాతం కన్న తక్కువ భౌగోళిక విస్తీర్ణానికే పరిమితమైనట్లు 2011 నాటి అధ్యయన నివేదిక నిగ్గుతేల్చింది. దేశ వ్యాప్తంగా 2009–11 మధ్య రెండేండ్లలోనే 367 చదరపు కిలోమీటర్ల పరిధిలో అడవులు నాశనమయ్యాయి. ఇప్పటికి రోజూ సగటున 333 ఎకరాల మేర దేశంలో అటవీ భూమి అదృశ్యమవుతున్నట్లు కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ఇటీవలే వెల్లడించింది. అందులో సర్కారీ ప్రమేయమెంతో అధికార దస్త్రాలే వెల్లడిస్తున్నాయి. గడచిన దశాబ్దిలో మూడు లక్షల హెక్టార్లమేర అడవుల్ని అభివృద్ధి ప్రాజెక్టుల కోసం కేటాయించారు. అందులో ఇంచుమించు సగం గనుల తవ్వకాల నిమిత్తమే. చిన్నపాటి గుబురు పొదలనుండి దట్టమైన కీకారుణ్యాలదాకా, అన్నిటిని ఒకే గాటినగట్టి అడవిగా నిర్వహించిన పర్యావరణ శాఖ ఔదార్యం అటవీ భూములకు ఎసరు బెడుతుంది. వివిధ ప్రాజెక్టులు పరిశ్రమలకోసం దట్టమైన అడవులను బదలాయిస్తున్నా కాగితాలపై కాకి లెక్కలు వాస్తవ నష్ట తీవ్రతను కప్పిపుచ్చుతున్నాయి. ప్రకృతి సమతూకాన్ని కాపాడేందుకంటూ అటవీ పరిరక్షణచట్టంలో పొందుపరచిన నిబంధనల విధులు అమలులో నిలువునా నీరు కారుతున్నాయి. సక్సేనా – మాధవ్‌గాడ్గిల్ గారల నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీలు నిపుణుల అధ్యయనం తర్వాత వాటిని క్రోడికరించిన తర్వాత తేలింది కఠోర యదార్థమని దాన్ని ఏ మాత్రం పట్టించుకోని పర్యావరణ మంత్రిత్వశాఖలోని అటవీ సలహాసంఘం 8 రాష్ట్రాలతో ఏడున్నర లక్షలకు పైగా వృక్షాల నరికివేతకు

ఈ మధ్య పచ్చ జెండా ఊపింది. అందులో పెద్ద వాటా రాజస్థాన్, మహారాష్ట్రలది ఈ చేదుఅనుభవాలను లక్ష్యపెట్టకుండా తర తమ తేడాలతో వివిధ రాష్ట్రాలల్లో వన విధ్వంసం కొనసాగుతూనే ఉందనడానికి దృష్టాంతమిది. అటవీ హక్కు చట్టం సంబంధిత ఇతర చట్టాలకు లోబడే ఏ ప్రాజెక్టుకైనా అనుమతు లుంటాయన్న మంత్రుల ప్రకటనలు వాస్తవిక కార్యాచరణలో చెల్లని కాసులేనని పదే పదే రుజువవుచున్నది.”

“ పర్యవసానాలు పట్టించుకోకుండా అడవులు నాశనం చేసుకుంటూ పోతే భూ మండలం మీద మనిషి బ్రతుకే దుర్భరమవుతుంది. చెట్ల సహజ రక్షణ కోల్పోయిన చోట్ల భూసారం క్షీణించి, జలాశయాలు మేటలువేసి జనజీవనమే మోడువారిపోతుంది. ఇథియోపియాలో భయానక క్షామం విచక్షణా రహితంగా వృక్షాలను గొడ్డలి వేటుకు బలిచేసిన దుష్పరిణామమే! కొండ ప్రాంతాల్లో ఉన్నత నదీ ప్రవహక సంగమ స్థలాల్లో అటవీ విధ్వంసం పర్యావరణానికి ఎంతటి విఘాతం వాటిల్ల జేయగలదో ఉత్తరాఖండ్ విలయం తెలియచెప్పింది. అరుణాచల్ ప్రదేశ్ (61), మణిపూర్ (78) సిక్కిం (82) చత్తీస్ఘర్ (44) ఒడిషా (37)లతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో “ అధికారికంగా”(22) శాతానికి పడిపోయిన అటవీ విస్తీర్ణం ఇక్కడా పెనుముప్పు పొంచిఉందని చాటుతోంది. నిజానికి దట్టమైన అడవుల విస్తీర్ణం 10 శాతమేననడం భయాందోళనలను కల్పిస్తోంది. విశాఖ, అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అడవులు వేగంగా అంతరిస్తున్నాయి. ఖమ్మం నుండి శ్రీకాకుళం దాకా ఏజెన్సీ ప్రాంతాలలో కలప దొంగల విజృంభణకు పట్టపగ్గాలు లేవు. తీరప్రాంతానికి రక్షణ కవచంగా భాసిల్లే మన అడవుల్ని అడ్డంగా నరికేస్తూ చేపల చెరువులుగా మార్చేస్తున్నారు. వన సంరక్షణ సమితులు నామ మాత్రమై రిజర్వు ఫారెస్టు ప్రాంతాలూ కొల్లబోతున్నాయి. కొన్ని చోట్ల అటవీ భూముల్ని దర్జాగా కబ్జా చేసి మామిడితోటలు వేస్తున్న ప్రహసనాలు జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో ప్లాట్లుచేసి విక్రయిస్తున్న బాగోతాలు నిశ్చేష్టపరిచేవే. శేషాచలం పాలకొండలు అంకమల అడవుల్లో ఎర్రచందనం స్మగ్లర్ల దోపిడీకాండ రాష్ట్రంలో అటవీ విధ్యంసానికి మచ్చుతునక. ఎక్కిన చెట్టు కొమ్మనునరుక్కున్న చందంగా బ్రతకుల్ని భవిష్యత్తును కూలదోసుకునే మూర్ఖత్వమిది. మొక్కుబడిగా ఏడాదికోమారు “ అటవీ దినోత్సవం” నిర్వహించుకునే కన్నా పర్యావరణాన్ని ఎలా పరిరక్షించుకోవాలో రాజస్థాన్‌లోని పిప్లాంత్రి గ్రామ పంచాయితీ యావత్ దేశానికే పాఠాలు నేర్పుతుంది. అక్కడ అమ్మాయి పుట్టినప్పుడు 111 మొక్కలు కుటుంబ సభ్యులెవరైనా చనిపోతే 11 మొక్కలు నాటే సంప్రదాయం ఆరేళ్ళలో రెండున్నర లక్షల చెట్లను బతికించింది. ఆమారు మూల పల్లెనినదించే స్ఫూర్తి మంత్రం “ ప్రకృతిని మనం కాపాడితే అది మనల్ని రక్షిస్తుంది ”. ప్రభుత్వాలకు విధాన నిర్ణేతలకు, ఉత్తరాఖండ్ ఒక ప్రమాద ఘంటిక, పిప్లాంత్రి ఒక మేలుకొలుపు.

పర్యావరణం దాని పరిరక్షణ మానవ మనుగడకెంత ప్రాణప్రదమో స్థూలంగానైనా విద్యా వంతుల దృష్టిని ఆకర్షిస్తున్నది. ప్రకృతి వైపరీత్యాలు వాటి పర్యవసానాల గురించి ప్రజలందరికి బాగా తెలుసు. వాటి నుండి ఆత్మరక్షణ చర్యలకై ఆరాటపడుతూ ఉన్నారు. కాబట్టి పర్యావరణ పరి రక్షణ సామాజిక సమస్యగా, ఆర్థిక సమస్యగా, ఆ తర్వాత రాజకీయ న్యాయశాస్త్ర సమస్యగా క్రమంగా ఎదిగిపోయింది. యుగయుగాలుగా మానవ సమాజాలు ప్రకృతి గురించి జ్ఞాన విజ్ఞాన సంపదను

ఆహ్వానిస్తూ పోషిస్తూ రానున్న తరాలకందచేయడాన్ని గమనిస్తున్నాం. పర్యావరణ పరిరక్షణ పరిజ్ఞానం సామాజిక, ఆర్థికశాస్త్ర పరిజ్ఞానంతో ఎంతగా సమన్వయం పొందవలసిన అవసరమున్నదో అంత సమన్వయం పొందడంలేదు. భూ ఉష్ణోగ్రత పెరుగుదల దాని వలన వాటిల్లే నష్టాల గురించి తెలుసుకున్నంతగా భూ ఉష్ణోగ్రతను తగ్గించే ఉపాయాలగురించి తెలియచెప్పడం లేదు. అందు కవసరమైన సామాజిక బాధ్యత, ఆర్థిక బరువు బాధ్యతలు రాజకీయ కర్తవ్యాల గురించి సమగ్రంగా సమష్టిగా ఆలోచించడం కొరవడింది. సామాజిక శాస్త్రవేత్తలు ప్రకృతి శాస్త్రవేత్తలకు చేరువగా ఉమ్మడి సమస్యల ఎంపిక చేస్తూ కర్తవ్య నిర్ధారణ జరగడం ఈనాటి వైజ్ఞానికావసరం.

వాయుకాలుష్యం, నీటి కాలుష్యం, శబ్ధకాలుష్యం గురించి పౌర సమాజానికి కొంతవరకైనా తెలిసినా ఈ కాలుష్యాల నివారణ చర్యల గురించి లోతుగా తెలుసుకుంటూ, స్థానిక స్వపరిపాలన, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలపై తగు మోతాదులో ఒత్తిడిని తెచ్చే ఉద్యమ చైతన్యం ఇంకా లోపించియున్నది. దీన్ని ఒక సామాజిక రాజకీయ కర్తవ్యంగా సంబంధిత సంస్థలన్ని నిర్వహించడం మానవతాకర్తవ్యం. అలాగే అతివృష్టి, అనావృష్టి, వరదలు, తుఫాన్లకు చివరకు సునామిలాంటి ప్రళయాల వెనక భూ ఉష్ణోగ్రత దాగియున్న సత్యాన్ని ప్రజాబాహుళ్యం దృష్టికి రావడం అవసరం. వచ్చే 30 సంవత్సరాలలో భూ ఉష్ణోగ్రత (2) రెండు డిగ్రీలకు పెరిగి అనేక అనర్థాలకు దారితీస్తూ ప్రకృతి సమతుల్యాన్ని చెదరగొట్టగల్గుతుందంటున్నారు. సన్నిహిత భవిష్యత్తులోనే భూ మండలంపై జీవరాశి నామ రూపాలు లేకుండా పోయే ప్రమాదముందని శాస్త్రజ్ఞులు ఘంటాపథంగా చెప్పినప్పటికి (కార్బన్ డై ఆక్సైడ్) సి.ఒ.2 లాంటి విషవాయువులను తగ్గించే ప్రయత్నాలన్ని విఫలంగావడం మన నాగరికత లోని పెద్ద లోపం. ఐక్యరాజ్య సమితి మొదలుకొని గ్రామ పంచాయితి వరకు పర్యావరణ పరిరక్షణ కర్తవ్య నిర్వహణను తమ ప్రథమ బాధ్యతగా భావిస్తూ తగు వనరులను ఉదారంగా కేటాయిస్తూ అన్ని రకాల నివారోణోపాయాలను యుద్ధ ప్రాతిపదికపై చేపట్టవలసియున్నది. అందుకవసరమైన చైతన్యయుత ప్రయత్నాలకుపక్రమించవలసియున్నది.

మరికొంత వివరంగా తెలుసుకోవాలంటే ప్రపంచబ్యాంకులోని నిపుణులు సమర్పించిన నివేదిక ఆసియా దేశాలకు సంభవించే భయానక దృశ్యం కంటికి కట్టినట్లుగాఉంటుంది. వచ్చే రెండు, మూడు దశాబ్దాలలో (గ్లోబల్ వార్మింగ్) భూతాపోన్నతి వలన దక్షిణాసియాలో ప్రత్యేకించి భారత్‌లోని చాలా ప్రాంతాలలో విపరీతమైన కరువు పరిస్థితులేర్పడే ప్రమాదం ఉందని ఈ నివేదిక హెచ్చరించింది. తీవ్రమైన ఆహారకొరత ఏర్పడే అవకాశముందని అంచనా వేసింది. వచ్చే రెండు మూడు దశాబ్దాలకాలంలో సగటు ఉష్ణోగ్రత రెండు డిగ్రీల వరకు పెరిగితే రుతుపవనాలను అంచనా వేయడం కష్టమని తెలియచేసింది. అతివృష్టి, అనావృష్టి సహజమై త్రాగడానికి నీటి కొరత ఏర్పడవచ్చని తెలియచేసింది. తీరప్రాంత పట్టణాలు, గ్రామాలు వరదలతాకిడికి గురై తీవ్ర నష్టాలు పొందవచ్చునని తెలిపింది. భూ ఉష్ణోగ్రత ఇలాగే పెరిగితే 40 సంవత్సరాలనాటికి పంటల దిగుబడి పూర్తిగా క్షీణించే ప్రమాదముందన్నది. ఆకలి, అనారోగ్యాల వాతబడి 6–7 కోట్ల ప్రజలు తమ ప్రాణాలను కోల్పోవచ్చుననే భయాన్ని విశదీకరించింది. ఆ తర్వాత మరో దశాబ్దకాలానికి 2.5 డిగ్రీల ఉష్ణోగ్రత కారణంగా దేశంలోని సజీవ నదులన్ని ఎండి ఎడారులుగా మారిపోయే ప్రమాదం పొంచి కూర్చున్నట్లు తెలిపింది.

సంబంధిత శాస్త్రవేత్తలు ఈ నివేదికను బాధ్యతగా విశ్లేశించడం జరిగింది. అందులోని హెచ్చరికలన్నిటిని స్థూలంగా ఆమోదించడంగూడా జరిగింది. భూతాపోన్నతి (గ్లోబల్ వార్మింగ్)ని రెండు డిగ్రీలకుమించి పెరగకుండా నియంత్రించగలిగితే తిరిగి మానవుడే ప్రకృతిని జయించినవాడవుతాడని అభిప్రాయ పడ్డారు. భూతాపోన్నతిని నియంత్రించాలంటే ప్రపంచ దేశాలన్ని ఎవరివంతు వారు ఈ నియంత్రణా చర్యలన్నిటిని చేపట్టి తీరాలి. ప్రపంచాన్ని రక్షించడానికే ప్రపంచీకరణను సాధనంగా మలుచుకోవాలి. మనస్సుంటే మార్గముంటుంది ఈ విషయంలో ఆలస్యం అమృతం విషం. కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ సమస్యపై మన దేశంలోని వివిధ సంస్థలతోపాటు ప్రపంచబ్యాంకు వారు తాజాగా వెలువరించిన వాస్తవాలు మనకు కనువిప్పుగానుంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకాన్ని ఎండకడుతూ చైతన్యవంత పౌర సమాజానికి కర్తవ్య ప్రభోదం చేస్తున్నవి. అందుబాటులోకి వచ్చిన కొన్ని వివరాలు పరిశీలనార్థం. 2009లోని ప్రపంచ బ్యాంకు అంచనా ప్రకారం ప్రకృతి వైపరీత్యాలన్నిటి అకారణంగా మొత్తం భారతదేశం 1953 నుండి అయిదున్నర దశాబ్దాలకాలం సగటున ఏటా 1500 కోట్ల రూపాయల విలువగల సంపద నష్టపోగా పర్యావరణ కాలుష్యం కారణంగా ప్రతి సంవత్సరం 3.75 లక్షల కోట్ల విలువగల ఆస్తిని కోల్పోవుచున్నది. ఈ విధంగా ప్రపంచ పర్యావరణ సూచిలో మొత్తం 132 దేశాలకుగాను ఇండియా 126వ స్థానంలో ఉండడం ఇంగిత జ్ఞానమున్న వారంతా తీవ్రంగా ఆలోచించదగింది. దేశ ప్రజలనుభవిస్తున్న కాలుష్య కష్టాలు వర్ణనాతీతం. వెలుపల వాయుకాలుష్యం 29 శాతం, ఇళ్ళలో విషధూళి 23 శాతం, వ్యవసాయభూమి క్షీణత 19 శాతం, అడవుల నరికివేత 4 శాతం ఇవన్ని అభద్ర పర్యావరణానికి అద్దంపడుతున్నవి. పిల్లల మరణాల్లో 23 శాతానికి పెద్దల మృత్యువాతలో రెండున్నర శాతానికి పర్యావరణ పరిరక్షణతోపాటే కారణభూతమౌ తున్నవి. ప్రతిరోజూ 233 ఎకరాల అడవి విధ్యంసమతున్నట్లు ప్రతి ఏటా లక్షమంది యువకులు వాయుకాలుష్యం వాతబడి మరణిస్తున్నట్లు అంకెలు రుజువు చేస్తున్నవి.

మొదలు పారిశ్రామికాభివృద్ధి సాధించి ఆ తర్వాత పర్యావరణ, విద్యా, వైద్య సమస్యలపై దృష్టి కేంద్రీకరించాలనే ప్రభుత్వాల వైఖరి బండికి ముందు గుర్రాన్ని పెట్టేబదులు గుర్రాన్ని బండి వెనక పెట్టినట్లు అపసవ్యంగానున్నది. కాలుష్యంతో ఒక సంవత్సరం కోల్పోవుచున్న ఆస్తి, ప్రాణహని విలువను వెచ్చించి పర్యావరణాన్ని రక్షించగలిగితే ఆ నష్టాన్ని పదవవంతుకు తగ్గించగల్గుతాం లేనిచో అది ప్రతి సంవత్సరం పది శాతం పెరగకమానదు. దేశ వ్యాపితంగా నగరాలు ప్రతిరోజు నాలుగు వేల కోట్ల లీటర్ల మురుగును ఉత్పత్తి చేస్తుంటే అందులో కేవలం 20 శాతం మాత్రమే శుద్ధి అవుతున్నది. దేశంలోని 8000 పట్టణాలల్లో కేవలం 160 పురపాలక సంఘాల్లోనే మురుగునీటి కాలువల శుద్ధి ఏర్పాట్లున్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి రెండేళ్ళనాడే హెచ్చరించింది.

కలుషిత వ్యర్ధాలు భూమిలో ఇంకి భూగర్భజలాల్ని విషపూరితం చేస్తున్నాయని తెలిపింది. వినిపించుకున్న నాధుడే లేదు.

రాజ్యాంగంలోని 39(ఇ), 47,48(ఎ) అధికరణాలను అనుసరించి ప్రజారోగ్యం, పర్యావరణాల పరిరక్షణ మెరుగుదల ప్రభుత్వాల బాద్యత అని 10 సంవత్సరాల క్రితమే సుప్రీంకోర్టు స్పష్టీకరించింది. దీని వెలుతరులోనే చాలా ఆలస్యంగానైనా కేంద్ర నీటి కాలుష్య పర్యావరణ చట్టాన్ని

1974లో వాయుకాలుష్య నివారణ చట్టాన్ని 1981లో ఆమోదించింది. వాటి ఆధారంగా కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో కాలుష్య నివారణ బోర్డులు ఏర్పాటైనవి. వాటి పనితనాన్ని పరిశీలించిన తర్వాత అవి అన్ని కార్పొరేటు సంస్థల మాదిరిగానే రాజకీయ నిరుద్యోగుల ఉపాధికొరకే నియమించినవని తెలుస్తుంది. అందులో కాలుష్య నియంత్రణ నివారణ శాస్త్రవేత్తలు లాంఛన ప్రాయమేకాని అసలు బాధ్యతలు అధికారం కలిగిన వారి చేతిలోనేనంటూ 8వ పంచవర్ష ప్రణాళికాకాలంలో తీవ్రంగా హెచ్చరించడం జరిగింది. దేశంలో 43 పారిశ్రామిక కేంద్రాలలో కాలుష్యం ప్రమాదస్థాయికి చేరిపోయిందని వాటిని తక్షణం సరిచేయాలని కేంద్ర బోర్డు హెచ్చరించింది. ఒకటికాదు,రెండుకాదు 118 తాఖీదులను పంపింది. పట్టించుకున్ననాధుడులేడు. అభివృద్ధి, విద్య, వైద్య, కాలుష్య నివారణ, అవినీతి నిరోధక సుపరిపాలన సులోచనలతోగాక కేవలం దేశీయ వార్షికోత్పత్తి రేటు పెరుగదలగా ధనాఢ్యవర్గ ధృక్పథంతో చూచి తృప్తిపడడం జరుగుచున్నది. ప్రభుత్వాలు మాత్రం కంటితుడుపు చర్యలకే పరిమితమైనవి.కాలుష్య కారక పరిశ్రమల గురించి,పురపాలక వ్యవస్థలు తమకేమి పట్టనట్లు చేతులు ముడుచుకుని కూర్చుంటున్నవి. విషం వ్యాపిస్తున్నది. నియంత్రణ పరిధిని దాటి ప్రాణకోటికి తీరని ప్రమాదమేర్పడే స్థితి రాకముందే బాధ్యులు మేల్కొనక తప్పదు. కాలుష్యాన్ని ఉత్పత్తి స్థానంలోనే నిరోధించాలి. ఆధునిక సాంకేతిక పరికరాల సహాయంతో కాలుష్యాన్ని అత్యంత తీవ్రంగా తగ్గించే ప్రయత్నాలు చేయాలి. కాలుష్యం బారినపడిన ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికపై రక్షణ చర్యలన్ని చేపట్టబడాలి. పౌర సమాజం ప్రజా సామాన్యాన్ని కాలుష్య నివారణ అంశంపై జాగృతం చేయడం శాశ్వత నివారణోపాయం. ప్రతి పౌరుడు, ప్రతి గృహిణిలో ఈ పవిత్ర కర్తవ్య నిర్వహణలో చేయూతనిచ్చే చైతన్యం కలిగించాలి. అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు తమ తమ కార్యక్రమాలలో పర్యావరణ పరిరక్షణను ప్రముఖంగా చేర్చి ఆచరించాలి. ఇది ప్రజలందరి విధిగా మార్చాలి.

# 14. ముగింపు

ఆధునిక భారతదేశం అతి గొప్ప ప్రజాస్వామ్యమనుటలో సందేహంలేదు. చురుకైన మీడియాతో సహా ప్రాథమిక హక్కులు గల ప్రజాస్వామ్యదేశం, 1947 నాటితో పోల్చగా ఆయు: ప్రమాణం 32 సంవత్సరాల నుండి 66 సంవత్సరాలకి రెట్టింపుకి మించి పెరిగింది. ద్రవ్యోల్భణాన్ని లెక్కించిన తరువాతగూడా జనాభా తలసరి వార్షికాదాయం 5 రెట్లు పెరిగింది. దేశీయ ఉత్పత్తి రేటు పెరుగుదల 1991 నాటి సంస్కరణలకు పూర్వం నామమాత్రంగా నుండి ఈ నాటికి 8-9 శాతానికి పెరిగింది. తిరిగి గత రెండు సంవత్సరాలలో 3-4 శాతం తగ్గింది కొన్ని సంవత్సరాలుగా చైనా తర్వాత రెండవ అభివృద్ధి రేటు గల ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. అభివృద్ధి రేటులో ప్రపంచంలో చైనా ఆ తర్వాత భారతదేశాలున్నా ఉత్పత్తి విలువలో మాత్రం కాదు. అందులో పాశ్చాత్య దేశాల తర్వాతనే అభివృద్ధి రేటులో కూడా చైనా తర్వాత ప్రపంచంలో రెండవ దేశమైనా నిత్యావసర సేవలు, విద్యా, వైద్యం లాంటి మౌలిక సేవలని ప్రజలకు అందించడంలో చైనాకంటే పూర్తిగా వెనకబడియుండడం గమనార్హం. సమాజంలోని అన్ని స్థాయిలలో నైపుణ్యతగల విద్య, మంచి ఆరోగ్యం గల యువతీ, యువకులు పరిశ్రమించలేకపోవడమే అభివృద్ధికి గొప్ప ఆటంకం దేశంలో కలిగిన వారికి మంచి విద్య, వైద్య అవకాశాలున్నా సామాన్య ప్రజలలో ప్రతి 5గురిలో ఒక బాలుడు, బాలికల్లో ప్రతి ముగ్గురిలో ఒకరికి విద్య లేదు. బళ్లలో నాణ్యతగల విద్య అసలు లేదు, ఔషధాలు, ఔషధ మొక్కలకు ప్రపంచంలో మంచి పేరున్నా దేశ ప్రజల ఆరోగ్య రక్షణ అరణ్య రోదనగా మిగిలింది. చైనాలో ఆరోగ్యంపై దేశీయ ఆదాయంలో 2.7 శాతం వెచ్చించగా భారతదేశంలో కేవలం 1.2 శాతం వెచ్చించడం జరుగుతున్నది. ప్రారంభదశలో అభివృద్ధి లక్ష్యాలు, ఆతర్వాత అభివృద్ధి సాధనాలు కూడా అయిన పై అంశాలు విస్మరించకూడనివి.

నేషనల్ శాంపుల్ సర్వే వారి తాజాలెక్కల ఆధారంగా సామాజిక శాస్త్ర విశ్లేషకుల ఆలోచనల వెలుతురులోఈనాటి నిరుపేద భారతాన్ని స్వర్ణ భారతంగా దర్శించే స్వప్నాన్ని రేఖామాత్రంగా అక్షరబద్ధం చేయడం జరిగింది. కులమతాలు, భాషా సంస్కృతుల భిన్నత్వంలో ఏకత్వం గల భారతావనిని భారతజాతిగా ప్రపంచంలో అతిగొప్ప ప్రజాస్వామ్య బద్ధ సమసమాజంగా సహస్రాధిక అమరుల కలల రూపకల్పనగా దర్శించే ప్రయత్నం చేయడం జరిగింది. సమున్నత గమ్యానికి చేర్చే సుదూర గమనం గురించి తెలిసిన మేరకు మార్గాన్వేషణ చేయడం గూడా జరిగింది. ఇది సాహసమేఐనా వృత్తి ధర్మంగా భావించి జీవన సాయం సమయాన సహృదయులు, స్నేహితులైన పాఠకలోకానికి సమర్పించడం సంతృప్తి కరంగానున్నది. ఆశించిన ఫలితం లభిస్తుందని పరిపూర్ణ విశ్వాసం.

నేషనల్ శాంపుల్ సర్వే (ఎస్.ఎస్.ఎస్) వారి తాజా లెక్కలపై దృష్టిని సారిద్దాం. దీని ప్రకారం 2011-12 కాలంలో అట్టడుగునఉన్న 5 శాతం జనాభా తలసరి నెలవారి ఆదాయం (వ్యయం) గ్రామీణ ప్రాంతాలలో రూ. 521.44, పట్టణ ప్రాంతాలలో రూ. 700.50 ఉందని తెలిసింది. అదే సమయంలో మరోపక్క జనాభాలో ధనాఢ్యులుగా ఉన్న 5 శాతం జనాభా గ్రామీణ ప్రాంతాలలో రూ. 4401, పట్టణ ప్రాంతాలలో 10282 రూపాయలు వెచ్చిస్తున్నారని తెలుస్తున్నది. మొత్తంగా

చూస్తే గ్రామీణ భారతంలో రూ. 11430గాను, పట్టణ ప్రాంతాలలో 26300 మేరకున్నట్లు తెలుస్తున్నది. సగటు గ్రామీణ ఆదాయానికంటే పట్టణ సగటు ఆదాయం 84 శాతం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ విధంగా భారతదేశ వ్యాపితంగా ప్రతిపౌరుని సగటు దినసరి ఆదాయం గ్రామ సీమల్లో 17 రూపాయలు, నగరాల్లో 23 రూపాయలు మాత్రమే ఉందడం దేశ పేదరికానికి నిలువుటద్దం పట్టుచున్నది. అసలు ఆకలి చావులకు పాల్పడేవారు దేశజనాభాలో 4 శాతం ఉండగా. (సుమారు రూ. 5 కోట్లమంది), నిరుపేదలు అష్టదరిద్రులుగా చిన్నచిన్న తేడాలతోనున్న వారు జనాభాలో 67 కోట్లుండడం గమనార్హం. అందులో దాదాపు 40 కోట్ల జనాభా ముఖ్యంగా మహిళలు, బాలలు పౌష్టికాహార లోపంతో బాధలననుభవిస్తున్నారు. స్వాతంత్ర్యానంతర 66 సంవత్సరాల సుదీర్ఘ కాలం తర్వాత కూడా ఇంతటి దారిద్ర్యం ఉండడమే మన రాజ్యాంగ వ్యవస్థ నిర్వహణలోని పెద్దలోపం. ప్రజలకు రాజ్యాధికార సాధన ప్రధాన లక్ష్యంగా రాజ్యాంగం కొంతవరకు అమలవుతున్నది.

కాని, సామాజిక ఆర్థిక లక్ష్యాల గురించి రాజ్యాంగాన్ని పట్టించుకున్న నాధుడు లేడు. ఈ దిశలో చేసిన కొన్ని చట్టాలు ఆచరణకు నోచుకోకుండా నిర్జీవంగానో నిద్రావస్థలోనో ఉన్నవి.

పేదరికం ఆతర్వాత అవిద్య, అజ్ఞానం అధికార సాధనలో రాజకీయం చేయడం వర్ణణాతీతం ప్రతి సాధారణ ఎన్నికలకు ముందు పేదలనుద్దేశిస్తూ చేసే విధాన ప్రకటనలకు ఆ తర్వాత అధికార పీఠాల్ని అధిరోహించిన తర్వాత వాటి ఆచరణలకూ హస్తిమశకాంత తేడాలు ఉండటం అందరి అనుభవం. ఆచరణలో పేదరికం అధికార సాధనకు ఓ పెట్టుబడిగా వినియోగపడటం దురదృష్టకరం. వివిధ రాష్ట్రాలలో నిర్వహించిన ఆడిట్ నివేదికలు, సోషల్ ఆడిట్ నివేదికలు ఆహార భద్రతపై వెచ్చించే నిధులలో కనీసం సగం పెట్టుబడి వృధా అవుతున్నట్లు స్పష్టం చేసినవి. ధాన్యం రవాణా చేయటం, గోడౌన్‌లలో నిల్వచేయటం అందులోని తరుగులు బహిరంగంగా నిల్వచేసిన నిల్వలలో జరిగే విపరీతమైన నష్టాలు, అధికారుల లంచగొండితనం, అన్నిటికీ మించి అర్హతలేని వారికి ఇచ్చే రేషన్ చివరకు రేషన్ షాపులలో జరిగే అవినీతి పనులన్నిటిలో కనీసం 50 శాతం విలువైన జాతీయ ధనం వృధా అవుతున్నది. కొత్త ఆహార భద్రతా చట్టం ప్రకారం దేశ వ్యాప్తంగా కనీసం 67 కోట్ల జనాభాకి ఈ చౌక ధరల ధాన్యాన్ని సరఫరా చేయబోవుచున్నట్లు అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు నాయకులకు జరుగుతున్న వృధా గురించి తెలియదనుకుంటే అది అమాయకత్వం, మోసం అవుతుంది. అధిష్టాన వర్గానికి అన్నీ తెలుసు. ఎన్నికల వేళ ఎంత పెట్టుబడి ఎంత రాజకీయ ప్రయోజనాన్ని సాధిస్తుందో బాగా తెలుసు.

సుప్రీం కోర్టు ఒక తీర్పులో ఈ ఎన్నికల వాగ్దానాలపై ఘాటుగా విమర్శించింది కానీ ఈ అంశం ఎన్నికల కమీషన్ పరిధిలోనిది కాదు కాబట్టి ఆదేశాలివ్వలేదు. రాష్ట్ర దేశ సమున్నత న్యాయస్థానాలు వారి ఉద్దేశాన్ని అర్థం చేసుకోవడం దేశాభివృద్ధికి అవసరం లేనిచో అనేక లక్షల కోట్ల రూపాయల ఖర్చుతో కూడిన అపత్కాల మొక్కులు, వాటి చెల్లింపులు దేశ మౌలిక సదుపాయాల నిర్మాణాన్ని తీవ్రంగా అడ్డుకోవడం తప్పదు. అత్యవసరమున్న నిరుపేదల ఆహార అవసరాలు తీర్చడం జాతీయ కర్తవ్యమేఐనా దాని పేర తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల సాధనకై మరో 50 వేల కోట్ల రూపాయలు వృధాచేయడం వివేకమనిపించుకోదు. అర్హతలుగల నిరుపేదలకు చెందవలసిన సహాయం

అధికంగా అనర్హుల చెంత జేరే అవినీతి ఎంతమాత్రం క్షంతవ్యంగానిది. ఈ అవినీతిని అరికడుతూనే పేదలకు అంతగా అవసరం లేని సబ్సిడీలు, ఉదా ॥ పెట్రోలు ఉత్పత్తులపై ఇచ్చే సబ్సిడీలు యూరియాలాంటి ఎరువులపై ఇచ్చే అధిక సబ్సిడీలను ఎత్తివేస్తూ వసరులను అభివృద్ధి కార్యక్రమాలకు మళ్ళించడం అత్యవసరం. ఈ సహాయాలన్నిటిని గ్రామ సభలల్లో చర్చించి నిర్ధారణ చేయబడిన వ్యక్తులకు గాని కుటుంబాలకు మాత్రమే. అందించడం నిజమైన పరిష్కార మార్గం. వ్యవసాయ ఉత్పత్తులను కాపాడుకోవడానికని కనీసం 30లక్షల టన్నుల ధాన్యాన్ని భద్రపరచడానికై గిడ్డంగుల అవసర మున్నది. రైతులు పండించే ధాన్యాదులు, కూరగాయలు, పండ్లు, ఫలాలని మార్కెట్టుకు తరలించాలంటే గ్రామీణ రోడ్లు, వంతెనల నిర్మాణం అత్యవసరముగా ఉన్నది. ప్రారంభించిన కొన్ని, నిధుల కొరత కారణంగా పూర్తి చేయబడలేదు. ఇంతకు నాలుగు రెట్ల పనులు ప్రారంభించి పూర్తిచేయనిదే వ్యవ సాయరంగం బాగుపడదు. వ్యవసాయ మార్కెట్ చట్టం దాని నిబంధనలలో మార్పులు చేర్పులు జరగనిదే రైతులు స్వేచ్ఛగా తమ ఉత్పత్తులను గిట్టుబాటు ధరలకు అమ్ముకోలేరు. అలాగే విద్యావ్యాపకం విద్యా ప్రమాణాల పెంపకం, సాంకేతిక విద్యల ప్రోత్సాహానికి వేలాది మంది నిపుణత గల ఉపాధ్యాయుల ట్రైనింగ్ కళాశాలల నిర్మాణం,వాటి నిర్వహణ గొప్పజాతీయ అవసరం. ఆ దిశలో నిధులను మళ్ళించడం బంగారు గుడ్లు పెట్టే బాతులను పోషించుకున్నట్లుంటుంది. అలాగే ప్రాథమిక చికిత్స కేంద్రాల సంఖ్య వాటి ప్రమాణాలన్నీ పెంచాలంటే దేశ వ్యాపితంగా కొత్తగా కనీసం 50 మెడికల్ కాలేజీల ఏర్పాటు ఏమాత్రం విస్మరించరానిది. గ్రామ సీమల్లో ప్రభుత్వ రంగంతో పనిచేసే వేలాది వైద్యులు, నర్సుల అవసరం ఏమాత్రం నిర్లక్ష్యం చేయరానిది. దేశవ్యాపితంగా కనీసం మరో 20వేల మంది న్యాయమూర్తుల నియామకం అత్యవసరం. దశాబ్దాలుగా పేరుకుపోతున్న ఫైళ్ళు త్వరగా పరిష్కారంకానిదే దేశంలో న్యాయస్థానాలపై మిగిలియున్న విశ్వాసం అసలే మిగలదు. పోలీసుశాఖ శాంతి భద్రతలను ఏమాత్రం బాగుచేయాలన్నా కొన్ని లక్షల మంది యువతీ, యువకులను కొత్తగా ఆ ఉద్యోగాల్లో నియమిస్తూ వారికి తగు శిక్షణ ద్వారా పూర్తిగా దిగ జారిపోతున్న శాంతి భద్రతల స్థితిని పునరుద్ధరించడం అత్యవసరం. ఇలా సూక్ష్మస్థాయి, స్థూలస్థాయిల్లో చేపట్టి త్వరగా పూర్తి చేయవలసిన గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజా అవసరాలెన్నో నిధుల కొరతతో నిలిచి పోయినవి. రాజకీయాధికారాల కొరకు అక్రమంగా విలువైన ప్రజా ధనాన్ని జనాకర్షక పథకాలపై వృధా చేసే అధికారం ఏ పార్టీకి గాని ఎంతటి వ్యక్తికికాని ఉండరాదు. ప్రపంచ దేశాలన్నింటితో పోల్చుకోగా మనదేశం ఈ విషయాలల్లో 185 దేశాలలో 135వ ర్యాంకులో ఉండటం నాగరిక ప్రపంచంలో తలవంపులుగా నున్నది. దేశ మహోన్నత న్యాయస్థానం చేసిన సద్విమర్శ ఆచరణాత్మకం. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమీషన్లు ప్రభుత్వాలు సకాలంలో మేల్కొని ఈ అరిష్టాన్ని అరికట్టాలి. లేనిచో నడుస్తున్న 12వ ప్రణాళికలో చివరి నాలుగు సంవత్సరాలలో మౌలిక సదుపాయాల నిర్మాణంపై వెచ్చించాలనుకున్న ఒక ట్రిలియన్ అమెరికన్ డాలర్లు గూడా నిధులు నిపుణుల కొరత కారణంగా వెచ్చించలేము. దేశం మరింత ఋణగ్రస్థం పరాధీనం కాక తప్పదు. అంతరంగికంగా వివిధ అవిశ్వాసాల కారణంగా అశాంతి, అరాచకం త్వరగా ప్రబలి పోవటాన్ని ఊహించలేం.

దేశం నామమాత్రంగా ప్రగతి పథంలోఉన్నా అగమ్యగోచర స్థితిలో నిలిచియున్నది, అభివృద్ధి వేగం 9శాతం నుండి తగ్గి 5శాతానికి పడిపోయింది. ఇంకా పడిపోతే అథ:పతనమే తప్ప తిరిగి

అభివృద్ధి పథంలోకి రాలేము. ప్రధానమంత్రిగారు, వారి ఆర్థిక సలహాదారులంతా ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటూ ఈ ప్రణాళికాంతానికి తిరిగి 9 శాతం అభివృద్ధి రేటును సాధిస్తామని నమ్మబలుకుచున్నారు. ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడుల వెచ్చింపు కీలకమైనది. అధినాయకత్వం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఈ అవసరాన్ని తీరుస్తాయని ఆశిస్తున్నది. పాశ్చాత్య దేశాల ధనాఢ్య వర్గాలు అక్కడి ఆర్థిక మాంద్యం కారణంగా నిలువపడున్న తమ నిధులను చౌకగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు మళ్లిస్తారని, మనదేశానికి విరివిగా నిధులు వస్తాయని వీరు ఆశిస్తున్నారు. ఇది అంత సులభం కాదు. అమెరికా ఆ తర్వాత యూరపు దేశాలలో నెలకొన్న ఆర్థిక మాంద్యానికి మార్కెట్ కొరత, లేక డిమాండు కొరత ప్రధానంకాదు. కాలక్రమేణా అక్కడి సంపద అత్యధికంగా సంపన్న వర్గాల చేతుల్లో చేరింది. వారి నిత్య నూతన విలాస వంతమైన జీవితావసరాలు తీర్చుకోవటానికే ఆది సరిపోతున్నది. అక్కడి బ్యాంకులు దివాలా తీయడం ప్రభుత్వం వీలున్నంతవరకు అప్పులు కూడా చేసి బ్యాంకులతో పాటు పరిశ్రమలను కూడా ఉద్దీపనల ద్వారా ఆదుకోవడం చివరకు ఆ ప్రక్రియ కూడా సరిపడకపోవడం అనుదినం వింటున్న వార్తలే  వలసవాదులుగా బలహీన దేశాలను దోచుకుంటూ బ్రతికే పాతరోజులు కావివి. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం వ్యాపిస్తున్న వినూత్న శకం. వారి బ్యాంకులు పరిశ్రమలు, ప్రభుత్వాలు  బతికి బట్టకట్టే మీమాంసలో మునిగితేలుచున్న సమయమిది. పొదుపరి తనం (గాంధీయిజం) వారికి తారకమంత్రంగా అగుపించేరోజులివి. అయినా అత్యధిక లాభాల ధనదాహం గల బహుళజాతి ద్రవ్యసంస్థలు మన పరిమితులకులోబడి వస్తే వారిని స్వాగతించవలసిందే. కాని అంతకంటే మనదేశాన్ని మనమే పునరుజ్జీవింపచేసుకోవటం స్వావలంబన సిద్ధాంతాన్ని అక్షరాలా ఆచరించడం ఉత్తమ పరిష్కార మార్గం. పట్టపగ్గాలు లేని దళారీ (క్రోని) పెట్టుబడీదారుల ఆగడాలను అరికట్టడం నల్లధనాన్ని వెలికితీసి ప్రయోజనాత్మక ప్రాథమిక మౌలిక అవసరాల నిర్మాణాన్ని చేపట్టడం దేశభక్తియుత కర్తవ్యం. మన కవసరమైన సంపదను మనమే సృష్టించుకోగలగాలి. అమెరికాతో సహా ఐరోపా దేశాలమొత్తం జనాభాకంటే మించిన మధ్య తరగతి మార్కెట్టు మన సొంతం విదేశాలకు అమ్మకానికి గాని అప్పులకు గాని పరిగెత్తనవసరం లేదు. పచ్చని పొలాలు, అడవులు, ఖనిజ సంపదలు గల రత్నగర్భ మన భారత్. అన్నిటికీ మించి ప్రపంచంలో చైనాతో సహా ఎక్కడా లేని మానవ వనరులు గల ధన్యభూమి మనది. కాబట్టి లొటిపెట(ఒంటె) పెదవులకు నక్క ఆశించినచందంగా విదేశీ ప్రత్యక్ష పెట్టు బడులపై ఆధారపడి పంచవర్ష ప్రణాళికల రూపకల్పనగాని కార్యక్రమాలుగాని నిర్వహించరాదు. మనదేశ పెట్టుబడి దారీ వర్గాన్ని ఆకర్షించే తీర్మానాలు చట్టాలు చేయడం ఉత్తమం, వారికి తగినలాభాల గ్యారంటీ చేయడం మంచిది. ఇతర దేశాలు ముఖ్యంగా ఆసియా దేశాలు బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికాలతో ఒప్పందాల ఆధారంగా, ఆదాన ప్రదాన సూత్రాల వెలుతురులో వాణిజ్య వ్యాపారాలు కొనసాగితే అదే మనదేశానికి పదివేలు.

జాతీయ శాంపిల్ సర్వే వారి లెక్కల ప్రకారం అవి కొంత ప్రశ్నార్థకమైనా ప్రపంచ ప్రజల కొనుగోలు శక్తి ప్రమాణికగా పర్చేజింగ్ పవర్ ప్యారిటి (పి.పి.పి) మనదేశీయ అంతరంగిక సంపద 2011-12లో 4.46 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల స్థాయి నుండి పెరిగి 2016-17నాటికి 6.30 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. అదేకాలంలో తలసరి ఆదాయం ప్రతిసంవత్సరం 3700 డాలర్లనుండి 5100 డాలర్లకు చేరుతుంది. అప్పటికి మనదేశం సంపన్నదేశం కాదుగదా పేదరికాన్ని

విజయవంతంగా ఎదిరించగల్గే దేశంగా కూడా ఎదగజాలదు. ఇదిగూడా దేశీయ ఉత్పత్తి పెరుగుదల రేటు 7శాతముందనుకుంటేనే. అది ఈ సంవత్సరం 5 శాతానికి పరిమితమైందని తాజా లెక్కలు తెలియజేస్తున్నవి. పేదరికం తగ్గేరేటుపై ప్రామాణికత నేపథ్యంలో ప్రతి సంవత్సరం కేవలం 0.9శాతమే. వ్యవసాయ పారిశ్రామికాభివృద్ధి రేటు పెరగడం ద్వారా పెరిగే ఉపాధి ఉద్యోగాలు మాత్రమే పేదరికాన్ని క్రమంగానైనా ఆత్మవిశ్వాసంతో తగ్గించగల్గుతాం. ఒక దశాబ్దకాలంలో అనగా, 13వ పంచవర్ష ప్రణాళికాంతానికి పేదరిక రేఖకు అటు ఇటు 60శాతం, అనగా 74 కోట్ల జనాభా ఉంటారని శాంపిల్ సర్వేవారి సాధికారపత్రం తెలియజేస్తున్నది. పట్టణాలలో ప్రజల దినసరి ఆదాయం ఖర్చు 66 రూపాయలుంటుందని గ్రామీణ జనాభా తలసరి ప్రతిరోజు ఆదాయవ్యయం కేవలం రూ॥ 35 ఉంటుందని దీని అర్థం. 5 శాతం అభివృద్ధి రేటును 7 శాతానికి, ఆ తర్వాత 9 శాతానికి పెంచగలిగిన నాడు పేదరిక నిర్మూలన సంక్షేమ రాజ్యసాధన గురించి ఆలోచించే అర్హత సమకూరుతుంది. ఇను మడించిన ఆత్మవిశ్వాసంతో ముందడుగువేయడం సాధ్యపడుతుంది. అందరికి నాణ్యతగల విద్య, వైద్యం, అను నినాదం విప్లవాత్మకమైనది. గత అర్ధశతాబ్ది కాలంలో ఆసియా దేశాలు సాధించిన గొప్ప లక్ష్యం, ఆర్యోగం, విజ్ఞానం గల సమాజం. స్వయంచలిత శక్తితో ప్రజాతంత్ర వ్యవస్థలో సాధించ లేనిదంటూ ఉండదు. అందుకే స్వార్థపర వర్గాలు వీలున్నంతకాలం ప్రజా బాహుళ్యాన్ని అంధకారంలో ఉంచాలని చూస్తాయి. కాని అది పరవళ్ళు తొక్కుచున్న ప్రపంచీకరణ కాలంలో జరగదు. సూర్యరశ్మికి అరచేయి అడ్డంకానేకాదు. చాలా సందర్భాలలో అతి విశ్వాసంతో ప్రస్తావించుకుంటున్న యువశక్తి ప్రయోజనం ప్రపంచంలో అన్ని దేశాలకంటే దీర్ఘకాలం మనదేశానికే ఉంటుందనేది పరమ సత్యం. అది నాణ్యతగలదికావడం ప్రధానాంశం. అప్పుడే అది ఉత్పత్తి ఉత్పాదకతల పెరుగుదలకు దోహదపడుతుంది. లేనిచో అదే యువశక్తి అభివృద్ధి నిరోధానికి కారణభూతమవుతుంది. విద్య, విజ్ఞానబలం గల ఉత్పత్తిదాయక ఉపాధి, ఉద్యోగాలను సృష్టించే విద్య ఆరోగ్యబలమే దైవబలం. దార్శనికతగల రాజనీతిజ్ఞులు రాజ్యమేలితేనే ఈ యువశక్తికి నాణ్యత సమకూరుతుంది. సమాజం నిరంతరం ప్రగతిపథంలో పయనిస్తుంది. అందుకే ఉద్యోగ సృష్టి అభివృద్ధికి కీలకాంశం. కోటి ఉద్యోగాలు సృష్టిస్తామని వాగ్దానం చేసిన యు.పి.ఎ ప్రభుత్వం తనమాట నిలుపుకోలేదు. రానున్న ఏడు సంవత్సరాలల్లో కొత్తగా సంఘటిత ఉద్యోగాన్వేషణపై ఒక కోటి ఇరవై లక్షలమంది గ్రామ సీమల్నుండి పట్టణాలకు రానున్నారని అంచనా! వీరందర్ని జీర్ణించుకునే స్థితిలో సంఘటిత రంగంలేదు. పెట్టుబడి కొరతను తీర్చుతూ నాణ్యతగల శ్రామికుల శ్రమశక్తిని దానికి జత పరచే సృజనాత్మకతగల రాజకీయ నాయకత్వ పాత్ర అత్యంత ప్రధానం. తాత్కాలికంగా కొన్ని ఉద్యోగాలు కొంతకాలం తగ్గినా విస్తృతంగా చేయబడే ఆర్థిక సంస్కరణల ఫలితంగా సుస్థిరమైన ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. ఈనాడు కేవలం 20 శాతం మాత్రమే ఉన్న వివిధ రంగాలసంఘటిత కార్మికరంగం త్వరగా విస్తరిస్తుంది. వ్యాపిస్తుంది. అభివృద్ధి వేగం నిలకడగా కొనసాగుతుంది.

స్వశక్తి సమస్యలను నివారిస్తూ నిరాటంక పురోగమనాన్ని సాధిస్తుంది. ఇందులో చర్చించుకున్న కొన్ని సంస్కరణలతోపాటు అనేకానేక ఇతర సంస్కరణలపై విశ్వాసంతో, అంకితభావంతో చర్యలను చేపట్టగలిగే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నిర్మాణం భవిష్యత్తుకు కీలకం. అటువంటి లక్ష్యశుద్ధిగల ప్రభుత్వాలే మొదలు వృధాఖర్చులకు కళ్లెం వేస్తూ నల్లధనాన్ని అరికట్టగల్గుతాయి. ఉత్పత్తి రేటు పెరుగుదలకై

తగు నిర్మాణాత్మక క్రియాశీల చర్యలను చేపడుతాయి. దేశం పేదరికాన్నుండి విమోచనను పొందుతుంది. అర్ధశాస్త్ర సిద్ధాంత దిశను ఉదారవాద, నయా ఉదారవాద మార్కెటు వ్యవస్థల ఆధారంగా బ్రతికే దళారి (క్రోని) పెట్టుబడిదారి వ్యవస్థల లక్ష్యం నుండి, చైతన్యవంత, సంఘటిత ప్రజా ఉద్యమాల బలంతో సహయ సహకార, సమ్మిళిత సిద్దాంతాన్ని సాధ్యమైనంత త్వరగా సాధించే దిశకు మళ్లించాలి. అది మన దేశానికే కాదు ప్రపంచ మానవతావాదులందరి స్వప్నాలను సాకారం చేస్తుంది.“ కార్పోరేటు సిద్దాంతం వద్దు – కో ఆపరేటివ్ సిద్దాంతం ముద్దు” మన నినాదం కావాలి. 21వ శతాబ్దంలో స్వతంత్ర భారతం “బహుజన హితాయ” “బహుజనసుభాయ” అను సంక్షేమ సిద్ధాంతాల్ని ఆచరించగల్గితే ఆ తర్వాత అర్ధశతాబ్దికాంలోనే భారతీయ దార్శినికులందరితో సహా ప్రపంచ వ్యాపిత మానవతా సిద్ధాంతకర్తలు ఆశించిన “ సర్వేజనాః సుఖినోభవంతు ” వసుధైన కుటుంబకం గా పుష్పించి ఫలించె సమ సమాజం సాకారం పొందుతుందని పరిపూర్ణ ప్రగాఢ విశ్వాసం. అదే మనం స్వప్నిస్తున్న స్వర్ణభారతం.